


డి.వి.వి.యస్. వర్మ

# కొత్తచూపు


రచనలు
సంపాదకీయాలు






# డి.వి.వి.యస్.వర్మ

# కొత్తచూపు

## రచనలు - సంపాదకీయాలు

# డి.వి.వి.యస్.వర్మ

# కొత్తచూపు

## రచనలు - సంపాదకీయాలు

ప్రథమ ముద్రణ : మార్చి 2025.

కాపీలు : 1000

ముఖపత్రం : ఆరిమిల్లి సునీత

వెల : రూ. 100/-

సోల్ డిస్ట్రిబ్యూషన్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

ముద్రణ : విశాలాంధ్ర ప్రెస్, విజయవాడ 4.

స్వీయ ప్రచురణ : డివివియస్ వర్మ, 34-20-3, బొమ్మల వీధి,
తణుకు, 534211

ఫోన్ నెంబరు : 85006 78977.



### అంకితం

నాకు విద్యార్థి ఉద్యమ సహచరిగా పరిచయమై జీవిత భాగస్వామిగా నన్ను భరిస్తూ, కుటుంబ పోషణ భారం మోస్తూనే.. సామాజిక ఉద్యమకారిణిగా తనకంటూ ఒక ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్న మనోరమ గారికి ప్రేమతో..

## ముందుమాట



ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ

# కొత్త ఆలోచనల దారులు పరచిన పథికుడు

ఇవి సమకాలీన రాజకీయ సామాజిక చరిత్ర మీద మార్క్సిస్టు మేధావి, పత్రికా సంపాదకుడు, ఉద్యమ నేత డివివియస్ వర్మ గారు చేసిన విశ్లేషణలు. వర్మగారంటే నాకు ఎంతో ఇష్టం. ఆయన హైదరాబాదులో ఉన్న కాలంలో ఆయనను దగ్గరగా చూసే అవకాశం కొద్దిగా లభించింది. ఆయన విషయ పరిజ్ఞానం, నిబద్ధత, నిరాడంబరత ఆయన మీద నా గౌరవాన్ని పెంచాయి.

విశ్వ విద్యాలయాల్లో మార్క్సిస్ట్ అవగాహనతో చరిత్రను విశ్లేషించబూనుకోవడంతో చరిత్ర అంతకుముందు చూడని కొత్త దారులవెంట ప్రయాణించింది. చీకటి కోణాలు అనేకం వెలుగుచూశాయి. ప్రజలే చరిత్ర నిర్మాతలని రుజువయ్యింది. చారిత్రక ఘటనల వెనుక ఉన్న సామాజిక ఆర్థిక పరిణామాల గమనశీలతను పట్టుకున్నారు చరిత్రకారులు. ఇదంతా వేల ఏళ్లు మొదలు వందలోపు ఏళ్ల క్రితం ముగిసిన జాతీయోద్యమం మీదుగా సాగి ఇటీవలి దేశ గణతంత్ర చరిత్రలోకి కూడా ప్రవేశించింది. అయితే ఒక ఘటన జరిగిన ఐదేళ్లు తిరక్కుండానే నిర్దిష్టమైన దృక్పథంతో విశ్లేషించి ఆ సందర్భం మీద కమ్ముకున్న పొరల్ని ఒక్కటొకటిగా వొలిచి సత్యావిష్కరణ చేయడంలోని తక్షణత్వం అంతకుముందు నేను చాలా తక్కువసార్లు చూశాను. వర్మ గారు ఈ పుస్తకంలో చేర్చిన ఎన్‌టి రామారావును మార్క్సిస్ట్ దృక్పథంలో చూసిన వ్యాసం ఆ కోవలో మేలైనది. 1983లో అధికారంలోకి వచ్చిన ఎన్.టి.రామారావు మీద 1988లో వర్మ గారు ఆ సుదీర్ఘవ్యాసం వెలువరించారు. మార్క్సిజం బాగా చదువుకున్న ఆయన ఫ్రాన్స్‌లో 1848-52 మధ్య జరిగిన పరిణామాల నేపథ్యంలో మార్క్స్ రాసిన The Eighteenth Brumaire of Louis Bonaparteలో చేసిన విశ్లేషణను సరిగ్గా ఆంధ్రదేశానికి, ఎన్‌టి రామారావుకు అన్వయించారు.

1789లో ఫ్రెంచ్ ప్రజలు తొలిసారి నిరంకుశ రాచరిక వ్యవస్థ మీద స్వేచ్ఛ కోసం, సమానత్వం కోసం విప్లవించారు. 1789, 1830, 1848ల్లో విప్లవాలు జరిగి అధికారం మధ్యతరగతికి రాచరికానికి మధ్య ఊగిసలాడింది. 1871 కమ్యూన్ సంగతి సరేసరి. 1789లో తొలి విప్లవం సంభవించినపుడు ఫ్రాన్స్‌లో మొదటిసారి రిపబ్లిక్ ఏర్పడింది. కాని దేశం అరాచకం పాలయ్యింది. విదేశీ సేనలు చుట్టుముట్టాయి. మధ్యతరగతి ప్రభుత్వానికి అధినేతగా అధికారంలోకి వచ్చిన మొదటి నెపోలియన్ తనను Son of Revolution అని చెప్పుకుని దేశాన్ని గట్టెక్కించాడు. కాని, విప్లవాన్ని పడగొట్టి తనను చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. తరువాత ఫ్రెంచ్ ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా అనేక సైనిక విజయాలు సాధించి ప్రజల హృదయాల్లో man of destiny (అవతార పురుషుడు)గా స్థానం పొందాడు. అతని తరువాత రాచరికం కొనసాగి దేశం మళ్లీ అనిశ్చితిలో పడింది. ప్రజలు మళ్లీ ప్రజా ప్రభుత్వాన్ని కోరుకున్నారు. తీవ్ర గందరగోళంలో వివిధ రాజకీయపక్షాల మధ్య అధికారం చేతులు మారింది. ప్రజలు దేశాన్ని రక్షించగల నాయకుడి కోసం చూశారు. ఈ దశలో నెపోలియన్ కుటుంబానికే చెందిన లూయీ నెపోలియన్ ముందుకు వచ్చాడు. నెపోలియన్ అనే పేరు ఒక సమ్మోహక శక్తిగా పనిచేసింది. అతనిలో వారు తమ అవతార పురుషుణ్ణి చూసుకున్నారు. అధికారంలోకి తెచ్చారు. పేరుకే నెపోలియన్. కాని, సారంలో అతన్ని విక్టర్ హ్యూగో Little Napoleon అన్నాడు.

ఫ్రాన్సులో వర్గ పోరాటం ఒక సామాన్యమైన వ్యక్తిని రాజకీయ హీరోగా ఎట్లా చలామణి చేసిందో రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యతిరేకత ఎన్‌టి రామారావుని అట్లా అధికారంలోకి తెచ్చిందని చెప్పడంలో వర్మ గారు సఫలీకృతులయ్యారు. అంతకు ముందు రాష్ట్రంలో పెట్టుబడిదారీ, వామపక్ష ప్రత్యామ్నాయ పోరాటంలో వామపక్షం వెనుకడుగు వేయడాన్ని, తరువాత రెండు పెట్టుబడిదారీ మార్గాల రాజకీయ పక్షాల సంఘర్షణ తలెత్తడాన్ని, చివరికి కాంగ్రెస్ వ్యతిరేకత ఒక స్వతంత్ర శక్తిగా మారి, సినిమాలలో కృష్ణుడిగా రాముడిగా జానపద సాంఘిక చిత్రాల కథానాయకుడిగా ఆ పాత్రల లక్షణాలన్ని ఆపాదించబడిన రామారావు సమ్మోహక శక్తిగా అవతరించడాన్ని, ప్రజలతన్ని అవతార పురుషుడిగా భ్రమించడాన్ని వర్మ గారు విశ్లేషించిన తీరు ఎంతో సముచితంగా, విలువైనదిగా ఉంది. వర్మగారు మార్క్సిస్ట్ దృక్పథంతో చేసిన కొన్ని సూత్రీకరణలు ఆధునిక ఆంధ్రదేశ చరిత్ర అధ్యయనానికి మార్గదర్శకాలుగా పనిచేస్తాయనడంలో సందేహం లేదు. స్వాతంత్ర్యానంతర ఆంధ్రదేశ రాజకీయ అధ్యయనానికి వర్మగారి ఈ పరిశీలన ఒక కరదీపిక.

ఇదంతా ఒక కోణం అయితే 1937లో చనిపోయిన ఇటాలియన్ మార్క్సిస్ట్ ఆంటోనియో గ్రాంసీ రచనల ఇంగ్లిష్ అనువాదం 1971 దాకా వెలువడలేదని తెలుసు. ఇటలీలోనే అతని సర్వలభ్య రచనల సంకలనం 1980 దాకా రాలేదు. అటువంటిది వర్మ గారు 1988 నాటికే రామారావు రాజకీయ ఆగమన సందర్భం లో సంక్షోభకాలంలో సమ్మోహన శక్తులకు ద్వారాలు ఎలా తెరుచుకుంటాయో వివరించడానికి గ్రాంసీని ఉటంకించారు. అట్లాగే, మార్క్స్ ప్రస్తావించిన క్షీణ కార్మిక వర్గం (lumpen proletariat) గురించి అందరూ ప్రస్తావిస్తారు. కాని బూర్జువా సమాజపు శిఖరాగ్రంలో డబ్బు సంపాదన కోసం అన్ని అడ్డదారులూ తొక్కే క్షీణ ప్రభువర్గం (lumpen bourgeoisie) తల ఎత్తడం గురించి ఆశ్చర్యకరంగా ఈ పుస్తకంలో వర్మ గారు ప్రస్తావించారు. ఈ అరుదైన ఉటంకింపు లోతైన అధ్యయనం వల్లనే సాధ్యం.

చరిత్ర అధ్యయనంలో మార్క్సిస్ట్ విశ్లేషణ తరువాత సబాల్టర్న్ దృక్పథం వచ్చినట్లే ఆ దృక్పథానికి మార్గదర్శి అయిన అంటోనియో గ్రాంసీని తరువాతి వ్యాసంలో వివరంగా ముందుకు తెచ్చారు వర్మ గారు. అయితే ఆయన చరిత్రకారుల మాదిరిగా ఉపశ్రేణులకు మాత్రమే పరిమితం కాలేదు. మార్క్సిజంలోని నియతి వాదాన్ని ఖండించి, దానికి సాగే లక్షణాన్ని జోడించిన గ్రాంసీ భావజాలం మొత్తాన్ని ఆంధ్రదేశ రాజకీయాలకు అన్వయించారు. ఇటువంటి ప్రయత్నం భారతదేశంలో ఏ ప్రాంతీయ రాజకీయాల మీద జరిగినట్టు నేను వినలేదు. గ్రాంసీని అధ్యయనం చెయ్యడానికి లోతైన అవగాహన శక్తి కావాలి. వర్మగారు గ్రాంసీని వ్యక్తీకరించిన తీరులోని స్పష్టత నన్ను విస్మయపరచింది. Historic bloc, హెజమొని, కౌంటర్ హెజమొని, బాస్టర్డ్ హెజమొని, సవర్గ మేధావులు, లోకజ్ఞానం విచక్షణ జ్ఞానంగా మారే తీరు వంటి జటిలమైన సైద్ధాంతికాంశాల్ని తెలుగులో మంచినీళ్లప్రాయం చేశారు. వామపక్ష భావజాలంతో సుదీర్ఘ సాహచర్యం, అధ్యయన ఆచరణలు లేకుండా ఇది సాధ్యపడదు. స్వాతంత్ర్యానంతర తొలిదశలో ఆంధ్రదేశంలో వామపక్షాలు సాధించిన ప్రజా హెజమొని వెనుక సద్యోజనిత గ్రాంసీయిజం ఉందనడం వర్మ గారి నూతన ఆవిష్కరణ. ఒకే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం రెండు ప్రాంతీయ పార్టీలుగా విడిపోయి బాస్టర్డ్ హెజమొని సాధించిందనడం వర్మ గారు చూపుతున్న కొత్త వెలుగు.

ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో గ్రాంసీ అధ్యయనం గణనీయంగా పెరగడం వెనుక ఈ 'ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు 1952–2020'తోపాటు ఆయన

సంపాదకత్వంలో గ్రాంసీ మీద రెండు ప్రత్యేక సంచికలు వెలువడడం కూడా కారణమనుకుంటాను. మేథోసమాజపు దృష్టిని ఇట్లా ఒక సమ్యక్ దిశ వైపుకు మరలించగలగడం సాధారణ వ్యక్తులు చేయగలిగే పనికాదు. వర్మగారి ఈ ప్రయత్నం దేశంలో Cultural hegemony సాధనకు జరుగుతున్న ప్రయత్నాలను సరిగా అర్థం చేసుకోవడానికి తప్పక ఉపకరిస్తుంది. అప్పుడు ఆయన ప్రయత్న ఫలితం ఎన్నో రెట్లు పెరుగుతుంది.

వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలకు కొత్త దారి చూపిస్తున్నారు వర్మ గారు. ఒక సిద్ధాంతం గానీ, భావజాలం గానీ ప్రజల మనసుల్ని ఆకర్షించగలిగినపుడు అది భౌతికశక్తిగా మారుతుందన్న మార్క్స్ భావనని శాస్త్రీయంగా వివరించారు. ప్రజల ఉమ్మడి ఆకాంక్షకు ఇట్లా భౌతిక శక్తిగా మారే శక్తి ఉందని, అది ఒక పరిచారిక అవుతుందని అంటూ వ్యవస్థని మార్చాలనుకునే వాళ్లకు మార్చేదిగా, ప్రలోభపెట్టి అధిపత్య పోరుకు వినియోగించుకునే వారికి అదే విధంగా ఉపయోగపడుతుందని విశ్లేషిస్తున్నారు. ఒక ఆకాంక్ష ప్రజల నిత్య జీవనానికి సంబంధించినదై ఉండాలని, ఆచరణలో సాధ్యమేనన్న నమ్మకం కలిగించేదై ఉండాలని, అది తమ జీవితాల్ని ఎలా మార్చివేస్తుందో స్పష్టపరిచే మరొక చర్య జతపడాలని అప్పుడే అది భౌతికశక్తిగా మారుతుందని కూడా అంటున్నారు. సమాజంపట్ల ప్రజల బాగోగుల పట్ల ఎంత నిబద్ధత, తపన ఉంటే ఒక వ్యక్తి ఇట్లా ఆలోచించగలుగుతారు, ప్రతిపాదనలు చెయ్యగలుగుతారు అని అనిపిస్తున్నది.

వర్మ గారు సంపాదకత్వం చేసిన జాతీయస్ఫూర్తి, దారిదీపం పత్రికలు నాకు అందుతూ ఉండేవి. వాటిల్లో కొన్ని ప్రత్యేక సంచికలు ఉన్నాయి. అందులో కొన్నిటికి నాచేత వ్యాసాలు రాయించారు. కొన్ని ఆవిష్కరింపజేశారు. ఈ ప్రత్యేక సంచికల్లో మార్క్స్ మీద వెలువరించిన రెండు సంచికలు భద్రపరుచుకోదగ్గవి. 'సమ సమాజానికి దారిదీపం మార్క్స్' పేరిట వేసిన సంచికలో మార్క్సిజం వెనుకపట్టు పట్టిందనుకుంటున్న దశలో 2008 నాటి నుంచే పెట్టుబడిదారీ దేశాలు తిరిగి మార్క్సిజం వైపు దృష్టి సారించాయని గమనించడం, అందుకు తగ్గట్టు మన దృష్టి మళ్లిస్తూ ఒక ప్రత్యేక సంచిక వేయడం వర్మ గారు మార్క్సిజం అధ్యయనంలో ఎంత updatedగా ఉన్నారో తెలుస్తున్నది. 'మనకు తెలియని మార్క్స్ రాత ప్రతుల'ను పరిచయం చేసిన రెండవ సంచిక మార్క్సిస్ట్ మేథావులకు సైతం తెలియని కోణాల్ని బయటపెట్టింది. మార్క్స్ రచనలు సగానికి పైగా వెలుగుచూడకపోవడం వల్ల మార్క్సిజం నియతివాదంగా చలామణి అయ్యిందని, మార్క్సిజం మీద వచ్చిన

విమర్శలకు మార్క్స్ అచ్చుకాని రచనల్లో సమాధానాలున్నాయని ఈ సంచిక చెప్పింది. ఏంగెల్స్ ద్విశత జయంతి సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచికలో మార్క్స్‌ను, ఏంగెల్స్‌ని వర్మ గారు అంచనా వేసిన తీరులో సున్నితపు త్రాసు ఖచ్చితత్వం కనిపిస్తుంది. మోదీ ఎనిమిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా వేసిన సంచికలో 'మనం గతాన్ని తెలుసుకోవాలి. కాని గతంలోకి ప్రయాణించకూడదు' అన్నపుడు వర్మగారి ఆలోచన ల్లో గాఢత, వ్యక్తీకరణలో సరళత తెలుస్తుంది. ఈ సంకలనంలో వర్మగారి సంపాదకీయాలతోపాటు ఇతర వ్యాసాలు చేర్చారు. అవి మరింత విలువైనవిగా కనిపిస్తున్నాయి.

వర్మ గారు నిర్వహించిన ఇంటింటికీ మరుగుదొడ్డి, సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమం, రైతు కార్యాచరణ సమితి వంటి ఉద్యమాల గురించి విన్నాను. వాటి రూపకల్పన, నిర్వహణలు దీక్షాదక్షతలున్న వర్మ గారు మాత్రమే చేయగలిగినవి. వాటి గురించి విన్న తరువాత ప్రజల గురించి ఆలోచించకుండా ఉండడం వర్మ గారికి చేతకాదని నాకు అర్థమైంది. ఈ కొత్త ఆలోచనల్ని ఆచరణని ఈ వయసులోనైనా విడిచిపెట్టడం ఆయనకు సాధ్యం కాని పని. ఈ కృషిని ఆయన కొనసాగించాలని కోరుకోవడం జరిగే పనినే జరగాలని కోరుకోవడం లాంటిది. వర్మగారు నాకు సమకాలికుడూ, స్నేహితుడూ అయినందుకు సంతోషంగా ఉంది. ఈ పుస్తకం నా ఆలోచనల్ని, అవగాహనను మరింత కాంతివంతం చేసిందని ప్రత్యేకంగా ప్రకటిస్తున్నాను.

చివరగా, ఈ నాలుగు మాటలూ రాయడంలో నాకు సహకరించిన మిత్రులు కొప్పర్తి వెంకటరమణమూర్తికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**వకుళాభరణం రామకృష్ణ**

**హైదరాబాదు, 28.02.2025**

# విషయ సూచిక


1. ముందుమాట : ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ .............. 3
2. పరిచయం : డి.సోమసుందర్ .................................... 9
3. జీవన రేఖలు ........................................................ 17
4. ఎన్టీఆర్ : ఒక మార్క్సిస్టు పరిశీలన ............................. 19
5. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు ........................ 88
6. వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలు ............................ 150
7 ప్రత్యేక సంచికలు – సంపాదకీయాలు ......................... 177
8. వ్యాసాలు ........................................................... 230



## కృతజ్ఞతలు

శ్రీ వకుళాభరణం రామకృష్ణ గారు ప్రముఖ చరిత్రకారులు. తెలుగు ప్రజల సమగ్ర చరిత్రను రూపొందించడానికి తన జీవితాన్ని అంకితం చేశారు. ఈ పుస్తకానికి ముందుమాట వారితోనే రాయించాలన్న నా కోరికను కాదనలేక పోయారు. వయోభారాన్ని పక్కన పెట్టి నా అభ్యర్థనను మన్నించి ముందుమాట రాశారు. ఇంతటి భారం ఈ వయస్సులో వారి మీద పెట్టడం భావ్యం కాదన్న భావన నన్ను బాధిస్తున్నా నా కోసం అపురూపమైన ముందుమాట రాసిన వకుళాభరణం రామకృష్ణ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఈ సంకలనంలో వ్యాసాలను ఎంపిక చేసి సేకరించడానికి సహాయపడిన దారి దీపం సంపాదకవర్గ మిత్రులు కొప్పర్తి వెంకటరమణమూర్తి, మందలపర్తి కిషోర్, డాక్టర్ రమేష్ చంద్రబాబు, పరిచయ వాక్యాలు రాసిన డి.సోమసుందర్ గారికి ధన్యవాదాలు. ఇందులో కొన్ని వ్యాసాలను ప్రచురించిన విశాలాంధ్ర, ఆంధ్రజ్యోతి పత్రికల సంపాదకులకు, యాజమాన్యాలకు, కార్టూనిస్టులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– డివివియస్ వర్మ

## పరిచయం



- డి.సోమసుందర్

# ప్రజా ఉద్యమాలకు దారి దీపం డి.వి.వి.యస్.వర్మ గారు

యాభై సంవత్సరాలకు పైగా వర్మ గారు నాకు తెలుసు. అభిమానిగా, అనుచరుడిగా కంటే సహచరునిగా దశాబ్దాలపాటు కలసి పనిచేశాం. ఈ సుదీర్ఘమైన ఉద్యమ సహచర్యంలో ఎన్నో అనుభవాలు, ఎన్నో జ్ఞాపకాలు అన్నీ రాస్తే అదే ఒక పుస్తకం అవుతుంది. కమ్యూనిస్టు ఉద్యమం సృష్టించిన ఎందరో ఉత్తమ వ్యక్తుల గురించి వింటూ ఉంటాం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన కథానాయకుల జీవిత గాథలు చదువుతూ ఉంటాం. కానీ, మన మధ్యలోనే ఉంటూ మౌనంగా తన పని తాను నిశ్శబ్దంగా చేసుకుంటూ పోయే సిసలైన కథానాయకుల విశిష్టతలు మన దృష్టికి పెద్దగా రావు. డి.వి.వి.ఎస్.వర్మ అలాంటి కోవకు చెందిన వ్యక్తి.

ఒక మార్క్సిస్టు మేధావిగా, నిబద్ధత కలిగిన సామాజిక కార్యకర్తగా, నిజాయితీ మూర్తీభవించిన నిరాడంబర నాయకునిగా వర్మ గారు రెండు తెలుగు రాష్ట్రాలలోని కమ్యూనిస్టు ఉద్యమ శ్రేణులకు చిరపరిచితులు.

చారిత్రక, సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై ఆయన చేసిన రచనలు, విశ్లేషణలు కొత్తదైన లోచూపుతో ఉంటాయి. సామాజిక ఉద్యమాలలో విశాల ప్రజానీకం విస్తృతంగా పెద్ద ఎత్తున పాల్గొనడానికి వీలుగా వర్మ గారు రూపొందించే నినాదాలు, పోరాట రూపాలు, వైవిధ్యంగానూ, వినూత్నంగానూ, సరళంగాను, అదే సమయంలో అత్యంత ప్రభావవంతంగానూ ఉంటాయి. కొత్త తరహా ప్రజా ఉద్యమాల రూపశిల్పిగా తనదైన ప్రత్యేక స్థానాన్ని శాశ్వతం చేసుకున్నారు.

ఐదారు దశాబ్దాల వర్మ గారి సామాజిక కార్యకలాపాల కుదురు నుండి నా లాంటి అనేకమంది సామాజిక కార్యకర్తల బలగం మొలకలు వేసింది. అది తెలుగు రాష్ట్రాలలో విస్తరించి ఉంది. విభిన్న జీవన రంగాలలో ఆ మొలకలు ఎదిగి తమదైన

కీలక భూమిక పోషించడం మనం గమనించవచ్చు. ఆ చనువుతోనే వారి కృషి గురించి కొన్ని సంగతులు చెప్పడానికి ఈ పరిచయ వాక్యాలు రాస్తున్నాను.

## వినూత్న ప్రజా ఉద్యమాలు !

వర్మ గారు జిల్లాలో నడిపించిన ప్రత్యేకతలుగల కొన్ని ఉద్యమాలను మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తాను. **'ఒక పాదయాత్ర - మూడు ప్రజా ఉద్యమాలు'.** 1986లో ఒక కొత్త తరహా పాదయాత్రను వర్మ గారు రూపొందించారు. ఇది పార్టీ ప్రచార యాత్ర కాదు. దశాబ్దాల తరబడి ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు, సాగు భూమి పట్టాలు, ఖాళీగా వున్న అటవీ భూములు, మహిళలకు మరుగుదొడ్లు వంటి ఇతర సమస్యలు తెలుసుకోవడానికి, వారు గతంలో పెట్టుకున్న అర్జీలు వినతి పత్రాల సేకరణ కోసం చేసిన పాదయాత్ర. ఈ సమాచారంలో మాకు కొత్త కనిపించలేదు. కాని వర్మ గారు ఈ సమాచారం ఆధారంగా మూడు ప్రజా ఉద్యమాలను రూపకల్పన చేశారు.

ఇళ్ల స్థలాలు, బంజరు సాగుదారుల అర్జీలు వినతి పత్రాలను మండలాలు గ్రామాల వారీగా–సర్వే నంబరు భూమి తరహా, ఎన్ని సంవత్సరాలుగా వుంటున్నది – క్రోడీకరించే పని మా బృందం చేసింది. 90 పేజీల మెమోరాండం పుస్తకాన్ని ప్రింటు చేయించి వేలాది మంది పేదల ప్రదర్శనతో కలక్టరు గారికి సమర్పించారు. ఈ సమాచారం చూసి ఆయన నివ్వెరపోయారు. 50 పుస్తకాలు తీసుకుని అందరు ఎంఆర్ఓలకు పంపించి నెల తర్వాత డివిజనుల వారీగా ఎం ఆర్ఓలతో వర్మ గారి సారధ్యంలోని పార్టీ ప్రతినిధులతో సంయుక్తంగా సమావేశాలు నిర్వహించి అభ్యంతరం లేని వేలాది మంది పేదలకు ఇళ్ల పట్టాలు సాగు పట్టాలు ఇచ్చారు.

ఈ విజయానికి పాదయాత్రలో పార్టీ సభ్యులు సేకరించిన సమాచారం రెవెన్యూ శాఖను కదిలిస్తే, నేరుగా తమ సమస్యను కలెక్టరుకు అందిస్తామన్న ప్రకటన పేదలను ఆకర్షించడం కారణాలుగా వర్మ చెప్పారు.

పాదయాత్ర బృందాలకు అన్ని గ్రామాలలోను మహిళల మరుగుదొడ్ల సమస్య ముఖ్యమైనదిగా ముందుకు తెచ్చారు. ఇది అందరికీ తెలిసిన సమస్యే కాని పట్టించుకున్న వారు లేరు. గ్రామాలలో మహిళలు ప్రతిరోజూ నరకయాతన పడుతున్నారు. చీకటి పడ్డాకే రోడ్ల పక్కన మల విసర్జన పురుగు పుట్రా భయం, లైటుతో వచ్చే వాహనాలు, మనుషుల రాకపోకలకు లేచి నిలబడడం అవమాన భారంతో తలలు దించుకునే దుస్థితి మీద ఉద్యమించి తీరాలని వర్మ గారు పట్టుపట్టి ఈ ఉద్యమానికి రూపకల్పన చేశారు. సామూహిక మరుగుదొడ్లకు

బదులు 'ఇంటింటికి మరుగుదొడ్డి' అన్న కొత్త నినాదం పుట్టుకొచ్చింది.

ఈ సమస్యపై జిల్లా కలక్టరు, జిల్లా పరిషత్ సీఈవోలకు మెమోరాండాలతోపాటు వర్మ గారి సారథ్యంలో ప్రతినిధి బృందం చర్చలు జరిపింది. సామూహిక మరుగు దొడ్లు నిరుపయోగం అని వ్యక్తిగత మరుగుదొడ్లు మేలు అన్న అంశాన్ని సూత్ర ప్రాయంగా వారిని అంగీకరింపజేశారు. దీనికి ప్రత్యేకంగా ప్రభుత్వ నిధులు లేని సమస్యను ముందుకు తెచ్చారు. ప్రయోగాత్మకంగా కొన్ని మరుగుదొడ్లను నిర్మించడానికి పంచాయతీల సీనరేజి నిధులు, శాసనసభ్యుల నియోజక అభివృద్ధి నిధులు, ఇతరత్రా నిధుల సమీకరణ చేయాలన్న సూచనను పరిశీలిస్తామన్న హామీని ఇచ్చారు.

మరో పక్క ఇంటింటికీ మరుగుదొడ్డి నినాదాన్ని కరపత్రంతోపాటు ఒక వాల్ పోస్టరుతో విస్తృతంగా చేసిన ప్రచారం మహిళలను విశేషంగా ఆకట్టుకుంది. 'చలో కలక్టరేట్'కు ఇచ్చిన పిలుపులో వేలాది మంది మహిళలు కలక్టరేట్‌లో బైఠాయించారు. చర్చల అనంతరం 10 వేల మరుగుదొడ్ల నిర్మాణం తక్షణం ప్రారంభిస్తామని దశల వారీగా మరి కొన్ని వేల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మిస్తామని మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ కలెక్టరు గారు చేసిన ప్రకటనతో ఈ ఉద్యమం విజయం సాధించింది. వర్మ గారు మాట్లాడుతూ ఎన్ని మరుగుదొడ్ల నిర్మాణం సాధించామన్న దానికంటే ఇంటింటికీ మరుగుదొడ్డిని ప్రభుత్వమే నిర్మించే విధాన పరమైన మార్పు కీలకమైనదని, ఇది ఈ జిల్లాకే కాకుండా రాష్ట్రానికి, ఇతర రాష్ట్రాలకు దారి చూపిస్తుందన్నారు. అదే జరిగింది.

నాలుగు దశాబ్దాల క్రితం వర్మ గారు చేపట్టిన నినాదాన్నే ఇప్పుడు అందరూ 'స్వచ్ఛ భారత్' అంటున్నారు. ఇప్పుడు ఇంటింటా మరుగుదొడ్డి ఒక సహజమైన అవసరంగా సమాజంలో గుర్తింపు వచ్చింది. పేదలకు ఉచితంగా మరుగుదొడ్డి నిర్మించడం ప్రభుత్వానికి బాధ్యత అయింది.

పశ్చిమ గోదావరి జిల్లాలో చింతలపూడి, పోలవరం, గోపాలపురం, ఏలూరు, తాడేపల్లిగూడెం తాలూకాల్లో అడవులు ఉన్నాయి. అంతరించిపోతున్న అడవుల కేటగిరిలో ఉన్న ఆయా అడవుల్లో వేలాది ఎకరాల బంజరు భూములు ఉన్నాయి. ఈ అటవీ బంజర్లు పేదలకు పంచాలని, ఫారెస్టు కార్పొరేషన్ తరహాలో మొక్కలు పెంచుకునే అవకాశం కల్పించాలని స్థానిక పేదలతో మెమోరాండాలు, ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు నిర్వహించినా ప్రభుత్వంలో కదలిక రావడం లేదు. పాద యాత్రల సందర్భంగా ఈ సమస్యపై పేదలు చూపిన ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని

వర్మ గారు ఒక ప్రజా ఉద్యమానికి రూపకల్పన చేశారు.

ఈ ఉద్యమానికి జిల్లాలో అడవి బంజర్లున్న విస్తారంగా వున్న ప్రాంతాలను, ఐదారు కార్పొరేషన్ జీడి తోటల ప్రాంతాలను ఎంపిక చేశారు. జిల్లా నాయకులు వారాల తరబడి తాము బాధ్యత తీసుకున్న ప్రాంతాల్లోనే వుండి ప్రచార కార్యక్ర మాలు నిర్వహించారు. పత్రికలలో వార్తలు వచ్చాయి. ప్రభుత్వాన్ని కదిలించడానికి అటవీ బంజర్ల ఆక్రమణ ఉద్యమం ప్రారంభించారు. అటవీ బంజర్ల చుట్టూ వున్న గ్రామాల పేదలు వేలాదిగా పాల్గొన్నారు. దాదాపు 400 మందిని అరెస్టు చేసి కేసులు పెట్టారు. బెయిల్‌పై బయటకు వచ్చినా కేసుల తిరుగుడు తప్పలేదు.

ఉద్యమంలో పాల్గొన్న పేదలలో మరింత పట్టుదలను పెంచడానికి ఈ ఉద్యమాన్ని కొత్త రూపంలో సాగించారు. ఏలూరులోని డివిజనల్ ఫారెస్టు ఆఫీసును సమస్య పరిష్కారమయ్యే వరకు దిగ్బంధం చెయ్యాలనే ఉద్యమానికి పిలుపునిచ్చారు. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు గారిని ఈ ఉద్యమ ప్రారంభానికి ఆహ్వానించారు. ఆయన నాయకత్వంలో మూడు వేల మందితో శాంతియుతంగా ఎంతో క్రమశిక్షణతో దిగ్బంధం ప్రారంభమైంది. రాజేశ్వరరావు గారి రాకతో మర్నాడు అది పెద్ద వార్త అయ్యింది. మరోపక్క వేలాది మందికి వంట, పడక అక్కడే. రెండు రోజులు గడిచాయి. ప్రభుత్వం కదిలింది. కలక్టరు కార్యాలయం నుండి చర్చలకు పిలుపువచ్చింది. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు గారు చర్చలకు నాయకత్వం వహించారు. పోరాటం జరిగిన అన్ని ప్రదేశాలలో పేదలకు యాజమాన్యంలో భాగస్వామ్యం కలిగించే వనరక్షణ సమితుల ఏర్పాటుకు, జీడి తోటల వేలంలో పేదల సహకార సంఘాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం, కేసుల ఎత్తివేతకు అంగీకరించడం వంటి విజయాలను సాధించింది. పశ్చిమ గోదావరి జిల్లాలో వ్యవసాయ కార్మికులు నిర్వహించిన ఆ ఉద్యమం జాతీయ స్థాయిలోనే ఒక పెద్ద సమస్యకు పరిష్కారం చూపగలిగింది. ఢిల్లీ సరిహద్దుల్లో ఇటీవల రైతులు సాగించిన పోరాటం గుర్తుకు వస్తోంది కదూ? అదే పోరాట రూపాన్ని వర్మ గారు మూడున్నర దశాబ్దాల క్రితమే చేపట్టారు. విజయం సాధించే దిశగా నడిపించారు.

## రైతు కార్యాచరణ సమితి

రైతుల పంటలకు లాభసాటి ధరలు లేక అప్పుల ఊబిలో వున్న రైతులపై రాష్ట్ర ప్రభుత్వం అదనపు శిస్తు భారాన్ని ప్రకటించింది. పైగా కాలం చెల్లిన బ్రిటిష్ కాలం నాటి భూమి తరాల ఆధారంగా అశాస్త్రీయమైన పెంపుదలగా రైతులు భావించారు. ఈ సమస్యపై వివిధ రైతు సంఘాలు చేసిన ప్రయత్నాలు మొత్తం రైతులను

కదిలించడం లేదు. ఈ పరిస్థితులలో రైతు ఉద్యమానికి అందరినీ సమీకరించాలి ఒక స్వతంత్ర వేదిక అవసరమని వర్మ గారు భావించారు. క్రియాశీల రాజకీయాలకు కొంత దూరంగా వున్న వారిని గుర్తించి తణుకులో సమావేశం పెట్టి 'పశ్చిమ గోదావరి జిల్లా రైతు కార్యాచరణ సమితి'ని ఏర్పాటు చేశారు. వివిధ రైతు సంఘాల ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించారు. ఎక్కడికక్కడ రైతులు రావడానికి వీలుగా గ్రామసభలు జరిపించారు. రైతులు సునాయాసంగా నిర్వహించుకోగల 'గ్రామీణ ప్రాంతాల బంద్'కు ఇచ్చిన పిలుపులో గ్రామాల్లో రైతులు వందల సంఖ్యలో రోడ్ల మీదకు వచ్చారు. బండ్లు, ట్రాక్టర్లు రోడ్ల మీద నిలిపి బంద్‌ను కోలాహలంగా నిర్వహించారు. ఉద్యమం వేడెక్కిన తర్వాత వేలాది మందితో భీమవరంలో రైతుగర్జన సభ నిర్వహించారు. రైతుల ఐక్య ఉద్యమంతో ప్రభుత్వం దిగివచ్చి మొత్తం భూమి శిస్తును రద్దు చేసింది. నీటి తీరువాతో సరిపెట్టుకుంది.

ఈ విజయంతో రైతు కార్యాచరణ సమితి డెల్టాలోని డ్రెయిన్ల ఆక్రమణలను తొలగించి, తవ్వకాలు చేపట్టి ముంపు నివారణ చర్యల కోసం మరో ఉద్యమాన్ని చేపట్టింది. డ్రెయిన్ల ఆక్రమణల పరిశీలనకు గట్ల వెంబడి పాదయాత్రలు చేపట్టింది. ప్రభుత్వం గతంలో చేసిన వాగ్దానాల పత్రికా వార్తలను సేకరించి ఎక్కడికక్కడ రైతులు తమ తమ డ్రెయిన్లలో వినూత్నంగా 'వాగ్దానాల నిమజ్జనం' చేశారు. ప్రభుత్వం మారడంతో ఒక ఏడాది తర్వాత డ్రెయిన్ల తవ్వకం జరిగింది. ఈ రైతు ఉద్యమాలను నడిపించిన వర్మ గారిని రైతు కార్యాచరణ సమితి గౌరవాధ్యక్షులుగా నాటి నుండి నేటి వరకూ గౌరవిస్తూనే వున్నారు.

## సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమం

పశ్చిమ గోదావరి జిల్లా అక్షరాస్యతా ఉద్యమంలో ఆరేడేళ్లపాటు పోషించిన క్రియాశీలపాత్ర, చేసిన ప్రయోగాలు ప్రస్తావించి తీరాలి. 1996లో జాతీయ సాక్షరతా మిషన్ అక్షరాస్యతా ఉద్యమానికి కొనసాగింపుగా నిరంతర విద్యా కేంద్రాల పథకాన్ని ప్రకటించింది. ఈ కేంద్రాలలో కార్యకలాపాల నిర్వహణకు గ్రాంటును ఇచ్చినా ఈ కేంద్రాల నిర్వహణ విధి విధానాలను రూపొందించుకునే వెసులుబాటు జిల్లా యంత్రాంగానికి ఇచ్చింది. ప్రజల భాగస్వామ్యంతో ఈ కేంద్రాలను నిర్వహించాలని వారు భావించారు. జిల్లా సలహా మండలి సభ్యులుగా వున్న వర్మ గారు స్థానికులు నిర్వహించుకునే విధంగా వాటికి ఒక నిబంధనావళిని రూపొందించారు. నిరంతర విద్యా కేంద్రాల కార్యకలాపాలపై ఒక పుస్తకాన్ని

రాశారు. మండల లిటరసీ అధికారులకు శిక్షణలో ప్రత్యక్షంగా పాలు పంచుకున్నారు. కేంద్రాలను నిర్వహించే ప్రేరక్‌ల శిక్షణ ఇచ్చారు. కొత్త పాఠకుల కోసం 'అక్షర దీక్ష' పత్రికను నడిపించారు. 1999 జిల్లా వయోజన విద్యా శాఖ 'అక్షర మహిళ' పేరుతో స్వయం సేవక బృందాల్లో చదువు రాని మహిళల కోసం విద్యా కార్యక్రమం తలపెట్టింది. వీరికి మూడు నెలలలో సులభంగా చదువునేర్పడానికి వర్మ గారు కొన్ని అక్షరాలను తగ్గించి, కొత్త పద్ధతులతో రెండు పుస్తకాలు రాశారు. ముందు అక్షరాలను గుర్తు పట్టి చదవడానికి 'చదువు' పుస్తకం తర్వాత దానిని స్థిర పరచడానికి 'రాత' పుస్తకాలను రూపొందించారు. తర్వాత 11 జిల్లాలు ఈ పుస్తకాలను ముద్రించుకుని తమ అక్షరాస్యతా కార్యక్రమాలకు వినియోగించుకున్నారు. కొత్త చదువరుల కోసం వర్మ గారు 15 పుస్తకాలను రాశారు.

2001లో పశ్చిమ గోదావరి జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధన కోసం 'అక్షర దీక్ష' కార్యక్రమాన్ని జిల్లా వయోజన విద్యాశాఖ చేపట్టింది. ఈ ఉద్యమంలో వేలాది మంది విద్యా వలంటీర్లను సమీకరించడం వారికి 'చదువు-రాత' పుస్తకాలపై శిక్షణ వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తూనే తణుకులో 'అక్షర యజ్ఞం' కో ఆర్డినేటరుగా వ్యవహరించారు. దేశంలో 1991-2001 మధ్యలో మహిళలలో అత్యధిక అక్షరాస్యత సాధించినందుకు పశ్చిమ గోదావరి జిల్లాకు అవార్డు వచ్చింది. రాష్ట్రంలో తణుకు ప్రథమస్థానం పొందింది. పశ్చిమ గోదావరి జిల్లా సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమ చరిత్రలో వర్మ గారు తనదైన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

## లోక్‌సత్తాలో..

1999 సంవత్సరంలో వర్మగారు లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో చేరారు. అప్పటికి లోక్‌సత్తా ఒక ప్రజా ఉద్యమసంస్థగా రూపు ధరించలేదు. రతన్ టాటా ట్రస్ట్ సహకారంతో క్రియాశీల పౌరుల శిక్షణా కార్యక్రమంతో లోక్‌సత్తాలో ప్రజా ఉద్యమ బీజాలు పడ్డాయి. క్రియాశీల పౌరుల శిక్షణా పత్రాన్ని వర్మ గారు రూపొందించారు. ప్రజలే ప్రభువులు అన్న చైతన్యాన్ని కలిగించడం ఈ శిక్షణ లక్ష్యం. చదువు రాని వారికి కూడా ప్రశ్న-పలు సమాధానాలు చదివి వినిపించి వారి నుండి అభిప్రాయాలు సేకరించడానికి వీలున్న రీతిలో శిక్షణా పత్రాన్ని రూపొందించడం వర్మ గారి ప్రత్యేకత. సుమారు 70 వేల మందికి శిక్షణ ఇచ్చారు. సాధారణ ప్రజల లోకజ్ఞానంతో చెప్పే సమాధానాలలోని పొరపాటు అవగాహనను సరిదిద్దడానికి చేసిన తొలి ప్రయత్నం. లోక్‌సత్తా నాయకులు, కార్యకర్తలు ప్రజల దగ్గరకు వెళ్లి

వారిని చైతన్య పరచడంతోపాటు వారు ప్రజా కార్యకలాపాలు నిర్వహించగల సామర్థ్యాన్ని, ఉత్సాహాన్ని పొందారు.

సమాచార హక్కు సాధన కోసం ఏ ఇతర రాష్ట్రాలలోను జరగనంత ప్రచార ఆందోళనా కార్యక్రమాలు ఇక్కడ జరిగాయి. వర్మ గారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రూపొందించిన ప్రదర్శనలు, ఆర్డినెన్స్ కాపీల దగ్ధం వంటి కార్యక్రమాలతో లోక్ సత్తా బలగాలు హాలు మీటింగులకు పరిమితం కాకుండా రోడ్ల మీద కూడా కనిపించే ఉద్యమాలతో ప్రజాకర్షణ శక్తిగా మారింది.

లోక్‌సత్తా ప్రజా కార్యకలాపాలు నిర్వహించగల సామర్థ్య కొంత పెంచుకున్న నేపథ్యంలో 'స్థానిక ప్రభుత్వాల సాధికారత'కు కోటి సంతకాల ఉద్యమానికి పిలుపు ఇచ్చింది. 'ఇంటి ముందు ప్రభుత్వం - కంటి ముందు పాలన' వంటి నినాదాలను, ఆకర్షణీయమైన ప్రచార సామగ్రిని వర్మ గారు రూపొందించారు. రోజువారీ సమీక్ష సమన్వయంతో నెల రోజులలో కోటీ 10 లక్షల సంతకాల సేకరణ సాధించి ఉద్యమాన్ని నిర్వహింపజేశారు. ప్రజా బ్యాలెట్, కంకణ ధారణ వంటి పలు ఆకర్షణీయమైన ప్రచార రూపాలను వినియోగించారు.

ప్రతి సంవత్సరం డిసెంబరు 9 అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని లక్షలాది మంది విద్యార్థులతో ప్రతిజ్ఞా కార్మక్రమాలతో విద్యాసంస్థలకు లోక్‌సత్తాను విస్తరింపజేశారు. 2006లో పార్టీ ఏర్పడినప్పుడు ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. పార్టీకి స్థిరమైన సిద్ధాంత పునాదిని కల్పించడానికి 'నూతన రాజకీయ సంస్కృతి', 'జన రాజకీయం ఎందుకోసం?', 'జన రాజకీయం - ప్రశ్నలు, సమాధానలు' వంటి పుస్తకాలు రాశారు. శిక్షణ పొందిన నాయకత్వం, కార్యకర్తలు లేకుండా పార్టీ విస్తరణ, నూతన రాజకీయ భావజాల వ్యాప్తి జరగడం అసాధ్యం అన్న భావనతో పార్టీకి శాశ్వత పాఠశాలను ఏర్పాటు చేయించారు. శిక్షణా కరదీపికను వర్మ గారే రాశారు. ఏ అంశాలు ఎలా చెప్పాలి అన్న సూక్ష్మ అంశాల వివరణలు అందులో వున్నాయి. శాశ్వత బోధకుల బృందంతో పాఠశాలను నిర్వహింపజేశారు. శిక్షణా కరదీపికల రూపకల్పనలో, శిక్షణ ఇవ్వడంలో దిట్టగా పేరు తెచ్చుకున్నారు. మద్య నియంత్రణ కోసం శ్రీకాకుళం నుండి ఆదిలాబాద్ వరకు నిర్వహించిన బస్సు యాత్ర చెప్పుకోదగ్గది. లోక్‌సత్తా పేరుతో రాష్ట్రవ్యాపితంగా నిర్వహించిన సురాజ్య ఉద్యమం అన్ని తరగతుల ప్రజలను ఆకర్షించింది. దీని మీద వర్మ గారు ఒక పుస్తకం రాశారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులుగా మద్య నియంత్రణకు పలు ఉద్యమాలు చేసింది.

సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధం జాతీయ రహదారుల పై వున్న మద్యం షాపుల తొలగింపు కోసం చాలా రోజులపాటు సాగించిన ఉద్యమం షాపులు తొలగింపును సాధించింది. ప్రత్యేక హెూదా కోసం అన్ని జిల్లాలలో రౌండు టేబుల్ సమావేశాలు, పాదయాత్రలు, ప్రధానికి లక్ష పోస్టు కార్డుల ఉద్యమాలతో హెూదా కోసం ముందుగా ఉద్యమించింది లోక్‌సత్తా పార్టీ. మొత్తం మీద లోక్‌సత్తా సంస్థను, తర్వాత పార్టీని ప్రజా ఉద్యమాల బాట పట్టించడంలో కీలక పాత్రను వర్మ గారు పోషించారు.

## పత్రికా సంపాదకునిగా..

చివరిగా సంపాదకులుగా వర్మ గారు రూపొందించిన కొన్ని ప్రత్యేక సంచికల మీద, నిర్వహించిన పత్రికల మీద కొన్ని మాటలు చెప్పాలి. 1990లో విశాలాంధ్ర ప్రచురించిన 'పశ్చిమ గోదావరి జిల్లా సమాచార దర్శిని'కి వర్మ గారు సంపాదకులుగా వున్నారు. ఏ ఒక్క రంగాన్ని విడిచి పెట్టకుండా 100 సంత్సరాల చరిత్రను గణాంకాలను తవ్వి తీయించి రూపొందించిన ఈ దర్శిని నేటికీ రిఫరెన్సు పుస్తకంగా వుంది. ఆయన సంపాదకులుగా లోక్‌సత్తా టైమ్స్ ప్రచురించిన విద్య, వైద్య రంగాలపైనా, సురాజ్య ఉద్యమం పైనా విలువైన ప్రత్యేక సంచికలను రూపొందించారు. జాతీయ స్ఫూర్తి, దారి దీపం పత్రికలు ప్రచురించిన మార్క్స్, ఎంగెల్స్, గ్రాంసీ ప్రత్యేక సంచికలు వామపక్ష శ్రేణులను విశేషంగా ఆకర్షించాయి.అలాగే మార్క్సిస్టు మేధావు లైన విశాలాంధ్ర రాఘవాచారి, సాహితీ ప్రముఖులు రాంభట్ల కృష్ణమూర్తి, ఆర్వియార్, విలక్షణ కార్మిక నేత ఎంవియన్ కపర్ధీ మీద విలువైన ప్రత్యేక సంచికలను రూపొందించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న దారి దీపం మాసపత్రిక తెలుగులో ఉత్తమ ప్రమాణాలు గల పత్రికగా పేరు తెచ్చుకుంది. భారతీయ వాస్తవికతలకు అనుగుణంగా మార్క్సిజాన్ని వర్తింప చేయడానికి ఆయన తనవంతు మేధోకృషి కొనసాగిస్తున్నారు. దారి దీపం పత్రిక, ప్రత్యేక సంచికలు దానికి అద్దం పడుతున్నాయి. ఆయన నిత్య సత్యాన్వేషి. నిరంతర సృజనశీలి. 80 దశకంలో అడుగు పెడుతున్న వర్మగారు ఆరోగ్యంతో, ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండాలని మాబోటి సహచరులకు మార్గదర్శనం చేస్తూ వుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

## జీవన రేఖలు

# డి.వి.వి.యస్.వర్మ

- పూర్తిపేరు : దాట్ల వీర వెంకట సుబ్రహ్మణ్యేశ్వరవర్మ.
- జననం : పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం శివారు రామచంద్ర పురంలో 1946 జూలై 1వ తేదీన.
- కుటుంబం : తండ్రి సత్యనారాయణరాజు, తల్లి సూర్యనారాయణమ్మ గారు. ఒక సోదరుడు, ఇద్దరు సోదరీమణులు.
- చదువు : జంగారెడ్డిగూడెం జడ్పీ హైస్కూల్లో పాఠశాల విద్య
- **విద్యార్థి ఉద్యమం :** 1962 ఏలూరు సర్ సీఆర్ రెడ్డి కాలేజీలో విద్యార్థిగా ఏఐయస్ఎఫ్‌లో క్రియాశీల పాత్ర నిర్వహిస్తూ బీఎస్సీ పూర్తిచేశారు.
- 1966 కుటుంబంలో ఉద్యోగంలో చేరడమా లేక పార్టీలో వుండడమా అన్న చిక్కు సమస్య వచ్చినప్పుడు కుటుంబాన్ని, ఆస్తిపాస్తులనీ వదులుకుని ఏలూరు పార్టీ ఆఫీసుకి చేరి తన నిబద్ధతను నిలబెట్టుకున్నారు.
- ఆంధ్ర యూనివర్సిటీలో లా కోర్సులో చేరారు. విద్యార్థి ఉద్యమ అవసరాల కోసం చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పారు.
- విశాఖ ఉక్కు ఉద్యమ నేపథ్యంలో 1966లో గుంటూరులో జరిగిన ఏఐఎస్ఎఫ్. రాష్ట్ర మహాసభల్లో సురవరం సుధాకరరెడ్డి గారు రాష్ట్ర అధ్యక్షుడిగా, వర్మ గారు ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక.
- 1964లో భారత కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం. ఆ తరవాత మూడున్నర దశాబ్దాలపాటు కమ్యూనిస్టు ఉద్యమంలో వివిధ బాధ్యతలు నిర్వహించడం.
- 1971 నాటికి జిల్లా కార్యవర్గ సభ్యుడుగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుగా ఎన్నిక.
- **విదేశాలకు :** 1967లో బల్గేరియా రాజధాని సోఫియాలో జరిగిన ప్రపంచ యువజనోత్సవాలకు ప్రతినిధిగా హాజరు. సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు సిద్ధాంత, ఆచరణలను ప్రత్యక్షంగా అధ్యయనం చేయడానికి పది నెలలపాటు మాస్కోలో ఉండి వచ్చారు.
- **జిల్లా కార్యదర్శి :** 1975 నుంచి తొమ్మిదేళ్లపాటు సీపీఐ జిల్లా సహాయ

కార్యదర్శి. 1985లో జిల్లా కార్యదర్శిగా ఎన్నిక. రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికై 1994 వరకూ కొనసాగారు.

- పార్టీలో రెండుసార్లు మించి కార్యదర్శుల పదవులకు ఎన్నిక కారాదన్న స్వీయ నిబంధనతో పార్టీ కార్యదర్శిగా ఆయన స్వచ్ఛందంగా వైదొలిగారు.
- 1996లో వర్మగారు తన సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోకుండా పార్టీ కార్యకలాపాలను విరమించుకున్నారు. ఈ విషయంలో వర్మ గారు తన ప్రత్యేకతను నిలుపుకున్నారు. ఆయన పార్టీకి రాజీనామా చేయలేదు. పార్టీ ఆయన్ని బహిష్కరించలేదు.
- 1971లో వర్మ గారి వివాహం తన విద్యార్థి ఉద్యమ సహచరి సంకు మనోరమ గారితో జరిగింది.
- ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ, రైతు నాయకుడు, సంకు అప్పారావు, మహిళా ఉద్యమ నేత సంకు లక్ష్మీకాంతమ్మ దంపతుల కుమార్తె మనోరమ గారు.
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా మనోరమ గారు పదవీ విరమణ.
- మహిళా ఉద్యమ నేతగా, సామాజిక కార్యకర్తగా మనోరమ గారు జిల్లాలోనే కాక రాష్ట్రంలోనే చిరపరిచితురాలు.
- మనోరమ గారు తాను నమ్మిన విశ్వాసాలను, అభిప్రాయాలనూ నిర్భయంగా వ్యక్తం చెయ్యగల మంచి వక్త. శ్రోతల ఆలోచనలను ప్రభావితం చెయ్యగలిగే విషయ పరిజ్ఞానమూ, భావావేశమూ ఆమె సొంతం. ఒకపక్క కుటుంబ బాధ్యతలు తానే నిర్వహిస్తూ కమ్యూనిస్టు ఉద్యమంలో, లోక్‌సత్తాలో, మహిళా హక్కుల కోసం, ప్రపంచ శాంతి కోసం జరిగిన ఉద్యమాల్లో, మద్య వ్యతిరేక ఉద్యమాల్లో మనోరమ గారు క్రియాశీలంగా పాల్గొన్నారు.
- సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమం సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా అక్షర దీక్షకు జిల్లా సమన్వయకర్తగా డిప్యూటేషన్‌పై బాధ్యతలు నెరవేర్చారు.
- మనోరమ గారు మనుషులు అందర్నీ బేషరతుగా ప్రేమిస్తారు. ఇంటికి వచ్చి న ప్రతీ ఒక్కరినీ మనసారా ఆదరించే విశాల హృదయం ఆమెది. భోళాతనం మూర్తీభవించిన మనోరమ గారికి రాష్ట్రంలోనే పెద్ద అభిమానగణం ఉంది.
- వారికి ఇద్దరు పిల్లలు. కుమారుడు రాహుల్ కుటుంబం జంగారెడ్డిగూడెంలో, కుమార్తె కవిత కుటుంబం యు.ఎస్.ఎ.లో స్థిరపడ్డారు.

**- డి.సోమసుందర్**


ఎన్నికలు
ఒక మార్క్సిస్టు పరిశీలన

## పుస్తకాలు

# యన్.టి.రామారావు

## ఒక మార్క్సిస్టు పరిశీలన

**ప్రథమ ముద్రణ : జూలై 1988**

**ద్వితీయ ముద్రణ : డిసెంబరు 1988**

**ప్రతులు : 5,000**

**ముఖచిత్రం : మోహన్**

## నా మాట

ఈ పుస్తకం ప్రచురణకు సిద్ధం చేసే నాటికి వామపక్షాలు ఎన్‌టి రామారావు తెలుగుదేశం పార్టీతో కలసి ప్రయాణం సాగిస్తున్నాయి. పార్టీలో క్రియాశీల పాత్రలో వున్నందువల్ల నా పేరుతో ప్రచురణకు వున్న పరిమితుల రీత్యా ఈ పుస్తకాన్ని కలిదిండి భీమరాజు గారి పేరుతో ప్రచురించవలసి వచ్చింది. అప్పటికే భీమరాజు గారు పార్టీకి దూరంగా వున్నారు. ఆయన పేరుతో వున్న ముందుమాట కూడా నేను రాసిందే. ఆయన జ్ఞాపకార్థం ముందుమాటను ఆయన పేరుతోనే ప్రచురిస్తున్నాను. నా పేరుతో ఈ పుస్తకాన్ని ప్రచురించాలని భీమరాజు గారి చిరకాల వాంఛ నెరవేరకుండానే అకాల మరణం చెందారు. ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

ఈ పుస్తకం తొలి ముద్రణకు విశేష ఆదరణ లభించింది. కొద్ది నెలల వ్యవధి లోనే మలి ముద్రణ అవసరం అయ్యింది. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఎన్టీయార్ రాజకీయ ప్రవేశం మీద, పరిపాలన మీద గాఢమైన అభిమానం, తీవ్రమైన వ్యతిరేకత వున్నాయి. ఈ రాజకీయ ప్రత్యామ్నాయం ఆవిర్భవించిన తీరునీ పర్యవసానాలపై చేసిన ఈ పరిశీలన ఈ కీలక రాజకీయ ఘట్టం మీద చేసే భవిష్యత్ పరిశోధనలకు ప్రేరణగా ఉపకరిస్తుందని భావిస్తున్నాను.

**– డివివియస్ వర్మ**

# ముందుమాట

1982లో ఎన్‌టీ రామారావు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రాంతీయ పార్టీ ఏర్పడింది. రాష్ట్రంలో పెను తుఫాన్‌లాగ వ్యాపించినది. పది నెలలు నిండకుండానే అధికారాన్ని కైవసం చేసుకుంది. రామారావుకు 'అతీతశక్తులు' ఉన్నాయని పలువురు విశ్వసించారు. తాను 'అవతార పురుషుడు' అన్నట్టుగా ఆయన వ్యవహరించాడు. రాజకీయ 'మాంత్రికుని'లాగా ప్రజలను సమ్మోహితుల్ని చేసి అఖండ విజయాన్ని సాధించాడు. ఈ పరిణామాల మీద అనేక పుస్తకాలు, వ్యాసాలు, పార్టీల ప్రకటన తీర్మానాలు ప్రచురితమయ్యాయి. ఈ 'హఠాత్ పరిణామాన్ని' ఈ 'సమ్మోహన శక్తిని' మాత్రం అవి వివరించలేకపోయాయి. ఈ చిదంబర రహస్యాన్ని వెలికి తేవటానికి కావలసిన లోతైన పరిశీలన కరువైంది.

మార్క్సిస్టు విశ్లేషణ ఇలాంటి 'హఠాత్ పరిణామాలు శూన్యం నుంచి దూసుకురావడాన్ని' తిరస్కరిస్తుంది. చరిత్రక్రమాభివృద్ధి నేపథ్యంలో ఇలాంటి పరిణామాలన్నింటినీ విశ్లేషిస్తుంది. ఆంధ్రదేశంలో జరిగిన సుదీర్ఘ రాజకీయ పోరాటాన్ని పరిశీలిస్తే ఈ ప్రాంతీయ పార్టీ హఠాత్ పరిణామం వెనుక దశాబ్దాల చరిత్ర మనకు కనిపిస్తుంది. ఈ సంఘర్షణలో తలెత్తిన ప్రత్యామ్నాయాలు, ఆవిర్భ వించిన నూతన శక్తులు, అవి నడిపిన ఉద్యమాలు, సంపాదించిన అనుభవాలు, అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి చేసిన డ్రస్ రిహార్సెల్స్ వగైరాలు మనకు అవగతమవుతాయి. ఈ రాజకీయ సంఘర్షణ కొనసాగింపుగా అందులో అంతర్భాగంగా తెలుగుదేశం ఏర్పడడం, విజయాన్ని సాధించడం మనం గమనించ గలుగుతాం.

రామారావు ప్రజల్ని సమ్మోహితుల్ని చేసినట్టు కనిపించే మాట నిజం. అయితే రామారావుకు అతీతశక్తులు వున్నాయా ? అతను రాజకీయ మాంత్రికుడా ? అవతార పురుషుడా ? అన్న సమస్యలు రాకెట్ యుగంలో కూడా మనల్ని వేధిస్తున్నాయి. రామారావు అవతార పురుషుడూ కాదు. అతీతశక్తులు కలవాడూ కాదు. స్వార్థం మూర్తీభవించిన ఒక రాజకీయ అల్పిష్టి మాత్రమే. కాని, రాజకీయ హీరోగా వెలిగిపోతున్నాడు. దీనికి కారణం ఏమిటి ? ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితి సమ్మోహన శక్తులకు రంగాన్ని సిద్ధం చేసుకుంటూ వచ్చింది. ఇది రామారావు రాజకీయ రంగంలో ప్రవేశించి సృష్టించిన అంశం కాదు. 1970 దశకంలోనే పరిస్థితికి అంకురార్పణ జరిగింది. క్రమంగా అది పెరిగి పెద్దదైంది.

సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మీద రాజకీయ పార్టీలు తమ పట్టును కోల్పోయినప్పుడు ఈ పరిస్థితులు ఏర్పడతాయి. అప్పుడు అవి రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా స్వతంత్రంగా వ్యవహరించగలగుతాయి. రాజకీయ పార్టీలు వివిధ వర్గాలను నడపడానికి బదులు ఇలా స్వతంత్ర శక్తిగా వ్యవహరించగల వర్గాలు రాజకీయ పార్టీల భవిష్యత్తును నిర్వహించడం ప్రారంభమౌతుంది. తాత్కాలికంగా ఈ వర్గాలు ఏ పార్టీ వెనుక చీలి వున్నా సమయం వచ్చినప్పుడు తృటి కాలంలో ఏకం కాగల రాజకీయ కళను సంపాదించుకుంటాయి. విభజనోద్యమంలో, జనతా పార్టీకి శక్తినివ్వడంతో ఈ వర్గాలు ఇలాంటి రాజకీయ కళను ప్రదర్శించాయి. పరస్పరం పొసగని శక్తులతో కూడిన 'కాంగ్రెస్ వ్యతిరేకత' అనే రాజకీయ సమ్మేళనాన్ని రూపొందించి తమ బలగాలను దాని అధీనంలో వుంచాయి.

ఇది క్రమానుగతంగా బలాన్ని పుంజుకుని అది ఎవరిని వరిస్తే వారిని గెలిపించగల 'మంత్రశక్తిని' సంపాదించుకుంది. రామారావు రంగ ప్రవేశానికి ముందు ఈ 'మంత్రశక్తి' విశాఖలో బి.జె.పి.ని, చీరాలలో జనతా పార్టీని, విజయవాడలో వామపక్షాలను వరించి గెలిపించింది. ఇలా చిత్ర విచిత్రమైన తీర్పునిచ్చి గెలిపించగల స్థితికి ఈ 'మంత్రశక్తి' చేరిన దశలో రామారావు రంగ ప్రవేశం చేశాడు. సమ్మోహన శక్తులకు రాజకీయ రంగ పరిపక్వమైవున్న సమయంలో తన సినీ గ్లామరుతో రాజకీయ హీరోగా వాగాడంబరం చేస్తున్న రామారావును ఈ 'మంత్రశక్తి' ఆవహించింది. రామారావు రాజకీయ 'మాంత్రికు'డయ్యాడు.

అలాగే రాష్ట్రంలో తలెత్తిన ఈ ప్రాంతీయ బూర్జువా వర్గాన్ని మనం సక్రమంగా నిర్వచించుకోవాలి. ఈ బూర్జువా వర్గ ఫ్యూడలిజం అవశేషాల మీద తిరుగుబాటు చేసి, దాన్ని ఛేదించుకుని వచ్చిన బూర్జువా వర్గం కాదు, దానికి విరుద్ధంగా ఇది ఫ్యూడల్ అవశేషాల నుండి పెంపొందిన బూర్జువా వర్గం. దీనిని ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం అని నిర్వచించుకోవాలి. అప్పుడు మనం తెలుగు దేశం వెనుకగల శక్తుల వర్గ స్వభావాన్ని వాటి రాజకీయ లక్ష్యాలను సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాం. దీనికితోడు నాయకుడిగా అవతరించిన రామారావు వర్గ స్వభావాన్ని కూడా అంచనా వేసుకోవాలి. ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గానికి రామారావు సహజసిద్ధమైన నాయకుడు కాదు. ఈ వర్గం రాజకీయ అధికారం కోసం దశాబ్దాలుగా సాగిస్తున్న ప్రయత్నాలలో అంతర్భాగంగా నాయకుడైన వాడు కాదు. అయితే ఈ వర్గ లక్షణాలన్నీ రామారావు పుణికిపుచ్చుకున్నాడు. దీనికితోడు రామారావుకు తనదైన ప్రత్యేక వర్గ లక్షణం

ఉంది. అతను బూర్జువా సమాజపు శిఖరాగ్రంలో తలెత్తిన క్షీణవర్గం ప్రతినిధి. ఇది రామారావు సిసలైన జీవ లక్షణం. ఉత్పత్తి ద్వారా సంపాదన కాకుండా అడ్డదారిలో నడమంత్రపు సిరిని సంపాదించే వర్గానికి ప్రతినిధి. 'తమకు తాము లాభాలు సంపాదించుకోవడమే మిక్కిలి పెద్ద లక్ష్యంగా గల' వర్గానికి ప్రతినిధి. 'ధనం, రక్తం, కుళ్లు' కలగలిపి వ్యవహరించే దుస్సాహసిక వర్గానికి ప్రతినిధి. రామారావులోని ఈ జీవ లక్షణాన్ని అర్థం చేసుకుంటేనే అతని 'విశ్వరూపాన్ని' దర్శించగలుగుతాము. రాష్ట్ర రాజకీయ పరిణామాలలోని 'చిదంబర రహస్యం' గుట్టును రట్టు చేసే అనేక అంశాలు మనం జాగ్రత్తగా పరిశీలిస్తే దొరుకుతాయి. ఇలాంటి పరిశీలన ఆధారంగా ఈ పరిణామాల గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును రేఖా మాత్రంగా చిత్రించడానికి ఈ పుస్తకంలో ప్రయత్నం చేశాను. దీని మీద సమగ్ర పరిశీలన చేసే వారికి ఆసక్తిని కలిగించగలిగితే సంతోషం. వామపక్షాలు మరింత లోతైన, సమగ్రమైన పరిశీలన చేయడానికి ఇది ప్రేరణ కలిగిస్తే, రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్న ఆశ మాత్రం వుంది.

ఈ పుస్తకం ఒక రకంగా సంకలనం అని చెప్పడం ఉచితంగా వుంటుంది. ఈ దండలో దారం మాత్రమే నాది. నా సొంతం చెప్పుకోగలిగేవి రాజకీయ సూత్రీకరణలు, నిర్ధారణలు మాత్రమే. దీనికి అవసరమైనవి, అనువైనవి అని తోచిన వాటిని వివిధ పుస్తకాల నుండి, దిన వార పత్రికల నుండి కొటేషన్లుగా, విడిగా ఒక క్రమంలో గుదిగుచ్చి రూపం ఇచ్చాను. దీనికి అనేక మంది మిత్రులు ఇచ్చిన తోడ్పాటు సహకారానికి కృతజ్ఞతలు. మార్క్స్ వ్రాసిన లూయీ బోనపార్ట్ గ్రంథానికి ముందుమాట రాస్తూ ఎంగెల్స్ ఇలా అన్నారు. 'రాజకీయ కుట్ర హీరోను అత్యంత సముచితమైన అసహ్యాభావంతో తప్ప మరో విధంగా చూడాల్సిన అవసరం సహితం మార్క్స్‌కు లేకపోయింది'. అలాగే రామారావు పట్ల వ్యవహరించడంలో తప్పు లేదను కుంటాను. ఏమైనా ఈ పరిశీలన చెయ్యడానికి నాకు ప్రేరణ యిచ్చింది మార్క్స్ వ్రాసిన బోనపార్ట్ గ్రంథం. అది ఒకటికి పదిసార్లు చదవాల్సిన గ్రంథం. అది మన భావాలను, భాషను, విశ్లేషణా శక్తిని మనకు తెలియకుండానే మార్చి వేస్తుంది.


**కలిదిండి భీమరాజు**

అడ్వకేట్, తణుకు-534 211

ప.గో.జిల్లా. 20-7-1988

# విషయసూచిక

**ఒకటవ అధ్యాయం :** విస్మరించబడిన విశ్లేషణా పద్ధతి .................. 26

**రెండవ అధ్యాయం :** రాష్ట్ర రాజకీయ సంఘర్షణలో అంతర్భాగం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ...................... 29

1. వామపక్ష ప్రత్యామ్నాయ దశ ........................................... 31
2. రెండు పెట్టుబడిదారీ మార్గాల మధ్య సంఘర్షణ ...................... 32
3. ఒక 'స్వంతంత్ర శక్తిగా' కాంగ్రెస్ వ్యతిరేకత .......................... 35
4. వేషాన్ని మార్చిన మితవాద ప్రత్యామ్నాయం .......................... 38

**మూడవ అధ్యాయం :** రామారావు వాగాడంబర యజ్ఞం ................. 40

1. 'కాంగ్రెస్ వ్యతిరేకత'ను వశీభూతం చేసుకునే లక్ష్యం ................ 41
2. నికృత రూపధారి ప్రచారగణాలు ....................................... 42
3. వాగాడంబర ప్రసంగాలు ................................................. 44
4. ఫాసిజం వినియోగించే క్షుద్ర కళ ...................................... 49

**నాలుగవ అధ్యాయం :** రాజకీయ రంగంలో సమ్మోహనాశక్తులు ........ 50

1. చరిత్రలో అవతార పురుషులు ......................................... 50
2. సన్నకారు రైతుల విపరీత ధోరణులు ................................. 52
3. సంక్షోభ కాలంలో సమ్మోహనా శక్తులు ................................ 56

**ఐదవ అధ్యాయం :** ప్రాంతీయ పార్టీకి వెన్నెముకగా వున్న ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం ...... 58

1. పరిణామ దశలోని వున్న వివిధ వర్గాలు ............................... 58
2. ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం .......................... 60

అ) భూస్వామ్య ప్రయోజనాలు రక్షించే వర్గం ............................ 61
ఆ) ఫాసిస్టు పోకడలు గల వర్గం ............................................ 63
ఇ) జాతీయ ఐక్యతా బంధం లేని వర్గం .................................. 64
ఈ) సామ్రాజ్యవాదులకు సాధనంగా వినియోగపడే వర్గం ............... 65
3. ప్రాంతీయ బూర్జువా వర్గంలోని అంతర్గత వైరుధ్యాలు ............... 66

**ఆరవ అధ్యాయం :** రామారావు నిజస్వరూపం ........................... 69
1. నాయకుని ప్రత్యేక విశ్లేషణ ఆవశ్యకత ................................ 69
2. బూర్జువా సమాజ శిఖరాగ్రంలోని క్షీణవర్గం .......................... 70
3. మతమౌఢ్యం, క్షుద్ర తాంత్రిక మౌఢ్యం : సెక్యులరిజం ............... 73
4. వెయ్యి హిట్లర్లను దాచుకోగల దుస్సాహసం .......................... 74
5. పచ్చి అభివృద్ధి నిరోధకత్వానికి వికృతరూపం ........................ 76

**ఏడవ అధ్యాయం :** రామారావు రాజకీయ భవిష్యత్తు ..................... 79
1. క్షీణవర్గపు ఆర్థిక విజ్ఞానం : విరాళాలు, రుణాలు .................... 79
2. అవతార పురుషుని మంత్రశక్తులు ...................................... 82
3. అపర విశ్వామిత్రుని త్రిశంకు స్వర్గం .................................. 85

# ఒకటవ అధ్యాయం

## విస్మరించడిన విశ్లేషణా పద్ధతి

1983లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికలు ఒక 'రాజకీయ మహాద్భుతం'. తెలుగుదేశం పార్టీ పెట్టి పట్టుమని పది మాసాలైనా నిండకముందే రాజకీయాలలో అంతకుమించిన 'గత కీర్తి' అంటూ ఏమీ లేని ఒక సినీనటుడు ఈ ఎన్నికలలో 'ఘనవిజయాన్ని' సాధించాడు. రాజకీయ పండితులు ఆశ్చర్యచకితులయ్యారు. కాంగ్రెస్ పార్టీకి అది పిడుగుపాటుగా తోచింది. అంతవరకు రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలు నిర్వహించిన ప్రతిపక్ష పార్టీలు, వామపక్ష పార్టీలు ఈ ప్రభంజనంలో హారతి కర్పూరంలా హరించుకుపోయాయి. అయినప్పటికీ కాగల కార్యం గంధర్వులు తీర్చినట్టు కాంగ్రెస్‌ను ఓడించాలన్న తమ లక్ష్యాన్ని ఈ 'రాజకీయ గంధర్వుడైనా' తీర్చినందుకు ఈ పార్టీలన్నీ ఆనందించాయి. ఈ ఆనంద పారవశ్యంలో క్షతగాత్రులంతా తమకు తగిలిన గాయాలను విస్మరించి ఆత్మసమర్ధనా చాతుర్యాన్ని ప్రదర్శించుకున్నారు. దేశ, విదేశీ పత్రికలు ఈ విజయాన్ని ఆకాశానికెత్తి ఘనంగా కీర్తించాయి. 'రాజకీయ వ్యాఖ్యాతలు' ఈ 'చారిత్రాత్మక విజేతకు' జేజేలు పలికారు. 'నూతన శకానికి నాంది'గా 'ఈనాడు' పత్రిక పరవళ్లు తొక్కింది. 'రామరాజ్యం వచ్చిందంటూ' రాజధానిలో 'రామబంట్లు' నృత్యగానాలు చేశారు. ఎట్టకేలకు 'ఆంధ్రుల ఆత్మగౌరవం' 'గతకీర్తి కిరీటాన్ని' తగిలించుకొని అంధ్రప్రదేశ్‌లో అందలం ఎక్కింది.

1848-51 మధ్యకాలంలో ఫ్రాన్స్‌లో జరిగిన రాజకీయ పరిణామాలను విశ్లేషిస్తూ కార్ల్ మార్క్స్ లూయీ బోనపార్ట్ యొక్క బ్రూమేర్ 18వ తేదీ అన్న పుస్తకాన్ని రాశారు. ఈ పుస్తకానికి ఏంగెల్స్ ముందుమాట రాస్తూ లూయీ బోనపార్ట్ అధికారం కైవసం చేసుకొన్న తీరును ప్రస్తావిస్తూ 'అందరూ ఈ ఘటనను చూచి ఆశ్చర్యపడ్డారే గాని దీన్ని అర్థం చేసుకొన్న వారెవరూ లేరు' అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఈ 'విజయం'పై కూడా సరిగ్గా అందరూ ఇలాంటి వైఖరినే తీసుకొన్నారు. ఎవరి జయాపజయాలకు వారు ఆత్మసమర్ధనా వైఖరిని ప్రదర్శిస్తూ ఈ మహాద్భుత పరిణామం పట్ల విస్మయాన్ని ప్రకటించారు. మార్క్సిస్టు విశ్లేషణా పద్ధతి తెలిసిన వామపక్షాలు అదేదారి తొక్కడం విడ్డూరంగా కనిపిస్తుంది.

మార్క్సిజం మనకు గొప్ప విశ్లేషణా పద్ధతిని ప్రసాదించింది. చరిత్ర నడకను గురించిన సూత్రాలను స్పష్టంగా విప్పి చెప్పింది. రాజకీయ, మత, తాత్విక రంగాలలో జరిగిన చారిత్రక పోరాటాలన్నిటినీ లోతుగా పరిశీలిస్తే ఒక వాస్తవం బయటపడుతుంది. ఇవన్నీ కొద్దో గొప్పో సామాజిక వర్గాల యొక్క పోరాటాలను వ్యక్తీకరిస్తాయి. పైకి ఎంత ఆశ్చర్యాన్ని కలిగించే రాజకీయ ఘటనలు అయినప్పటికీ అవి ఆ సమాజంలో ఉన్న వర్గ పోరాటం యొక్క సహజ పరిణామంగానూ లేదా జరిగి తీరవలసిన పరిణామాలు గానూ వుండి తీరతాయి. అయితే శ్రీ బిపిన్ చంద్ర చెప్పినట్లు మనదేశంలో వామపక్షాలు ఈ మార్క్సిస్టు విశ్లేషణా పద్ధతికి తిలోదకాలు ఇవ్వడం వల్ల గాని, లేదా సిద్ధాంత బద్ధకంతో వాయిదా వెయ్యడం వల్ల గాని, అవకాశవాదంతో తల్లకిందులుగా ఆలోచించడం వల్ల గాని ప్రస్తుత దుస్థితి ఏర్పడిందని భావించక తప్పదు.

ఫ్రాన్సులో జరిగిన 'ఆశ్చర్యకరమైన ఘటన' గురించిపై పుస్తకంలో మార్క్స్ చేసిన ప్రస్తావన చూడండి. 'తమ జాతి విభ్రాంతి మొనర్చబడినట్టుగా ఫ్రెంచి వారు చెప్పినట్టుగా చెబితే సరిపోదు.. మూడు కోట్ల అరవై లక్షల జనాభా కలిగిన ఒక జాతిని ముగ్గురు వంచకులు విభ్రాంతులను చేసి, ప్రతిఘటన లేకుండా ఎలా వశం చేసుకోగలిగారన్న విషయాన్ని వివరించాల్సిన అవసరం ఇంకా మిగిలే వుంది?' అని ఆ పనికి పూనుకొన్నాడు మార్క్స్.

అలాగే 'ఒక అల్పిష్టి అయిన అతి సామాన్య వ్యక్తి రాజకీయ హీరోగా చలామణీ కావడానికి దారితీసిన పరిస్థితులకు, ఫ్రాన్సులోని వర్గ పోరాటం ఎలా అవకాశాన్ని కల్పించిందో వివరించడానికి పూనుకున్నానని' మార్క్స్ స్పష్టం చేస్తారు. అందుచేత ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పరిణామాలను కూడా వివరించుకోవలసిన అవసరం ఇంకా నిస్సందేహంగా మిగిలి ఉందనేది సుస్పష్టం. ఈ సందర్భంగా లెనిన్ చెప్పిన మరికొన్ని అంశాలను కూడా గుర్తు చేసుకొందాం.

**'ప్రజలు ఎల్లప్పుడూ రాజకీయాలలో వంచనకూ, ఆత్మ వంచనకూ తెలివి తక్కువగా బలి అవుతూనే వున్నారు. అన్ని రకాలైన మత, రాజకీయ, సాంఘిక పదజాలాల, ప్రకటనల, వాగ్దానాల వెనక ఏదో ఒక వర్గం యొక్క ప్రయోజనాలు దాగి వున్నాయనే విషయాన్ని ప్రజలు గ్రహించగలిగేటంత వరకూ వారు అలా బలి అవుతూనే వుంటారు. ప్రతి పురాతన సంస్థా అది ఎంత అనాగరికంగా, కుళ్లి పోయినదిగా కనపడినప్పటికీ అది పాలక వర్గాలకు చెందిన కొన్ని శక్తులచేత నిలబెట్టబడుతూ వుంటుందనే విషయాన్ని గ్రహించకుండా వున్నంత వరకు**

**సంస్కరణవాదులూ, అభివృద్ధి కాముకులూ ఆ శక్తులచేత ఎల్లపుడూ మోసగించబడుతూనే వుంటారు.'**

ఇలా రాజకీయాలలో అటు ప్రజలు, ఇటు అభివృద్ధి కాముకులు ఎందుకు వంచనకూ, ఆత్మవంచనకూ గురవుతారో లెనిన్ స్పష్టీకరించారు.

ఇలాంటి సుసంపన్నమైన మార్క్సిజం-లెనినిజం వెలుగులో మన రాష్ట్రంలో జరిగిన 'అద్భుత రాజకీయ' పరిణామాలను పరిశీలించుకొందాం. ఈ 'అభినవ రాముని' డైలాగుల వెనక, వాగ్దానాల వెనక, వేషభాషల వెనక, నైతిక, మత, రాజకీయ, సాంఘిక పదజాలాల వెనక దాగివున్న వర్గ ప్రయోజనాలను విశ్లేషించుకుందాం. 'ఆశ్చర్యచకితుల్ని చేసిన ఈ విజయానికి గల కారణాలను, ఒక 'అల్పిష్టి' అయిన సాదా వ్యక్తిని 'రాజకీయ హీరో'ని చేసిన మన సమాజంలోని వర్గ సంబంధాలను, వర్గ పోరాటాల స్థితినీ విశదీకరించుకొందాం.

# రెండవ అధ్యాయం

## రాష్ట్ర రాజకీయ సంఘర్షణలో అంతర్భాగం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం

**1. వామపక్ష ప్రత్యామ్నాయ దశ**

**2. రెండు పెట్టుబడిదారీ మార్గాల మధ్య సంఘర్షణ**

**3. ఒక 'స్వతంత్ర శక్తిగా' కాంగ్రెస్ వ్యతిరేకత**

**4. వేషాన్ని మార్చిన మితవాద ప్రత్యామ్నాయం**

మనుషులు తమ చరిత్రను తామే నిర్మించుకుంటారు. అయితే దాన్ని తమ యిష్టం వచ్చినట్లుగా నిర్మించుకోలేరు. తమ ఊహాలలో వున్న పరిస్థితులనుబట్టి గాని నిర్మించుకోలేరు. ప్రజలు తమకు తటస్థపడిన వాస్తవ పరిస్థితులలో, తమకు గతం నుండి లభించిన పరిస్థితులలో మాత్రమే దానిని నిర్మించుకుంటారు. ఇవి కార్ల్ మార్క్స్ చేసిన బోధనలు.

ఈ బోధనల ఆధారంగా ఈ రాష్ట్రంలో మన ప్రజలకు తటస్థపడిన వాస్తవ పరిస్థితులను వారికి గతం నుంచి లభించిన పరిస్థితులను విశ్లేణ చేసుకుంటే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావాన్ని, దాని విజయాన్ని అర్థం చేసుకోగలుగుతాం. ఈ పరిణామాలకు దోహదం చేసిన శక్తులను, వాటి నిజ స్వరూపాన్ని, అవగతం చేసుకోగలుతాం. ఇలా కాకుండా తెలుగుదేశం పార్టీ యొక్క తొమ్మిది నెలల చరిత్రకే పరిమితం అయిచూస్తే ఆ పార్టీ శూన్యంలో నుండి దూసుకువచ్చిన ఆంధ్ర ప్రజల 'ఆశాకిరణం'గా భ్రమించుతాం.

ఇలా ఒక రాజకీయ పార్టీ హఠాత్తుగా పుట్టి అధికారాన్ని హస్తగతం చేసుకోవడం భారత రాజకీయాలకు కొత్తకాదు. 1977లో జనతా పార్టీ ఆ పేరు తగిలించుకొన్న నెల రోజులలోనే కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకొంది. అయితే జనతా పార్టీ ఆవిర్భావానికీ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికీ అవి అధికారాన్ని చేజిక్కించుకొన్న తీరులోనూ చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ ప్రత్యేకతలను గమనంలో వుంచుకుంటూనే ఈ 'హఠాత్పరిణామాల'ను విశ్లేషణ చేసుకోవాలి. జనతా పార్టీ

ఆవిర్భావాన్ని గురించి సోవియట్ పరిశోధకుడు శ్రీ అలెగ్జాండర్ చిచరోవ్ చేసిన పరిశీలన ఎలా వుందో చూడండి.

'భారతదేశంలో 1960, 70 దశకాలలో జరిగిన దీర్ఘకాలికమైన రాజకీయ పోరాటాల ఫలితమే జనతా పార్టీ ఆవిర్భావం. 1967-70 సంవత్సరాలలో కాంగ్రెస్ రాజకీయ అధికారానికి ఎదురైన సంక్షోభం, తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ వ్యతిరేక సంఘటనల ప్రభుత్వాలు ఏర్పడటం అన్నవి ఈ పోరాటంలో అత్యంత ప్రధానమైన రెండు ఘట్టాలు. 1971, 72 ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా 'గ్రాండ్ ఎలయెన్స్' ఏర్పాటుకు పూనుకోవడం మరొక ముఖ్యమైన ప్రయత్నం. అయితే ఈ ప్రయత్నం విఫలమైంది. జాతీయ కాంగ్రెసు అధికారంలో కొనసాగింది. అయితే దేశంలో రెండవ రాజకీయ శక్తిని ఏర్పాటు చెయ్యడంలో ఈ శక్తులు క్రమానుగతంగా అనుభవాన్ని పెంపొందించుకొన్నాయి. ఈ పరిణామానికి దోహదం చేసే భౌతిక, స్వీయాత్మక అంశాలు బలాన్ని పెంచుకుంటూ వచ్చాయి.

చివరికి 1975లో గుజరాత్‌లో కాంగ్రెస్‌ను ఓడించడానికి జనతా ఫ్రంట్ ఏర్పాటు చేయబడింది. ఒక విధంగా జనతా పార్టీకి అది బీజప్రాయమైన రూపం.

ఈ విశ్లేషణను బట్టి చూస్తే నెల రోజులలో అధికారానికి వచ్చిన జనతా పార్టీ ఆవిర్భావం వెనక 10, 15 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ సంఘర్షణ దాగివుంది. ఇలాంటి లోతైన విశ్లేషణ మనం ఇప్పుడు చేసుకోవాలి.. అంటే మనరాష్ట్రంలో సాగిన రాజకీయ సంఘర్షణ తీరుతెన్నులను, అందు లోని ముఖ్యమైన ఘట్టాలను, దానికి దోహదం చేసిన భౌతిక, స్వీయాత్మక అంశాలను పరిశీలించడం ద్వారానే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావాన్ని, దాని విజయ రహస్యాన్ని దాని వర్గ స్వభావాన్ని అర్థం చేసుకోగలుగుతాం.

## 1. వామపక్ష ప్రత్యామ్నాయ దశ

1952 నుండి 1967 వరకు ఆంధ్రరాష్ట్రంలో జరిగిన పరిణామాలను పరిశీలిద్దాం. మన రాష్ట్రంలో 1952-55 సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రగతిశీలమైన వామపక్షం ఒక ప్రత్యామ్నాయ శక్తిగా వుంది. 1955 ఎన్నికల తర్వాత కమ్యూనిస్టు పార్టీ తన ప్రత్యామ్నాయ స్థానాన్ని కోల్పోవడం ప్రారంభించింది. ఈ క్రమంలో 1962 నాటికి అది ప్రధాన ప్రతిపక్షం స్థానానికి,

ఆ తర్వాత 1964లో పార్టీలో చీలిక వచ్చిన తర్వాత 1967 ఎన్నికలలో అది ప్రధాన ప్రతి పక్షపార్టీ స్థానాన్ని కూడా కోల్పోయి ఒక అతివాద 'ఒత్తిడి శక్తి'గా రాష్ట్ర రాజకీయాలలో మిగిలిపోయింది. ఈ దురదృష్టకర పరిణామాలకు దారితీసిన పరిస్థితులు లోతుపాతులను ఇక్కడ చర్చించలేము. కారణాలు ఏమైనప్పటికీ 1967 నాటికి ఆంధ్రప్రదేశ్ రాజకీయపటం నుంచి వామపక్ష ప్రగతిశీల ప్రత్యామ్నాయం తెరవెనుకకు నెట్టబడింది. సరిగ్గా ఈ మార్పులు జరుగుతున్న కాలంలోనే మరొక పరిణామం కూడా జరిగింది. కాంగ్రెస్ లోపల వున్న అభివృద్ధి నిరోధక శక్తులలోని ఒక భాగం స్వతంత్ర పార్టీ రూపంలో ఒక 'మితవాద ఒత్తిడిశక్తి'గా రాష్ట్ర రాజకీయ రంగంలో అవతరించింది. 1967 నాటికి కమ్యూనిస్టు పార్టీ కోల్పోయిన ప్రధాన ప్రతిపక్షం స్థానాన్ని ఈ స్వతంత్ర పార్టీ ఆక్రమించుకుంది.

అంటే 1952 నుంచి 1967 వచ్చే నాటికి ఆంధ్రప్రదేశ్ రాజకీయ సంఘర్షణ ఒక గుణాత్మకమైన మార్పునకు గురైంది. అంతవరకు కాంగ్రెస్ అనుసరిస్తున్న పెట్టుబడిదారీ మార్గానికీ, కమ్యూనిస్టు పార్టీ యొక్క ప్రగతిశీల ప్రత్యామ్నాయానికి మధ్య సాగిన రాజకీయ సంఘర్షణ తెరవెనుకకు నెట్టబడింది. ఇప్పుడు రాజకీయ సంఘర్షణ ప్రధానంగా రెండు పెట్టుబడిదారీ మార్గాల మధ్యకు తీసుకొని రాబడింది. అంటే కాంగ్రెస్ అనుసరించే పెట్టుబడిదారీ మార్గానికి, స్వతంత్ర పార్టీ అభిలషించే పెట్టుబడిదారీ మార్గానికి మధ్య జరిగే ఘర్షణగా అది రూపాంతరం చెందింది. రాజకీయ సంఘర్షణలో వచ్చిన ఈ మార్పు ఒక విషాదకరమైన తిరోగమన పరిణామం.

## 2. రెండు పెట్టుబడిదారీ మార్గాల మధ్య సంఘర్షణ

1967 నుండి 1978 వరకు రాష్ట్రంలో రెండు బూర్జువా ప్రత్యామ్నాయాల మధ్య సాగిన ఘర్షణను పరిశీలించాలి. 'అన్నీ బూర్జువా పార్టీలే' అని తేలికగా తోసి వేసే ధోరణి తీసుకోకూడదు. ఒక రాజకీయ పార్టీ ఏర్పడడానికి, అది బూర్జువా పార్టీ అయినప్పటికీ, అది మరొక బూర్జువా పార్టీతో ఘర్షణ పడటానికి గల కారణాలను పరిశీలించుకుంటేనే వాటి వర్గ స్వభావాన్ని స్థూలంగా అర్థం చేసుకోగలుతాము.

భారత రాజకీయాలలో వివిధ బూర్జువా పార్టీల గురించి సోవియట్ పరిశోధకుడు శ్రీ ఎరిక్ కొమరోవ్ చేసిన పరిశీలన చూడండి. 'పాలక బూర్జువా పార్టీ అయిన జాతీయ కాంగ్రెస్ విధానాలు స్థూలంగా పరిశీలిస్తే అదొక సంస్కరణవాద స్వభావం

కలదిగా వుంది. అలాగే ఆస్థిపర వర్గాలకు చెందిన ఇతర బూర్జువా భూస్వామ్య ప్రతిపక్ష పార్టీలు వాటిలో ఒక దానికి మరొక దానికి మధ్య వ్యత్యాసాలు వున్నప్పటికీ అవి ప్రధానంగా మితవాద స్వభావం కలిగి వున్నాయి' అని అన్నారు.

సోవియట్ పరిశోధకుడు చేసిన విశ్లేషణను మరికొంత వివరించుకొందాం. కాంగ్రెసు పార్టీ స్థూలంగా స్వతంత్ర పెట్టుబడిదారీ మార్గాన్ని అనుసరిస్తున్నది. అనేక పరిమితులు వున్నప్పటికీ అందులో ప్రణాళికలు ప్రభుత్వరంగం, కొన్ని పరిమిత వ్యవసాయ సంస్కరణలు, మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో భాగంగా ప్రైవేటు రంగం అభివృద్ధి ఈ మార్గంలో భాగంగా వున్నాయి. ఈ స్వతంత్ర పెట్టుబడిదారీ అభివృద్ధికి అనుగుణ్యమైన అలీన విధానం, సోషలిస్టు దేశాలతో మైత్రిని కొనసాగిస్తుంది. ఇదంతా దేశంలోని మొత్తం పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలకు ఉద్దేశించిందే. అయితే ఇది పెట్టుబడిదారీ అభివృద్ధి త్వరితం చేస్తుంది. పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి మార్గాలలో ఇదొక తరహా 'సంస్కరణవాద మధ్యేమార్గం' మాత్రమే. ఈ మార్గంలో నిర్మాణమయ్యేది కూడా పెట్టుబడిదారీ విధానమే ఇందులో, రైతులు, కూలీలు, శ్రామికులు దోపిడీకి గురవుతారు. అధిక ధరలు, దారిద్ర్యం, నిరుద్యోగం అవినీతి వగైరా పెట్టుబడిదారీ జాడ్యాలన్నీ వుండి తీరతాయి.

అయితే కాంగ్రెస్ పార్టీ స్థూలంగా అనుసరిస్తున్న ఈ మధ్యే మార్గానికి వ్యతిరేకంగా స్వేచ్ఛా పెట్టుబడిదారీ మార్గానికి మితవాద ప్రతిపక్షం స్థూలంగా ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఈ ప్రతిపక్షాల గుంపు స్థూలంగా ప్రణాళికల్ని, ప్రభుత్వ రంగాన్ని, జాతీయకరణల్ని వ్యతిరేకించింది. ఎలాంటి ఆంక్షలూ లేని పెట్టుబడిదారీ మార్గాన్ని సూచించింది. ఆదాయాలపై, ఆస్తులపై పరిమితిని ఏ రూపంలో విధించినా స్వేచ్ఛాభివృద్ధికి ఆటంకంగా ప్రకటించింది. స్వేచ్ఛా విపణిలో పోటీ వల్లనే ధరలు తగ్గుతాయని, అన్ని కంట్రోళ్లను ఎత్తివేయాలని ప్రకటించింది. ఇటువంటి అభివృద్ధికి నమూనాగా అమెరికాను ప్రస్తుతించింది. అమెరికాతో ఘర్షణకు దిగుతున్న అలీన విధానాన్ని వ్యతిరేకిస్తూ 'నిజమైన అలీన విధానాన్ని' ఏదో ఒక రూపంలో ముందుకు తెస్తూ సామ్రాజ్యవాద అనుకూల వైఖరులను ప్రదర్శించింది. దీనినిబట్టి కాంగ్రెస్ అంతా సంస్కరణవాద మధ్యే మార్గ బూర్జువా వర్గంగానూ, ప్రధాన బూర్జువా ప్రతిపక్ష పార్టీలన్నీ అభివృద్ధి నిరోధక బూర్జువా వర్గంగానూ విభజన జరిగిందని సూత్రీకరణ చేయకూడదు. అభివృద్ధి నిరోధకులకు కాంగ్రెస్ కూడా ఒక ప్రధాన కేంద్రమైతే అది స్థూలంగా మధ్యే మార్గాన్ని అనుసరిస్తున్నది. అలాగే బూర్జువా ప్రతిపక్షాలన్నీ ఈ మధ్యే మార్గ సమర్థకులు

వున్నప్పటికీ, అలాగే ఆ పార్టీలలో కూడా అనేక వ్యత్యాసాలు వున్నప్పటికీ, స్థూలంగా అవి మితవాద మార్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. దేశవ్యాపితంగా వివిధ పెట్టుబడిదారీ మార్గాల మధ్య జరుగుతున్న ఘర్షణ పూర్వ రంగంలోనే ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రాజకీయ ఘర్షణను మనం పరిశీలించుకోవాలి.

1969లో కాంగ్రెస్ పార్టీ చీలిపోయింది. బ్యాంకుల జాతీయీకరణ, రాజాభరణాల రద్దు వంటి చర్యలు తీసుకోబడ్డాయి. 1971, 1972 ఎన్నికలలో బూర్జువా ప్రతిపక్షాలు జాతీయ స్థాయిలో 'గ్రాండ్ ఎలయన్స్' ఏర్పాటుకు ప్రయత్నించాయి. కాని, ఇది రాష్ట్రంలో అంత ప్రభావాన్ని చూపలేదు. రాష్ట్రంలోని భూస్వామ్య, ధనాఢ్య వర్గాలకు ప్రత్యేకంగా దెబ్బ తీసే సమస్యలు కాకపోవడంతో ఈ వర్గాలన్నీ కాంగ్రెస్‌లోనే కొనసాగాయి.

1972 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ పరిస్థితి మార్పు చెందడం ప్రారంభించింది. భూసంస్కరణల చట్టం, పట్టణ ఆస్తుల పరిమితి చట్టాలు రావడం, ఆహార ధాన్యాల టోకు వ్యాపారాన్ని జాతీయం చేస్తామని కాంగ్రెస్ తీర్మానించడంతో ఆ పార్టీ లోపల, వెలుపల ఉన్న అభివృద్ధి నిరోధక శక్తులు ఏకమై ఎదురుదాడికి పూనుకున్నాయి. దీని ఫలితమే రాష్ట్ర విభజనోద్యమం.

1974లో విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ మహాసభ దీనిని చక్కగా అంచనా వేసింది.

'1972 ఎన్నికలలో దెబ్బ తిన్న మితవాద, మతవాద శక్తులు జనసంఘం, స్వతంత్ర పార్టీ, భూస్వామ్య వర్గం మొత్తం కాంగ్రెస్ వెలుపల ఉన్న అభివృద్ధి నిరోధక శక్తులన్నీ తమ స్వార్ధ ప్రయోజనాల పరిరక్షణకై ఈ ఉద్యమం వెనుక ప్రధానంగా సంఘటితమయ్యారు. కాంగ్రెస్‌లోని అభివృద్ధి నిరోధక శక్తులన్నీ ఈ వేర్పాటు ఉద్యమంలోకి దిగాయి. అసంతృప్తులై ఉన్న విద్యార్థులను, ఉద్యోగులను ఇతర మధ్యతరగతి వర్గాలని ముందు పెట్టుకుని వారి ముసుగులో సాగించిన విప్లవ ప్రతీఘాతుక ఉద్యమం ఇది.'

1972 ఎన్నికల తరువాత వచ్చిన భూ సంస్కరణల చట్టం లాంటి చర్యలకు కాంగ్రెస్ లోపల, బయట ఉన్న అభివృద్ధి నిరోధక శక్తులు ఈ విభజనోద్యమం రూపంలో ప్రతిఘటన ఇచ్చారు. మధ్య తరగతి వర్గాల 'ముసుగు'లో వారి అసంతృప్తిని వినియోగించుకుని విజయం సాధించగలమని భావించారు. ఈ విప్లవ ప్రతీఘాతుక ఉద్యమాన్ని సరిగా, వర్గరీత్యా అంచనా కట్టిన కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్‌లోని సమైక్యతావాదులను కలుపుకుని తిప్పికొట్టింది. తాత్కాలికంగా

మితవాద శక్తుల ఎదురుదాడి వెనక్కి తగ్గింది. దెబ్బ తిన్న పెద్ద పులి తిరిగి దాడి చేసేందుకు వీలుగా సేద తీర్చుకోడానికి వెళ్లినట్టుగా తిరిగి ఈ అభివృద్ధి నిరోధక వర్గాలు తమ తమ స్థావరాలకు చేరుకున్నాయి. కాంగ్రెస్ నుంచి బయటకు దూకిన శక్తులు తిరిగి కాంగ్రెస్‌లోకి చేరుకున్నారు. బయట జనసంఘ్, సిండికేట్, స్వతంత్ర పార్టీల రూపంలో ఉన్న పార్టీలు, తిరిగి నామమాత్రావశిష్టం అయ్యాయి.

రాష్ట్రంలో సాగిన ఈ విభజనోద్యమం అభివృద్ధి నిరోధక శక్తులకు ఒక డ్రస్ హార్సల్‌గా ఉపయోగపడింది. ఈ విప్లవ ప్రతిఘాతుక శక్తులు అవి కాంగ్రెస్ లోపల ఉన్నా, వెలుపల ఉన్నా – తృటి కాలంలో ఏకమై సమైక్యంగా పోరాడగల 'రాజకీయ కళను' నేర్చుకున్నాయి. ఈ శక్తులకు తిరిగి దాడి చేయడానికి కావలసింది మరికొంత బలం. కాంగ్రెస్ పాలనలో అసంతృప్తి చెందిన సామాన్య వర్గాల ప్రజల్ని ఆకట్టుకోగల 'ముసుగు', దెబ్బ తీయడానికి తగిన మంచి అవకాశం. వీటికోసం ఈ శక్తులు పొంచి చూస్తున్నాయి.

మితవాద ప్రత్యామ్నాయాన్ని రాజకీయ రంగం మీదకు తీసుకు రావడానికి 1977 లో జరిగిన పార్లమెంటు ఎన్నికలను ఒక సదవకాశంగా ఈ శక్తులు భావించాయి. ఎమర్జెన్సీ వల్ల ఏర్పడిన పరిస్థితులను, ప్రజలలో ఉన్న అసంతృప్తిని 'కాంగ్రెస్ వ్యతిరేకత' ముసుగులో వినియోగించుకోడానికి ఈ శక్తులు జనతా పార్టీ రూపాన్ని ధరించాయి. ఈ జనతా పార్టీని గురించి కమ్యూనిస్టు పార్టీ ఇలా విశ్లేషణ చేసింది. 'రాష్ట్రంలోని భూస్వామిక వర్గాలు జనతా పార్టీ వెనుక సమీకృతులయ్యాయి. కొన్ని జిల్లాలలో కాంగ్రెస్ నుంచి పెద్ద ఎత్తున రాజీనామాలు చేసి జనతా పార్టీలో చేరారు. ఇది మితవాద అభివృద్ధి నిరోధక శక్తులు బలంగా ఉన్న పార్టీ. భూస్వామిక వర్గ ప్రయోజనాలకు కంకణం కట్టుకొన్న పార్టీ'. అంటే ఇది నిస్సందేహంగా విభజనోద్యమానికి కొనసాగింపు మాత్రమే. ఈ మితవాదశక్తులు తిరిగి అదే ఎత్తుగడను అనుసరించాయి. అంటే ఈ శక్తులు అవి కాంగ్రెస్ లోపలవున్నా, వెలుపల వున్నా తగిన సమయంలో ఏకమై సమైక్యమై పోరాడగల 'రాజకీయకళ'ను తిరిగి ప్రదర్శించాయి.

జనతా పార్టీ వెనక ఒక నెల రోజులలోనే తమ శక్తులన్నింటినీ సమీకరించి 1972 నాటికి రాష్ట్రంలోవున్న అన్ని ప్రతిపక్ష బూర్జువా పార్టీలకు కలిపి 12 శాతం ఓట్లు ఉన్నాయి. కాని జనతాపార్టీ రూపంలో 1977లో ఈ శక్తులు తమ కొత్త 'రాజకీయ కళ' ద్వారా 33 శాతం ఓట్లు జనతా పార్టీకి తెచ్చిపెట్టాయి. జనతా పార్టీ రూపంలో ముందుకు నెట్టబడిన ఈ మితవాద కూటమి సీట్లపరంగా విజయం

సాధించక పోయినా ఓట్ల పరంగా 33 శాతం సంపాదించి రాష్ట్ర రాజకీయాలలో ప్రత్యామ్నాయ శక్తిగా ముందుకొచ్చింది.

రాష్ట్రంలో 1978 ఎన్నికల నాటికి కాంగ్రెస్ మరొక చీలికకు గురై అది మరింత బలహీనపడింది. ఇందిరా కాంగ్రెస్‌కు 39 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. దీనికి వ్యతిరేకంగా బూర్జువా ప్రతిపక్ష పార్టీలైన జనతా, కాంగ్రెస్ (యస్)లకు 46 శాతం ఓట్లు వచ్చాయి. అయితే వీరు చీలి పోటీ చేయడం వల్ల సీట్లపరంగా అధికారాన్ని గెల్చుకోలేకపోయారు. ఈ ఎన్నికలపై కమ్యూనిస్టు పార్టీ ఇలా వ్యాఖ్యానించింది.

'మన రాష్ట్ర శాసనసభ ఏర్పడినది లగాయితు జనతా పార్టీ వంటి మితవాద పార్టీ శాసనసభకు ఇంత సంఖ్యా బలంతో 60 మంది ఎన్నుకోబడడం ఇదే మొదటిసారి'. రాష్ట్రంలో మితవాద ప్రత్యామ్నాయం ప్రమాదకర స్థాయికి ఎదిగిందనడానికి ఇంత కంటే వివరణలు అవసరం లేదు. పరాజయం పాలైనప్పుడల్లా ఈ మితవాదశక్తులు తమ తమ స్థావరాలకు చేరుకోవడం, అదను దొరికినప్పుడల్లా తిరిగి కలసి దెబ్బ తియ్యడం అన్న ఎత్తుగడలను విభజనోద్యమంలోనూ ఆ తర్వాత ప్రతిసారీ అనుసరించారు. ఈ ఎన్నికల తర్వాత 'ఇందిరా కాంగ్రెస్' వ్యతిరేక ఓటుతో గెల్చిన వారు చాలా మంది తిరిగి అదే కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఈ సారి గెలుపుకు తగిన బలం వున్నప్పటికి తమ శ్రేణుల మధ్య పూర్తి ఐక్యత లేకపోవడమే ఓటమికి కారణంగా ఈ శక్తులు గుర్తించాయి. ఈ చీలిక అధిగమించే అవకాశం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో జనతా పార్టీ ముక్కచెక్కలు కావడంతో 1980 ఎన్నికలలో ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ వెలుపల, లోపల వున్న శక్తులు ఐక్యమై దెబ్బ తినే ప్రయత్నాలకు పూనుకోలేదు. మరొక సదవకాశం కోసం పొంచి వుండడమే మేలుగా భావించాయి.

## 3. ఒక 'స్వతంత్ర శక్తి'గా కాంగ్రెస్ వ్యతిరేకత

1980 తర్వాత రాష్ట్ర ప్రజల తీవ్ర ఆగ్రహానికి గురయ్యే రీతిలో చెన్నారెడ్డి సాగించిన అవినీతి పరిపాలన, నవాబును మించిన దర్పం, ప్రజా సమస్యల పట్ల ప్రతికూల వైఖరితో తిరిగి 'కాంగ్రెస్ వ్యతిరేక శక్తి' రంగంలోకి రావడం ప్రారంభమైంది. చెల్లా చెదురుగా వున్న ఈ 'శక్తిని' అఖిలపక్ష ఉద్యమం సమీకరించింది. ప్రజా సమీకరణలు, బంద్‌ల రూపంలో అది పెల్లుబికింది. ఈ ప్రజా అసంతృప్తిని తగ్గించేందుకు కేంద్రం తన చెప్పు చేతల్లో వుండే ముఖ్య మంత్రులను తెచ్చుకొనే క్రమంలో ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు. అంజయ్య,

భవనం వెంకట్రామ్ ఇక్కడ తమ పార్టీని నడుపుకోలేని, రాష్ట్రాన్ని పాలించలేని అసమర్థులని ప్రజల దృష్టిలో అభాసుపాలయ్యారు. వారు ఢిల్లీలో కాపురం పెట్టి హైదరాబాదును పాలిస్తున్నట్టుగా అత్యంత జుగుప్సాకరంగా ఢిల్లీ యాత్రలు చేశారు. కేంద్రం చేతుల్లో కీలుబొమ్మలుగా, అసమర్థులుగా, ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని ఢిల్లీ కొలువుకు తాకట్టు పెట్టిన వారుగా వీరిపై సాగుతున్న ప్రచారానికి సాకార రూపాలుగా వ్యవహరించారు. రాష్ట్రాన్ని పాలించగల సమర్థత కాంగ్రెస్ పార్టీకి లేదనే భావం ప్రజల్లో బలంగా నాటుకుంది. కాంగ్రెస్ వ్యతిరేకత తీవ్రస్థాయికి చేరింది. అది ఒక 'స్వతంత్రశక్తిగా' పరిణమించింది. 'కాంగ్రెస్ వ్యతిరేకత' ఒక శక్తిగా రూపొందడం మన రాష్ట్ర రాజకీయాలలో ఒక ముఖ్యమైన పరిణామం. ఎందుకంటే ఇది రాజకీయ మహాద్భుతాలను నడిపింది. అందుచేత దీనిని లోతుగా పరిశీలించడం అవసరం.

కాంగ్రెస్ అనుసరించే మధ్యే మార్గం కూడా పెట్టుబడిదారీ మార్గమే కావడంతో అది ప్రజల మీద దారిద్ర్యాన్ని, నిరుద్యోగాన్ని, అధిక ధరలను రుద్దుతుంది. వీటికి గురయ్యే ప్రజానీకంలో న్యాయసమ్మతంగా పెల్లుబికిన అసంతృప్తి 'కాంగ్రెస్ వ్యతిరేకత'గా వ్యక్తం కావడం సహజం.

కాంగ్రెస్ మధ్యే మార్గంతో ఘర్షణ పడుతున్న మితవాద అభివృద్ధి నిరోధక ప్రత్యామ్నాయం తన నిజ స్వరూపంలో ప్రజల ముందుకు రాలేదు. అది ప్రజల అసంతృప్తికి నాయకత్వం వహించేదిగా 'కాంగ్రెస్ వ్యతిరేకత' వేదికను ముసుగుగా వినియోగించుకుంటుంది. ఈ వేదికను ఆధారం చేసుకొని వామపక్షాలను దీనిలోకి లాగాలని ప్రయత్నిస్తుంది. అలాగే వామపక్షాలు విధానాల ప్రాతిపదికపై ప్రజల అసంతృప్తికి మార్గాలు చూపిస్తే అప్పుడు వర్గ ప్రాతిపదిక మీద రాజకీయ విభజన జరుగుతుంది. విధానాల ప్రాతిపదికకు, వర్గప్రాతిపదికకు, స్వస్తి చెప్పి 'కాంగ్రెస్ వ్యతిరేకతను' ప్రాతిపదికగా తీసుకొని వ్యవహరిస్తే దాని కార్యకలాపాలు కూడా 'కాంగ్రెస్ వ్యతిరేక' చైతన్యానికే తోడ్పడతాయి. అంతిమంగా వర్గ దృష్టిని వదులుకొని 'కాంగ్రెస్ వ్యతిరేక' గొడుగు క్రింద అభివృద్ధి నిరోధకులు పన్నిన వలలో వారి సరసకు చేరుకుంటారు.

రాష్ట్ర రాజకీయాలలో ఈ 'కాంగ్రెస్ వ్యతిరేకత' ఒక స్వతంత్ర శక్తిగా అభివృద్ధి చెందడానికి కావలసిన బలాన్ని అటు అభివృద్ధి నిరోధక మితవాద వర్గాల నుంచి, ఇటు వామపక్షాల నుంచి, కాంగ్రెస్ విధానాల వల్ల అసంతృప్తి చెందిన వివిధ వర్గాల ప్రజల నుంచి పొందింది. తనకు బలాన్ని చేకూర్చిన వివిధ వర్గాల

ప్రయోజనాలను, వివిధ పక్షాల విధానాలను తనలో వాతాపి జీర్ణం చేసుకొని ఈ 'కాంగ్రెస్ వ్యతిరేకత' ఒక స్వతంత్ర శక్తిగా రూపొందింది. వివిధ రుచులు కలిగిన వివిధ ప్రవాహాల నీళ్లు సముద్రంలో కలిసిన తర్వాత అన్నీ ఉప్పు నీళ్లుగా మారినట్టు అయింది. ఈ 'కాంగ్రెస్ వ్యతిరేకత' ఒక స్వతంత్ర శక్తిగా వ్యవహరించడానికి దోహదపడిన పరిస్థితులు మన రాష్ట్రంలో సాగిన రాజకీయ సంఘర్షణ తీరుతెన్నుల నుంచే ఉత్పన్నమయ్యాయి. మన రాష్ట్రంలో మితవాద ప్రత్యామ్నాయానికి జరిగిన ప్రయత్నాలు కొన్ని రాజకీయ పార్టీల పరంగా, స్థిరంగా జరగకపోవడమే ఈ పరిస్థితికి మూలకారణం. ఈ మితవాద ప్రత్యామ్నాయం అభివృద్ధి క్రమం అనేక బూర్జువా ప్రతిపక్ష పార్టీలు పుట్టడం, పోవడం, కలవడం, విచ్ఛిన్నం కావడం అనే క్లిష్టమైన రూపంలో సాగింది. అందుచేత ఈ మితవాద ప్రత్యామ్నాయానికి ప్రయత్నించిన అభివృద్ధి నిరోధక శక్తులు ప్రజల అసంతృప్తిని ఏదో ఒక ముసుగులో 'కాంగ్రెస్ వ్యతిరేకత'గా పెంపొందిస్తూ వచ్చారు. సదవకాశం దొరికినప్పుడల్లా వివిధ పార్టీలలో ఉన్న తమ వర్గ శక్తుల్ని సమీకరించి ఈ ప్రజల అసంతృప్తిని వినియోగించుకొనే 'రాజకీయ కళ'ను ప్రదర్శించారు. ఇలాంటి సందర్భాలలో పార్టీల పరంగా నిర్వహించాల్సిన నాయకత్వ పాత్రను ఈ శక్తులే ఆయా పార్టీలను అడ్డం పెట్టుకుని నిర్వహిస్తూ వచ్చాయి.

విభజనోద్యమాన్ని కొన్ని మితవాద పార్టీలు సాగించిన ఉద్యమం అని చెప్పడం కంటే కాంగ్రెస్ లోపల, వెలుపలవున్న అభివృద్ధి నిరోధక శక్తులు మధ్య తరగతులలోని అసంతృప్తిని 'ముసుగుగా' పెట్టుకుని నడిపిన ఉద్యమంగా చెప్పడమే సరైనది అవుతుంది. ఈ విభజనోద్యమంలో ఓటమిని చవిచూడగానే మితవాద శక్తులు తిరిగి తమ స్థావరాలకు చేరిపోయాయి. దీనితో ఈ ఉద్యమంలో పెద్ద పాత్ర వహిస్తున్నట్టు కనిపించిన బూర్జువా ప్రతిపక్ష పార్టీలు, వాటి సేనానులు తిరిగి ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు. తర్వాత జనతా పార్టీ ఏర్పాటుతో ఈ మితవాద శక్తులు మళ్లీ రాజకీయ రంగప్రవేశం చేశాయి. జనతా పార్టీ చీలికలు, ఓటములతో ఈ శక్తులు తిరిగి తమ స్థావరాలకు చేరుకున్నాయి. దీని పర్యవసానంగా జనతా పార్టీ, దాని భాగస్వామ్య పార్టీలు తిరిగి నామమాత్రపు స్థితికి వచ్చాయి. ఇవన్నీ మితవాద ప్రత్యామ్నాయానికి కొన్ని వర్గాలు చేసిన కృషిని స్పష్టం చేస్తున్నాయి. అవి ప్రదర్శించిన 'రాజకీయ కళను' విశదం చేస్తున్నాయి. ఈ మొత్తం క్రమంలో మితవాదశక్తులు 'కాంగ్రెస్ వ్యతిరేకత' అనే వికృత చైతన్యాన్ని రాష్ట్ర రాజకీయాలలో పెంచి పోషించాయి. ఈ 'కాంగ్రెస్ వ్యతిరేకత' బూర్జువా ప్రతిపక్షాల

నుంచి, వామపక్షాల నుంచి, అసంతృప్తులైన ప్రజల నుంచి బలాన్ని సంపాదించుకుంది. అయితే తాను పొందిన శక్తిని తిరిగి ఎవరిది వారికి పంచి ఇవ్వడం ఈ వికృత రూపానికి అసాధ్యం. అందుచేత అది ఒక 'స్వతంత్ర శక్తి'గా రూపొందింది. ఇప్పుడు ఈ 'స్వతంత్ర శక్తి' దీన్ని పెంచి పోషించిన పార్టీల అదుపాజ్ఞలలో లేదు. పైగా దాని దయాదాక్షిణ్యం మీదే ఈ పార్టీల భవిష్యత్తు ముడిపడివుంది. అయితే ఈ వాస్తవాన్ని బూర్జువా ప్రతిపక్షాలు గాని, చివరికి వామపక్షాలు గాని గుర్తించే స్థితిలో లేవు. పైగా ఈ పార్టీలన్నీ తమ తమ బలాధిక్యతల మీద ఉహా స్వర్గాలు నిర్మించుకొని వున్నాయి.

చీరాల ఉప ఎన్నికలలో విజయం జనతా పార్టీకి పెరుగుతున్న పలుకుబడిగా దానిని భ్రమింపచేసింది. విశాఖ కార్పొరేషన్‌లో గెలుపు రాష్ట్రంలో రాబోయే ప్రత్యామ్నాయంలో తన వాటాకు కాటా సూచికగా బి.జె.పి.ని పరవశింపచేసింది. విజయవాడ కార్పొరేషన్‌లో వామపక్షాల ఆధిక్యత వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయానికి మార్గం సుగమం అవుతున్నట్టుగా వారిని ఊహింపజేసింది. పరిస్థితి చేయి జారిపోతున్నదని, ఈ 'కాంగ్రెస్ వ్యతిరేక శక్తి' రాష్ట్ర రాజకీయాలను ఆవహించిందని, అది ఇప్పుడిచ్చిన విచిత్రమైన తీర్పులతోనే సరిపెట్టుకోదని, ఇంకా విచిత్రమైన తీర్పులను ఇచ్చే క్రమంలో అది బూర్జువా ప్రతిపక్షాలను, వామపక్షాలను హతాశుల్ని చేస్తుందన్న ఆలోచనే ఈ పక్షాలకు కలగలేదు.

## 4. వేషాన్ని మార్చిన మితవాద ప్రత్యామ్నాయం

సరిగ్గా ఇలాంటి రాజకీయ సన్నివేశంలో రాష్ట్రంలోనే పుట్టినా రాష్ట్రేతరుడుగా పెరిగిన వ్యక్తి, వెండితెర మీదే గాని నిండు సభలలో ప్రజలకు అంతగా దర్శనం ఇచ్చి ఎరుగని వ్యక్తి, 300 సినిమాలలో నటించి ఎడా పెడా కోట్ల ఆస్తులకు పడగలెత్తడం మినహా చెప్పుకోదగ్గ ఘనకార్యాలంటూ ఏమీ చేసి ఎరుగని వ్యక్తి, అటు స్వాతంత్ర్య ఉద్యమంలో గాని ఇటు రాష్ట్ర ఆందోళనలు, ప్రజల సమస్యల మీద గాని లేదా 'కాంగ్రెస్ వ్యతిరేక పోరాటాలు, లాఠీ దెబ్బలు, జైళ్లు వగైరాలలో పాత్ర వహించడానికి, తన 60 ఏళ్ల నిండు జీవితంలో 60 సెకన్లు కూడా వెచ్చించి యెరుగని వ్యక్తి హఠాత్తుగా రాజకీయ రంగ ప్రవేశం చేశాడు.

కాంగ్రెస్ నుంచి వలసవచ్చే వారితోను, అందులో టిక్కెట్టు దొరకని వారితోనూ ఈ తెలుగుదేశం పార్టీ వుంటుందని, అది కాంగ్రెస్‌ను ఎంత చీలిస్తే అంత మంచిదని, ఈ కొత్త పార్టీ తమకొక జూనియర్ పార్టనర్‌గా ఉంటుందని తొలి

దశలో ప్రతిపక్ష పార్టీలు భావించాయి. ప్రతిపక్షాలు, వామపక్షాలు తాము 'కాంగ్రెస్ వ్యతిరేకత మీద నిర్మించుకొన్న కంచుకోటలలో తమ బలగాలను భద్రంగా ఉంచుకొన్నామని భ్రమించారు. చీరాల ఉపఎన్నికలో విశాఖ, విజయవాడ కార్పొరేషన్ ఎన్నికలలో తమకు ఆవహించిన ఈ 'కాంగ్రెస్ వ్యతిరేక శక్తి' ఈ పార్టీల అదుపాజ్ఞలలో లేదనే కరుకు వాస్తవాన్ని గుర్తించే స్థితిలో అవి లేవు. ఇప్పుడా 'వికృత శక్తికి' తనలాంటి 'వికృత రూపంగల' వ్యక్తి తటస్థపడినాడు. ఈ 'కాంగ్రెస్ వ్యతిరేక శక్తి' తెలుగుదేశం పార్టీని ఆవహించింది.

1978 ఎన్నికలలో బూర్జువా ప్రతిపక్ష పార్టీలన్నింటికీ 'కాంగ్రెస్ వ్యతిరేకత' ప్రాతిపదికగా వచ్చిన 46 శాతం ఓట్లలో 40 శాతం ఓట్లు 'అన్న' పరమయ్యాయి. మంత్రదండాన్ని కోల్పోయిన మాంత్రికుల లాగ 'కాంగ్రెస్ వ్యతిరేక శక్తి' తమని ఆవహించలేకపోవడంతో ప్రతిపక్షాలు హతాశులయ్యాయి. విభజనోద్యమం రూపంలో, జనతా కూటమి రూపంలో 'కాంగ్రెస్ వ్యతిరేకత'ని ఆయుధంగా చేసుకొని ప్రయాణం సాగించిన మితవాద అభివృద్ధి నిరోధక ప్రత్యామ్నాయం వేషాన్నీ, పార్టీని మార్చింది, గుణాన్ని మాత్రం మార్చుకోకుండా. వామపక్ష ప్రత్యామ్నాయం తెరవెనక్కు నెట్టబడిన తర్వాత కాంగ్రెస్ మధ్యేమార్గానికి వ్యతిరేకంగా మితవాద ప్రత్యామ్నాయానికి సాగిన సుదీర్ఘ పోరాటాల ప్రయత్నాలు ఫలితమే తెలుగుదేశం యొక్క విజయం.

# మూడవ అధ్యాయం

## రామారావు వాగాడంబర యజ్ఞం

**1. కాంగ్రెస్ వ్యతిరేకతను వశీభూతం చేసుకునే లక్ష్యం**

**2. వికృత రూపధారి ప్రచారగణాలు**

**3. వాగాడంబర ప్రసంగాలు**

**4. ఫాసిజం వినియోగించే క్షుద్ర కళ**

పట్టుమని పది మాసాలైనా నిండకుండానే, ప్రపంచంలోనే పరమాద్భుతాన్ని సృష్టించిన వాడిగా తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన సినీనటుడు యన్.టి.రామారావు వినియోగించిన పద్ధతులను పరిశీలిద్దాం.

మే 28వ తేదీ ఎన్‌టీఆర్ పుట్టినరోజు. ఈ కారణజన్ముని జన్మదినం నాడు అవతరించాల్సిన ఈ ప్రాంతీయ పార్టీ మధ్యంతర ఎన్నికలు వచ్చేస్తున్నాయన్న వదంతుల మూలంగా నెల తక్కువ బిడ్డగా 1982 మార్చి 29న హడావుడిగా పుట్టుకొచ్చింది. తనను తానే అధ్యక్షునిగా ప్రకటించుకున్న ఈ పార్టీకి 'తెలుగుదేశం' అని నామకరణం చేశాడు. మార్చి 31న పత్రికా గోష్ఠి జరిపి రాష్ట్ర ప్రజలకు 'ఏప్రిల్ ఫస్టు' కానుకగా పార్టీ పతాకాన్ని విడుదల చేశారు.

మార్క్స్ ఫ్యూడల్ సోషలిజాన్ని పరిహాసం చేస్తూ 'ప్రజలను తమ చుట్టూ సమీకరించుకోవడానికి ఫ్యూడల్ ప్రభువులు గత్యంతరం లేక కార్మిక వర్గపు బిచ్చపు జోలెను తమ పతాకంగా పెట్టుకుని ముందరి వైపు ఆడించేవారు' అన్నాడు.

అలాగే రామారావు తన 'పసుపు పచ్చని' బిచ్చపు జోలె పతాకాన్ని రూపొందించాడు. కార్మికులకు 'ఎర్ర రంగు పళ్ల చక్రాన్ని' రైతులకు 'ఆకుపచ్చ నాగలిని', కుటీర జీవన స్వచ్ఛతకు 'తెల్లరంగు గుడిసెను' చిహ్నాలుగానూ 'స్వార్థ త్యాగానికి' ప్రతీక అయిన పసుపు రంగు మీద ముద్రించినట్టు ఈ జెండాను రాష్ట్ర ప్రజల ముందు ఆడించాడు.

తెలుగు జాతి ఆత్మగౌరవం అనే మహారథానికి ఈ జెండాను తగిలించి దాని మీద తెలుగుదేశం పార్టీని ప్రతిష్టింపజేసి తానే సర్వరూపధారియైన రథసారధి కాగా రామోజీ దానికి 'ఈనాడు' జననాశ్వాన్ని కట్టి వదలగా 'వాగాడంబర'మనే

ఆయుధాన్ని ధరించి ఆంధ్రప్రదేశ్ సింహాసనాన్ని కైవసం చేసుకునేందుకు జైత్రయాత్రకు బయలుదేరాడు.

## 1. కాంగ్రెస్ వ్యతిరేకతను వశీభూతం చేసుకునే లక్ష్యం

అప్పటికి నలుగురు ముఖ్యమంత్రులను మార్చి కాంగ్రెస్ పార్టీ నవ్వులపాలై వుంది. 1978 నాటికే 'కాంగ్రెస్ వ్యతిరేకత' అధికారాన్ని కైవసం చేసుకోగల స్థితికి పెరిగింది. 1980 కార్పొరేషన్ ఎన్నికలలో 'ఈ కాంగ్రెస్ వ్యతిరేకత' ఎవరిని వరిస్తే వారు విజయఢంకా మోగించగల స్థితి స్పష్టమైంది. సరిగ్గా ఇలాంటి సమయంలో 'ఆంధ్ర ప్రజల సముద్ధరణ' కోసం రాజకీయ అవతారం ఎత్తిన రామారావు ఈ 'కాంగ్రెస్ వ్యతిరేకత'ను వశీకరణ చేసుకోవడం అన్న మహాత్కార్యాన్ని సాధించాల్సి వుంది. ఈ నిజ లక్ష్యం సాధించబడితే అప్పుడాయన కాంగ్రెస్‌ను ఓడించగల సర్వ శక్తి సమన్వితుడవుతాడు. ఈ 'కాంగ్రెస్ వ్యతిరేకతను' తన స్వంతం చేసుకొనేం దుకు, ఆ 'మహత్తును, ఆ సంజీవిని'ని కైవసం చేసుకొనేందుకు 'వాగాడంబర'మనే మహాయజ్ఞాన్ని సాగించడానికి నడుం కట్టాడు. ఈ 'మహాయజ్ఞం'లో ఎక్కడ తప్పటడుగుపడినా 'మంత్రదండం' కోల్పోయిన మాంత్రికుని పరిస్థితి యన్.టి. ఆర్‌కు సంభవిస్తుందని ఈ ధర్మధ్వజికి వారి పురోహిత ప్రచారగణాలకు బాగా తెలుసు. ప్రజల మూఢత్వం మీద వారు రాజకీయ జూదం ఆడదల్చారు. ఇందులో వారు కోల్పోయే సంపద అంటూ వారికి గతంలో కూడబెట్టుకున్నదేమీ లేదు. దుస్సాహసిక చర్య ఫలిస్తుందా ఆంధ్రప్రదేశ్ సింహాసనాన్ని అధిష్టించవచ్చు. ఆపైన ఢిల్లీ సింహాసనానికి రాచబాటలు రూపొందించుకోవచ్చు.

రాష్ట్రంలోని ప్రతిపక్షాలు తాము పెంచి పోషించిన ఈ 'కాంగ్రెస్ వ్యతిరేకత' సమ్మోళనాన్ని తస్కరించడానికి వచ్చిన ఈ 'సినీ మాంత్రికుని' నిజరూపం వారికి అర్థమే కాలేదు. ప్రతిపక్షాలన్నీ నా మిత్రపక్షాలే'నంటూ ఎన్నికల వరకు వాటిని ఆదమరపులో వుంచి, తన సమస్త లాఘవాలన్ని వినియోగించి ఈ 'కాంగ్రెస్ వ్యతిరేక శక్తి'ని చేతచిక్కించుకొని ఆ 'మంత్రదండం'తోనే ఈ ప్రతిపక్షాలను కూడా ఒక్క మోదు మోదాడు. ఆ తర్వాత కూడా ఈ పక్షాలకు అసలు విషయం బోధపడనే లేదు. రామారావు దృష్టిలో సినిమాలో నటనకూ, రాజకీయ నటనకూ మధ్య తేడా లేదు. 'సినిమాలలో రాముని పాత్ర అంటే నాకిష్టం. కాని, రాజకీయాలలో కృష్ణుని పాత్ర ధరిస్తాను' అని ఢిల్లీ విలేకరులతో స్పష్టం చేశాడు. మాయావిగా, మాటకారిగా, వంచనా శిల్పంలో ఆరితేరినదిట్టగా కనిపించే శ్రీకృష్ణునిపాత్ర

అందరికీ తెలిసిందే.

రాష్ట్ర రాజకీయాలలో మార్పులకు సిద్ధం అవుతున్న ప్రజలకు రామారావు తన 'నూతన పాత్రను' వాస్తవం అని భ్రమింపజేశాడు. 'సంభవామి యుగేయుగే' అన్న గీతా ప్రవచనకారుడైన శ్రీకృష్ణ పరమాత్మగా, దుష్ట శిక్షణకు అవతరించిన వాడిగా ప్రజలను వంచించడానికి పూనుకున్నాడు. సినిమా ప్రేక్షకులకీ, నటులకీ వుండే సంబంధం ప్రేక్షకులలో అలాంటి భ్రమలను కలిగించడంలో అసహజం ఏమీ కాదు. ఎందుకంటే ప్రేక్షకులు సినిమాలో లీనమైపోయి హీరోకి కష్టాలు వస్తే కన్నీరు కారుస్తారు. హీరోకు గాయమైతే విలవిలలాడిపోతారు. కాని, నటుడికి మాత్రం ఇదంతా కేవలం, నటన మాత్రమే. ఈ రాజకీయ నాటకంలో ప్రజా ప్రేక్షకుల్ని వంచించడానికి 'కాంగ్రెస్ వ్యతిరేక' శక్తిని ఆకట్టుకోడానికి రామారావు అనుసరించిన పద్ధతుల్ని పరిశీలించుదాం.

## 2. వికృతరూపధారి ప్రచారగణాలు

ఈ 'నటరత్న'కు ఆంధ్రప్రదేశ్‌లో ఒక వంది మాగధ దళం వుంది. సుమారు 600 అభిమాన సంఘాలలో వారు సంఘటితులై వున్నారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడగానే రామారావు మొట్ట మొదట సమావేశపర్చింది వీళ్ళనే. 1982 ఏప్రిల్ 10వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన సమావేశం రాష్ట్రం నాలుగు మూలల నుంచి నాలుగు వేల మంది 'బ్రదర్స్' వచ్చారు. మీటింగు స్టేజి మీదకు యన్.టి.ఆర్. రాగానే ఉత్సాహంతో ఈలలు వేస్తూ స్టూడియో దద్దరిల్లేటట్లు హర్షధ్వానాలు చేశారు. రాజకీయ రంగంలో ప్రవేశించి అభిమాన సంఘాలన్నింటికీ అన్నగా వుంటానని తాను ఏ కార్యక్రమం చేపట్టినా తన సోదరుల అండ చూసుకొనేనని యన్.టి.ఆర్. అన్నారు. అప్పుడు సోదరులంతా 'ఉంటాం, ఉంటాం' అని అరిచారు. యన్.టి.ఆర్.ను రాష్ట్రానికే అన్నగా, జాతిపితగా, జాతీయ విప్లవ పులిగా ఆ ప్రతినిధులు అభివర్ణించారు. తెలుగుదేశం విజయానికి ఆఖరి రక్తం బొట్టు వున్నంత వరకు కృషి చేస్తాం అని ప్రమాణం చేశారు. అభిమాన సంఘాలన్నీ అన్న అభిమతం మేరకు "యన్.టి.ఆర్. యువసేనగా రూపాంతరం చెందాయి.' (ఈనాడు వార్త)

ఈ 'బ్రదర్స్' గురించి కొంత వివరణ అవసరం. అభిమాన సంఘాలకు చెందిన వీరంతా స్థూలంగా 'హీరో' మనస్తత్వానికి బానిసలు. మానవాతీతమైన మహత్తర ఘనకార్యాలు చెయ్యగల 'సూపర్‌మేన్'లు వున్నారని, తమ అభిమాన హీరో

అలాంటి వాడని విశ్వసిస్తారు. తాము అల్పులమని తమ ఆరాధ్య హీరో కోసం ఏమైనా చెయ్యాలన్న తత్వం గలవాళ్ళు. పైగా అల్ప సంతోషులు. తమ హీరో సంతకం పెట్టిన కాయితం చూసి ఉబ్బితబ్బిబ్బైపోతారు. ఫోటో పంపితే పటం కట్టించి పూజించుకుంటారు. తమ హీరోకి షూటింగ్‌లో చిటికెన వేలుకు చీపురు పుల్ల తగిలితే వీళ్ల హృదయం వెయ్యి ముక్కలైపోతుంది. 'హీరో' చేయలేని పనులకు నగిషీలు చెక్కి, లేనిపోని ప్రతిభా పాటవాలను అంటగట్టి కవితలు, కథలు అల్లి, తమ హీరో పేర వీరకృత్యాలు, దానకార్యాలను ప్రచారంలో పెడతారు. సినిమా కలెక్షన్లు డల్ అయితే వీళ్లు ఘొల్లుమంటారు. అభిమానం వాళ్ళ బుర్రల్ని ఆలోచింపనివ్వదు. తమ హీరో సినిమా పోస్టర్లు వీళ్ళే అంటించి అలంకరిస్తారు. దానిమీద ఈగ వాలకుండా రాత్రింబగళ్ళు కాపలా కాస్తారు. ప్రత్యర్థుల పోస్టర్లు చించిపారేస్తారు. పేడ పూసి పాడు చేస్తారు. ఇదొక ప్రచార సంస్కృతి. దీనికి 'ఈనాడు' లేకి రాతలు తోడైతే, వీళ్ళ ప్రచారం పూనకంగా పాకాన పడుతుంది.

ఇలాంటి వాళ్ల అండతో అన్న ప్రచారరంగం సిద్ధమైంది. ఇక్కడ మరొక అంశాన్ని ప్రస్తావించుకోవాలి. ఆంధ్రదేశంలోని ఆబాలగోపాలానికి రామారావు సుపరిచితుడు. అయితే వారందరికి పరిచయమైన తీరు, వారిని ప్రభావితం చేసిన తీరు మాత్రం ప్రత్యేకమైనది. రాముడుగా, కృష్ణుడుగా రామారావు నటించిన సినిమా బొమ్మలకు పటాలు కట్టించుకొని ఈ 'వేషధారి' బొమ్మను పూజిస్తూ, దేవుణ్ణి పూజిస్తున్నామని భ్రమించేవారున్నారనేది అందరికీ తెలిసిందే.

దాదాపు 40 సంవత్సరాలుగా రామారావు దేవుళ్ళ పాత్రలు, జానపద కథానాయకుల పాత్రలతోపాటు, రైతుగా, నిరుపేద యువకుడిగా, తిరుగుబాటు కథానాయకుడిగా, రిక్షా, టాక్సీ, లారీ డ్రైవర్లుగా, ఖైదీగా, ఖూనీకోర్, కేడీలుగా, స్త్రీల ధన, మాన, ప్రాణ సంరక్షుడిగా, కష్టాలలో ఉన్న వారిని ఆదుకొనేవాడిగా, యువతీ యువకుల మానసచోరుడిగా, ప్రస్తుత సమాజంలో వుండే అన్ని వర్గాల పాత్రలనీ పోషించాడు. అందరి కథానాయకుడిగా చలామణి అయ్యాడు. నిజ జీవితంలో ఈ వర్గాలు, ఒక దానికి ఒకటి పొసగనివి.

సినిమా వేషాల ద్వారా ఈ భిన్నవర్గాల ప్రతినిధిగా ఒక వికృత రూపంలో అందరి కథానాయకుడుగా భ్రమింప చెయ్యగలిగాడు. రామారావు నటజీవితం ఆంధ్ర ప్రజల మనో స్థితి మీద కలగచేసిన విపరీత ప్రభావం ఇదేనని చెప్పుకోవచ్చు. అయితే వాస్తవిక రాజకీయ జీవితంలో మాత్రం ఆయన ఏదో ఒక వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహించగలుగుతాడు. కాని, రామారావు తన నటనా జీవితం

ద్వారా ఆంధ్రప్రజల మనోస్థితి మీద సంపాదించుకొన్న వికృత రూపాన్ని వినియోగించుకోవడానికి వీలుగా 'అన్ని వర్గాల ప్రజల ప్రతినిధిగా' రాజకీయ 'శ్రీకృష్ణ పాత్రను' అభినయించి అన్నివర్గాల రాజకీయ నాయకుడుగా చెలామణి కావడానికి పూనుకొన్నాడు.

## 3.వాగాడంబర ప్రసంగాలు

మనం ఇంతకుముందుగా ఒక అంశాన్ని ప్రస్తావించుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో మితవాద ప్రత్యామ్నాయానికి సాగిన సుదీర్ఘమైన రాజకీయ ఘర్షణలో 'కాంగ్రెస్ వ్యతిరేకత' అనే ఒక స్వతంత్ర శక్తి ఆవిర్భవించిన తీరును పరిశీలించుకున్నాం. ఇది అటు మితవాద వర్గాల నుంచి, వామపక్షాల నుంచి, కాంగ్రెస్ పాలన మీద అసంతృప్తులైన వివిధ వర్గాల ప్రజల నుంచి బలాన్ని పెంపొందించుకొన్నది. ఇది సమాజంలోని వివిధ వర్గాల నుంచి, పొసగని రాజకీయ శక్తుల నుంచి బలాన్ని పెంపొందించుకొన్న వికృత రూపమేనని గమనించాం.

ఈ 'కాంగ్రెస్ వ్యతిరేకత' అనే 'వికృత శక్తిని' అన్ని వర్గాల సినీ కథానాయకుల రూపంలో వున్న రామారావు అనే వికృతరూపం ఆకర్షించడానికి తగినదిగా వున్నది. తన చుట్టూ తన పార్టీ చుట్టూ ఈ 'కాంగ్రెస్ వ్యతిరేక' శక్తిని సమీకరించడానికి 'వాగాడంబర'మనే ఫాసిస్టు కళను బాణంగా సంధించి రాజకీయ జైత్రయాత్రకు బయలుదేరాడు. 'ప్రస్తుతం తెలుగుజాతి దౌర్భాగ్య స్థితికి ఆందోళన చెంది కర్షక, కార్మికలోకంలో కలిగిన అసంతృప్తి.. దీనావస్థలను చూసి తాను వికలమనస్కుడనై స్వార్థచింతన విడనాడి రాజకీయ రంగ ప్రవేశం చేశానని, తాను రాజకీయాలలో ప్రవేశించడం 'దైవప్రేరణ ఫలితమని' రాష్ట్ర ప్రజల మీద ఆదరాభిమానాలు కురిపిస్తూ దైవకార్యం మీద వచ్చిన దేవదూతలాగ వంచనా శిల్పాన్ని ప్రదర్శించాడు. అంతేకాదు 'తెలుగు సినిమా' రంగంలో తాను అత్యధిక డిమాండు గల నటుడినని, నటనకు స్వస్తి చెప్పడం ద్వారా తాను చేసిన త్యాగాన్ని అంకెలలో చెప్పబూనితే అది ఆశ్చర్యం గొలిపేటంత పెద్ద సంఖ్యలో చెప్పవలసి వస్తుందని, తన త్యాగాన్ని తానే అభివర్ణించుకొన్నాడు. 'పదవీ వ్యామోహంతో గాని, ధనదాహంతో గాని తాను రాజకీయ రంగప్రవేశం చెయ్యలేదని, ప్రజలు తమ ఆదరణ, అభిమానం, ప్రేమలతో అతి సామాన్య స్థాయి నుంచి తనను ఈ స్థాయికి తెచ్చారని, ఆ ప్రజల రుణాన్ని ఇంకొక జన్మలో కాకుండా ఈ జన్మలోనే తీర్చుకోవాలని నిర్ణయించుకున్నానని' ప్రకటించాడు. పైగా 'ప్రజలకు సేవ చెయ్యడమే నాకు తెలిసిన

రాజకీయం. స్వార్థం, కుళ్ళు, కుతంత్రాలు, అవినీతి రాజకీయాలు నాకు తెలియవు' అంటూ తనకు లేని గతాన్ని సమర్థించుకున్నాడు.

'దైవ ప్రేరణ'తో, 'స్వార్థ త్యాగం'తో ప్రజల 'రుణాన్ని' తీర్చుకోడానికి 'ప్రాణ త్యాగం' చెయ్యడానికి వచ్చానంటూ ఆషాడభూతిలాగ అత్యంత నేర్పరితనంతో అభినయించి మరీ చెప్పాడు. 'ముందుగా నాయకులు నీతిపరులైతే' మిగతా వారు నిజాయితీగా వుంటారు. 'సో ఫస్ట్ ది మాస్టర్ మష్ట్ బి కరెక్ట్' అని తనకు తానుగా 'కరెక్టు మాస్టర్'గా డిక్లేర్ చేసుకున్నాడు.

ఈ రామారావు 'వాగుడు' మేధావుల్ని కూడా బురిడీ కొట్టింది. 'ఆయన సంపాదన పూర్తి చేసుకుని వచ్చారు. ఇప్పుడు అందరూ సంపాదన కోసమే రాజకీయాలలోకి వస్తున్నార'ని విజయవాడ బార్ కౌన్సిల్ ప్రముఖులు రామారావును ప్రస్తుతించారు. (ఈ ఉటంకింపులన్నీ ఈనాడు పత్రికలోనివే).

ఇలాంటి వ్యక్తిగత స్తోత్ర పాఠాలతోపాటు తన పార్టీలో చేరే వారికి కూడా 'నీతి సూత్రాలను ప్రకటించాడు. ఇతర పార్టీల టిక్కెట్ల మీద ఎన్నికైన వారు ఆ పదవుల్ని వదులుకుని ఈ పార్టీలో చేరాలి. అలా చేరే వాళ్ళు స్వల్పంగానే వుంటారని వీరికి తెలుసు. ఇకపోతే తెలుగుదేశంలో చేరే వారికి పూర్వచరిత్ర గురించి ముందుగా పరిశీలన చెయ్యడం జరగదని, ఎవరినైనా చేర్చుకుంటామని, ఇంతకుపూర్వం ఏ పార్టీలోనైనా వుండి అక్కడి వాతావరణాన్ని బట్టి తప్పులు చేసి వుండవచ్చునని అంత మాత్రాన తెలుగుదేశంలో చేరడానికి అది అనర్హత కాదని రామారావు స్పష్టీకరించారు. అటు 'పవిత్రత' కాపాడబడింది. ఇటు 'అభిమతమూ' తీర్చుకోబడింది. ఎవరైనా చేరడానికి గేట్లు తెరవబడ్డాయి.

విభజనోద్యమం వెనుకకు, జనతా కూటమి వెనుకకు గతంలో సమీకృతమైనట్టుగానే వివిధ శక్తులు తృటికాలంలో సమీకృతం కావడం మొదలైంది. బూర్జువా పార్టీలన్నింటి నుంచి కుప్పతెప్పలుగా వచ్చి చేరుతున్నట్టు సభ్యత్వ ఫారాలు అందివ్వడమే కష్టమైపోతున్నట్టు ప్రచారాన్ని జోరుచేసింది. ఈ వాతావరణంలో రామారావు తన రాజకీయ జైత్రయాత్రను ప్రారంభించాడు. ప్రాంతీయాభిమానాన్ని రెచ్చగొడుతూ, కాంగ్రెస్ వ్యతిరేకతని ఆకట్టుకొనే వాగాడంబర యుద్ధానికి ఉపక్రమించాడు.

భిన్నజాతుల సమ్మేళనంగా వున్న భారతదేశంలో కేంద్రాన్ని ఏ ఒక్క జాతి సొత్తుగానూ పరిగణించలేము. అయితే వివిధ భాషలు మాట్లాడే జాతులను కేంద్రం మీదకు రెచ్చగొట్టడానికి వీలైన సమస్యలు, ప్రాంతీయ అసమానతలు, అన్ని

రాష్ట్రాలలోనూ వున్నాయి. పైగా ప్రాంతీయ తత్వం సహజంగానే వర్గ సమస్యలను కప్పి ఉంచడానికి ఒక మంచి ముసుగుగా వినియోగపడుతుంది. ప్రాంతీయ ఉద్రేకాలను రెచ్చగొట్టి వారిని తప్పుదారి పట్టించడానికి తోడ్పడుతుంది. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన నిర్దుష్టమైన సమస్యల జోలికి పోకుండా తెలుగుజాతి 'ఆత్మగౌరవాన్ని' ప్రజా సమస్యలను ముడి వేసి ఊకదంపుడుగా ఉద్రేకపూరిత ప్రసంగాలకు రామారావు పూనుకొన్నాడు. ఈనాడు పత్రిక ప్రచురించిన రామారావు ప్రసంగాలు ఇలా వున్నాయి.

'తెలుగుజాతి శ్రేయస్సు, ప్రాంతీయాభివృద్ధిని కోరే నాయకులు కరువయ్యారని, పొట్టనింపుకొనే వినాయకులు మాత్రమే వున్నారని ఆయన గర్జించారు'.

'మన రాష్ట్రంలో పరిపాలనా వ్యవహారాలు, విద్యా బోధన, ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు, తెలుగులోనే వుండాలని, తాను అధికారంలోకి వస్తే తెలుగునాడుగా రాష్ట్రానికి పేరు మారుస్తానని ప్రకటించారు'.

'తెలుగుజాతి త్యాగాల ఫలితమైన ఉక్కు ఫ్యాక్టరీ 'ఇస్పాత్ నిగమ్'గా మారడమేమిటి ? తెలుగు వారి ఫ్యాక్టరీలో తెలుగు వారికే చోటు లేనప్పుడు ఇక ఉక్కు కర్మాగారం ఎవరి కోసం ? డిగ్రీలు చేతపట్టుకొని ఉద్యోగాలు కావాలి మహాప్రభో అంటూ యువతరం వీధులపై పడుతుంటే ఇతర రాష్ట్రాల నుంచి విద్యావేత్తలను దిగుమతి చేసుకుంటున్నారు ఎందుకు ? ఇది తెలుగువారిని కించపరచడం కాదా? ఈ జాతి ఆత్మ గౌరవాన్ని అవమానపర్చడం కాదా?' అని రామారావు ప్రశ్నించాడు. అలాగే వివిధ వర్గాల ప్రజల సమస్యల మీద రామారావు ప్రదర్శించిన వాగాడంబరాన్ని చూడండి.

'దేశానికి రైతు వెన్నెముక అని చెబుతూ ఆ ప్రభుత్వం ఆ రైతు వెన్నెముక విరగగొట్టింది. జోడెడ్ల బండిని అమ్ముకొని పాలేరుకు కడుపు నిండా భోజనం పెట్ట లేక, పిల్లలను చదివించుకోలేక, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక, రైతన్న దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. ఎటువంటి మచ్చ లేకుండా స్వచ్ఛమైన జీవితాన్ని గడుపుతున్న రైతుల ఆస్తులపై ఆంక్షలు విధిస్తూ పెద్ద పెద్ద పట్టణాలలో భవనాలపైనా, ఆస్తులపైనా ఎందుకు ఆంక్షలు విధించడం లేదు. నేను ఈ మాట అంటే, నేను భూసంస్కరణల వ్యతిరేకినని ప్రచారం చేస్తారు. అన్నదాత అగ్గిపిడుగు కావాలి. దేశానికి కూడు పెడుతున్న రైతు బాధ్యతల్ని విస్మరించిన ప్రభుత్వానికి షాక్ ట్రీట్‌మెంటు యిస్తే గాని ఈ దోపిడీ నాయకులకు బుద్ధి రాదు' అని ఆక్రోశించారు.

మహిళలకు వాగ్దానాల వర్షం కురిపించాడు. 'స్త్రీల ధన, మాన, ప్రాణాలకు రక్షణ ఇవ్వలేని ప్రభుత్వం కూడా ఒక ప్రభుత్వమేనా' అని ప్రశ్నించాడు. 'ఆడవారు చెయ్యదగిన పనులన్నింటినీ తెలుగుదేశం పార్టీ ఆడవారికే ప్రత్యేకంగా కేటాయిస్తుంది. స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించి వరకట్న పిశాచాల్ని రూపుమాపుతానని, మహిళా విశ్వ విద్యాలయాన్ని నెలకొల్పుతాన'ని ప్రకటించాడు. 'మండుటెండలో మంచినీళ్ళ కోసం తెలుగు ఆడపడుచులు వెళ్లడం తనకు కన్నీళ్ళు తెప్పిస్తున్నద'ని వాపోయాడు. కిలో బియ్యం రెండు రూపాయలకు అందరికీ సరఫరా చేస్తానని, బడి పిల్లలకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తానని ప్రకటించాడు.

'తెలుగుజాతి సంస్కృతిని కాపాడుకొనే బాధ్యత యువకులపై వుందని యువశక్తికి ద్రోహం జరుగుతోందని, విద్య, ఆరోగ్యం, అందరికీ కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యం అని అటువంటి వాటిని ప్రభుత్వం అమ్ముకుంటుందంటే సిగ్గుపడాల'ని అన్నారు. ఇలా తెలుగు జాతి, ఆత్మ గౌరవం, రైతులు, స్త్రీలు, యువకులు, బలహీన వర్గాలను ఆకట్టుకొనే వాగాడంబర వాగ్దానాలను జోడించి తన దాడినంతా కాంగ్రెస్ నాయకుల మీద ఎక్కు పెట్టారు.

'అల్లూరి సీతారామరాజు, తెన్నేటి విశ్వనాథం వంటి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు సాధించిన స్వరాజ్యాన్ని దగా కోరులైన కాంగ్రెస్ నాయకులు పాలిస్తున్నారు. ఆటో రిక్షా తోలుకునే సోదరునిపైన పన్ను వేయకుండా పాలించలేరా?' అని ప్రశ్నించారు.

'మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్డు రవాణా సంస్థకు బదులుగా రాష్ట్ర ప్రయాణ సౌకర్య సంస్థగా దానిపేరు మారుస్తానని, బస్సు ఛార్జీలు పెంచకుండానే మరిన్ని సౌకర్యాలు కల్పిస్తానని' అన్నారు. 'మంత్రులు జేబులు నింపుకుంటున్నారు. ఈ దుర్మార్గులను చూస్తూ ఇంకెంత కాలం ఉపేక్షించాలి?' అని ప్రశ్నించారు.

'అమ్మను నమ్ముకుని అదేపనిగా ఓట్లు వెయ్యడం వల్లనే ఆంధ్రదేశం అధోగతి పాలైంది. ఆమె తెలుగు ప్రజలపై అమృతం వర్షించే తల్లి కాదు. వీరిని వేధించి, సాధించే సవతి తల్లి మాత్రమే. ఈమె ఆశీర్వాదంతోనే అసమర్థులు అందలాలెక్కి తెలుగు వాళ్లను దోచేస్తున్నారు' అని అన్నారు.

'మన తెలుగు నేలలో బాలచంద్రుడు, బొబ్బిలి పులి పాపారాయుడు వంటి వీరులు, నాయకురాలు మాంచాలి వంటి వీర నారీమణులు పుట్టారు. అటువంటి నేలలో ప్రస్తుతం మన సోదరీమణుల పరిస్థితి ఏమిటి ? ఏమైంది మన వీరత్వం ?

ఏమైంది మన పౌరుషం ? ఏమైంది మన జాతి ప్రతిష్ట ? పూర్వుల పేర్లు చెప్పుకునే భోగలాలసులైన వీరా మన నాయకులు ? కుక్క మూతి పిందెలవలె పుట్టుకొస్తున్న వీరు మన నాయకులని చెప్పుకోడానికి సిగ్గు పడాలి' అని ఆయన తన సహజ వాక్చాతుర్యాన్ని ప్రదర్శించి అశేష ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.

'ఇకనైనా జాతి మేల్కొనాలి, సింహగర్జన చెయ్యాలి. తాము ఆదరించిన అమ్మ సవతి అమ్మగా మారినందుకు తెలుగు ప్రజలు బుద్ధి చెప్పాలి.'

'పందికొక్కుల పాలన ఇక చాలు'. 'నేటి నాయకులు తెలుగుజాతిని అవమానపరుస్తున్న తీరును ఏ మీసమున్న ఆంధ్రుడూ సహించడు. అందుకే తెలుగు తల్లిని నడిబజారుకు ఈడ్చిన ఇందిరా కాంగ్రెస్ నాయకులను ఈసారి ఎన్నికల్లో తరిమి కొట్టాలి' అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

'ఆంధ్రులు అవమానాన్ని భరించరు. పౌరుషవంతులు తెలుగు వారు తిరుగుబాటు చేస్తారు. ఇందిరా కాంగ్రెస్‌కు సమాధి కడతారు' అని హెచ్చరించారు. 'ఇందిరా కాంగ్రెస్ చేసిన మోసానికి తగిన బుద్ధి చెప్పాలి' అని కోరారు. 'వ్యక్తి ఆరాధనలో జాతి గౌరవాన్ని ఇందిరకు తాకట్టు పెట్టిన మంత్రులు, కాంగ్రెస్ నాయకులకు ఈ రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదు. ఆరు కోట్ల ఆంధ్రులు ఒక్కసారి ఉమ్మివేస్తే ఈ ప్రభుత్వం కొట్టుకుపోతుంద'ని అన్నారు. 'ఆరు కోట్ల తెలుగు ప్రజల పూర్వవైభవాన్ని మరింత ప్రజ్వలింపజెయ్యడమే మన పార్టీ ధ్యేయమని,' 'తెలుగుదేశం ఒక పార్టీ కాదని, యావత్ తెలుగు జాతికి అంకితమైన మహోద్యమమని" ఆయన అన్నారు.

దీనికితోడు ప్రచారానికి అనేక వెకిలి చేష్టలకు పూనుకొన్నారు. పతాక శీర్షికల కోసం చౌకబారు ఎత్తుగడలు వేశారు. కార్మిక కేంద్రాలలో ఖాకీ దుస్తులతో, రైతులకు పంచె లాల్చీల మేకప్పుతో దర్శనం ఇచ్చారు. రోడ్డు పక్క స్నానాలు, గెడ్డం గీసుకోడాలు.. వాటిని ఫొటోలు తీయించుకొని ఈనాడులో ప్రకటించుకుని రాజకీయ కష్టజీవి పాత్రను రక్తికట్టించారు.

హరిజన వాడలలో సహపంక్తి భోజనం అనే ప్రహసనాలను పెద్దక్షరాలతో పేపర్లలో వేయించుకున్నాడు. 'బ్రదర్స్'తో నిత్య రక్త తిలకాలు, ఆడపడుచులతో హారతులు, పూలవర్షాలు 'స్వాగతం దొరా' అనే సినీ సెట్టింగు ఆహ్వానాలు జరిపించాడు. ఎన్నికలను కురుక్షేత్ర యుద్ధంగా పోలుస్తూ అవతార పురుషుని పోజులో పోస్టర్లు, కటౌట్లు, కేసెట్లతో విశ్వ రూపం ధరించి ప్రచారాన్ని సాగించాడు.

## 4. ఫాసిజం వినియోగించే క్షుద్రకళ

ఈ మొత్తం ప్రచారంలో కంచు కాగడా పెట్టి వెతికినా కనిపించని అంశాలు కొన్ని వున్నాయి. ఆయన గుత్త పెట్టుబడిదారుల దోపిడీ గురించి, భూస్వాముల దోపిడీ గురించి పల్లెత్తు మాట పలకలేదు. ఈ దోపిడీ వ్యవస్థ గురించి మాటమాత్రంగానైనా విమర్శించలేదు. వాగాడంబర కళకు వున్న ప్రత్యేకతే అది. అది అసలు సమస్యను దాచిపెట్టడానికి అమాయకులను రెచ్చగొట్టడానికి స్వార్థపరుల ప్రయోజనాల పరిరక్షణకు ఉద్దేశించబడిన కళ.

ప్రఖ్యాత మార్క్సిస్టు మేధావి శ్రీ రజనీ పామిదత్తు వాగాడంబర కళ గురించి ఇలా చెప్పారు. 'వాగాడంబరం అనే కళ ధనికుల యొక్క బలవంతుల యొక్క ప్రయోజనాల కోసం వినియోగించబడుతుంది. ఈ వర్గాల ప్రయోజనాల కోసం పేదల యొక్క, దీనుల యొక్క ఆశలతోనూ, ఆందోళనలతోను వారియొక్క అజ్ఞానంతోనూ క్షణికమైన ఉద్రేకాలతోనూ జూదమాడే కళ ఇది. ఈ వాగాడంబరం అనేది కళలన్నింటిలోనూ నీచాతినీచమైనది. ఫాసిజం వినియోగించే క్షుద్రమైన కళే వాగాడంబరం'. ఆంధ్రదేశంలో అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ఈ క్షుద్రమైన వాగాడంబర కళనే రామారావు వినియోగించాడు. సామాన్య ప్రజల ఆశల్ని, అమాయకత్వాలను ఉపయోగించుకుని క్షణికోద్రేకాలను రెచ్చగొట్టి దానికి తెలుగుజాతి ఆత్మ గౌరవం అన్న మేలి ముసుగు కప్పి ప్రజల్ని పంచనా శిల్పంతో వశీభూతం చేసుకున్నాడు. రాష్ట్ర ప్రజల చేత పచ్చి మితవాద ప్రత్యామ్నాయపు విష గుళికను ఈ వాగాడంబరమనే పంచదార పూతతో మింగించాడు.

## నాలుగవ అధ్యాయం

# రాజకీయరంగలో సమ్మోహనాశక్తులు

1. చరిత్రలో అవతార పురుషులు
2. సన్నకారు రైతుల విపరీత ధోరణులు
3. సంక్షోభ కాలంలో సమ్మోహనాశక్తులు

### 1. చరిత్రలో అవతార పురుషులు

మన పురాణాలు, ఇతిహాసాలలో కొల్లలుగా కనిపించే ఇలాంటి అవతార పురుషులు మనకు కొత్తకాదు. ధర్మసంస్థాపన కోసం 'సంభవామి యుగేయుగే' అన్న గీతా ప్రవచనం తెలియని వారుండరు. అలాగే సాధు రక్షణకూ, దుష్టశిక్షణకూ అవతరించానంటూ పర్జన్య శంఖం పూరిస్తున్న సినీ వాల్ పోస్టర్లతో ఆంధ్రప్రదేశ్ రాజకీయరంగం మీదకు యన్.టి.రామారావు పుట్టుకొచ్చాడు. ఇలాంటి అవతార పురుషులు కొత్త కావచ్చును. కాని రాజకీయాలలో ఇలాంటి వేషధారణ చెయ్యడం మాత్రం చరిత్రలో కొత్తదేమీ కాదు. కార్ల్ మార్క్స్ తన 'లూయీ బోనపార్ట్' గ్రంథాన్ని ఈ వివరణతోనే ప్రారంభించాడు. 'ప్రపంచ చరిత్రలో అధిక ప్రాముఖ్యం కలిగిన అన్ని ఘటనలూ తిరిగి సంభవిస్తూ వుంటాయని, వ్యక్తులు తిరిగి ఆవిర్భవిస్తూ వుంటారని అనిపిస్తుందని హెగెల్ ఒకమారు ఎక్కడో గాని అన్నాడు. అయితే మొదటిసారి విషాదాంతంగానూ, రెండవసారి ప్రహసనంగానూ అని చేర్చడం ఆయన మరిచిపోయాడు' అని మార్క్స్ తిరిగి తిరిగి పుట్టుకు వచ్చే అవతార పురుషుల వ్యంగ్యావతారాలు చరిత్రలో విషాదాంతంగానూ ప్రహసనంగానూ ఎలా మారేది స్పష్టం చేశాడు.

అయితే చరిత్రలో గతించిపోయిన సంప్రదాయాల కోసం ప్రజలు అర్రులు చాచే స్థితి ఎప్పుడు కలిగేది దాని పర్యవసానాలు ఎలా వుండేది కూడా ఆ గ్రంథంలోనే మార్క్స్ వివరించాడు. 'గతించిపోయిన తరాలన్నింటి సంప్రదాయమూ ప్రస్తుతం జీవించి యున్న తరం యొక్క బుర్రలలో భూతంలా సవారి చేస్తుంది. సరిగ్గా మనుషులు ఎప్పుడైతే తమనూ, పరిస్థితులను మార్చుకొనడానికి నిమగ్నులై వున్నట్లు కనిపిస్తారో అలాంటి సంక్షోభ సమయాలలో గతానికి సంబంధించిన ఈ

భూతాలను తమకు ఊడిగం చేసేందుకు ఆతృతగా ఆవాహన చేస్తారు. చిరకాలంగా గౌరవాన్ని కలిగివున్న ఆ అవతారాలను ఆనాటి పరిభాషతో ప్రదర్శించడానికి వీలుగా గత కాలపు పేర్లనూ, యుద్ధ నినాదాలనూ, వేషాలను అరువు తెచ్చుకుంటారు' అని మార్క్స్ స్పష్టం చేస్తాడు. ఇలా గతించిపోయిన కాలానికి సంబంధించిన వాటిని ఆవాహన చేసుకోవడాన్ని పరిశీలిస్తే అవి కొన్ని సందర్భాలలో చారిత్రక అభివృద్ధి క్రమాన్ని ముందుకు తీసుకుపోవడానికి వినియోగించబడ్డాయి. మరికొన్ని సందర్భాలలో వెనక్కు నడిపించడానికి వినియోగించబడ్డాయి అని మార్క్స్ సోదాహరణలు చూపిస్తారు.

'ఒక దశలో క్రాంవెల్, ఇంగ్లాండ్ ప్రజలు తమ బూర్జువా విప్లవానికి అవసరమైన మాటలనూ, ఆవేశాలనూ, భ్రమలనూ, బైబిలు పాత నిబంధన నుంచి అరువు తెచ్చుకున్నారు. సమాజాన్ని ముందుకు నెట్టడానికి వీలుగా 'ఆ విప్లవాలలో మృతాత్మల జాగృతిని పాత భూతాన్ని తిరిగి నడయాడేలా చెయ్యడానికి బదులు నూతన పోరాటాల ప్రస్తుతి కోసం వినియోగించబడింది' అని అంటాడు. దీనికి విరుద్ధంగా 1848-51 సంవత్సరాలలో ఫ్రాన్సులో జరిగిన ఘటనలను మార్క్స్ ఇలా ప్రస్తావించాడు. 'విప్లవం ద్వారా తమ గమనం త్వరపడుతుందని భావిస్తున్న ఒక జాతి యావత్తూ ఆకస్మికంగా కాలం చెల్లిపోయిన యుగంలోకి నెట్టబడింది. పురాతన చరిత్రకు సంబంధించిన పాండిత్య విషయాలుగా ఉంటూ వచ్చిన పాత పేర్లూ, పాతశాసనాలూ తిరిగి తలెత్తాయి. ఫ్రెంచి ప్రజలకు కొత్త నెపోలియన్ ప్రత్యక్షమయ్యాడు. వారికి పాత నెపోలియన్ యొక్క వ్యంగ్యావతారం 19వ శతాబ్ది మధ్యలో అతను ఏ విధంగా కనిపించాలో ఆ రూపంలో సాక్షాత్తూ పాత నెపోలియన్ వారికి దఖలుపడ్డాడు. సమాజం తనకు కొత్త సామర్థ్యాన్ని సమకూర్చుకోవడానికి బదులు రాజ్యం(State) అతి పురాతన రూపానికి తిరిగి వెళ్లినట్టు కనిపిస్తుంది' అని మార్క్స్ విశ్లేషణ చేశాడు.

మార్క్స్ చేసిన ఈ విశ్లేషణ సారాన్ని మన రాష్ట్ర పరిస్థితులకు అన్వయించుకుందాం. సంక్షోభ సమయాలలో ప్రజలు గతానికి సంబంధించిన భూతాలను తమకు ఊడిగం చేసేందుకు ఆతృతగా ఆవాహన చేసే మనోస్థితిని మనం అర్థం చేసుకోవాలి. ఇలాంటి పరిస్థితులు వున్నప్పుడు గత కాలపు వేషభాషల లో తమకు తారసపడే వారిని ప్రజలు రాజకీయ హీరోలను చేస్తారు. అతనిలో అతీతశక్తుల్ని చూస్తారు. అవతార పురుషుణ్ణి చేస్తారు. అలాంటి సంక్షోభ స్థితి గాని, అలాంటి మనోస్థితి గాని లేని సాధారణ పరిస్థితులలో ఇలాంటి వేషభాషలలో వచ్చే

వారిని పగటి వేషగాళ్లుగా పరిగణిస్తారు. పరిహాసం చేస్తారు. రాష్ట్రంలో ఏర్పడిన సంక్షోభ పరిస్థితిని మనం పరిశీలన చేశాం. ఈ పరిస్థితులలో ప్రజల బుర్రల మీద సవారీ చేసే గత కాలపు భూతాన్ని ప్రజ్వలింపజేయడానికి రామారావు పూనుకున్నాడు.

తెలుగు జాతి గత కీర్తిని, అలనాటి వీరుల పేర్లను, గాధలను తవ్వి తీసి అవతార పురుషుల వేషాలను అరువు తెచ్చుకున్నాడు. ఫ్రెంచి ప్రజలకు పాత నెపోలియన్ యొక్క వ్యంగ్యావతారంగా కొత్త నెపోలియన్ తారసపడినట్లు ఆంధ్ర ప్రజలకు ఈ అభినవరాముడు దర్శనమిచ్చాడు. అవతార పురుషుడిగా ఆంధ్రప్రదేశ్ సింహాసనాన్ని చేజిక్కించుకున్నాడు. ఈ పరిణామం మన రాష్ట్రంలో మితవాద ప్రత్యామ్నాయాన్ని కొత్త వేషంలో, కొత్త భాషలో అధికారానికి తెచ్చింది. ఇక్కడ అవతార పురుషుని పాత్ర రాష్ట్రాన్ని తిరోగమనానికి నెట్టింది. అయితే మార్క్స్ చెప్పినట్టుగా రాజకీయ అవతారాలు 'మొదటిసారి విషాదాంతమూ, రెండవసారి ప్రహసనమూ' అవుతాయన్న దానిని తలదన్నేట్టుగా 'ఆంధ్రదేశాన్ని గత కీర్తి వైభవాలకు' నడిపించడానికి పుట్టుకు వచ్చిన ఈ కపట వేషధారి రాష్ట్ర ప్రజలకు ఒకేసారి 'విషాదాన్ని, ప్రహసనాన్ని' కలగలిపి ఇచ్చిన తీరును తర్వాత పరిశీలించుకుందాం.

## 2.సన్నకారు రైతుల విపరీత ధోరణులు

సమ్మోహనా శక్తులకు రాజకీయ రంగాన్ని సంసిద్ధం చెయ్యడంలో సన్న కారు రైతులు విపరీత ధోరణి ఒక ప్రముఖమైన పాత్రను నిర్వహిస్తుంది. ఈ రైతాంగ భావజాలానికి సంబంధించి మార్క్స్ చేసిన కొన్ని నిర్ధారణలను, మన రైతాంగంలో వచ్చిన పరిణామాలను ఇప్పుడు పరిశీలించుకుందాం.

1702లో ఫ్రాన్సులోని లంగెడోర్ జిల్లాలో ప్రొటెస్టెంట్ మతానుయాయుల పీడనకు వ్యతిరేకంగా రైతులు పోరాటం సాగించారు. కార్ల్ మార్క్స్ ఈ పోరాటాన్ని 'బాహాటంగా ఫ్యూడల్ వ్యతిరేక స్వభావం' కలదిగా పేర్కొంటాడు. ఇది చరిత్రలో 'సెవెన్స్' పోరాటంగా ప్రసిద్ధికెక్కింది. అలాగే 1703లో ఫ్రాన్సు పశ్చిమ భాగంలోని 'వెండే' జిల్లాలో జరిగిన విప్లవ ప్రతీఘాతుక తిరుగుబాటును మార్క్స్ ప్రస్తావించాడు. ఫ్రెంచి విప్లవానికి వ్యతిరేకంగా రాజరికవాదులు తమ పోరాటంలోకి వెనుకబడిన రైతులను రెచ్చగొట్టి వారిని తమకు సాధనంగా వినియోగించుకున్నారని తెలియజేస్తాడు. ఇలా సామాన్య రైతాంగం నిర్వహించే పరస్పర విరుద్ధమైన పాత్రలను మార్క్స్ వివరిస్తూ సన్నకారు రైతులు విపరీత

ధోరణలపై లోతైన విశ్లేషణ చేశాడు. ఆ వివరాలలోకి వెళ్లే ముందు ఆంధ్ర రాష్ట్రంలో రైతాంగ భావజాలంలో వచ్చిన మార్పులను స్థూలంగా పరిశీలిద్దాం.

మన రాష్ట్రంలో కూడా తొలి దశలో జమిందారీ వ్యతిరేక పోరాటాలలో నైజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో మన రైతాంగం 'బాహాటమైన ఫ్యూడల్ వ్యతిరేకత' ను ప్రదర్శించింది. ఆ తర్వాత వామపక్ష ఉద్యమం క్రమానుగతంగా బలహీనపడడం, స్వతంత్ర పార్టీ ఆవిర్భవించడం, దేశ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన పరిణామాలు వగైరాలు మన రైతాంగ భావజాలంలో మార్పులకు దారితీశాయి. భూసంస్కరణల సమస్యని, రైతాంగ ఆర్థిక వ్యవస్థలోని సంక్షోభాన్ని కుల వ్యవస్థను ఆధారం చేసుకుని రైతులందరికీ చెందిన జనరల్ సమస్యల ముసుగులో రాష్ట్రంలోని భూస్వామ్యవర్గాలు ఈ సామాన్య రైతాంగాన్ని ఆకట్టుకునే ప్రయత్నాలు సాగించారు.

రైతుల ప్రతినిధిగా చరణ్‌సింగ్ సామాన్య రైతులలో తప్పుడు భావజాలాన్ని చొప్పించడానికి ప్రయత్నించాడు. పట్టణాలకు వ్యతిరేకంగా పల్లెసీమలను, భారీ పరిశ్రమలకు వ్యతిరేకంగా వ్యవసాయ రంగాన్ని, కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా రైతు రాజ్యం అనే నినాదాలను వారి బుర్రలలోకి వ్యాపింపజేశాడు. ఈ భావజాలం మన రైతాంగంలోని చాలా విభాగాలను ఆకట్టుకున్నది. ఆంధ్రప్రదేశ్‌లో మితవాద ప్రత్యామ్నాయానికి జరిగిన సుదీర్ఘ పోరాటంలో గ్రామీణ భూస్వామ్యవర్గాలు, సంపన్న వర్గాలు ప్రముఖపాత్ర వహించాయి. సామాన్య రైతాంగంలో ప్రవేశ పెట్టబడిన ఈ వెనుకబాటు భావజాలం, దాని నుంచి ఉత్పన్నమయ్యే మనోస్థితి వల్ల ఈ సామాన్య రైతాంగం కూడా పైవర్గాల ప్రయత్నాలకు తోడ్పాటునిచ్చే స్థితి ఏర్పడింది. విభజన ఉద్యమంలోనూ, ఆ తర్వాత ఏర్పడిన జనతా కూటమికి బలాన్ని సమకూర్చి పెట్టడంలోను ఈ రైతాంగం పాత్ర గమనించదగినది. ఇలా సామాన్య రైతాంగం భిన్న పరిస్థితులలో నిర్వహించే విరుద్ధ పాత్రలు మనకు కొత్త కాదని స్పష్టం అవుతున్నది. ఈ సన్నకారు రైతులపై కార్ల్ మార్క్స్ లోతైన విశ్లేషణ చేశారు. లూయీ బోనపార్ట్ గ్రంథంలో బోనపార్ట్‌ను సన్నకారు రైతాంగం ప్రతినిధిగా పేర్కొంటూ ఇది కూడా ఒక ప్రభు వంశమేనని స్పష్టం చేశారు.

'ఏ విధంగానైతే బూర్బన్ రాజవంశం బడా భూస్వాముల రాజవంశమో, ఆర్లియన్ల రాజవంశం ధనికుల రాజ వంశమో, అదేవిధంగా బోనపార్ట్ రైతులయొక్క అంటే ఫ్రెంచి జనసముదాయం యొక్క ప్రభువంశం అని మార్క్స్ అన్నారు. ఈ సన్నకారు రైతాంగం ఒక ప్రభువంశంగా వ్యవహరించడానికి గల

కారణాలను, వారు బోన పార్ట్ ను అధికారంలోకి తేవడంలో వహించిన పాత్రను మార్క్స్ ఇలా వివరించారు.

'సన్నకారు రైతాంగం బహుళ సంఖ్యాకమైంది. వారు ఒకే రకమైన పరిస్థితులలో జీవిస్తున్నప్పటికీ ఒకరితో మరొకరు పలు రకాలైన సంబంధాలను కలిగివుండరు. ఈ సన్న కారు రైతుల ఉత్పత్తి విధానంలోని ప్రత్యేకత ఏమిటంటే అది వారిని పరస్పర సంపర్కంలోకి తేవడానికి బదులుగా ఒకరి నుంచి మరొకరిని వేరుచేసి వుంచుతుంది. చిన్న చిన్న కమతాల సాగులో శ్రమ విభజనకు తావుండదు. శాస్త్ర విజ్ఞానాన్ని ఉపయోగించుకునే అవకాశం వుండదు. పర్యవసానంగా దాని అభివృద్ధిలో గాని, బుద్ధి కౌశల్యంలో గాని వైవిధ్యం వుండదు'.

ఒక చిన్న కమతం, ఒక రైతు, అతని కుటుంబం, పక్కనే మరొక కమతం, మరొక రైతు కుటుంబం. ఇటువంటివి కొన్ని కలిస్తే ఒక గ్రామం అవుతుంది. కొన్ని గ్రామాలు కలిస్తే ఒక జిల్లా అవుతుంది. అందుచేత ఈ సన్నకారు రైతుల మధ్య కేవలం స్థానిక స్థాయిలో మాత్రమే అంతః సంబంధాలుంటాయి. తమ ప్రయోజనాల యొక్క ఏకరూపతను ఆధారం చేసుకుని వారు ఒక సముదాయంగా సంఘటితం కానంత వరకూ, అలాగే వారి మధ్య జాతీయ ఐక్యతాబంధమూ, రాజకీయ సంఘటనా ఉత్పన్నం కానంత వరకూ ఈ సన్నకారు రైతులు ఒకవర్గంగా చలామణీ కాలేరు. దీని పర్యవసానంగా ఈ సన్నకారు రైతులకు తమ స్వంత పేరు మీదుగా పార్లమెంటు ద్వారా గాని, ఇతర సంస్థల ద్వారా గాని తమ వర్గప్రయోజనాలను సమర్థించుకోలేరు. అంటే ఈ సన్నకారు రైతులు ఒక వర్గంగా రూపొం దనంత వరకూ తమకు తాముగా ప్రాతినిధ్యం వహించుకోలేరు. అందుచేత ఇతరులే వారికి ప్రాతినిధ్యం వహించాలి. అయితే ఈ సన్నకారు రైతులకు ప్రాతినిధ్యం వహించే వాడు ఒక వైపున తమకు యజమానిగా తమపై పెత్తనం నేరపే వాడుగా వుండాలి. మరొకవైపున ఇతర వర్గాలకు వ్యతిరేకంగా తమను కాపాడగలిగే అపరిమితమైన ప్రభుత్వాధికారానికి సాకార రూపముగా వుండేవాడు కావాలి. అలాగే తమకు ఆకాశం నుండి ఎండనీ, వాననీ పంపించగలిగేవాడు అయి వుండాలి. అందుచేతనే సన్న కారు రైతుల రాజకీయ ప్రభావం అంతిమంగా మొత్తం సమాజాన్ని కార్యనిర్వాహక అధికారం లొంగ తీసుకోవడంలో వ్యక్తం అవుతుంది.

'చారిత్రక సంప్రదాయం ఫ్రెంచి రైతులలో నెపోలియన్ అనే పేరు గల ఒక వ్యక్తి తనకు సమస్త పురాతన ఘనతను తిరిగి సాధించి పెడతాడన్న అద్భుతంలో

విశ్వాసాన్ని ఉత్పన్నం చేసింది. ఆ మనిషిని నేనే అంటూ బోనపార్ట్ ముందుకు వచ్చారు. ఇతగాని ఇరువదేళ్ల దేశ దిమ్మరితనం, అనేక విచిత్ర దుస్సాహసాల తదుపరి తన జోస్యం ఫలించింది. ఆ నాటి ఫ్రెంచి సమాజంలోని అత్యధిక సంఖ్యాక వర్గం యొక్క మనోకాంక్ష సైతం అదే కావడంతో ఈ భ్రాత్రీయుని స్థిర మనోకాంక్ష ఆచరణరూపం దాల్చింది'.

'ఈ బోనపార్ట్ విప్లవకారుడైన రైతు గాక ఛాందసపు రైతుకు ప్రతినిధి. పట్టణాలలో సంబంధాలు పెట్టుకుని పాత వ్యవస్థను తమ స్వంతశక్తితో కూలదొయ్యాలనుకునే గ్రామీణ జనానికి గాక దానికి విరుద్ధంగా ఈ పాత వ్యవస్థ అనే నూతికి పరిమితమైన కప్పల మాదిరిగా వుంటూ తమ కోసం సామ్రాజ్యాన్ని తెచ్చి పెట్టగల ప్రేతం యొక్క సంరక్షణను, అభయహస్తాన్ని కోరే గ్రామీణ జనానికి ప్రతినిధి. ఇతను రైతు యొక్క వివేకానికి గాక అతని అంధ విశ్వాసానికి ప్రతినిధి. రైతు యొక్క భవిష్యత్తుకు గాక వారి గతానికి ప్రతినిధి'.

కార్ల్ మార్క్స్ చేసిన ఈ విశ్లేషణ ఆధారంగా మన రాష్ట్రంలోని పరిస్థితులను వివరించుకుందాం. మన రాష్ట్రంలోని సన్నకారు రైతులు 'ఒక వర్గంగా, ఒక సముదాయంగా' సంఘటితం కాలేదు. వీరి ప్రయోజనాలను ఇప్పటికీ 'ఇతరులే ప్రాతినిధ్యం వహించి పెట్టాల్సిన స్థితి' వున్నది. ఈ పరిస్థితులలో మార్క్స్ చెప్పినట్టుగా ఈ నెరపే వాడిని', 'ఆకాశం నుండి తమపై ఎండనూ, వాననూ పంపించగలిగేవాడిని' నాయకునిగా కోరుకుంటుంది. ఈ పరిస్థితులు సహజంగా రాజకీయ రంగంలో సమ్మోహనా శక్తులకు ద్వారాలను తెరుస్తాయి.

ఫ్రాన్సులో లాగే మనకు కూడ మన చారిత్రక సంప్రదాయం, దుష్టశిక్షణకు, శిష్ట రక్షణకు అవతరించే మహాపురుషుల మీద, వారు తమ పురాతన ఘనతను తిరిగి సాధించి పెడతారన్న అద్భుతాల మీద విశ్వాసాన్ని మిగిల్చింది. ఫ్రెంచి రైతులకు ఇరవై ఏళ్ల దేశ దిమ్మరితనం, అందులో 'చిత్ర విచిత్ర దుస్సాహసాల' చరిత్రగల బోనపార్ట్ వారికి పాత నెపోలియన్ రూపంతో తారసపడ్డాడు. ఇక్కడ కూడా 'చిత్ర విచిత్ర సినీ కథానాయకుడు' సంభవామి యుగే యుగే అన్నట్టు 'రామరాజ్య స్థాపన'కు కంకణం కట్టుకుని సినీ జగత్తు నుంచి దిగి వచ్చిన అవతార పురుషుడిగా వీరికి రామారావు సాక్షాత్కరించాడు. బోనపార్ట్ లాగే మన 'భ్రాత్రేయుని' కూడా పట్టాభిషిక్తుణ్ణి చేశారు. సరిగ్గా లూయీ బోనపార్ట్ లాగే మన 'భ్రాత్రియుడు' కూడా రైతు యొక్క వివేకానికి గాక అతని అంధ విశ్వాసానికి ప్రతినిధి. రైతుల భవిష్యత్తుకు గాక అతని గతానికి ప్రతినిధి మాత్రమే.

## 3.సంక్షోభ కాలంలో సమ్మోహనా శక్తులు

రాజకీయ సంక్షోభాల కాలం బహు సున్నితమైంది. సంక్షోభం తన పరిష్కారానికి రకరకాల దారులను వెదుకుతుంది. పలు మార్గాలకు ద్వారాలను తెరుస్తుంది. రాజకీయ పార్టీలు, సామాజిక వర్గాలు తీవ్రమైన ఒత్తిడికి, మార్పులకు గురవుతాయి. రాజకీయ సంక్షోభ కాలాన్ని గుర్తించడం, కారణాన్ని విశ్లేషించడం, పరిష్కారానికి గల మార్గాలను నిర్దిష్టంగా అధ్యయనం చెయ్యడం అన్నది గొప్ప కళ. సంప్రదాయక పార్టీలు ఈ కళను ప్రదర్శించలేనప్పుడు రాజకీయ రంగం సమ్మోహన శక్తులకు ద్వారాలను తెరుస్తుంది. పరిణామాలు అనూహ్యంగా పరిణమిస్తాయి. సంక్షోభాల కాలంలో రాజకీయ పార్టీల స్థితిగతులపై ప్రఖ్యాత మార్క్సిస్టు మేధావి శ్రీ ఆంటోనీ గ్రాంసీ అభిప్రాయాలను, స్థూలంగా చెప్పుకుందాం.

'పాలకవర్గం యొక్క గుత్తాధికారం సంక్షోభంలో పడే క్రమం వివిధ దేశాలలో వేరు వేరుగా వుంటుంది. సారాంశం మాత్రం ఒక్కటిగానే వుంటుంది. ప్రజలకిచ్చిన వాగ్దానాలను, వారిలో రేకెత్తించిన ఆశలను పరిపూర్తి చెయ్యడంలో వైఫల్యం చెందినప్పుడు, అలాగే రాజకీయ రంగంలో స్తబ్దతగా వున్న కొన్ని వర్గాలు తమ సమస్యలపై అస్పష్టమైన నినాదాలతోనైనా ఆకస్మికంగా రాజకీయ కార్యాచరణకు దిగడం వగైరాలు ఈ సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తాయి. అప్పుడు పాలకవర్గం యొక్క 'అధికారానికి నూకలు చెల్లాయి' అన్న మాటలు వ్యక్తం అవుతాయి. ఇది పాలక వర్గపు సర్వవ్యాపిత సంక్షోభానికి సంకేతమవుతుంది. ప్రజలు మార్పుకు సంసిద్ధులవుతారు. ఇలాంటి సంక్షోభ పరిస్థితులలో సంప్రదాయక పాలకవర్గం చేయిజారిపోతున్న పరిస్థితిని అదుపులోకి తెచ్చుకోవడానికి నాయకుల్ని మారుస్తుంది. తన కార్యక్రమాలను మారుస్తుంది. వాగాడంబర నినాదాలను ముందుకు తెస్తుంది. తన వర్గ ప్రయోజనాలను కొన్నింటిని త్యాగం చెయ్యడానికి సిద్ధం అవుతుంది' అని పేర్కొంటారు.

1969లో ఇందిరా కాంగ్రెస్ ఆ నాటి పాలకవర్గపు సంక్షోభాన్ని పరిష్కరించడానికి చేసిన ప్రయత్నం కూడా ఇలాంటిదేనని చెప్పుకోవచ్చు. అలాంటి పద్ధతిలో సంక్షోభం పరిష్కారం కానప్పుడు పాలకవర్గాలు ఇతర మార్గాలను అన్వేషిస్తాయి. తమ వర్గ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే ఒక పార్టీ వెనుకకు లేదా ఒక నాయకత్వం వెనుకకు తమ బలగాలనన్నింటినీ సమీకరించి సంక్షోభాన్ని ఎదుర్కొంటాయి. ఇలాంటి సంక్షోభ కాలంలో వివిధ పార్టీలు వెనుకవున్న వర్గ శక్తుల మార్పిడి మామూలు పరిస్థితులతో పోల్చినప్పుడు కాంతి వేగంతో

జరుగుతుంది' అని గ్రాంసీ వివరిస్తారు. 1977లో జనతా పార్టీ వెనక జరిగిన సమీకరణ ఈ తరహా ప్రయత్నంగా మనం చెప్పుకోవచ్చు. 'ఇలాంటి సంప్రదాయక పద్ధతులు సాధ్యం కానప్పుడు ఆ సంక్షోభం తన పరిష్కారానికి సమ్మోహన శక్తి గలవారి కోసం వెదుకుతుంది' అని గ్రాంసీ వివరిస్తూ మరొక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించారు. 'సామాజిక వర్గాలు ఒకానొక చారిత్రక పరిస్థితులలో తమ సంప్రదాయక పార్టీలకు దూరం అవుతాయి. అలాంటి ప్రత్యేక పరిస్థితి ఏర్పడినప్పుడు సంక్షోభాలు సంభవిస్తే పరిస్థితి అత్యంత సున్నితమూ, ప్రమాద భరితమూ అవుతుంది. ఎందుకంటే 'మానవుల భవితవ్యాన్ని' నిర్ణయించే సమ్మోహనా శక్తులకు ప్రాతినిధ్యం వహించే నిగూఢశక్తుల కార్యకలాపాలకు రాజకీయ సంక్షోభపు గేట్లు తెరుచుకుంటాయి" అని స్పష్టం చేస్తారు.

ఆంధ్రప్రదేశ్‌లో పాలక కాంగ్రెస్ పార్టీ తన పరిపాలనకు ఎదురైన సంక్షోభాన్ని మొదటి తరహా పద్ధతిలో పరిష్కరించడానికి ప్రయత్నించింది. ముగ్గురు ముఖ్యమంత్రుల్ని మార్చి చూసింది. అయితే ఇలా మార్చిన తీరు సంక్షోభాన్ని పరిష్కరించడానికి బదులు తీవ్రతరం చేసింది. ఇక రెండవ తరహా పరిష్కారాన్ని బూర్జువా ప్రతిపక్ష పార్టీలు చూపించగల స్థితిలో లేవు. జనతా ప్రయోగం విఫలం కావడంలో తిరిగి అప్పటి ప్రయత్నాలు ప్రజల్లో విశ్వాసం కలిగించే స్థితి అప్పుడు లేదు. పైగా మన రాష్ట్రంలో జరిగిన రాజకీయ సంఘర్షణ క్రమంలో సామాజిక వర్గాలు తమ సంప్రదాయక పార్టీలకు దూరం అయి వున్నాయి. ఆకస్మికంగా రంగ ప్రవేశం చెయ్యగల రాజకీయ కళను కొన్ని వర్గాలు సంతరించుకుని వున్నాయి.

మరొక పక్క కాంగ్రెస్ వ్యతిరేకత 'ఒక స్వతంత్ర శక్తి'గా రాజకీయ రంగం మీద ఆవిర్భవించి చిత్ర విచిత్రమైన తీర్పులు యివ్వగల స్థితిలోవున్నది. ఈ పరిస్థితులన్నింటి వల్లా రాష్ట్రంలో తలెత్తిన రాజకీయ సంక్షోభం తన పరిష్కారానికి సమ్మోహనా శక్తులకు ద్వారాలను తెరిచింది. ఆ అవతార పురుషుణ్ణి నేనే అంటు రామారావు రాజకీయ రంగప్రవేశం చేశాడు. సంక్షోభ కాలాలలో అవతార పురుషుల అభయహస్తాల కోసం ఎదురుచూసే శక్తులన్నీ సమీకృతం అయ్యాయి. ఈ శక్తులన్నీ రామారావుని రాజకీయ హీరోని చేసి అధికారాన్ని కట్టబెట్టాయి. దీనిలో కీలకపాత్ర వహించి రామారావు విజయానికి కారణ భూతమైన ప్రాంతీయ పార్టీకి వెన్నెముకగా వ్యవహరించిన ప్రాంతీయ బూర్జువా వర్గం యొక్క స్వరూప స్వభావాలను పరిశీలించుకుందాం.

# ఐదవ అధ్యాయం

# ప్రాంతీయ పార్టీకి వెన్నెముకగా వున్న వర్గం ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం

1. పరిణామ దశలో వున్న వివిధ వర్గాలు
2. ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం
    - ఎ). భూస్వామ్య ప్రయోజనాలు రక్షించే వర్గం
    - బి). ఫాసిస్టు పోకడలు గల వర్గం
    - సి). జాతీయ ఐక్యతా బంధం లేని వర్గం
    - డి). సామ్రాజ్యవాదులకు సాధనంగా వినియోగపడే వర్గం
3. ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గంలో అంతర్గత వైరుధ్యాలు

## 1. పరిణామ దశలో వున్న వివిధ వర్గాలు

భారతదేశంలాంటి వర్ధమాన దేశాలలోని ఆర్థికాభివృద్ధిలో కొన్ని విలక్షణ ధోరణులు స్పష్టంగా మనకు కనిపిస్తాయి. ఇవి 'బహు దొంతరలు' గల ఆర్థిక సముదాయాలను కలిగి వున్నాయని మార్క్సిస్టు పరిశోధకులు విశదీకరిస్తున్నారు. అంటే ఆధునిక నగరాల నుంచి ఇంకా ఆదిమ దశలో వున్న ఆటవిక తెగల వరకు గల ఈ సముదాయాలు ఒక దాని సరసన మరొకటి సహజీవనం చేస్తున్నాయి. భారీ పరిశ్రమలు, కర్మాగారాలు, చేతి వృత్తులు కలగలసి ప్రయాణం సాగిస్తున్నాయి. ఇలాంటి వైవిధ్యమే వ్యవసాయ రంగంలోను కనిపిస్తుంది.

'స్వచ్ఛమైన' వర్గాల రూపకల్పన పూర్తి కానందున అనేక వర్గాలు పరిణామ దశలో కనిపిస్తాయి. ఇలాంటి 'బహు దొంతరల' ఆర్థిక వ్యవస్థలో 'స్వచ్ఛమైన' వర్గాల ఆవిర్భావానికి జరిగే పరిణామంలో వివిధ వర్గాల విచ్ఛిత్తి, సమ్మేళనాలు, వికృత రూపాలు తప్పనిసరి అవుతాయి. ఈ పరిణామక్రమం యొక్క పూర్వ రంగంలో మన రాష్ట్రంలో ఏర్పడిన బూర్జువా గ్రూపుల ఆవిర్భావాన్ని మనం అర్థం చేసుకోవాలి. భారతదేశంలో ప్రాంతీయ బూర్జువా గ్రూపుల స్థితిగతులపై సోవియట్

పరిశోధకుడు ఎ.బి.చరోవ్ చేసిన పరిశీలన ఇలా వుంది. '1960 దశకంలో పంజాబీ, తమిళ, మరాఠీ, తెలుగు, బెంగాలీ తదితర ప్రాంతీయ బూర్జువా వర్గం స్థానిక మార్కెట్ల కోసం, ఆర్థికాభివృద్ధిలోని మరింత ప్రోత్సాహకర పరిస్థితుల కోసం.. వీటన్నింటినీ మించి అంతిమంగా ఈ రాష్ట్రాలలో రాజకీయ అధికారం కోసం ఈ ప్రాంతీయ, బూర్జువా వర్గాలు తమ పోరాటాన్ని ఉధృతం చేశాయి' అని పేర్కొన్నాడు.

దీనినిబట్టి ఈ ప్రాంతీయ బూర్జువా గ్రూపులకు 25 నుంచి 30 ఏళ్ల గత చరిత్ర వున్నది. అవి క్రమేణా బలాన్ని పెంపొందించుకుని రాష్ట్రాలలో రాజకీయ అధికారం కోసం తమ పోరాటాన్ని తీవ్రతరం చేశాయనేది స్పష్టం అవుతున్నది. మన రాష్ట్రంలోని ఈ ప్రాంతీయ బూర్జువా వర్గం ఎలా ఆవిర్భవించింది, అది బలాన్ని ఎలా పెంపొందించుకున్నది పరిశీలిద్దాం.

మన రాష్ట్రంలో గ్రామీణ ఫ్యూడల్ ధనాఢ్య వర్గాలు పరిణామం చెంది ఈ ప్రాంతీయ బూర్జువా గ్రూపులుగా ఆవిర్భవించిన విషయాన్ని మనం గమనించి తీరాలి. ఇది నిస్సందేహంగా భూ రూప ఆస్తి నుంచి పుట్టుకు వచ్చిన వర్గం. 1970 దశకంలో ప్రత్యేకించి 1972లో వచ్చిన భూసంస్కరణల చట్టం అనంతరం ఈ గ్రామీణ ఫ్యూడల్ ధనాఢ్యవర్గాలు తన భూరూపమైన ఆస్తిని కాపాడుకుంటూనే పారిశ్రామిక రంగానికి తమ పెట్టుబడులను తరలించడం ద్వారా ఏర్పడిన వర్గం ఇది. ఈ క్రమంలో ఈ శక్తులు తమ సంఖ్యా బలాన్ని గణనీయంగా పెంపొందించు కున్నాయి. ఈ శక్తుల బల ప్రదర్శన మనకు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ, తర్వాత మితవాద ప్రత్యామ్నాయానికీ, రాజకీయ అధికారానికి జరిగిన ఘర్షణ తీవ్రతలోనూ, ఉధృతిలోనూ స్పష్టంగా ప్రతిబింబించింది.

'బహు దొంతరల ఆర్థిక సముదాయాలు' గల మన దేశంలో స్వచ్ఛమైన వర్గాల ఆవిర్భావానికి జరుగుతున్న ఒక ప్రత్యేక పరిణామక్రమంలో ఈ ప్రాంతీయ బూర్జువా వర్గం ఒక 'వికృతమైన రూపం'లో ఏర్పడింది. అందుచేత ఈ వర్గాన్ని మనం సక్రమంగా నిర్వచించుకోవాలి. అంతేగాని 'ప్రాంతీయ బూర్జువా వర్గం' అనే సర్వనామం దీనికి తగిలిస్తే సరిపోదు. మనం పెట్టే పేరు ఈ వర్గం యొక్క పరిణామ క్రమాన్ని, దాని వర్గ స్వభావాన్ని స్పష్టం చేసేదిగా ఉండాలి. అందుచేత ఈ వర్గానికి 'ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం' అనే నామకరణం తప్పనిసరి అవుతుంది.

మన రాష్ట్రంలో ఈ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం సరసన బూర్జువా

సమాజపు క్షీణవర్గాలు తలెత్తాయి. వివిధ రంగాలలో వారి చొరబాటు పెరగడం ప్రారంభమైంది. ఈ క్షీణ వర్గాన్నే లుంపెన్ ప్రొవిటేరియట్ అనీ, ప్రమాదకర వర్గం అనీ, వర్గ భ్రష్ట బికారి గాలి మూక అనీ పిలుస్తారు. ఈ క్షీణవర్గంలో రెండు రకాలున్నాయి. ఒకటి నిమ్న స్థాయికి చెందినది, మరొకటి ఉన్నత స్థాయికి చెందినది. స్థాయీ భేదం వున్నా వీటికి గుణభేదం లేదని మార్క్స్ అంటాడు.

రౌడీలు, జేబుదొంగలు వగైరా పెట్టుబడిదారీ సమాజపు భ్రష్ట సంతానం అంతా నిమ్న స్థాయికి చెందిన క్షీణ వర్గం, శ్రమించే దేశ ప్రజల సొమ్ముతో తమ స్వంత లాభం చూసుకోవాలని కోరుకునే వర్గం. మన పట్టణాలలో ప్రమాదకర స్థాయికి పెరుగుతున్న మాఫియా గ్యాంగులు, అండర్ వరల్డ్‌గా పేరుపొందిన ముఠాలు ఈ అథమస్థాయి క్షీణ వర్గం పెరుగుదలను సూచిస్తున్నాయి.

ఇక ఉన్నత స్థాయి క్షీణ వర్గం బూర్జువా సమాజపు శిఖరాగ్రంలో తలెత్తుతుంది. పచ్చని చెట్టు కొమ్మల చివర బదనిక తలెత్తినట్టు పుట్టుకొస్తుంది. ఉత్పత్తి ద్వారా సంపాదన కాకుండా ఇతరులు సృష్టించుకున్న దాన్ని స్వాహా చేయాలన్న ధన కాంక్ష గల వర్గం. దీనినే ఫైనాన్స్ పెత్తందారీ వర్గం అంటాడు మార్క్స్.

ఉత్పత్తితో ప్రత్యక్షంగా సంబంధం లేని చట్టా వ్యాపారం, సారాయి రంగం, కాంట్రాక్టులు, ఫైనాన్సు కంపెనీలు, సినిమా రంగం, పత్రికా రంగం, హొటళ్ల రంగం వగైరాలు ఈ ఉన్నత స్థాయి క్షీణ వర్గాలకు ఆటపట్టులుగా వుంటాయి. అడ్డదారి సంపాదనకు అపరిమితమైన ధనకాంక్షకు, నడమంత్రపు సిరికి వీళ్లు ప్రతినిధులు. వీరు కూడా శ్రమించే దేశ ప్రజల సంపదను తను జేబులు నింపుకోడానికి తస్కరించే వాళ్లే, అయితే వీరు నేర్పరులైన భ్రష్టాచారులు అని మార్క్స్ అంటాడు. ఈ క్షీణ వర్గం గురించి మార్క్స్ చేసిన నిర్వచనాలు రాజకీయ రంగంలో వారు వ్యవహరించే తీరు గురించి వివరంగా తరువాత పరిశీలించుకుందాం. రాష్ట్రంలో ఈ క్షీణ వర్గాలు తలెత్తడం, ఇటీవల కాలంలో అవి మరింత బలాన్ని పుంజుకోవడం రాష్ట్ర రాజకీయ రంగంతో సహా వివిధ రంగాలకు విస్తరించడం అన్న పరిణామాలను మనం గమనంలోకి తీసుకోవాలి.

## 2. ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం

మన రాష్ట్రంలో రూపుదిద్దుకున్న ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీవర్గం గురించి మరికొంత పరిశీలన చేద్దాం. కమ్యూనిస్టు ప్రణాళికలో కార్ల్ మార్క్స్, ఏంగెల్సు వివరించిన ఆధునిక పెట్టిబడిదారీ వర్గానికీ ఇక్కడ మన రాష్ట్రంలోని ఈ

ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గానికీ మధ్య ఎంతో వ్యత్యాసం వుంది. ఈ తేడాను మనం అర్థం చేసుకోవాలి.

ఆధునిక బూర్జువా వర్గం, ఫ్యూడలిజం మీద తిరుగుబాటు చేసిన వర్గం, సకల ఫ్యూడల్ సంబంధాలను, కూకటివేళ్ళతో పెళ్లగించిన వర్గం. దీనికి విరుద్ధంగా ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం ఫ్యూడల్ అవశేషాల నుంచి పుట్టిన వర్గం. గ్రామీణ భూస్వామ్య, ధనాఢ్య వర్గాల నుంచి పరిణామం చెందిన వర్గం. వాటితో రక్త సంబంధం గల వర్గం.

కమ్యూనిస్టు ప్రణాళికలో వివరించిన ఆధునిక బూర్జువా వర్గం 'జన్మత తమకంటే అధికులైన వాళ్ళకు కట్టిపడేసిన 'కలగా పులగపు' ఫ్యూడల్ సంబంధాలను పటాపంచలు చేసిన వర్గం. కాగా మన ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడి దారీ వర్గం అలాంటి 'కలగాపులగపు' సంబంధాలను కలిగివున్న వర్గం. వెంట తెచ్చుకున్న వర్గం.

అంతేకాదు ఆధునిక బూర్జువా వర్గం. 'సకల నిష్కపట జానపద సంబంధాలను నిర్మూలించగా' ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టిబడిదారీ వర్గం అలాంటి 'జానపద సంబంధాల మీద' మోజు వీడని వర్గం వెంట తెచ్చుకున్న వర్గం. ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం పారిశ్రామిక రంగానికి ఎగబాకినంత మాత్రం చేతనే ఆధునిక బూర్జువా వర్గంలాగా వ్యవహరించజాలదు. ఎందుకంటే ఇది తన ఫ్యూడల్ గతాన్ని, పెట్టుబడిదారీ వర్తమానంతో పెనవేసుకుని వున్న వికృతవర్గం.

ఇలాంటి వికృత రూపంగల ప్రాంతీయ భూస్వామిక పెట్టిబడిదారీ వర్గం రాష్ట్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి వివిధ వర్గాల కథా నాయకుడుగా వికృత రూపం పొందిన రామారావుని తన ప్రతి రూపంగా ఎంచుకుంది. తన రాజకీయ 'హీరోని' చేసుకుంది. 'జన్మతః అధికులైన వాళ్ల మీద' ఆశలు మిగుల్చుకున్న ఈ వికృత వర్గం, ఈ 'కారణజన్ముణ్ణి' వరించింది. అలాగే 'సకల నిష్కపట జానపద సంబంధాల' మీద మోజు వీడని వర్గం అలాంటి 'జానపద కథానాయకుణ్ణి' తన నేతగా స్వీకరించింది. ఈ రాజకీయ హీరో నిజ స్వరూపాన్ని విశ్లేషించుకోవడానికి ముందుగా ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం యొక్క స్వభావాన్ని పరిశీలించుకుందాం.

## 1. భూస్వామ్య ప్రయోజనాలను రక్షించే వర్గం

ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం ప్రగతి నిరోధకమైన వర్గం.

రాష్ట్రంలో ఇది భూసంస్కరణల చట్టానికి వ్యతిరేకంగా పుట్టి పెరిగిన వర్గం. ఈ భూసంస్కరణల చట్టాన్ని వమ్ముచేయడానికి విభజన ఉద్యమాన్ని నడిపిన వర్గం. జాతీయ బూర్జువా పార్టీలో అంతర్భాగంగా వుంటూ ఈ భూసంస్కరణలతో పరిమితంగానైనా రాజీ పడడానికి అంగీకరించిన వర్గం ఇది. ప్రాంతీయ పార్టీ ద్వారా రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకున్న తన భూరూప ఆస్తిని కాపాడుకుంటూనే పారిశ్రామిక రంగంలో అభివృద్ధి పొందాలని కోరుకుంటున్న వర్గం. అందుచేత ఇది జాతీయ బూర్జువా వర్గం లాగ భూస్వాములతో రాజీపడే వర్గం కూడా కాదు. ఇది వారి ప్రయోజనాలను కాపాడే వర్గం. రామారావు తన ఎన్నికల ప్రచారంలో 'రైతుల ఆస్తులపై ఆంక్షలు విధిస్తూ, పెద్ద పెద్ద పట్టణాలలో భవనాలపైన, ఆస్తులపైనా ఎందుకు ఆంక్షలు విధించడం లేదని ఆయన ప్రశ్నించారు. 'నేను ఈ మాట అంటే, నేను భూసంస్కరణలకు వ్యతిరేకినని ప్రచారం చేస్తారు' అని పేర్కొన్నాడు. ఈ వర్గానికి ఇంతకంటే కావలసిందేముంటుంది? అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వర్గం, దాని నాయకుడు భూసంస్కరణల్ని ఎలా బుట్టదాఖలు చేసిందీ వేరుగా చెప్పనక్కరలేదు.

ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం తన గ్రామీణ ఫ్యూడల్ పెత్తనం సాగించి తీరాలనే వర్గం. పదిరి కుప్పం, కారంచేడు, నీరుకొండ ఘటనలు ఇందులో అంతర్భాగం మాత్రమే. ఇలాంటివి ఇతరచోట్ల జరగడం లేదా అనవచ్చు. కాని, ఈ నగ్నమైన ఫ్యూడల్ వర్గాల దాడిని ఇరు వర్గాల మధ్య ఘర్షణగా తెలుగుదేశం ప్రభుత్వం చిత్రించడం, ఈ ఘటనలన్నింటిలోని ప్రధాన సాక్ష్యులు పథకం ప్రకారం హత్యలకు గురైనా, ప్రభుత్వం పట్టించుకోకపోవడం స్పష్టంగా ఈ ప్రభుత్వం వెనక గల వర్గాల స్వభావాన్ని వెల్లడిస్తున్నది.

ఈ రాష్ట్ర సమగ్రాభివృద్ధి పట్ల, పారిశ్రామికాభివృద్ధి పట్ల ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం, ఆధునిక బూర్జువా వర్గంగా వ్యవ హరించ జాలదు. దీని ఫ్యూడల్ సంకుచిత ధోరణులు, నిరంకుశ పెత్తందారీ ధోరణులు ప్రగతి నిరోధకాలవుతాయి. తన ఫ్యూడల్ సంబంధాల పరిధిలోనే పారిశ్రామికాభి వృద్ధి జరగాలన్న సంకుచిత ధోరణి పెట్టుబడి విస్తరణకు, నూతన రంగాల ఆవిష్కరణకు ప్రతిబంధకం అవుతుంది. పైగా ఇది ప్రభుత్వ రంగ విస్తరణ పట్ల ఆసక్తిగల వర్గం కాకపోగా, ఆ పరిశ్రమలను కారు చౌకగా దిగమింగాలని చూస్తుం ది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల అమ్మకాలు, ఆర్టీసీ, విద్యుచ్ఛక్తి రంగాలలో ప్రైవేటు వ్యక్తుల చొరబాటు దీనిని స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తగిన

పథకాలు లేకపోవడం, పారిశ్రామికాభివృద్ధి కుంటుపడడం, విద్యుచ్ఛక్తి లోటులోకి రావడం ఇవన్నీ ఈ వర్గం యొక్క వెనక చూపుకు, సంకుచిత దృక్పథానికి నిదర్శనాలు మాత్రమే.

## 2. ఫాసిస్టు పోకడలుగల వర్గం

ఆధునిక బూర్జువా వర్గం 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అన్న నినాదాలతో ఫ్యూడలిజం మీద తిరుగుబాటు చేసింది. కాని మన రాష్ట్రంలోని ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీవర్గం ఫ్యూడల్ అవశేషాల నుంచి అభివృద్ధి అయిన వర్గం కావడంతో దాని నిరంకుశ పోకడలను పుట్టుకతోనే వెంట తెచ్చుకున్న వర్గం ఇది. విభజన ఉద్యమంలో, అధికారంలో లేనప్పుడే ఈ వర్గం ప్రదర్శించిన ఫాసిస్టు పోకడలు అందరికీ తెలిసినవే.

ఇది అధికారాన్ని స్వీకరించగానే ముందుగా ప్రజాస్వామిక సంస్థలపై దాడులకు పూనుకుంది. ఎన్నికలకు ఎగనామం పెట్టి సర్వత్రా నామినేషన్లకు పూనుకుంది. ప్రెస్ బిల్, పోలీసు బిల్లులు తేవడానికి ఆరాటపడింది. ప్రభుత్వ యంత్రాంగాన్ని పాదాక్రాంతం చేసుకునే క్రమాన్ని ప్రారంభించింది. సెక్రటేరియట్ నుంచి పోలీసు స్టేషన్ల వరకు పచ్చ చొక్కాల పాలనను ప్రవేశపెట్టింది.

1987 డిసెంబర్ 20న ఈనాడు పత్రిక ద్వారా వెల్లడైన తెలుగుదేశం శాసన సభ్యుల కోర్కెలు ఇలా వున్నాయి.

జిల్లాస్థాయిలోని కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్ వంటి అధికారుల నియామకాలు జిల్లా మంత్రుల నిర్ణయం మేరకు జరగాలి. నియోజకవర్గ పరిధిలోని వివిధ శాఖల అధికారులను, శాసనసభ్యులతో సంప్రదించి వారు కోరిన వారిని నియమించాలి. అయిదేళ్ల వరకు వారిని బదిలీ చేయకూడదు. శాసనసభ్యుల నియంతృత్వాన్ని చెలాయించాలన్న ఉబలాటం ఈ వర్గానికి ఎంత ప్రబలంగా ఉన్నదో వేరే ఉదాహరణ అక్కరలేదు.

ఎన్.జి.ఓల సమ్మెపై సమస్త నల్ల చట్టాలను ప్రయోగించడం, సమ్మె విచ్ఛిన్నానికి ప్రజల్ని రెచ్చగొట్టడం, భయోత్పాతాన్ని, అత్యంత జుగుప్సాకరమైన ప్రచార పద్ధతులతో దాడికి పూనుకుంది. సమ్మె చేసిన నేరానికి ఉపాధ్యాయులను డివిజన్లు దాటించింది. కాలేజీ లెక్చరర్లను మూకుమ్మడిగా జిల్లాలను దాటించింది. ఇవన్నీ ఈ వర్గం యొక్క నియంతృత్వ పోకడలకు, సంఘటిత కార్మికోద్యమాన్ని దెబ్బ తీసే

దుష్ప్రయత్నాలకు ప్రతీకలు మాత్రమే. ఈ ప్రభుత్వ అధికార పత్రిక హిట్లర్ బొమ్మను ప్రచురించి ఊరేగించింది ఈ వర్గం అధినాయకుడు హిట్లర్‌ను పొగడ్తలతో ముంచెత్తాడు. ఈ పార్టీ కార్యకర్తల శిక్షణా శిబిరంలో హిట్లర్ పద్ధతులు బోధనాంశాలు అయ్యాయి. ఇవన్నీ ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గపు ఫాసిస్టు పోకడలకు అద్దంపట్టే కొన్ని అంశాలు మాత్రమే.

## 3. జాతీయ ఐక్యతా బంధం లేని వర్గం

కమ్యూనిస్టు ప్రణాళికలో వివరించిన ఆధునిక పెట్టుబడిదారీ వర్గం 'పరస్పర సంబంధాలు దుర్బలంగా వుండిన రాష్ట్రాలను ఒకే ప్రభుత్వం ఒకే జాతీయ వర్గ ప్రయోజనమూ, ఒకే జాతీయ సరిహద్దుగల జాతి ముద్దగా రూపొందించే' వర్గంగా చెప్పబడింది. దీనికి విరుద్ధంగా ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం తన భూరూప ఆస్తిని కేంద్రంగా చేసుకుని పరిశ్రమల చుట్టూ పరిభ్రమించే వర్గం. ఇది ఫ్యూడల్ సంకుచితతత్వంతో తన భాష, ప్రాంతీయ పరిధిలో తన ఏకైక పెత్తనానికి ప్రయత్నిస్తుంది.

మన రాష్ట్రంలో విభజనోద్యమం జరిగినప్పుడు ఈ వర్గాలు రాష్ట్రాన్ని చీల్చి ముక్కలు చేసి, ఆ చెక్కలపై పెత్తనం చేయాలన్న ప్రయత్నం చేశాయి. దేశం నుండి కూడా వేరుపడాలన్న నినాదాలు అప్పుడే అక్కడక్కడా వినిపించాయి. అందుచేత ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం జాతి, మత భాషల కోటగోడల్ని బద్దలుకొట్టి మార్కెట్ల కోసం జైత్రయాత్ర చేసే వర్గం కాదు. రాష్ట్రాల మధ్య దుర్బలంగా వున్న సంబంధాలను ధృఢతరం చేసే లక్షణం గల వర్గం కాదు. దీని ఏకైక లక్ష్యం రాష్ట్రాలలో తమ నిరంకుశ పెత్తనం సాగడం, ఆ రాష్ట్రాలకు సర్వాధికారాలు ఉండడం మాత్రమే.

అంతేగాని కేంద్రం రాష్ట్రాల మధ్య సమతూకం వుండాలన్న భావన ఈ వర్గం యొక్క సంకుచిత దృష్టికి పొసగనిది. రాష్ట్రాలు సత్యం, కేంద్రం మిధ్య అన్న నినాదం ఈ వర్గం యొక్క సంకుచిత దృష్టికి అద్దం పడుతుంది. ఈ వర్గం తన సంకుచిత పెత్తందారీ ప్రయోజనాల కోసం జాతీయ ప్రయోజనాలను పణంగా పెడుతుంది. దేశ సమైక్యతకు విరుద్ధంగా విభజనోద్యమాలకు, విచ్ఛినకర వేర్పాటు ఉద్యమాలకు వెనుదీయని వర్గం. దీని గత చరిత్ర దానికి సాక్ష్యం పలుకుతుంది. (ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన విభజనోద్యమం వెనుకగల వర్గాలు. తమ నాయకుల్ని మార్చుకున్నాయి. నాయకులు తమ పార్టీలను మార్చుకున్నారు. కాని దీనికి

వెన్నెముకగా వున్న ఈ వర్గం తన లక్షణాన్ని మాత్రం మార్చుకోలేదని గమనించాలి).

ఇప్పుడు ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గానికి నాయకత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ సమైక్యతకు, సమగ్రతకు హాని కలిగించే నినాదాలు చేపట్టడం, సమస్త మతవాద, మితవాద విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలిపి ఒకే జెండా కిందకు సమీకరించే ప్రయత్నాలు దీనిని ధృవపరుస్తున్నాయి.

## 4. సామ్రాజ్యవాదుల కుట్రలకు సాధనంగా వ్యవహరించే వర్గం

వర్ధమాన దేశాల్లో తలెత్తుతున్న ఇలాంటి ప్రాంతీయ ధోరణులు గల పెట్టుబడి దారీ వర్గాలను గురించి సోవియట్ పరిశోధకుడు ఎ.చిచరోవ్ ఇలా వ్రాశాడు. ఇది ప్రాంతీయ ధోరణులు కలిగి వుంటుంది. అభివృద్ధి నిరోధక భావాలతో, వేర్పాటు వాదం, ప్రాంతీయ ప్రత్యేకతల ముసుగును, జాతి ఆత్మగౌరవం వంటి సిద్ధాంతాలను ముందుకుతెస్తుంది. ఇది ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతకు విచ్ఛిన్నకారిగా, సామ్రాజ్య వాదుల కుట్రలకు వినియోగపడే సాధనంగా, జాతీయ స్వాతంత్రానికి ముప్పు కలిగించే శక్తిగా తయారౌతుంది. మన ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం కూడా ఇదే దారిలో ప్రయాణిస్తున్నది. ఇది ఆది నుంచి అమెరికన్ సామ్రాజ్య వాదులతో, పశ్చిమ దేశాలతో దగ్గర సంబంధాల కోసం ఆరాటపడింది. దీనికి తగిన పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరుగా వ్యవహరించగల దక్షతగలవాడన్న నమ్మకంతోనే ప్రవాసాంధ్ర జీవితం గడుపుతున్న ఉపేంద్రను తెచ్చి పార్టీలో పెద్ద పీట వేశారు. సామ్రాజ్యవాదులకు అనుకూలమైన 'నిజమైన అలీన విదేశాంగ విధానం' అన్న నినాదాన్ని ఎన్నికల ప్రణాళికలో పొందుపర్చారు. పశ్చిమ దేశాలు, ప్రత్యేకించి అమెరికా అలాంటి ప్రత్యేక శ్రద్ధనే తెలుగుదేశం పట్ల, రామారావు పట్ల ప్రదర్శించాయి. తెలుగుదేశం ఎన్నికల విజయానికి ఆ దేశాల పత్రికలు ఎనలేని ప్రాధాన్యతను ఇచ్చాయి. ఈ పశ్చిమ దేశాల పత్రికా బృందాలు హైదరాబాదుకు రాకపోకలను పెంచాయి.

తెలుగుదేశం కార్యదర్శి ఉపేంద్ర ప్రత్యేక అతిథిగా అమెరికా, ఇతర పశ్చిమ దేశాలలో నెలల తరబడి పర్యటనలు చేశారు. రామారావు రెండుసార్లు అమెరికా వెళ్ళి వచ్చారు. అమెరికాలో తెలుగుదేశం సంబంధాల మెరుగుదలకు ఇవన్నీ దోహదం చేశాయి. రామారావు భారత విదేశాంగ విధానాన్ని 'తొత్తు' విదేశాంగ విధానం అనే దాకా ఈ సంబంధాలు విస్తరించి ఘనీభవించాయి. స్వాతంత్ర్యానంతరం భారతదేశ చరిత్రలోనే మొదటిసారిగా అమెరికా రాయబార

కార్యాలయం 'తమ జాతీయ ఉత్సవాలను' ఢిల్లీ కాకుండా తమ మిత్రరాజ్యమైన ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో జరిపింది. తెలుగుదేశంతో తనకుగల ప్రత్యేక మైత్రిని ఈ రూపంలో వ్యక్తం చేసింది. ఈ ఉత్సవాలలో 'ముఖ్య అతిథిగా' రామా రావు ప్రత్యేక గౌరవ సత్కారాలు పొందాడు. తెలుగుదేశం పార్టీ మీద, దాని అధినేత రామారావు మీద అమెరికాకు ప్రత్యేకమైన ఆశలు వున్నాయి. 1984లో రాష్ట్ర సమాచార శాఖ 'ముఖ్యమంత్రి అమెరికా పర్యటన' అన్న పుస్తకాన్ని ప్రచురించింది. అందులో అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలోని కౌంట్ ఆఫ్ ఎలిఫినీ పాలకవర్గం సమర్పించిన స్వాగతపత్రంలో యిలా వుంది. 'భారతదేశంలోనే మంచి పేరు గాంచిన సినీనటులైన శ్రీ రామారావు ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. గొప్ప మెజారిటీతో ఎన్నికలలో గెలుపొందారు. వీటన్నింటికంటే అత్యంత ప్రాధాన్యత కలిగినది ఏమిటంటే భారతదేశంలోని అన్ని ప్రతిపక్షపార్టీలనూ సమైక్యంగా పనిచెయ్యడానికి సంఘటిత పరుస్తున్నారు. ఆయన పర్యటన మన రెండు దేశాలకు ఫలప్రదమైనదీ, ప్రయోజనకరమైనదీ కావాలన్న ప్రగాఢవాంఛతో ఆహ్వానిస్తున్నాం' అమెరికా సామ్రాజ్యవాదులు రామారావుని రాష్ట్ర ముఖ్యమంత్రిగా మాత్రమే చూడడం లేదనేది స్పష్టం అవుతున్నది. భారతదేశంలోనే పలుకుబడిగలిగిన సినీ నటుడిగా చూస్తున్నారు. భారతదేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలను సంఘటిత పరుస్తున్న వాడిగా చూస్తున్నారు. రామారావు పర్యటన రెండు దేశాలకూ ఫలప్రదమైనదీ, ప్రయోజనకరమైనదిగా చూస్తున్నారు. ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీవర్గం, దాని పార్టీ యిప్పటికే సామ్రాజ్య వాదంతో వీడని బంధాన్ని ఏర్పాటు చేసుకుంది. మన దేశ విదేశాంగ విధానాన్ని 'తొత్తు' విదేశాంగ విధానం అనే స్థాయికి పెరిగి తనకు తానుగా సామ్రాజ్యవాదులకు తొత్తుగా ప్రకటించుకుంది. సామ్రాజ్యవాదుల కుట్రలకు వినియోగపడే సాధనంగా తయారవుతున్నది.

## 3.ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీవర్గంలోని అంతర్గత వైరుధ్యాలు

ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం యొక్క వర్గ స్వభావాన్ని, అది రాష్ట్ర రాజకీయ రంగంలో ఒక వర్గంగా, ఒక ముద్దగా వ్యవహరించిన తీరునూ మనం పరిశీలించాం. ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం రాష్ట్రంలోని కాంగ్రెస్‌తో సహా వివిధ బూర్జువా ప్రతిపక్ష పార్టీల వెనుకగల తమ వర్గ శక్తులను తమకు అవసరం వచ్చినప్పుడల్లా తృటి కాలంలో ఒకేచోటుకు సమీకరించగల

'రాజకీయ మంత్ర కళను' ప్రదర్శించిందని తెలుసుకున్నాం. ఈ వర్గం విభజనోద్యమంలో అలాంటి కళను ప్రదర్శించింది. జనతా పార్టీ కూటమి వెనుక తన బలగాలను తృటికాలంలో సమీకరించడంలోనూ అలాంటి కళను ప్రదర్శించింది. తిరిగి తెలుగుదేశం పార్టీ వెనక తన శక్తులన్నింటినీ సమీకరించడంలోను ఈ వర్గం తన 'రాజకీయ మంత్రకళను' ప్రదర్శించింది. ఈ వర్గం రాష్ట్రంలో ఒక ముద్దగా, ఒక వర్గంగా వ్యవహరించగలదని చెప్పడానికి తిరుగులేని ఉదాహరణలు. అయినా పైకి ఒక ముద్దగా కనిపించే ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గంలో అనేక ఆంతరంగిక వైరుధ్యాలున్నాయి. ఈ వర్గ ఐక్యతను భగ్నం చేసే అంశాలు, ఈ వర్గం ఒక ముద్దగా వ్యవహరించడానికి అవరోధాలను కల్పించే అంశాలు కూడా వున్నాయి.

**మొదటిది** దీని పుట్టుకలోనే వున్నది. ఇది రాష్ట్రం లోపలే ప్రాంతీయ సంకుచితతత్వాన్ని కలిగిన వర్గం. గతంలో రాష్ట్రంలో జరిగిన విభజన ఉద్యమాలలో ఈ వర్గం తన ప్రాంతీయ సంకుచితతత్వంతో ఒక దానితో ఒకటి పోరాడుకున్న చరిత్రగల వర్గమిది. ఈ రాష్ట్రం మూడు చెక్కలయితే, ఆ మూడు చెక్కలకు తామే అధిపతులం కావచ్చునని భావించిన సంకుచిత ప్రాంతీయ దృష్టిగల వర్గాల సముదాయం ఇది. మళ్ళీ రాష్ట్రంలో ఈ ప్రాంతీయ సమస్యలు ఎప్పుడు తిరిగి ప్రకోపించినా ఇది ఒకే ఒక వర్గంగా, ఒక ముద్దగా వ్యవహరించలేని వర్గం. పైగా ఒకదానితో మరొకటి సంఘర్షణకు వెనుకాడని బలహీనత కలిగిన వర్గం ఇది.

**రెండవ అంశం.** రాష్ట్రంలో రూపుదిద్దుకున్న ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం బహుకులాల సమ్మేళనం. ఒకపక్క వర్గ ప్రయోజనాలు వారిని ఐక్యం చేస్తున్నా మరొకపక్క కుల ప్రయోజనాలు, కుల పెత్తనాలు వారిని ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటున్నాయి. రాజకీయ పెత్తనాన్ని పంచుకోవడంలో వివిధ కులాల మధ్య సమతూకం దెబ్బ తిన్నప్పుడల్లా ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం కుల విభజనకు గురవుతుంది. అది వర్గంగా వ్యవహరించలేని బలహీనతను ప్రదర్శిస్తుంది.

**మూడవది.** ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం ఇచ్చిన నినాదాలతో ఈ వర్గం గొడుగు కిందకు చేరిన బూర్జువా వర్గంలోని ప్రజాతంత్ర విభాగాలు కొన్ని వున్నాయి. ఈ ప్రాంతీయ పార్టీ వల్ల రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సత్వరం జరుగుతుందని, కేంద్రం నుండి రాష్ట్రానికి జరగాల్సిన న్యాయం కోసం పోరాడుతుందని భావించిన వర్గాలు. ఈ ప్రజాతంత్ర బూర్జువా విభాగాలు ఈ ప్రాంతీయ భూస్వామిక

పెట్టుబడిదారీవర్గం తన నిజ స్వరూపంతో, నియంతృత్వ పోకడలతో, బైటపడే కొద్దీ ఈ ప్రజాతంత్ర విభాగాలు అందులో ఇమడలేని పరిస్థితి కలుగుతుంది. ఈ విభాగాలు చీలిపోతాయి.

**నాలుగవది చివరిది.** ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గానికి నాయకత్వం వహిస్తున్న రామారావు ఈ వర్గానికి సహజసిద్ధమైన నాయకుడు గాదు. రాజకీయ అధికారం కోసం ఈ మితవాద ప్రత్యామ్నాయం సాగించిన పోరాటాలనుండి దానికి నాయకుడైనవాడు కాదు. అందుచేత రామారావు ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం యొక్క మొత్తం ప్రయోజనాలను పరిరక్షించేవాడుగా వ్యవహరిస్తాడా ? లేక దీని ఐక్యతను దెబ్బ తీసే అంశాలను ప్రకోపించే విధానాలకు పూను కుంటాడా? అన్న అంశాలపై ఈ వర్గం ఒక ముద్దగా వ్యవహరించడం ఆధారపడి వుంటుంది. అలాగే రామారావు వర్గ లక్షణం ఈ ప్రాంతీయ భూస్వామిక వర్గ లక్షణమేనా? లేక ఆయనదొక ప్రత్యేక వర్గ లక్షణమా? అన్నది కూడా మనం పరిశీలించుకోవాలి. ఆ పనికి ఇప్పుడూ పూనుకుందాం.

## ఆరవ అధ్యాయం

# రామారావు నిజ స్వరూపం

1. నాయకుని ప్రత్యేక విశ్లేషణ ఆవశ్యకత
2. బూర్జువా సమాజ శిఖరాగ్రంలోని క్షీణ వర్గం
3. మత మౌఢ్యం, క్షుద్రతాంత్రిక మౌఢ్యం: సెక్యులరిజం
4. వెయ్యి హిట్లర్లను దాచుకోగల దుస్సాహసం
5. పచ్చి అభివృద్ధి నిరోధకత్వానికి వికృతరూపం

1983 ఎన్నికలలో బలాన్ని పంజుకునివున్న మూడు వికృతశక్తులు రంగ ప్రవేశం చేశాయి. పరస్పర వ్యతిరేక శక్తుల కలయికగా ఏర్పడిన 'కాంగ్రెస్ వ్యతిరేక శక్తి' పరివర్తన దశలో రూపొందిన 'ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం' పలు వర్గాల ప్రజల పాత్రలను ధరించి తనలోనే అన్ని వర్గాల కథానాయకుణ్ణి చూపించగల 'రాజకీయ హీరో' అన్నవి ఈ మూడు వికృత శక్తులు ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోసం సుదీర్ఘ పోరాటాలను చిత్ర విచిత్ర విన్యాసాలను సాగించిన మితవాద ప్రత్యామ్నాయం. ఈ వికృత శక్తుల కలయిక రూపంలో రాజకీయ హీరో రామారావు విజయం రూపంలో అధికారాన్ని హస్తగతం చేసుకుంది. రాజకీయ రంగప్రవేశం చేసిన సమ్మోహన శక్తుల ప్రవేశంతో ఆంధ్రజాతి ఈ వికృత శక్తులకు దాసోహమైంది.

### 1. నాయకుని ప్రత్యేక విశ్లేషణ ఆవశ్యకత

రాజకీయాలలో సాధారణ పరిస్థితులు ఉన్నప్పుడు రాజకీయ పార్టీలు, వర్గాలు ప్రముఖస్థానంలో వుంటాయి. వివిధ పార్టీల నాయకులు తమ పార్టీల, వర్గాల ఆకాంక్షలను వ్యక్తీకరించే పాత్రధారులుగా వుంటారు. కాని రాజకీయాలలో సమ్మోహన శక్తుల ప్రవేశంతో అసాధారణ రాజకీయ పరిస్థితులు ఏర్పడతాయి. అప్పుడు నాయకులకు 'అతీతశక్తులు' అంటగట్టబడతాయి. వారు కూడా అలాగే వ్యవహరించడానికి పూనుకుంటారు. ఇలాంటి పరిస్థితులలో 'నాయకుడే పార్టీ',

'పార్టీయే నాయకుడు', 'హై హై నాయకా' అన్న నినాదాలు తలెత్తుతాయి. రాజకీయ హీరోకు సర్వాధికారాలు ధారాదత్తం అవుతాయి. ఇలాంటి పరిస్థితులలో పుట్టిన తెలుగుదేశం పార్టీకి కర్త, కర్మ, క్రియ అన్నీ హీరో రామారావే కావడం అత్యంత సహజ సిద్ధమైన పరిణామం. అందుచేత తెలుగుదేశం పార్టీ వర్తమానాన్ని, భవిష్యత్తును అర్థం చేసుకోవాలంటే దాని 'హీరో' యొక్క నిజ స్వరూపాన్ని విశ్లేషించుకోవడం అత్యంత కీలకమైన అంశం అవుతుంది. ఆ పనికి పూనుకుందాం.

## 2. బూర్జువా సమాజ శిఖరాగ్రంలోని క్షీణవర్గం

వివిధ వర్గాల ప్రజల పాత్రలను నటించడం ద్వారా ఏక కాలంలో పలు వర్గాల ప్రజల 'కథానాయకుడుగా' వికృతరూపం పొందడం, వర్గ భ్రష్టత్వం చెందడం మనం గమనించాం. నట జీవితం ద్వారా ప్రాప్తించిన ఈ పైకి కనిపించే వర్గ భ్రష్టరూపం యొక్క పరిశీలన మాత్రమే మనకు సరిపోదు. కార్ల్ మార్క్స్ ఇలాంటి వర్గభ్రష్టత్వం గురించి, క్షీణవర్గం గురించి, చేసిన విశ్లేషణను మనం అర్థం చేసుకుని అన్వయించుకోవాలి.

మార్క్స్ విశ్లేషణ ప్రకారం ఈ వర్గభ్రష్ట బికారి గాలి మూక, క్షీణ వర్గం, లుంపెన్ వర్గం అనేది బూర్జువా సమాజపు అభివృద్ధి క్రమంలో రెండు నిర్దిష్టమైన దశలలో, రెండు నిర్దిష్టమైన రూపాలలో తలెత్తుతుంది. (పునరుక్తి దోషం ఉన్నప్పటికీ పాఠకుల సౌకర్యం కోసం వీటిని మరొకసారి వివరిస్తాను).

మొదటిది పెట్టుబడిదారీ సమాజంలోని అన్నివర్గాల చేత విసర్జించబడి, సమాజపు చెత్తగా, తెట్టుగా పుట్టుకొచ్చిన రౌడీలు, జేబుదొంగలు, జూదర్లు, చౌకబారు రచయితలు, వీధి కళాకారులు, దగా వంచనలతో జీవించే సమస్త భ్రష్ట బికారి గాలిమూకగా అంతా నిమ్నస్థాయి క్షీణవర్గంగా, భ్రష్ట బికారి గాలిమూకగా వుంటుంది. శ్రమించే దేశ ప్రజల సంపదను తమ స్వంత లాభాల కోసం కాజేయ డానికి ఎలాంటి దుస్సాహసాలకైనా పాల్పడే ప్రమాదవర్గం ఇది. బూర్జువా సమాజంలో అథమ స్థాయిలో జన్మ నెత్తిన క్షీణ కార్మికవర్గం యిది.

ఇక రెండవది ఉన్నతస్థాయి క్షీణ వర్గం. దీనిని గురించి మార్క్స్ 1848లో ఫ్రాన్సులో వర్గ పోరాటం అన్న గ్రంథంలో ఇలా వివరించాడు. 'బూర్జువా సమాజపు శిఖరాగ్రంలో ఫైనాన్స్ ప్రభువర్గం తలెత్తుతుంది. 'డబ్బు కూడబెట్టాలి' అనే పిచ్చి ప్రతి రంగంలోనూ తాండవిస్తుంది. ఉత్పత్తి ద్వారా సంపాదనకు బదులు, ఇతరుల

సంపదను అడ్డదారుల ద్వారా కైంకర్యం చేసుకోవడం ప్రధాన ధ్యేయం అవుతుంది. దీనికోసం ప్రతిక్షణం తమ బూర్జువా చట్టాలను తామే నిరంతరం ఉల్లంఘిస్తారు. అనారోగ్యకరమైన హద్దూ పద్దూ లేని ధనకాంక్షకు వీరు ప్రతినిధులు. ఈ వర్గం యొక్క ధనలాలసతను పలు రకాల జూదాలు, వంచనలు, దగాల ద్వారా లభించే నడమంత్రపు సిరి మాత్రమే సంతృప్తి పరచగలుగుతుంది. ఇక్కడ ధనం, కుళ్ళు, రక్తం కలగలసి వుంటాయి. తన సంపాదనా పద్ధతిలోనూ, సుఖ వినోదాలలోనూ ఈ ఫైనాన్సు ప్రభువర్గం బూర్జువా సమాజపు శిఖరాగ్రంలో పునర్జన్మ ఎత్తిన క్షీణ కార్మిక వర్గం తప్ప మరొకటి కాదు'.

ఈ రెండూ కూడా సజాతి బిడ్డలే. తేడా ఏమిటంటే ఒకటి ఉన్నత స్థాయి క్షీణవర్గం, మరొకటి నిమ్నస్థాయికి చెందిన క్షీణవర్గం. ఈ వర్గ భ్రష్ట బికారి గాలి మూక అది ఉన్నతస్థాయికి చెందినా, నిమ్నస్థాయికి చెందినా వీటి జీవలక్షణం మాత్రం ఒకటిగానే ఉంటుంది.

బూర్జువా సమాజపు శిఖరాగ్రంలో తలెత్తిన యిలాంటి భ్రష్టాచారి, క్షీణ కార్మికవర్గ ప్రతినిధి అయిన లూయీ బోనపార్ట్ రాజకీయ రంగంలో వ్యవహరించిన తీరును కార్ల్ మార్క్స్ ఇలా విశ్లేషించాడు.

'బోనపార్ట్ తాను ఏకకాలంలో రైతులు ప్రతినిధిగానూ, సామాన్య ప్రజల ప్రతినిధిగానూ–బూర్జువా సమాజ చట్రం లోపల క్రింది వర్గాల ప్రజలను సుఖవంతులను చెయ్యాలని కోరుకుంటాడు. కాని బోనపార్ట్ ఎక్కువగా తనను తాను వర్గభ్రష్ట బికారి గాలిమూక (క్షీణవర్గ) ప్రతినిధిగా పరిగణించుకుంటాడు. ఇలాంటివారికి గల మిక్కిలి పెద్ద లక్ష్యం తమకు తాము లాభాలు చేకూర్చుకోవడం మాత్రమే.. ఉత్తర్వులతో, ఉత్తర్వులు లేకుండా, ఉత్తరువుల్లంఘన చేసి కూడా అతను తన స్థితిని విజయవంతంగా సార్ధకం చేసుకున్నాడు.'

ఇక్కడ బోనపార్ట్ పేరును తొలగించి రామారావు పేరు తగిలించి చూడండి. రామారావు ఈ రాష్ట్రానికి చెందిన బోనపార్ట్ అవుతాడు. బోనపార్ట్ తాను ప్రకటించుకున్న నెపోలియన్‌కు వ్యంగ్యావతారం కాగా, రామారావు తాను ప్రకటించుకున్న ధర్మ సంస్థాపనకు అవతరించిన వ్యంగ్యావతారం మాత్రమే. బోనపార్ట్ లాగే రామారావు కూడా తాను రైతులకు ప్రతినిధిననీ, పేదలకు అన్ననీ, వారి సంక్షేమానికి చివరి రక్తంబొట్టు వరకూ ధారపోస్తానని గొంతు చించుకుంటాడు. కానీ ఇతని ఏకైక లక్ష్యం కూడా 'తమకు తాము లాభాలు చేకూర్చుకోవడమే'. ఎందుకంటే రామారావు కూడా బూర్జువా శిఖరాగ్రంలో

పునర్జన్మ ఎత్తిన క్షీణ వర్గానికి, ఫైనాన్స్ ప్రభువర్గానికి ప్రతినిధి. ఇతని సంపాదనా క్రమం, లక్షలు కూడబెట్టడం, దాన్ని కోట్లకు పడగలెత్తించడం. దానికోసం బూర్జువా చట్టాల ఉల్లంఘనలు, ధనకాంక్ష అన్నీ అందులో అంతర్భాగాలు. బోనపార్ట్‌లాగే రామారావు కూడా అధికారం వచ్చిన నాటి నుండి 'ఉత్తర్వులతో, ఉత్తర్వులు లేకుండా ఉత్తర్వుల ఉల్లంఘన ద్వారా తన స్థితిని విజయవంతంగా సార్థకం చేసుకుంటున్నాడు.'

రామారావు నిజస్వరూపాన్ని విప్పిచెప్పగల తాళంచెవి అతని ప్రాతినిధ్యం వహించే ఉన్నతస్థాయి క్షీణవర్గం యొక్క జీవ లక్షణంలో ఉంది. 'హద్దూ పద్దూ లేని ధనకాంక్ష ఉత్పత్తి ద్వారా కాకుండా సంపదను కైంకర్యం చేసుకొనే ప్రయత్నాలు మోసం, దగా, వంచన, జూదాలతో మాత్రమే సంతృప్తి చెందగల ధనలాలసత, వగైరాలు అన్నీ దీని ప్రతిరూపాలు మాత్రమే. ఈ జీవలక్షణం ప్రాతిపదికపైన మాత్రమే రామారావు చర్యలను, చేష్టల్ని మనం సక్రమంగా అర్థం చేసుకోగలుగుతాం.

1983 జనవరి 9న రామారావు ముఖ్యమంత్రి అయ్యాడు. 'పవిత్రమైన' ప్రమాణ స్వీకారం రోజునే స్వంత రామకృష్ణా స్టూడియో ఫైలును నడపడంతో తన 'ప్రభుత్వ కార్యకలాపాలకు' శ్రీకారం చుట్టాడు. సినీ రంగంలో లక్షలార్జిస్తున్న తాను 'దైవప్రేరణ'తో శేష జీవితాన్ని తెలుగు ప్రజలకు అంకితం చేయడానికి వచ్చినట్టు ప్రకటించుకున్న రామారావు తొలినాడే స్వంత పనిలో నిమగ్నమైనాడంటే కొందరికి నమ్మశక్యం కానిదిగా వుంది. మరి కొందరికి దీన్ని వివరించడం ఎలాగో అర్థం కాకుండా వుంది. 'తమకు తాము లాభాలు సంపాదించుకోవడమే' ఏకైక లక్ష్యంగా గల ఈ ఉన్నతస్థాయి క్షీణ వర్గపు జీవ లక్షణం గురించి తెలిసిన వారికి అది సర్వసాధారణ విషయం మాత్రమే. ఈ వర్గపు ధనకాంక్ష ఎంతటి తీవ్రమైనదంటే అది 'స్వలాభం' కోసం అధికారాన్ని ఒక్క క్షణం కూడా వృధా చెయ్యదు.

అలాగే ఆదాయపు పన్ను ఎగగొట్టిన దానికంటే దాన్ని రామారావు సమర్థించుకున్న తీరు చాలా మందికి వింతగా తోచింది. స్టూడియో స్థలానికి విధించిన సొమ్మును తగ్గించుకోవడం, మూడు నివాసాలు మార్చి ప్రభుత్వ ధనాన్ని వినియోగించుకోవడం, పరిశ్రమల లైసెన్సులలో కుటుంబ సభ్యుల కోసం అడ్డదారులు తొక్కడం, తన సినిమా హాళ్లలో ఆటలు నిలుపుదల జరిగినందుకు రాయితీకై పడిన కక్కుర్తి వగైరాలన్నీ అధికార దుర్వినియోగాలేనని కోర్టు ధృవపరిచింది. ఇవన్నీ 'ఉత్తర్వులతో, ఉత్తర్వులు లేకుండా, ఉత్తర్వులు ఉల్లంఘన

చేసి' కోట్లు కూడబెట్టుకునే ఈ ధనలాలసత రామారావులోని ఉన్నత స్థాయి క్షీణ వర్గం యొక్క జీవ లక్షణం మాత్రమే.

అందుచేత రామారావును నడిపించేది ఈ ఉన్నతస్థాయి క్షీణవర్గం యొక్క జీవ లక్షణం మాత్రమే. అతని వేషాలు, అభినయాలు, అన్నీ అందులో అంతర్భాగాలు. రామారావు రాజకీయ రంగంలో దుస్సాహసికాలు"భారతదేశం పార్టీ అన్న భావన, ప్రతిపక్ష సంఘటన కోసం తపన, దేశానికి ఎగబ్రాకాలన్న దుగ్ధ. వీటన్నింటి వెనక ఈ క్షీణవర్గం యొక్క జీవలక్షణం. 'తమకు తాము లాభాలు చేకూర్చుకోవడం' అన్న మిక్కిలి పెద్ద లక్ష్యం వెన్నంటి వుంటుంది.

## 3. మత మౌఢ్యం, క్షుద్రతాంత్రిక మౌఢ్యం: సెక్యులరిజం :

ఇలాంటి బోనపార్టీకి గల వివిధ భావనలను మార్క్స్ ఇలా వివరిస్తాడు. 'బోనపార్ట్ స్వయంగా తానొక పాత భ్రష్టాచారి గనుక అతని దృష్టిలో జాతుల చారిత్రక జీవితము, వాటి రాజ్యకార్యకలాపాలు, ఒక వినోదాత్మక ప్రహసనం మాత్రమే. ఇంకా అశ్లీలమైన అర్థంలో చెప్పాలంటే అందులోని ఘనమైన దుస్తులు, మాటలు, అభినయాలు అన్నీ నీచాతినీచమైన దగా వంచనలకు ఒక ముసుగు మాత్రమే.'

రామారావు కూడా ఈ ప్రహసనాన్నే ప్రదర్శిస్తున్నాడు. ఇందులో తాను ధరించే 'ఘనమైన దుస్తులూ, మాటలూ, అభినయాలూ' అన్నీ తన నీచాతి నీచమైన దగా వంచనలకు ఒక ముసుగు మాత్రమే. యన్.టి.రామారావు విజయవాడ కాలేజీలో చదివే రోజులలో ఆర్ఎస్ఎస్ శాఖలో సభ్యుడిగా ఉన్నాడని జీవిత విశేషాలు రాసిన వారు విస్పష్టంగా ప్రకటించారు. ఆర్ఎస్ఎస్ నాటికీ నేటికీ హిందుమతాన్ని రాజకీయాలకు ఒక ముసుగుగా వినియోగించుకొంటున్నది. ఈ గురువును మించిన శిష్యుడు మాత్రం మతాన్ని కేవలం తన స్వీయ ప్రయోజనాలకు ముసుగుగా తగిలించుకున్నాడు.

కాషాయ వస్త్రాలు ధరించి తన దగ్గర బూడిద తప్ప ఏమీ లేదని ప్రకటించినా, పోతులూరి వీరబ్రహ్మం గారి సినిమా తీసి ఎన్నికల ముందు విడుదల చేసినా, వివేకానంద వేషం కట్టి తలబరువు పెట్టుకున్నా, ఇప్పుడు విశ్వామిత్ర సినిమాని హిందీలో తీసి వివిధ భాషలలో విడుదల చెయ్యాలని ఉబలాటపడుతున్నా, వీటన్నింటి వెనుకా ఆయనకు సన్యసించాలని గాని, స్వాముల తత్వాలను ప్రచారం చెయ్యాలని గాని, భారతజాతి వంశ వృక్షాన్ని వివరించడం గాని అసలు లక్ష్యం కాదని అందరికీ తెలిసిందే. ఈ తంతులో భాగమే తిరుపతిని వాటికన్ సిటీ

చేస్తాననడం, వేద విశ్వ విద్యాలయాన్ని ప్రారంభిస్తాననడం వగైరాలన్నీ. తానొక 'అతీత శక్తులు' గలవాడుగా రాష్ట్ర ప్రజలలో విశ్వాసాన్ని పెంపొందించడానికి, మతం ముసుగులో దేశ ప్రజల దృష్టికి ఎగబ్రాకడానికి ఇవన్నీ చౌకబారు ప్రయత్నాలు మాత్రమే.

ఇవన్నీ రాష్ట్ర ప్రజల్ని వంచించినట్లే ఇప్పుడు దేశ ప్రజల్ని వంచించడానికి భారత సింహాసనాన్ని అధిరోహించడానికి చేస్తున్న నీచమైన ప్రయోగాలు మాత్రమే. అంతకుమించిన విలువ వాటికి రామారావు ఏనాడు ఇవ్వలేదు. వాస్తవానికి రామారావుకి మతం మీద కంటె మూఢ విశ్వాసాల మీద నమ్మకం ఎక్కువ. అతని మనసు అంధ విశ్వాసాలకు పుట్ట. పైశాచిక తంత్ర విద్యలకు నిలయం. ఒక జ్యోతిష్కుని మంత్రిని చేసుకుని మంత్రాంగం చేస్తున్నాడు. జ్యోతిష్యాన్ని 'ఒక శాస్త్రం'గా పాఠ్యాంశం చేస్తానన్నాడు. శవయాగాలు, చెవి పోగులు, చీర కట్టడం వగైరాలన్నీ అతని మూఢత్వానికి అద్దం పడతాయి. అంకెలతో భవిష్యత్తుని నిర్ణయించుకుంటాడు.

కుర్చీ గండం వుందని చిలక జోస్యం చెబితే నిర్లజ్జగా బహిరంగ వేదికల మీద కుర్చీలను వదిలేసి క్రింద కూర్చుంటాడు. (పవర్ గండం ప్రాణప్రదమైంది కదా.) ఇతను అవతార పురుషుడు కాదని, అజ్ఞాన శిఖామణి అని చెప్పడానికి ఇంతకంటే తార్కాణాలు అక్కరలేదు. మతం వేరు, మూఢ విశ్వాసాలు వేరు, మూఢ విశ్వాసాలు మతానికంటే ప్రమాదకరమైనవి, క్షుద్రమైనవి, జుగుప్సాకరమైనవి. సెక్యులరిజానికి వీటికి మధ్య పొంతన కుదరదు. సెక్యులరిజం అనేది అత్యంత ఆధునికమైన భావన. అది మతాన్ని, మూఢ విశ్వాసాలను ప్రభుత్వ కార్యకలాపాల నుండి, రాజకీయ కార్యకలాపాల నుండి వేరు చేస్తుంది. వ్యక్తులకు వున్న మత స్వేచ్ఛను మాత్రమే గౌరవిస్తుంది. అంధ విశ్వాసాల పుట్టగా ఉన్న రామారావు ఈ ఆధునికమైన సెక్యులర్ భావనకు జేరడానికి ఆకాశం అంత ఎత్తు ఎదగాల్సి ఉంది.

## 4. వెయ్యి హిట్లర్లను దాచుకోగల దుస్సాహసం

మనం బూర్జువా ప్రజాస్వామ్యంలో వున్నాం. ఈ ప్రజాతంత్ర సంస్థలను మరింత పటిష్టం చెయ్యాలని, దీన్ని మరిన్ని రంగాలకు విస్తృత పరచాలని, ప్రజాతంత్ర జీవనంలో ప్రజల్ని భాగస్వాములను చేసే ఆర్థిక, సామాజిక సంస్కరణలను కోరే వారిని ప్రజాతంత్ర వాదులుగా పరిగణిస్తాం 'తమకు తాము లాభాలు చేకూర్చుకోవడమే మిక్కిలి పెద్ద లక్ష్యం'గా గల ఉన్నత స్థాయి క్షీణ వర్గానికి

ప్రజాస్వామ్యంలో పొత్తు కుదరదు. వ్యక్తి స్వార్థమే పరమార్థంగా భావించే వర్గలక్షణం గల వారికి నియంతృత్వమే రాచబాటగా వుంటుంది. ఈ వర్గపు జీవలక్షణాన్ని పుణికి పుచ్చుకున్న రామారావుకు నియంతృత్వమే శిరోధార్యం. అయితే ప్రస్తుత వ్యవస్థ పరిమితుల్లో ఆయన చెయ్యగలిగింది ప్రజాస్వామ్యాన్ని కుదించడం, నియంతృత్వానికి దారులు వెయ్యడం మాత్రమే.

'అతీత శక్తులు' గల నాయకునిగా ప్రజలు భ్రమించడానికి రామారావు ఒక కొత్త పూజా పద్ధతిని ప్రవేశపెట్టాడు. రక్త తిలకాలతో ప్రారంభించి పాద పూజల దాకా దానిని విస్తృతపరిచాడు. ముందుగా పార్టీ లోపల ప్రజాస్వామ్యానికి స్వస్తి చెప్పాడు. తానే సర్వాధికారిగా పార్టీ నిబంధనావళి సవరించుకున్నాడు. చేతులెత్తే కార్యవర్గాన్ని, దానికి అల్లుణ్ణి కార్యదర్శిగా పెట్టుకున్నాడు. పార్టీ ఆస్తుల్ని కుటుంబ సభ్యుల ట్రస్టులు చేశాడు. వ్యక్తి పూజను తీవ్రస్థాయిలో సాగించడానికి సర్కారు సొమ్ముతో 'తెలుగు సమాచారం' పత్రికను ప్రచార బాకా చేసి, దానినిండా రంగుల ఫొటోలతో సొంత డబ్బా వాయించుకుంటున్నాడు. ఈ పత్రిక అమ్మకం ధరను తూకం ధరకంటే తక్కువ చేసి లక్షల సర్క్యులేషన్‌తో గోబెల్స్ ప్రచారానికి పూనుకున్నాడు.

మంత్రి వర్గానికి పైన అల్లుణ్ణి రాజ్యాంగేతర వ్యక్తిగా పెట్టాడు. ఇప్పుడు కర్షక పరిషత్‌ను సృష్టించి దాని అధ్యక్ష పదవిని కట్టబెట్టి దాదాపుగా అన్ని మంత్రిత్వ శాఖలను చట్టబద్ధంగా ఈ రాజ్యాంగేతర వ్యక్తి అధీనం చేశాడు. మరొక అల్లుణ్ణి మంత్రివర్గంలో పెట్టుకున్నాడు. ఆచరణలో రాష్ట్రంలో సాగుతున్నది మామా, అల్లుళ్ల పాలన మాత్రమే. గండిపేట నిర్ణయాలే మంత్రివర్గ నిర్ణయాలుగా చలామణి అవుతున్నాయి. అయితే ఈ నిర్ణయాల వెనుక మాత్రం ఈ క్షీణ వర్గ జీవ లక్షణం అయిన 'ధనం, కుళ్ళు, రక్తం' కలగలిసి వుంటున్నాయి. రాష్ట్రంలో ప్రజాస్వామిక సంస్థలు రద్దు చెయ్యబడుతున్నాయి. యూనివర్శిటీ సెనేటు దగ్గర నుండి కర్షక పరిషత్ వరకు నామినేషన్లతో నింపబడుతున్నాయి. శాసనసభల సమావేశ కాలం కుదించబడింది. ఎన్నికైన జిల్లా ప్రజా పరిషత్తులపై సమీక్షా మండలి నిరంకుశ పెత్తనం రుద్దబడింది.

నిరంకుశత్వానికి పరాకాష్టగా తన పుత్రరత్నాన్ని వారసుణ్ణి చెయ్యాలని ఉబలాటపడ్డాడు. పోలీసు బిల్లు, ప్రెస్ బిల్లుల ద్వారా ప్రజా జీవనాన్ని గుప్పెట్లో పెట్టుకోవాలని ప్రయత్నించాడు. తీవ్ర విమర్శలు రావడంతో తాత్కాలికంగా వెనకడుగు వేశాడు.

అన్ని స్థాయిల్లోనూ పచ్చ చొక్కాల పాలన ప్రవేశపెట్టాడు. గ్రామీణ జీవితాన్ని ప్రజాతంత్రం చేసే భూసంస్కరణలకు ఎగనామం పెట్టాడు. కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల మీద నల్లచట్టాలతో విరుచుకుపడ్డాడు. కక్ష సాధింపులో నియంతలాగ వ్యవహరించాడు.

'నేనే ప్రజలు' 'ఆరు కోట్ల మందికి ప్రతినిధిని' అంటూ రామారావు రాష్ట్ర ప్రజల పాలిట హిట్లర్ కావడానికి సర్వ సన్నాహాలు చేసుకుంటున్నాడు. గండిపేట పార్టీ శిక్షణాలయంలో హిట్లర్ పద్ధతుల్ని పాఠ్యాంశం చేశాడు.

తెలుగు సమాచారంలో హిట్లర్ బొమ్మను ముద్రించి బహిరంగ ప్రచారానికి పూనుకున్నాడు. 'రామారావు గుండెల్లో వెయ్యి హిట్లర్లు దాగివున్నారని' కొందరు చేసే ఆరోపణలను అతిశయోక్తిగా కొట్టిపారెయ్యకూడదు. ఈనాటి సభ్య ప్రపంచంలో హిట్లర్‌ను తవ్వి తలెత్తుకోవడానికి ఎవరూ సాహసించలేకపోతున్నారు. కాని రామారావు అలాంటి సాహసం చేస్తున్నాడంటే ఆయన గుండెల్లో ఎంతమంది హిట్లర్లు దాగివుంటారో అర్థం చేసుకోవచ్చు. ఉన్నతస్థాయి క్షీణవర్గం ప్రతినిధి అయిన రామారావు ఇలాంటి రాజకీయ దుస్సాహసాలకు దిగడంలో ఆశ్చర్యపడాల్సింది ఏమీలేదు. దీని పర్యవసానంగానే రాజకీయాలలో భయోత్పాతం, దౌర్జన్యాలు, మాఫియా హత్యలు ప్రవేశ పెట్టబడ్డాయి. 'చిన్న కుక్కనైనా పెద్ద కర్రతో కొట్టండి.' 'కర్రలు చేతబూనండి" అని రామారావు స్వయంగా కార్యకర్తలకు పిలుపు యివ్వడం, పోలీసు ఉన్నతాధికారుల చేత అది నేరం కాదని చెప్పించడం యివన్నీ ఈయన ఎటు ప్రయాణిస్తున్నది సూచిస్తున్నాయి. ఈయన ప్రజాతంత్రవాది కాకపోగా యధాతథవాది కూడా కాదు. మొత్తం కాల గమనాన్ని వెనక్కి తిప్పాలనే తిరోగమనానికి, పచ్చి నిరంకుశ హిట్లర్ పద్ధతుల కోసం తహతహలాడుతున్న నియంతృత్వ శక్తి మాత్రమే.

## 5. పచ్చి అభివృద్ధి నిరోధకత్వానికి వికృత రూపం

భారతదేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు వున్నాయి. వాటికి కూడా పలుకుబడి గలిగిన నాయకులున్నారు. అందులో కొమ్ములు తిరిగిన అభివృద్ధి నిరోధకులు ఉన్నారు. తమ ప్రాంతం వేరు కావాలని కోరే ప్రమాదకారులున్నారు. కాని వారెవ్వరూ లేవనెత్తడానికి సాహసించని నినాదాలను రామారావు మాత్రమే లేవనెత్తాడు. 'కేంద్రం ఊహాత్మక మిధ్య' అన్నాడు. 'జాతీయ పార్టీలు దండుగ' అన్నాడు. 'ప్రాంతీయ పార్టీలే శరణ్యం' అన్నాడు. మన విదేశాంగ విధానం 'తొత్తు

విధానం' అన్నాడు. ఇలాంటి దుస్సాహసికమైన, విద్రోహకరమైన నినాదాలను రామారావే ఇవ్వడానికి గల కారణాలు పరిశీలించాలి.

దేశంలో వివిధ ప్రాంతీయ పార్టీలు, వాటి నాయకత్వం ఒక సాధారణ రాజకీయ సన్నివేశంలో ప్రాంతీయ సమస్యల ప్రాతిపదికపై అభివృద్ధి చెందాయి. వాటి నినాదాలకు పరిమితులు వాటి పుట్టుకలోనే విధించబడ్డాయి. కాని తెలుగుదేశం పార్టీ వీటికి భిన్నంగా సమ్మోహన శక్తులకు రాజకీయ రంగం సిద్ధం అయిన అసాధారణ పరిస్థితులలో ఏర్పడిన వ్యక్తి సర్వాధికారాలుగల 'రాజకీయ హీరో'ని నాయకుణ్ణి చేసింది. ఈ 'రాజకీయ హీరో' సాధారణ రాజకీయ నాయకులకు భిన్నమైన లక్షణం గలవాడు. 'హద్దూ పద్దూ లేని ధనకాంక్ష'కు బూర్జువా సమాజపు ఉన్నతస్థాయి క్షీణవర్గానికి ఇతడు ప్రతినిధి. రామారావు రాజకీయ దుస్సాహసికాలకు అతని క్షీణవర్గ జీవ లక్షణమే మూలకారణం. ఇదే అతని గుండెల్లో వెయ్యి హిట్లర్లకు జన్మకారణం. ఈ జీవ లక్షణం గల వానికి రాష్ట్ర రాజకీయ అధికారం ఇరుకుగా కనిపిస్తుంది. సూర్యుని ముందు దివిటీలాగ ప్రధాని ముందు ముఖ్యమంత్రి పదవి భరించరానిదవుతుంది. హిట్లర్ తన దుస్సాహసికం ద్వారా ప్రపంచాధిపత్యం పొందాలని ప్రయత్నిస్తే 'చిట్టి హిట్లర్' దేశాధిపత్యం కోసం తహతహలాడతాడు. రామారావు దుస్సాహసిక నినాదాల వెనక వున్న అసలు లక్ష్యం యిదే. దాన్ని సాధించడం కోసమే ముందుగా 'కేంద్రాన్ని మిధ్య' చేశాడు.

రాష్ట్రాలు లేకపోతే కేంద్రానికి ఎల్లలు లేవన్నాడు. ఎల్లలు లేని ప్రాంతానికి చెందిన 'జాతీయ పార్టీలు దండగ' అన్నాడు. రాష్ట్రాలే వాస్తవం. ప్రాంతీయ పార్టీలే సత్యం. ప్రాంతీయ పార్టీల సమాఖ్యే దేశానికి శరణ్యం అన్నాడు. ప్రాంతీయ పార్టీలకు స్థానిక అధికారాలతోపాటు దేశ రాజకీయాధికారాన్ని కట్టబెట్టే మొనగాడుగా ఈ శక్తులకు నాయకత్వం వహించడానికి వీలైన దుస్సాహసిక నినాదాలను ముందుకు తెస్తున్నాడు.

దేశ సమైక్యతకు, సమగ్రతలకు, విచ్ఛిన్నకర శక్తుల నుండి, మతోనాదశక్తుల నుండి తీవ్ర ప్రమాదం ఎదురౌతున్న తరుణంలో 'కేంద్రాన్ని మిధ్య' చేసి దేశంలో ప్రాంతీయ పార్టీల విజృంభణకు, విచ్ఛిన్నకర శక్తుల తోడ్పాటుకు వీలైన నినాదాలను ముందుకు తెస్తున్నాడు. దేశంలో ఒకే పార్టీ, ఒకే జెండా, ఒకే గుర్తు, ఒకే అభ్యర్థి వుండే ఫెడరల్ పార్టీ అనే సమస్త అభివృద్ధి నిరోధకుల వేదిక ఏర్పాటుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడు.

ఈ దుస్సాహసిక నినాదం ఫలిస్తుందా.. జాతీయ పార్టీలు గంగలో కలుస్తాయి.

మిగిలిన ప్రాంతీయ పార్టీల సమాఖ్య సరసన చేరతాయి. వాటి నాయకుడుగా రామారావు ఢిల్లీ కోటలో పాగా వేస్తాడు. ఇది వికటిస్తే దేశం విచ్ఛిన్నం అవుతుంది. అప్పుడు రాష్ట్రాలు 'దేశాలు'గా మారిపోతాయి. ముఖ్యమంత్రులే ప్రధానులు అవుతారు. సామ్రాజ్యం చిన్నదైనా చక్రవర్తి స్థానం లభిస్తుంది.

దేశంలో విచ్ఛిన్నకర శక్తులను పోగు చేసి, ప్రాంతీయ శక్తులను పైచెయ్యి చెయ్యదలచుకున్నవాడు అంతర్జాతీయంగా భారతదేశాన్ని బలహీనపరచాలనే శక్తుల గూటిలోకే చేరతాడు. ఆ సజాతి పక్షుల కూతలే కూస్తాడు. అమెరికా ప్రభువుల కితాబులు కోసం దేశంలోని అభివృద్ధి నిరోధకులు ఏనాడూ సాహసించని రీతిలో మన విదేశాంగ విధానాన్ని 'తొత్తు విదేశాంగ విధానం' అనే దుస్సాహసానికి పూనుకున్నాడు. భారతదేశంలో సకల ప్రతి పక్షాలను సంఘటిత పరుస్తున్న మహా నాయకుడుగా అమెరికా గడ్డ మీద పొగడ్తలందుకున్నాడు.

ఇలా సామ్రాజ్యవాదులకు తొత్తుగా దేశంలోని సమస్త అభివృద్ధి నిరోధక వేర్పాటువాద, మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులకు ప్రాంతీయ శక్తులకు మేటి నాయకుడుగా రామారావు దేశ రాజకీయాలలోకి ఎగబ్రాకడానికి అత్యంత ప్రమాదకరమైన దుస్సాహసిక మార్గాలకు ద్వారాలు తెరిచాడు.

ఇప్పుడు మనం రామారావు నిజ స్వరూపాన్ని మరింత నిర్దిష్టంగా నిర్వచించుకోవాలి. రామారావు పెట్టుబడిదారీ సమాజంలోని సర్వసాధార ణమైన అభివృద్ధి నిరోధకత్వానికి ప్రతినిధి కాదు. దీన్ని మనం స్పష్టంగా రామారావు బూర్జువా సమాజపు శిఖరాగ్రంలో తలెత్తిన క్షీణ వర్గానికి ప్రతినిధి. ఇది పెట్టుబడిదారీ అభివృద్ధి నిరోధకత్వానికి ఒక వికృత రూపం. 'వెయ్యి హిట్లర్‌లను గుండెల్లో దాచుకోగల' శక్తి కలిగిన వికృత రూపం. ధనం, కుళ్లు, రక్తం కలగలిసిన వికృత రూపం. తమకు తాము లాభాలు చేకూర్చుకోవడానికి ఎలాంటి దుస్సాహసి కాలకైనా తలపడే క్షుద్రమైన వికృతరూపం. ఇలాంటి అభివృద్ధి నిరోధక వికృత రూపానికి ప్రతినిధి రామారావు. దేశంలోని ఇతర అభివృద్ధి నిరోధక రాజకీయ పార్టీలు ఇవ్వడానికి సాహసించని వికృతమైన, దుస్సాహసికమైన నినాదాలను రామారావే ఇవ్వడానికి నిస్సందేహంగా ఈ క్షీణ వర్గం యొక్క జీవ లక్షణమే కారణం.

## ఏడవ అధ్యాయం

# రామారావు రాజకీయ భవిష్యత్తు

**1. క్షీణవర్గపు ఆర్థిక విజ్ఞానం : విరాళాలు, రుణాలు**

**2. అవతార పురుషుని మంత్ర శక్తులు**

**3. అపర విశ్వామిత్రుని త్రిశంకు స్వర్గం**

రామారావుకు రాజకీయ జన్మనిచ్చి, దైవాంశ సంభూతుణ్ణి చేసిన ఆంధ్రప్రదేశ్‌లో ఆయన భవిష్యత్తును గురించి పరిశీలించుదాం.

1983 ఎన్నికలకు ముందు రామారావు రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించాడు. దారిలో ఎదురైన ప్రతి సమస్యనూ డైలాగులతో చీల్చి చెండాడాడు. అన్ని జిల్లాలకు చిన్నవీ, పెద్దవీ పరిశ్రమలు, ప్రాజెక్టులు ప్రచార దానంగా యిచ్చాడు. అన్ని వర్గాల ప్రజలకి వరాల వర్షం కురిపించాడు. రాజవీధులలో రత్నాలు అమ్మిన గత తెలుగు ప్రాభవాన్ని తిరిగి పాదుకొల్పుతానని ప్రగల్భాలు పలికాడు.

లూయీ బోనపార్ట్‌కి లాగే రామారావుకు కూడా అధికారంలోకి రాగానే కాంగ్రెస్ వ్యతిరేకశక్తి వెనుక వున్న పరస్పర విరుద్ధ శక్తులను తృప్తిపరిచే కార్యభారం మీదపడింది. బోనపార్ట్‌లాగే రామారావు కూడా తనకు తాను ఏకకాలంలో రైతుల ప్రతినిధిగా, క్రింది వర్గాల ప్రజలను సుఖవంతులను చేయాల్సిన వాడుగా తనకు తోడ్పాటునిచ్చిన సంపన్న వర్గాలను సంతృప్తి పరిచేవాడుగా పరిగణించుకుంటాడు. అలాగే బోనపార్ట్ లాగే రామారావుకి కూడా 'తమకు తాము లాభాలు చేకూర్చుకోవడం' అన్న మిక్కిలి పెద్దదైన క్షీణవర్గ లక్షణం వుండనే వున్నది.

## 1.క్షీణవర్గపు ఆర్థిక విజ్ఞానం : విరాళాలు, రుణాలు

బోనపార్ట్ ఆర్థిక విజ్ఞానం గురించి మార్క్స్ ఇలా చెప్పారు. 'బహుమతి రూపంలో ధనం, రుణ రూపంలో ధనం పొందే అవకాశాలను చూపించి జన సామాన్యాన్ని ప్రలోభపెట్టాలని బోనపార్ట్ ఆశించాడు. భ్రష్ట బికారి, గాలి మూక యొక్క ఆర్థిక విజ్ఞానశాస్త్రం (ఆ మూక ఉన్నతస్థాయికి చెందినదైనా, నిమ్నస్థాయికి చెందినదైనా) విరాళాలు, రుణాలు – అనే రెండింటికే పరిమితం. బోనపార్ట్ వినియోగించగల

వనరులు సైతం ఆ రెండే. ఉన్నతస్థాయి భ్రష్టవర్గ ప్రతినిధిగా రామారావు కూడా ఆ రెండు వనరులతోనే ప్రజల మూఢత్వం మీద జూదమాడడం ప్రారంభించాడు. 'అన్ని వర్గాల ప్రజలు తనను పితృ తుల్య హితైషిగా పరిగణించాలని బోనపార్ట్ కోరుకుంటాడు. కాని అతను ఒక వర్గం నుండి తీసుకోకుండా ఇంకొక వర్గానికి యివ్వలేడు' అని మార్క్స్ అంటారు. అలాగే రామారావు తనను 'ఆరు కోట్ల ప్రజలు అన్నగా భావించాలని కోరుకుంటాడు. పేద వర్గాలకి బహుమతి రూపంలో ధనం ఇవ్వాలి. అదే సమయంలో ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గానికి, గ్రామీణ సంపన్న వర్గాలకి నొప్పి తగలకూడదని భావిస్తాడు. ఈ పరస్పర విరుద్ధమైన ఆకాంక్ష నెరవేర్చడానికి వీలుగా రాష్ట్ర ఆర్థికవ్యవస్థను చిన్నాభిన్నం చెయ్యడానికి పూనుకున్నాడు.

తన పుర్రెలో పుట్టిన పథకాలకు నిధులు సమకూర్చడానికి వీలుగా రాష్ట్ర పురోభివృద్ధికి కీలకమైన విద్యుచ్ఛక్తి, పరిశ్రమలు, నీటిపారుదల, వ్యవసాయ రంగాలకు అంట కత్తెర వేశాడు. దీన్ని వేలెత్తి చూపిన వాళ్ళ మీద విరుచుకుపడ్డాడు. 'విద్యుచ్ఛక్తిలో, ధాన్యం ఉత్పత్తిలో మన రాష్ట్రం మిగులులో వుంది. ఇతర రాష్ట్రాల అవసరాల కోసం, కేంద్ర నిల్వల కోసం, మనమెందుకు ఖర్చు చెయ్యాలని' వాదించాడు. (తెలుగుగంగ ఈ వైఖరికి సడలింపు మాత్రమే. రాయలసీమకు అపర భగీరధుడు కావాలన్న కీర్తి కోసం, దేశ రాజకీయాలలో, తమిళులను ఆకట్టుకోవడం వగైరాలు యిందులో యిమిడి వున్నాయి. ఈ పథకాన్ని కూడా కోతి పుండు బ్రహ్మరాక్షసిగా చేసిన ఘనత కూడా రామారావుదే.)

రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన రంగాల నుండి తరలించిన నిధులతో చిలువలు పలవలుగా ప్రారంభమైన సంక్షేమ పథకాలలో ఒక్క బియ్యం పథకం మాత్రమే గుడ్డిలో మెల్లగా నడుస్తున్నది. ఇళ్ళ పథకం నత్తనడక పట్టింది. వివిధ పెన్షన్ల పథకాలు ప్రారంభ జాబితాలతో సరిపుచ్చుకున్నాయి. మిగిలిన పథకాలు కోట్లను దిగమింగి చతికిలపడ్డాయి.

దుబారా ఖర్చులతో, పనికిమాలిన చిట్కా ప్రయోగాలతో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశాడు. యన్.జి.వోలపై చేసిన దాడి, కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ రద్దు, గ్రామాధికార్ల తొలగింపులో చేతకానితనం, సీసాల్లో 'వారుణ వాహిని' పథకం కొన్ని వందల కోట్ల రూపాయలను వృథా చేశాయి. 1100 మండలాల ఏర్పాటు తల బరువై కూర్చుంది. ఈ దుబారా చాలదన్నట్టు పేను లాంటి పథకాలకు ఏనుగంత రూపం ఇచ్చి నిలువెత్తు బొమ్మలతో ప్రచార ప్రకటనల కోసం, సొంత ప్రచార బాకాగా

తెలుగు సమాచారం లాంటి తెల్ల ఏనుగుల ఖర్చులు తడిపి మోపెడు భారాన్ని తగిలించాడు.

కీలక రంగాలకు కోత పెట్టినప్పటికీ రామారావు తన సర్వ దుంబాలా ఆర్థిక విధానాన్ని సాగించడం రెండేళ్ళలోనే అసాధ్యమైంది. 'పెట్టే వారినే కొట్టు' అన్న విధానాన్ని ప్రారంభించాడు. బస్సు చార్జీలు పెంచాడు. విద్యుత్ చార్జీలు పెంచాడు. పాల ధర పెంచాడు. ఒక చేతితో పేదలకు బియ్యం పథకం, బట్టల పథకం అమలు చేస్తూనే దానికి వడ్డీతోసహా సారా ధరను పెంచడం ద్వారా రాబట్టాడు. రైతులకు నామమాత్రంగా 15 రూపాయల మెట్ట శిస్తును తగ్గించిన చేతితోనే 150 రూపాయల నీటి తీరువాను పెంచాడు. సేల్స్ టాక్స్, ఎంట్రీ టాక్స్‌లతో ప్రజల మీద భారాన్ని పెంచాడు. ఇలా పృష్టం కింద మంట పెద్దది చేస్తూ శిరస్సు మీద సంక్షేమ పథకాల వానజల్లు కురిపించాడు.

ఈ వడ్డింపులు కూడా రామారావు సర్వదుంబాలా ఆర్థిక పద్ధతుల్ని రక్షించ లేకపోయాయి. ఇప్పుడు రామారావు తన కడపటి ఆయుధాన్ని బైటకు తీశాడు. ఇక మీదట 'ఎవరి పథకాలకు వారే కర్తలట'. 'రైతులంతా కర్షక పరిషత్తులో చేరండి మీ కర్మకు మీరే కర్తలుకండి', 'బ్రిడ్జీలు నిర్మించుకోండి – టోల్ గేటు రుసుము వసూలు చేసుకోండి', 'సహకార కాలేజీలు తెరవండి – తల్లిదండ్రులే చదివించుకోండి', 'రైతుల విరాళాలతో కాల్వల తవ్వకం' వగైరా పథకాలు ప్రకటించడం ప్రారంభించాడు.

అయినా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి దివాళాకు వచ్చింది. చెల్లించలేని బిల్లులు 500 కోట్లకు పెరిగిపోయాయి. ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తే టి.ఎ.లు మిగిలిపోతున్నాయి. ప్రభుత్వ వాహనాలకు పెట్రోలు వుండడం లేదు. దేవాలయాల సొమ్ముతో సహా ఎక్కడి సొమ్మునైనా ప్రభుత్వ ఖజానాకు తరలించాడు. ప్రభుత్వ స్థలాలను అమ్మకానికి పెట్టాడు. ప్రభుత్వ పరిశ్రమలు వేలం వేస్తున్నాడు. ప్రభుత్వ ఆస్పత్రులలో సగం ప్రైవేటు వ్యాపారానికి తెరిచిపెట్టాడు. విద్యుత్ శాఖలో, ఆర్.టి.సి.లో ప్రైవేటు వ్యక్తులకు ద్వారాలు తెరిచాడు. రామారావు ప్రభుత్వం టోకుగా, చిల్లరగా ప్రైవేటు వ్యక్తులకు లీజుకు యిచ్చే స్థితికి తెచ్చాడు. ఇవన్నీ అదుపు తప్పిన ప్రభుత్వ ఆర్థికస్థితిని సూచిస్తున్నాయి. ఏతావాతా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుక్కలు చింపిన విస్తరిజేశాడు.

ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అక్షరాల అంధకార బంధురంగా వుంది. దారుణంగా విద్యుత్ కోత విధించబడింది. క్రొత్త పరిశ్రమల మాట దేవుడు ఎరుగు,

ఉన్న పరిశ్రమలు మూతకు వస్తున్నాయి. ఈ అయిదేళ్ళలో 12 లక్షల మంది అదనంగా నిరుద్యోగులయ్యారు. ఇప్పుడు ఈ అపర విశ్వామిత్రుని సృష్టి అయిన విద్యుత్ కోత పొదుపు చర్యలతో ఈ నిరుద్యోగ సైన్యం శరవేగంతో పెరిగిపోతున్నది. రైతులు, కార్మికులు, పేద వర్గాల ప్రజలకు ఈ ప్రభుత్వం బహుమతుల రూపంలో ఇచ్చేది చారెడు కాగా, దోచేది మాత్రం గంపెడు అయింది. అన్ని రంగాలలోనూ, అస్తవ్యస్థ పరిస్థితి నెలకొంటున్నది. ఇంత జరుగుతున్నప్పటికీ బోనపార్ట్ లాగే రామారావు కూడా తన క్షీణవర్గ లక్షణమైన 'తమకు తాము లాభాలు సంపాదించుకునే మిక్కిలి పెద్ద లక్ష్యాన్ని' మాత్రం నిరాఘాటంగా సాగిస్తున్నాడు. రాష్ట్రంలో 'నభూతో నభవిష్యతి' అన్నట్టుగా అవినీతి చక్రవర్తిగా 'కీర్తి కిరీటాన్ని' సంపాదించుకున్నాడు. బోనపార్ట్‌లాగే 'ఉత్తరువులతో, ఉత్తరువులు లేకుండా, ఉత్తరువులు ఉల్లంఘనం చేసి' అవినీతికి అధికార దుర్వినియోగానికి పాలు పడ్డాడని హైకోర్టు సర్టిఫికెట్లు కూడా పుచ్చుకున్నాడు.

రామారావుకు కూడా బోనపార్ట్‌కు ఎదురైన పరిస్థితులే తటస్థపడుతున్నాయి. 'బోన పార్ట్ ముందు ఇటువంటి పరస్పర విరుద్ధమైన కార్యభారం వున్న కారణంగానే అతని ప్రభుత్వంలో పరస్పర వైరుధ్యాలున్నాయి. అది అంధకారంలో గందర గోళంగా తడువులాడుకుంటున్నది. ఒక మారు ఒక వర్గాన్ని, వేరొక మారు వేరొక వర్గాన్ని అవమానించి, వీటన్నింటినీ ఒకే విధంగా తనకు వ్యతిరేకం చేసుకుంది' అని కార్ల్ మార్క్స్ అంటారు. రామారావు కూడా ఒకమారు ఒకవర్గాన్ని, మరొకమారు మరొక వర్గాన్ని అవమానించి వాటిని తనకు వ్యతిరేకం చేసుకుంటున్నాడు.

## 2. అవతార పురుషుని మంత్రశక్తులు

రాజకీయాలలో 'అవతార పురుషుడు'గా తన స్థానాన్ని కాపాడుకోవడానికి బోనపార్ట్ లాగే రామారావు కూడా 'ప్రజాదృష్టిని ఆకర్షింపజేసుకోవలసిన అవసరానికి వశీభూతుడై', 'కొత్త కొత్త ఇంద్రజాలిక చర్యలు' కోసం రోజుకొక కొత్త నినాదాన్ని లేవనెత్తాల్సిన స్థితికి నెట్టబడ్డాడు. తన ప్రజాకర్షణ శక్తి తగ్గలేదని చూపించడానికి మహానాడు జాతరలోనూ, అందులో జంతు ప్రదర్శనలు, ఎడ్ల పందేలు, వింతలూ, వినోదాలతో కూడిన మాయాబజార్‌ను సృష్టించి ప్రజల్ని వంచించాలని చూస్తున్నాడు.

ఇన్ని తంటాళ్లు పడుతున్నప్పటికీ రామారావు రాజకీయ రంగంలో 'అవతార

పురుషుడు'గా తన స్థానాన్ని నిలబెట్టుకోగలుగుతాడా? తెలుగుదేశం పార్టీని పెట్టిన 10 నెలలలోగానే రాజకీయ అధికారాన్ని కైవసం చేసుకొని 'పరమాద్భుతాన్ని' సృష్టించిన 'అతీత శక్తులు గల' వాడిగా ప్రజల్ని ఆకట్టుకొన్న 'ఇంద్ర జాలికుడుగా భ్రమింపజేసిన ఈ 'రాజకీయ మాంత్రికుడు' తన 'మంత్ర శక్తిని' నిలబెట్టుకో గలుగుతాడా? అన్న ప్రశ్నలు మిగిలి ఉండడం సహజం.

రాజకీయాలలోకి రాకముందు రామారావు సమస్త కథా నాయకుల పాత్రలనూ అవలీలగా పోషించగల ప్రముఖ సినీనటుడు మాత్రమే. నట జీవితంలోనూ చీకటి వెలుగులు వున్నాయి. ఆయన ప్రతి చిత్రమూ శత దినోత్సవాలు జరుపుకోలేదు. రామారావును నమ్ముకున్న నిర్మాతలందరికీ పట్టిందల్లా బంగారమూ కాలేదు. దైవ-పాత్రలలో నటించిన ఆయన బొమ్మలను పూజించిన వారు వున్నారు. అలాగని రామారావుని 'దైవాంశ సంభూతుణ్ణి' చేసి ఆయన నటించిన ఎలాంటి పాత్రల బొమ్మలనైనా పూజించనూ లేదు. అయితే సినీ నటుడుగా ఆయన ప్రజలకు సుపరిచితుడు. వెండి తెర మీద మనిషిని నిండు సభలో చూడాలన్న జనాకర్షణ కలవాడు. వివిధ వర్గాల పాత్రలను నటించి అన్ని వర్గాల ప్రజలకూ ఒకడే కథానాయకుడైన వికృతం పొందివున్నాడు.

సుదీర్ఘమైన అయన 'నట జీవితంలో నట చక్రవర్తి', 'నట సార్వభౌమ', 'నటరత్న' అన్న బిరుదులు పొందాడు గాని, ఆయన సినీ జీవితంలో ఏనాడూ ఎవరూ ప్రేక్షకుల పాలిట 'సినీ మాంత్రికుడు'గా శతదినోత్సవాలు జరిపించగల 'అతీత శక్తులు' గలవాడుగా, నిర్మాతల పాలిట 'అవతార పురుషుడు'గా చిత్రించడానికి సాహసించలేదు. కాని, రామారావు రాష్ట్ర రాజకీయ రంగంలో మాత్రం 'అవతార పురుషుడు'గా అడుగుపెట్టాడు. 'అతీతశక్తులుగల' వాడుగా 'రాజకీయ మాంత్రికుడుగా' ప్రచారం అయ్యాడు. రామారావుకు లేని ఈ మంత్రశక్తిని' ఎలా సంపాదించుకున్నది పరిశీలించుకుందాం.

రామారావు రాజకీయ రంగ ప్రవేశం చేసే నాటికే రాష్ట్రంలో 'కాంగ్రెస్ వ్యతిరేకత' ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా తయారైవున్నది. స్వతంత్ర శక్తిగా అని ఎందుకంటున్నాను అంటే దాన్ని పెంచి పోషించిన రాజకీయ పార్టీల ఆధీనంలో అది లేదు. పైగా అది ఎవరిని వరిస్తే వారు 'అధినేతలు' అయ్యే స్థితిలో వుంది. ఇది విశాఖలో బి.జె.పి.ని, విజయవాడలో కమ్యూనిస్టుల్ని, చీరాలలో జనతాని వరించింది. ఆ పార్టీల బలాబలాలు కంటే ఈ 'కాంగ్రెస్ వ్యతిరేక' రాజకీయ శక్తి తన 'మంత్రబలం'తో వారిని గెలిపించింది.

ఇక రెండవది రామారావు రాజకీయ రంగ ప్రవేశం నాటికి అభివృద్ధి చెందివున్న ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీవర్గం. ఇది తన వర్గ రాజకీయాధికారాన్ని సంపాదించుకోవడాన్ని ఒక 'మంత్ర శక్తిగల రాజకీయ కళను' నేర్చుకున్నది. విభజనోద్యమంలో ఈ కళను ప్రదర్శించింది. ఈ ప్రాంతీయ భూస్వామిక బూర్జువావర్గం తనవర్గ ప్రయోజనాలకు పరిస్థితులు పరిపక్వమైనప్పుడల్లా కాంగ్రెస్ పార్టీతో సహా సమస్త బూర్జువా పార్టీల వెనుక గల తన బలగాలన్నింటిని 'మంత్రశక్తితో' సమీకరించినట్టుగా క్షణాల మీద సమీకరించగల 'రాజకీయ కళ'ను సంపాదించుకొని వున్నది. జనతా పార్టీ ఆవిర్భవించినప్పుడు అది తన ప్రయోజనాలకు అనుకూలమైనదని భావించినప్పుడు ఈ వర్గం ఇదే రాజకీయ కళను వినియోగించి జనతా పార్టీకి రాష్ట్రంలో ఊహించని 'మంత్రబలాన్ని' సమకూర్చి పెట్టింది. రాష్ట్రంలో తన వర్గ ప్రయోజనాలకు అవసరమైపుడల్లా ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం 'మంత్రశక్తి'తో క్షణాల మీద తన వర్గ బలగాలను అన్నింటినీ సమీకరించే శక్తిగలిగి వున్నది.

రాజకీయ రంగ ప్రవేశం చేసిన రామారావు రాష్ట్రంలో 'రాజకీయ మంత్ర కళలను' ప్రదర్శించగల ఈ రెండు శక్తులను వశీభూతం చేసుకోవడానికి 'వాగాడంబర యజ్ఞాన్ని' చేశాడు. దీనికి అవసరమైన వేషభాషలను, అభినయాలను, నినాదాలను ప్రయోగించాడు. ఈ యాగం ఫలించింది. ఈ రెండు మంత్ర దండాలను రామారావు చేజిక్కించుకున్నాడు. మంత్ర దండాలు లభించిన తర్వాత మాంత్రికుడే వాటిమీద సర్వాధికారి అవుతాడు. రామారావు 'రాజకీయ మాంత్రికుడయ్యాడు. ఈ రెండు శక్తులు ఇచ్చిన 'అతీతశక్తుల'తో ఘన విజయాలు సాధించగల 'అవతార పురుషు'డయ్యాడు.

కాని వాస్తవానికి మహిమ మాంత్రికునిలో లేదు. అతను వశీభూతము చేసుకున్న మంత్రదండాలలో వున్నది. కాని అవి అతని చేతుల్లో వున్నంతకాలం రాజకీయ రంగంలోని 'అతీతశక్తులు', 'అద్భుత శక్తులు' అతనికి వూడిగం చేస్తాయి. అయితే ఈ మంత్ర దండాలు' తమ శక్తిని కోల్పోయినా, రామారావు వీటిని కోల్పోయినా అప్పుడు పరిస్థితి తలక్రిందులవుతుంది. 'మంత్రదండం' కోల్పోయిన మాంత్రికునిలాగ రామారావు తన నిజస్వరూ పంతో 'అతీతశక్తులు' లేని అతిసాధారణ రాజకీయవేత్తగా మిగిలిపోతాడు. రామారావు ఎటు ప్రయాణం చేస్తున్నదీ పరిశీలించుదాం.

## 3. అపర విశ్వామిత్రుని త్రిశంకు స్వర్గం

ఈ అయిదేళ్ల పాలనలో రామారావు 'ఒకమారు ఒక వర్గాన్ని వేరొకమారు వేరొక వర్గాన్ని అవమానించి' వాటిని దూరం చేసుకున్నాడు. ఇటీవల మున్సిపల్ ఎన్నికలు దీనిని స్పష్టంగా రుజువుచేస్తున్నాయి. 'విశ్వ విఖ్యాత విజేతకి' అపజయాలు ఎదురవుతున్నాయి. గతంలో ఒకసారి ఈ 'అవతార పురుషుడు' దర్శనం ఇస్తే 'ఓట్ల వర్షం కురిపించిన ప్రజల ముందుకు ఇప్పుడు ఈ 'అభినవ రాముడు' తన అభ్యర్థుల్ని నోట్లతోనూ, సారా ప్యాకెట్లతోనూ పంపితే గాని పరువు దక్కని స్థితి వచ్చింది. దీనికి రామారావు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే కారణం.

రామారావు చేతిలో మంత్ర దండముగా వున్న 'కాంగ్రెస్ వ్యతిరేక శక్తి' మీద ఈయన తన ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలతో సమ్మెట దెబ్బలు కొడుతున్నాడు. ఇప్పుడు రాష్ట్రంలో ఈ 'కాంగ్రెస్ వ్యతిరేక శక్తి' మంచుగడ్డలా కరిగిపోతున్నది. ఆ మేరకు రామారావు చేతిలోని ఒక మంత్ర దండము తన శక్తిని కోల్పోతున్నది. ఆ మేరకు రామారావులోని 'మాంత్రిక శక్తి' క్షీణించడం ప్రారంభమైనది. రానురాను ఈ క్రమం వేగాన్ని పుంజుకుంటున్నది. పరస్పర విరుద్ధ శక్తుల కలయికతో ఏర్పడి వామపక్షాల వెనుక గల వర్గాలను కూడా వాతాపి జీర్ణంచేసుకున్న ఈ 'కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయ ముద్ద' నుంచి వివిధ వర్గాలు బయటపడి తమతమ స్థావరాల కోసం కోల్పోయిన బలగాలను వెదుకలాడడం ప్రారంభించాయి.

ఇక రామారావుకి 'మాంత్రిక శక్తి'ని కలిగించినది ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం. ఇది బూర్జువా ఆర్థిక వ్యవస్థ పరిధిలో తన వర్గ ప్రయోజనాలను తన పూర్తి పెత్తనాన్ని కోరుకుంటున్నది. కాని దీనికి నాయకుడుగా వ్యవహరిస్తున్న రామారావు బూర్జువా సమాజపు శిఖరాగ్రంలో తలెత్తిన క్షీణవర్గానికి ప్రతినిధి. బోనపార్ట్ లాగే రామారావు తన సర్వదుంబాలా ఆర్థిక విధానాల ద్వారా 'యావత్తు బూర్జువా ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం' చేస్తున్నాడు. ఇది సహజంగానే ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గాన్ని గందరగోళ పరుస్తుంది, అసంతృప్తికి గురిచేస్తుంది.

ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం కేంద్రంతో ఘర్షణకు సిద్ధం అవుతుంది. ఇది కేంద్రాన్ని మిధ్య చేసి అయినా రాష్ట్రాలకు సర్వాధికారాలూ

కావాలని కోరుకుంటుంది. రాష్ట్రంలో తమ పూర్తి పెత్తనం నెరపాలని కాంక్షిస్తుంది. ఈ వర్గం కేంద్రానికి ఎగబాకడానికంటే రాష్ట్రాల అధికారానికి, పెత్తనానికీ ప్రాధాన్యతనిస్తుంది. కాని రామారావు 'తమకు తాము లాభాలు చేకూర్చుకునే' క్షీణవర్గ జీవ లక్షణంగల వర్గానికి ప్రతినిధిగా దేశాధినేత కావాలని చేసే ప్రయత్నాల పట్ల ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం ఆసక్తిని ప్రదర్శించదు.

ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం ఒక ముద్దగా ఒక వర్గంగా వ్యవహరించడానికి అనేక పరిమితులు వున్నాయి. ఇది ఫ్యూడల్ సంకుచిత తత్వాన్ని, కులాన్ని ముడివేసుకుని ప్రయాణిస్తుంది. ఈ ప్రాంతీయ భూస్వామిక వర్గం బహు కులాలకు నిలయం. వర్గ ప్రయోజనం రీత్యా కీలక సమయాలలో ఈ కులాలన్నీ కలగలసి వున్నట్టు కనిపించినా రాజకీయ అధికారాన్ని పంచుకోవడంలో వివిధ కులాల మధ్య సమతూకం దెబ్బతిన్నపుడు ఇది ఒకే వర్గంగా నిలబడలేని బలహీనతను ప్రదర్శిస్తుంది. రామారావు ప్రభుత్వం ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గంలోని వివిధ కులాలు మధ్య సమతూకాన్ని ప్రత్యక్షంగా పరోక్షంగా దెబ్బ తీయడంతో ఇది ఒకే వర్గంగా వ్యవహరించలేని స్థితి ఏర్పడుతున్నది.

ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం తెలుగుదేశం పార్టీ ద్వారా తమ వర్గం యొక్క పరిపాలనను, తమ వర్గం యొక్క మొత్తం ప్రయోజనాలను కోరుకుంటుంది. కాని, క్షీణ వర్గపు జీవ లక్షణం గల రామారావు మొత్తం వర్గ పరిపాలన మీద తన కుటుంబ నియంతృత్వాన్ని, మొత్తం వర్గం యొక్క ప్రయోజనాల మీద తన కుటుంబ సంక్షేమాన్ని రుద్దడానికి పూనుకున్నాడు. 'నాతోనే తెలుగుదేశం పుట్టింది. నాతోనే అది అంతరిస్తుంది' అన్న రామారావు వైఖరి ఈ వర్గాన్ని సంతృప్తి పరచజాలదు.

'తమకు తాము లాభాలు సంపాందించుకునే మిక్కిలి పెద్ద లక్ష్యం గల' క్షీణ వర్గ ప్రతినిధిగా రామారావు ఆకాంక్షలకూ, దానిని నెరవేర్చుకునే నిరంకుశ పెత్తందారీ పోకడలకు ప్రాంతీయ భూస్వామిక పెటుబడిదారీ వర్గం యొక్క మొత్తం ప్రయోజనాలకు మధ్య కనబడని వైరుధ్యం కొనసాగుతుంది. అది రకరకాల రూపంలో వ్యక్తం అవుతుంది. ఈ ప్రాంతీయ భూస్వామిక పెట్టుబడిదారీ వర్గం తన బలగాలనన్నిటినీ క్షణాలలో సమీకరించే 'మంత్ర మహిమను' ఒక వర్గంగా ప్రదర్శించే స్థితి రానురాను బలహీనపడుతుంది. రామారావును 'అవతార పురుషుణ్ణి' చేసి 'రాజకీయ హీరో'గా అందలం ఎక్కించిన ఈ 'మాంత్రిక శక్తులు'

బలహీనపడడంతో విచ్ఛిన్నమవడంతో, మంచుగడ్డలా కరిగిపోవడంతో, రామారావులోని 'దైవాంశ' కూడా అదృశ్యమవుతుంది. అతనిలోని 'అదృశ్య శక్తులు' అంతరిస్తాయి. అప్పుడే మంత్రదండం కోల్పోయిన మాంత్రికునిలా రామారావు తన నిజ స్వరూపంతో బయట పడతాడు. ఒక వదరుబోతుగా, వాగాడంబర పరుడుగా, బూర్జువా సమాజ శిఖరాగ్రంలో తలెత్తిన క్షీణవర్గ ప్రతినిధిగా 'ధనం, కుళ్ళు, రక్తం' కలగలసిన దురాశాపూరితుడైన స్వార్థపరుడుగా 'తమకు తాము లాభాలు చేకూర్చుకొనే మిక్కిలి పెద్ద లక్ష్యం గల క్షీణవర్గ ప్రతినిధిగా రాష్ట్రాన్ని, దేశాన్నీ కబళించడానికి ప్రయత్నించిన దుస్సాహసికుడుగా, కాషాయం ధరించిన కపట సన్యాసిగా తన డైలాగుల వెనకగల ముసుగులను తొలగించుకొని ఒక రాజకీయ 'అల్పష్టిగా' ధృవీకరించబడతాడు. అపుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయ రంగమే అతణ్ణి మట్టికరిపిస్తుంది. ఈ రాజకీయ విశ్వామిత్రుణ్ణి తాను సృష్టించుకున్న త్రిశంకు స్వర్గానికి సాగనంపుతుంది.

ప్రత్యామ్నాయం : ప్రజా హెజమనీ

ప్రాంతీయ పార్టీలు : బాస్టర్డ్ హెజమనీ

ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం

# ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ ప్రయోగాలు

## 1952–2020

కులసమీకరణల రాజకీయం

దళిత, బహుజనులు : ఆలోచనగా హెజమనీ

సినీ హీరో : సీజర్ హెజమనీ

కమ్యూనిస్టులు : ప్రజా హెజమనీ

ఓట్ల కోసం ప్రలోభాలు

గ్రాంసీ కౌంటర్ హెజమనీ

డి వి వి ఎస్ వర్మ

## పుస్తకాలు

### ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు

### విషయ సూచిక


1. ఒక సృజనాత్మక విశ్లేషణ ........................................ 90
2. ముందుమాట ...................................................... 95
3. కమ్యూనిస్టులు : ప్రజా హెజమనీ .............................. 100
4. సినీ హీరో : సీజర్ తరహా హెజమనీ .......................... 121
5. దళిత, బహుజనులు : ఆలోచనగా హెజమనీ ................ 128
6. ప్రాంతీయ పార్టీలు : బాస్టర్డ్ హెజమనీ ....................... 134
7. ప్రత్యామ్నాయ రాజకీయం : ప్రజా హెజమనీ ................ 143



## కృతజ్ఞతలు

ఈ పుస్తకంలో వివిధ అంశాలపై విలువైన సమాచారాన్ని ఈ కింది రచనల నుండి స్వీకరించడం జరిగింది.

1 శ్రీ ఐ.నర్సయ్య గారి పరిశోధన పత్రం
(Left and National movements in Madrass Presidency 1930-47, A Study in Politics of Hegemony)

2 ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు గారి వర్కింగ్ పేపర్
(Caste ,Class and Social Articulation in Andhra Pradesh)

3 ప్రొఫెసర్ కె.వై.రత్నం గారి పుస్తకం
(The Dalit Movement and Democratization in Andhra Pradesh)

4 విశాలాంధ్ర వారు ప్రచురించిన ఆంధ్రప్రదేశ్ దర్శిని

వీరందరికి, ఈ పుస్తకం చిత్తు ప్రతిని చదివి విలువైన సలహాలను ఇచ్చిన మిత్రులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

## పరిచయం

# ఒక సృజనాత్మక విశ్లేషణ

గతాన్ని పరిశీలించడానికి వెనక్కుచూడాలి. వర్తమాన అధ్యయనానికి చుట్టూ చూడాలి. భవిష్యత్ నిర్మాణానికి ముందుకు చూడాలి. డెబ్బై ఏళ్ల ఆంధ్రప్రదేశ్ రాజకీయ, సామాజిక పరిణామాలను అన్ని వైపుల చూస్తూ చేసిన అవలోకన ఇది.

'గతం వాస్తవాల (facts) మీద నిలబడుతుంది. వాస్తవం పవిత్రమైనది' అన్నాడు ఇ.హెచ్.కార్. వాస్తవం ఒకటే అయినా వ్యాఖ్యానాలు అనేకం ఉంటాయి. నిర్జీవ సందర్భాలను వ్యాఖ్యానించేటపుడు వైవిధ్యం ఉండకపోవచ్చు. కానీ, సజీవులైన మానవుల చేత నిర్మించబడిన వైవిధ్య భరితమైన మనుగడను మళ్లీ అదే జీవ లక్షణాలున్న మనుషులు విశ్లేషించపూనుకున్నపుడు మనకు తెలుసుననుకున్న గతమే కొత్తగా కనపడుతుంది. కొత్తగా అర్థమౌతుంది.

గతాన్ని విశ్లేషించుకునే విధానాన్ని బట్టే వర్తమానం విశదమౌతుంది. వర్తమానం సరిగా లేదంటే గతాన్ని అర్థం చేసుకోవడంలో విఫలం చెందామన్నమాట. గతాన్ని చూసిన దృష్టికోణాన్నీ, తూనిక రాళ్లను మార్చుకోవాలన్నమాట. కొత్త మూల్యాంకన విధానం ఎత్తుకోవాలన్న మాట. విద్యార్థి గణిత సమస్యలో పరిష్కార సాధనకు ఒక పద్ధతి విఫలమైతే మరొకటి ఎన్నుకోవడానికి ముందు లెక్కను మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయడం లాంటిదే ఇది కూడా. ఆంధ్రప్రదేశ్‌లో 1952-2020 మధ్య సాగిన రాజకీయ పరిణామాల్ని ప్రయోగాలుగా చూస్తు సాగిన విశ్లేషణ ఇది.

డెబ్బై ఏళ్లంటే గతమే కానీ సమీప గతం లేదా సమకాలీన గతం. దీన్ని అర్థం చేసుకోవడానికి కొత్తగా ఎన్నుకున్నది ఇటాలియన్ మార్క్సిస్ట్ మేధావి ఆంటోనియో గ్రాంసీ మార్గం. నడుస్తున్న చరిత్రలో పడి కొట్టుకుపోయే వాళ్లే కానీ నిలబడి తేరిపార చూచేవాళ్లు తక్కువ.

గతం చిత్రమైంది. సాధారణ కళ్లకు దూరంగా ఉన్నది సరిగా కనిపించదు. దగ్గరయ్యే కొద్దీ స్పష్టత పెరుగుతుంది. కానీ గతం అట్లా కాదు. అది దూరమైపోయే కొద్దీ నిశ్చలమైపోవడం వల్ల బొమ్మ రూపు కడుతుంది. అదే దగ్గరయ్యే కొద్దీ ప్రక్రియ సాగుతుండడం వల్ల సంచలిస్తూ కదలబారుతుంది.

అడుగు భాగం కనిపించడంలో కోనేరులో రాయి పడిన స్థితికీ, అలలు తేరుకున్న స్థితికి ఉన్న తేడాయే ఇది కూడా ! ఈ నేపథ్యంలో చూసినపుడు మార్క్సిస్టు దృక్పథంతో ఆంధ్రప్రదేశ్ ప్రాచీన మధ్య యుగ చరిత్రను రాయడానికి గతంలో కొన్ని ప్రయత్నాలు జరిగాయని మనకు తెలుసు. కాగా ఆధునిక యుగానికి వచ్చే సరికి స్వాతంత్ర్యోద్యమం, రాష్ట్రోద్యమం ప్రధాన భూమిక వహించాయి. జాతీయవాద దృక్పథంతోపాటు మార్క్సిస్టు కోణం నుంచి ప్రాంతీయస్థాయిలో చరిత్ర రచన సాగింది. అయితే దీన్ని సవాల్ చేస్తూ జాతీయస్థాయిలో స్వాతంత్ర్యోద్యమంలో రైతుల, ఆదివాసీల, స్త్రీల పాత్రను తెరపైకి తెచ్చింది ఉపశ్రేణుల చరిత్ర. ఇది మహా కథనాల ఏకశిలా సదృశత్వాన్ని కొట్టి పారవేస్తూ చరిత్రలోని బహుళతత్వాన్ని బహిర్గతం చేసింది. దీన్ని ప్రతిపాదించిన చరిత్రకారులు తాము ఇటాలియన్ మార్క్సిస్టు మేధావి ఆంటోనియో గ్రాంసీ నుంచి స్ఫూర్తి పొందినట్లు చెప్పుకున్నారు.

రాష్ట్ర స్వాతంత్ర్యోద్యమంలో ఉపశ్రేణుల పాత్రను వెలికి తీస్తూ కొన్ని పరిశోధనలు జరిగినప్పటికీ అవి గ్రాంసీ సమగ్ర దృక్పథం నుంచి జరిగినవి కావు. గ్రాంసీ వ్యవస్థ సమూల మార్పును కోరుతూ ప్రతిపాదించిన సిద్ధాంతాల్లో ఉపశ్రేణుల కోణం ఒకటి మాత్రమే ! స్వాతంత్ర్యానంతర చరిత్రను గ్రాంసీ సమగ్ర దృక్పథం నుంచి పరిశీలించిన తొలి ప్రయత్నం ఇదే !

సమకాలీన ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకు ఇది పూర్తిగా కొత్త కోణం. ఇప్పటిదాకా ఈ చరిత్ర ఆయా రాజకీయ పార్టీల విడివిడి చరిత్రగా లేదా ముఖ్యమంత్రుల జీవిత చరిత్రలుగా లేదా కులాల వారీగా ఓట్ల గణాంకాల పట్టికగా మాత్రమే ఉంది. గ్రాంసీ ఆలోచనల వెలుగులో సమకాలీన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్ని విశ్లేషిం చిన ఈ సందర్భాన్ని చూసినపుడు గ్రాంసీ భావనలను ఇక్కడి పరిణామాలకు అన్వయించినట్టుగా కాక ఆయన ఆలోచనల ప్రతిఫలనాలే ఇక్కడి పరిణామాల్లో సద్యో జనితమై ఉన్నట్లు కనిపిస్తుంది.

ఇది మొత్తంగా స్థూల దృష్టి విశ్లేషణ. సాధారణ దృష్టి నుంచి ఈ కాలాన్ని మూడు దశలుగా చూసినట్లు తెలుస్తుంది. ఇది కాంగ్రెస్, కమ్యూనిస్టులనే రెండు జాతీయ పార్టీల మధ్య పోటీని మొదటి దశగా చూసి తర్వాత కాంగ్రెస్, తెలుగుదేశం అనే ఒక జాతీయ పార్టీ ఒక ప్రాంతీయ పార్టీ మధ్య పోటీని రెండవ దశగా, ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీ, తెలుగుదేశం అనే రెండు ప్రాంతీయ పార్టీల మధ్య

పోటీని మూడవ దశగా చూస్తూ గ్రాంసీ ప్రతిపాదిత హెజిమనీ(Hegemony) సిద్ధాంతం ఆధారంగా మొత్తం ఐదు దశలుగా వర్గీకరణ చెందింది. ఆధిపత్య వర్గాలు తమ అధికారానికి అనుకూలంగా ప్రజా సమ్మతిని పొందడాన్ని హెజిమనిగా గ్రాంసీ నిర్వచిస్తే ఐదు దశలలో ఆ సమ్మతి పొందిన మార్పులు ఇక్కడ విశ్లేషించబడిన తీరు ఇంతకు ముందెప్పుడూ మనం చూడలేదు.

1952 ఎన్నికల్లో కమ్యూనిస్టులు తమ అంచనాలకు మించి అనూహ్యంగా సాధించిన విజయాల వెనుక ఒక అసాధారణ శక్తి ఉన్నదని విశదం చేసి, దాన్ని వాళ్లు సాగించిన రాజకీయ సామాజిక సాంస్కృతిక కార్యకలాపాల సమ్మేళనం నుంచి కొత్త రూపం ధరించిన ప్రజా హెజిమనిగా గుర్తించడంతో ఈ విశ్లేషణ మొదలవుతుంది.

1983లో ఎన్.టి.రామారావు పార్టీని పెట్టి తొమ్మిది నెలలలో సాధించిన విజయాన్ని కేవలం సినీ గ్లామర్ హెజిమని సాధించిపెట్టిందని భావించడం సరికాదంటూ, అప్పటి రాజకీయ సన్నివేశంలో ఏర్పడిన సర్వవ్యాపిత రాజకీయ సంక్షోభం సమ్మోహన శక్తులకు ద్వారాలు తెరిచిన వైనాన్నీ, పర్యవసానంగా అది కాంతి వేగంతో ప్రజా సమూహాలను ఆకర్షించిన తీరును కొత్తచూపుతో చూసింది.

ఆ దశలోనే దళితులపై సాగిన దాడుల, హత్యాకాండల నేపథ్యంలో ఏర్పడిన దళిత మహాసభ తన మేనిఫెస్టోలో ఆలోచనగా చేసిన దళిత–బహుజన హెజిమనిని ప్రస్తావిస్తూ అప్పుడు పడిన బీజం తిరిగి సానుకూల పరిస్థితి వచ్చినపుడు అంకురిస్తుందన్న భవిష్యత్ దర్శనాన్ని చేసింది.

తర్వాత జరిగిన మరో కీలక మలుపుపై చేసిన విశ్లేషణ ప్రస్తుత రాజకీయ సంఘర్షణలోని ప్రత్యేకతలను ఆవిష్కరిస్తుంది. వ్యవసాయమే ప్రత్యేక వనరుగా ఉన్న ఆంధ్ర ప్రాంతంలో 1990 దశకంలో ఓ వైపు వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోవడం, మరోవైపు దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు పెట్టుబడిదారీ పద్ధతులలో లాభార్జన ద్వారాలు తెరుచుకోవడంతో స్థానిక భూస్వామ్య ధనిక రైతు వర్గాలు భూఆదాయ మార్గం నుంచి పెట్టుబడి ఆదాయ మార్గాలకు మళ్లడంతో ప్రాంతీయ పెట్టుబడిదారీ శక్తులు ఒక వర్గంగా రూపొందిన క్రమాన్ని గొప్ప లోచూపుతో వివరించింది.

ఒకే నాణానికి బొమ్మా బొరుసులాగా, ఒకే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను కాపాడే రెండు ప్రాంతీయ పార్టీల వ్యవస్థ ఏర్పడిన తీరును తెర

మీదకు తెస్తూ, ఈ రెండు ప్రాంతీయ పార్టీల మధ్య వర్గ సంఘర్షణకు తావు లేనందువల్ల అవి రాజకీయ సంఘర్షణలో కొత్త రూపాలు తెచ్చాయని దాని పర్యవసానంగానే రాజకీయ సంఘర్షణ కుల సమీకరణల సంఘర్షణగా, కేవలం అధికార క్రీడగా, కుబేరుల ఆటగా మారిందని వినూత్న ఆవిష్కరణ చేసింది. ఈ ప్రాంతీయ పార్టీలు ప్రజా సమ్మతిని పొందడానికి వర్గ ప్రాతిపదిక లేని పరోక్ష పద్ధతిని అనుసరిస్తున్నాయని, ఉపశ్రేణి కులాల నాయకులకు చిల్లర పదవుల ఆశ చూపించి తమలో ఇముడ్చుకోవడం, ప్రజా సమూహాలను ప్రలోభ పథకాలతో ఆకట్టుకోవడం వంటి పద్ధతులను అనుసరించడాన్ని బాస్టర్డ్ హెజిమనిగా నిర్వచించడం ఈ విశ్లేషణలో పతాక సన్నివేశం.

ఆఖరున, పార్టీలకు ప్రత్యామ్నాయంగా ప్రజల హెజిమనిని సాధించే క్రమంలో ఉపశ్రేణుల చారిత్రక సంఘటన అవసరాన్ని చెప్పడం అది పీడిత వర్గ, కుల ఐక్యత గా ఉండాలని కోరుకోవడంతో ఈ ప్రతిపాదన ముగుస్తుంది.

పూలే, అంబేద్కర్‌ల మార్గంలో దళిత బహుజన వర్గాలు సాగిస్తున్న కులాధిక్య వ్యతిరేక పోరాటాలు తప్ప ఇతర సైద్ధాంతిక ఆలోచనలు మసకబారుతున్న వేళ డి.వి.వి.యస్.వర్మ గారు ముందుకు తెస్తున్న ఈ సిద్ధాంత ప్రతిపాదన గొప్ప ఆశను కలిగిస్తున్నది. ప్రత్యామ్నాయ భావజాల ఆధిపత్య సాధనకు పాటించవలసిన విధి విధానాల పట్ల ఆయన ప్రజాస్వామిక దృక్పథాన్ని ప్రకటించారు.

ఉన్నవి చాలకనా మళ్లీ ఈ గ్రాంసీ అధ్యయనం ? అందునా విదేశీ సిద్ధాంతమా ? రష్యాకు చైనాకు ఎత్తి పట్టిన గొడుగులు ఎగిరిపోయాక ఇప్పుడు ఇటలీ వంతు వచ్చిందా? అనే వాళ్లకు బహుళత్వం ఉన్న సమస్యకు బహుళాధ్యయనమే మార్గం అన్నది సమాధానం. ఇది మార్క్స్‌లో అంబేద్కర్‌నీ, అంబేద్కర్‌లో గ్రాంసీని చూడవలసిన సందర్భం. అందుకే ఆయన మార్క్స్, పూలే, అంబేద్కర్, గ్రాంసీల అధ్యయనం జరగాలని ప్రతిపాదించారు. ప్రజా సమ్మతి సాధనలో సాంస్కృతిక విప్లవానికి పెద్ద పీట వేశారు. ఇంతకంటే ఏం కావాలి ?

డి.వి.వి.యస్.వర్మ గారు దాదాపు ఆరు దశాబ్దాల ప్రత్యక్ష రాజకీయ అనుభవం ఉన్న మేధావి. విశ్లేషకులు. తనదైన ఆలోచన కలిగిన దార్శనికులు. ఆచరణ శీలి. నిరంతరం ప్రజల హితం కోరుతూ కొత్త బాటలు వెదికే అన్వేషి. ఆయనకిప్పుడు కొత్త దారి దొరికింది. అది మన ముందుంది.

మీరు చదవబోయేది వాస్తవికత ఆధారంగా ఎంతో సృజనాత్మకంగా తయారు చేసిన డాక్యుమెంట్. లోతుగా స్పష్టతతో చేసిన ఈ విశ్లేషణ ఎంతో సరళంగా సాగి సమ్మతి సాధించే విధంగా ఉంది. తరిచే కొద్దీ కొత్త ఆలోచనలు ఊరే ఊటలా ఉంది. వర్మ గారు నాకు గురుతుల్యులు. ఈ విశ్లేషణను ముందుగా చదివి ఈ మాటలు రాయడానికి హెచ్చు తగ్గులెంచక నాకు అవకాశం ఇచ్చారు. ఆయనకు కృతజ్ఞతలు. ఇక మీరు ప్రవేశించండి.

**కొప్పర్తి వెంకటరమణమూర్తి**

**తణుకు,**

**10.08.2020**

# ముందుమాట

**ఆ**oధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం రెండు ప్రాంతీయ పార్టీల రాజకీయ వ్యవస్థ రూపుదిద్దుకుంది. తెలుగుదేశం పార్టీ, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలు ఒక దాని తర్వాత మరొకటి అధికార మార్పిడి కూడా చేసుకున్నాయి. ఈ రెండు ప్రాంతీయ పార్టీలు ఏర్పడిన రాజకీయ నేపథ్యాన్ని, ఆ పార్టీల వర్గ స్వభావాలను ఆవిష్కరించుకోవాలి. 1952 నుంచి 2020 వరకు రాష్ట్ర రాజకీయాలు అనేక మలుపులు తిరిగాయి. అందులో కీలకమైన ప్రయోగాలను విశ్లేషించుకోవాలి – దీనికోసం చేసిన ప్రయత్నమే ఈ చిన్న పుస్తకం. 1952లో జరిగిన ఎన్నికలలో ఆంధ్ర ప్రాంతంలో రెండు జాతీయ పార్టీల మధ్య రాజకీయ సంఘర్షణ జరిగింది. పైగా అది వర్గ సంఘర్షణ రూపంలో జరిగింది. దాదాపు 70 సంవత్సరాల తర్వాత ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2019 నాటికి రాష్ట్రంలో రాజకీయ సంఘర్షణ రెండు ప్రాంతీయ పార్టీల మధ్య సంఘర్షణ రూపం ధరించింది. పైగా ఇది వర్గ సంఘర్షణను పక్కన పెట్టింది. కుల సమీకరణల సంఘర్షణ రూపాన్ని తీసుకుంది. కుల సముదాయాలను సమీకరించే పథకాలను ముందుకు తెచ్చింది. ప్రజల సొమ్ముతో ఓటు బ్యాంకులు సృష్టించుకునే పద్ధతిని ప్రవేశపెట్టింది. కోట్ల పెట్టుబడితో ఎన్నికల్లో పోటీపడడం, తర్వాత అంతకు మించిన ప్రజాధనాన్ని, ప్రకృతి సంపదలను దోచుకునే అవినీతి పద్ధతిని సర్వ సాధారణం చేసింది. ఇదొక వికృత రాజకీయ క్రీడ. దీని పుట్టు పూర్వోత్తరాలను గత రాజకీయ పరిణామాల నుండి వెదికి పట్టుకోవాలి. శూన్యం నుండి ఏదీ పుట్టుకుని రాదు. ఈ వికృత రాజకీయం కూడా ఒక క్రమ పరిణామ ఫలితం. దానిని ఆవిష్కరించుకోవాలి.

## కీలక మలుపులు

1. 1952 ఎన్నికలలో ఆంధ్ర ప్రాంతంలో 41 శాసనసభ స్థానాలు గెల్చుకుని కమ్యూనిస్టు పార్టీ ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. ఇది డబ్బు సంచులతో తెచ్చుకున్న విజయం కాదు. కుల సమీకరణలతో సాధించిందీ కాదు. పౌర సమాజంలోని వివిధ తరగతులను ప్రజా సంఘాలలో సమీకరించి, ఉద్యమాలు నిర్వహించి సాధించిన రాజకీయ ఆధిపత్యం. దీనిని ఎలా సాధించారు? ఏ ఏ పద్ధతులను అనుసరించారు అన్న అంశాల్ని లోతుగా అధ్యయనం చెయ్యాలి.

2. 1983 ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయ ఆధిపత్యానికి గండి పడింది. సినీ హీరో ఎన్.టి.రామారావు రాజకీయ ప్రవేశం చేసి, తెలుగుదేశం పేరుతో ప్రాంతీయ పార్టీని పెట్టాడు. 9 నెలలలో అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. రాజకీయాలలో లేని వ్యక్తి హఠాత్తుగా రాజకీయ హీరో ఎలా అయ్యాడు ? రాజకీయ సంక్షోభ కాలంలో సమ్మోహన శక్తులకు ద్వారాలు ఎందుకు తెరుచుకుంటాయి ? ఈ పరిణామాలు చూపిన ప్రభావం ఏమిటి ? అన్న అంశాలను పరిశీలించాలి

3. 1985లో కారంచేడులో ఆధిపత్య వర్గాలకు చెందిన కుల దురహంకారులు దళితవాడపై సాగించిన మారణకాండ నేపథ్యంగా రాష్ట్రంలో దళిత మహాసభ ఏర్పడింది. దళిత పదానికి ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనారిటీల సంఘటన అన్న విశాల నిర్వచనం ఇచ్చింది. కులరహిత–వర్గరహిత సమాజం కోసం సామాజిక సాంస్కృతిక ఉద్యమంగా ప్రారంభమైంది. 1994లో బహుజన సమాజ్ పార్టీలో చేరి రాజ్యాధికారం కోసం ప్రయత్నించింది. దళిత – బహుజన కులాల రాజకీయ ఆధిపత్యం కోసం చేసిన ప్రయత్నం ఎందుకు ముందుకు సాగలేదు ? దీని భావజాల ప్రభావం నిర్వహించే పాత్ర ఏమిటి అన్న అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

4. ఆంధ్ర ప్రాంతంలో ప్రాంతీయ పెట్టుబడిదారీ శక్తులు ఒక వర్గంగా రూపొందడం ఒక ముఖ్యమైన పరిణామం. అది అంతర్గత వైరుధ్యాలను సమన్వయం చేసుకుని ఒక వర్గంగా వ్యవహరించడంతో రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థితిని తెచ్చుకుంది. ఈ పరిణామం రాజకీయ సంఘర్షణ స్వరూప స్వభావాలను ఎలా మార్చి వేసిందో విశ్లేషించుకోవాలి.

5. రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీలు ఏర్పడిన తీరులో వున్న సారూప్యతను పరిశీలించడం. అవి దాదాపు ఒకే తీరు రాజకీయాన్ని అనుసరించడానికి దారి తీసిన పరిస్థితిని విశ్లేషించుకోవాలి.

దీనికి భిన్నంగా ప్రజా ప్రత్యామ్నాయాన్ని సాధించడం ఎలా అన్న స్థూలమైన చర్చ జరగాలి. ఇది రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యం నుండి గత అనుభవాల నుండి, వర్తమాన పరిస్థితుల విశ్లేషణల నుండి అలాంటి ప్రజా ప్రత్యామ్నాయానికి దారులు వేసుకోవాలి. ఆధునిక కాలంలో పౌరసమాజం బాగా విస్తరించింది. రాజకీయ రంగంలో దానిని విస్మరించడం సాధ్యం కాని స్థితిని

పొందింది. పాలక పార్టీలు తమ ఎన్నికల విజయాల కోసం, పాలనను నిలబెట్టుకోడానికి, కొనసాగించుకోడానికి పౌరసమాజ సమ్మతిని పొందడానికి నిరంతర ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీనికి పౌర సమాజంలోని వివిధ సంస్థలను, వ్యవస్థలను సాధనాలుగా మల్చుకుంటున్నారు. ప్రస్తుత వ్యవస్థను మార్చాలనుకునే వారు ప్రత్యామ్నాయ రాజకీయానికి పౌరసమాజ సమ్మతిని సాధించే ప్రయత్నాలను చేస్తున్నారు పౌరసమాజంలో జరిగే రాజకీయ సాంస్కృతిక సంఘర్షణ రాజకీయ పరిణామాలలో ముఖ్య పాత్రను పోషిస్తున్నది.

పౌర సమాజంలో ప్రజా సముదాయాల సమ్మతితో సాధించే ఆధిపత్యం లేదా హెజమనీ(Hegemony)పై ఇటాలియన్ కమ్యూనిస్టు, ప్రఖ్యాత మార్క్సిస్టు మేధావి ఆంటోనియో గ్రాంసీ విశిష్టమైన కృషిచేశారు. మార్క్స్ భావజాలాన్ని ఆధునిక కాలంలో విస్తరించిన పౌర సమాజానికి వర్తింపజేసి తన హెజమనీ సిద్ధాంతాన్ని గ్రాంసీ రూపొందించారు. గ్రాంసీ గురించి, ఆయన భావజాలం గురించి రాష్ట్రంలో అంతగా ప్రచారం లేదు. ఈ రాజకీయ పరిణామాల విశ్లేషణలో కేంద్ర బిందువుగా వున్న గ్రాంసీ భావజాలాన్ని సంక్షిప్తంగా పరిచయం చేసుకుందాం.

## గ్రాంసీ భావజాలం - పరిచయం

గ్రాంసీ ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు. 1915లో సోషలిస్టు పార్టీలో చేరి అందులో భాగంగా కమ్యూనిస్టు బృందాలను ఏర్పాటు చేసి 1922లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటులో పాత్రధారిగా వున్నాడు. 1922లో లెనిన్ నాయకత్వంలో ఏర్పడిన కమ్యూనిస్టు ఇంటర్ నేషనల్‌లో సభ్యుడుగా వున్నాడు. 1924లో ఇటలీ పార్లమెంట్‌కు ఎన్నికయ్యాడు. అప్పుడే ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యాడు.

ముస్సోలినీ ఫాసిస్టు పాలనలో 1926లో అరెస్టు అయ్యాడు. గ్రాంసీ ఎంతటి గొప్ప మేధావి అంటే ప్రాసిక్యూషన్ తరఫున వాదించిన లాయరు 'ఈ వ్యక్తి (గ్రాంసీ) మెదడును 20 ఏళ్లు పనిచెయ్యకుండా చెయ్యాలి' అన్నాడు. ఫాసిస్టు కోర్టు మరో నాలుగు నెలలు కలిపి 20 ఏళ్ల నాలుగు నెలల శిక్ష విధించింది. 1926 నుంచి 1937 వరకు జైలులోనే వున్నాడు. అనారోగ్యంతో 1937 ఏప్రిల్ 27వ తేదీన మరణించాడు. జైలులో ఆయన మొత్తం 34 నోట్ బుక్స్ రాశాడు. మూడు వేల పేజీలు వున్న ఈ నోట్ బుక్స్‌లో రాజకీయ, సిద్ధాంత, సాహిత్య సాంస్కృతిక రంగాలపై తన పరిశోధనలను రాశాడు. 1970లో 'సెలక్షన్స్ ఫ్రమ్ ది ప్రిజన్ నోట్

బుక్స్' పేరుతో కొన్ని భాగాలు ఇంగ్లీషులో వచ్చాయి. అప్పటి నుంచి గ్రాంసీ రచనలకు ప్రపంచవ్యాపిత ప్రచారం లభించింది. ప్రస్తుతం మార్క్స్ రచనల తరువాత గ్రాంసీ రచనల మీదే విస్తారమైన చర్చ సాగుతున్నది.

రష్యాలో కార్మిక వర్గ విప్లవం జయప్రదం కావడం, పశ్చిమ దేశాల్లో కార్మిక వర్గ తిరుగుబాట్లు పరాజయం పొందడం ఆయన రచనలకు నేపథ్యంగా వుంది. రష్యాకి, పశ్చిమ దేశాల రాజ్య వ్యవస్థలకి మధ్యగల తేడాను గ్రాంసీ ఆవిష్కరించాడు. రష్యాలో రాజ్య వ్యవస్థ దానికి సహజమైన అణచివేత యంత్రాంగానికే పరిమితం అయింది. అంటే పోలీసులు, సైన్యం, కోర్టులు, బ్యూరోక్రసీ వగైరా అణచివేత సాధనాల ద్వారా పాలన సాగించింది. పశ్చిమ దేశాల రాజ్య వ్యవస్థ దీనికి భిన్నమైంది. అక్కడ అణచివేత సాధనాలతోపాటు, అభివృద్ధి చెందిన పౌర సమాజం కూడా వుంది. ఈ రాజ్య వ్యవస్థలు అణచివేత సాధనాలతోబాటు పౌర సమాజ సమ్మతిని పొందే పద్ధతిని అనుసరిస్తున్నాయి.

మత సంస్థలు, విద్యా సంస్థలు, ప్రజలు రూపొందించుకున్న ఇతర సామాజిక, సాంస్కృతిక సంస్థల ద్వారా తన వర్గ భావజాల ఆధిపత్యాన్ని సాధించుకుంటున్నది. యథాస్థితిని కొనసాగించే ఈ భావజాలాన్ని ప్రజా సమూహాల లోక జ్ఞానంలోకి చొప్పించడం ద్వారా పౌర సమాజ సమ్మతిని రాబట్టుకుంటుంది. ఇలాంటి సమ్మతిని పొందడాన్ని 'హెజమనీ'గా గ్రాంసీ నిర్వచించాడు.

పౌర సమాజం మీద హెజమనీ అన్నది పాలక వర్గం మాత్రమే సాధించుకునే ప్రక్రియ కాదు. దీనికి ప్రతిగా దోపిడీ వ్యవస్థను కూలదోసే 'కౌంటర్ హెజమనీ' అంటే ప్రత్యామ్నాయ హెజమనీని గ్రాంసీ గుర్తించాడు. ప్రత్యామ్నాయ హెజమనీ సాధించడానికి అవసరమైన అంశాలను ఆయన ప్రస్తావించాడు.

1. కార్మిక వర్గం లేదా దానికి నాయకత్వం వహించే రాజకీయ పార్టీ తన మౌలిక వర్గంతోపాటు సమాజంలో వున్న ఇతర ఉపశ్రేణి శ్రామికులను, దోపిడీకి, వివక్షకీ గురవుతున్న సమూహాలను అంటే మహిళలు, మైనారిటీలు, భాషా ప్రాంతీయ అస్తిత్వం కోసం ఉద్యమిస్తున్న ప్రజా సమూహాలను అది సమీకరించుకోగలగాలి. ఈ ఉపశ్రేణుల ఆకాంక్షలకు మద్దతునివ్వడం మాత్రమే కాదు వాటికి తానే గొంతుక కావాలి. వారి ఆకాంక్షలు తన ఆకాంక్షలుగా ప్రకటించగలగాలి.

2. గ్రామీణ ప్రాంత రైతాంగంతో ఐక్య సంఘటనకు పూనుకోవాలి. పారిశ్రామిక

లాభాల కోసం, వ్యాపార లాభాల కోసం రైతులపై సాగే దోపిడీని అంతం చెయ్యడానికి అవసరమైన ఐక్యతగా ఇది రూపొందాలి.

3. కౌంటర్ హెజమనీ కోసం సవర్గ మేధావులను రూపొందించుకోవాలి. సంప్రదాయ మేధావుల నుంచి కూడా వారిని రాబట్టుకోవాలి. కౌంటర్ హెజమనీ చుట్టూ సమీకరించే ప్రజాసమూహాల ఉమ్మడి ఆకాంక్షలను వ్యక్తం చేసేవారుగా, ఆయా ఉపశ్రేణులతో సయోధ్యను నెరపి సమ్మతిని సాధించేవారుగా ఈ సవర్గ మేధావులు కీలక పాత్ర పోషిస్తారు.

4. లోకజ్ఞానం నుండి విచక్షణ జ్ఞానం

ప్రతి వ్యక్తీ తత్వ వేత్తే అంటాడు గ్రాంసీ. ఎందుకంటే వారు ప్రపంచాన్నీ, సమాజాన్ని తమదైన రీతిలో అర్థం చేసుకుంటారు. లోకజ్ఞానం వారి తత్వ శాస్త్రం. ఇది వారి నిత్య జీవితాన్ని నడిపిస్తుంది – లోకజ్ఞానం ఒక వైరుధ్యాల పుట్ట. ఇందులో మత పరమైన విశ్వాసాలు, ఆచారాలు, సంప్రదాయాలు, పాలకవర్గాలు పెంచి పోషించే భావజాలం, జీవితానుభవం వగైరాలన్నీ వుంటాయి. ఇది వారి ప్రపంచం. దీనిని తప్పుడు చైతన్యంగా కొట్టి పారెయ్యకూడదు. వారి ప్రపంచంలో ప్రవేశించాలి. లోకజ్ఞానం భావజాలాన్ని విచక్షణా జ్ఞానం భావజాలంగా మార్చాలి. దీనిలో సాహిత్య, సాంస్కృతిక రంగాల పాత్ర కీలకమైంది. లోకజ్ఞానాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చకుండా ప్రజాసమూహాలలో ఉమ్మడి ప్రపంచ దృక్పథాన్ని, సమాజాన్ని మార్చాలన్న చైతన్యాన్ని కలిగించడం సాధ్యం కాదు. అందుకే గ్రాంసీ భావజాలంలో సాంస్కృతిక కోణం కీలక స్థానం పొందింది.

5. కౌంటర్ హెజమనీ అన్నది కొన్ని వర్గాలకే పరిమితం అన్న భావన నుండి అదొక జాతీయ భావన రూపం ధరించాలి. అంటే కౌంటర్ హెజమనీ ఒక జాతీయ అవసరంగా, అందరి అవసరంగా రూపొందించాలి.

6. కౌంటర్ హెజమనీ నిర్మాణంలో నైతిక, రాజకీయ నాయకత్వ పాత్ర ప్రముఖ మైంది. అలాంటి నాయకత్వం మాత్రమే సమాజంలో అన్ని వర్గాల సమ్మతిని, విశ్వాసాన్ని పొందుతుంది. ప్రతిష్ట గల నాయకత్వం కౌంటర్ హెజమనీ నిర్మాణాన్ని వేగవంతం చేస్తుంది.

పౌర సమాజంలో హెజమనీ సాధించడం అంటే వ్యవస్థను మార్చడానికి

ప్రజల్ని యుద్ధ సన్నద్ధుల్నిచెయ్యడం. పౌర సమాజంలో హెజమనీ ఒకసారి యుద్ధ సన్నద్ధ(వార్ ఆప్ పోజిషన్) దశకు చేరుకుంటే దాని విజయాన్ని ఎవరూ ఆపలేరు. అలాంటి హెజమనీ విజయాలు చేకూర్చే శక్తి అవుతుంది.

ఈ హెజమనీని సాధించే రెండు పద్ధతులను గ్రాంసీ ప్రస్తావించాడు.

ఒకటి ప్రత్యక్ష పద్ధతి : ప్రజల భాగస్వామ్యంతో, ఉమ్మడి చైతన్యంతో, ఇష్టపూర్వకంగా అందించే సమ్మతి ద్వారా సాధించేది నిజమైన హెజమనీ.

రెండవది పరోక్ష పద్ధతి : ఇందులో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం ఉండదు. ఈ సమ్మతి ఉపశ్రేణుల నాయకులను తనలో ఇముడ్చుకుని వారి ద్వారానూ, ప్రజా సముహాలను వివిధ ప్రలోభాలతో పరోక్షంగా సాధించే సమ్మతి. దీనినే వంచనతో, నీతి బాహ్య పద్ధతులతో సాధించే బాస్టర్డ్ హెజమనీ (Bastard Hegemony)గా గ్రాంసీ పేర్కొన్నాడు

రాష్ట్రంలో వివిధ దశలలో జరిగిన రాజకీయ మలుపులను అందులో కనిపించిన హెజమనీలను పోలికలను విశ్లేషించుకోడానికి గ్రాంసీ భావజాలాన్ని ఆలంబన చేసుకోవడం అవసరం. అలాంటి ప్రయత్నమే ఈ చిన్న పుస్తకం.

రాష్ట్రంలో బాస్టర్డ్ హెజమనీకి ప్రత్యామ్నాయంగా ప్రజా హెజమనీని సాధించాలన్న ఆలోచనను అందరి ముందూపెట్టే ఈ ప్రయత్నాన్ని సానుకూలంగా స్వీకరిస్తారని ఆశిస్తూ ..

**- డి.వి.వి.యస్.వర్మ**

**85006 78977**

# మొదటి భాగం

## ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు
## 1952 - 2020

### కమ్యూనిస్టులు : ప్రజా హెజమొని

స్వతంత్రం వచ్చే నాటికి ఆంధ్ర ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో భాగంగా వుండేది. 1952లో వయోజన ఓటింగ్ ప్రాతిపదికగా తొలి ఎన్నికలు జరిగాయి. ఆంధ్ర ప్రాంతానికి వున్న 140 అసెంబ్లీ స్థానాలలోనూ కాంగ్రెస్ పార్టీ పోటీ చేసి 40 స్థానాలు పొందింది. కేవలం 60 స్థానాలకు మాత్రమే పోటీ చేసిన కమ్యూనిస్టు పార్టీ 41 స్థానాలను గెల్చుకుంది. మిగిలిన స్థానాలను ఇతర పార్టీలు పంచుకున్నాయి. ఆంధ్ర ప్రాంతంలో ఎక్కువ సీట్లు సాధించిన కమ్యూనిస్టు పార్టీ ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది.

ఈ అద్భుత విజయంపై రకరకాల విశ్లేషణలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీలో చీలికలు, అంతర్గత ముఠా తగాదాల వల్ల కమ్యూనిస్టు పార్టీ గెలిచిందన్నది ఒక విశ్లేషణ. మద్రాసు రాష్ట్రంలో భాగంగా వున్న తెలుగు ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా వేరు చెయ్యాలన్న నినాదంతో సాగిన ఉద్యమంలో కమ్యూనిస్టులు వహించిన ప్రముఖ పాత్ర వల్ల ప్రజల్లో కలిగిన ప్రాంతీయాభిమానం వారిని గెలిపించింది అన్నది మరో విశ్లేషణ. 1948-51 మధ్య కమ్యూనిస్టు పార్టీని నిషేధించి చాలా మంది కమ్యూనిస్టు నాయకులను కాల్చి చంపడంతో ప్రజలలో పెరిగిన సానుభూతి వారిని గెలిపించింది అన్నది ఇంకో విశ్లేషణ. ఈ విజయాల వెనక కమ్యూనిస్టులు సాగించిన ప్రజా కార్యకలాపాల ప్రస్తావనలు ఈ విశ్లేషణలలో చోటు చేసుకున్నాయి.

కమ్యూనిస్టుల విజయాల వెనక ఈ అన్నింటి పాత్ర వుంది. అయితే వారు నిర్మించిన ప్రజా సంఘాలు సాగించిన బహుముఖ కార్యకలాపాలు ఒక ఉన్నత స్థితికి చేరి విజయాలను అందించగల శక్తిగా రూపొందింది. కమ్యూనిస్టులకు విజయాలను అందించిన ఈ అసాధారణ శక్తి రూపాన్ని ఎవరూ పసిగట్టలేక పోయారు. వారి విజయ రహస్యం ఈ అసాధారణ శక్తిలో దాగి వుంది. దానిని

మనం ఆవిష్కరించుకోవాలి. దీనికి ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నేపథ్యాన్ని, అది సాగించిన ఉద్యమాల ప్రత్యేకతలను విశ్లేషించుకోవాలి.

## ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నేపథ్యం

భారత కమ్యూనిస్టు పార్టీ 1925లోనే ఏర్పడింది. కాని, ఆంధ్ర ప్రాంతంలో తొలి కమ్యూనిస్టు బృందం దాదాపు ఒక దశాబ్దం తర్వాత 1934లో ఏర్పడింది. అప్పటికి ఆంధ్ర ప్రాంతంలో వున్న రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలను పరిగణనలోకి తీసుకోవాలి. కాంగ్రెస్ సారథ్యంలో సాగుతున్న జాతీయోద్యమం తీరు తెన్నులపై చాలా మంది యువకులలో అసంతృప్తి వుంది. 1930 దశకంలో శాసనోల్లంఘనంలో జైలుకు వెళ్లిన యువకులకు అక్కడ విప్లవకారులతో పరిచయం అయ్యింది. వారి నుంచి పొందిన కమ్యూనిస్టు, సోషలిస్టు భావాలకు ఆకర్షితుల య్యారు. 1917లో సోవియట్ విప్లవం జరిగింది. దాని ప్రభావం ఆంధ్ర ప్రాంతంలో బాగా విస్తరించింది. ఆ విప్లవాన్ని శ్లాఘిస్తూ, పత్రికలలో అనేక వ్యాసాలు వచ్చాయి. ఈ విప్లవం సాధిస్తున్న విజయాలపైన, దోపిడీ వ్యవస్థ రద్దు ఫలితాలపైన, విద్య, ఆరోగ్యం అందరికీ అందిస్తున్న తీరుపైన, మహిళల సమానత్వంపైనా వ్యాసాలు వెలువడ్డాయి. లెనిన్ మీద, కమ్యూనిస్టు భావజాలం మీద పుస్తకాల ప్రచురణ కూడా జరిగింది.

ఈ విప్లవ ప్రభావం తెలుగు సాహిత్యం మీద విశేషంగా పడింది. మాలపల్లి నవల వచ్చింది. గోర్కీ అమ్మ నవల అనువాదం అందుబాటులోకి వచ్చింది. తెలుగు కవిత్వం కొత్త పుంతలు తొక్కింది. ఫ్యూడల్ భావజాలంపైనా, ఛందస్సుపైనా, గ్రాంథిక భాషపైన తిరుగుబాటు కవిత్వం ప్రారంభమైంది. 1934లోనే శ్రీశ్రీ మహాప్రస్థానం గేయం యువతరాన్ని విశేషంగా ఆకట్టుకుంది. దీనికితోడు ఈ ప్రాంతంలో జరిగిన సంఘ సంస్కరణోద్యమాల ప్రభావం యువత మీద పడింది. వీరేశలింగం ప్రభృతులు సాగించిన సంఘ సంస్కరణ కార్యకలాపాలు స్త్రీ విద్యా వాప్తికి సాగించిన కృషితోపాటు మరోపక్క బ్రాహ్మణేతర తరగతుల ఆత్మగౌరవ పోరాటం, మత విశ్వాసాల మీద, మూఢ నమ్మకాల మీద తిరుగుబాటు భావాలను పెంచింది. ప్రత్యామ్నాయ వివాహ పద్ధతులు, పౌరోహిత్యాలు ఆచరణ రూపం ధరించాయి. దేశంలో నెలకొన్న ఆర్థిక మాంద్యం రైతుల, కూలీల, మధ్య తరగతి ప్రజల నిత్య జీవనాన్ని దిగజార్చింది. వారు వర్గ సంఘాల వైపు, ఉద్యమాల వైపు అడుగులు వేసే స్థితి వచ్చింది.

ఈ నేపథ్యంలో ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ రూపుదిద్దుకుంది.. కమ్యూనిస్టులు జాతీయోద్యమంతోపాటు, ఈ సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, సంఘ సంస్కరణల ఉద్యమాల నేపథ్యం నుండి వచ్చారు. తొలితరం కమ్యూనిస్టులు ఈ స్రవంతుల మేలు కలయికకు ప్రతినిధులుగా వున్నారు. దేశభక్తులుగా, విప్లవకారులుగా, సంఘ సంస్కర్తలుగా సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రతినిధులు గా వున్నారు. కమ్యూనిస్టు పార్టీ వివిధ ప్రజాసమూహాల వర్గపరమైన పోరాటాలకే పరిమితం కాకుండా రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో ఒక ప్రత్యేక తరహా ఉద్యమాలకు, ప్రజాసంఘాల నిర్మాణానికి ద్వారాలు తెరిచింది.

## ఐక్యసంఘటన కాలంలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణ

1934లోనే ఆంధ్ర ప్రాంతంలో తొలి కమ్యూనిస్టు గ్రూపు ఏర్పడింది. అప్పటికి కమ్యూనిస్టు పార్టీపై నిషేధం వుంది. బహిరంగ కార్యకలాపాలకు అవకాశం లేదు. కమ్యూనిస్టు పార్టీ పేరు మీద కాకుండా ప్రజా సంఘాల రూపంలో కార్యకలాపాలు సాగించారు. కార్మిక సంఘాలను ఏర్పాటు చేశారు. కూలిరక్షణ సంఘాల పేరుతో కొన్ని పట్టణాలలో కార్యకలాపాలు నిర్వహించారు.

1936 నాటికి పరిస్థితి మారింది. కొమింటర్న్ సూచన మేరకు జాతీయోద్య మంలో భాగంగా పనిచెయ్యాలన్న నిర్ణయాన్ని జాతీయ పార్టీ తీసుకుంది. అప్పటికే కాంగ్రెస్‌లో భాగంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడింది. అదే సంవత్సరంలో ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ తొలి మహాసభ కాకినాడలో జరిగింది. అప్పటికి 40 మంది పార్టీ సభ్యులున్నారు. 10 మంది ప్రతినిధులతో జరిగిన ఈ మహాసభ ఐక్యసంఘటనా మార్గాన్ని ఆమోదించింది. కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీలో, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరి పని చెయ్యాలని నిర్ణయించింది. దీంతో బహిరంగంగా పనిచేసే అవకాశం వచ్చింది. కాంగ్రెస్ సంస్థను సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తిగా బలోపేతం చెయ్యడానికి వివిధ వర్గాల ప్రజలను ప్రజాసంఘాలుగా సంఘటిత పర్చే కార్యక్రమం తోపాటు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ పేరుతో సోషలిజాన్ని ప్రచారం చెయ్యడానికి అవకాశం వచ్చింది. కాంగ్రెస్ లోని అతివాదులతోనూ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభ్యులతోనూ పనిచెయ్యడం ద్వారా వచ్చిన సంబంధాలను కమ్యునిస్టు సిద్ధాంతాల వైపు మళ్లించడానికి వీలు కలిగింది.

## 1936-40 మధ్యకాలంలో కమ్యూనిస్టు పార్టీ విస్తరించిన తీరును రేఖా మాత్రంగా క్రోడీకరించుకుందాం.

1. కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో భాగంగా కమ్యూనిస్టులకు బహిరంగంగా పనిచేసే అవకాశం వచ్చింది. సంస్థాగత నిర్మాణంలో చురుకైన పాత్ర నిర్వహించడం ద్వారా కాంగ్రెస్‌లో, కాంగ్రెస్ సోషలిస్టుపార్టీలో జిల్లా స్థాయి, తాలూకా స్థాయి పదవులకు ఎంపికయ్యారు. అనతి కాలంలోనే కాంగ్రెస్ సోషలిస్టుల పార్టీకి సుందరయ్యగారే ప్రధాన కార్యదర్శి అయ్యారు.
2. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తరఫున నిర్వహించిన బహిరంగ సభలలో జాతీయ నాయకుల ప్రసంగాలతో ఉత్తేజితులైన యువకులు, కమ్యునిస్టు భావజాలంవైపు ఆకర్షితులయ్యారు. వీరికి రాజకీయ పాఠశాలలు నిర్వహించి సోషలిస్టు చైతన్యాన్ని కల్పించారు. కొత్తపట్నం, మంతెనవారి పాలెంలో నిర్వహించిన పాఠశాలలకు హాజరైన వారంతా తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరారు.
3. కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్న నవశక్తి పత్రిక, దాని ప్రచురణలు కమ్యూనిస్టు సాహిత్యాన్ని అందించటంలో కీలకపాత్ర వహించింది. రష్యన్ విప్లవంపైన, సోషలిస్టు వ్యవస్థ ఆవశ్యకతపైనా చేసిన ప్రచురణలు జాతీయోద్యమంలో పాల్గొంటున్న ఇతరులను కూడా ప్రభావితులను చేశాయి.
4. జాతీయోద్యమాన్ని విస్తృత పరిచే లక్ష్యంలో భాగంగా వివిధ ప్రజా సంఘాల నిర్మాణం జరిగింది. కాంగ్రెస్‌లో అంతర్భాగంగానే అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ), అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) తర్వాత అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) సంస్థలు ఏర్పడినా అవి కమ్యూనిస్టుల ప్రభావం కిందే పనిచేశాయి. జాతీయోద్యమ ప్రచారంతోపాటు, ఆయా తరగతుల వర్గ సమస్యలపై ప్రచారం ఆందోళనలు సాగించాయి. ఈ తరగతుల విముక్తి సోషలిస్టు సమాజం ఏర్పాటుతోనే జరుగుతుందన్న ప్రచారం జోడించబడింది. అంటరానితనంపైనా, మహిళా సమానత్వంపైనా, ప్రచారంతో పాటు, మత మూఢ విశ్వాసాలపైన, సాంఘిక దురాచారాలపైనా, ఫ్యూడల్ సంప్రదాయాలపైనా ప్రచారాలను నిర్వహించారు.
5. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నిర్వహణలో, ప్రజాసంఘాల నిర్మాణంలో ఐక్య సంఘటన సూత్రాలను పాటించి అందరితోనూ కలిసి పనిచెయ్యడం, తమ ప్రాబల్యంలో వున్న ప్రజా సంఘాలలో అందరికీ ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా బలమైన ఐక్యప్రజా ఉద్యమాలకు పునాదులు వేశారు.

## స్వతంత్రంగా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ దశ

- 1940 దశకంలో కమ్యూనిస్టు పార్టీ రెండు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నది.
- 1939లో రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. కమ్యూనిస్టులు యుద్ధ వ్యతిరేక నినాదాన్ని తీసుకున్నారు. కాంగ్రెస్ యుద్ధ వ్యతిరేకతను ప్రకటించినా అచేతనంగా వుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సత్యాగ్రహాన్ని ప్రకటించాలని కమ్యూనిస్టులు డిమాండ్ చేశారు. యుద్ధవ్యతిరేక ప్రచారాన్ని సాగించారు.
- 1940లో సుభాష్ చంద్రబోస్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని ఏర్పాటు చేశారు. బోస్ అనుయాయులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నుండి వైదొలిగారు. కమ్యూనిస్టుల విస్తరణ గిట్టని మితవాద సోషలిస్టులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నుండి కమ్యూనిస్టులను బహిష్కరించారు. అప్పటికి ఇంకా కమ్యూనిస్టుపార్టీపై నిషేధం కొనసాగుతూనే వుంది.
- మరోపక్క 1941లో ఫాసిస్టు హిట్లర్ రష్యాపై యుద్ధం ప్రకటించాడు. కమ్యూనిస్టు పార్టీ యుద్ధ వ్యతిరేక నినాదం సందిగ్ధంలో పడింది. ఫాసిజానికి వ్యతిరేకంగా సోషలిస్టు రాజ్యాన్ని కాపాడుకోవడం ప్రధానం అన్న భావనతో రష్యా సాగించే యుద్ధాన్ని 'ప్రజాయుద్ధం'గా ప్రకటించింది. రష్యా కూటమిలో వున్న బ్రిటిష్ ప్రభుత్వం  ఇక్కడ చేస్తున్న యుద్ధ సన్నాహాలను బలపర్చాలని నిర్ణయించింది. ఇదే సమయంలో 1942లో కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రకటించింది. కమ్యూనిస్టు పార్టీ దానిని వ్యతిరేకించింది. ఈ ఉద్యమం ఫాసిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రభుత్వ యుద్ధ సన్నాహాలను బలహీనపరుస్తుందని భావించింది. దీంతో కమ్యూనిస్టు పార్టీ జాతీయోద్యమం నుండి వేరుపడింది. కాంగ్రెస్‌లో, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో భాగంగా సాగిన ఐక్య సంఘటన దశ ముగిసింది. కమ్యూనిస్టు పార్టీ ఒంటరిగా తన కార్యకలాపాలను రహస్యంగా సాగించే స్థితి వచ్చింది.

ఆంధ్ర ప్రాంతంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నుంచి కొందరు బోసు అనుయాయులు ఫార్వర్డ్ బ్లాక్‌గా, ఎం.ఎన్.రాయ్  అనుచరులు కొందరు వేరు పడ్డారు. ఆంధ్రలో మొత్తంమీద కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ అంతా కమ్యూనిస్టు పార్టీగా రూపాంతరం చెందింది. ప్రజా సంఘాల నాయకత్వం కొద్ది మినహాయింపులతో కమ్యూనిస్టుల ప్రాబల్యం కిందికి వచ్చింది.

'ప్రజాయుద్ధం' నినాదంతో ప్రభుత్వ యుద్ధ సన్నాహాలకు సహకరించే విధానాన్ని చేపట్టడంతో 1942లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించారు. మరోపక్క క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ నేతలను ప్రభుత్వం అరెస్టు చేసి జైళ్ళలో పెట్టింది. కాంగ్రెస్ కార్యకలాపాలపై నిషేధాన్ని ప్రకటించింది. జాతీయోద్యమ వ్యతిరేకులుగా, బ్రిటిష్ ప్రభుత్వం అనుకూలురుగా రష్యా ఏజంట్లుగా కమ్యూనిస్టు పార్టీపై విద్వేష ప్రచారం సాగింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రంలో వివిధ ప్రజాసంఘాలను నిర్మించింది. 1942-46 మధ్య కాలంలో అది ఒక అసాధారణ శక్తిగా ఎదిగింది. దానికి వారు చేపట్టిన కార్యకలాపాలు, అనుసరించిన ఎత్తుగడలను లోతుగా అధ్యయనం చెయ్యాలి.

## కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలు

కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగిపోవడంతో 1942 నుండి రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ బహిరంగ కార్యక్రమాలు మొదలయ్యాయి. విజయవాడలో పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజాశక్తి వారపత్రిక తిరిగి వెలుగులోకి వచ్చింది. రాజకీయ, సాహిత్య పుస్తకాల ప్రచురణ మొదలైంది. రష్యా, చైనాలలో పరిణామాలపైనా పుస్తకాలు వెలువడ్డాయి.

1943లో విజయవాడలో పార్టీ 3వ మహాసభ జరిగింది. పూర్వం కొన్నివందల సంఖ్యలో వున్న పార్టీ సభ్యత్వం ఈ మహాసభ నాటికి 3,250కి పెరిగింది. రెండు వేల కాపీలతో ప్రారంభమైన ప్రజాశక్తి 9,500 కాపీలకు చేరింది. 1,900 గ్రామాలకు పంపిణీ జరిగేది. పార్టీ పిలుపు మేరకు చాలా మంది తమ ఆస్తులను అమ్మి విరాళంగా ఇచ్చారు.

ఈ మహాసభ నాటికి 70 వేల రైతు సంఘ సభ్యత్వం, 24 వేల ట్రేడ్ యూనియన్ సభ్యత్వం, 40 వేల మంది యూత్ లీగ్ సభ్యత్వం, 24 వేల మంది వ్యవసాయ కార్మిక సంఘ సభ్యత్వం వున్నట్లు మహాసభ నివేదిక వెల్లడించింది.

అంతర్జాతీయంగా ఫాసిజంపై పోరాటానికి ప్రభుత్వ యుద్ధ సన్నాహాలకు తోడ్పాటునిస్తూనే కమ్యూనిస్టు పార్టీ కొన్ని కీలకమైన రాజకీయ డిమాండ్లను తన ప్రచార, ఆందోళనా కార్యక్రమాలలో భాగం చేసింది. జైళ్లలో వున్న కాంగ్రెస్ నాయకులను విడుదల చెయ్యాలని, దేశ ప్రజలంతా యుద్ధ ప్రయత్నాలకు సహకరించే విధంగా కాంగ్రెస్-లీగ్-కమ్యూనిస్టులతో కూడిన జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేసింది. పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాలలో ఈ

నినాదాలు ప్రముఖస్థానం పొందాయి. ఈ నినాదాలు కమ్యూనిస్టులు జాతీయోద్యమానికి వ్యతిరేకులు అన్న ప్రచారం ప్రజల మీద పెద్దగా ప్రభావం చూపకుండా నిరోధించగలిగాయి. ఈ కాలంలో కమ్యూనిస్టులు వివిధ ప్రజాసంఘాలలో పనిచేసిన తీరుని, అనుసరించిన ఎత్తుగడలను విశ్లేషించుకోవాలి. అప్పుడే కమ్యూనిస్టులు సాధించిన అసాధారణ ప్రజాఉద్యమ విస్తరణ మనకి అవగతం అవుతుంది.

## ప్రజా సంఘాలలో కమ్యూనిస్టు పార్టీ : కార్మిక సంఘాలు

'ప్రజాయుద్ధం' నినాదం ప్రకారం కార్మిక సంఘాలు సమ్మెలను నివారించాలి. ఉత్పత్తిని పెంచాలి. దీనిని యధాతథంగా అమలు చేస్తే ఉన్న కార్మిక సంఘాలు కూడా దూరం అయ్యేవి. ప్రజాయుద్ధం నినాదాన్ని ప్రచారం చేస్తూనే కార్మికులు ఉత్పత్తిని పెంచాలంటే వారు ఇష్టపూర్వకంగా పనిచేసే పరిస్థితులు కల్పించాలని కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. కార్మికుల వేతనాలను 25 శాతం పెంచాలని, కరువు భత్యం పెంచాలని, పరిశ్రమలలో పని పరిస్థితుల మెరుగుకు కార్మికుల భాగస్వామ్యంతో కమిటీలు వెయ్యాలని, వారానికి 48 గంటల పనిని పాటించాలని, మహిళలకు సమాన పనికి సమాన వేతనం, ప్రసూతి సెలవులు ఇవ్వాలనే డిమాండ్లతో కార్మికులను సమీకరించింది. ప్రభుత్వం ఈ డిమాండ్ల పట్ల సానుకూలంగా వుండాలని డిమాండ్ చేసింది. ఉత్పత్తిని పెంచాలనే నినాదంతో కార్మికుల్ని యజమానులకు కట్టు బానిసలను చెయ్యకుండా ఆ నినాదాన్ని కార్మికుల నిత్యజీవిత సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టులు భాగం చేశారు. కార్మికుల ఆకాంక్షలను పెంచి వారిని కార్మిక సంఘాలలోకి ఆకర్షించారు.

### కార్మిక సంఘాల పరిధిలో ఉపశ్రేణులు

ఆంధ్ర ప్రాంతంలో పారిశ్రామిక రంగం అంతగా అభివృద్ధి చెందలేదు. పరిశ్రమలలో కార్మిక సంఘాల ఏర్పాటుతోపాటు, ప్రభుత్వరంగ సంస్థలుగా వున్న రైల్వేలు, పోర్టులు, ప్రభుత్వ పాలనా శాఖలలో వున్న మున్సిపల్ కార్మికులను (ఏఐటీయూసీ) సంఘాలుగా సమీకరించారు. కులం ప్రాతిపదికగా వున్న చేనేత, గీత కార్మికుల్ని వృత్తి సంఘాలుగా నిర్మించారు. ప్రత్యక్షంగా యజమానులు లేకపోయినా కొన్ని హక్కుల కోసం, పరస్పర సహకారం కోసం తోపుడుబళ్ల

సంఘాలు తాపీ, టైలరింగ్ తదితర సంఘాలు నిర్మించారు. ఒక్క మాటలో చెప్పాలంటే వ్యవసాయేతర రంగంలో శ్రామికులందరినీ సమీకరించే వేదికగా ఏఐటీయూసీకి విశాల ప్రాతిపదికను ఇచ్చారు. ఫాసిస్టు వ్యతిరేక ప్రచారంలో భాగంగా తొలి శ్రామిక విప్లవం సాధించిన రష్యా మీద, అక్కడ శ్రామికులు, మహిళల స్థితిగతుల మీద విస్తృత ప్రచారం చేశారు. శ్రామిక రాజ్యం ఏర్పాటుతోనే కార్మికవర్గ విముక్తి జరుగుతుందని స్పష్టం చేశారు. కార్మికులకు రాత్రి పాఠశాలలు నిర్వహించారు. కార్మికులలో వర్గ చైతన్యాన్ని పెద్ద ఎత్తున కల్పించారు.

## వ్యవసాయ కార్మిక సంఘం

1942-46 మధ్యకాలంలో కమ్యూనిస్టు పార్టీ గ్రామాలలో బలమైన వ్యవసాయ కార్మిక సంఘాన్ని నిర్మించింది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంపుదలకు ఉద్యమాన్ని చేపట్టింది.

వీలైన చోట్ల ఒప్పందాల ద్వారా కూలిరేట్లు పెంపును సాధించింది. గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీ సారథ్యంలో రైతు సంఘాలు వుండడం దీనికి దోహదం చేసింది. అలాంటి ఒప్పందాలు రానిచోట్ల సమ్మెలు నిర్వహించి పెంపుదల సాధించింది. దీనికితోడు పేదల కోసం చౌక ధరల దుకాణాలు ఏర్పాటు చెయ్యాలనే ఉద్యమాన్ని చేపట్టింది.

- ప్రభుత్వం ఇచ్చిన ఆహారధాన్యాల అధికోత్పత్తి నినాదాన్ని ఆధారం చేసుకుని వ్యవసాయ కూలీలకు పేదరైతులకు ప్రభుత్వం బంజర్లను, జమీందారీ బంజర్లను పంపిణీ చెయ్యాలని ఆందోళన చేసింది. ప్రభుత్వ బంజర్ల పంపిణీని చాల చోట్ల సాధించింది.- పేదల ఆకలియాత్రలు నిర్వహించింది. బ్లాక్ మార్కెట్ దారుల దగ్గర వున్న అక్రమ నిల్వలను వెలికితీసి ప్రభుత్వ ధరలకు అమ్మించే కార్యక్రమాలు నిర్వహించింది .
- కాంగ్రెస్ వాదులు, షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ వారు ఈ పేదలను సమీకరించే ప్రయత్నాలు చేశారు. కమ్యూనిస్టు పార్టీ దీనికి ప్రతిగా ఐక్యసంఘటన నినాదాన్ని ముందుకు తెచ్చింది. ఏ పార్టీకి చెందిన వారైనా ఆ పార్టీలోనే వుంటూ అందరి ప్రయోజనాల కోసం ఒకే కూలి సంఘంలో చేరి పనిచెయ్యాలని ఇచ్చిన పిలుపు అందరినీ ఆకర్షించింది. కాంగ్రెస్ వాదులు, అంబేద్కరిస్టులు ఈ సంఘాలతో కలిసి పనిచేశారు.

- కమ్యూనిస్టు కార్యకర్తలు ఈ పేదల పేటలలోనే నివసించారు. కుల భేదం లేకుండా వారి ఇంటనే తిన్నారు. రాత్రి పాఠశాలు నిర్వహించారు. చదువుతోపాటు రాజకీయాలపైనా, సోషలిజంపైనా పాఠాలను చెప్పారు. కుల భేదాలను వారు పాటించకపోగా ఈ కార్యకర్తల్లో చాలా మంది కులాంతర వివాహాలు చేసుకున్నారు. వాటిని ప్రోత్సహించారు. మత ఛాందసాల మీద, అణచివేత సాంప్రదాయాల మీద తిరుగుబాటు భావాలు నూరిపోశారు.
- వందలాది గ్రామాలలో వ్యవసాయ కూలిసంఘాలు ఏర్పడ్డాయి. గ్రామాలలో కులాల మధ్య వివాదాలను ఈ సంఘాలే పరిష్కరించేవి. పేదలు తమ కుటుంబ సమస్యల నుండి, కూలి సమస్యలు, పాలేర్ల సమస్యలు వగైరా అన్ని సమస్యలకు వ్యవసాయ కార్మికసంఘం తలుపు తట్టే పరిస్థితి వచ్చింది. గ్రామాలలో కుల పెద్దల స్థానాన్ని వ్యవసాయ కార్మిక సంఘాలు ఆక్రమించాయి.
- 1944 విజయవాడలో జరిగిన అఖిల భారత రైతు మహాసభ బహిరంగ సభకు 15 వేల మంది వ్యవసాయ కూలీలు వచ్చారు. మహాసభ నిర్వహణకు నాలుగు వేల మంది వలంటీర్లు వుండగా అందులో వెయ్యి మంది వ్యవసాయ కార్మిక సంఘానికి చెందిన వారున్నారు. ఇలా గ్రామాలలో ఏకైక సంఘంగా వ్యవసాయ కార్మిక సంఘం రూపొందింది. గ్రామాలలో ఈ సంఘాలు కమ్యూనిస్టు పార్టీకి పెట్టని కోటలయ్యాయి.

## రైతు సంఘం

కమ్యూనిస్టు పార్టీకి తొలిదశలో ఆకర్షితులైన వారిలో అత్యధికులు రైతు కుటుంబాల నుండి వచ్చారు. రైతు ఉద్యమం వారికి బాగా తెలిసిన కార్యరంగం అయింది.

- 1942లో పార్టీ పై నిషేధం తొలగిన తర్వాత రైతు ఉద్యమం మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. అన్ని జిల్లాలలో, తాలూకాలలో రైతు సంఘాల నిర్మాణం చేశారు.
- యుద్ధకాలంలో ప్రభుత్వం 'ఆహార ధాన్యాల అధికోత్పత్తి' నినాదాన్ని ఇచ్చింది. దానిని కమ్యూనిస్టు పార్టీ తనదైన రీతిలో అందిపుచ్చుకుంది.
- ఆహార ధాన్యాల అధికోత్పత్తికి రైతులకు అందించాల్సిన ప్రోత్సాహకాలను రైతు ఉద్యమ డిమాండ్లుగా చేసింది. వ్యవసాయ రుణాలపై మారటోరియం ప్రకటించాలని, రైతులకు రుణ సదుపాయం పెంచాలని, పంటలను గిట్టుబాటు

ధరలకు ప్రభుత్వం కొనుగోలు చెయ్యాలని కోరుతూ రైతు ఉద్యమాలను సాగించింది. బ్లాక్ మార్కెట్లకు తరలిపోయే ఎరువులను పట్టుకుని కంట్రోలు ధరలకు అమ్మించింది

- మరో పక్క కమ్యూనిస్టులు జమీందారీలలో భూమి హక్కు కోసం రైతుల్ని సమీకరించారు. జమీందారులు తమ భూముల నుండి సాగు చేస్తున్న రైతులను వెళ్ళగొట్టే ప్రయత్నాలను ప్రత్యక్షంగా ప్రతిఘటించారు. దున్నేవానికి భూమి అన్న నినాదంతో రైతు సత్యాగ్రహాలు నిర్వహించారు. జమీందారీలలో వున్న బంజర్ల ఆక్రమణలకు వ్యవసాయ కూలీలను, పేదరైతులను సమీకరించారు. జమీందారీ రద్దు పోరాటాన్ని విస్తృత పరిచారు.
- ఆహార ధాన్యాల అధికోత్పత్తిలో భాగంగా సాగు నీటి వసతుల కోసం ఎక్కడికక్కడ కార్యాచరణ సాగించారు. చెరువుల పూడిక తీతల కోసం ఇరిగేషన్ కాలువల తవ్వకాల కోసం, కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రైతులను సమీకరించి ఆందోళనలు చేశారు.
- కమ్యూనిస్టు పార్టీ సారథ్యంలో రైతు సంఘాల తరపున వివిధ జిల్లాలలో పంట కాలువల తవ్వకాలు సాగించారు. కమ్యూనిస్టు నాయకులు స్వయంగా ఈ కార్యక్రమాలలో పాల్గొని రైతు నాయకులుగా పేరు తెచ్చుకున్నారు.
- 1943 నాటికే రాష్ట్రంలో రైతు సంఘం సభ్యత్వం 70 వేలు దాటింది. 1944లో విజయవాడలో జరిగిన అఖిల భారత కిసాన్ సభలో పాల్గొన్న రెండు లక్షల మందిలో అత్యధికులు రైతులే. ఈ రైతు ఉద్యమం కమ్యూనిస్టు పార్టీకి, ప్రజా సంఘాలకు చాలా మంది నాయకుల్ని అందించింది. రైతులను సమీకరించే ఏకైక సంస్థగా రైతు సంఘం ఆవిర్భవించింది.

## విద్యార్థి ఫెడరేషన్

1942–46 మధ్య కాలంలో విద్యార్థి ఫెడరేషన్ అత్యంత బలమైన విద్యార్థి సంఘంగా విస్తరించింది. విద్యార్థి ఉద్యమాన్ని విశాల ప్రాతిపదికపై అందరినీ కూడగట్టే ఉద్యమంగా నిర్వహించాలని తలపెట్టింది.

- యుద్ధ సన్నాహాలను బలపరుస్తూ, ఫాసిజం ప్రమాదానికి వ్యతిరేకంగా ప్రచారం సాగిస్తూ, సోషలిస్టు రష్యాలోని సోషలిస్టు వ్యవస్థను ఆదర్శంగా ప్రకటిస్తూ విద్యార్థులలో ప్రచారం చేసింది. అలాగే జైళ్లలో వున్న కాంగ్రెస్ నాయకులను

విడుదల చెయ్యాలని, అన్ని పార్టీలతో జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యాలన్న డిమాండ్లకు విస్తృత ప్రచారం కల్పించింది.

- విద్యార్థులను వారి తక్షణ సమస్యలపై సమీకరించి ఉద్యమాలు, స్థానిక ఆందోళనలు చేపట్టింది. విద్యాసంస్థలలో ఫీజులు తగ్గించాలని, గ్రంథాలయాలు, హాస్టలు సౌకర్యాలు కల్పించాలని, క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలకు తగిన ఏర్పాట్లు చెయ్యాలని అన్నిచోట్ల విద్యార్థులతో ఆందోళనా కార్యక్రమాలు సాగించింది. విద్యార్థులకు తానే స్వయంగా ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనల పోటీలు, వ్యాసరచన-వక్తృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులను ఆకర్షించింది.
- విద్యార్థి ఫెడరేషన్ మహాసభలకు కమ్యూనిస్టులు కాని ప్రముఖులను, కవులను, రచయితలను ఆహ్వానించి దానికి ఒక ఉమ్మడి ఉద్యమ రూపాన్ని ఇచ్చింది. ఫెడరేషన్ నాయకత్వంలో కమ్యూనిస్టులతో పాటు ఇతరులకు ప్రాధాన్యతనిచ్చి వారిని ఉద్యమంలో భాగస్వాములను చేసింది.
- చురుకైన విద్యార్థి కార్యకర్తలకు రాజకీయ పాఠశాలలు నిర్వహించి వారిని కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షించింది. ఈ కార్యకర్తలు అనేక గ్రామాలలో రాత్రి పాఠశాలలు నిర్వహించి, పేదలలో రాజకీయ చైతన్యానికి కృషి చేశారు.
- 1946 నాటికి రాష్ట్రంలో మొత్తం కాలేజీలు, హైస్కూళ్ల విద్యార్థులలో 25 శాతం మంది ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. విద్యార్థులు పలు గ్రామాలకి, పలు వర్గాలకి చెందిన వారు కావడంతో కమ్యూనిస్టు పార్టీ విస్తరణలో విద్యార్థి ఉద్యమం కీలకపాత్ర పోషించింది.

## యూత్ లీగ్స్

గ్రామాలలో పెడమార్గంలో వున్న యువతను నిర్మాణ కార్యక్రమాలలోకి రాజకీయ కార్యకలాపాలలోకి మళ్లించడానికి కమ్యూనిస్టు పార్టీ యూత్ లీగ్స్ ఏర్పాటుకు పూనుకుంది.

- 1942లో గుంటూరులో యూత్ లీగ్స్ మహాసభ జరిపి దాని కార్యకలాపాలకు నిర్దిష్ట రూపం ఇచ్చింది.
- గ్రామాలలో యువతను ఆకర్షించడానికి ఆటలు, సాంస్కృతిక కార్యకలాపాలను చేపట్టింది. ప్రతి ఏటా ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించింది.

యువకుల మానసిక, శారీరక వికాసం పట్ల ఆసక్తిని పెంచింది. విజ్ఞాన యాత్రలు, విహార యాత్రలను నిర్వహించింది.

- గ్రామాలలో ప్రతి చిన్న పనికి ఎవరి మీదనో ఆధారపడకుండా యువకులను శ్రమదానం కార్యక్రమాల ద్వారా గ్రామాభివృద్ధిలో భాగస్వాములను చేసింది.
- యూత్ లీగ్స్ ద్వారా గ్రామాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. రాత్రి పాఠశాలలు నిర్వహించారు. వీటిద్వారా గ్రామస్థులలో రాజకీయ చైతన్యాన్ని, అక్షర జ్ఞానాన్ని పెంపొందించారు.
- ఈ యువజన సంఘాలు స్థానికంగా సంఘ సంస్కరణ కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ సంఘాల ద్వారా బాల్యవివాహాలు జరగకుండా అడ్డుకున్నారు. కులాంతర వివాహాలు, వితంతు వివాహాలను ప్రోత్సహించారు. స్త్రీ విద్యను, సమానత్వాన్ని ప్రచారం చేశారు. స్త్రీలను వివిధ కార్యక్రమాలలో భాగస్వాములను చేశారు.
- మూఢ విశ్వాసాలను, ఫ్యూడల్ సంప్రదాయాలను ప్రతిఘటించారు. ప్రజలను కళారూపాల ద్వారా చైతన్యపరిచారు. ఫాసిస్టు వ్యతిరేక ప్రచారాన్ని, సోషలిస్టు సమాజం ఆవశ్యకత పై ప్రచారాన్ని అన్ని కార్యకలాపాలలో జోడించారు. ఈ యువత సమాజంలోని వివిధ వర్గాలకు చెందినవారు కావడంతో గ్రామంలోని అన్ని తరగతులలోనూ కమ్యూనిస్టుల ప్రభావం విస్తరించింది.

## మహిళా సంఘాలు

జనాభాలో సగభాగంగా వున్న మహిళలను సమీకరించి ప్రజాఉద్యమాలలో భాగం చెయ్యకుండా రాజకీయ, సామాజిక మార్పులు సాధ్యం కావని కమ్యూనిస్టు పార్టీ భావించింది. గ్రామాలలో ప్రధానంగా పట్టణాలలో మహిళా సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది.

- మహిళల నిత్య జీవిత సమస్యల చుట్టూ వారిని సమీకరించే కార్యక్రమాలను రూపొందించింది. స్త్రీల ఆరోగ్యం, పిల్లల పెంపకం, ప్రసూతి కేంద్రాల ఏర్పాటు, పేదలకు రేషన్ కార్డులు, చౌక ధరల దుకాణాలు, సమాన పనికి సమాన వేతనం, బాల్య వివాహాల రద్దు, వితంతు వివాహాలకు ప్రోత్సాహం వంటి అంశాలపై సాగించిన ప్రచారం మహిళలలో కొత్త ఆకాంక్షలను రేకెత్తించింది. గ్రంథాలయాలలో ఈ తరహా పుస్తకాలను మహిళలకు

అందుబాటులోకి తెచ్చింది. ఝూన్సీ లక్ష్మీబాయి, రష్యాలో ఫాసిస్టు వ్యతిరేక పోరాట యువతి టాన్యా జీవిత చరిత్రలను అందుబాటులోకి తెచ్చి తిరుగుబాటు భావాలను వారికి అందించింది.

- విశాఖ, కాకినాడలలో బాంబులు పడడంతో ఫాసిస్టు యుద్ధ ప్రమాదం అందరికీ తెలిసి వచ్చింది. దేశం మీద ఫాసిస్టు దాడి జరిగితే మహిళల స్వీయ రక్షణ, ఆత్మగౌరవ పరిరక్షణ ఆవశ్యకతపై ఈ మహిళా సంఘాలు ప్రచారం చేశాయి. మహిళలకు 'స్వీయ రక్షణ శిక్షణ' శిబిరాలను నిర్వహించింది. ఇది వివిధ వర్గాల మహిళలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ శిక్షణలో స్వీయరక్షణ, మిలటరీ డ్రిల్లుతోపాటు ఫాసిస్టు ప్రమాదాన్ని, సోవియట్ మహిళలు సాధించుకున్న హక్కులపై ప్రచారాన్ని కూడా భాగం చేశాయి
- ప్రజానాట్యమండలి ప్రదర్శనలలో పురుషులే స్త్రీ పాత్రలు ధరించే స్థితిని తొలగించి ఆ పాత్రలను స్త్రీలే ధరించే చైతన్యం వచ్చింది. మహిళల ప్రత్యేక బుర్రకథ దళాలు స్త్రీ సమస్యలతోపాటు రాజకీయ సమస్యలపై సాగించిన ప్రదర్శనలు ప్రజల్ని విశేషంగా ఆకర్షించాయి.
- ఆంధ్రప్రాంతంలో మహిళలను బహుముఖ రంగాలలో ఆకర్షించిన ఏకైక మహిళాసంఘం అయింది. 1945 నాటికి అన్ని జిల్లాలలో మహిళా సంఘాల కార్యకలాపాలు వందలాది గ్రామాలకు విస్తరించాయి. మహిళా సంఘం సభ్యత్వం 20 వేలకు చేరింది.

## బాల సంఘాలు

బాల బాలికలను చదువుపట్ల, ఆటపాటల పట్ల, ఆసక్తి కలిగించడానికి బాలసంఘాలు ఏర్పడ్డాయి. భరత మాత ముద్దు బిడ్డలం – బాలదళం సభ్యులం అంటూ దేశభక్తిని చిన్న వయసులోనే ఈ సంఘాలు అందించాయి. గ్రామ గ్రంథాలయాలలో పిల్లల పుస్తకాలు, సాహస గాథల పుస్తకాలు ఏర్పాటు చేశారు.

- పిల్లలకు ఆటల పోటీలు – పాటల పోటీలు నిర్వహించారు. ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం, కరువు బాధితులకు సహాయ కార్యక్రమాలు, సాంఘిక దురాచారాల ను వ్యతిరేకించే అంశాలతో బాలదళాల సాంస్కృతిక బృందాలకు శిక్షణ ఇచ్చారు. ఈ బాలదళాల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రత్యేకించి బుర్రకథలు విశేషంగా ప్రజల్ని ఆకట్టుకున్నాయి.

- 1945 నాటికి ఆంధ్ర ప్రాంతంలో 1200 గ్రామాలలో 40 వేల మంది బాల సంఘంలో  సభ్యులయ్యారు.

## అభ్యుదయ రచయితల సంఘం (అ.ర.సం)

1943లో ఆంధ్ర రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం  ప్రథమ మహాసభ తెనాలిలో జరిగింది. అప్పటికే తెలుగు సాహిత్యంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మహాసభ అలాంటి రచయితలందరినీ సమీకరించి ఒక సంఘంగా వ్యవస్థాగత రూపం ఇచ్చింది. ఈ సంఘంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం వున్నప్పటికీ దానిని పార్టీయేతర సంఘంగా ఏర్పాటు చేసింది.

- అరసం ఆవిర్భావంతో తెలుగు సాహిత్యం స్వరూప, స్వభావాలు పూర్తిగా మారిపోయాయి. సమాజం కోసం రచనలు, ప్రజల భాషలో రచనలు, ప్రజా సమస్యలు ఇతివృత్తంగా రచనలు, ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదే సాహిత్య సృజన పెద్దఎత్తున సాగింది. వ్యావహారిక భాష, దానికి తగ్గ ఛందస్సు, ఇలా మొత్తం సాహిత్యం కొత్తరూపాన్ని పొందింది.
- సాహిత్య వర్క్ షాపులను నిర్వహించి యువ రచయితలను ఆకర్షించింది. వారికి రచనా పాటవాలతోపాటు రాజకీయ సైద్ధాంతిక అవగాహన కల్పించింది.
- అభ్యుదయ సాహిత్య ప్రచారానికి అభ్యుదయ, నగారా, తెలుగుతల్లి, అరుణరేఖ, సంధ్య, ఉదయిని వంటి అనేక పత్రికలను నిర్వహించారు.
- రాష్ట్రంలో జరుగుతున్న ప్రజాసంఘాల కార్యకలాపాలకు ఉత్తేజం కలిగించే రచనలతో పాటు తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చే రచనలు వచ్చాయి.
- 1946 నాటికి అరసంలో 900 మంది రచయితలు సభ్యులుగా వున్నారు. తెలుగు సాహిత్యం మీద అరసం తిరుగు లేని అధిపత్యాన్ని పొందింది.

## ప్రజా నాట్యమండలి

ఆంధ్ర ప్రాంతంలో సాహిత్య, సాంస్కృతిక  రంగాల ద్వారా సాధించిన భావ విప్లవంలో అరసం, ప్రజానాట్యమండలి కీలకపాత్ర పోషించాయి. ఫాసిస్టు వ్యతిరేక

ప్రచార దళాలకు ప్రజల నుండి లభించిన విశేష ఆదరణ ప్రజానాట్యమండలి ఏర్పాటుకు ప్రేరణ అయింది.

- 1943లో ప్రజానాట్యమండలి ఏర్పడింది. అంతవరకు పురాణగాథల చుట్టూ తిరుగుతున్న నాటక రంగాన్ని ప్రజానాట్యమండలి ప్రజల బాట పట్టించింది. ప్రజల జీవిత సమస్యల చుట్టూ ప్రజల భాషలో సాగిన కళాప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రజలకు మరింత చేరువకావడానికి కనుమరుగవుతున్న జానపద కళారూపాలను వెలుగులోకి తెచ్చింది. వర్తమాన పరిస్థితులకు తగిన రచనలు చేసి ప్రదర్శించింది.
- వివిధ ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న ఉద్యమాలను ఇతివృత్తంగా రూపొందించిన కళా ప్రదర్శనలు ఆయా వర్గాలను ఉత్తేజితుల్ని చేశాయి.
- తెలంగాణాలో సాగుతున్న రైతాంగ పోరాటం, ఆంధ్రప్రాంతంలో జమీందారీ వ్యతిరేక పోరాటాలను నాటికలు, పాటలు తదితర కళారూపాలద్వారా ప్రచారం చేశాయి. మూఢనమ్మకాలను, అంధ విశ్వాసాలను ఎండగట్టే కళారూపాలు, సంఘసంస్కరణను ప్రోత్సహించే ప్రదర్శనలతో ప్రజలను చైతన్య పరిచాయి.
- రాష్ట్రవ్యాపితంగా అనేక బుర్రకథ దళాలు, నాటికల దళాలు జానపద కళారూపాలతో ప్రజలలో భావ విప్లవాన్ని సాధించే ప్రయత్నం చేశాయి అల్లూరి సీతారామరాజు కథ దేశభక్తిని రగిలిస్తే మాభూమి, ముందడుగు, కష్టజీవి ప్రదర్శనలు ఉద్యమ చైతన్యాన్ని పెంపొందించాయి. 1946 నాటికి పూర్తికాలం పనిచేసే 21 ప్రజానాట్యమండలి కళాబృందాలు, పాక్షికంగా పనిచేసే 30 బృందాలు ప్రచార రంగంలో ఉన్నాయి.

## కమ్యూనిస్టు పార్టీ సాధించిన అసాధారణ శక్తి

ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ సాధించిన అసాధారణ శక్తిని అవగాహన చేసుకోవడానికి వీలుగా అది నిర్మించిన ప్రజా సంఘాలు సాగించిన బహుముఖ కార్యక్రమాలపై ఇంతటి వివరణ అవసరమైంది. 1934-47 మధ్య కాలంలో ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ విస్తరించిన క్రమంపై శ్రీ. ఐ.నర్సయ్య గారు మంచి పరిశోధన చేశారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలపై వందల పేజీల సమాచారాన్ని సేకరించారు. వాటి మూలాలను ఉటంకించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఆయన పరిశోధనా పత్రానికి డాక్టరేట్ ఇచ్చింది.

ఆయన తన పరిశోధన పత్రం ముగింపులో 'ఆంధ్ర ప్రాంతంలో కొన్ని పొరపాట్లు చేసినప్పటికీ సంస్కరణ వాద రాజకీయాలకు పాల్పడినప్పటికీ అక్కడ కమ్యూనిస్టు పార్టీ విశాలమైన ప్రజా పునాదిగల పార్టీగా రూపొందగలిగింది. పీడిత ప్రజల నాయకత్వ స్థానానికి ఎదగగలిగింది. కార్మిక వర్గానికి తిరుగులేని నేతగా నిలువగలిగింది. విప్లవాత్మకమైన రైతు ఉద్యమాన్ని నిర్మించగలిగింది. సామాజిక న్యాయం లక్ష్యంగా పోరాడే బలమైన శక్తిగా నిలబడగలిగింది. ఆంధ్ర ప్రాంతంలో ఆధునిక ప్రగతిశీల సాంస్కృతిక పతాకధారిగా ముందుకు వచ్చింది. ఫలితంగా రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే నాటికి ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ అసాధారణమైన బలం పుంజుకుని ప్రముఖ రాజకీయ శక్తిగా అవతరించింది. దేశంలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు ఆలస్యంగా జరిగినప్పటికీ ఆంధ్ర పార్టీ బలవత్తరమైన శక్తిగా ఆవిర్భవించింది. కాంగ్రెస్ నాయకత్వంలో సాగిన 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొనకూడదని నిర్ణయించినప్పటికీ ఆంధ్ర పార్టీ ఈ స్థితికి చేరుకోగలిగింది.' అని పేర్కొన్నారు

ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ సాధించిన 'అసాధారణ బలానికి' ఆయన చేసిన ముగింపు అద్దం పట్టింది. ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ 'అసాధారణ బలాన్ని పుంజుకుని' ప్రబల రాజకీయ శక్తిగా మారిన క్రమాన్ని అర్థం చేసుకోవడానికి గ్రాంసీ భావజాలం మనకి ఉపకరిస్తుంది. పౌరసమాజంలో ప్రత్యామ్నాయ రాజకీయం ఆధిపత్యం పొందే ప్రక్రియలను గ్రాంసీ ఆవిష్కరించారు. దీనికీ, ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ సాధించిన దానికీ ఉన్న పోలికలను సారూపత్యలను మనం విశ్లేషణ చేసుకోవాలి.

## 1. ఉపశ్రేణుల చారిత్రక సంఘటన

పౌర సమాజం మీద ఆధిపత్యానికి ప్రయత్నించే మౌలిక వర్గం, ఇతర ఉపశ్రేణులను సమీకరించి ఒక ఉమ్మడి లక్ష్యం, ఉమ్మడి భావజాలంతో ఒక 'చారిత్రక సంఘటన'గా ఏర్పడడం అన్నది గ్రాంసీ రూపొందించిన ప్రత్యామ్నాయ హెజమనీ భావనలో ఒక కీలక అంశం. ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ అలాంటి చారిత్రక సంఘటనను రూపొందించింది  పారిశ్రామిక కార్మికులకే పరిమితం కాకుండా అన్ని శ్రామికవర్గ ఉపశ్రేణులని కార్మిక సంఘాలలో సంఘటిత పరిచింది. గ్రామీణ వ్యవసాయ కూలీలను ప్రత్యేక సంఘం గా సమీకరించింది. పలు వర్గ సమూహాలకు చెందిన  విద్యార్థి, యువజనులను, వివక్షకు వ్యతిరేకంగా

మహిళలను సంఘాలలో సమీకరించింది. రైతులతో ఐక్య సంఘటనకు బదులు వారిని తానే ఒక ప్రజా సంఘంగా సమీకరించి ఈ ఉద్యమాలలో అంతర్భాగం చేసింది. కమ్యూనిస్టు పార్టీ ఈ ప్రజా సంఘాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా నాయకత్వం వహించి ఒక ఉమ్మడి ఆకాంక్ష, ఉమ్మడి లక్ష్యం గల ప్రజా సంఘాల సమ్మేళనాన్ని సాధించింది.

## 2. సవర్గ మేధావులు

పౌర సమాజంలో ఆధిపత్యాన్ని ప్రోదిచెయ్యడంలో సవర్గ మేధావుల పాత్రను గ్రాంసీ ప్రత్యేకంగా పేర్కొన్నాడు. వీరు కేవలం సిద్ధాంత పండితులు కాదు, ప్రజల గుండె చప్పుళ్ళను పసిగట్టగలవారై ఉండాలి. అంటే ప్రజా జీవనంలో, ఉద్యమాలలో మమేకం కాగలగాలి. అప్పుడే వీరు ఈ ఉపశ్రేణుల బృందాలకు ఉమ్మడి మేధో నాయకత్వాన్ని అందించగలగుతారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆ పాత్ర పోషించారు. అన్ని ప్రజాసంఘాలకు మేధోపరమైన నాయకత్వాన్ని అందించారు. అలాగే వారు సాగించిన ప్రజా ఉద్యమాలనుండి సవర్గ మేధావులు పుట్టుకొచ్చారు. మరోపక్క అభ్యుదయ రచయితలు కూడా ఇలాంటి పాత్ర పోషించారు. ప్రజా ఉద్యమాల నుండి స్ఫూర్తిని పొందారు. ప్రజా సమస్యలు, ఉద్యమాలు ఇతివృత్తాలుగా రచనలు చేశారు. వీరి రచనలు ఉద్యమానికి ప్రేరణ ఇస్తే ఉద్యమాలు వీరి రచనలకు ప్రేరణ అయ్యాయి. ఇలా ఉత్తమ ప్రజా మేధావులను కమ్యూనిస్టు పార్టీ రూపొందించుకుంది.

## 3. లోకజ్ఞానాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చే భావ విప్లవం

ప్రజల నిత్య జీవితాన్ని లోకజ్ఞానం నడిపిస్తుందని అది చాలా వైరుధ్యాలతో నిండి ఉంటుందని, దానిని విచక్షణా జ్ఞానంగా, ప్రజా చైతన్యంగా మార్చే సాంస్కృతిక విప్లవం తప్పనిసరి అన్నది గ్రాంసీ ఆవిష్కరించిన మరో కీలకమైన భావన. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు వివిధ ప్రజా సంఘాలతో వారి దైనందిన సమస్యలపై పోరాడుతూ వర్గ చైతన్యాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. రాత్రి పాఠశాలలను, రాజకీయ సామాజిక సాంస్కృతిక చైతన్యానికి వేదికలుగా చేసుకున్నారు. మరోపక్క అభ్యుదయ రచయితల సంఘం తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల మీద తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించింది. ఆంధ్ర ప్రాంతంలో సాహిత్య, సాంస్కృతిక భావ విప్లవానికి పునాదిగా మారింది. మరోపక్క ప్రజా నాట్య మండలి పేదలు, సామాన్య ప్రజల హృదయాలను ఆకట్టుకుంది. జానపద కళా రూపాల ద్వారా

సాంఘిక దురాచారాలను, మతమూఢ విశ్వాసాలను, వివక్షనీ, అణిచివేతనీ ఎండగట్టింది. సామాజిక మార్పు ఆవశ్యకతని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకుపోయింది. లోకజ్ఞానాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చే భావ విప్లవాన్ని సాధించే క్రమంలో ఇవన్నీ ప్రముఖ పాత్ర పోషించాయి.

## 4. నైతిక రాజకీయ నాయత్వం

పౌర సమాజంలో ప్రజా సమ్మతి ద్వారా పొందే ఆధిపత్య సాధనలో ప్రతిష్ట గల నైతిక రాజకీయ నాయకత్వ పాత్రను గ్రాంసీ నొక్కి వక్కాణించారు. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీకి ప్రజా సంఘాలకు కమ్యూనిస్టులు అలాంటి నైతిక రాజకీయ నాయకత్వాన్ని అందించారు. వారి సాదా జీవన శైలి, త్యాగనిరతి, ఉద్యమం కోసం తమ జీవితాలను, ఆస్తులను, చివరికి తమ ప్రాణాలను త్యాగం చేసిన తీరు ప్రజలలో నాయకత్వం పట్ల అచంచల విశ్వాసాన్ని కలిగించింది. వారు ఏకకాలంలో విప్లవకారులుగా, సంఘ సంస్కర్తలుగా, కుల వివక్షను సాంఘిక దురాచారాలను ప్రతిఘటించే వారుగా, స్త్రీ సమానత్వాన్ని కాంక్షించే వారుగా కనిపించారు. ఇలాంటి ప్రతిష్టగల నాయకత్వం అన్ని వర్గాల ప్రజల మీద సానుకూల ప్రభావం కలిగించింది.

## 5. అందరికీ ప్రాతినిధ్యం

పౌర సమాజం మీద ప్రజా సమ్మతి ద్వారా ఆధిపత్యం సాధించాలనే వర్గం తమ సమూహాలకే కాకుండా అందరి ప్రయోజనాలను కాపాడే వారుగా భావించే స్థితిని తెచ్చుకోవాలని గ్రాంసీ సూచించాడు. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజల అందరి ఆకాంక్షగా ఉన్న భాషా ప్రయుక్త రాష్ట్ర నినాదాన్ని తన ప్రచార ఆందోళనలో కీలకం చేసింది. దీంతో కమ్యూనిస్టు పార్టీ కేవలం తన ప్రజా సంఘాలకి పరిమితమైన శక్తిగానే కాకుండా రాష్ట్ర ప్రజలందరి ప్రయోజనాల కోసం పోరాడే ప్రజాశక్తిగా ఎదిగింది. స్థూలంగా గ్రాంసీ పౌర సమాజం మీద ఆధిపత్యానికి అవసరమైన కీలక అంశాలుగా పేర్కొన్నవాటిని ఆంధ్ర కమ్యూనిస్టులు ఆచరణలో పెట్టారు. పౌర సమాజంలో ఇలాంటి స్థితిని సాధించడాన్ని గ్రాంసీ, యుద్ధ సన్నాహంగా (War of Position) విశ్లేషించాడు. ఈ యుద్ధసన్నాహం జరిగితే దానికి విజయం సిద్ధించడం ఖాయం అని తీర్పు కూడా ఇచ్చాడు. దీనినే ఆయన ప్రత్యామ్నాయ హెజమనీ రూపంగా నామకరణం చేశాడు. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు అలాంటి హెజమనీని సాధించారు. అయితే వారికి గ్రాంసీ

తెలియదు. గ్రాంసీ రూపొందించిన హెజమనీ భావజాలం కూడా తెలియదు. గ్రాంసీ 1937లో జైలులోనే మరణించాడు. జైలులో ఆయన నోట్ బుక్స్ రూపంలో ఇటాలియన్ భాషలో రాసిన భావజాలం 1970లో ఇంగ్లీషులో కొన్ని భాగాలు వెలువడే వరకూ ప్రపంచానికి తెలియదు.

కానీ గ్రాంసీ భావజాలాన్ని ప్రపంచంలోనే మొట్టమొదట ఆచరణలో పెట్టింది మాత్రం ఆంధ్రప్రాంతంలో కమ్యూనిస్టులే. ఇలా తమకు తెలియకుండానే గ్రాంసీ భావజాలాన్ని ఆచరణలో పెట్టినవారిని గురించి గ్రాంసీ మీద గొప్ప పరిశోధనలు చేసిన స్టూవర్ట్ హాల్ రాస్తూ దీనికి 'సద్యోజనిత గ్రాంసీయిజం' (Instinctive Gramsci-ism)గా పేరు పెట్టాడు. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు సాధించిన హెజమనీ కూడా సద్యోజనిత 'గ్రాంసీయిజం'గానే మనం భావించాలి.

ఇక్కడ కమ్యూనిస్టులు పౌరసమాజం మీద సాధించిన హెజమనీ రూపురేఖలు పలు రంగాలలో తొంగి చూడడం కనిపిస్తుంది. ఆంధ్ర ప్రాంతంలో చాలా గ్రామాలు 'రెడ్ విలేజెస్'గా పేరుతెచ్చుకున్నాయి. అంటే గ్రామం అంతా కమ్యూనిస్టుల లేదా వారి ప్రజా సంఘాల ప్రభావంతో నడిచేవారే. కృష్ణా జిల్లాలో కాటూరు గ్రామాన్ని స్టాలిన్ గ్రాడ్ అని ఎలమర్రు గ్రామాన్ని లెనిన్ గ్రాడ్ అని, గుంటూరు జిల్లాలో నర్సాయపాలెం గ్రామాన్ని మరో స్టాలిన్ గ్రాడ్ అని కారంచేడులో ఒక వీధిని మాస్కో వీధిగా పిలిచే స్థితి వారు సాధించిన హెజమనీకి చిహ్నాలు మాత్రమే.

ఆ కాలంలో విద్యార్థులుగా ఉన్నవారు తాము విద్యార్థి ఫెడరేషన్లో పాల్గొన్నామని గర్వంగా చెప్పుకునేవారు. ప్రతి ఒక్కరూ తాము అభ్యుదయ రచయితలమేనని చెప్పుకోవడానికి తాము ఒక సామాజిక సమస్యపై చేసిన రచనను చూపించేవారు.

యువజన సంఘాలలో, బాల సంఘాలలో తమ పిల్లలు చేరడాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించడం ఆ కాలం ప్రత్యేకత. కమ్యూనిస్టుకి తమ ఆడ పిల్లనిస్తే ఆమెను గౌరవంగా చూసుకుంటాడని భావించిన కాలం అది... కమ్యూనిస్టులు సాధించిన హెజమనీకి ఇవి కొన్ని నిదర్శనాలు మాత్రమే.

హెజమనీ అన్నది విడి విడి ప్రజా సంఘాల కలయిక మాత్రమే కాదు. అది కొత్త రూపం ధరించిన ఉమ్మడి సామాజిక శక్తి. కమ్యూనిస్టులు 'అసాధారణ బలం పుంజు'కోవడంలో ఉన్నది, హెజమనీ రూపం ధరించిన ప్రత్యేక శక్తి.

ఈ హెజమనీ కొనసాగుతున్న దశలో కమ్యూనిస్టులపై తీవ్ర నిర్బంధకాండ

సాగింది. చాలామందిని ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపింది. ఇవన్నీ ప్రజలలో సానుభూతిని మరింత పెంచాయి.

1952 ఎన్నికలలో కమ్యూనిస్టులకు అనూహ్య విజయాలు వచ్చాయి. సుందరయ్య గారు విప్లవ పథంలో నా ప్రయాణం అన్న పుస్తకంలో "మేము రహస్యంగా వుండి అంచనాలు వేసుకున్నాం. ఆంధ్రలో 20 నుండి 25 సీట్లు మనం గెలుస్తామని కానీ 40 సీట్లకు పైగా గెలిచాం. ఉదాహరణకు నెల్లూరు, కోవూరు సీట్లు గెలుస్తామని ఎప్పుడూ అనుకోలేదు. కానీ గెలిచాం. ప్రజల మనోభావాలు అలా వున్నాయి" అని అన్నారు. అంటే ప్రజల మనో భావాలు అంచనాలకు మించి ఉన్నాయి. అదీ కమ్యూనిస్టులు సాధించిన హెజమనీ శక్తి. 1952లో కమ్యూనిస్టులు సాధించిన ఘనవిజయాన్ని కట్టబెట్టింది పౌర సమాజంలో వారు సాధించిన హెజమనీయే. ఈ హెజమనీయే వారి అంచనాలకు అందని అనూహ్య ఫలితాలను అందించిన విజయ రహస్యం.

## చేజారిన ప్రజా హెజమనీ

1946-51 మధ్య కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ కొన్ని విప్లవ ప్రయోగాలు చేసింది. వారికి ముందుగా తెలిసిన మార్గం రష్యన్ తరహా తిరుగుబాటు. దీనికి పిలుపునిచ్చారు. కానీ ఇది ప్రారంభంలోనే ముగిసిపోయింది. మనది వ్యవసాయ దేశం గనుక చైనా మార్గంలో తిరుగుబాటు అన్ననినాదాన్ని చేపట్టింది. అది కూడా 1951తోనే ఆగిపోయింది. వీటితో పాటు 1942-46 మధ్య కాలంలో సాగించిన కార్యకలాపాలు, జాతీయోద్యమం పట్ల అనుసరించిన వైఖరి అన్నీ పార్టీలో చర్చనీయాంశాలయ్యాయి.

ఒకసారి హెజమనీ సాధిస్తే దాని ప్రభావం కొంతకాలం కొనసాగుతుంది. 1952 ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీని ఏకైక పెద్ద పార్టీగా గెలిపించిన ప్రజా హెజమనీ 1955 ఎన్నికలలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా కమ్యూనిస్టు పార్టీని నిలబెట్టింది.

పౌరసమాజంలో హెజమనీ ఒకసారి సాధిస్తే అది శాశ్వతం కాదు. దానిని నిరంతరం కాపాడుకోవాలి. నిలబెట్టుకోవాలి. మారుతున్న పరిస్థితులకు తగినట్టుగా వివిధ వర్గాలలో కొత్త ఆకాంక్షలని, కొత్త పరిష్కారాలని, కొత్త నినాదాలనీ చేపట్టి తాము సాధించిన 'చారిత్రక సంఘటన' చెల్లా చెదురు కాకుండా చూసుకోవాలి. సాధించిన హెజమనీని కొనసాగించాల్సిన దశలో పార్టీలో సిద్ధాంత, రాజకీయ చర్చ

నానాటికీ పెరుగుతూ వచ్చింది. ఈ దశలో రెండు పరిణామాలు చోటు చేసుకున్నాయి.

**మొదటిది** కమ్యూనిస్టు పార్టీకి వెలుపల జరిగిన మార్పులు. 1953లో భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పడింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కమ్యూనిస్టులకు తోడ్పాటునిచ్చిన కొన్ని వర్గాలు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో చెల్లాచెదురయ్యాయి. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయానికి ప్రాధాన్యత నిచ్చింది. ఇది రైతులలో కొత్త ఆకాంక్షలను కల్పించింది. మరో పక్క 1957లో ప్రభుత్వం పంచాయితీరాజ్ వ్యవస్థను అమలులోకి తెచ్చింది. రైతు వర్గాలకి స్థానిక అధికారానికి ద్వారాలు తెరుచుకున్నాయి. ఇవన్నీ కమ్యూనిస్టులు సాధించిన హెజమనీపై తీవ్ర ప్రభావాన్ని కలిగించాయి. వారు సమీకరించిన ప్రజా సమూహాలలో చీలికలు తెచ్చాయి.

**రెండో పరిణామం** కమ్యూనిస్టు పార్టీలో మొదలైన అంతర్గత చర్చ విభేదాల స్థాయికి చేరింది. తాము సాధించిన హెజమనీని మారిన పరిస్థితులలో కొనసాగించడానికి తగిన ప్రత్యామ్నాయ ఎత్తుగడల చర్చను విస్మరించారు. పౌర సమాజంలో ఆధిపత్యం కోసం జరగాల్సిన ప్రయత్నం స్థానంలో, పార్టీలో ఆధిపత్యం కోసం అంతర్గత పోరుగా మారింది. అంతర్జాతీయ పరిణామాలు దీనికి తోడయ్యాయి. 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. చీలిపోయిన మార్క్సిస్టు పార్టీ 1969లో మరో చీలికకు గురైంది. నక్సలైట్లుగా విడిపోయిన వాళ్ళు అనేకపాయలుగా చీలిపోయారు. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ అనేక ప్రజా ఉద్యమాల నిర్మాణం ద్వారా, అనేక త్యాగాలతో పౌరసమాజంపై సాధించిన హెజమనీ చేజారిపోయింది.

# రెండవ భాగం

## సినీ హీరో : సీజర్ తరహా హెజమనీ

1982లో ప్రముఖ సినీనటుడు ఎన్‌టి రామారావు ఒక ప్రాంతీయ పార్టీని ఏర్పాటుచేశాడు. దానికి తెలుగుదేశం పార్టీగా నామకరణం చేశాడు. అప్పటికి ఆయన వయస్సు 60 సంవత్సరాలు. హీరోగా నటించే సినిమాలు తగ్గిపోయాయి. అప్పటివరకు ఆయన రాజకీయాలకి దూరంగా వున్నాడు. ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని ఎలాంటి ప్రజా ఉద్యమాలలోనూ ఆయన భాగస్వామిగా లేడు. తెలుగు ప్రజలతో సినిమా సంబంధం తప్ప మరో అనుబంధం లేదు. మూడు వందలకుపైగా సినిమాలలో నటించాడు. పురాణ, జానపద పాత్రలతోపాటు మధ్యతరగతి సామాన్య శ్రామికుల పాత్రలలో హీరోగా నటించాడు. ఆయన ఎన్నికల ప్రచారయాత్రకు అవి జనాకర్షణ అయ్యాయి. కాని అదొక్కటే ఆయన విజయానికి కారణం కాదు. 9 నెలల కాలంలోనే ఆయన రాజకీయాధికారాన్ని అందిపుచ్చుకోడానికి అప్పటికే రాష్ట్ర రాజకీయ రంగం సిద్ధమై వుంది. ఎన్‌టిఆర్‌కి విజయాన్ని చేకూర్చి పెట్టిన ఈ రాజకీయ నేపథ్యాన్ని విశ్లేషించుకోవాలి.

- 1. 1952 తర్వాత 1955 ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా వున్న కమ్యూనిస్టు పార్టీ 1955 ఎన్నికల పరాజయం తర్వాత 1962లో ప్రధాన ప్రతిపక్షంగా మారింది. 1964లో ఆ పార్టీ చీలిపోవడంతో 1967 ఎన్నికల నాటికి బాగా బలహీనపడింది. అంతవరకు రెండు జాతీయ పార్టీల మధ్య వర్గసంఘర్షణగా సాగిన రాజకీయ దశ ముగిసింది.
- 2. 1962 నుండి 1978 వరకు రాష్ట్రంలో రాజకీయ సంఘర్షణ స్వభావం పూర్తిగా మారిపోయింది. రెండు పెట్టుబడిదారీ జాతీయ పార్టీల మధ్య సంఘర్షణ రూపం ధరించింది. 1962లో స్వతంత్రపార్టీ రాష్ట్రంలో 19 స్థానాలను గెల్చుకుంది. 1967 ఎన్నికలలో 29 స్థానాలను గెల్చుకుని ప్రధాన ప్రతిపక్షం స్థానాన్ని ఆక్రమించింది. కాని తర్వాత చాలామంది కాంగ్రెస్‌లో చేరిపోవడంతో 1972లో దానికి కేవలం 2 స్థానాలు మాత్రమే వచ్చాయి. 1977లో కేంద్రంలో జనతాపార్టీ ఏర్పాటు కావడంతో ఆంధ్రలో అవే శక్తులతో జనతాపార్టీ ఏర్పడింది. 1978 ఎన్నికలలో జనతా పార్టీ రాష్ట్రంలో 60 స్థానాలు గెల్చుకుంది. 28.73 శాతం ఓట్లను సాధించింది. కాని అధికారంలోకి

రాకపోవడంతో ఏడాది తిరిగే లోపే దాని సంఖ్యాబలం 45 కి పడిపోయింది. ఇలా రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీల మధ్య అధికారం కోసం పోరుగా సాగింది.

- 3. ఈ కాలంలో కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్‌లో మితవాద నాయకత్వం సిండికేటు కాంగ్రెస్‌గా చీలిపోయింది. ఆ తర్వాత ఇందిరా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాల స్థాయిలో పాతుకు పోయిన నాయకత్వాన్ని మార్చడం ద్వారా అధినాయకత్వానికి ఎదురులేని స్థానాన్ని పొందడానికి అనేక చర్యలు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో దాని పర్యవసానంగా ప్రజా పునాది లేని నాయకత్వాన్ని పై నుండి ప్రవేశపెట్టారు. 1978 ఎన్నికల తర్వాత ఇది మరింత వికృతరూపంగా సాగింది. ఆంధ్రప్రదేశ్‌లో నాలుగేళ్లలో నలుగురు ముఖ్యమంత్రులను మార్చింది. ఆ పార్టీ పరిపాలన చుట్టూ తిరగడానికి బదులు అనునిత్యం నాయకత్వ మార్పు కోసం అసంతృప్తుల బృందాలుగా ఏర్పడి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ముఖ్యమంత్రులను మార్చేందుకు అధిష్టానం చుట్టూ తిరగడం జరిగింది. రాష్ట్రానికి సంబంధించిన ప్రతి నిర్ణయం ఢిల్లీలో చేసే స్థితి వచ్చింది. ఢిల్లీ నాయకత్వం ఈ నాయకుల పట్ల అవమానకర పద్ధతులలో వ్యవహరించారని అలా ఆంధ్రుల ఆత్మగౌరవం సమస్య ముందు కొచ్చింది. పాలక పార్టీ ప్రజలకు దూరమైంది. ఆ మేరకు ప్రజలు ఆ పార్టీకి దూరమయ్యారు.

## సంక్షోభ సమయంలో సమ్మోహన శక్తులు

రాష్ట్రంలో కాంగ్రెస్ గుత్తాధిపత్యం అన్ని రంగాలలోనూ సంక్షోభంలో పడింది. దీని ఛాయలు 1981లో జరిగిన స్థానిక ఎన్నికలు స్పష్టం చేశాయి. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమ్యూనిస్టుల పరం అయింది. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ బి.జె.పి.కి దక్కింది. చీరాలలో జరిగిన శాసనసభ ఉప ఎన్నికలలో జనతా పార్టీ గెలిచింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు నూకలు చెల్లిన కాలం ప్రారంభం అయింది. ఈ పరిస్థితిని అర్థం చేసుకోడానికి సంక్షోభ కాలంలో పార్టీ స్థితిగతులపై గ్రాంసీ చేసిన విశ్లేషణ మనకు తోడ్పడుతుంది.

'పాలకవర్గం హెజమనీ సంక్షోభంలో పడే క్రమం వివిధ దేశాలలో వేరు వేరుగా వుంటుంది. కాని సారాంశం మాత్రం ఒక్కటిగానే వుంటుంది. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, వారిలో రేకెత్తించిన ఆశలను పరి పూర్తి చెయ్యడంలో వైఫల్యం

చెందినప్పుడు, అలాగే రాజకీయ రంగంలో స్తబ్దంగా వున్న కొన్ని వర్గాలు తమ సమస్యలపై అస్పష్టమైన నినాదాలతోనైనా వారు ఆకస్మికంగా రాజకీయ కార్యాచరణకు దిగడం వగైరాలు ఈ సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తాయి. ఇది పాలక వర్గపు సర్వవ్యాప్తి సంక్షోభానికి సంకేతం అవుతుంది. ప్రజలు మార్పుకు సంసిద్ధులవుతారు. ఇలాంటి సంక్షోభ పరిస్థితులలో సంప్రదాయ పాలకవర్గం చేయి జారిపోతున్న పరిస్థితిని అదుపులోకి తెచ్చుకోడానికి నాయకుల్ని మార్చుతుంది. తన కార్యక్రమాలను మార్చుతుంది. కొత్త నినాదాలను ముందుకు తెస్తుంది. తన వర్గ ప్రయోజనాలను కొన్నింటిని త్యాగం చెయ్యడానికి కూడా సిద్ధం అవుతుంది' అన్నది స్థూలంగా చేసిన విశ్లేషణ.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఇలాంటి పద్ధతులనే అనుసరించింది. ప్రజలలో నానాటికీ పెరుగుతున్న అసంతృప్తిపై నీళ్లు జల్లడానికి వరసగా ముఖ్యమంత్రుల్ని మార్చింది. తనకు కీలుబొమ్మలుగా వుండేవారిని ఎంచుకోవడంతో వారు పరిస్థితిని చక్కదిద్దకపోగా పాలక పార్టీ ప్రతిష్ట మరింత దిగజారింది. నిరంతరం అంతర్గత కీచులాటలలో పాలనను మరింత అస్తవ్యస్తం చేసింది. ప్రజల దృష్టిలో అది చులకన అయింది. ఆ మేరకు ప్రజలు మార్పువైపు మొగ్గును మరింత పెంచింది. దీనికితోడు ఆ నాడు ముఖ్యమంత్రిగా వున్న అంజయ్య పట్ల రాజీవ్‌గాంధీ వ్యవహరించిన తీరు ఆంధ్రుల ఆత్మగౌరవం అన్న నినాదాన్ని తెరపైకి తెచ్చింది.

గ్రాంసీ ప్రస్తావించిన మరో అంశం 'ఒకానొక చారిత్రక పరిస్థితిలో సామాజిక వర్గాలు తమ సంప్రదాయక పార్టీలకు దూరం అవుతాయి. అలాంటి ప్రత్యేక పరిస్థితి ఏర్పడినప్పుడు సంక్షోభాలు సంభవిస్తే పరిస్థితి అత్యంత సున్నితమూ, ప్రమాదభరితమూ అవుతుంది. అప్పుడు రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించే సమ్మోహన శక్తులకు ప్రాతినిధ్యం వహించే నిగూఢశక్తుల కార్యకలాపాలకు రాజకీయ సంక్షోభపు గేట్లు తెరుచుకుంటాయి.' ఇలా సమ్మోహన శక్తుల కాలం ప్రారంభం అవుతుంది.

మరో విధంగా చెప్పాలంటే ఒక పక్క పాలక పార్టీ తన అధికారాన్ని కొనసాగించ లేని పరిస్థితి మరోపక్క ప్రతిపక్షాలు దానిని కూలదోయలేని స్థితి వున్నప్పుడు రాజకీయ సంక్షోభంలో అనిశ్చితి ఏర్పడుతుంది. అలాంటి అనిశ్చిత పరిస్థితి ఏర్పడినప్పుడే రాజకీయ రంగంలో సమ్మోహన శక్తులకు ద్వారాలు తెరుచుకుంటాయి. ఈ అనిశ్చితిని తొలగించగల హీరోల కోసం ప్రజల వెదుకులాట ప్రారంభం అవుతుంది.

ఇలాంటి అనిశ్చితితో కూడిన ప్రత్యేక రాజకీయ సంక్షోభ కాలంలో ఎన్ టి రామారావు రాజకీయ రంగ ప్రవేశం చేశాడు. ఒక సినిమా హీరోని ప్రజలు తమ రాజకీయ హీరోని చేసుకుని గెలిపించారు. సమ్మోహన శక్తుల ప్రవేశానికి అవకాశాలున్న ఒక ప్రత్యేక రాజకీయ సంక్షోభం, ఒక అనిశ్చితి లేకపోతే ఆయన కేవలం సినీ హీరోగానే మిగిలి ఉండేవాడు. రామారావు విజయ రహస్యం ఆయన సినీ గ్లామర్‌లో లేదు, ఆ విజయం సంక్షోభ కాలంలో రంగ ప్రవేశం చేసే సమ్మోహన శక్తులు ప్రజలను నడిపించిన ప్రత్యేక పరిస్థితిలో వుంది.

ఇలాంటి సంక్షోభ కాలంలో వివిధ పార్టీల వెనుకనున్న వర్గశక్తుల మార్పిడి మామూలు పరిస్థితులలో పోల్చినప్పుడు కాంతి వేగంతో జరుగుతుందని గ్రాంసీ విశ్లేషించాడు. ఈ సమ్మోహన శక్తుల ప్రవేశానికి సమయం ఆసన్నమైనప్పుడు ప్రజలు హీరోల కోసం వెదుకుతారు. వారికి అలాంటి హీరోలు తటస్థపడకపోతే దొరికిన వారినే హీరోలు చేస్తారు.

సీజర్ అన్న మాటను గ్రాంసీ సమ్మోహన శక్తికి పర్యాయపదంగా వాడాడు. ఈ సీజర్ తరహా రాజకీయ సంక్షోభ పరిష్కారం ప్రగతిశీలమైనదీ కావచ్చు, ప్రగతి నిరోధకమైనదీ కావచ్చునని గ్రాంసీ సోదాహరణలు ఇస్తాడు. ఈ రాష్ట్రంలో సమ్మోహన కాలంలో ఎన్‌టిఆర్ సాధించిన విజయం సీజర్ తరహా హెజమనీని పోలి వుంది.

ఎన్‌టిఆర్ పార్టీలో చేరిన ప్రధాన భాగం గతంలో రాష్ట్రంలో మితవాద వర్గానికి ప్రాతినిధ్యం వహించిన శక్తులే. గతంలో జై ఆంధ్ర ఉద్యమంలో ఆ తర్వాత జనతా పార్టీ రూపంలో వున్నవారే. ఈ సమ్మోహన కాలంలో సమీకృతమైన విభిన్న సామాజిక వర్గాలలో కొన్ని పరస్పర విరుద్ధ శక్తులు వున్నాయి.

1989 వచ్చే నాటికి ఈ సమ్మోహన శక్తి చెదిరిపోయింది. రాష్ట్ర ఎన్నికలలో ఎన్‌టిఆర్ పరాజయం పాలయ్యారు. తెలుగుదేశం పార్టీలో ఎన్‌టిఆర్ గ్లామర్ ప్రజా సమీకరణకు దోహదం చేస్తున్నా అది ఒక సాధారణ రాజకీయ పార్టీగా మారింది. 1994లో తిరిగి ఎన్‌టిఆర్ అధికారంలోకి రావడానికి ఆయన సమ్మోహనా శక్తి కంటే రాష్ట్రంలో మద్య నిషేధానికి జరిగిన ఉద్యమ నేపథ్యం ఆయన విజయానికి ఎక్కువ దోహదం చేసింది. 1995లో ఎన్‌టిఆర్‌ను తొలగించి చంద్రబాబు పార్టీ పగ్గాలు పట్టడంతో అది పూర్తిగా ఒక సాధారణ ప్రాంతీయ పార్టీ రూపాన్ని పొందింది. ఎన్‌టిఆర్‌కి, వారి కుటుంబానికి దూరం కాలేదనడానికి తప్ప ఆ పార్టీ జయాపజాలలో వారి పాత్ర అంతంత మాత్రమే అయ్యింది.

## రాజకీయ సంఘర్షణలో మారిన పరిస్థితులు

- 1. రాష్ట్రంలో రాజకీయ సంఘర్షణ పెద్ద మలుపు తీసుకుంది. 30 ఏళ్ళ కాంగ్రెస్ గుత్తాధికారం అంతమైంది. రెండు జాతీయ పార్టీల మధ్య సాగిన రాజకీయ సంఘర్షణ ఇప్పుడు ఒక ప్రాంతీయ పార్టీకి మరొక జాతీయ పార్టీకి మధ్య సంఘర్షణగా మారింది. మొట్టమొదటిసారి ఒక ప్రాంతీయ పార్టీ ఏర్పడి రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టింది.
- 2. ఒక ప్రాంతీయ పార్టీ అధికారంలోకి రావడంతో రాష్ట్ర రాజకీయం అంతా ప్రాంతీయ సమస్యల చుట్టూ తిరగడం మొదలైంది. జాతీయ పార్టీలు కూడా దీనినే ప్రధానం చేసుకోక తప్పలేదు.
- 3. రాష్ట్ర రాజకీయాలలో కులం పాత్ర ఒక కీలక మలుపు తీసుకుంది. ఇంత వరకూ రెడ్లు ఆధిపత్యంలో రాజకీయ అధికారం సాగింది. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులను మార్చే క్రమంలో భాగంగా ఇతర కులాల ముఖ్యమంత్రులు వచ్చినా అది కుల ప్రాధాన్యతని పొందలేదు. వారు కులాల ఆధారంగా నిలదొక్కుకునే అవకాశాలు లేవు. మొదటిసారి కమ్మ సామాజిక కులం, ఏదైతే, వ్యవసాయ, పారిశ్రామిక, విద్య తదితర రంగాలలో అందరికంటే ముందున్నదో రాజకీయ అధికారం కూడా కోరుకుంటున్నదో ఆ కులం అధికారంలోకి వచ్చింది. అది రాజకీయ అనిశ్చితి కాలంలో సమ్మోహన శక్తి కెరటం మీద అధికారాన్ని అందిపుచ్చుకొంది. రాష్ట్ర రాజకీయం కుల సమీకరణల సంఘర్షణా రూపం పొందడానికి బీజాలు పడ్డాయి.
- 4. ఈ కాలంలో దళిత చైతన్యం పెరిగింది. వివక్ష మీద, అత్యాచారాల మీద, అణచివేత, హత్యాకాండల మీద వారు సంఘటిత రూపంలో ప్రతిఘటన మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఒక ఉద్యమ సంస్థగా దళిత మహాసభ ఏర్పడి తన మేనిఫెస్టోని ప్రకటించింది.

ఈ పరిణామాలు భవిష్యత్ రాజకీయ సంఘర్షణ స్వరూప స్వభావాల మీద చూపిన ప్రభావాలను తర్వాత భాగంలో విశ్లేషించుకుందాం.

### మరికొన్ని రాజకీయ ప్రయోగాలు

2009లో ప్రజారాజ్యం పార్టీని పెట్టి సినీ హీరో చిరంజీవి, 2019లో జనసేన పార్టీని పెట్టి మరో సినీ హీరో పవన్ కళ్యాణ్ ఎన్నికల బరిలోకి దిగారు. వీరిద్దరూ మంచి జనాకర్షణ గల సినీ హీరోలే. ఎన్‌టి రామారావు రాజకీయ ప్రవేశం చేసిన నాటి రాజకీయ సంక్షోభం, అనిశ్చిత పరిస్థితులు సమ్మోహన శక్తుల రాజకీయ ప్రభావం వంటి అంశాలు వీరు ప్రవేశించిన కాలంలో లేవు. పైగా పాలక పక్షం, ప్రతిపక్ష పార్టీ హోరాహోరీ పోరులో వున్నాయి. అలాంటి స్థితిలో సమ్మోహన శక్తుల కోసం ప్రజల వెదుకులాట ఉండదు. అందువల్ల ప్రజలు చిరంజీవిని, పవన్ కళ్యాణ్‌లను సినీ హీరోలుగానే ఆదరించారు. ఆ మేరకు సినీ అభిమానులు, కులాభిమానులు మద్దతునిచ్చారు. కానీ ఈ సినీ గ్లామర్ రాజకీయ గ్లామర్‌గా మారలేదు

2009 ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీ 240 స్థానాలకు పోటీచేసింది. డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తన ఐఏఎస్ పదవిని వదులుకుని రాజకీయ ప్రక్షాళనకు, ప్రజాస్వామ్య సంస్కరణలకు సాగించిన కార్యకలాపాలు మధ్య తరగతి వర్గాలను ఆకర్షించాయి. ఆ మేరకు ఎన్నికలలో పట్టణాలలో కొంత ప్రభావాన్ని చూపెట్టింది.

# మూడవ భాగం

## దళిత, బహుజనులు : ఆలోచనగా హెజమనీ

1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే 1989లో తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇలా ఒకరి తర్వాత మరొకరు దళిత బహుజనులను చీల్చి అధికారాన్ని పంచుకునే పరిస్థితి వచ్చింది. దీనికి ప్రతిగా 1994 ఎన్నికలలో రాష్ట్రంలో బహుజన సమాజ్ పార్టీ రూపంలో దళిత, బహుజన సంఘాలు, ప్రతినిధులు ప్రత్యామ్నాయాన్ని ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో 294 స్థానాలకు గాను 244 స్థానాలలో వారు తమ అభ్యర్థులను పోటీకి నిలబెట్టారు. రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటిసారి సంప్రదాయ పార్టీల ఆధిపత్య రాజకీయాన్ని వారు బహుజన సమాజ్ పార్టీ రూపంలో సవాల్ చేశారు.

## 1994 ఎన్నికలు - బహుజన్ సమాజ్ పార్టీ

1993లో ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికలు జరిగాయి. బీఎస్పీ, ఎస్పీలు కలిసి పోటీ చేసి విజయాన్ని సాధించాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అలాంటి ప్రయత్నం చేస్తే ఎన్నికలలో గెలుపు సాధ్యమేనన్న భావన దళిత ఉద్యమంలో చాలా మందికి కలిగింది. ఈ రాష్ట్రంలో కూడా సమాజ్‌వాదీ పార్టీ ఏర్పాటుకు కొంత మంది బీసీ నాయకులు పూనుకున్నారు. ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు కలిస్తే సంఖ్యాపరంగా గెలిచే అవకాశాలు వారికి కనిపించాయి.

ఈ దశలో 'రాజకీయ అధికారమే అసలు తాళం చెవి' దానిని సాధిస్తే అన్నీ అవే సమకూరుతాయి అని కాన్షీరాం ఇచ్చిన నినాదం దళిత–బహుజన విజయానికి సోపానంగా కనిపించింది. 1994 ఎన్నికలకు ముందే కాన్షీరాం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. హైదరాబాద్, నల్గొండ, విశాఖపట్టణంలో జరిగిన బహిరంగ సభలు జయప్రదం కావడంతో దళిత మహాసభలో చీలిక వర్గాలన్నీ బీఎస్పీలో చేరి ఎన్నికలలో పోటీ చేయడానికి సిద్ధం అయ్యాయి. అసెంబ్లీలో 290 స్థానాలకు గాను 244 స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టారు. దళిత–బహుజన ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందుంచారు.

ఎన్నికల ఫలితాలు వారి అంచనాలకు విరుద్ధంగా వచ్చాయి. ఒకే ఒక్క స్థానంలో మాత్రమే డిపాజిట్ వచ్చింది. మిగిలిన అన్ని స్థానాలలో ఐదు వేలకులోపు ఓట్లు

మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికలలో వారు కులాల ఆధారంగా వేసుకున్న అంచనాలు తల్లకిందులయ్యాయి. ఈ దళిత -బహుజన కులాలలోనూ, ఈ కులాల మధ్య ఉన్న వైరుధ్యాలను వారు విస్మరించారు. పైనుండి జతకట్టిన కులాల సంఘటన కింది స్థాయిలో పనిచేయలేదు. అక్కడ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు ఉన్న పట్టును వారు గుర్తించలేదు. దీంతో దళిత ఉద్యమం రాజ్యాధికారం కోసం చేసిన ప్రయత్నం సఫలం కాలేదు. ఈ ఎన్నికలలో దళిత, బహుజనులు ఒక శక్తిగా ఎన్నికల బరిలోకి దిగడానికి దారితీసిన దళిత ఉద్యమాల నేపథ్యాన్ని మనం పరిశీలించుకోవాలి.

## దళిత ఉద్యమ నేపథ్యం

1980 దశకంలో ఆంధ్ర ప్రాంతంలో కొన్ని పరిణామాలు చోటు చేసుకున్నాయి. వాటి పర్యవసానంగా ఆంధ్ర ప్రాంతంలో దళిత ఉద్యమం విస్తరించింది. దళిత మహాసభ పేరుతో అది సంస్థాగత రూపం పొందింది. కోస్తా జిల్లాలలో హరిత విప్లవం తర్వాత ఈ పదిహేను సంవత్సరాల కాలంలో ధనిక రైతుల వ్యవసాయ ఆదాయం పెరిగింది. అది గ్రామీణ ప్రాంతంలో అంతరాలను మరింతగా పెంచింది. ఇది స్థానికంగా ఆధిపత్య కులాలకి, పేదలకి మధ్య వైరుధ్యాన్ని పెంచింది.

రాష్ట్రంలో విద్యా వ్యాప్తి విస్తరించింది. గ్రామీణ పేదలకు హైస్కూలు విద్య అందుబాటులోకి వచ్చింది. రిజర్వేషన్ల ఫలితంగా కాలేజీ విద్య కొందరికి లభించింది. దీని పర్యవసానంగా వ్యవసాయేతర రంగంలో దళితులు, బహుజనులకు కొన్ని కొలువులు వచ్చాయి. దీంతో ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వ భావజాలం పేదల పిల్లలకు వారి ద్వారా పేదల వాడలకు చేరింది. వారిలో అణచివేతను ప్రతిఘటించే తత్వం పెరిగింది. స్థానిక పెత్తందారీ కులాలకు ఇది కంటగింపు అయ్యింది. మరోపక్క కమ్యూనిస్టు ఉద్యమం చీలికలు, పేలికలు కావడంతో దళితులు, బహుజనులు ఆర్థిక అంశాల చుట్టూ సమీకృతం కావడానికి బదులు కులం చుట్టూ తమ చైతన్యాన్ని పెంచుకునే స్థితి వచ్చింది.

1985లో కారంచేడులో ఆధిపత్య కులానికి చెందిన భూస్వామ్య దురహంకార శక్తులు తమ బలగాలతో దళితుల వాడపై సామూహిక దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు దళితులని వెంటాడి చంపారు. చాలా మందిని తీవ్రంగా గాయపరిచారు. ఇద్దరు మహిళలను మానభంగం చేశారు. దళితులు అక్కడి నుండి తప్పించుకుని

మొదట చీరాల చర్చిలో తలదాచుకున్నారు. తరువాత వారు ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ శిబిరాన్ని నిర్వహించడానికి రాష్ట్రవ్యాపితంగా దళిత సంఘాలతోపాటు దళితేతర సంఘాలు తోడ్పాటునిచ్చాయి. ఈ శిబిరాన్ని ప్రముఖ హక్కుల పోరాట నాయకుడు బొజ్జా తారకం, ప్రముఖ హేతువాది కత్తి పద్మారావు చేరుకుని ఈ ఉద్యమానికి కొత్త విశ్వాసాన్ని కల్పించారు. వారే ఈ దళిత శిబిరానికి నాయకత్వంగా నిలిచారు.

ఈ శిబిరం కేంద్రంగా కారంచేడు హత్యాకాండకు కారకులైన వారిపై కేసులు నమోదు చేసి శిక్షించాలని, బాధితులకు చీరాలలోనే నివాస వసతి కల్పించాలని, వారి ఉపాధికి ప్రత్యేకంగా భూపంపిణీ చెయ్యాలని కోరుతూ ఆందోళనలు సాగించారు. ఐదు లక్షల మందితో 'చలో హైదరాబాద్' సమీకరణతో ప్రభుత్వం దిగివచ్చి ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించింది. కానీ ఇతర డిమాండ్లు అలాగే ఉండిపోయాయి. వీటి కోసం వేలాది మందిని సమీకరించి ఉద్యమించారు. ఈ ఉద్యమాలలో అంబేద్కర్, జ్యోతిబా పూలే, మార్క్స్ భావజాల స్రవంతుల వారు హేతువాదులు, రాడికల్స్ అందరూ భాగస్వాములయ్యారు.

## దళిత మహాసభ మేనిఫెస్టో

1986లో తెనాలిలో దళిత మహాసభ తొలి మహాసభ నిర్వహించారు. అక్కడ దళిత మహాసభ మేనిఫెస్టోని విడుదల చేశారు. ఈ మేనిఫెస్టోలో పై స్రవంతుల ప్రభావం కనిపిస్తుంది. మేనిఫెస్టోలో మార్క్స్ పేరు ప్రస్తావించకపోయినా పరోక్షంగా ఆ భావజాలం కనిపిస్తుందని ఈ ఉద్యమం పై అనేక వివరాలతో కూడిన వర్కింగ్ పేపర్‌ను ప్రచురించిన ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు సోదాహరణలతో పేర్కొన్నారు

దళిత మహాసభ మేనిఫెస్టోని విశ్లేషిస్తూ మరో ప్రొఫెసర్ కె.వై.రత్నం అందులో వర్గ-కుల దోపిడీ సమాజాన్ని కూల్చివేసే కోణాన్ని ముందుకు తెచ్చారు. 'అది ఒక ఐక్య సంఘటనను సూచించింది. అణచివేతకు గురవుతున్న తరగతుల ప్రత్యా మ్నాయ హెజమనీ రూపొందే ఐక్య సంఘటనను వాగ్దానం చేసింది. ఇది దళితుల నిర్వచనాన్ని విస్తృత పరిచింది. అది ఒక ప్రత్యేక తరహా వర్గంగా దానికి ప్రస్తుత వర్గ-కుల దోపిడీ సమాజాన్ని కూల్చివేయడానికి తగిన శక్తిని కలిగి ఉందని, సమాజాన్ని, రాజకీయాన్ని అది ప్రజాస్వామికీకరణ చేస్తున్నదని స్పష్టం చేసింది.' అని అన్నారు. ఈ భావజాల వ్యాప్తికి దళిత పత్రికలు కీలక పాత్ర పోషించాయి. దళిత శక్తి, నలుపు, ఎదురీత, ఈనాటి ఏకలవ్య, కుల నిర్మూలన వంటి పత్రికలు

భారత చరిత్ర, సమాజం, రాజకీయాల మీద శక్తివంతమైన చర్చలు సాగించాయి. మార్క్సిజం మీద, అంబేద్కరిజం మీద సిద్ధాంత పరమైన చర్చ సాగించాయి. వర్గ, కుల సమస్యల మీద, భారతదేశంలో కులానికున్న ప్రత్యేక ప్రాధాన్యత మీద చర్చలు సాగించాయి.

దళిత మహాసభ చొరవతో మహాత్మాపూలే, పెరియార్, నారాయణ గురు, అంబేద్కర్ రచనలకు తెలుగులో అనువాదాలను ప్రచురించారు. ఈ దళిత మేధావుల రచనలను చర్చకు పెట్టి వాటి ద్వారా కుల – వర్గ దృక్పథంతో చరిత్రని పునర్నిర్మించడానికి, సమాజాన్ని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించారు. సాంస్కృతిక దళాలు బుర్రకథ, జముకుల కథలు తదితర రూపాలలో ప్రచారాన్ని నిర్వహించాయి. మొత్తం మీద దళిత మహాసభ తన ప్రారంభ దశలో బహుముఖ కార్యకలాపాల ద్వారా పీడిత వర్గాలలో కొత్త చైతన్యానికి పునాదులు వేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో దళిత – బహుజన హెజమనీకి, ఆధిపత్య పాలక వర్గాలకు ప్రత్యామ్నాయంగా రాజ్యాధికారం కోసం జరిగిన తొలి ప్రయత్నం ఇది.

ఆంటోనీ గ్రాంసీ ఉపశ్రేణుల హెజమనీ మీద రూపొందించిన భావజాలానికి ఇక్కడ దళిత మహాసభ చేసిన ప్రయత్నాలకు కొన్ని పోలికలు ఉన్నాయి. దళిత మహాసభ నాయకులకు గ్రాంసీ భావజాల పరిచయం ఉన్నట్లు ఈ ఉద్యమాన్ని పరిశోధించిన వారు ప్రస్తావించలేదు. అలాంటి ప్రస్తావన దళిత మహాసభ నాయకుల ప్రసంగాలలో ఉన్న దాఖాలాలు కనిపించడం లేదు. అందుచేత ఈ ఉద్యమంలో కనిపించే గ్రాంసీ భావజాల పోలికలు సద్యోజనితమైనవిగానే భావించవచ్చు. అయితే పోలికలు ఉన్నందు వల్ల ఈ ఉద్యమ విశ్లేషణకు గ్రాంసీ భావజాలం నిస్సందేహంగా ఉపకరిస్తుంది.

- 1. గ్రాంసీ ఉప శ్రేణుల నిర్వచనాన్ని విస్తృత పరిచాడు కార్మిక వర్గంతో సహా పలు రూపాలలో దోపిడీకి, అణచివేతకు గురవుతున్న సమూహాలన్నింటితో పాటు, భాషాపరంగా, ప్రాంతీయపరంగా అణచివేతకు గురవుతున్న తరగతుల అస్తిత్వ వాద ఉద్యమాలు, వివక్షకు గురవుతున్న మహిళల సమూహాలను మైనారిటీలను ఉపశ్రేణుల పరిధిలో నిర్వచించాడు. ప్రత్యామ్నాయ హెజమనీలో ఈ ఉపశ్రేణుల సంఘటన వహించే కీలకపాత్రను పేర్కొన్నాడు. దళిత మహా సభ తన మేనిఫెస్టోలో దళిత పదానికి విశాలమైన నిర్వచనాన్ని ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అందరూ దళితులేనని కుల–వర్గ దోపిడీకి, అణచివేత కు గురైన వారి అందరి ఐక్య సంఘటనకు దళిత పదం ప్రాతినిధ్యం

వహిస్తుందని ప్రకటించింది. ఇది పౌర సమాజంలో అత్యధిక సంఖ్యాకులుగా వున్న ఉపశ్రేణి కులాల సంఘటనగా ప్రకటించారు.

- 2.గ్రాంసీ భావజాలం ప్రకారం ఈ ఉపశ్రేణులకు నాయకత్వం వహించే వర్గం కేవలం తన వర్గ ప్రయోజనాలకే పరిమితం కాకూడదు. అది ఈ ఐక్య సంఘటనలోని అన్ని సమూహాల ఆకాంక్షలను తన ఆకాంక్షలుగా వ్యక్తం చేయడం ద్వారా దీనికోసం అవసరమైన మేరకు తన ప్రయోజనాలను కొన్నింటిని వదులుకోవడానికి, మార్చుకోవడానికి సిద్ధపడాలి. దీనికి ఒక ఉమ్మడి భావజాలాన్ని, అందరూ దానిని తమ స్వంత భావజాలంగా భావించే రీతిలో రూపొందించాలి. దీని ద్వారా ఒక ఉమ్మడి సమ్మతిని సాధించాలి. దళిత మహాసభ కూడా కుల-వర్గ నిర్మూలనను అందరి ఆకాంక్షలనూ సాధించే ఉమ్మడి అంశంగా ప్రతిపాదించింది.
- 3.గ్రాంసీ ఉపశ్రేణుల ఐక్యత విడి విడి సంఘటన కాకుండా అది ఒక సమ్మేళనంగా ఒక చారిత్రక ముద్దగా రూపొందినప్పుడే ఈ ఉపశ్రేణులు సమాజంలో హెజమనీ సాధించే స్థితి వస్తుందని సూత్రీకరించాడు. దీనిని దళిత మహాసభ సాధించలేకపోయింది. దళిత పదానికి విశాలమైన నిర్వచనం ఇచ్చినా అది ఎస్సీలకే పరిమితం అయ్యింది. ఎస్టీలు, బీసీలు తాము కూడా దళితులమేనని ప్రకటించుకున్న సందర్భాలు లేవు. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ వారిని విడి విడి సమూహాలుగా ఉంచింది. అది దళిత పదం గొడుగులో ఒక చారిత్రక ముద్దగా రూపొందలేదు.
- 4.గ్రాంసీ ఇలాంటి చారిత్రక ముద్దను రూపొందించడానికి తమ సవర్గ మేధావులను రూపొందించుకోవలసిన ఆవశ్యకతను వివరించాడు. ఈ సవర్గ మేధావులు ఉపశ్రేణులను కలిపి ఉంచే చరిత్రను, సామాజిక, సాంస్కృతిక భావజాలాన్ని పెంపొందించడం మాత్రమే కాదు. వారితో సజీవ సంబంధాల ద్వారా ఈ ఐక్యతను ప్రోది చేసే వారు కావాలని సూచించాడు. దళిత మహాసభ కూడా తన రచయితల విభాగాన్ని ఏర్పాటు చేసింది. వారు చరిత్ర, సామాజిక ఉద్యమాలపైన, ప్రచార సాహిత్యంపైనా చాలా కృషి చేశారు. ఎంతో వైవిధ్యం గల సాహిత్య సృష్టి చేశారు. అయితే ఈ ఉపశ్రేణులు ఎవరికి వారు తమ కులపరమైన అస్తిత్వ వాదానికి పరిమితం అయ్యారు. ఇవి విడి విడి అస్తిత్వ వాద సాహితీ ఉద్యమాలుగానే ఉండిపోయాయి.
- 5. గ్రాంసీ ఈ ఉపశ్రేణుల భావజాలాన్ని ఒక సాంస్కృతిక ఉద్యమంగా సాగించి భావ విప్లవాన్ని సాధించాలని ప్రతిపాదించాడు. ప్రజలను నిత్య

జీవితంలో నడిపించేది వారికి అందుబాటులో ఉన్న లోకజ్ఞానం అనీ దానిని విచక్షణా జ్ఞానంగా మార్చడం ఈ భావ విప్లవ లక్ష్యంగా ప్రకటించారు. దళిత మహాసభ ప్రత్యేక సాంస్కృతిక రంగాన్ని ఏర్పాటు చేసినా అది ఉమ్మడి భావ జాలాన్ని ప్రచారం చేసేదిగా సామాన్య ప్రజల లోకజ్ఞానాన్ని, విచక్షణా జ్ఞానంగా మార్చే ఉమ్మడి భావ విప్లవాన్ని సాధించే దిశగా అడుగులు పడలేదు.

- 6. గ్రాంసీ ఈ రాజకీయ సైద్ధాంతిక, సామాజిక, సాంస్కృతిక ఉద్యమం కింది నుండి నిర్మాణం కావాలని అప్పుడే అది విజయం సాధించే స్థితికి చేరుకుంటుందని విశ్లేషించారు. బహుజన సమాజ్ పార్టీ రూపంలో 1994 ఎన్నికలలో పైనుండి ఏర్పాటు చేసిన ఉపశ్రేణి కులాల రాజకీయ సంఘటన ప్రయోగం జయప్రదం కాలేదు. అది అట్టడుగు స్థాయిలో దళిత-బహుజనుల ఉమ్మడి చైతన్యం నుండి పుట్టింది కాదు. 1988లో దళిత మహాసభ రెండో మహాసభ జరిగింది. ప్రారంభంలో దీని కార్యకలాపాలు ప్రధానంగా సామాజిక, సాంస్కృతిక రంగానికే పరిమితంగా ఉన్నాయి.

1988 మహాసభలో నాయకత్వంలో వచ్చిన విభేదాలతో దళిత మహాసభ చీలిపోయింది. 1991లో పద్మారావు గ్రూపు విజయవాడలో, బొజ్జా తారకం గ్రూపు ఒంగోలులో వేరు వేరుగా సభలు నిర్వహించారు. ఇవే దళిత మహాసభ చివరి సమావేశాలు అయ్యాయి. ఆ తర్వాత దళిత ఉద్యమం అంతర్గత కుల వైరుధ్యంతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిగా, మాల మహానాడుగా చీలిపోయింది. దీనితో దళిత మహాసభ తన అస్తిత్వాన్ని కోల్పోయింది.

దళిత, బహుజన హెజమనీ ఆలోచనగానే మిగిలిపోయింది. దళిత మహాసభ ఒక ఉద్యమంగా జయప్రదం కాకపోయినా దాని ప్రభావం రాజకీయ రంగం మీద ఈ శక్తుల ప్రాధాన్యతని పెంచింది. దళిత మహాసభ ఉద్యమాలు చరిత్రలో భాగం అయ్యాయి. అవి ఆయా సమూహాల ఆలోచనలలో భాగంగా కొనసాగుతున్నాయి. మరో ప్రయత్నానికి అది పునాది అవుతుంది.

# నాలుగవ భాగం

## ప్రాంతీయ పార్టీలు : బాస్టర్డ్ హెజమనీ

2014 నాటికి ఆంధ్ర ప్రాంత రాజకీయం ఒక ప్రత్యేక దశకు చేరుకుంది.

- 1. 1952లో రెండు జాతీయ పార్టీలు.. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్య - రాజకీయ సంఘర్షణ జరిగింది. ఇప్పుడు దానికి విరుద్ధంగా రెండు ప్రాంతీయ పార్టీల మధ్య - తెలుగుదేశం, వైఎస్ఆర్‌సీపీ - రాజకీయ సంఘర్షణ రూపం తీసుకుంది. ఆనాడు ఎన్నికల సంఘర్షణలో ప్రధాన పాత్ర వహించిన కాంగ్రెస్ - కమ్యూనిస్టు పార్టీలు, 2014-2019లో జరిగిన ఎన్నికల సంఘర్షణలో తెర వెనుకకు నెట్టబడ్డాయి. ఈ రెండు ఎన్నికలలో ఆ పార్టీలకు శాసన సభలో ఒక స్థానం కూడా దక్కని స్థితి వచ్చింది.
- 2. ఆనాడు కాంగ్రెస్ - కమ్యూనిస్టు పార్టీల మధ్య రాజకీయ సంఘర్షణ వర్గ సంఘర్షణ రూపంలో జరిగింది. ఇప్పుడు అది కుల సమీకరణాల సంఘర్షణ రూపం పొంది సమాజంలో వివిధ వర్గాలను సమీకరించడానికి బదులు వివిధ కులాలను సమీకరించే రూపం ధరించింది.
- 3. ఆనాడు విధాన పరమైనదిగా సాగిన రాజకీయ సంఘర్షణ నేడు కేవలం అధికార సాధనే లక్ష్యంగా సాగుతున్నది. అభివృద్ధి నమూనాలతో ప్రజల ఆకాంక్షల చుట్టూ సాగిన ఎన్నికల సమరం ఇప్పుడు డబ్బు చుట్టూ, ప్రలోభాల చుట్టూ, రాయితీల చుట్టూ ఓట్లను పొందే ప్రక్రియగా రూపాంతరం చెందింది.

ఇలాంటి వికృత రాజకీయాలకి దారి తీసిన ఆర్థిక, రాజకీయ పరిణామాలను మనం విశ్లేషించుకోవాలి.

### ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం ఆవిర్భావం

#### 1. భూ ఆదాయం నుండి పెట్టుబడిదారీ ఆదాయానికి మార్పు

1950 దశకంలో ఆంధ్ర ప్రాంతంలో వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరుగా వుంది. 1960 దశకంలో ప్రారంభమైన సాంద్ర వ్యవసాయం, హరిత విప్లవం ఈ ఆదాయాన్ని మరింత పెంచింది. భూస్వాములు, ధనిక రైతులు దగ్గర సంపద పోగుపడింది. దీనిని మరికొంత భూవిస్తరణకు వినియోగించే దశలో 1972లో భూసంస్కరణల చట్టం వచ్చింది. దీనిని భూ యజమానులు తీవ్రస్థాయిలో 'జై

ఆంధ్ర' ఉద్యమ రూపంలో ప్రతిఘటించారు. జాతీయస్థాయి పాలక పెట్టుబడిదారీ వర్గానికి ప్రాంతీయ భూస్వామ్య వర్గానికి మధ్య తీవ్ర ఘర్షణగా సాగింది. ఈ చట్టం వల్ల భూమి పంపిణీ జరగకపోయినా, భూకమతాల విస్తరణ ఆగింది. మిగులు సంపద రకరకాల రంగాలలో పెట్టుబడులుగా తరలడం ప్రారంభమైంది.

1991 తర్వాత రెండు పరిణామాలు జరిగాయి. దేశంలో సరళీకృత ఆర్థిక విధానాల అమలు ప్రారంభమైంది. ప్రపంచీకరణ విస్తరించింది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక, వాణిజ్య వ్యాపార రంగాలలో, పట్టణీకరణలో భాగంగా రియల్ ఎస్టేటు రంగం వగైరాలలో పెట్టుబడులకు, అదనపు ఆదాయానికి ద్వారాలు తెరుచుకున్నాయి.

మరోపక్క వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో పడింది. భూమి ఒక ఆస్తిగా తప్ప అదనపు ఆదాయాన్ని ఇచ్చేది కాకపోగా నష్టాల బాట పట్టింది. గ్రామాలలో భూయజమానులు ప్రత్యక్షంగా వ్యవసాయం చేయడం నుంచి క్రమంగా తప్పుకున్నారు. వ్యవసాయంలో కౌలు రైతులను ప్రవేశపెట్టారు. భూ ఆస్తి ని వుంచుకుంటూనే, కౌలును పొందుతూ వ్యవసాయ సంక్షోభాన్ని కౌలు రైతులకు దఖలుపర్చారు. కౌలు రైతులు పగలూ రాత్రులూ చేసిన శ్రమే వారికి ఆదాయం అయింది. ఏదైనా విపత్తు సంభవిస్తే అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కల్పించారు.

సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ గ్రామీణ భూస్వాములు, ధనిక రైతులు దానిని అందిపుచ్చుకుని వివిధ రంగాలలో రకరకాల రూపాలలో పెట్టుబడిదారులుగా రూపాంతరం చెందారు. స్వేచ్ఛా పెట్టుబడిదారీ గొడుగు కింద వారంతా ఒక వర్గంగా రూపొందారు. భూ ఆస్తి సంబంధాలకు పెట్టుబడికి వున్న వైరుధ్యాన్ని సమన్వయం చేసుకున్నారు. అంతగా అంతర్గత ఘర్షణలేని ఒకే వర్గంగా అవతరించారు.

## 2. ఫ్యూడల్ పట్టు నుండి డబ్బు పట్టుకు మారిన రాజకీయం

ఈ కాలంలో గ్రామీణ ప్రాంత రాజకీయం కూడా మార్పులకు గురైంది. 1994 రాజ్యాంగ సవరణకు పూర్వ రాష్ట్రంలో రాజకీయ రంగంలో ఎదుగుదలకు పంచాయతీరాజ్ వ్యవస్థ నిచ్చెనమెట్లుగా వుండేది. అంచెలంచెలుగా శాసనసభకు దాని ద్వారా ఎదిగే పద్ధతిని పార్టీలు అనుసరించేవి. 1994 రాజ్యాంగ సవరణ తర్వాత 60 శాతం స్థానాలు బడుగు బలహీన వర్గాలకు రిజర్వు కావడంతో

పంచాయతీల వ్యవస్థ మీద భూస్వామ్య వర్గాల ప్రత్యక్ష నాయకత్వ పాత్ర సన్నగిల్లింది. వారు పరోక్షంగా తమ అనుయాయుల ఆధారంగా పట్టు కొనసాగించడం తప్ప ప్రత్యక్ష పట్టు సడలింది.

మరో పక్క ఎన్నికల రాజకీయంలో డబ్బు ప్రవేశించింది. ఏ స్థాయిలోనైనా పాలక పార్టీల పదవులు డబ్బు పెట్టగలిగే వారికే దక్కే స్థితి వచ్చింది. దాంతో రాజకీయ రంగంలో ఫ్యూడల్ పట్టు స్థానంలో డబ్బు పట్టు ఆక్రమించింది. డబ్బు ప్రవేశంతో పదవులు గత రాజకీయ జీవితంతో సంబంధం లేని కొనుగోలు సరుకు అయింది. కొత్త పెట్టుబడిదారీ వర్గం ఈ దారిలోనే రాజకీయ అధికారాన్ని పొందే మార్గాన్ని అవలంబించింది. ఎన్నికల వ్యవస్థ భూస్వామ్య పద్ధతుల నుండి పెట్టుబడిదారీ పద్ధతికి మారింది.

## రెండు ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించిన తీరు

1983 ఎన్నికలు రాష్ట్ర రాజకీయంలో కొన్ని ప్రత్యేకతలను తెచ్చిపెట్టాయి. రాష్ట్రంలో అంత వరకు జాతీయ పార్టీల మధ్య నడిచిన రాజకీయం ఇప్పుడు ఒక జాతీయ పార్టీకి, ఒక ప్రాంతీయ పార్టీకి మధ్య రాజకీయ సంఘర్షణగా మారింది.

1983లో కాంగ్రెస్ రాజకీయ గుత్తాధిపత్యాన్ని బద్దలుకొట్టడంతోపాటు రాష్ట్రంలో రెడ్డి కుల ఆధిపత్య రాజకీయాన్ని తొలగించింది. ఇలా కమ్మ కులం అధికారంలోకి తొలిసారి రంగప్రవేశం చేసింది. దాంతో రాజకీయంలో కులాల ఆధిపత్య పోరుకు బీజాలు పడ్డాయి. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీల వ్యవస్థ ఏర్పాటును, అవి కుల రాజకీయ సంఘర్షణ రూపం తీసుకున్న క్రమాన్ని విశ్లేషించుకోవాలి.

ప్రస్తుతానికి రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీలు – తెలుగుదేశం – వై.యస్.ఆర్ పార్టీలు ఒక దానికి మరొకటి ప్రత్యామ్నాయంగా వున్నాయి

## తెలుగు దేశం పార్టీ

1982లో తెలుగుదేశం ఒక ప్రాంతీయ పార్టీగా ఏర్పడింది. అన్ని ప్రాంతీయ పార్టీలలాగే ఇది కూడా వ్యక్తి కేంద్రంగా ఏర్పడింది. ఇలాంటి పార్టీల కొనసాగింపు కూడా ఆ వ్యక్తి వారసత్వం రూపంలోనే వుంటుంది.

1989 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పరాజయం పాలైంది. పార్టీ

కార్యకలాపాలకు ఎన్‌టి.ఆర్ దూరంగా వున్నాడు. పార్టీ పగ్గాలు చేపట్టిన చంద్రబాబు తనకంటూ ఒక వర్గాన్ని రూపొందించుకున్నాడు. 1994 ఎన్నికలలో తన వర్గానికి ఎక్కువ సీట్లు కేటాయించుకోగలిగాడు. 1995లో లక్ష్మీపార్వతి జోక్యం సమస్యపై ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని అస్థిరపరచి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాడు. ఈ సమయంలో ఆ పార్టీని అనుసరించే ప్రజా సమూహాలలో వారసత్వం సమస్య ముందుకొచ్చింది. ఎన్టీఆర్ మరణం తర్వాత వారసత్వాన్ని లక్ష్మీపార్వతి దక్కించుకో వాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులందరినీ చంద్ర బాబు ఆకట్టుకోవడంతో వారసత్వ సమస్య ఆయనకు అనుకూలంగా మారింది. 1999 ఎన్నికలలో చంద్రబాబు తన నాయకత్వంతోనే ఎన్నికల్లో గెలిచాడు.

## ప్రాంతీయ పార్టీగా కాంగ్రెస్ - వారసుడుగా జగన్

మరోపక్క కాంగ్రెస్ పార్టీ నుండి వైఎస్ఆర్‌సీపీ ఒక ప్రాంతీయ పార్టీగా పుట్టుకొచ్చిన క్రమంలో కొన్ని ప్రత్యేకతలు వున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వరసగా రెండు ఎన్నికల్లో(1994–1999) పరాజయం పాలైంది. అదే సమయంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయి వుంది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, చంద్రబాబుని ఎదుర్కొని నిలబడగల నాయకత్వం కోసం కాంగ్రెస్‌లో తపన ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడిగా చంద్రబాబును సమర్థవంతంగా ఎదుర్కొంటున్న రాజశేఖర్‌రెడ్డి అటు పార్టీ దృష్టినీ, ఇటు ప్రజల దృష్టినీ ఆకర్షించారు.

కాంగ్రెస్ పార్టీ నిర్ణయంతో నిమిత్తం లేకుండా రాజశేఖరరెడ్డి సుదీర్ఘమైన పాదయాత్ర చేశాడు. ప్రజలలో వచ్చిన స్పందనతో కాంగ్రెస్ శ్రేణులు ఆయన నాయకత్వం కింద సమీకృతం అయ్యాయి. పాదయాత్ర ద్వారా పేదలలో, రైతులలో, సామాన్యులలో మంచి గుర్తింపుతోపాటు వారితో మమేకం కావడంతో ప్రజా నాయకుడుగా ఎదిగాడు.

## ఇద్దరు నేతల మధ్య పోరు

మొత్తం మీద తెలుగుదేశం అంటే చంద్రబాబు అన్నట్లే కాంగ్రెస్ అంటే రాజశేఖర్ రెడ్డి అన్న స్థితి రాష్ట్రంలో ఏర్పడింది. దీంతో రెండు పార్టీల మధ్య పోటీ ఇద్దరు నాయకుల మధ్య పోటీగా మారింది. 2004లో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ఈ పరిస్థితి స్థిరపడింది.

2004లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాని అది సంకీర్ణ ప్రభుత్వంగా వుంది. రాష్ట్రంలో రాజశేఖర్‌రెడ్డి పాలన మీద, పథకాల మీద ఎలాంటి ఆంక్షలు పెట్టే స్థితిలో కాంగ్రెస్ హైకమాండ్ లేదు. ఆయన ప్రకటించిన సంక్షేమ పథకాలు, అర్హులందరికీ అందించే పద్ధతి సాగు నీటి రంగం మీద కల్పించిన ఆకాంక్షలు, ఉచిత విద్యుత్ వగైరాలు పేదలు, రైతులు అందరి ఆదరాభిమానాలు పొందాయి. 2009 ఎన్నికలలో ఆయన తిరిగి ముఖ్యమంత్రి అయ్యాడు. కొద్ది నెలలకే సంభవించిన దుర్మరణం ప్రజల సానుభూతిని విపరీతం చేసింది. ఆయనకు వారసుడుగా జగన్ ముందుకు వచ్చాడు. కాని కాంగ్రెస్ అధిష్టానం తన పద్ధతి ప్రకారం హైకమాండ్ ద్వారా నిర్ణయించి రోశయ్యను ముఖ్యమంత్రిని చేసింది.

జగన్ అధిష్టానాన్ని ధిక్కరించి 'ఓదార్పు యాత్ర' చేశాడు. పల్లెల్లో మరణించిన కుటుంబాలను పరామర్శించడం, సభలలో ప్రసగించడం ద్వారా రాజశేఖర్‌రెడ్డిపై వున్న సానుభూతిని, ఆయనకు వారసునిగా జగన్ తన వైపు మళ్లించుకున్నాడు. కాంగ్రెస్ పార్టీ నుంచి తన వెంట వచ్చిన ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి జగన్ ఎన్నికల బరిలోకి దిగాడు. కాంగ్రెస్‌నీ, తెలుగుదేశాన్ని ఓడించి ఘన విజయం సాధించాడు. రాజశేఖరరెడ్డికి వారసునిగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులన్నీ జగన్ పరం అయ్యాయి. 2014 ఎన్నికలకు ముందు రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ ఆ ఎన్నికలలో నామమాత్రంగా మిగిలింది. జగన్ ప్రాంతీయ పార్టీ కూడా వ్యక్తి చుట్టూ నిర్మితమైంది. ఇలా రెండు ప్రాంతీయ పార్టీలు, రెండు కులాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల చుట్టూ నిర్మితమైన వారసత్వ పార్టీల నేతలు రాష్ట్ర రాజకీయంలో ఒకరికి మరొకరు ప్రత్యామ్నాయంగా రూపొందారు.

## ఒకే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం - రెండు ప్రాంతీయ పార్టీలు అధికార క్రీడ - ధన రాజకీయం

ఈ ప్రాంతీయ పార్టీల మధ్య సాగుతున్న కుల సమీకరణల సంఘర్షణ పూర్వాపరాలను విశ్లేషించుకుందాం.

రాష్ట్రంలో ప్రాంతీయ పెట్టుబడిదారీ శక్తులు ఒక వర్గంగా రూపొందిన క్రమాన్ని మనం చూశాం. ఈ వర్గం ఒక కులానికి మాత్రమే చెందింది కాదు. సంపన్నవర్గాల – కులాల సమ్మేళనం. అయితే వారికి కుల ప్రయోజనాలకంటే వర్గ ప్రయోజనాలే ప్రధానంగా వుంటాయి.

ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం తనను కూలదోసే ప్రగతిశీల రాజకీయ ప్రత్యామ్నాయాన్ని కోరుకోదు. అది దాని వర్గ ప్రయోజనాలకు విరుద్ధం. అలాగే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం తనకు అనుకూలమైనదే అయినా ఒక జాతీయ పార్టీ ప్రత్యామ్నాయాన్ని అంతగా కోరుకోదు. ఎందుకంటే తన ప్రయోజనాలకు అనుగుణంగా జాతీయ పార్టీని మల్చుకోవడంలో వున్న కష్టనష్టాలు దానికి తెలుసు. అందుచేత ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం తన వర్గ ప్రయోజనాలు కాపాడే రెండు ప్రాంతీయ పార్టీల ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటుంది. అప్పుడు ఎవరు అధికారం లోకి వచ్చినా తమ వర్గపాలన యధావిధిగా కొనసాగుతుంది. అంటే అది రెండు ప్రాంతీయ పార్టీలను కోరుకుంటుంది. ఈ రెండు తమ వర్గ ప్రయోజనాలు కాపాడేవిగా వుండాలని కోరుకుంటుంది.

అందుకే రాష్ట్రంలో ఈ రెండు ప్రాంతీయ పార్టీలకీ వర్గపరంగా వున్న పునాది ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గమే. ఇలా ఒకే వర్గానికి రెండు ప్రాంతీయ పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు రాజకీయ అధికారం కోసం సాగే సంఘర్షణ వర్గ పోరాట రూపం ధరించదు. ఎందుకంటే అది తమ వర్గ పునాదిని దెబ్బ తీస్తుంది.

అందుచేత రాజకీయ సంఘర్షణ కేవలం అధికార క్రీడగా ఒకరిని ఓడించి మరొకరు అధికారంలోకి రావడం తప్ప వర్గపరమైన మార్పులకు అందులో చోటు వుండదు. మరొకటి ఎన్నికల్లో డబ్బుది ప్రధాన పాత్ర చెయ్యడం. డబ్బు ప్రధానపాత్ర వహిస్తే సామాన్యుల ప్రగతిశీల ప్రత్యామ్నాయం వృద్ధి చెందడాన్ని అది నిరోధిస్తుంది. డబ్బుతో సాగే ఈ ఆట ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం చేతుల నుండి అధికారం జారకుండా చేస్తుంది. అలాగే ప్రజలను వర్గ సమస్యల మీద సమీకరించడం ఈ అధికార క్రీడలో వుండదు.

## కుల సమీకరణల రాజకీయం

ధన రాజకీయంతోపాటు ప్రజలను సమీకరించే ప్రత్యామ్నాయ మార్గం అవసరం అవుతుంది. దీని పర్యవసానంగా వచ్చిందే కుల సమీకరణల రాజకీయం. ఒకే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం రెండు పార్టీల రూపంలో కుల సమీకరణల రాజకీయం సాగిస్తున్నది.

రాష్ట్రంలో ఇప్పుడు రెండు ప్రాంతీయ పార్టీల వ్యవస్థ స్థిరపడింది. ఒకే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గానికి ఈ రెండు ప్రాంతీయ పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇలా ఒకే వర్గ పునాది మీద ఏర్పడిన రెండు పార్టీలు సాగించే రాజకీయ సంఘర్షణ ఒక ప్రత్యేక రూపంలో తప్ప సాధ్యం కాదు. అది ఒక వర్గాన్ని కూల్చి మరోవర్గం

అధికారాన్ని పొందే రూపంలో సాధ్యం కాదు. అందువల్ల అది వర్గ ప్రాతిపదిక లేని కేవలం అధికార క్రీడ రూపంలోనే సాగుతుంది. వర్గ ప్రమేయం లేని రూపంలో సాగుతుంది. అందుకే రాష్ట్రంలో రాజకీయం కుల సమీకరణల సంఘర్షణ రూపం తీసుకుంది. ఇలాంటి కుల సమీకరణలను సాధించడం, ఆ ప్రజా సమూహాలను ఓటు బ్యాంకులుగా మార్చుకోడానికి వారి సమ్మతిని పొందే మార్గాలు ఈ ప్రాంతీయ పార్టీల రాజకీయ సంఘర్షణలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

## పౌర సమాజ సమ్మతి - బాస్టర్డ్ హెజమనీ

ఇలాంటి రాజకీయ అధికార క్రీడలో ప్రజల సమ్మతిని పొందే మార్గాలను విశ్లేషించుకోడానికి గ్రాంసీ భావజాలం మనకు దారి చూపిస్తుంది. పౌర సమాజ సమ్మతిని సాధించే రెండు రకాల పద్ధతులను గ్రాంసీ ఆవిష్కరించాడు. మొదటిది ప్రత్యక్ష ప్రజా సమ్మతిని పొందే పద్ధతి. దీనిని సాధించే వర్గం ప్రజా సమూహాల నిజమైన ప్రయోజనాలను తన ప్రయోజనాలుగా ప్రకటించి ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో ఒక ఉమ్మడి సమ్మతిని పొందుతుంది. దాని ద్వారా ఈ వర్గాల ఉమ్మడి ప్రయోజనాలను సాధించే వ్యవస్థను సాధిస్తుంది. ఇది నిజాయితీగా సాధించే ప్రజాసమ్మతి.

మరో పద్ధతి పరోక్షంగా ప్రజా సమస్మతిని సాధించడం. ఇక్కడ పౌర సమాజ సమ్మతిని సాధించే వర్గం తన మిత్ర వర్గాలుగా భావించే ఉపశ్రేణి ప్రజా సమూహాల నుండి క్రియాశీలమైన నేతలను తన వర్గంలో ఇముడ్చుకుంటుంది. వారి ద్వారా ఆ ప్రజా సమూహాల సమ్మతిని పరోక్షంగా పొందే ప్రయత్నం చేస్తుంది. అలాగే ఆయా ప్రజాసమూహాలకు కొన్ని రాయితీలు, కొన్ని ప్రలోభాలను కల్పించి వారు వర్గపరమైన ఆలోచనల వైపు మళ్లకుండా తటస్థ పరుస్తుంది. ఈ పద్ధతులతో సాధించే పరోక్ష  సమ్మతిని గ్రాంసీ నీతి బాహ్యమైన, వంచనతో కూడిన బాస్టర్డ్ హెజమనీగా నిర్వచించారు.

రాష్ట్రంలో ఈ రెండు ప్రాంతీయ పార్టీలు అవలంభిస్తున్న పద్ధతులకీ గ్రాంసీ నిర్వచించిన బాస్టర్డ్ హెజమనీకి చాలా పోలికలు కన్పిస్తాయి. అందుచేత గ్రాంసీ భావాల నేపథ్యంలో ఈ రెండు ప్రాంతీయ పార్టీల విధానాలను మనం విశ్లేషించుకోవాలి. ఈ రెండు పార్టీలు రాష్ట్రంలో ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం స్థిరపడడానికి, బలపడడానికి, విస్తరించడానికి తగిన విధానాలను అనుసరిస్తు న్నాయి. దీనిపట్ల ప్రజలలో అసంతృప్తి రాకుండా వారిని తటస్థపరిచే పద్ధతులను

పాటిస్తున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ఆర్థిక రాయితీలు, పన్ను రాయితీలు, భూసేకరణ రాయితీలు, విద్యుత్ రాయితీలు ఇతర మౌలిక సదుపాయాల కల్పన వగైరాలు ఈ రెండు పార్టీలు సమానంగానే తోడ్పాటు నిస్తున్నాయి. ఇదంతా రాష్ట్రంలో ఉద్యోగ కల్పన పేరుతో నిరుద్యోగులను ఆకర్షించే మార్గంగా మలుచుకున్నాయి.

కార్పొరేట్ వైద్యం ఒక వ్యాపారంగా విస్తరించింది. అది ప్రజల్ని నిలువుదోపిడీ చేస్తూ లాభాల వేట సాగిస్తున్నది. ఈ దోపిడీని, దీని వ్యాప్తినీ అరికట్టేందుకు ఈ రెండు పార్టీలు ఏ చర్యలు తీసుకోలేదు. వైద్య సేవలలో పెరిగిన ఈ అంతరం సామాన్యులలో తీవ్ర నిరసనకు దారితీసింది. అయితే కార్పొరేట్ వైద్యాన్ని అదుపు చెయ్యడానికి బదులు పేదలకు సామాన్యులకు కార్పొరేట్ వైద్య సేవలు అందించే పేరుతో ప్రభుత్వ సొమ్ముతో ఆరోగ్యశ్రీ వంటి పథకాలను ఒకరు ప్రవేశపెడితే మరొకరు దానినే కొనసాగించారు. పైకి ఇది పేదలకు కార్పొరేట్ వైద్య సేవగా కనిపించినా నిజానికి ఈ కార్పొరేట్ ఆసుపత్రులకే ప్రభుత్వ సొమ్ము దక్కింది.

కార్పొరేట్ విద్యారంగం విపరీతంగా విస్తరించింది. ఫీజుల దందా సాగుతోంది. పేదల చదువు, సంపన్నుల చదువును వేరు చేసింది. పేదలు, సామాన్యుల పిల్లలు చదువుకోసం కార్పొరేట్ల బారినపడి ఆస్తులు అమ్ముకొంటున్నారు. అప్పులపాలు అవుతున్నారు. దీనిని ఈ రెండు పార్టీలు కట్టడి చెయ్యకపోగా పేదలకు కార్పొరేట్ చదువుల నినాదాన్ని ముందుకు తెచ్చాయి. ఫీజు రీ-ఇంబర్స్‌మెంట్లు పథకం తెచ్చి ఉభయతారకంగా వ్యవహరిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతంలో భూ ఆస్తి ఒకరిదీ, సాగు పని మరొకరిదీ అయింది. సాగు చెయ్యని భూకామందుల జోలికి పోకుండా, కౌలు నిర్ధారణకు తగిన పద్ధతిని తీసుకురాకుండా కౌలుదారులకు ప్రభుత్వ రాయితీలు ఇచ్చే కార్డుల పద్ధతి ముందుకు తెచ్చారు. ఇది ఆచరణలో అమలు కానిదైనా దాని చుట్టూనే కౌలు రైతులకు ఆశలు కల్పిస్తున్నారు. ఇలా ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను ఈ రెండు పార్టీలలో ఎవరు అధికారంలో వున్నా వారు ఈ వర్గ ప్రయోజనాలకు దోహదపడే విధానాలనే అమలు చేస్తున్నారు.

సమాజంలో వున్న ఉపశ్రేణులని కులం పేరుతో, మతం పేరుతో సమీకరించు కోడానికి ఈ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయి. పరోక్ష పద్ధతిలో ఆయా కులాల మద్దతు సంపాదించడానికి వారి నాయకులను వివిధ కుల కార్పొరేషన్లలో ఇముడ్చుకుంటున్నాయి. ఇతర నామినేటెడ్ పోస్టులలో వివిధ కులాలకు ప్రాతినిధ్యం

కల్పించడానికి ఒకరిని మించి మరొకరు పోటీ పడుతున్నారు. కేవలం రాజకీయ అధికారమే లక్ష్యం కావడంతో ఒక పార్టీ నుంచి మరో పార్టీకి నాయకుల ఆకర్షణలు సునాయాసంగా జరిగిపోతున్నాయి. ఒకే వర్గ పునాది కావడం వల్ల వారు ఎలాంటి ఇబ్బంది పడే స్థితి లేకుండాపోయింది.

ప్రజల ప్రమేయం లేని ఈ పరోక్ష సమ్మతిని సాధించే ప్రక్రియలో ఉప శ్రేణులకు స్వతంత్ర జీవనాన్ని ఇచ్చే ఆకాంక్ష పక్కకు పోయింది. ఎందుకంటే అలాంటి ఆకాంక్ష వర్గ చైతన్యాన్ని పెంపొందిస్తుంది. దానికి బదులుగా ఈ రెండు పార్టీలు ఓట్లు కోసం తమ ఆకాంక్షలనే ప్రజల ఆకాంక్షలుగా ప్రకటిస్తున్నాయి. ఒక వర్గం నుండి మరొక వర్గానికి సంపద మార్పిడికి బదులు ప్రభుత్వ ధనాన్ని రాయితీలు, సంక్షేమం రూపంలో అందిస్తున్నాయి. ఒక పార్టీని మించి మరొక పార్టీ ఈ తరహా ఓట్ల వేటలో పోటీపడుతున్నాయి. ఇవి ప్రజల నిత్య జీవితం నుండి పుట్టిన కొత్త ఆకాంక్షలు కావు. ఈ పార్టీలు వండి వారుస్తున్న ఓట్ల ఆకాంక్షలు. ఒకరు పసుపు కుంకుమ, పండగలకు ప్రభుత్వ కానుకలు, పెళ్ళికి డబ్బులు, ప్రభుత్వం తరఫున బారసాలలు, పిల్లలకు గోరుముద్దలు వగైరాలు.. అందిస్తే, మరొకరు రుణమాఫీలు, అమ్మ ఒడి, వివిధ వృత్తుల వారికి ఏదో ఒక ఉచితాన్ని పంచి పెట్టి ఇదంతా సంక్షేమంగా ప్రకటిస్తున్నారు. కులాల వారీగా, తరగతుల వారీగా ఓటు బ్యాంకుల కోసం సాగించే ఈ తరహా పథకాలు ఉపశ్రేణుల స్థితిని అలాగే వుంచి వారు మరింతగా ప్రభుత్వ పథకాలపై ఆధారపడేటట్లు ఏదో ఒక పార్టీకి మద్దతుదారులుగా మారేట్టు చేస్తున్నారు. ఇవన్నీ వారిలో కొత్త ఆకాంక్షలు రేకెత్తకుండా, వర్గ చైతన్యం పొందకుండా కేవలం ఓట్ల సమ్మతిని పొందే బాస్టర్డ్ పద్ధతి. ఇది సమాజాన్ని మార్చేది కాదు. ఉపశ్రేణులను దోపిడీ నుండి, వివక్ష నుండి విముక్తి చేసేది కాదు.

ఈ రెండు ప్రాంతీయ పార్టీలకు, కుల సమీకరణల రాజకీయానికి, ఉపశ్రేణులను వంచించే ప్రలోభాలకు వ్యతిరేకంగా ఒక నిజమైన ప్రజా ప్రత్యామ్నాయం రూపుదిద్దుకోవాలి.

# ఐదవ భాగం

## ప్రత్యామ్నాయం : ప్రజా హెజమనీ

రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న బాస్టర్డ్ హెజమనీ ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గాన్ని స్థిరపరిచి, విస్తరింపజేస్తుంది. ఇది అన్ని రంగాలకు విస్తరించి అందరినీ దోపిడీ చేస్తున్నది. సంపద కేంద్రీకరణ వేగంగా సాగుతున్నది. సమాజంలో పేదరికాన్ని శాశ్వతం చేస్తున్నది. ఈ అంతరాలపై ప్రజల దృష్టి పడకుండా రాజకీయ సంఘర్షణను కుల సమీకరణల ప్రాతిపదికగా మార్చింది. కుల వివక్షను తెర వెనుకకు నెట్టి కులాల గోడలను స్థిర పరుస్తున్నది. ఉపశ్రేణులకు స్వతంత్ర జీవనానికి బదులు వారిని ప్రలోభాల చుట్టూ, రాయితీల చుట్టూ తిప్పుతున్నది. మరో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి రాజకీయ రంగ ప్రవేశం చెయ్యడానికి వీలు లేకుండా ఎన్నికల వ్యవస్థను కుబేరుల ఆటగా మార్చింది.

దీనికి ప్రత్యామ్నాయంగా పౌరసమాజంలో ప్రజా హెజమనీని నిర్మించాలి. అది ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం మూలాల మీద దాడి చేసేది కావాలి. ఈ వ్యవస్థను మార్చి ప్రజలకు స్వతంత్ర జీవనాన్ని, దోపిడీ లేని, కుల వివక్ష లేని సమాజాన్ని అందించేది కావాలి. ఇలాంటి ఉమ్మడి ప్రయోజనాలను సాధించే ప్రత్యామ్నాయ హెజమనీని పౌర సమాజంలో సాధించాలి. పౌర సమాజంలో ఈ ప్రత్యామ్నాయ భావజాలం ఆధిపత్యం వహించే కార్యకలాపాలకు రూపకల్పన జరగాలి.

పౌర సమాజంలో ప్రత్యామ్నాయ హెజమనీ అన్న భావనకు గ్రాంసీ రూపశిల్పి. ప్రత్యామ్నాయ హెజమనీ సాధనకు అవసరమైన మార్గాలను ఆయన ఆవిష్కరించాడు. దానిని నిర్దిష్టమైన చారిత్రక, రాజకీయ నేపథ్యంలో అన్వయించుకోవాలి. ఈ రాష్ట్రంలో పౌర సమాజంలో ప్రత్యామ్నాయ హెజమనీ సాధించడానికి చేసిన ప్రయత్నాల అనుభవాలను జోడించుకోవాలి. ఆ ప్రయోగాల తర్వాత మారిన పరిస్థితులను అంచనా వేసుకోవాలి. అందుకు గ్రాంసీ భావజాలం ఒక మార్గదర్శిగా ఉపయోగపడుతుంది.

### మారిన పరిస్థితులు - చీలిన ఉద్యమాలు

రాష్ట్రంలో 1952 నాటి పరిస్థితి ఇప్పుడు లేదు. 1942-46 మధ్య కాలంలో కమ్యూనిస్టు పార్టీ అన్ని తరగతుల ప్రజా సమూహాలను వివిధ ప్రజా సంఘాలలో

సంఘటిత పరిచింది. సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాల ద్వారా పౌర సమాజంలో భావజాల ఆధిపత్యాన్ని సాధించింది. తర్వాత కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. విడిపోయిన మార్క్సిస్టు పార్టీ మరో చీలికకు గురైంది. దాని నుండి చీలిన నక్సలైట్ గ్రూపులు మళ్లీ మళ్లీ చీలిపోయాయి. ఒకనాడు పౌరసమాజంలో ప్రత్యామ్నాయ హెజమనీకి చోదకశక్తిగా వున్న వామపక్షం ప్రస్తుతం ఈ చీలికల లోనే కొనసాగుతూ బలహీనపడింది.

రాష్ట్రంలో 1980 దశకంలో దళితులపై ఆధిపత్య కులాలు సాగించిన మూకుమ్మడి దాడులు, హత్యాకాండ నేపథ్యంలో దళిత మహాసభ ఆవిర్భవించింది. అది దళిత పదానికి విశాలమైన నిర్వచనాన్ని ఇచ్చింది. యస్.సి., యస్.టి., బి.సి., మైనారిటీల ఐక్యవేదికగా పేర్కొంది. అది కుల రహిత, వర్గ రహిత సమాజాన్ని సాధించడం లక్ష్యంగా చెప్పుకుంది. ఈ ఉపశ్రేణి కులాల ఐక్యతకు అంతర్గత వైరుధ్యాలను పక్కన పెట్టాలని పేర్కొంది. ఈ ఐక్య సంఘటనకు అనుబంధంగా రచయితలతోను, కళా బృందాలతోను, ఒక భావ విప్లవాన్ని సాధించాలని తలపెట్టింది. ఈ దిశగా స్థిరమైన అడుగులు పడకముందే దళిత మహాసభ చీలిపోయింది. దానికి సూత్రధారిగా వున్న దళితులు (ఎస్సీలు) రిజర్వేషన్ల అంశంపై విభేదించి అంతర్గతంగా వున్న కులపరమైన విభేదంతో రెండుగా చీలిపోయారు. అవి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి – మాల మహానాడులుగా నేటికీ కొనసాగుతున్నాయి

ఇప్పుడు దళిత మహాసభ లేదు. దళిత సమూహాలు ఎక్కడికక్కడ ఎవరికి వారుగా అంబేద్కర్ సంఘాలు నడుపుకుంటూ ఎక్కడైనా అవమానాలు, అత్యాచారాలు జరిగితే దానిని ప్రతిఘటించే రూపంలో కార్యకలాపాలు సాగిస్తున్నారు.

మరో పక్క ఆదివాసీల ఉద్యమాలలోనూ ఇలాంటి చీలికలే కనిపిస్తున్నాయి. మైదాన ప్రాంతాలలో ఎస్టీలుగా గుర్తింపు పొందినవారు ఒకపక్క, షెడ్యూలు ప్రాంతాలలో నివసించే ఆదివాసీలు మరో పక్క రిజర్వేషన్లతో సహా ఇతర సమస్యలపై ఘర్షణ పడుతున్నారు.

బీసీలలో అనేక కులాలున్నాయి. ఇందులో వర్గ విభజన హెచ్చుగా వుంది. భూ యజమానులుగా, పారిశ్రామిక వేత్తలుగా, ఇతర ఆర్థిక కార్యకలాపాలలో యజమానులుగానూ, ఆధిపత్య రాజకీయ కార్యకలాపాలలోనూ, పాత్ర పోషిస్తున్నారు.

బహుజనుల రాజ్యాధికారం అన్న సమస్య ప్రతి ఎన్నికల ముందు వినిపిస్తుంది. ఐతే పాలక వర్గాల నుండి మరిన్ని రాజకీయ పదవులు పొందడంతో

సరిపెట్టుకుంటున్నది.

ఈబీసీ కులాలలో కులపరమైన అంతరాలు, వైరుధ్యాలు వున్నాయి. ప్రతి కులం తన అస్తిత్వం కోసం కుల సంఘాలను ఏర్పాటు చేసుకుంటున్నది. మరోపక్క పూలే భావజాలంతో ప్రభావితులైన వారు రాజ్యాధికార స్వరాన్ని వినిపిస్తున్నారు.

ఇలాంటి అంతర్గత వైరుధ్యాలతో దళిత - బహుజన ఐక్యత రావడం లేదు. అస్తిత్వ వాద ఉద్యమాల పరిధిలో కుల చైతన్యం, ఆత్మ గౌరవం, రాజ్యాధికార కాంక్షలు మాత్రం వ్యక్తం అవుతున్నాయి. మొత్తం మీద దళిత - బహుజన ఐక్యత వైరుధ్యాలతో సతమతమౌతున్నది. రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీలు సాగిస్తున్న కుల సమీకరణల సంఘర్షణలో వారు పాత్రధారులవుతున్నారు.

ఈ నేపథ్యంలో వ్యవస్థను మార్చే ప్రత్యామ్నాయం పౌరసమాజంలో ఆధిపత్యాన్ని సాధించడంలో చాలా సంక్లిష్టతలు చోటుచేసుకున్నాయి.

## ఉపశ్రేణుల శకలాలతో ప్రజా హెజమనీ

ఆంధ్ర రాష్ట్రంలో నెలకొల్పే ప్రత్యామ్నాయం ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గ పాలనకు దాని బాస్టర్డ్ హెజమనీకి వ్యతిరేకంగా ప్రజా హెజమనీని సాధించేది కావాలి. అందుచేత ఒకేవర్గ పునాది గల తెలుగుదేశం, వైఎస్ఆర్‌సీపీలు రెండింటికీ అది ప్రత్యామ్నాయం కావాలి. ఈ రెండు ప్రాంతీయ పార్టీల మధ్య ఒక దానిని ఎంచుకుని మరో దానిపై పోరాడే అవకాశం లేదు. అలా ఎంచుకుంటే అది ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గ పాలనకు ప్రత్యామ్నాయం కాకపోగా దానికి తోడ్పాటు ఇచ్చేది అవుతుంది.

## ఉపశ్రేణుల చారిత్రక సంఘటన

ఈ ప్రత్యామ్నాయ ప్రజా హెజమనీకి సారథ్యం వహించే వర్గం లేదా పార్టీ లేదా సంస్థ ఈ ఉపశ్రేణులన్నింటినీ సంఘటిత పరిచేదిగా వుండాలి. ఇది ఒక విడివిడి సమూదాయాల ఐక్య సంఘటన లాంటిది కాదు. ఇదొక ఉమ్మడి ప్రయత్నం. అందులో అందరి ఆకాంక్షలకు స్థానం వుండాలి. అందరూ ఈ ఘటన తమదిగా భావించేలా రూపుదిద్దుకోవాలి. దీనిని గ్రాంసీ ఒక చారిత్రక సముదాయం లేదా ముద్ద అన్నాడు. అలాంటి హిస్టారిక్ బ్లాక్ ఏర్పడాలి.

ఇది భావసారూప్యత గల ముద్ద కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఏ ఒక్క సిద్ధాంత

భావజాలమూ ఇలాంటి ముద్దకు ప్రాతినిధ్యం వహించే స్థితి లేదు.

ఉప శ్రేణి కులాలలో అస్తిత్వవాద ఉద్యమాల ప్రభావం బలంగా వున్న నేపథ్యంలో వీటన్నింటికీ ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి భావజాలాన్ని పెంపొందించుకోవాలి. వర్గ దోపిడీని అంతం చేసే మార్క్స్ భావజాలాన్ని, కుల వివక్షను నిర్మూలించే అంబేద్కర్, పూలేల భావజాలాల సమన్వయంతోనే ఈ సంఘటన ఏర్పడే అవకాశం ఉంది. ప్రాంతీయ పెట్టుబడిదారీ దోపిడీని ప్రతిఘటించడానికి, కుల సమీకరణల రాజకీయాన్ని వ్యతిరేకించడానికి ఇలాంటి భావ సమన్వయం తప్పనిసరి అవుతుంది. అప్పుడు వర్గరహిత, వివక్షరహిత సమాజం ఈ సంఘటనకు ఉమ్మడి నినాదం అవుతుంది.

కుల నిర్మూలన జరిగినా వర్గ దోపిడీ దానంతట అదే అంతం కాదు అలాగే వర్గ దోపిడీ పోయినా కులం దానంత అదే తొలగిపోదు. అందువల్ల ఇది జమిలిగా సాగించాల్సిన రాజకీయ ఆర్థిక సామాజిక సాంస్కృతిక ఉద్యమం.

ఈ మౌలిక సంఘటనలో లింగ వివక్షకు వ్యతిరేకంగా మహిళలను సమీకరించడం, మైనార్టీల హక్కుల పరిరక్షణ సంస్థలతోపాటు పర్యావరణ పరిరక్షణ సంస్థలను ప్రజాస్వామిక హక్కుల సంస్థలను, ఇతర సామాజిక ఉద్యమాలను దీనిలో భాగం చెయ్యడానికి ఆయా సంస్థల నినాదాలను, లక్ష్యాలను ఈ సంఘటన తన కార్యక్రమంలో భాగంగా ప్రకటించుకోవాలి. అప్పుడే పౌరసమాజంలో భావజాల ఆధిపత్యం సంపాదించే విశాల ప్రాతిపదిక ఏర్పడుతుంది.

## సవర్గ మేధావులు

ప్రత్యామ్నాయ హెజమనీకి సాగే ఉద్యమం పౌరసమాజంలో సిద్ధాంత పోరాటం అవుతుంది. దానిని నిర్వహించడానికి తగిన సవర్గ మేధావులను అది రూపొందించుకోవాలి. చరిత్రను పునర్ నిర్మించడం, నూతన సమాజ ఆకాంక్షలను, దాని స్వరూప స్వభావాలను వెల్లడించగల సాహిత్య సృష్టి జరగాలి.

ప్రస్తుతం వర్గ దృక్పథం తో రాసే రచయితలున్నారు. అస్తిత్వవాద కుల చైతన్యం తో రచనలు చేసే వారున్నారు.అలాగే మహిళల, మైనారిటీల అస్తిత్వ వాదాన్ని ప్రకటించే రచయితలూ ఉన్నారు. వీరిలో చాలామంది ఆయా ఉద్యమాలలోపాత్ర దారులుగా ప్రత్యక్ష సంబంధాలను కలిగి వున్నారు. ఇది విడివిడి స్రవంతుల ప్రత్యేక భావజాలం గా వుంది. పైగా కొంత పరస్పర వ్యతిరేక

భావజాలం కూడా కనిపిస్తుంది. ఒక ఉమ్మడి భావజాలం గల సవర్గ మేధావులను వీరి నుండి రూపొందించుకునే అవకాశాలు వున్నాయి.

## సాంస్కృతిక విప్లవం

ప్రతి వ్యక్తి ఒక తత్వవేత్తే అంటాడు గ్రాంసీ. తాత్వికులు సాగించే అన్వేషణ వారు చెయ్యరు. కాని తననీ, తన చుట్టూ వున్న సమాజాన్ని వారు అర్థం చేసుకునేందుకు వినియోగించే సాధనం ఒకటి వుంది. అదే ప్రజలకు అందుబాటులో వుండే లోక జ్ఞానం. దీనిని తప్పుడు చైతన్యంగా కొట్టి పారెయ్యకూడదు అంటాడు గ్రాంసీ. ఇందులో పొసగని అంశాలు వుంటాయి. మతపరమైన విశ్వాసాలు, సంప్రదాయాల పరంపర, మూఢ నమ్మకాలతోపాటు పాలక వర్గాలు అందించే భావజాలమూ వారి జీవితానుభవాలు వగైరాలన్నీ వుంటాయి. ఇది వారి భావనా ప్రపంచం. బయటి నుండి అందించే సిద్ధాంత అంశాలు వారిని అంతగా ప్రభావితం చెయ్యవు. వారి లోక జ్ఞాన ప్రపంచంలో ప్రవేశించి దానిని విచక్షణా జ్ఞానంగా మార్చాలి. అప్పుడే నిజమైన భావ విప్లవం జరుగుతుంది. వారిలో కొత్త ఆకాంక్షలు మొలకెత్తుతాయి. వ్యవస్థను మార్చే ఉద్యమాలలో భాగస్వాములవుతారు.

ఈ పరిణామంలో సాహిత్య, సాంస్కృతిక  రంగాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ ఉపశ్రేణుల ఉమ్మడి ఆకాంక్షలతో కూడిన బలమైన సాంస్కృతిక ఉద్యమం సాగినప్పుడే పౌర సమాజంలో వివిధ సముదాయాలు చైతన్యవంతం అవుతాయి. పౌర సమాజంలో భావజాల ఆధిపత్యానికి అది దారితీస్తుంది.

ఆధునిక ప్రపంచంలో ప్రచార, ప్రసార మాధ్యమాలలో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇబ్బడిముబ్బడిగా పెరిగిన పత్రికలు, 24 గంటల టెలివిజన్ ప్రసారాలు, విస్తరించిన సోషల్ మీడియా, యూ ట్యూబ్ చానళ్లు అనునిత్యమూ ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ మాధ్యమాలను వినియోగించుకోవడంతో పాటు అక్కడ జరుగుతున్న భావజాల పోరాటంలో క్రియాశీలంగా పాల్గొనాల్సిన ప్రత్యేక పరిస్థితిని గుర్తించాలి.


మరోపక్క ప్రత్యక్షంగా ప్రజలతో మమేకమై, వారి భాగస్వామ్యంతో ,వారి మధ్యన సాగే సజీవ సాంస్కృతిక ఉద్యమ కార్యకలాపాలు భావ విప్లవంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయన్న అంశాన్ని గుర్తుంచుకోవాలి.

పౌర సమాజంలో భావజాల ఆధిపత్యం కింది నుండి జరిగే ప్రక్రియగా గ్రాంసీ

ప్రకటించారు. అట్టడుగునవున్న ప్రజా సమూహాలను ఉత్తేజపరిస్తే వారు తమ నాయకుల్ని తామే సృష్టించుకుంటారు. అంతేకానీ కొద్దిమంది నాయకుల కలయిక తో పౌర సమాజంలో భావజాల ఆధిపత్యం సిద్ధించదు.

ముందుగా వ్యవస్థను మార్చే ప్రయత్నం చేసేవారు మార్క్సిజం, అంబేద్కరిజం, జ్యోతీబా ఫూలే రచనలతోపాటు గ్రాంసీని ప్రత్యేకంగా అధ్యయనం చెయ్యాలి. అలాగే మన రాష్ట్రంలో పౌర సమాజంలో ప్రజా హెజమనీ కోసం జరిగిన ప్రయత్నాలను అధ్యయనం చెయ్యాలి. ఒకనాడు కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంఘాలను నిర్మించిన తీరును అర్థం చేసుకోవాలి. వారు ప్రజా సంఘాలను ఆయా వర్గాల ఐక్య వేదికలుగా నిర్వహించిన పద్ధతులు తెలుసుకోవాలి. నాయకత్వంలో కమ్యూనిస్టులు కాని వారికి తగిన స్థానం కల్పించి అందరి సంస్థగా ప్రజా సంఘాల ను నిర్వహించిన అనుభవాలను గ్రహించాలి. అననుకూల రాజకీయ పరిస్థితులలో ప్రజా సంఘాలు బహుముఖ ఉద్యమాలను సాగించడానికి అవకాశమున్న ప్రతి అంశాన్ని వినియోగించుకున్న తీరును పసిగట్టాలి. దళిత మహాసభ సమాజంలోని మరో ముఖ్యమైన కుల వివక్ష సమస్యను ముందుకు తెచ్చింది. బహుజనుల రాజ్యాధికార సమస్యగా దానికి ప్రయత్నం చేశారు. ఇప్పుడు ఈ అనుభవాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ భావజాల ఆధిపత్యానికి ప్రస్తుత వ్యవస్థను ప్రతిఘటించే కార్యకలాపాలను రూపొందించుకోవాలి.

వ్యవస్థను మార్చాలని భావించే వారు ఎవరైనా పౌర సమాజం మీద భావ జాల ఆధిపత్యం సంపాదించడం తప్పనిసరి. అంటే ప్రజా సమూహాల ఇష్ట పూర్వక సమ్మతి పొందడం తప్పనిసరి. పైపై కూడికలు తీసివేతలతో, సంఘటనలతో వ్యవస్థలు మారవు. దీనిని కార్యరూపంలోకి పెట్టడానికి మనం గతం నుండి అనుభవాలను నేర్చుకోవాలి. రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి. ప్రస్తుత వికృత రూపంలో సాగుతున్న రాజకీయాల్ని మార్చడానికి సన్నద్ధులు కావాలి. ఈ బృహత్తర ప్రయత్నానికి ప్రస్తుతం వ్యవస్థను మార్చాలని కోరుకునే వారిలో ఎవరో ఒకరు గంట కట్టాలి. అలా జరగకపోతే పరిస్థితుల ప్రోద్బలంతో అలాంటి కొత్త శక్తులు అంకురిస్తాయి. చరిత్ర ఎల్లకాలం ఒకేచోట స్థిరంగా నిలిచిపోదు. అది ముందుకు సాగుతుంది. ప్రజలే చరిత్ర నిర్మాతలు – ప్రజలను దానికి సన్నద్ధం చెయ్యడమే అందరికీ కర్తవ్యం కావాలి.


వ్యవస్థను మార్చే
ప్రజా ఉద్యమాలు
కొత్త చూపు - కొత్త దారి
డివివియస్ వర్మ

## పుస్తకాలు

# వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలు
# కొత్త చూపు - కొత్త దారి

తొలి ముద్రణ : ఏప్రిల్ 2018

కాపీలు : 1000

వెల : రూ.25/-

ముద్రణ : అరుణోదయ ప్రింట్ ప్యాక్ ప్రైవేటు లిమిటెడ్ హైదరాబాద్,

---

## విషయ సూచిక

1. వ్యవస్థను మార్చే ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలి .................... 151
2. మార్క్స్ రచనల నేపథ్యంలో.. .......................................... 154
3. ప్రజల ఆకాంక్షలు భౌతిక శక్తిగా మారే క్రమం ...................... 157
4. పెట్టుబడిదారీ వ్యవస్థను మార్చే ఉద్యమాలకు కొత్త చూపు ......... 163
5. కొన్ని వాదనలు – కొన్ని వివాదాలు ................................. 170
6. ప్రజా ఉద్యమాలు – కొన్ని పరిశీలనాంశాలు ....................... 172

# వ్యవస్థను మార్చే ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలి

ప్రపంచంలో పెనుమార్పులు జరుగుతున్నాయి. ఇరవై ఏళ్ల కిందట పెట్టుబడిదారీ వ్యవస్థకు ఇక తిరుగులేదన్నారు. ప్రపంచం అంతా దాని ఏక ధృవం మీదే నడుస్తుందన్నారు. దానికి మించిన శ్రేయోరాజ్యం మరొకటి వుండబోదన్నారు. సంపద ఎంత హెచ్చుగా పెరిగితే అంతగా అది అందరి జేబుల్లోకి వెదజల్లబడు తుందన్నారు. అంతరాలు క్రమేపీ అంతరించి పోతాయన్నారు. పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రవేత్తలు అందరూ దాదాపు ఇదేమాటను పదే పదే చెప్పారు. ఎవరైనా వామపక్ష ఆర్థికవేత్తలు మార్క్స్ మాట ఎత్తితే వారి మీద మండిపడ్డారు. మార్క్స్ తోపాటే ఆయన సిద్ధాంతం సమాధి అయిపోయిందని హేళన చేశారు.

2008 నుంచి ఒక దేశం తర్వాత మరో దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాల దారిపట్టాయి. ఈ సంక్షోభానికి మొదలే కాని.. అంతం కనిపించడం లేదు. గతంలో వ్యవస్థను కాపాడడానికి వాడిన అస్త్రాలన్నీ ఇప్పుడు పనికిరానివి అయ్యాయి. వారిదగ్గర కొత్త చిట్కాలు ఏమీ మిగలలేదు.

పెరిగిన సంపద వెదజల్లబడుతుందనుకుంటే దానికి విరుద్ధంగా ఒక శాతం మంది దగ్గర 80 శాతం ప్రపంచసంపద గుట్టగా పోగుపడింది. ఉపాధిరహితమైన అభివృద్ధి కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా వున్న ఉద్యోగాలను ఊడగొడుతున్నది. సంపద సంపన్నులకీ అప్పులు ప్రజలకీ మిగులుతున్నాయి. వివిధ దేశాల ప్రభుత్వాలు వ్యవస్థను కాపాడడానికి పొదుపు చర్యలు ప్రారంభించాయి. జీతాల పెంపుదలను నిలుపుదల చేస్తున్నాయి. సంక్షేమ కార్యక్రమాలకు భారీగా కోతలు పెడుతున్నాయి. ప్రజల జీవితాలను మరింత దుర్భరం చేస్తున్నాయి.

మరోపక్క ప్రజల దృష్టిని మళ్లించే నినాదాలు వస్తున్నాయి. మత జాతీయవాదం, రంగు జాతీయవాదం, యుద్ధసన్నాహాలు వంటి నినాదాలను ముందుకు తెస్తున్నాయి. ప్రజలను, ప్రజాస్వామిక హక్కులను అణిచివేసే నిరంకుశ ధోరణులను అవలంభిస్తున్నాయి. ఇది ప్రస్తుత ప్రపంచానికి ఒకవైపు కనిపిస్తున్న చిత్రం మాత్రమే.

మరొకవైపు నిన్నటి వరకూ ఈ వ్యవస్థ సమర్ధకులుగా వున్న ఆర్థికవేత్తలలో చాలా మంది పునరాలోచనలు చేస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాలను అర్థం చేసుకోవాలంటే కారల్ మార్క్సును మళ్ళీ మళ్ళీ చదవాలని ప్రకటిస్తున్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్గత వైరుధ్యాలు, దాని పర్యవసానాలపై మార్క్స్ చేసిన విశ్లేషణలు ఎంతో హేతుబద్ధంగా వున్నాయంటున్నారు. రోగానికి తగ్గమందు వెయ్యాలని సూచిస్తున్నారు. అందువల్లనే ఇప్పుడు మార్క్స్ రచనలు ప్రపంచ మార్కెట్లలో వెల్లువెత్తుతున్నాయి. వేలాది యూనివర్శిటీలలో, కాలేజీలలో మార్క్స్ రచనలు పాఠ్యాంశాలుగా దర్శనం ఇస్తున్నాయి. మరణించాడని ప్రకటించిన మార్క్స్ ఇప్పుడు సజీవంగా ప్రపంచం అంతటా సంచరించడం కనిపిస్తున్నది.

ఈ చర్చలలో కొత్త అంశాలు కొత్త నినాదాలు ముందుకొస్తున్నాయి. ఒక శాతం దగ్గర పోగుపడ్డ సంపదను బద్దలుకొట్టాలంటున్నారు. ఆదాయపు పన్ను, సంపద పన్ను వృద్ధిక్రమానుగతంగా హెచ్చుగా విధించాలంటున్నారు. వారసత్వంగా సంపదను దోచిపెట్టడాన్ని కట్టడి చెయ్యాలంటున్నారు. దేశాల సహజ వనరుల ఆదాయం ప్రైవేటు వ్యక్తుల పరం కాకూడదంటున్నారు. అది ప్రజల ఉమ్మడి ఆస్తి. దాని ఆదాయం అందరికీ దక్కాలంటున్నారు. మొత్తం మీద దోపిడీ వ్యవస్థ నడ్డి విరగగొట్టే ప్రతిపాదనలు చాలా మంది ఆర్థికవేత్తలు చేస్తున్నారు. పోగుపడ్డ సంపదలో వాటాను పునఃపంపిణీ చేసే మార్గాలను సూచిస్తున్నారు. అందరికీ మౌలిక ఆదాయం హక్కుగా పంపిణీ జరగాలంటున్నారు. ఒకచోట కొట్టి మరోచోట పెట్టకుండా ఆర్థిక అంతరాలు తొలగవని వక్కాణిస్తున్నారు.

అనేక దేశాల ప్రజలు ఈ నినాదాలను అందుకుంటున్నారు. పెట్టుబడిదారీ దోపిడీని బహిరంగంగా సవాలు చేస్తున్నారు. భారీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఇది ఈనాటి ప్రపంచంలో కనిపిస్తున్న మరొకచిత్రం.

ఒకటి వ్యవస్థలోపల ప్రజలపై భారాలు మోపి దానిని కాపాడాలని పాలకపక్షాలు చేస్తున్న ప్రయత్నం కాగా మరొకటి వ్యవస్థను బద్దలుకొట్టి సంపద పంపిణీకి ప్రజలు చేస్తున్న ప్రయత్నం. ఈ పూర్వరంగంలో భారతదేశంలో జరుగుతున్న పరిణామాలను చూద్దాం.

మనదేశంలో అంతరాల స్థితి మరింత దారుణంగా వుంది. గత సంవత్సరం దేశంలో ఒక శాతం మంది 73 శాతం ఆదాయాన్ని సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో అత్యంత గరిష్టంగా సంపద దోపిడీ మనదేశంలో జరిగింది. ఒక్క సంవత్సరంలో ఈ ఒక్క శాతం మంది దగ్గరకు చేరిన మొత్తం 21 లక్షల కోట్లుగా వెల్లడైంది.

అందరికీ మంచి రోజులు తెస్తానన్న మోదీ ప్రభుత్వం వరుసగా ప్రతీ బడ్జెట్‌లోను

కార్పొరేట్లకు ఆదాయపు పన్ను తగ్గిస్తూ వచ్చింది. సంపద పన్నును పూర్తిగా ఎత్తివేసింది. వారసత్వానికి బదిలీ చేసే సంపద మీద ఆంక్షలు లేవు. అంతకుమించి కార్పొరేట్లు ఎగవేసిన బ్యాంకు బాకీలను ఏటా లక్షల కోట్లు రద్దు చేస్తున్నది. ప్రజలందరికీ చెందిన సహజ సంపదలను ప్రైవేటు వ్యక్తుల లాభాలకు అప్పజెప్పింది. ఉపాధి రహిత పారిశ్రామికాభివృద్ధికి రాయితీలు, ప్రోత్సాహకాలను కొనసాగిస్తున్నది. ఇది నిరుద్యోగాన్ని తగ్గించకపోగా వున్న ఉద్యోగాలను ఊడగొడుతున్నది. దాదాపు అన్ని రాష్ట్రాలు ఇదే బాటలో నడుస్తున్నాయి.

మరోపక్క కార్మికుల హక్కులను హరించే చట్టాలకు సన్నాహాలు చేస్తున్నది. ప్రజలపై విపరీతమైన పరోక్షపన్నుల భారాన్ని పెట్టింది. కేవలం పెట్రోలు, డీజిల్ నుండి ఏటా ప్రజల మీద రెండున్నర లక్షల కోట్లు కొల్లగొడుతున్నది. అన్ని ప్రజాస్వామిక సంస్థలను నిర్వీర్యం చేసుకుంటూ పోతున్నది. ప్రమాదకరమైన మత జాతీయవాద రాజకీయాలను వివిధ పరివార్ సంఘాల ద్వారా మైనారిటీలు, దళితులకు వ్యతిరేకంగా నిరంతర దాడులకు వినియోగిస్తున్నది.

దేశంలో, రాష్ట్రంలో ఓట్ల రాజకీయం ప్రధాన కార్యకలాపం అయింది. పాలక వర్గాల రాజకీయ పక్షాలు అధికారం కోసం నిరంతరం కుల, మత సంఘర్షణ రాజకీయాలను సాగిస్తున్నారు. ఓటు బ్యాంకుల కోసం జనాకర్షణ పథకాలపై ఒకరినిమించి మరొకరు పోటీ పడుతున్నారు. డబ్బుతో ప్రజా సమీకరణలు సాగిస్తున్నారు. అధికారం వస్తే అన్నింటా అవినీతిని వ్యవస్థాగతం చేసి దోచుకుంటున్నారు. ప్రజలు నిరంతర లబ్ధిదారులుగా ప్రభుత్వ పథకాల మీద ఆధారపడే యాచకులుగా మిగిలిపోతున్నారు.

ఇక మిగిలిన పక్షాలు ప్రభుత్వ పథకాల అమలు చుట్టూ, లబ్ధిదారుల ప్రయోజనాల చుట్టూ, పత్రికలలో వచ్చే వార్తల చుట్టూ ఏదో ఒక ఆందోళన, నిరసన కార్యక్రమాలు సాగిస్తున్నారు. పైగా ఇందులో అత్యధికం కార్యకర్తల ఉద్యమాలుగానే వుండిపోతున్నాయి.

మొత్తం మీద వ్యవస్థ మీద దాడి చేసే పోరాటాలు మాత్రం జరగడం లేదు. ప్రపంచ నేపథ్యం వ్యవస్థను మార్చే ఉద్యమాలకు గొప్ప అవకాశాలను కల్పిస్తున్నది. వ్యవస్థను మార్చాలనుకునే వారంతా దీనిని అందిపుచ్చుకోవాలి. వ్యవస్థను మార్చే ప్రత్యేక ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలి. ఈ చిన్న పుస్తకం ఒక రాజకీయ ప్రత్యామ్నాయాన్ని రూపొందించడానికి ఉద్దేశించిది కాదు. వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలకు కొత్త చూపునీ, కొత్తదారినీ ఆవిష్కరించడానికి ఉద్దేశించబడింది.

ఇందులో ప్రజల ఉమ్మడి ఆకాంక్ష భౌతిక శక్తిగా మారే ప్రక్రియ అత్యంత కీలకమైంది. ఒక నినాదం భౌతికశక్తిగా మారితే అది ప్రజా ఉద్యమం అయి తీరుతుంది. అలాగే ఒక నినాదాన్ని భౌతికశక్తిగా మార్చే ప్రజా ఉద్యమ కార్యకలాపాలలో పరిగణనలోకి తీసుకోవలసిన ముఖ్యమైన అంశాల మీద కొన్ని వివరణలు వున్నాయి.

ప్రస్తుతం సాగుతున్న ప్రజా కార్యకలాపాల తీరు వ్యవస్థను మార్చేదిగా లేదు. ఆ పాత దారిలో ఎన్నాళ్లు, ఎన్నేళ్లు తిరిగినా వ్యవస్థ లోపల తిరగడమే తప్ప దానిని బద్దలు కొట్టదు. ఇప్పుడు కొత్త దారి తొక్కి తీరాలి. ఇక్కడ ప్రతిపాదించిన పద్ధతి కాదనుకుంటే మరో కొత్త ఆలోచన చెయ్యాలి. అలాంటి ఆలోచనలకు ఈ పుస్తకం ప్రేరణ ఇస్తుందన్న ఆశతో చేసిన ప్రయత్నంగా చూడండి.

# మార్క్స్ రచనల నేపథ్యంలో..

1848లో మార్క్స్-ఎంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళికను ప్రకటించారు. గత 170 సంవత్సరాలుగా పెట్టుబడిదారీ వ్యవస్థ మీద పోరాడేవారికి ఇది ప్రేరణగా నిలిచింది. రాబోయే కాలానికి అలాగే నిలుస్తుంది. ఎందుకంటే అది పెట్టుడిదారీ వ్యవస్థ అంతర్గత వైరుధ్యాలను ఆవిష్కరించింది. అది ప్రపంచాన్ని ఎలా కబళిస్తుందో స్పష్టం చెయ్యడంతోపాటు అంతిమంగా ఆ వ్యవస్థ పతనం కాక తప్పని వైరుధ్యాలను వివరించింది. ఆ నాటి పరిస్థితులలో కార్మికవర్గం అధికారం లోకి వస్తే పెట్టుబడిదారీ వ్యవస్థ మీద దాడి చెయ్యడానికి చేపట్టే పది అంశాల కార్యక్రమాన్ని వారు ప్రకటించారు.

- 1.భూముల మీద ఆస్తి హక్కు రద్దు చేసి, భూముల మీద వచ్చే కౌలు డబ్బు అంతా సామాజిక కార్యాలకు వినియోగించడం.
- 2.క్రమప్రవర్ధమానంగా వుండే భారమైన ఆదాయపు పన్ను.
- 3.వారసత్వపు హక్కులన్నీ రద్దు.
- 4.దేశాంతరగతుల ఆస్తి, తిరుగుబాటుదార్ల ఆస్తి ప్రభుత్వ స్వాధీనం చేసుకోవడం.
- 5.ప్రభుత్వ పెట్టుబడులతో జాతీయ బ్యాంకును ఏర్పాటు చేసి, పరపతి అంతా గుత్తాధికారంతో ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించడం.
- 6.వార్తా రవాణా సాధనాలు ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించడం.
- 7.ప్రభుత్వ ఫ్యాక్టరీలు, ఉత్పత్తి సాధనాలు విస్తరింపజేయడం. బంజరు భూములు సాగు చేయడం, ఒక సమష్టి పథకం ప్రకారం భూములను సారవంతం చేయడం.
- 8.పనిచేసే బాధ్యత అందరికీ సమానంగా వుండడం. కార్మిక సైన్యాలు ఏర్పాటు చేయడం. ముఖ్యంగా వ్యవసాయం కోసం.
- 9. వ్యవసాయాన్ని పరిశ్రమలనూ సమ్మేళనం చేయడం, జనసంఖ్య విషయంలో వివిధ ప్రాంతాల అసమానతలు తగ్గించడం ద్వారా పట్టణాలకూ పల్లెలకూ గల భేదం క్రమక్రమంగా రద్దు చేయడం.
- 10. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలందరికీ ఉచిత విద్య, ఇప్పుడు చేస్తున్నట్లు పిల్లలు ఫ్యాక్టరీలలో పనిచేయడం రద్దు, విద్యను పారిశ్రామిక ఉత్పత్తితో

మేళవించడం మొదలైనవన్నీ..

ఈ చర్యలు భిన్న దేశాలలో భిన్నంగా వుండడం సహజమేనని కమ్యూనిస్టు ప్రణాళికలో వారు సూచించారు. ఈ కార్యక్రమంలోని అంశాలను యధాతధంగా కాపీ కొట్టకూడదు. కాని, ఆయా దేశాల పరిస్థితులకు అన్వయించుకోడానికి ఉపకరిస్తాయి. 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అని మార్క్స్ చేసిన విశ్లేషణ అందరికీ తెలిసిందే. పెట్టుబడిదారీ వ్యవస్థ మీద పోరాడాలి. దానిని మార్చాలి. అంటే కొత్త చరిత్రను నిర్మించాలి. సిద్ధాంతపరంగా వ్యవస్థ మార్పును కోరే పార్టీలు, సంస్థలు దానికోసం పనిచేస్తాయి. అయితే వ్యవస్థను మార్చగల శక్తి, కొత్తల చరిత్రను నిర్మించగల శక్తి మాత్రం ప్రజల దగ్గర వుంది. ఇలా మార్పుకోరేవారు – మార్పు తేగల శక్తి గల వారికి మధ్య వున్నతేడాని మనం గుర్తించాలి. సిద్ధాంతపరంగా మార్పు కోరేవాళ్ల ఆకాంక్ష మేరకు మార్పు జరగదు. అది ప్రజల ఆకాంక్షల మేరకు జరుగుతుంది. అలాంటి ఆకాంక్షలకు రూపునిచ్చేపని పార్టీలదీ, సంస్థలదీ అవుతుంది.

'ఒక సిద్ధాంతం లేదా భావజాలం ప్రజల మనసులను ఆకట్టుకోగలిగినప్పుడు లేదా గెలుచుకోగలిగినప్పుడు అది భౌతికశక్తిగా మారుతుంద'ని మార్క్స్ ఒక అపురూపమైన విశ్లేషణ చేశారు. ఇది కూడా అందరికీ తెలిసిందే. ఒక సిద్ధాంతం, ఒక భావజాలం అజేయమైన భౌతికశక్తిగా మారే ప్రక్రియ మీద అధ్యయనం జరగకపోవడం, అవగాహన చేసుకుని ఆచరణలో పెట్టే ప్రయత్నాలు జరగకపోవడం వల్లనే ఈ వ్యవస్థపై జరిగే పోరాటాలు ఆశించిన రీతిలో పురోగమించడం లేదు.

కేవలం సిద్ధాంతాలు, క్లిష్టమైన భావజాలాలు ప్రజల మనసులను గెలుచుకోడానికి ఉత్తమమైన సాధనాలు కాజాలవు. ప్రజలు తమ దైనందిన సమస్యల మీద, జీవితాలలో మార్పు తెచ్చే అంశాల మీద ఆకాంక్షలు కలిగివుంటారు. ఈ ఉమ్మడి ఆకాంక్షలకు వ్యవస్థను మార్చే కొత్త నినాద రూపాలు ఇవ్వగలగాలి. దానికి సిద్ధాంత పునాది, భావజాల బలం అవసరం.

# ప్రజల ఆకాంక్షలు భౌతిక శక్తిగా మారే క్రమం

ప్రతి వ్యక్తికీ ఆకాంక్షలుంటాయి. ఏదో ఒక కొత్త ఆకాంక్ష కలగకపోతే ఆ వ్యక్తి జీవితం గానుగెద్దు అవుతుంది. ఒక సమూహానికి లేకపోతే అది చలన రహితం అవుతుంది. ఒక సమాజానికి లేకపోతే ఎదుగూ బొదుగూ లేనిదవుతుంది. ఆకాంక్షలే వ్యక్తులనూ, సమూహాలను, సమాజాలను కార్యాచరణ దిశగా నడిపిస్తాయి.

## 1. వ్యక్తిగత ఆకాంక్షలు

ఇవి తన జీవితావసరాల నుంచి, తన చుట్టూ వున్న సమాజం నుంచి పుట్టుకొస్తాయి. ఇంతకంటే మెరుగైన జీవితం పొందడానికి లేదా పిల్లలను ఉన్నత స్థితిలో నిలపడం వగైరా ఆకాంక్షలు ఏర్పడగానే అవి అతనిని కార్యాచరణకు నడిపిస్తాయి. దానిని సాధించే వరకూ పదపదమంటూ పరుగులు తీయిస్తాయి. ఇవన్నీ మనకు నిత్యం కనిపించే విషయాలే. ఒక ఆకాంక్ష తనకు అసాధ్యం అని తేలే వరకూ దానికోసం ప్రయత్నాలు సాగుతూనే వుంటాయి. తనవల్ల కాదని తేలినప్పుడు మాత్రమే దానిని వదులుకోవడం లేదా వాస్తవ పరిస్థితులకు తగినట్లుగా సవరించుకోవడం జరుగుతుంది. అది వ్యక్తి ఆకాంక్ష అయితే దానికి కర్త, కర్మ, క్రియ అతనే అవుతాడు. ఆకాంక్షకు గల ఇలాంటి నడిపించే శక్తి అనుభవంలో అందరికీ తెలిసిందే.

## 2. చిన్న సమూహాలు - ఉమ్మడి ఆకాంక్షలు

ఒకే పరిశ్రమలో పనిచేసే కార్మికులు వంటి చిన్న సమూహాలలో ఎవరి వ్యక్తిగత ఆకాంక్షలు వారికి వున్నా తమ జీవన స్థితిగతులు మార్చుకోడానికి ఒక ఉమ్మడి ఆకాంక్ష రూపుదిద్దుకుంటుంది. వారు ఒక సంఘంగా సంఘటితం కావడంలో వేతనాలు, ఇతర పని పరిస్థితులు మెరుగు కోసం డిమాండ్లు రూపొందించుకోవడంలో ఈ ఉమ్మడి ఆకాంక్ష వ్యక్తమవుతుంది.

ఇలాంటి చిన్న సమూహాలలో ఉమ్మడి ఆకాంక్ష ఆ సమూహం నుంచే పుట్టుకొచ్చే వ్యక్తుల ద్వారా లేదా బైట నుంచి సహాయపడే పార్టీలు, సంస్థల ద్వారా రూపుదిద్దుకుంటుంది. ఉమ్మడి ఆకాంక్ష రూపుదిద్దుకోడానికి సమూహం నుంచి లేదా బైట నుంచి నాయకత్వం అందించడం తప్పనిసరి అవుతుంది. ఈ ఉమ్మడి

ఆకాంక్ష ఒక భౌతికశక్తిగా తమ స్థితిగతుల్ని మార్చుకోడానికి తెగించి సమ్మెలు, ఆందోళనలు సాగించే క్రమం మనకు కనిపిస్తుంది.

## 3. ఒక సమాజంలో, దేశంలో ఉమ్మడి ఆకాంక్షలు

ఒక వ్యక్తి తన ఆకాంక్షను తానే రూపొందించుకునే వీలుంది. అది తన ప్రయోజనాల చుట్టూనే వుంటుంది. ఒక సమూహం తనకు అనుభవంలో వున్న స్థితిగతుల నుంచి ఉమ్మడి ఆకాంక్షను రూపొందించుకోవడంలో కొన్ని ఇబ్బందులున్నా తేలికగానే రూపొందించుకుంటుంది. ఒక రాష్ట్రంలో, ఒక దేశంలో వివిధ ప్రాంతాలు, భాషలు ఇతర అంతరాలు వున్న చోట ఒకే తరహాకు చెందిన సమూహాలు లేదా భిన్న తరగతుల సమూహాలు ఒక ఉమ్మడి ఆకాంక్షను రూపొందించుకోవడం క్లిష్టతరమైంది. అంతమాత్రం చేత అది అసాధ్యం మాత్రం కాదు. ఇంత భిన్నమైన, విస్తృతమైన సమూహాలు ఉమ్మడి ఆకాంక్షను తమంతట తాము రూపొందించుకోలేవు. ఈ పని పార్టీలు, వారికి ప్రాతినిధ్యం వహించే సంస్థలు చెయ్యాల్సిందే.

## 4. ఉమ్మడి ఆకాంక్షల ప్రత్యేకత

ఈ ఉమ్మడి ఆకాంక్ష ప్రజల మనసులను ఆకట్టుకుంటే అది భౌతికశక్తిగా మారడంతోపాటు ఎవరు దీనిని వినియోగించుకుంటే వారికి పరిచారిక అవుతుంది. వ్యవస్థను మార్చాలనుకున్న వారికి ఇది ఉపయోగపడుతుంది. అలాగే వ్యవస్థ లోపల ప్రజలను ప్రలోభపెట్టే వారికి, ఆధిపత్య పోరు కోసం వినియోగించుకునే వారికి, కుల, మత శక్తులకీ ఇది భౌతికశక్తిగా మారి విజయాలు తెచ్చిపెడుతుంది. అలాగే ప్రతి ఉమ్మడి ఆకాంక్ష విధిగా భౌతిక శక్తిగా మారదు. ప్రజల ఉమ్మడి ఆకాంక్ష అనేది దానంతటదే ప్రజల మనసులను గెల్చుకోలేదు. భౌతికశక్తిగా పరిణామం చెందదు. దీనికి జతపర్చి తీరాల్సిన ఇతర అంశాలు లేకపోతే అవి కేవలం నినాదాలుగానే మిగిలిపోతాయి. వాటిని ఇప్పుడు పరిశీలించుకుందాం.

## 5. భౌతికశక్తిగా మారే ప్రక్రియ

ఒక ఆకాంక్ష ప్రజలను ఆకట్టుకుని భౌతికశక్తిగా మారే క్రమాన్ని అర్థం చేసుకోడానికి మనకు తెలిసిన, మన చుట్టూ జరిగిన, జరుగుతున్న వాటిని

ఉదాహరణలు తీసుకుందాం. 'సర్వేజన సుఖినోభవంతు' అన్నది ఒక ఆకాంక్ష. ఒక నినాదం. 'సోషలిజమే అన్ని సమస్యలకు పరిష్కారం' అన్నది ఒక ఆకాంక్ష, ఒక నినాదం. ఇవి ఉత్తమమైన భావాలు.. ఆకాంక్షలే. కాని అవి ప్రజలను ఆకట్టుకుని భౌతికశక్తిగా మారిన దాఖలాలు లేవు.

మరో రెండు నినాదాలను లేదా ఆకాంక్షకు రూపమిచ్చిన నినాదాలను చూద్దాం. మొదటిది 'గరీబీ హఠావో' అన్నది ఒకనాడు ఇందిరాగాంధీ ఇచ్చిన నినాదం. 'మంచి రోజులు వస్తున్నాయి' అన్నది ఇటీవల మోదీ ఇచ్చిన నినాదం. ఈ రెండు నినాదాలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి. కొన్ని తరగతుల వారిని కదిలించాయి. ఆ సమూహాలు భౌతికశక్తిగా మారి వారికి విజయాలు సాధించిపెట్టాయి.

మొదట చెప్పిన రెండు నినాదాలు ప్రవచనాలుగానే మిగిలిపోగా ఈ రెండు నినాదాలు ప్రబలశక్తిగా మారడం కనిపిస్తుంది. ఈ ప్రక్రియలో మనం గుర్తించాల్సిన మూడు కీలక అంశాలు.

**ఒకటి :** ఒక ఆకాంక్ష, నినాదం ప్రజల నిత్య జీవనానికి సంబంధించినదై వుండాలి.

**రెండు :** ఈ ఆకాంక్ష, నినాదం ఆచరణలో సాధ్యమేనన్న నమ్మకం కలిగించే మరోచర్య జతపడాలి.

**మూడు :** అది తమ జీవితాలను ఎలా మెరుగు పరుస్తుందో లేదా మార్చివేస్తుందో స్పష్టపరిచే ఇంకొక చర్య జతపడాలి.

ఈ మూడింటినీ జతపర్చగలిగినప్పుడే కొత్త ఆకాంక్షలు, భావాలు, నినాదాలు ప్రజల మనసులను గెలుచుకుని భౌతికశక్తిగా మారినట్లు ఈ ఉదాహరణలు స్పష్టం చేస్తున్నాయి.

'గరీబీ హఠావో' అన్న నినాదాన్ని చూడండి. పేదరికం నుంచి బైటపడాలన్న ప్రజల ఆకాంక్షకు అది నినాద రూపం. అది సాధ్యమేనన్న నమ్మకం కలిగించింది బ్యాంకుల జాతీయకరణ. జీవితాలు మెరుగుపడతాయన్న స్పష్టతనిచ్చింది 20 సూత్రాల పథకం.

మంచిరోజులు రావాలన్నది ప్రజల ఆకాంక్షకు నినాదరూపం. విదేశాలలో వున్న లక్షల కోట్ల నల్లధనాన్ని 100 రోజుల్లో తెస్తానన్నది - అది సాధ్యమేనన్న నమ్మకాన్ని కలిగించేది. ప్రతి బ్యాంకు ఖాతాలోనూ 15-20 లక్షలు జమ చేస్తానన్నది తమ జీవితాలు మెరుగవుతాయన్న స్పష్టతను ఇచ్చిందిగా వుంది.

ఈ ఉదాహరణలు కేవలం ఒక భావం. ఒక ఆలోచన, ఒక ఆకాంక్ష నినాద రూపంలో ప్రజల్ని ఆకట్టుకుని భౌతికశక్తిగా మారే ప్రక్రియను అర్థం చేసుకోవడానికి ఉద్దేశించినవి మాత్రమే. నిజానికి ఈ రెండు నినాదాలు వ్యవస్థను మార్చే నినాదాలు కావు. బ్యాంకు డిపాజిట్లు ప్రజలవి. అవి ప్రైవేటు ఆధిపత్యం నుంచి ప్రభుత్వ ఆధిపత్యంలోకి వచ్చాయి.

అలాగే మోదీ తెస్తానన్న నల్లధనం పన్ను ఎగవేత నుంచి పోగైన సొమ్ము. దానిని వెనక్కి తెచ్చినంత మాత్రాన దోపిడీ వ్యవస్థ మారదు. పేదలు లబ్ధిదారులుగా, కొన్ని ఉపశమన చర్యల లబ్ధి పొందేవారు గానే మిగిలిపోతారు. ఈ ఉదాహరణలు వ్యవస్థను మార్చేవి కాకపోవడమే కాదు తాత్కాలికమైనవి. ఒక ఎన్నిక తర్వాత మరో ఎన్నికకు ఉపయోగపడేవి కూడా కావు. ఒకరి తర్వాత మరొకరు ప్రజల్ని వంచించడానికి వాడుకున్న నినాదాలు. ఈ ఆకాంక్షల నినాదాలు ప్రజల మనసుల్ని ఆకట్టుకుని భౌతికశక్తిగా మారి, విజయాలను చేకూర్చిన ప్రక్రియ మాత్రమే మనకు ముఖ్యం.

## 6. దీర్ఘకాలిక ఉద్యమాలు - ఆకాంక్షలు

ప్రజల ఆకాంక్షలు భౌతిక శక్తిగా మారే ప్రక్రియ కేవలం ఎన్నికల కోసం తాత్కాలిక విజయాల కోసమే పనిచేస్తుందా? దీర్ఘకాలిక ఉద్యమాలకు అలాంటి శక్తిని ఇవ్వగలుగుతుందా? అన్న సందేహం కలగడం సహజం.

జన జీవనానికి సంబంధించిన ఆకాంక్షను రూపొందించి దానికి ప్రజలను ఆకట్టుకునే విధంగా పైన చెప్పిన మూడు అంశాలను జతపర్చగలిగితే దీర్ఘకాలిక ఉద్యమానికి ఒక ఆకాంక్ష భౌతికశక్తిగా వినియోగపడుతుంది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మన కళ్ల ముందే జరిగింది. 'మన ఉద్యోగాలు మనకి, మన నీళ్లు మనకి, మన సంపద ఆదాయం మనకి' అన్న ఆకాంక్షల చుట్టూ ఈ ఉద్యమం సాగింది. ఇవి ప్రత్యేక తెలంగాణ ద్వారా సాధ్యం అన్న నినాదానికి జతపర్చబడింది. స్వతంత్రం వచ్చిన తర్వాత ఆయా ప్రాంతాల ప్రజల ఆకాంక్షల మేరకు కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఈ రాష్ట్ర సాధన సాధ్యమేనన్న భావన కలిగించబడింది. తమ జీవితాలు ఎలా మారతాయో స్పష్టం చేసే ప్రకటనలు ఉద్యమ నేపథ్యంలో స్పష్టం చేయబడ్డాయి.

ఈ మూడు జత కూడడంతో ఆ ఆకాంక్ష, ఆ నినాదం, భౌతిక శక్తిగా మారింది.

అయితే ప్రత్యేక రాష్ట్రం ఎప్పుడు వస్తుందో తెలియదు. ఈ మధ్యలో జరిగిన ఎన్నికలలో గెలుపులు, ఓటములు వున్నాయి. అయినా ఆ ఉద్యమంలో ఈ ఆకాంక్ష ఒక భౌతిక శక్తిగా కొనసాగింది. అంతిమంగా ప్రజల మనసులను గెలుచుకున్న ఈ ఆకాంక్షే ప్రత్యేక రాష్ట్రం పొందడానికి సాధనం అయింది.

అలాగే ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కూడా దీర్ఘకాలంగా సాగుతూ వుండడం ఒక ఆకాంక్ష భౌతికశక్తిగా మారడం ద్వారానే సాధ్యపడింది. వీటిని ప్రాంతీయతత్వం, కుల విభజనల ఉద్యమాలుగా కొట్టిపారెయ్యడం కంటే అవి దీర్ఘకాలిక ఉద్యమాలుగా సాగడంలో భౌతికశక్తిగా మారిన ఆకాంక్షల పాత్రను అర్థం చేసుకోవడం అవసరం. ఈ ఉద్యమాలు వ్యవస్థను మార్చేవి కావు. లబ్ధిదారులకు మెరుగైన జీవనాన్ని ఇస్తాయని నమ్మకం కలిగించినవి మాత్రమే.

## 7. వ్యవస్థను మార్చే ఉద్యమాలు - ప్రజల ఆకాంక్షలు

ప్రజల ఆకాంక్షలు ఒక భౌతిక శక్తిగా మారే ఈ ప్రక్రియ ఒక సామాజిక ఆర్థిక వ్యవస్థను మార్చడానికి సాధనం అవుతుంది. మనకు తెలిసిన ఒక ఉదాహరణ తీసుకుందాం. 1950కి పూర్వం ఆంధ్ర రాష్ట్రంలో జమిందారీ వ్యతిరేక పోరాటం సాగింది. దున్నేవాడు రైతు, అనుభవించేది జమీందారుగా వున్న వ్యవస్థ అది. ఇక్కడ రైతుల ఆకాంక్షలకు రెండు రకాల నినాదాలు ఇవ్వడానికి వీలుంది.

దున్నే రైతులకు మరికొంత ప్రయోజనం కల్పించే ఆకాంక్షకు 'దున్నే వాడికి పంటలో పెద్ద వాటా' అన్నది నినాదం చెయ్యవచ్చు. దానివల్ల రైతులకు కొంత లబ్ధి చేకూర్చవచ్చును. కాని కమ్యూనిస్టు పార్టీ 'దున్నేవాడిదే భూమి' అన్న నినాదాన్ని ఇచ్చింది. ఇదీ రైతుల జీవనస్థితి నుండి వచ్చిందే. కాని అది వారి జీవితాలను మార్చివేసే ఆకాంక్షకు ఇచ్చిన నినాదం. రైతులను లబ్ధిదారుల నుండి హక్కుదారులుగా మార్చే నినాదం.

ఈ నినాదంతో ఒక వైపు రైతులకు భూమి దక్కుతుంది. మరోవైపు జమిందారీ వ్యవస్థ కూలిపోతుంది. ఈ నినాదం రైతుల మనసులను గెల్చుకుంది–తెగించి పోరాడే భౌతిక శక్తిగా మార్చింది. అంతిమంగా జమిందారీ వ్యవస్థ రద్దును సాధించింది. మొత్తం మీద ప్రజల జీవితాల నుంచి రూపుదిద్దుకున్న ఆకాంక్షలు, వారి మనసులను గెలుచుకున్న నినాదాలు భౌతిక శక్తిగా మారే ప్రక్రియను ప్రస్తుత వ్యవస్థ పరిధిలోనే ఆధిపత్య పోరుకీ, ఎన్నికల విజయాలకీ వాడుకునే వీలుంది.

అలాగే ఈ వ్యవస్థను మార్చాలనుకునే వారికీ సాధనంగా మారి విజయాలను సాధించి పెడుతుంది.

## పోరాడిన వారికే విజయాలు

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో, జమిందారీ వ్యతిరేక పోరాటంలో మరో ఆసక్తికరమైన విషయం కూడా వుంది. రాష్ట్రం ఇచ్చింది మేమే గనుక తమనే గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసినా దాని కోసం పోరాడిన తె.రా.స కే ప్రజలు పట్టం గట్టారు. 1950లో జమిందారీ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వమే రద్దు చేసినా దాని కోసం పోరాడిన కమ్యూనిస్టులకే 1952 ఎన్నికలలో అత్యధిక స్థానాలను గెలిపించడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది.

# పెట్టుబడిదారీ వ్యవస్థను మార్చే ఉద్యమాలకు కొత్త చూపు

మనదేశంలో వున్న పెట్టుబడిదారీ వ్యవస్థపై అనేక విశ్లేషణలు వచ్చాయి. నిరంతరం వస్తూనే వున్నాయి. అందులో మనకి కొరత అంతగా కనిపించదు. అయితే ఈ వ్యవస్థ మీద పోరాడడం ఎలా? దానిని మార్చడం ఎలా ? అన్నది అసలు సమస్య. దీనికి అవసరమైన కొన్ని కీలక అంశాలకే మనం పరిమితం అవుదాం.

- దేశంలో అన్ని రంగాలను దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలు ఆక్రమించుకున్నాయి. గత సంవత్సరం పెరిగిన దేశ సంపదలో 73 శాతాన్ని కేవలం ఒక శాతం మంది దక్కించుకున్నారు. సంపద కేంద్రీకరణ ఎంత జోరుగా సాగుతున్నదో ఇది అద్దంలో చూపిస్తుంది. సంపద అంతరాలలో, ఆదాయ వ్యత్యాసాలలో అత్యంత హెచ్చుగా వున్న దేశాలలో మనది కూడా ముందున్నది.
- ఈ కార్పొరేట్ శక్తులు ఉపాధిరహిత అభివృద్ధి నమూనాను ఎంచుకున్నాయి. వచ్చే ఉద్యోగాలకంటే పోయే ఉద్యోగాలు హెచ్చుకావడం చూస్తున్నాం.
- కార్పొరేట్ శక్తులు వ్యవసాయ రంగంలో యంత్రాలు, పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు తయారీని తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. వాణిజ్య పంటల వ్యాపారం వారి పరమైంది. ఇప్పుడు ఆహార పంటల వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నారు. వ్యవసాయం లాభసాటి కాకుండా ఈ శక్తులే దోచుకుంటున్నాయి.
- విద్య కార్పొరేట్ శక్తుల వ్యాపార రంగం అయింది.
- వైద్య సేవలు కూడా అదే దారి పట్టాయి.
- ఎన్నికలను కుబేరుల ఆటగా మార్చారు. కార్పొరేట్ శక్తులు వాటిని తమ ప్రత్యక్ష, పరోక్ష పాత్రల చుట్టూ తిప్పుకున్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థపై పోరాటం ముందుగా కార్పొరేట్ వ్యవస్థను బద్దలు కొట్టడంతో ప్రారంభం కావాలి. ఈ వ్యవస్థ బద్దలైతేనే సంపద పునఃపంపిణీతో సామాజిక న్యాయానికి ద్వారాలు తెరుచుకుంటాయి. ఉపాధినిచ్చే కొత్త పారిశ్రామిక విధానానికి వీలు పడుతుంది. కార్పొరేట్ శక్తుల నుంచి వ్యవసాయ మార్కెట్లను వేరు చేసి రైతులే ధరలు నిర్ణయించుకోగల కొత్త వ్యవస్థకు దారి ఏర్పడుతుంది.

కార్పొరేట్ విద్య, వైద్య సంస్థల జాతీయంతో అందరికీ సమానమైన, మంచి ప్రమాణాల విద్య, వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చే పరిస్థితి వస్తుంది.

అందుచేత కార్పొరేట్ వ్యవస్థను బద్దలు కొట్టడం ఈ పోరాటానికి ముఖ్యమైన లక్ష్యం అవుతుంది. అయితే ఈ వ్యవస్థ వల్ల పేదరికానికి, నిరుద్యోగానికి లాభసాటి గాని వ్యవసాయానికి గురవుతున్నవారు వివిధ వర్గాలకు, వివిధ సమూహాలకు చెందిన వారు.

ఏ సమూహం ఆకాంక్షలు దానికి వుంటాయి. అందువల్ల భిన్నమైన ఆకాంక్షలను ఒక లక్ష్యం మీద దాడికి సన్నద్ధం చెయ్యడం దాని ఫలితంగా వచ్చే ప్రయోజనాలు ఆయా సమూహాల జీవితాలను ఎలా మారుస్తాయో, వారికి గల భిన్నమైన ఆకాంక్ష లను ఎలా నెరవేరుస్తాయో స్పష్టం చేసే కార్యక్రమాలను రూపొందించడం జరగాలి. ఇది కొంత సంక్లిష్టమైనదే అయినా ఒకే లక్ష్యంలో వివిధ సమూహాలను ఒకే గొడుగు కిందకు తెచ్చినప్పుడే విజయాలు సాధ్యం అవుతాయి. ఒక ఆకాంక్ష ప్రజల ను ఆకట్టుకుని భౌతికశక్తిగా విజయాలు సాధించే సాధనంగా మారే ప్రక్రియను ఇంతకు ముందే చూశాం. ఇందులో జత కూడాల్సిన మూడు అంశాలున్నాయి.

**మొదటిది** ఆకాంక్ష ప్రజల జీవిత స్థితిగతుల నుండి రావాలి.

**రెండవది** అది సాధ్యమేనన్న నమ్మకం కలిగించే ఒక చర్య దానికి జత కలవాలి.

**మూడవది** అది జరిగితే వారి జీవితాలు ఎలా మారతాయో స్పష్టం చేసే కార్యక్రమం వుండాలి. ఈ ప్రక్రియను పెట్టుబడిదారీ వ్యవస్థపై జరిగే పోరాటానికి ఎలా అన్వయించుకోవచ్చునో కొన్ని ఉదాహరణలు చూద్దాం.

## ఎ) పేదల ఉమ్మడి ఆకాంక్షలు - నినాదాలు

సామాజిక న్యాయం అవసరం అయిన పేదలు, సామాన్యుల సమూహాలను తీసుకుందాం. ఇందులో కొన్ని చిన్న చిన్న అంతరాలుంటాయి. కుల మత తేడాలు ఉంటాయి.

**మొదటిది :** ఈ బృందాన్ని ఆవరించిన ఉమ్మడి అంశం 'పేదరికం, ఆదాయ భద్రత' దాని నుంచి బయటపడాలన్న ఆకాంక్ష వుండడం సహజం.

'పేదరికాన్ని జయిద్దాం' అన్నది వారి ఆకాంక్షలను ప్రతిబింబించే నినాదం కావడానికి వీలుంది. ఇది ఉమ్మడి ఆకాంక్ష. ఇతర భేదాలు ఎన్ని వున్నా ఈ సమూహాలన్నింటిని ఏకం చెయ్యగల ఆకాంక్ష అవుతుంది.

**రెండవది :** ఈ ఆకాంక్ష నెరవేరడం సాధ్యమేనన్న నమ్మకం కలిగించే మరో చర్య దీనికి జత చెయ్యాలి. ఈ నినాదం కార్పొరేట్ శక్తుల దగ్గర కేంద్రీకరణ జరిగిన, జరుగుతున్న సంపద మీద దాడి చేసే రూపంలో వుండాలి.

- ప్రతి ఏటా ఒక శాతం మంది జాతీయ ఆదాయంలో 73 శాతాన్ని కొల్లగొడుతున్న దానిపై కేంద్రీకరించాలి.
- బోనస్ చట్టంలాగ ఈ కార్పొరేట్ శక్తుల ఆదాయంలో ఒక వాటాను పోగైన సంపద మీద పన్నులు, తమ సంపదను అంతా వారసులకే కట్టబెట్టకుండా వారసత్వ పరిమితిని విధించే విధంగా సంపద పునఃపంపిణీ చట్టాన్ని నినాదంగా చెయ్యాలి.
- ఈ నినాదం పోగుపడ్డ సంపదను బద్దలు కొట్టే సాధనం అవుతుంది. దేశ ప్రజలకు సంపద పునఃపంపిణీ ద్వారా వాటాను పొందే హక్కును కలిగిస్తుంది. లక్షల కోట్లు పునఃపంపిణీ చెయ్యడానికి మార్గం సుగమం చేస్తుంది. ఆదాయ భద్రత కల్పించాలన్న నినాదానికి నమ్మకం కలిగించే చర్య అవుతుంది.

**మూడవది :** సంపద పునఃపంపిణీ ఎలా జరుగుతుందో, ప్రజల జీవితాలు ఎలా మారతాయో స్పష్టం చేసే కార్యక్రమం పై రెండింటికి జతపరచాలి.

- హక్కుగా ప్రతి ఒకరికీ మౌలిక ఆదాయం.
- హక్కుగా గృహ వసతి అంతవరకూ ఇంటి అద్దె.
- హక్కుగా అర్హతలను బట్టి ఏ చదువైనా పిల్లలకు ఉచితం.
- హక్కుగా అందరికీ అన్ని వైద్య సేవలు ఉచితం.
- హక్కులు అమలు చేయడానికి ప్రత్యేక కోర్టు

ఈ తరహా కార్యక్రమం పేద ప్రజలను లబ్ధిదారుల నుంచి హక్కుదారులుగా మారుస్తుంది. ఈ హక్కులకు భంగం జరిగితే అమలు చేయించుకోడానికి వీలుగా ప్రత్యేక కోర్టుల ఏర్పాటును ప్రకటించాలి.

ఈ ఉదాహరణ ఒక  ఆకాంక్షను భౌతిక శక్తిగా మార్చడానికి అనుసరించాల్సిన ప్రక్రియకు ఒక రేఖా మాత్రమైన చిత్రం మాత్రమే. ఇలాంటి మరికొన్ని ఉదాహరణలను రూపొందించుకుందాం.

## బి) రైతుల ఆకాంక్షలు - పంటలకు ధర నిర్ణయించుకునే హక్కు

రైతులలో ఎన్ని అంతరాలున్నా వారికి ఒక ఉమ్మడి సమస్య వుంది. వారి పంటల

కు లాభసాటి ధరలు రావడం లేదు. అయినకాడికి అమ్ముకోవడం, అప్పుల భారం తప్పడం లేదు. పంటలకు లాభసాటి ధరలు రావాలన్నది రైతుల ఉమ్మడి ఆకాంక్ష.

## వ్యవస్థ లోపల ప్రయత్నాలు

వ్యవస్థ లోపల లాభసాటి ధర కోసం ప్రభుత్వ మద్దతు ధర అన్నది నినాదం అయింది. ప్రతి ఏటా ప్రభుత్వాలు మద్దతు ధరలను ప్రకటిస్తున్నాయి. దానిని పెంచాలన్న రైతుల ఆవేదన అరణ్యరోదనం అవుతున్నది. ఆ ధరలకు కూడా మొత్తం పంటను కొనుగోలు చేసే స్థితి లేదు. దీంతో వ్యవసాయం, పంటల మార్కెట్లు దళారుల చేతుల్లో, అంతిమంగా కార్పొరేట్ల కబంధహస్తాలలో చిక్కుకుంటున్నది. పంట కాలంలో ధరలను పడగొట్టడం, మూడు, నాలుగు నెలల కాలంలో ధరలు పెంచి విపరీతమైన లాభాలు గుంజుకుంటున్నారు.

రైతు సంఘాలు, పార్టీలు, సంస్థలు ప్రతి సంవత్సరం ఆందోళనలు ధర్నాలు నిర్వహిస్తున్నాయి. అవే నినాదాలు, అదే తరహా పోరాటాలు అరకొర పెంపుదలలూ, చిల్లర రుణమాఫీలు తప్ప లాభసాటి ధర మాత్రం దక్కడం లేదు. ప్రస్తుత వ్యవస్థ పరిధిలో తిరిగినంత కాలం తాత్కాలిక ఉపశమనాలతో సరిపెట్టుకోవడం తప్ప లాభసాటి ధర వచ్చే అవకాశాలు వుండవు.

## కొత్త వ్యవస్థ తప్ప మార్గం లేదు

పండించేది రైతులు – ధర నిర్ణయించేది దళారులు, కార్పొరేట్లు అన్న వ్యవస్థను బద్దలుకొట్టాలి. వ్యవసాయ పంటల మార్కెట్లను దళారుల, కార్పొరేట్ శక్తుల చేతుల నుంచి వేరు చెయ్యాలి. పండించే వారికే ధర నిర్ణయించుకునే హక్కు సాధించాలి. విడివిడిగా రైతులు ఈ పని చెయ్యలేరు. కాని పంటల వారీగా ఏర్పడే సహకార సంఘాల ద్వారా దీనిని సాధించుకోవచ్చు.

ఉదాహరణకు పాల సహకార సంఘాలను చూడండి. పాలు అమ్మే రైతులంతా అందులో సభ్యులుగా వుంటారు. పాల కొనుగోలు ధరను, తిరిగి అమ్మకం ధరను ఈ రైతు సంఘాలే నిర్ణయించుకుంటాయి. ఎవరు ఎన్ని పాలు పోసినా ప్రకటించిన ధరకు కొనుగోలు చేస్తారు. తిరిగి పాలను ఉప ఉత్పత్తులనూ వినియోగదారులకు అమ్మకం చేస్తారు. లాభాలు వస్తే పోసిన పాలను బట్టి రైతులకు డివిడెండ్లు ఇస్తారు. ఈ పద్ధతి వ్యవసాయ పంటలకు అన్వయించుకోవచ్చు.

- **మొదటిది :** పంటల వారీగా రైతు సహకార సంఘాల ఏర్పాటు వారి చేతుల్లోనే వ్యవసాయ మార్కెట్ యార్డులు వుండాలి.

- **రెండవది :** కొనుగోలు అమ్మకం ధరల నిర్ణయం పూర్తిగా ఈ రైతు సహకార సంఘాల చేతుల్లోనే వుండాలి. అంటే ప్రభుత్వం నిర్ణయించే మద్దతు ధర వుండదు, దళారులు కార్పొరేట్లు చేతుల్లోనూ ధర నిర్ణయం వుండదు.
- **మూడవది :** ప్రభుత్వ సీడ్మనీ, కార్పొరేటు సంస్థల నుండి రాబట్టే సంపద పునఃపంపిణీలో కొంత వాటా సొమ్ము దీనికి కొనుగోలు నిధిగా వుంటుంది.
- **నాలుగవది :** కొనుగోలు రేటు హెచ్చుగా నిర్ణయించినా అమ్మకం రేటు దానిపైన కొద్దిగా మాత్రమే వుండడంతో వినియోగదారుల మీద భారం పడదు. రైతులకు అదనంగా వచ్చే లాభసాటి ధర ప్రధానంగా దళారులు, కార్పొరేట్లు దోచుకుంటున్న దాని నుంచే లభిస్తుంది.
- **ఐదవది:** మనం ప్రారంభంలో చెప్పుకునే సంపద పునఃపంపిణీలో వ్యవసాయ కూలీలు, రైతులు అందరికీ కనీస ఆదాయ భద్రత అదనంగా లభిస్తుంది.

- ఇది జరిగితే రైతు తన పంట ధరకు హక్కుదారుడవుతాడు. సంపద పునఃపంపిణీలో హక్కుదారుడవుతాడు.
- అప్పులపాలు కావడానికి, ఆత్మహత్యలకు దూరం అవుతాడు.
- ఇలా రైతుల జీవనస్థితి నుండి పంటలకు లాభసాటి ధర నిర్ణయించుకునే ఆకాంక్ష కొత్త నినాదం అవుతుంది.
- దానిని సాధ్యం చెయ్యడానికి దళారీల వ్యవస్థని, కార్పొరేట్ల దోపిడీ నుంచి వ్యవసాయం పంటల మార్కెట్లను వేరు చెయ్యడం సాధ్యం చేస్తుంది.
- పర్యవసానంగా లాభసాటి ధర, సంపద పునఃపంపిణీ ద్వారా ఆదాయభద్రత సాధ్యం అవుతుంది. ఈ మూడు ఒకదానికొకటి జతపర్చడం ద్వారా కొత్త వ్యవస్థను సాధించే భౌతిక శక్తిగా రైతుల ఉద్యమం రూపొందుతుంది.

## సి) చోదకశక్తిగా కార్మికవర్గం - కొత్త నినాదాలు

ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థ విశ్వరూపం ధరిస్తున్న తొలినాళ్లలోనే కార్ల్ మార్క్స్ ఈ దోపిడీ వ్యవస్థను మార్చడానికి 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి' అన్న నినాదాన్ని ఇచ్చారు. తర్వాత మే డే పనిగంటల ఉద్యమంగా ప్రారంభమైంది. అది ఇప్పుడు కార్మికుల హక్కుల కోసం సంఘటితమయ్యే అంతర్జాతీయ ఉద్యమం అయింది. ప్రస్తుతం ప్రపంచం చాలా మారిపోయింది. ఒక శాతం మంది దగ్గర మొత్తం ప్రపంచ సంపదలో 80 శాతం పోగుపడ్డాయన్న లెక్కలు బైటకొచ్చాయి.

పోగుపడ్డ సంపద అంటే అది పోగుపడ్డ శ్రమ మాత్రమే. సంపద అనేది పెట్టుబడి రూపంలో వున్నా, వస్తువుల రూపంలో వున్నా అంతా శ్రమ ఫలితమే.

- నిత్యం సాగిపోతున్న దోపిడీకి అడ్డుకట్ట వెయ్యాలి.
- 1శాతం దగ్గర మూలుగుతున్న సంపదను బద్దలుకొట్టాలి.
- తొలిమెట్టుగా దానిలో ఒక వాటా సంపద అందరికీ పునఃపంపిణీ జరగాలి.
- కార్మికోద్యమం నినాదాలు మారాలి. కొత్త నినాదాలు పుట్టుకురావాలి.
- పోగుపడ్డ సంపదలో వాటా అందరికీ మౌలిక ఆదాయంగా పంపిణీ
- కనీస వేతనం కాదు.. జీవనస్థాయి వేతనం ఇవ్వాలి.
- వారానికి 5 రోజులు – 40 గంటల పని కల్పించాలి.

సంపద పునఃపంపిణీ ఉద్యమానికి సంఘటిత కార్మికవర్గం చొరవ తీసుకోవాలి. అప్పుడే అసంఘటిత రంగ కార్మికులకు, ఇతర పేద వర్గాలకు ఈ నినాదం త్వరగా వ్యాపిస్తుంది. ఇది వ్యవస్థను తక్షణమే మార్చదు. పోగు పడ్డ సంపదలో హక్కుగా వాటా పొందడం సంపద మీద ఆధిపత్యం వైపు వారికి దారి చూపిస్తుంది. అందరికీ కనీసం ఆదాయం హక్కుగా రావడం పెనుమార్పులకు దారులు వేస్తుంది.

పని దొరకకపోతే బతుకు లేనప్పుడు షరతులు పెట్టేది పెట్టుబడిదారుడవుతాడు. బతుకు భరోసా వున్నప్పుడు ఇష్టమైన పనిని ఎంచుకోడానికి, శ్రమ శక్తిని అమ్ముకునే బేరసారాలు సాగించే శక్తి వస్తుంది.

ఐదు రోజుల పని, పనిగంటల తగ్గింపు, కార్మికుల ఆరోగ్య స్థితిని మెరుగు పరుస్తుంది. కుటుంబం, సమాజంలో భాగస్వామ్యం పెరుగుతుంది. వారి అభిరుచులను సంతృప్తిపరిచే వివిధ అంశాలను అనుభవంలోకి తెచ్చుకోగలుగుతారు. అంతిమంగా వారి జీవన నాణ్యత, ప్రమాణాలు పెరుగుతాయి.

## ప్రపంచ వ్యాపిత ప్రచారం, ఆందోళనలు

కార్మిక సంఘాలు దేశస్థాయిలో, ప్రపంచస్థాయిలో పనిచేస్తున్నాయి. సంపద పునఃపంపిణీ మీద అంతర్జాతీయ స్థాయిలో ప్రచారాన్ని పెంచడంతోపాటు ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించే విధంగా ఒకేసారి జరిగే ప్రచార కార్యక్రమాలు, సామూహిక ప్రదర్శనలు సమ్మెతో సహా వివిధ కార్యాచరణలు సాగించాలి.

## డి) సామాజిక న్యాయానికి కొత్త నిర్వచనం ఇవ్వాలి

వివక్ష తరగతుల ఉద్యమాలకు గల ప్రత్యేకతను, ప్రాధ్యానతను గుర్తించాలి. మన సమాజంలో పుట్టుకతో వివక్ష వుంది. కుల వివక్ష, లింగ వివక్ష, మత వివక్ష, పేదరిక వివక్ష పుట్టుకతోనే సంక్రమిస్తున్నాయి. కుల, మత, లింగపరమైన సంస్థలు పుట్టుకొస్తున్నాయి. వివక్ష తొలగాలంటూ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వివక్ష తరగతులు ఉమ్మడి ప్రయోజనాలకంటే ఎవరి ప్రయోజనాలకు వారే ఒంటరి పోరాటాలు చేస్తున్నారు. వ్యవస్థ లోపల పాలకపక్షాలు ఈ సామాజిక చైతన్యాన్ని తమ రాజకీయ ప్రయోజనాలకు ఓటు బ్యాంకులుగా మార్చుకుంటున్నాయి.

సామాజిక న్యాయం అంటే కులాల వారీగా కార్పొరేషన్లు, పథకాలు, రాయితీలు, సబ్సీడీలు, ఉప ప్రణాళికలు, ఆదరణలు, చేయూతలు అన్న భావం కల్పించబడింది. వివక్ష తరగతుల నాయకులకు చిల్లర మల్లర పదవుల పంపిణీలు, ప్రలోభాలతో ఆకట్టుకుంటున్నాయి. ఇన్ని చేస్తున్నా ఇప్పటికీ పేదరికం అక్కడే గూడుకట్టుకుని వుంది. ప్రధానంగా ఈ తరగతులకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు, ఇతర పేదలకు రాయితీల బతుకుతో వారిని శాశ్వతంగా లబ్ధిదారులుగానే వుంచుతున్నది.

ఈ వ్యవస్థ లోపల వివక్ష తరగతులకు విముక్తి దొరకదు. వ్యవస్థను బద్దలుకొట్టే దారిలోనే పరిష్కారాలు దక్కుతాయి. పుట్టుకతో వివక్ష తొలగించడానికి ఇలాంటి ఉమ్మడి ఆకాంక్షను కలిగించాలి. సంపద పునఃపంపిణీతోనే అందరికీ మౌలిక ఆదాయభద్రత కలుగుతుంది.

తలెత్తుకు తిరిగే స్వతంత్ర జీవనానికి అది తొలిమెట్టు అవుతుంది.

మంచి ప్రమాణాల చదువు, ఏ స్థాయికైనా ఉచితంగా అందించడం ద్వారా ఎదిగే అవకాశం కల్పించడం రెండవ మెట్టు.

ఇవి వారి సామాజిక హోదాను మార్చివేస్తాయి. వివక్ష తరగతుల ఉద్యమాన్ని ప్రత్యేక దృష్టితో పేదల ఉద్యమంలో భాగంగా సాగించాలి.

# కొన్ని వాదనలు - కొన్ని వివాదాలు

**ఈ** నినాదాలన్నీ ఊహాజనితాలని కొట్టిపారేసేవారు ఉంటారు. ఆచరణ సాధ్యం కావని అపహాస్యం చేసేవారుంటారు. ఒకసారి ఇంటర్నెట్‌ను తెరిచి చూడండి. ప్రపంచం అంతటా ఇలాంటి చర్చ జరగడం గమనిస్తారు. సంపద కేంద్రీకరణ అనర్థాలు, పునఃపంపిణీ ఆవశ్యకత మీద అర్థవంతమైన చర్చ కనిపిస్తుంది. అలాగే భిన్నాభిప్రాయాలు కనిపిస్తాయి. నిన్నటి వరకు పెట్టుబడిదారీ వ్యవస్థకు సమర్థకులుగా వున్న ప్రముఖ ఆర్థికవేత్తలు, విశ్లేషకులు ఈ అంతరాల అగాధం మీద విరుచుకుపడడం కనిపిస్తుంది. కొన్ని దేశాలలో ఈ పంపిణీకి చేస్తున్న ప్రయోగాలు మరి కొన్ని దేశాలలో దీనికోసం సాగుతున్న ఉద్యమాలు కనిపిస్తాయి. ఇక్కడ కనిపించే భిన్న మార్గాలలో మనం ఏ మార్గాన్ని ఎంచుకోవాలి అన్నది మనం తేల్చుకోవాల్సిన సమస్య అవుతుంది.

## వ్యవస్థ లోపల క్యాష్ ట్రాన్స్‌ఫర్ పద్ధతి

అంతరాలకు మూలమైన కార్పొరేట్ల దోపిడీ మీద దాడి చెయ్యకుండా దానిని అలాగే వుంచి ప్రభుత్వాలకు ప్రజలు చెల్లించే పన్నుల సొమ్ము నుండి కొంత భాగాన్ని **'మౌలిక ఆదాయం'** పేరుతో నగదు బదిలీ చెయ్యడం ప్రధాన ధోరణిగా కనిపిస్తున్నది. మన దేశంలో కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఇలాంటి నగదు బదిలీలను మనం చూస్తున్నాం. ఇది అంతరాలను తగ్గించదు. అంతరాలకు గురవుతున్న వారిలో కొంత మందికి తాత్కాలిక ఉపశమనంగానే వుంటుంది. మరోపక్క వ్యవస్థ దోపిడీ యధావిధిగా కొనసాగుతూ అంతరాలను మరింత పెంచుకుంటూ పోతూనే వుంటుంది. మనలాంటి దేశాలలో పాలకపక్షాల ఓటు బ్యాంకు రాజకీయాలకు ఉపయోగపడే పథకాలకు మాత్రమే ఈ క్యాష్ ట్రాన్స్‌ఫర్ పద్ధతి సాధనంగా వున్నది.

## పోగుపడ్డ సంపదను బద్దలుకొట్టడం

వ్యవస్థను మార్చాలనుకునే వారు పోగుపడ్డ సంపదను బద్దలుకొట్టే మార్గాన్ని అనుసరించాలి. అంతరాల సృష్టికి మూలమైన వ్యవస్థ మీద దాడి చెయ్యాలి. అలాంటి ఆకాంక్షకు నినాద రూపం ఇవ్వాలి. కార్పొరేట్ల దగ్గర పోగు పడ్డ లక్షల

కోట్ల సంపద నుంచి, ఆదాయం నుంచి సంపద పునఃపంపిణీ నిధిని ప్రత్యేకంగా సమకూర్చాలి. వారసత్వానికి దక్కకుండా దానిలో వాటాను విడదీయాలి. అలాగే ప్రకృతి సంపదను ప్రయివేటుపరం నుండి తొలగించాలి. వీటన్నింటి ద్వారా సమకూరిన పునఃపంపిణీ నిధితో ప్రజలకు హక్కుగా మౌలిక ఆదాయాన్ని కల్పించాలి. ఇది పోగుబడ్డ సంపదను బద్దలుకొట్టి దోపిడీకి గురైన తరగతులకు పంపకం చేసేది అవుతుంది. అంతరాలు తగ్గడానికి తొలిమెట్టు అవుతుంది. పెట్టుబడిదారీ దోపిడీ మీద చేసే దాడికి తొలి అడుగు అవుతుంది.

## పారిశ్రామికాభివృద్ధి దెబ్బ తింటుందా ?

పారిశ్రామికరంగంలో గుత్తాధిపత్యం మీద చేసే దాడి చిన్న, మధ్య తరహా పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేస్తుంది. ఉపాధినిచ్చే పరిశ్రమలు, వ్యవసాయా ధారిత పరిశ్రమలకు అదనపు ప్రోత్సాహకాలు లభిస్తాయి. ప్రజల చేతుల్లోకి - కనీస ఆదాయభద్రత పద్ధతి ద్వారా చేరే లక్షల కోట్ల రూపాయలు దేశీయ మార్కెట్లకు కొత్త ఊపునిస్తాయి. ఇది పారిశ్రామికాభివృద్ధి కుంటుపరచకపోగా విస్తృతం చేస్తుంది. ఉపాధి అవకాశాలను పెంచుతుంది.

## ప్రజలు సోమరిపోతులు కారా ?

పనిచేసినా చెయ్యకపోయినా కనీస ఆదాయం కల్పిస్తే అంతా సోమరిపోతులు, తాగుబోతులు అవుతారన్న ప్రచారం సాగించేవారుంటారు. అంటే బతకడానికి డబ్బున్న వాళ్లంతా సోమరిపోతులు, తాగుబోతులు అయిపోవాలి. అలాకాక పోగా మంచి జీవితానికి రుచి మరిగిన కొద్దీ మరింతగా పనిచేసే వారే ఎక్కువ అవుతున్నారు. పేదరికమే అసలు సమస్య. అవిద్యకు, అనారోగ్యానికి, అధిక సంతానానికి, వ్యసనాలకు అదే పుట్టిల్లు. దాని తొలగింపులోనే జీవన వికాసం కనిపిస్తుంది. తప్పు కళ్లది కాదు పెట్టుకున్న కళ్లజోళ్లది. పేదలు, శ్రామికులు మనుషులేనని, వాళ్లతోనే సమాజానికి అవసరమైన వస్తువుల ఉత్పత్తి, సేవలు జరుగుతున్నాయని గుర్తించే సంస్కారం వుంటే ఇలాంటి వాదనలు రావు.

# ప్రజా ఉద్యమాలు - కొన్ని పరిశీలనాంశాలు

ఇంత వరకు ప్రజల ఆకాంక్షలకు నినాదరూపం ఇచ్చే అంశాలను చూశాం. నినాదాలు వాటంతటవే ప్రజా ఉద్యమాలుగా మారవు. అవి ప్రజలకు చేరాలి. వాటికి ఆదరణ లభించాలి. వారిలో విశ్వాసాన్ని పెంచడానికి తగిన కార్యాచరణలు జరగాలి. ఇవన్నీ జరిగితేనే నినాదాలు ప్రజా ఉద్యమాలుగా మారి భౌతికశక్తిగా విజయాలు సాధిస్తాయి. ఈ క్రమానికి సంబంధించిన కొన్ని సాధారణ అంశాలను పరిశీలించుకుందాం.

## 1. ఉమ్మడి ఆకాంక్షను ధృవపరుచుకోవాలి

ఒకే తరహా సమూహాలు వివిధ ప్రాంతాలలో, వివిధ రాష్ట్రాలలో వున్న వారికి ఉమ్మడి ఆకాంక్షను తమంత తాముగా రూపొందించుకోలేదు. ఆ సమూహాలలో పని చేసే పార్టీలు, సంస్థలు అలాంటి ఉమ్మడి ఆకాంక్షకు నినాదం రూపం ఇవ్వాల్సి వుంటుంది. ఇలా ఆ సమూహాల బయట నుంచి రూపుదిద్దుకునే ఉమ్మడి ఆకాంక్ష లేదా నినాదం బయట నుంచి రుద్దబడేది కాకూడదు. అలా జరిగితే ఆ సమూహాలు ఆ నినాదాలను పట్టించుకోవు. అందుచేత వివిధ సమూహాల ఉమ్మడి ఆకాంక్షలను, ఆ సమూహాలలో చర్చకు పెట్టి తుదిరూపం ఇవ్వాలి. అప్పుడు అది వారి నుంచి వచ్చిన ఉమ్మడి ఆకాంక్ష అవుతుంది.

## 2. ప్రచారం

వ్యవస్థను మార్చే పార్టీల సంస్థల నినాదాలు ప్రజల డిమాండ్‌గా మారాలి. ఒక నినాదాన్ని ప్రచారం చేయడం అంటే నినాదాలను వల్లించడం. ఏకపక్షంగా ప్రసంగాలు చేసి రావడంగా వుండకూడదు. ఇచ్చే నినాదం సహజంగానే ఆ సమూహానికి బాగానే కనిపిస్తుంది. దానివల్ల వారి జీవితాలలో వచ్చే మార్పులు వారికి అర్థమవుతాయి. అయితే ఇది ఎలా సాధ్యం అన్నది కీలక పాత్ర పోషిస్తుంది. సాధ్యమేనన్న నమ్మకం వారికి కలగకపోతే ఆ నినాదాన్ని వారు అంతగా పట్టించుకోరు.

దేశంలో ఒక శాతం మంది దగ్గర 73 శాతం సంపద గుట్టగా పోగుపడ్డ సంగతి అందరికీ తెలిసిందే. ఆ సంపదను బద్దలుకొట్టి దానిలో ఒక వాటాను ప్రజలకు

మౌలిక ఆదాయంగా పంపిణీ చెయ్యడం న్యాయ సమ్మతమేనా? దానిలో వాటా అడిగే హక్కు ఎలా సమంజసం అవుతుంది? అన్న ప్రశ్నలు సందేహాలు ముందుకొస్తాయి. ఈ సందేహాలు తీరకపోతే దానిని హక్కుగా సాధించాలన్న పట్టుదల సడలిపోతుంది.

శ్రమ నుంచే సంపద సృష్టి ఎలా జరుగుతుందో, దానిని ఎలా దోచుకుంటున్నారో, ఈ సంపద అంతా కూడబెట్టిన శ్రమ రూపం అన్న అంశాలు ప్రచారంలో భాగం కావాలి. ప్రజలు నిత్యం కొనుగోలు చేసే సరుకుల మీద లాభాలు ఎలా దండుకుంటున్నారో స్పష్టం చెయ్యగలగాలి. ఈ సంపద ప్రజల నుంచి దోచుకున్నది. దానిపై శ్రమ జీవులంతా హక్కుదారులు. అందులో వాటా న్యాయబద్ధమైనదిగా వివరించగలగాలి. ఇది మన హక్కు అన్న భావం ఆ సమూహానికి కలిగించగలిగితే ప్రచారం సజావుగా జరిగినట్లు భావించాలి. ఇది తమ హక్కు అని ఆ సమూహంలో కొందరైనా మాట్లాడడం ప్రారంభిస్తే ప్రచారం జయప్రదమైనట్లు. సమూహంలోని వారు మాట్లాడడం మొదలుపెడితే ఆ నినాదం ప్రజల డిమాండ్‌గా మారడం జరిగిందని భావించాలి. ఇది జరిగితే అతి త్వరలోనే ఆ నినాదం ప్రజా ఉద్యమంగా మారి తీరుతుంది. అందుచేత ప్రచారం చేసే కార్యకర్తలకు ఆ నినాదం వెనుక గల అంశాల మీద పరిపూర్ణమైన అవగాహన అవసరం. వారికి రోజుల తరబడి శిక్షణ ఇచ్చిన తర్వాతే ప్రచారకులుగా వినియోగించాలి. లేకపోతే మంచి నినాదాలు కూడా అపహాస్యం పాలవుతాయి.

## 3. తక్షణ సమస్యలతో కొత్త నినాదాలను జతపర్చడం

వివిధ సమూహాల ప్రజలు తమ తక్షణ సమస్యల మీద స్పందిస్తారు. కొంత ఉపశమనం వెంటనే జరగాలని కోరుకుంటారు. పంటల సమయంలో గిట్టుబాటు ధరలు, ప్రభుత్వ హామీల అమలు కోసం లబ్ధిదారుల ఆందోళనలు వగైరాలు ఈ కోవకు చెందుతాయి. వాటికి నాయకత్వాన్ని అందించాలి. ఇవి వ్యవస్థ లోపల జరిగే ఉపశమన కార్యక్రమాలు. వీటికి కొత్త ఆకాంక్షలని, వ్యవస్థని మార్చే నినాదాలను జతపర్చాలి. లేకపోతే అవి వ్యవస్థలోపలే తిరుగుతూ అక్కడే ఆగిపోతాయి.

ఉదాహరణకు ఇటీవల ముంబాయిలో రైతులు గొప్ప ప్రదర్శన చేశారు. దేశ ప్రజల దృష్టిని ఆకర్షించారు. రుణమాఫీ హామీలు, గిట్టుబాటు ధరలు, గిరిజన హక్కుల కోసం సాగిన ఈ కార్యక్రమం ప్రభుత్వ హామీతో ముగిసింది. ఇది విజయమే. కాని దానికి పైమెట్టు నినాదం లేదు. వ్యవస్థ మీద దాడి చేసే పైమెట్టు

నినాదాలు జతపడి వుంటే దేశం అంతటా దాని మీద చర్చ జరిగి వుండేది. ఆ ఉద్యమం ఒక విజయం సాధించిన తరువాత కూడా మరో విజయం కోసం దారి చూపించి వుండేది.

## 4. ప్రత్యేక నినాదాలు - స్వతంత్ర కార్యాచరణ

వ్యవస్థను మార్చే ఉద్యమ నినాదాలు ప్రత్యేకతను కలిగి వుండాలి. అవి ప్రజలకు కొత్త ఆకాంక్షలను కలిగించేవి అయి వుండాలి. పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించే పాలక పార్టీలు ఇవ్వలేని నినాదాలుగా వుండాలి. వ్యవస్థను మార్చే లక్ష్యాలు స్పష్టంగా కలిగి వుండాలి. ఈ ప్రత్యేకతలు వున్నప్పుడే అవి కొత్త గొంతుకను వినిపించగలుగుతాయి. ప్రత్యేకమైన స్వతంత్ర ఉద్యమాలను నిర్మించగలుగుతాయి. తక్షణ సమస్యల కార్యకలాపాలతో నినాదాలను జతపర్చడమే కాకుండా ఈ నినాదాలతో ప్రత్యేక ఉద్యమాలు సాగించాలి. ఒక ఉద్యమం సాగించడానికి ముందు దీర్ఘకాలం పాటు ప్రచారం జరగాలి. తర్వాత చేసే ప్రజా కార్యాచరణ కొన్ని రోజులపాటు లేదా కొన్ని వారాలపాటు ప్రజల మనసుల్లో ముద్రపడే విధంగా ఆ ఉద్యమాన్ని నిర్వహించాలి.

గతంలో ఇచ్ఛాపురం నుంచి తడ వరకు జరిగిన రైతు యాత్రలా ఇటీవల ముంబైలో జరిగిన రైతుల ప్రదర్శనలా వివిధ సమూహాల ప్రజల ఉమ్మడి ఉద్యమాలు లేదా ప్రత్యేక ఉద్యమాలు జరగాలి.

ప్రజలు ప్రతి రోజూ ప్రజా కార్యకలాపాలలో పాల్గొనలేరు. అందుచేత వ్యవస్థ మార్పును కోరే పార్టీలు ఎక్కువ కాలం ప్రజలకు దగ్గరగా వారి మధ్యనే ప్రచార కార్యక్రమాలు కొనసాగించాలి. విరామ సమయంలో ప్రజలను స్థానిక నిర్మాణ కార్యక్రమాలలో భాగస్వాములను చెయ్యాలి. వీటికి కొనసాగింపుగా తగిన వ్యవధితో ఒక ప్రత్యక్ష కార్యాచరణ వుండేలా చూసుకోవాలి. వ్యవస్థను మార్చే ప్రత్యేక కార్యాచరణ చేసే వారు దానికి తగిన ప్రత్యేకమైన ప్రతీకలను, ప్రత్యేక ఉద్యమ దినాలను (మే డే లా) ప్రకటించి ప్రత్యేక నినాదాలకు వాటిని వేదికలుగా తీర్చిదిద్దుకోవాలి.

ఉదాహరణకు భగత్ సింగ్ 'విప్లవం వర్ధిల్లాలి' అన్న నినాదాన్ని అందించారు. ఈ నినాదం ఇచ్చిన రోజు (వర్ధంతి – జయంతులతో నిమిత్తం లేకుండా) భారత విప్లవ దినోత్సవంగా ప్రకటించి కొత్త నినాదాలకు వేదికను చేసుకోవచ్చు.

గాంధీజీ చంపారన్ జిల్లాలో తొలిరైతు ఉద్యమాన్ని జయప్రదంగా నిర్వహించారు. దానిని రైతుల ప్రత్యేక నినాదాల ప్రకటన దినంగా ప్రకటించుకోవచ్చు.

అంబేద్కర్ సారథ్యంలో రాజ్యాంగ సభ కొత్త రాజ్యాంగ నిర్ణాయకసభ ఆమోదించిన రోజును 'వివక్షని, పేదరికాన్ని జయించే హక్కుల ఉద్యమదినం'గా పాటించవచ్చును.

గుంపులో గోవిందా అన్నట్టు జయంతులు, వర్ధంతుల తంతుగా కాకుండా వ్యవస్థను మార్చే స్వతంత్ర ఉద్యమాలకు, నినాదాలకు వీటిని స్వతంత్ర వేదికలుగా రూపొందించుకోవచ్చు.

## 5. ప్రజా కళలే ఉద్యమాలకు ఊపిరి

ప్రపంచం మారింది. సమాచారం అందించే మార్గాలు సులభతరం అయ్యాయి. సామాజిక మాధ్యమాలు అందరికీ అందుబాటులోకి వస్తున్నాయి. ప్రజా ఉద్యమాల ప్రచారానికి వీటిని వినియోగించుకోవాలి. ప్రస్తుతం ఇవి మన దేశంలో మధ్య తరగతి, విద్యార్థులలో విస్తరించినా వ్యవస్థను మార్చే ఉద్యమాలలో కీలకపాత్ర పోషించాల్సిన శ్రామికులు, ఇతర పేద వర్గాలకు అందుబాటులో అంతగా లేవు. పైగా ఇవి పరోక్ష ప్రచార సాధనాలు మాత్రమే. ప్రచారంలో ప్రత్యక్ష భాగస్వామ్యం అత్యంత ప్రభావాన్ని కలిగిస్తుంది. అది కళా రూపాల ఉద్యమం ద్వారానే జరగాలి. అలాగే ఈ కొత్త నినాదాలను వివరించే సాహిత్యం అందుబాటులోకి రావాలి. కళా రూపాలు కేవలం పెద్ద సభలకు ప్రచార సాధనాలుగానే కాకుండా వివిధ సమూహాల ప్రజలను ప్రభావితం చేసే ఉద్యమంగా సాగాలి. కళా రూపాలు ప్రజల హృదయాలను గెల్చుకుంటాయి. ప్రజా ఉద్యమాలకు భావోద్వేగాలను అందించే శక్తి కళారూపాలకు వుంటుంది. అందుచేత ప్రజా ఉద్యమాలలో కళారూపాలు అంతర్భాగం కావాలి. దీని మీద ప్రత్యేక శ్రద్ధ అవసరం.

## 6. పాజిటివ్ నినాదాలు

ప్రజలు తమ జీవితాలను మార్చే పాజిటివ్ నినాదాలకు, ఉద్యమాలకు స్పందిస్తారు. నెగిటివ్ నినాదాలు కార్యకర్తలకు ఆకర్షణగా వున్నా ప్రజలకు అవి అంతగా పట్టవు. అందుచేత ప్రజా ఉద్యమాలు వారి జీవితాలను మార్చే పాజిటివ్ నినాదాల చుట్టూ సాగాలి. ఉదాహరణకు 'దున్నేవాడికి భూమి' అన్నది ఒక

పాజిటివ్ నినాదం. ఇది రైతులను ఆకట్టుకుంటుంది. ఇలా కాకుండా 'జమిందారీ వ్యవస్థ రద్దు' అన్న నినాదంతో ప్రారంభిస్తే అది రైతులకు పాజిటివ్ నినాదంగా వుండదు. వ్యవస్థను మార్చే ఉద్యమాలు సాగించాలనుకునే వారు ఈ పై అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. కొత్త నినాదాలు కొత్త తరహా ప్రజా ఉద్యమాల రూపకల్పన నేటి తక్షణావశ్యకత. దానిమీద అందరూ దృష్టి సారించాలి.

# ప్రత్యేక సంచికలు - సంపాదకీయాలు


## విషయ సూచిక


1. సమ సమాజానికి దారిదీపం కారల్ మార్క్స్ .................... 178
2. మార్క్స్ : గోథా కార్యక్రమంపై విమర్శ ............................ 180
3. మనకు తెలియని మార్క్స్ అముద్రిత రచనలు .................... 184
4. మార్క్స్ విశ్లేషణా పద్ధతి .............................................. 188
5. ఎంగెల్స్ : జర్మనీలో రైతు యుద్ధం ................................ 191
6. మార్క్సిజాన్ని సుసంపన్నం చేసిన ఎంగెల్స్ ...................... 195
7. ఆంటోనియో గ్రాంసీని అధ్యయనం చేద్దాం ...................... 200
8. గ్రాంసీ : ప్రజా విప్లవానికి మరోదారి ............................ 202
9. గ్రాంసీ 86వ వర్ధంతికి మరో ప్రత్యేక సంచిక .................... 205
10. తెలుగులో గ్రాంసీ భావజాలం విస్తరించిన క్రమం ............. 207
11. దీపధారి.. చక్రవర్తుల రాఘవాచారి ............................. 210
12. బడి చదువు లేని బహుముఖ ప్రజ్ఞాశాలి రాంభట్ల ............. 214
13. సాహిత్యతత్వానికి దారి దీపం .................................. 216
14. ఆదర్శ కమ్యూనిస్టు – అరుదైన కార్మిక నేత .................... 218
15. సూదంటురాయి.. కపర్ది ! ....................................... 220
16. మోదీ జైత్రయాత్రకు అడ్డుకట్ట పడుతుందా ? ................. 222
17. ఉద్యమాల నుండి ప్రభవించిన మహిళా దినోత్సవం .......... 224
18. 2021 రిపబ్లిక్ డే ప్రత్యేకతలు .................................. 226
19. విద్యా భారతంలో వెనకచూపు ................................... 228

# సమ సమాజానికి దారిదీపం కారల్ మార్క్స్

● మార్క్స్ ప్రత్యేక సంచిక సంపాదకీయం

**మా**ర్క్స్‌కి పరిచయం అవసరం లేదు. ఇప్పుడు ఆయన పేరు అందరికీ తెలిసిందే. అన్ని దేశాలలోనూ మార్క్స్ రచనల చుట్టూ చర్చ సాగుతున్నది. నాటికీ నేటికీ ప్రపంచంలో అత్యంత ప్రభావశీల వ్యక్తి కారల్ మార్క్సే. 1990 దశకంలో మార్క్స్‌కు గ్రహణం పట్టినట్లు అనిపించింది. సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాలు కనుమరుగు కావడంతో పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు మార్క్స్ భావజాలానికి కాలం చెల్లిందని ప్రకటించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ చిరస్థాయిగా వుంటుందని, సంక్షోభాలకు తట్టుకుని మనగలుగుతుందని ప్రచారం చేశారు. ఈ ప్రచారం మూణ్ణాల ముచ్చటే అయింది.




2008 నుంచి పెట్టుబడిదారీ దేశాలు ఒక దాని తర్వాత మరొకటి చివరికి అన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయి. ఉద్దీపనల చిట్కాలు వాటిని గట్టెక్కించ లేకపోతున్నాయి. ఇప్పుడు పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు బుర్రలు గోక్కుంటున్నారు. పెట్టుబడి చలన సూత్రాల కోసం మార్క్స్ రచనలే శరణ్యం అంటున్నారు. అందుకే మార్క్స్ రచనల అధ్యయనం వారికి కూడా తప్పనిసరి అయింది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో సంపద కేంద్రీకరణ అనివార్యం అని అదే స్థాయిలో పేదరికం, దారిద్ర్యం మరొక చోట నెలకొంటుందన్న మార్క్స్ విశ్లేషణను నేటి ప్రపంచం తిరుగులేని వాస్తవంగా నిరూపిస్తున్నది. శాస్త్ర సాంకేతికాభివృద్ధి సమాజానికి ఉపయోగపడకపోగా ఉపాధి లేని అభివృద్ధికి దారులు వేస్తున్నది. ఈ పరిణామాల పర్యవసానంగా పెట్టుబడిదారీ దేశాలు కార్మికుల వేతన స్తంభననీ సంక్షేమ కార్యక్ర మాల కత్తిరింపులనీ సాధనాలు చేసుకుంటున్నాయి. పెట్టుబడికి రక్షణ కవచంగా వుండే నిరంకుశ శక్తుల చేతికి రాజకీయాన్ని కట్టబెట్టే చర్యలు తీసుకుంటున్నారు.


దేశ దేశాలలో కార్మికులు, శ్రామికులు ఈ పరిస్థితిని ప్రతిఘటించడానికి మార్క్స్ రచనలకు మరింత దగ్గర అవుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు బదులుగా సోషలిజం సాధించడం లక్ష్యంగా పలు ఉద్యమాలు సాగిస్తున్నారు. సోవియట్ తరహా సోషలిజం పతనానంతరం పుట్టినవారు ఇప్పుడు యూనివర్శిటీ చదువుల్లో వున్నారు. కొత్తతరం కార్మికులు కాబోతున్నారు. అన్ని దేశాలకు వ్యాపించిన మార్క్స్ రచనల చర్చ ఈ తరంపై పెద్ద ప్రభావాన్ని చూపిస్తున్నది. ఇప్పుడు అనేక దేశాలలోని యువత మార్క్సిజానికి ఆకర్షితులవుతున్నారు. ఒకనాడు మార్క్స్ రచనలకు పట్టిన గ్రహణం ఇప్పుడు విడిపోయింది. మార్క్స్ రచనల కోసం, వ్యవస్థ మార్పు కోసం వెదుకులాట సాగుతున్నది. సోవియట్ పతనం తర్వాత తెలుగులో మార్క్స్ రచనల అందుబాటు బాగా తగ్గింది. ఇటీవల ప్రచురితమైన కాపిటల్ అనువాదం కొన్ని నెలలోనే రెండు ముద్రణలు పొందింది. వామపక్ష ప్రచురణ సంస్థలు 'కమ్యూనిస్టు ప్రణాళిక' పుస్తకాన్ని లక్ష కాపీలు ప్రచురించి, సభలు సమావేశాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించారు.

ఈ నేపథ్యంలో జాతీయస్ఫూర్తి పత్రిక మార్క్స్‌పై ప్రత్యేక సంచికను ప్రచురించాలని తలపెట్టింది. గతంలో ఏంగెల్స్ ద్విశత జయంతికి, గ్రాంసీ 130వ జయంతికి ప్రచురించిన ప్రత్యేక సంచికలు విశేష ఆదరణ పొందాయి. ఇవన్నీ మార్క్సిజం పట్ల పెరుగుతున్న ఆసక్తికి సంకేతాలు. ఇప్పుడు మార్క్స్ ప్రత్యేక సంచికకు మంచి ఆదరణ లభిస్తుందని, అది మార్క్స్ రచనల అధ్యయనానికి ప్రేరణ కల్పిస్తుందని ఆశిస్తున్నాం. పెట్టుబడిదారీ వ్యవస్థను వదిలించుకోవాలి. సమ సమాజాన్ని సాధించాలి. దీనికి దారి దీపాలు మార్క్స్ రచనలే. మార్క్సిజం పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ ప్రారంభంలోనే పెద్ద గ్రంథాలను చదవడం, క్లిష్టమైన భావాలను అర్థం చేసుకోవడం అంత తేలిక కాదు. అలాంటి వారు మార్క్స్ భావజాలంలో ప్రవేశించడానికి ఈ సంచిక ఉపయోగపడుతుంది. ఈ ప్రత్యేక సంచిక సమగ్రమైంది కాదు. రేఖా మాత్ర చిత్రణ మాత్రమే. సరళంగా సాధ్యమైనంత మేర పడికట్టు పదాలకు దూరంగా, మార్క్స్ రచనల పరిచయాలను, ఆయన జీవితమూ కృషినీ అందిస్తున్నాం. ఈ ప్రయత్నంలో భాగస్వాములైన రచయితలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. జాతీయస్ఫూర్తి చేసే ఇలాంటి ప్రయత్నాలకు మీ సహాయ సహకారాలను అర్థిస్తున్నాం.

# మార్క్స్ : గోథా కార్యక్రమంపై విమర్శ

● కార్మిక వర్గ పార్టీలకు కరదీపిక

**గో**థా కార్యక్రమంపై మార్క్స్ చేసిన విమర్శలోని అంశాలను ప్రస్తావించడానికి ముందు దానికి గల నేపథ్యాన్ని తెలుసుకోవాలి. జర్మన్ సోషల్ డెమోక్రసీకి మార్క్స్ - ఏంగెల్స్‌లు ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యతను ఇచ్చారు. అది అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖపాత్ర పోషిస్తుందని భావించారు. అందువల్ల దాని నాయకత్వం విప్లవకర విధానాలను అనుసరించాలని, ఎలాంటి పెడధోరణులను అంగీకరించకూడదని భావించారు. 1860 దశకంలో జర్మనీలో రెండు కార్మికవర్గ పార్టీలు ఏర్పడ్డాయి. 1863లో జనరల్ అసోసియేషన్ ఆఫ్ వర్కర్స్ సంస్థ ఏర్పడింది. దీనికి లాసెల్లీ నాయకుడు. లాసెల్లీ భావజాలం రూపంలో సోషలిస్టుగా కనిపిస్తుంది. సారంలో అది బూర్జువా చట్రం పరిధిలో వుంటుంది. ఆయనకు కమ్యూనిస్టు భావజాల పునాది లేదు. పదాడంబరమూ, మాటల గారడీతో కార్మికులను ఆకర్షించడం తప్ప సూత్రబద్ధ వైఖరి గలవాడు కాదు. 1864లో ఆయన మరణించినా ఆయన అనుయాయులు అదే పద్ధతిని కొనసాగించారు.




రెండోది సోషల్ డెమోక్రటిక్ పార్టీ. ఇది 1869లో ఐసినాచ్ పట్టణంలో ఏర్పడింది. అందువల్ల దీనిని ఐసినాచ్ బృందంగా పిలుస్తారు. లీబ్‌క్నెఖ్ట్ బృందంతో ఇది ఏర్పడింది. ఈ పార్టీతో మార్క్స్ - ఎంగెల్స్‌కు సన్నిహిత సంబంధాలు వున్నాయి. వారు లాసెల్లీ బృందంతోనూ సంబంధాలను కలిగివున్నారు. మార్క్స్ ఎంగెల్స్‌లు ఈ విలీనానికి వ్యతిరేకం కాదు. అయితే ఆ విలీనం సూత్రబద్ధంగా, సిద్ధాంత పునాది మీద జరగాలని భావించారు. 1875 మార్చిలో మార్క్స్ ఎంగెల్స్‌తో సంప్రదించకుండా ఐసినాచ్ బృందం ముందుకు సాగింది. మే నెలలో

గోథాలో ఈ విలీన సభ జరపాలని, దానికి ఒక కార్యక్రమ ముసాయిదాను జర్మనీ ఏకీకరణపై ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర విభేదాలు వుండేవి. బిస్మార్క్ నాయకత్వంలో జర్మన్ ఏకీకరణ జరిగిన తర్వాత ఈ విభేదాలు కనుమరుగయ్యాయి. కార్మికవర్గ ప్రయోజనాల కోసం ఈ రెండు బృందాలు ఏకం కావాలన్న నినాదం ముందుకు వచ్చింది. కార్మికులలో ఇది బలమైన అభిప్రాయంగా జాతీయస్ఫూర్తి రూపొందించారు.

మార్క్స్ ఎంగెల్స్‌లు ఈ విలీనానికి వ్యతిరేకం కాదు. అయితే ఆ విలీనం సూత్రబద్ధంగా, సిద్ధాంత పునాది మీద జరగాలని భావించారు. 1875 మార్చిలో మార్క్స్ ఎంగెల్స్‌తో సంప్రదించకుండా ఐసినాచ్ బృందం ముందుకు సాగింది. మే నెలలో గోథాలో ఈ విలీనసభ జరపాలని, దానికి ఒక కార్యక్రమ ముసాయిదాను రూపొందించారు. ఈ కార్యక్రమం ఆసాంతం, లాసెల్లీ భావజాల దారిద్ర్యం ఆధారంగా వుంది. ఐసినాచ్ బృందం సభ్యుడు బ్రాకే ఈ కార్యక్రమ ముసాయిదాను మార్క్స్ అభిప్రాయాల కోసం పంపించాడు. విలీనం కోసం రూపొందించిన గోథా కార్యక్రమం ముసాయిదాపై మార్క్స్ స్పందిస్తూ అందులోని పదాడంబరం వెనుక వున్న అసలు రూపాన్ని బహిర్గతం చేస్తూ తన విమర్శను, వ్యాఖ్యలను బ్రాకేకు ఒక కవరింగ్ ఉత్తరంతో కలిపి పంపించాడు. దీనిని లీబ్‌క్నెఖ్ట్, బీబెల్ మరో ఇద్దరికి చూపించమని, తర్వాత దానిని తనకు తిరిగి పంపించమని రాశాడు. ఐసినాచ్ బృందంలో ఐదుగురికి మాత్రమే ఈ విమర్శ చేరింది. కాని వారు దీనిని పట్టించుకోలేదు. ఎందుకంటే ఒకసారి విలీనం జరిగితే, ప్రజాస్వామ్యబద్ధమైన అంతర్గత చర్చల ద్వారా అన్నీ పరిష్కారం అవుతాయన్న భ్రమలో పడ్డారు.

ఈ రాత ప్రతి మార్క్స్ మరణానంతరం ఎంగెల్స్‌కు చేరింది. 1891లో జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఎర్‌ఫర్ట్‌లో జరిగే మహాసభలో కొత్త కార్యక్రమాన్ని ఆమోదించనున్నట్టు ప్రకటించింది. ఆ పార్టీ గతంలో చేసిన తప్పునే తిరిగి చేస్తుందేమోనన్న ఆందోళనతో మార్క్స్ రాసిన 'గోథ కార్యక్రమంపై విమర్శ'ను ఎంగెల్స్ పుస్తకంగా ప్రచురించాడు. ఈ పుస్తకం జర్మన్ పార్టీలో కలకలం రేపింది. దాంతో ఎర్‌ఫర్ట్ సభలో కొత్త కార్యక్రమాన్ని మార్క్స్ విమర్శ ఆధారంగా రూపొందించి ప్రకటించారు. కొత్త కార్యక్రమంపై ఎంగెల్స్ తన సంతృప్తిని ప్రకటించాడు. అలా విస్మరణకు గురైన అత్యంత ప్రతిభావంత రచన అంతిమంగా విజయాన్ని సాధించింది. మార్క్స్ గోథా కార్యక్రమంపై చేసిన విమర్శ నాలుగు భాగాలుగా వుంది. 1891లో ఎంగెల్స్ దీనిని పుస్తకంగా ప్రచురించారు. తన

ముందుమాటతోపాటు, ఆయన బీబెల్‌కు రాసిన ఉత్తరం, బ్రీకేకు మార్క్స్ రాసిన ఉత్తరం, అనుబంధాలు వున్నాయి. ఈ పుస్తకం నేటికీ పార్టీ రాజకీయ కార్యక్రమాలు రూపొందించుకోడానికి కరదీపికగా వుంది.

## 1. గోథా కార్యక్రమ ముసాయిదా మొదటి పేరాలోని ఈ క్రింది వాక్యంపై మార్క్స్ విమర్శ ప్రారంభం అవుతుంది.

'సంపదకీ, సంస్కృతికీ శ్రమే మూలం. ఉపయోగ శ్రమ అనేది సమాజంలో, సమాజం ద్వారా మాత్రమే సాధ్యం. అందువల్ల శ్రమ ఉత్పాదితాలకు ఎలాంటి తగ్గింపులూ లేకుండా సమాజంలోని సభ్యులందరికీ చెందే సమాన హక్కు కావాలి'. ఈ వాక్యం పైకి చూడడానికి బాగానే కనిపిస్తుంది. కాని మార్క్స్ ఎక్స్‌రే కళ్లతో పరిశీలించి, దానిలోని డొల్లతనాన్ని వెల్లడిస్తాడు. శ్రమలాగే ప్రకృతి కూడా ఉపయోగపు విలువలకు మూలం అని పేర్కొంటూ గోథ కార్యక్రమంలోని పై వాక్యం అర్ధవంతం కావాలంటే 'శ్రమ అనేది మొత్తం సంపదకు మూలం గనుక ఎవరైనా శ్రమ ఉత్పాదితంగానే దానిని పొందాలి. సమాజంలో వున్న ఇతరులెవ్వరూ దానిని సంపదగా స్వంతం చేసుకోకూడదు. అంటే ఎవరైతే పనిచేయరో వారు ఇతరుల శ్రమ మీద బతికేవారు, ఇతరుల శ్రమతోనే సంస్కృతిని పొందే వారవుతారు' అంటూ శ్రమ దోపిడీ మీద స్పష్టత లేనితనాన్ని వివరిస్తాడు. ఉపయోగ శ్రమ అనేది 'సమాజంలో, సమాజం ద్వారానే సాధ్యం' అన్న వాక్యాన్ని విశ్లేషిస్తూ అంటే సమాజం ద్వారా కాకపోతే ఉపయోగశ్రమ వుండదా? అని ప్రశ్నించి, వానరుడు నరునిగా మారే తొలి మొరటు దశలో అతను ఒక రాతితో జంతువుని వేటాడటం, పండ్లను సేకరించడం కూడా ఉపయోగపు విలువేనని సూచిస్తాడు. సమాజానికి దూరంగా విడి వ్యక్తులుగా చేసే శ్రమ సంపదను గాని సంస్కృతిని గాని సృష్టించదు అని స్పష్టం చేస్తాడు.

## 2. వేతనాల ఇనప చట్రం

గోథా కార్యక్రమం 'స్వేచ్ఛా రాజ్యాన్ని చట్టబద్ధమైన మార్గాల ద్వారా సాధిస్తుంది. అలా స్వేచ్ఛా రాజ్యాన్ని, సోషలిస్టు సమాజాన్ని సాధిస్తుంది. వేతన వ్యవస్థని, వేతనాల ఇనుప చట్రం సూత్రాన్ని తొలగిస్తుంది. అన్ని రూపాలు దోపిడీని, సామాజిక ఆర్థిక అసమానతలను తొలగిస్తుంది' అని ప్రకటిస్తుంది.

ఈ ముసాయిదాను ఆమోదిస్తే జర్మన్ వర్కర్స్ పార్టీ లాసెల్లీ ప్రవచించే వేతనాల ఇనప చట్రం భావనని ఆమోదించాలి. లాసెల్లీ అనుయాయులు వేతన శ్రమ మీద చేసే దాడి కంటే 'వేతనాల ఇనుపచట్రం సూత్రం మీదే వారి దాడి ప్రధానంగా వుంద'ని మార్క్స్ పేర్కొంటూ 'నేను వేతన శ్రమని రద్దు చేస్తే దానితోపాటే సహజమైన దాని సూత్రాలు రద్దు అవుతాయి – అవి ఇనుప సూత్రాలైనా – స్పాంజ్ సూత్రాలైనా' అని స్పష్టం చేస్తాడు. అలాగే లాసెల్లీ అనుయాయులు వల్లిస్తున్న ఈ వేతనాల ఇనుప సూత్రం మాల్థూస్ జనాభా సిద్ధాంతం నుంచి పుట్టుకొచ్చిన భావన అనీ. జనాభా పెరుగుదల వల్ల ఎంత తక్కువ వేతనం ఇచ్చినా పని చెయ్యడానికి మనుషుల కొరత వుండదనీ, ఇది ప్రకృతి సిద్ధమైందని, అన్ని సమాజాలకు వర్తించేది. అందువల్ల ఇది వారికి 'ఇనుప చట్రం' అయిందని, దీనినే బూర్జువా ఆర్థికవేత్తలు గత 50 ఏళ్లుగా ప్రచారం చేస్తున్నారన్న అంశాన్ని మార్క్స్ ప్రస్తావిస్తూ ఇదే వాస్తవం అయితే 'వేతన వ్యవస్థను రద్దు చేసినా' అన్ని 'సమాజాలకూ వర్తించే' 'ఇనుపచట్రం' రద్దు కాదు గదా అంటూ వీరికి వేతన వ్యవస్థ అర్థం కాలేదంటాడు.

'వేతనాలు అనేవి పైకి కనిపించే రూపంలో వున్నవి కావని, శ్రమ యొక్క విలువ లేదా ధర అనేది ముసుగు వేసుకున్న శ్రమ శక్తి విలువ, ధర మాత్రమే ఇది వేతనాలకు మించి అదనపు శ్రమ చేసే పద్ధతి మీద ఆధారపడింది. అందుకే ఈ అదనపు శ్రమని మరింత పెంచడానికి పనిదినాల నిడివి పెంచడం, సాంద్రతను పెంచడం ద్వారా ఉత్పాదకతను పెంచడం వగైరాలకు పాల్పడుతున్నారని మార్క్స్ వివరిస్తాడు. అందువల్ల వేతన శ్రమ అనేది ఒక బానిస వ్యవస్థ లాసెల్లీ వర్గం కేవలం వేతన వ్యవస్థ రూపాన్నే చూస్తున్నారు. కాని దాని సారాన్ని గ్రహించడం లేదని మార్క్స్ విమర్శిస్తాడు.

మరో రెండు అంశాలను ప్రస్తావించి ఈ పరిచయాన్ని ముగిస్తాను. మార్క్స్ తన విమర్శను కొనసాగిస్తూ జర్మన్ వర్కర్స్ పార్టీ ఈ ముసాయిదాను ఆమోదించడం అంటే దానికి సోషలిస్టు భావజాలం పట్ల లోతైన అవగాహన లేదని అర్థం అంటాడు. ప్రస్తుతం వున్నది పెట్టుబడిదారీ వ్యవస్థ. ఈ వ్యవస్థే ప్రస్తుత రాజ్యవ్యవస్థకు పునాది అన్న అంశాన్ని ఈ ముసాయిదా గోథా కార్యక్రమం 'స్వేచ్ఛా రాజ్యాన్ని చట్టబద్ధమైన మార్గాల విస్మరించి, ఈ రాజ్యం ఒక స్వతంత్రమైన వ్యవస్థగా పరిగణిస్తున్నది. ఈ "ప్రస్తుత రాజ్య వ్యవస్థలో వివిధ దేశాలలో వివిధ రూపాలులో వుంది. కాని వాటన్నింటికీ కొన్ని సమాన లక్షణాలు వున్నాయంటూ ప్రస్తుత రాజ్య వ్యవస్థను భవిష్యత్ రాజ్యవ్యవస్థతో పోల్చి చెప్పడం మాత్రమే సాధ్యం


పడుతుందని అంటాడు. పెట్టుబడిదారీ వ్యవస్థకు, కమ్యూనిస్టు వ్యవస్థకు మధ్య ఒక విప్లవకర పరివర్తన దశ వుంటుందని ఇది ఒక వ్యవస్థ నుండి మరొక వ్యవస్థకు మారడం, దీనితోపాటే రాజకీయ పరివర్తన దశకూ కూడా వుంటుంది.

ఈ పరివర్తన దశలో రాజ్యం అన్నది ఒక విప్లవకర కార్మికవర్గ నియంతృత్వంగా వుంటుంది. అయితే ఈ ముసాయిదా కార్యక్రమం దీనిని గురించి మాట్లాడడం లేదు పైగా వారు లేవనెత్తిన డిమాండ్లు అన్నీ పాతకాలపు నినాదాలు మాత్రమేనని అంటాడు. కార్మిక వర్గ అంతర్జాతీయతను ప్రస్తావిస్తూ కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రతిపాదించిన దానికి విరుద్ధంగా లాసెల్లీ బృందం ఒక సంకుచితమైన జాతీయ దృక్పథాన్ని తీసుకున్నదని పేర్కొంటాడు. 'కార్మికులు ఒక వర్గంగా సంఘటితం కావాలన్నది అందరికీ తెలిసిందే. దాని పోరాటానికి తన దేశమే తక్షణ కార్యక్షేత్రంగా వుంటుంది. ఇంతవరకు ఆ పోరాటం జాతీయ పరిధిలోదే అన్నది కేవలం రూపంలో మాత్రమే కాని దాని సారం అది కాదు' అంటాడు మార్క్స్. ప్రస్తుతం వున్న జర్మన్ సామ్రాజ్యాన్ని తీసుకుంటే అది పైకి జాతీయ రాజ్యాల చట్టంలో వున్నట్టు కనిపిస్తుంది. కాని జర్మన్ ట్రేడ్ లోని విదేశీ వ్యాపారంలో ప్రత్యేకత బిస్మార్క్ అనుసరించే అంతర్జాతీయ విధానంలో వుందని పేర్కొంటాడు. గోథ కార్యక్రమ ముసాయిదా దీనిని పూర్తిగా విస్మరించింది. కార్మిక వర్గం తన విముక్తిని ప్రస్తుత జాతీయ రాజ్యాల చట్రంలోనే సాధించడానికి పూనుకుంటుందని చేసిన ప్రకటన కార్మికవర్గ అంతర్జాతీయతను ఎలా నీరు గారుస్తుందో వివరిస్తాడు. మా గోథా కార్యక్రమంపై చేసిన విమర్శ శాస్త్రీయ కమ్యూనిజానికి సంబంధించిన పలు కోణాలను ఆవిష్కరిస్తుంది. కార్మికవర్గ పార్టీల కార్యక్రమాల రూప కల్పనకు నేటికీ అది కరదీపికగా దారి చూపిస్తుంది.

**(జాతీయస్ఫూర్తి 2021 మే సంచిక)**

# మనకు తెలియని మార్క్స్.. అముద్రిత రచనలు

**2**022 మార్చి 14న కార్ల్ మార్క్స్ 139వ వర్ధంతి. మనకు తెలియని మార్క్స్ రాత ప్రతులనీ, రచనలనీ ఈ ప్రత్యేక సంచిక ద్వారా పరిచయం చేస్తున్నాం. ఇప్పుడు మన ముందు ఇద్దరు మార్క్స్ వున్నారు. ఒకరు మనకి తెలిసిన మార్క్స్. మరొకరు ప్రత్యేకించి తెలుగు పాఠకులకు తెలియని మార్క్స్. మనకు తెలిసిన మార్క్స్ అంటే 1975 నాటికి ఇంగ్లీషులో మార్క్స్ - ఎంగెల్స్ సంకలిత రచనల పేరుతో 52 సంపుటాలు వచ్చాయి. ఇవి కాక కొన్ని రాత ప్రతులు పాక్షికంగా అందుబాటులోకి వచ్చాయి. ఇందులో పెట్టుబడి మూడు సంపుటాలు, అదనపు విలువ సిద్ధాంతం మొదటి భాగం, కమ్యూనిస్టు ప్రణాళికతోపాటు, మాస్కో ప్రచురించిన మార్క్స్ - ఎంగెల్స్ సంకలిత రచనలు నాలుగు భాగాలు, ఇతర విడి విడి పుస్తకాలు వచ్చాయి. ఇంగ్లీషులో వచ్చిన రచనలతో పోలిస్తే తెలుగులో వచ్చినవి చాలా పరిమితమైనవి మాత్రమే. ఇవీ మనకు తెలిసిన మార్క్స్ రచనలు. 2021 మే 5న కార్ల్ మార్క్స్ జయంతిని పురస్కరించుకుని ఈ సంపాదక వర్గం ఆధ్వర్యంలో మనకు తెలిసిన మార్క్స్ రచనలను పరిచయం చేస్తూ 116 పేజీల ప్రత్యేక సంచికను వెలువరించాం. అలాగే ఎంగెల్స్ రచనలను పరిచయం చేస్తూ ఒక విశేష సంచికను, ఆంటోనియో గ్రాంసీ రచనలపై మరో ప్రత్యేక సంచికను వెలువరించాం. ఇప్పుడు మార్క్స్ - మెగా 2 పేరుతో మనకు తెలియని మార్క్స్ రాత ప్రతులను, చివరి దశ రచనలపై వ్యాసాలతో ఈ ప్రత్యేక సంచికను తీసుకువస్తున్నాం. 2 అంటే మార్క్స్ ఎంగెల్స్ సర్వ రచనల సంపుటాల ప్రచురణ ప్రాజెక్టు.




గతంలో వచ్చిన 50 సంపుటాలకు తోడుగా మార్క్స్ - ఎంగెల్స్ రాతప్రతులు, అముద్రిత రచనలు మొత్తంగా 114 సంపుటాలను ప్రచురిస్తున్నారు. అంటే మనకు

తెలిసిన మార్క్స్ కంటే తెలియని మార్క్స్ రచనలే ఎక్కువగా వున్నాయి. ఇప్పటికి 67 సంపుటాలు ప్రచురించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈ సంస్థలు కొన్ని సంపుటాలను డిజిటల్ రూపంలో తెస్తున్నాయి. మార్క్స్ – ఎంగెల్స్ రచనల మీద ఆసక్తి గలవారికి వారు సేకరించిన సమాచారాన్ని అందుబాటులో వుంచారు. ఆ సంపుటాలకు చెందిన సమాచారాన్ని అధ్యయనం చేసిన వారు ఇంగ్లీషులో రాసిన వ్యాసాల ఆధారంగా ఈ సంచికను రూపొందిస్తున్నాం. కార్ల్ మార్క్స్ మెగా 2 పేరుతో మనకు తెలియని మార్క్స్ రాత ప్రతులను, చివరి దశ రచనలను, వాటి ఆధారంగా రాసిన వ్యాసాలను ఈ సంచిక ద్వారా తెలుగు పాఠకులకు పరిచయం చేస్తున్నాం.

ఈ సంచికలో స్థూలంగా 5 భాగాలు వున్నాయి. మొదటి భాగంలో మార్క్స్ ఎంగెల్స్‌ల సర్వరచనల ప్రచురణకు సంబంధించిన చరిత్ర, దాని ప్రాముఖ్యతను వివరించే వ్యాసాలను ఇస్తున్నాం.

రెండవ భాగంలో ఆర్థిక రచనలు ప్రత్యేకించి తెలుగు పాఠకులకు అందుబాటులో లేని 'పెట్టుబడి ఫ్రెంచి ఎడిషన్'కు సంబంధించిన సమాచారాన్ని కార్ల్ మార్క్స్ ఈ ఫ్రెంచి ఎడిషన్‌లో చాలా మార్పులు చేశారు. పెట్టుబడి మొదటి భాగానికి సంబంధించి ఇదే ప్రామాణికమైందిగా, దీనినే భవిష్యత్ అనువాదాలకు ఉపయోగించాలని సూచించాడు. మార్క్స్ చేసిన సవరణలు చాలా ప్రాధాన్యత గలవి మనకి కొత్త చూపునిచ్చేవిగా వున్నాయి. మార్క్స్ తన ప్రాథమిక ఆర్థిక రచన 'గున్ డ్రిస్సే'లో ప్రకటించిన భావాల ప్రత్యేకతలపైనా వివరణ ఇచ్చే వ్యాసాలను ప్రచురిస్తున్నాం.


మూడవ భాగంలో మానవజాతి సమూహాల మీద మార్క్స్ రాసిన రాత ప్రతులు ఇప్పుడు ప్రపంచ మేధావుల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నవి. ఇందులో మార్క్స్ పశ్చిమేతర దేశాలలోని పెట్టుబడిదారీ పూర్వ సమాజాలపై చేసిన లోతైన పరిశీలన, పరిశోధన కనిపిస్తుంది. ఆసియా తరహా ఉత్పత్తి విధానం మీద, ప్రత్యేకించి రష్యాలో నెలకొన్న భూ సంబంధాల పర్యవసానాల మీద, పోలండ్, ఐరిష్ పరిణామాల మీద, జెండర్, జాతి వివక్ష వగైరా అంశాల మీద మనకు కొత్త దారులు చూపించే రచనలు వున్నాయి. చరిత్ర అభివృద్ధి దశలలో వివిధ మార్గాలకు గల అవకాశాలను అందులో ప్రస్తావించారు. వీటి ప్రాధాన్యతను వివరించే వ్యాసాలు వున్నాయి.

నాలుగవ భాగంలో పర్యావరణం, జీవావరణం మీద మార్క్స్ రాసుకున్న నోట్ పుస్తకాలలోని అంశాలను వివరించే వ్యాసాలున్నాయి. ఈ రచనల ఆధారంగా ఇప్పుడు పరిశోధకులు మార్క్స్ ఒక పర్యావరణ సోషలిస్టుగా పేర్కొంటున్నారు. మానవాళికి ప్రకృతికి మధ్య గల జీవ క్రియా సంబంధాన్ని ఆవిష్కరించి పెట్టుబడిదారీ వ్యవస్థ సాగిస్తున్న దోపిడీని ఎండగట్టారు.

అయిదవ భాగంలో ఇతర నోట్‌బుక్స్‌ను పరిచయం చేసే వ్యాసాలున్నాయి. మాథమేటిక్స్, ప్రకృతి శాస్త్రాలు, వ్యవసాయం శాస్త్ర సాంకేతిక అంశాలపై వున్న రాత ప్రతులు ఆయన పరిశోధన పద్ధతిని, సమాజ జీవనానికి అన్వయం చేసే తీరును వెల్లడిస్తాయి. మొత్తం మీద మార్క్స్ రాతప్రతులు, చివరి దశ రచనలు ఎంతో విలువైనవి. సమాజాన్ని అర్థం చేసుకోడానికి, దాన్ని మార్చడానికి తగిన కార్యాచరణకు అవి దారి చూపుతాయి. ఈ చిన్న ప్రయత్నానికి పెద్దగా తోడ్పాటునిచ్చిన రచయితలకు కృతజ్ఞతలు చెప్పి తీరాలి. ఈ ప్రత్యేక సంచిక మార్క్స్‌ను బహుకోణాలలో పరిశీలించడానికి మన ఆలోచనలకు పదును పెట్టుకోడానికి, కార్యాచరణకు కొత్తదారులు రూపొందించడానికి అవసరమైన చర్చకు దోహదం చేస్తుందని భావిస్తున్నాం.

# మార్క్స్ విశ్లేషణా పద్ధతి

**తె**లుగు పాఠకులకు అందుబాటులో లేని మార్క్స్ రాత ప్రతులు, చివరి రచనలు చాలా వున్నాయి. వీటిని పరిచయం చేసే వ్యాసాలతో 'మార్క్స్-మెగా 2' ప్రత్యేక సంచికను రూపొందించారు. 2022 మార్చి 14 మార్క్స్ 139వ వర్ధంతి సంద ర్భంగా ఈ సంచికను ఆవిష్కరించారు. మనకు తెలిసిన మార్క్స్ అంటే తెలుగులో అందుబాటులోవున్న ఆయన రచనలలో కనిపించే మార్క్స్. మనకు తెలియని మార్క్స్ అంటే మనకు తెలుగులో అందుబాటులోకి రాని రాత ప్రతులలో, చివరి రచనలలో కనిపించే మార్క్స్.



ఈ రెండింటి మధ్య వైరుధ్యం లేదు. ఆ భావజాలంలో మరింత విస్తృతి, కొనసాగిం పులో అవసరమైన మార్పులు చేర్పులు కనిపిస్తాయి. మార్క్సి జం నిత్య సృజనశీలతను అవి ధ్రువపరుస్తాయి. ఈ సంచిక లో మార్క్స్-ఎంగెల్స్‌ల రచన ల ప్రచురణకు సంబంధించిన సంక్షిప్త చరిత్రపై వ్యాసాలున్నాయి.

మనకు ఇంగ్లీష్‌లో అందుబాటులోవున్న 50 సంపుటాల మార్క్స్-ఎంగెల్స్ సంకలిత రచనలను స్థూలంగా మెగా 1గాను, వీటితో కలిపి గతంలో ప్రచురణకు నోచుకోని రాత ప్రతులను, ఉత్తరాలను, వ్యాసాలను ఇప్పుడు ప్రచురిస్తున్న 'మార్క్స్-ఎంగెల్స్ సర్వ రచనల' 114 సంపుటాలను మెగా-2 గాను వ్యవహరించడాన్ని ఈ వ్యాసాలలో వివరించారు. ఈ కొత్త సంపుటాలు ప్రధానంగా జర్మన్ భాషలో వున్నాయి. ఈ అదనపు సమాచారాన్ని అధ్యయనం చేస్తున్న వారు ఇంగ్లీష్‌లో రాసిన వ్యాసాల ఆధారంగా ఈ సంచికను రూపొందించారు. వివిధ స్రవంతులకు చెందిన మార్క్సిస్టు విశ్లేషకులు, రచయితలు రావు కృష్ణారావు, ఆర్వీ రామారావు, హెచ్చార్కె, అశోక్ కుంబము, ఇఫ్ట్యూ ప్రసాద్, కొండూరి వీరయ్య, మందలపర్తి కిషోర్, కొప్పర్తి వెంకటరమణమూర్తి, డాక్టర్ మర్ల సోము, డాక్టర్

బి.రమేష్ చంద్రబాబు, డి.సోమసుందర్ – ఈ సంచికలోని వ్యాసాలకు రూపునిచ్చారు. ఈ సంచికలో ఐదు భాగాలు వున్నాయి.

- మొదటి భాగంలో మార్క్స్–ఎంగెల్స్ సర్వ రచనల ప్రచురణ సంక్షిప్త చరిత్ర వ్యాసాలున్నాయి.
- రెండవ భాగంలో 'పెట్టుబడి' ఫ్రెంచ్ అనువాదంలో మార్క్స్ స్వయంగా చేసిన సవరణల మీద, ఇతర ఆర్థిక రచనలలో వెల్లడించిన అభిప్రాయాల మీద వ్యాసాలూ ఉన్నాయి.
- మూడవ భాగంలో మానవ సమూహాల చరిత్రపై మార్క్స్ చేసిన పరిశీలనలు, ఆవిష్కరణలపై వ్యాసాలు వున్నాయి.
- నాలుగవ భాగంలో పర్యావరణం, జీవావరణం, ప్రకృతిలో జీవక్రియపై వ్యాసాలు వున్నాయి.
- ఐదవ భాగంలో మార్క్స్ వివిధ విజ్ఞాన శాస్త్రాలపై–వ్యవసాయం, గణితశాస్త్రం, ప్రకృతిశాస్త్రం, సాంకేతిక విప్లవాలపై–రాసుకున్న నోట్ బుక్స్‌లో చేసిన ఆవిష్కరణలపై వ్యాసాలున్నాయి.

మొదటిది ఈ రాత ప్రతుల ద్వారా మార్క్స్‌లో మనం తెలుసుకోవలసిన అంశాలు చాలా ఉన్నాయని స్పష్టమవుతుంది. మార్క్స్‌ని ఒక మూసలో అర్థం చేసుకోకూడదనీ అది నిరంతరం మార్పులకు, చేర్పులకు గురికావడం కనిపిస్తుంది. దీనికితోడు సమస్త విజ్ఞాన శాస్త్రాలకు విస్తరించిన మార్క్స్ అధ్యయనాలు, పరిశీలనలు, ఆవిష్కరణలు తెలుస్తాయి. మార్క్స్‌ను ఒక ఆర్థిక నియతివాదిగా, ఏకరూప చారిత్రిక అభివృద్ధి దశల మూస సిద్ధాంతకర్తగా, పర్యావరణ విరోధిగా చూపించే ప్రయత్నాలను ఈ రాత ప్రతులు పూర్వపక్షం చేస్తున్నాయి. అందువల్ల ఈ రాత ప్రతుల అధ్యయనం తప్పని సరి అవుతుంది.


రెండవది మార్క్స్ రచనలకి, రాత ప్రతులకీ మధ్య వున్న ప్రత్యేకతలను మనం గుర్తించాలి. మార్క్స్ రచనలలో శాస్త్రీయ దృక్పథం గల విశ్లేషణ, చారిత్రక నేపథ్యం, గతితార్కిక అన్వయం కనిపిస్తుంది. మనకొక కొత్త భావ జాల ప్రపంచం గోచరిస్తుంది. భవిష్యత్తును దర్శించే కొత్తచూపు కనిపిస్తుంది. ఇవి మార్క్స్ అధ్యయనాల సారాన్ని వ్యక్తీకరిస్తాయి. మార్క్స్ రాతప్రతులు ఆయన అధ్యయన పద్ధతిని ఆవిష్కరిస్తాయి.

మార్క్స్ ఈ కొత్త చూపును సంపాదించుకున్న తీరును అర్థం చేసుకోడానికి

ఆయన రాతప్రతులు మనకు దారి చూపిస్తాయి. వర్తమానాన్ని అర్థం చేసుకోడానికి గతాన్ని అధ్యయనం చేశాడు. తన కాలానికి అభివృద్ధి చెందిన ఆర్థిక, రాజకీయ, అన్ని విజ్ఞాన శాస్త్రాలను అధ్యయనం చేశాడు. వాటికి తన గతి తర్క పద్ధతిని జోడించాడు. ఈ తరహా అధ్యయన పద్ధతే ఆయనకు కొత్తచూపును, ముందు చూపును ఇచ్చింది. మార్క్స్ అధ్యయనం చేసిన పద్ధతి రాత ప్రతులలో పుష్కలంగా కనిపిస్తుంది. అలాంటి కొత్తచూపును, ముందుచూపును పొందాలన్న ఆసక్తి గలవారంతా రాత ప్రతులను లోతుగా అధ్యయనం చెయ్యాలి. అందుకు ఈ ప్రత్యేక సంచిక ప్రేరణ ఇస్తుందని ఆశిద్దాం.

# ఎంగెల్స్ : జర్మనీలో రైతు యుద్ధం

ఎంగెల్స్ జర్మనీలో రైతు యుద్ధం పుస్తకాన్ని 1850లో రాశాడు. విప్లవోద్యమంలో పనిచేసేవారు, అలాంటి ఉద్యమాల పట్ల ఆసక్తి గల ప్రతి ఒక్కరూ చదివి తీరాల్సిన పుస్తకం ఇది. నిజానికి మార్క్స్ - ఎంగెల్స్ రచనలన్నీ చదివి తీరాల్సినవే. వీటిలో కొన్ని గొప్పవీ మరికొన్ని తక్కువ గొప్పవీ అన్న తేడా లేదు. ప్రతి రచనా విశిష్టమైనదే. దేని ప్రత్యేకత దానిదే. అవి మనకు ఒక కొత్త ప్రపంచ దృక్పథాన్ని, చరిత్ర అధ్యయనానికి భౌతిక దృష్టిని కలిగిస్తాయి. ఆర్థిక, సామాజిక విశ్లేషణకు, కార్యాచరణకు సాధన సంపత్తిని సమకూరుస్తాయి. ఎంగెల్స్ రాసిన 'జర్మనీలో రైతు యుద్ధం' పుస్తకంలోని కొన్ని ప్రత్యేకతలను రేఖామాత్రంగా పరిశీలిం చుకుందాం.




## ఎందుకు రాశాడు ?

జర్మనీలో 1848-49లో విప్లవం జరిగింది. ఇది తన కళ్ల ముందు జరిగింది. చారిత్రిక భౌతిక వాదానికి ఆది గ్రంథం 1525లో జరిగిన రైతు యుద్ధానికి సంబంధించిన సమాచారాన్ని ప్రముఖ జర్మన్ చరిత్రకారుడు విల్ హెల్మ్ జిమ్మర్ మాన్ పుస్తకం నుంచి స్వీకరించినట్లు ఎంగెల్స్ చెప్పుకున్నాడు. జిమ్మర్ మాన్ రాసిన 'ది హిస్టరీ ఆఫ్ గ్రేట్ పెజంట్ వార్' పుస్తకం ఆనాటి ఆర్థిక సామాజిక అంశాలను అత్యంత వాస్తవికంగా వివరించిందనీ, భావవాద చరిత్రకారుల పుస్తకాలలో ఇది మినహాయింపు అని ఎంగెల్స్ కొనియాడాడు. ఈ పుస్తకం ఆనాటి చారిత్రిక వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. కానీ, ఆ సంఘర్షణ అంతర్గత సారాన్ని వెల్లడించలేకపోయింది. అలాంటి వర్గ దృష్టి 16 శతాబ్ది నాటికి అందుబాటులో లేకపోవడం కారణంగా ఎంగెల్స్ పేర్కొన్నాడు. మార్క్స్ - ఎంగెల్స్‌లు 1848 నాటికే దీనిలో ఆయన పాత్రధారి కూడా. అంతకు War in Germany చరిత్రను గతి తార్కిక, చారిత్రిక భౌతికవాద ముందు 300 సంవత్సరాల కిందట జర్మనీలో రైతు యుద్ధం పేరుతో విప్లవం

జరిగింది. ఈ రెంటికీ మధ్య చాలా పోలికలు, కొన్ని భేదాలు కనిపించాయి. ఈ విషయాన్ని ఎంగెల్స్ తన ముందుమాటలో వెల్లడిస్తూనే 'జర్మన్ ప్రజలకు కూడా తన విప్లవ సంప్రదాయం వుంది. ఇతర దేశాల విప్లవాలలోని అత్యుత్తమ వ్యక్తులతో సరితూగగల వ్యక్తులను జర్మనీ సృష్టించిన కాలం ఒకటి వుంది. దానిని జర్మన్ ప్రజలకు అందించాల్సిన అవసరం వుంది' అని రాశాడు. జర్మనీలో రైతు యుద్ధం జరిగి అప్పటికే 300 సంవత్సరాలు గడిచాయి. జర్మనీలో పరిస్థితులు మారాయి. కానీ మనం పోరాడవలసిన శత్రువులు ఆనాటి శత్రువులేనని, 1848–49లో విప్లవానికి ద్రోహం చేసిన వర్గాలు 1525 నాటికే ద్రోహుల రూపంలో కనిపిస్తారని అన్నాడు. అది తొలి విప్లవం, ఇది మలి విప్లవం అంటూ వీటి నుంచి తగిన గుణపాఠాలను తీసుకుని భవిష్యత్ విప్లవ విజయానికి బాటలు వేయాలన్న సంకల్పంతో ఆయన ఈ రచన చేశాడు. దృక్పథంతో పరిశీలించే పద్ధతిని ఆవిష్కరించారు. కమ్యూనిస్టు ప్రణాళికలో అది ప్రస్ఫుటం అయ్యింది. మార్క్స్ తన కాలంలో జరుగుతున్న ఘటనల విశ్లేషణకు ఈ పద్ధతిని వినియోగించాడు. ఫ్రాన్సులో అంతర్యుద్ధం, లూయీ బోనపార్ట్ బ్రూమేర్ 18వ తేదీ పుస్తకాలు రాశాడు. ఎంగెల్స్ ఈ చారిత్రక భౌతికవాద పద్ధతిని 300 సంవత్సరాల పూర్వ చరిత్రను ఆవిష్కరించడానికి వినియోగించాడు. ఈ పుస్తకం తొలి అధ్యాయంలో ఆనాటి జర్మనీలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల మీదా, పర్యవసానంగా రూపు దిద్దుకున్న వివిధ వర్గాలను, వారి సామాజిక స్థితిని, వారి ఆకాంక్షలను ఎంగెల్స్ శాస్త్రీయ పద్ధతిలో చేసిన అద్భుతమైన విశ్లేషణ మనకు కనిపిస్తుంది.

సోవియట్ యూనియన్‌లో ఈ పుస్తకాన్ని ప్రచురించిన 'మార్క్సిజం లెనినిజం' సంస్థ తన పరిచయ వాక్యాలలో 'జర్మన్ చరిత్రలోని ఆ ముఖ్యమైన దశ మీద తాను చేసిన పరిశోధనకు భౌతికవాద పరస్పరవాద, చారిత్రక భౌతిక వాదాల పద్ధతిని ప్రయుక్తం చేయడంలోనూ, జర్మనీలోని 16వ శతాబ్ది తొలి కాలపు రాజకీయ, మత పోరాటపు సాంఘిక ఆర్థిక కారణాలనూ, వర్గ స్వభావాన్నీ వెల్లడించిన చారిత్రిక సాహిత్యంలో ఎంగెల్స్ మొదటివాడు' అని పేర్కొంది. అలా ఎంగెల్స్ రాసిన జర్మనీలో రైతు యుద్ధం చారిత్రక భౌతికవాదపు ఆది గ్రంథం అయ్యింది. మతం ముసుగులో ఫ్యూడల్ వ్యతిరేక తిరుగుబాట్లు 16వ శతాబ్దిలో జరిగిన తిరుగుబాట్లు మతం ముసుగును కప్పుకున్నాయి. ఈ తిరుగుబాట్లను భావవాద చరిత్రకారులు పై పొరను మాత్రమే చూసి వ్యాఖ్యానాలు చేశారు. దీనిని ఎంగెల్స్ ప్రస్తావిస్తూ 'మన చరిత్ర కారులూ, జ్ఞాన సంపన్నులూ చెప్పేది ఏమంటే ఆనాటి ప్రజలు స్వర్గలోక

విషయాల గురించి ఒక అంగీకారానికి వచ్చి వుంటే భూలోక విషయాల గురించి కొట్లాడవలసిన కారణమేమీ ఉండేది కాదు' అంటూ వారు పైపైన కనిపించే మతపరమైన ముసుగు చుట్టూ తిరగడాన్ని చూపించాడు. నిజానికి వారు భూలోక సమస్యల నుంచి విముక్తి కోసం స్వర్గలోకాన్ని పరదాగా చేసుకున్నారు. మత యుద్ధాలుగా పిలువబడుతున్న వాటిలో స్పష్టమైన భౌతిక ప్రయోజనాలు ఉన్నాయని వివరించాడు. ఆ యుద్ధాలు కూడా వర్గయుద్ధాలేనని కాకపోతే అవి మతం దుస్తులు వేసుకున్నాయని ఎంగెల్స్ స్పష్టం చేశాడు. వివిధ వర్గాల ప్రయోజనాలూ, డిమాండ్లు అన్నీ మతం తెరవెనుక మరుగున పడినప్పటికీ అవి వర్గ యుద్ధాలేనని తన విశ్లేషణ ద్వారా ఈ పుస్తకంలో నిరూపించాడు. దీనికి గల చారిత్రక పరిణామాన్ని ఆయన వెల్లడించాడు మధ్యయుగాల అనేవి ఆదిమ స్థితి నుంచి అభివృద్ధి అయ్యాయి. అవి పాత నాగరికతను, పాత తత్వశాస్త్రాలను, రాజకీయాలను, న్యాయ శాస్త్రాలనీ తుడిచి పారవేశాయి. ప్రతి దానినీ కొత్తగా ప్రారంభించాయి. ఇలా తుత్తునియలైన పాత ప్రపంచం నుంచి అవి మిగుల్చుకున్నది ఒకే ఒక్కటి, అది క్రైస్తవ మతమూ, తమ నాగరికతను కోల్పోయి సగం ధ్వంసమైన పట్టణాలు మాత్రమే. పర్యవసానంగా ప్రతి ఆదిమ అభివృద్ధి దశలో వున్నట్లే మతగురువులు బౌద్ధిక విద్య మీద గుత్తాధిపత్యం పొందారు. విద్య అనేది ప్రధానంగా మత విద్య అయింది. మతగురువుల చేతుల్లో రాజకీయాలు, న్యాయ శాస్త్రం, ఇతర శాస్త్రాలలాగే కేవలం మతశాస్త్ర శాఖలుగా వుండిపోయాయి. అవి మతశాస్త్ర సూత్రాల ప్రకారం వివరింపబడేవి. చర్చి పిడి సూత్రాలు, రాజకీయ సూత్రాలదీ అదే దారి అయింది. బైబిల్ ఉల్లేఖనలకు ఏ న్యాయస్థానంలోనైనా న్యాయ శాస్త్రపు విలువ ఉండేది. మతశాస్త్రపు జాతీయ స్ఫూర్తి ఆధిక్యం వీటన్నింటినీ ఆవరించిన సంశ్లేషణంగా చర్చి ఆ స్థానాన్ని ఆక్రమించింది.

ఈ పరిస్థితులలో ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా, చర్చికి వ్యతిరేకంగా జరిగిన దాడులు, అన్ని విప్లవకర సూత్రాలు అన్నీ ఏకకాలంలో సంప్రదాయ వ్యతిరేకమైన మత సూత్రాలుగా వుండవలసి వచ్చింది. ఆనాటి సాంఘిక పరిస్థితుల మీద దాడి చెయ్యడానికి ముందు ఈ సంప్రదాయాల పవిత్రతను చీల్చి పారవేయడం తప్పనిసరి అయింది. ఫ్యూడలిజంపై వ్యతిరేకత మధ్యయుగాలలో అన్నిచోట్లా సజీవంగా వుంది. ఐతే అది మార్మిక వాద రూపాన్ని లేదా సంప్రదాయ మత సిద్ధాంతాలకు వ్యతిరేక మైన రూపాన్ని లేదా తిరుగుబాటు రూపాన్ని ధరించాల్సి వచ్చింది. అది ఏ రూపాన్ని ధరించేది.. ఆనాటి పరిస్థితుల మీద ఆధారపడి

వుంటుందని ఎంగెల్స్ తన చారిత్రిక భౌతికవాద దృక్పథంతో జర్మనీలో రైతు యుద్ధంలో మతం ముసుగు వేసుకోడానికి గల కారణాలను ఆవిష్కరించాడు. అలాగే రైతుల డిమాండ్లు సంప్రదాయ వ్యతిరేక మత సిద్ధాంత రూపంలోనే వ్యక్తీకరించబడిన తీరును ఎంగెల్స్ వెల్లడించారు. మత గురువులకు, పోప్ వ్యవస్థకు వ్యతిరేకంగా తొలి క్రైస్తవ చర్చి నియమావళిని పునరుద్ధరించాలని అవి కోరాయి. 'దేవుని పిల్లల సమానత్వం' నుంచి అది పౌరుల సమానత్వం ఉండాలని, కొంత వరకు ఆర్థిక సమానత్వం వుండాలని కోరింది. నిర్బంధ శ్రమను, భూమి శిస్తు, అధిక పన్నులు వేసే హక్కుల రద్దునూ డిమాండ్ చేశాయి. సమాజంలో వివిధ అంతస్థుల మధ్య గల విపరీతమైన భేదాలను తొలగించాలని కోరారు. ఈ డిమాండ్లు తొలి క్రైస్తవ సిద్ధాంతపు అంతరార్థాలుగా ప్రకటించబడ్డాయి. మతసంస్కరణ చుట్టూ తిరిగిన ఈ డిమాండ్లు ఫ్యూడల్ వ్యవస్థపై తిరుగుబాటును ప్రకటించడంగా ఎంగెల్స్ వెల్లడించారు. మత సంస్కరణ పేరుతో ప్రారంభమైన ఈ తిరుగుబాట్లలోజరిగిన ప్రచారంలో ఆకర్షితులైన వారు ఒకే వర్గ సముదాయం కాదు. అది వివిధ వర్గాల మిశ్రమం. తుది పోరు నాటికి ఈ వర్గాలలో కొన్ని రాజీ పడడం కొన్ని వర్గాలు క్రియారహితం కావడాన్ని ఎంగెల్స్ చూపిస్తాడు. ఈ తిరుగుబాట్ల ప్రచారానికి నాయకత్వం వహించిన లూథర్, మూంత్సర్ల పాత్రలపై ఎంగెల్స్ చేసిన విశ్లేషణ దీనిని వివరిస్తుంది.

జర్మనీలో ఫ్యూడల్ సమాజపు పునాదులను 1525లో జరిగిన రైతు యుద్ధం దుర్బలపరిచిందని, దీనిలో రైతులు ప్రదర్శించిన విప్లవ శక్తిని ప్రశంసిస్తూనే రైతు ఉద్యమ బలహీనతలను వెల్లడించాడు. రైతులు సంఘటితంగా లేకపోవడమూ, రైతు ఉద్యమం సద్యోజనితంగా, అనైక్యంగా వుండడమూ, రైతులలోని తక్కువ చైతన్య స్థాయి ఇవన్నీ రైతు యుద్ధం ఓటమికి కారణాలుగా ఎంగెల్స్ ప్రకటించారు. రైతులలో వున్న గుప్త శక్తిని గుర్తించాలని, ఫ్యూడలిజానికి, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేక విప్లవాలలో విజయానికి కార్మిక వర్గానికి పొత్తుదారుగా రైతాంగం పాత్రను నొక్కి చెప్పాడు. ఈ పుస్తకంలో రైతుల తిరుగుబాట్లకు సంబంధించిన అనేక కోణాలను ఎంగెల్స్ ఆవిష్కరించారు. వ్యాసానికి విస్తృతికి గల పరిమితుల రీత్యా ఈ పరిచయాన్ని ముగించుకుందాం. ముగింపు.. ఈ పుస్తకం పలు రంగాలలో మనకు మార్గదర్శనం చేసేదిగా, ప్రేరణ ఇచ్చేదిగా ఉంటుంది.

1. దేశంలో, రాష్ట్రాలలో, వివిధ ప్రాంతాలలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధి క్రమాన్ని చారిత్రిక భౌతికవాద దృక్పథంతో విశ్లేషించుకోడానికి,

రూపు దిద్దుకున్న వర్గాలను, వాటి స్వభావాన్ని అంచనా వేసుకోడానికి ఈ పుస్తకం ప్రాతిపదికన ఇస్తుంది.

2.దేశంలో, రాష్ట్రంలో, స్థానికంగా కొన్ని ప్రాంతాలలో జరిగిన ప్రజా తిరుగుబాట్లను, అవి సృష్టించిన నాయకులను వెలుగులోకి తేవడం ద్వారా తిరుగుబాట్ల సంప్రదాయాలను ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చే ప్రతీకలను రూపొందించుకోవలసిన అవసరాన్ని ఈ పుస్తకం వెల్లడిస్తుంది.


3.దేశమంతటా జరిగిన, జరుగుతున్న కుల, మతపరమైన ఉద్యమాలపై విశ్లేషణకు ఈ పుస్తకం విశేషంగా ఉపకరిస్తుంది.

4. ఈ ఉద్యమాలలో ప్రగతిశీలమైన వాటిని, ప్రగతి నిరోధకమైన వాటిని గుర్తించే చూపును ఇస్తుంది. కులం అయినా, మతం అయినా అవి ఏకవర్గ స్వభావం కలవి కావని, అవి ఎంగెల్స్ రచనల పరిచయం బహువర్గాల మిశ్రమ రూపంగా గుర్తించడానికి, వర్గ ప్రయోజనాల దృష్టితో వాటి పట్ల వ్యవహరించడానికి దారి చూపుతుంది. కార్మిక – కర్షక పొత్తును సమర్థించడం అందరికీ తెలిసిందే. పొత్తులకు వర్గప్రయోజనాలు ప్రధానం అన్న అంశాన్ని నొక్కి చెబుతుంది. ఇదే పార్టీలతో పొత్తులకు వర్తించే అంశాన్ని ఈ పుస్తకం గుర్తు చేస్తుంది. చివరిగా ఎంగెల్స్ తన ఉపోద్ఘాతంలో చెప్పిన మాటలతో ముగించుకుందాం.

'ప్రత్యేకంగా నాయకుల కర్తవ్యం యేమిటంటే సిద్ధాంత సమస్యలన్నిటి పైనా అంతకంతకూ స్పష్టమైన అవగాహన సంపాదించుకోవడం.. సోషలిజం ఒక శాస్త్రం అయింది గనుక దానిని శాస్త్రంగా అనుసరించాలని, అనగా అధ్యయనం చెయ్యాలని, అది డిమాండ్ చేస్తుందనే విషయాన్ని నిత్యం మనసులో ఉంచుకోవాలి. అంతకంతకూ స్పష్టమైన అవగాహనను మరింత పట్టుదలతో కార్మిక జనాలలో వ్యాప్తి చేయడమూ, పార్టీ యొక్క, ట్రేడ్ యూనియన్ల యొక్క నిర్మాణాన్ని అంతకంతకూ దృఢంగా కట్టుదిట్టం చేయడమూ కర్తవ్యంగా వుంటుంది'. ఎంగెల్స్ రాసిన చారిత్రిక భౌతికవాదపు ఆది గ్రంథం నిజంగానే మనకు కర్తవ్య బోధ చేస్తుంది.

# మార్క్సిజాన్ని సుసంపన్నం చేసిన ఎంగెల్స్

ఫ్రెడరిక్ ఎంగెల్స్ కేవలం మార్క్స్ సహచరుడు మాత్రమే కాదు. ఆయన చేసిన అనేక రచనలకు భాగస్వామి. అంతకుమించి ఎంగెల్స్ తన స్వీయ రచనల తో మార్క్సిజాన్ని పరిపుష్టం చేసినవాడు. 1820 నవంబరు 28న నాటి జర్మనీలోని ప్రష్యా రాష్ట్రంలో బార్మెన్ పట్టణంలో జన్మించిన ఎంగెల్స్‌కి ఇది ద్విశత జయంతి సంవత్సరం. ఎంగెల్స్ కంటే రెండేళ్లు పెద్ద అయిన మార్క్స్ ద్విశత జయంతి ఉత్సవాలు 2017 నుంచి 2018 వరకు ప్రపంచమంతటా జరిగాయి. సంక్షోభంలో కూరుకుపోయిన ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థం చేసుకోడానికి, ప్రత్యా మ్నాయాలను అన్వేషించడానికి తగిన మార్గాలు మార్క్స్ రచనలతోనే ఉన్నాయని చివర కు ఉదారవాద ఆర్థికవేత్తలు ప్రకటిం చాల్సి వచ్చింది. ఈ వ్యవస్థను మార్చాల న్న భావనలకు, ఉద్యమాలకు మార్క్స్ ద్విశతజయంతి ఉత్సవాలు సరికొత్త ఉత్తేజాన్ని కలిగించాయి. ఇప్పుడు ప్రారంభం అవుతున్న ఎంగెల్స్ ద్విశత జయంతి ఉత్సవాలు దానికి కొనసాగిం పుగా జరగాలి. మార్క్సిజంలో ని చారిత్రక, ఆర్థిక, రాజకీయ, సామా జిక, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో కొన్నింటికి పునాదినీ, మరికొన్నింటికి పరపుష్టిని కల్పించిన ఎంగెల్స్ రచనలు, సాగించిన విప్లవ కార్యకలాపాలు మరోమారు ప్రపంచాన్ని నిస్సందేహంగా ప్రభావితం చేస్తాయి.



మార్క్స్ గురించి ఏంగెల్స్ 'కొన్ని ప్రత్యేక రంగాలలో నేను చేసిన కృషిని మినహాయిస్తే ఇతర రచనలలో నేను సమకూర్చిన అంశాలను నేను లేకపోయినా మార్క్స్ తనంతట తానే చేయగలిగేవాడు. కానీ మార్క్స్ సాధించిన అంశాలను నేనుగా అందుకోలేకపోయి వుండేవాడిని. ఆయన మాకంటే చాలాఎత్తులో

ఉన్నందున చాలా దూరంగా వున్న వాటిని చూడగలగడమే కాదు మరింత సమగ్రంగా అత్యంత శీఘ్రంగా వాటిపై అభిప్రాయాలను చెప్పగలిగేవాడు. మార్క్స్ గొప్ప మేధావి. మేము మహా అయితే ప్రావీణ్యం గల వ్యక్తులం మాత్రమే. ఆయనే ఉండి ఉండకపోతే ఈ సిద్ధాంతం ప్రస్తుత స్థితికి ఏంతో దూరంలో వుండి వుండేది' అందుచేత మార్క్స్ పేరుతో ఈ సిద్ధాంతం ఉండడమే సరైంది' అని చెప్పిన ఈ మాటలు ఆయన నమ్రతను సూచిస్తాయే కాని అవి పూర్తి సత్యాలు కావు. ఎందుకంటే ఎంగెల్స్ చేసిన కృషి కేవలం 'కొన్ని రంగాలకు ''మాత్రమే పరిమితమైంది కాదు. మార్క్స్‌తో భాగస్వామ్యం వహించి చేసిన సిద్ధాంత పరమైన రచనలు ఏకపక్షంగా సాగినవి కావు. అవి ఆదాన ప్రదానాలు. ఎంగెల్స్ జీవిత చిత్రణ చేసిన చాలా మందిలో ఆయనను ఒక వ్యాపారవేత్తగా, మార్క్స్‌కు జీవిత కాల మిత్రునిగా, ఆర్థికంగా సహాయపడిన వ్యక్తిగా చూపే ప్రయత్నాలే కనిపిస్తాయి. అంతకు మించి శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతానికి ఎంగెల్స్ సమకూర్చిన భూమికను అవి తక్కువ చెయ్యడం జరిగింది. ఎంగెల్స్ కేవలం మార్క్స్ నీడతో మెరిసిన చంద్రుడు కాదు. మార్క్స్‌లాగే ఆయన కూడా స్వయం ప్రకాశం గలవాడే. ఇది మార్క్స్‌ను తగ్గించి చూపడం ఎంతమాత్రమూ కాదు. వారు సమఉజ్జీలు అయినందునే అది వారి చిరకాల స్నేహానికి, పరస్పర పూరకమైన రచనల భాగస్వామ్యానికి, శాస్త్రీయ దృక్పథాన్ని పలు రంగాలకు అన్వయించడానికి స్థిరమైన పునాది అయ్యింది.

ఎంగెల్స్ చదువు హైస్కూల్ మధ్యలోనే ఆగిపోయింది. స్వయంకృషితోనే అర్థశాస్త్రం, మానవ పరిణామ చరిత్ర అధ్యయనంతోపాటు తత్వశాస్త్రం, సైన్స్, సాహిత్యం, మిలటరీకి సంబంధించిన విషయాలతోపాటు అనేక రంగాలలో మంచి పరిజ్ఞానం పొందారు. ఇంగ్లీషులో ప్రావీణ్యంతోపాటు దాదాపు 20 భాషలు నేర్చుకున్నారు. మార్క్స్, ఎంగెల్స్‌లు మొదటసారి 1842లో కొలోన్‌లో కలుసు కున్నారు. ఈ సమావేశంలో వారు ఒకరిని గురించి మరొకరు ప్రత్యేకంగా తెలుసు కున్నది ఏమీ లేదు. 1844లో పారిస్ నుంచి యంగ్ హెగెలియన్ ఆర్నాల్డ్ రూజ్ ప్రచురిస్తున్న 'ది జర్మన్, ఫ్రెంచ్ ఇయర్ బుక్' రూపకల్పనలో భాగస్వామిగా మార్క్స్ అక్కడికి వెళ్లారు. దీనిలో ప్రచురణ కోసం ఎంగెల్స్ రాసిన 'అవుట్ లైన్స్ ఆఫ్పొలి టికల్ ఎకానమీ' వ్యాసం మార్క్స్‌ను విశేషంగా ఆకట్టుకుంది. ఇది ఒక పురోగామి మేధావి రచనగా పేర్కొన్నాడు. జర్మనీ వెళ్ళేటప్పుడు తనతో పారిస్‌లో కొన్ని రోజులు ఉండేలా రమ్మని ఎంగెల్స్‌ను కోరాడు. అలా వారిద్దరూ 1844 ఆగస్టులో పారిస్‌లో

పది రోజులపాటు కలిసి వున్నారు. ఈ పది రోజులలో వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. చారిత్రకాభివృద్ధి క్రమంలో బూర్జువా సామాజిక వ్యవస్థ ఒక దశ మాత్రమేనని అది మారి తీరుతుందనీ కార్మికవర్గం ఆ మార్పును సాధించే విప్లవకర వర్గమనీ అదే సోషలిజానికి లేదా కమ్యూనిజానికి మార్గం అని ఉభయులూ భావించారు. ఇవి చర్చల నుంచి వచ్చిన భావ సారూప్యత కాదు. అంతకుముందే ఎవరికి వారుగా వచ్చిన నిర్ధారణలు. పైగా వేర్వేరు మార్గాల ద్వారా పొందినవి. బ్రిటీష్ క్లాసికల్ అర్ధశాస్త్రాల, బ్రిటీష్ లేబర్ ఉద్యమాల అధ్యయనం ద్వారా ఎంగెల్స్, మరోపక్క మార్క్స్ ఫ్రెంచ్ విప్లవాన్ని, దాని నుంచి ఉత్పన్నమైన కార్మికవర్గ రాడికలిజం, సోషలిస్టు సమానత్వ భావజాలాల అధ్యయనం నుండి పైనిర్ధారణలకు చేరుకున్నారు. ఇలా మార్క్స్, ఎంగెల్స్‌లు భిన్న మార్గాలలో ఒకే లక్ష్యానికి చేరుకున్న మేధా సంపన్నులు.

ఈ దిగ్గజాల కలయికతో మార్క్సిస్టు సిద్ధాంతం రూపుదిద్దుకోడానికి మూలా ధారాలైన బ్రిటీష్ క్లాసిక్‌ల అర్థశాస్త్రం, ఫ్రెంచ్ ఊహాజనిత సోషలిజం, జర్మన్ క్లాసికల్ ఫిలాసఫీలు ఒక్కచోటికి చేరినట్లయింది. ఒకే లక్ష్యం కోసం ఏకమైన ఈ ఇద్దరూ చివరి వరకు అదేబాటలో నడిచారు. ఓ పక్క విప్లవ సిద్ధాంతాలకు పదును పెట్టడం, మరోపక్క దానిని ఆచరణలో పెట్టగల విప్లవ కార్మికోద్యమాన్ని నిర్మించే పనిలో పూర్తిగా నిమగ్నమయ్యారు.

ఎంగెల్స్ పారిస్‌ను వదిలి వెళ్లే ముందే 'ది హెూలీ ఫ్యామిలీ–ఎక్రిటిసిజం ఆఫ్ క్రిటికల్ క్రిటిసిజం' పుస్తకంలో తొలి ప్రకరణం రాసిఇచ్చాడు. మార్క్స్ దానిని పూర్తి చేశారు. తర్వాత 1848లో కమ్యూనిస్టు లీగ్ కోసం ఎంగెల్స్ ముందుగా 'కమ్యూ నిస్టు సూత్రాలు' పేరుతో, ప్రశ్నలు జవాబుల రూపంలో ముసాయిదాను రాశారు. అది మార్క్స్ –ఎంగెల్స్‌ల ఉమ్మడి రచనగా నేటికీ ప్రపంచ ప్రసిద్ధమైన 'కమ్యూని స్టు ప్రణాళిక'కు ప్రాతిపదిక అయ్యింది. మార్క్స్ రచనలలో చాలా వాటికి అర్థవంత మైన ముందు మాటలను ఎంగెల్స్ రాశారు.

మార్క్స్‌కు తీరిక దొరికినప్పుడు న్యూయార్క్ ట్రిబ్యునల్‌కు ఆయన పేరుతో ఎంగెల్స్ కొన్ని వ్యాసాలు రాశారు. అలా విడదీయ రాని భావజాల అనుబంధం వారిది. ఎంగెల్స్ స్వీయ రచనలు చాలా ప్రసిద్ధమైనవి. మార్క్సిజాన్ని పలు రంగాల కు వర్తింపజెయ్యడం ద్వారా దానిని మరింత సుసంపన్నం చేశాడు. యాంటీ డ్యూరింగ్ గ్రంథంలో మార్క్సిస్టు తత్వశాస్త్రపు మూలసూత్రాలు విస్పష్టంగా, హేతు బద్ధంగా విపులీకరించాడు. ఆర్థిక సిద్ధాంతానికి శాస్త్రీయమైన పునాదులు వేశాడు.

తర్వాత కార్మికుల కోసం ఈ పుస్తకంలోని కొన్ని భాగాలను వేరు చేసి 'సోషలిజం : ఊహాజనితము శాస్త్రీయం' అన్న పేరుతో ప్రచురించారు. సోషలిజానికి శాస్త్రీయ పునాదిని ఆవిష్కరిస్తూ గతితర్కాన్ని, చారిత్రిక భౌతికవాదాన్నీ విపులీకరించాడు. ఎంగెల్స్ రచనలలో ఈ పుస్తకం ప్రపంచవ్యాపితంగా అత్యంత ప్రాచుర్యాన్ని పొందింది.

ఎంగెల్స్ మరో రచన 'ప్రకృతి గతితర్కం' : ఇందులో ఆయన తన కాలపు ప్రకృతి విజ్ఞాన శాస్త్రాలు సాధించిన అతి ముఖ్యవిజయాలన్నింటికీ తాత్విక పరమైన సాధారణీకరణలు చేశాడు


లుడ్విగ్ ఫ్యూయర్ బాక్ 'సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి' అనే పుస్తకంలో తత్వశాస్త్రపు మౌలిక సమస్య చైతన్యానికీ అస్తిత్వానికీ, పదార్థానికి భావానికీ మధ్య ఉన్న సంబంధాలకు సంబంధించినదే అన్న ప్రధానాంశాన్ని ఎంగెల్స్ శాస్త్రీయంగా నిరూపించాడు.

జర్మనీలో రైతు యుద్ధం పేరుతో రాసిన పుస్తకంలో కార్మిక వర్గానికి రైతాంగంతో గల విప్లవకర భాగస్వామ్యాన్ని చరిత్ర మూలాల నుంచి ఆవిష్కరించాడు. 'కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం' అన్న పుస్తకంలో చారిత్రకంగా సాగిన సామాజిక అభివృద్ధి క్రమాన్ని విశ్లేషించాడు. వీటికితోడు మార్క్స్ మరణానంతరం ప్రచురణకు సిద్ధంగా లేని కాపిటల్‌లోని రెండు, మూడు భాగాలను పరిష్కరించి ప్రచురించితన చిరకాల మిత్రుని కలను సాకారం చేశాడు. అదే కాలంలో అంతర్జాతీయ కార్మికోద్యమ నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశాడు. మార్క్స్ మరణానంతరం తానే సారధిగా కొత్తసోషలిస్టు ఇంటర్నేషనల్ స్థాపనకు పూనుకున్నాడు. 22 దేశాలకు ప్రాతినిధ్యం వహించే 407 మంది ప్రతినిధులు 1889 జూలై14న పారిస్‌లో మార్క్సిస్టుల మొదటి మహాసభ జరిగింది

'సకల దేశాల కార్మికులారా, ఏకంకండి !' అన్న నినాదంతో, ఎనిమిది గంటల పని దినాన్నీ, అంతర్జాతీయ కార్మికవర్గ సంఘీభావాన్ని సాధించుకొనేందుకు ఏటా మే 1న ప్రదర్శనలు జరపాలని సూచించింది. 1895 మార్చిలో ఆయన అస్వస్థత తిరగబెట్టింది. 1895 ఆగస్టు 5న రాత్రి పదిన్నర గంటలకి ప్రముఖ పండిత విప్లవకారుడూ, శాస్త్రీయ కమ్యూనిజం మూల పురుషుల్లో ఒకడూ అయిన ఎంగెల్స్ హృదయ స్పందనం శాశ్వతంగా నిలిచిపోయింది. ఎంగెల్స్ ద్విశత జయంతి ఉత్సవాలు అర్థవంతంగా స్ఫూర్తిదాయకంగా జరుగుతాయని ఆశిద్దాం.

# ఆంటోనియో గ్రాంసీని అధ్యయనం చేద్దాం

ఇది ఆంటోనియో గ్రాంసీ 130వ జయంతి సంవత్సరం. గ్రాంసీ ప్రముఖ ఇటాలియన్ కమ్యూనిస్టు. మార్క్స్- ఎంగెల్స్ రచనల తర్వాత ప్రపంచ వ్యాపితంగా గ్రాంసీ రచనల మీద విస్తారమైన చర్చ సాగుతున్నది. పలు స్రవంతుల మేధావులు గ్రాంసీ రచనల మీద చేస్తున్న అధ్యయనాలు వెల్లువెత్తుతున్నాయి. మార్క్స్ ఎంగెల్స్ రచనలను పునాది చేసుకున్న గ్రాంసీ భావజాలానికి అనేక కొత్త కోణాలను ఆవిష్కరించి మనకు కొత్తచూపును ఇచ్చాడు. మార్క్స్ ఎంగెల్స్ రచనలలోని పునాది ఉపరితలం విశ్లేషణల మీద వారి కాలంలోనే అనేక వక్రీకరణలు జరిగాయి. మార్క్సిజాన్ని కేవలం ఆర్థిక నియతివాదంగా కుదించిన కుహనా మార్క్సిస్టులను ఎద్దేవా చేస్తూ మార్క్స్ స్వయంగా 'నేను మార్క్సిస్టుని కాను' అని ప్రకటించుకోవలసి వచ్చింది. ఆ తర్వాత 1890లో జె.బ్లోష్కి ఎంగెల్స్ రాసిన లేఖలో ఈ ఆర్థికవాద దింపును తిరస్కరిస్తూ 'యువ కులు ఒక్కొక్కసారి ఆర్థిక పార్శ్వానికి దానికి యోగ్యమైన దాని కన్నా ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తున్నారంటే, ఈ దోషంలో స్వయంగా మార్క్సుకూ, నాకూ పాక్షికంగా కొంత బాధ్యత ఉంది. ఆర్థిక అంశాన్ని తిరస్కరించిన మా ప్రత్యర్థులకు వ్యతిరేకంగా,




ఆ ప్రధాన సూత్రాన్ని మేము నొక్కి చెప్పాల్సి వచ్చింది. పరస్పర వర్తనలో ఇమిడి వున్న యితర అంశాలకు సముచితమైన స్థానాన్ని ఇచ్చే వ్యవధి గాని, స్థలం గాని, అవకాశం గాని మాకు అన్నప్పుడు లభ్యం కాలేదు' అని రాశాడు.


గ్రాంసీ తన రచనలలో మార్క్స్ ఎంగెల్స్ విశ్లేషించిన సామాజిక పునాదిపై నిలబడి ఉపరితలంపై లోతైన విశ్లేషణ చేసి పునాది - ఉపరితలాల పరస్పరవర్తనలో ఇమిడి వున్న అంశాలను ఆవిష్కరించి మార్క్సిజాన్ని సుసంపన్నం చేశాడు. ఆర్థిక పునాది స్థాయిలో మౌలిక వర్గమైన కార్మికవర్గం తన పరిశ్రమలో లేదా అదే తరహా పరిశ్రమలలో జరిగే దోపిడీ మీద, పని పరిస్థితుల మీద జరిగే పోరాటాన్ని తొలి

దశగానూ, తర్వాత వివిధ రంగాలకు చెందిన భిన్నతరహా పనులు చేసే శ్రామికులందరూ పరస్పరం సహకరించుకుంటూ ఒకే వర్గం అన్న భావనతో చేసే వర్గ పోరాటాలను రెండవ దశగానూ విశ్లేషించారు. ఇది పునాదిస్థాయిలో జరిగే ఆర్థిక పోరాటంగా వివరించాడు. పెట్టుబడిదారీ వర్గ పాలన అంతం కోసం కార్మిక వర్గం పోరాటం సాగించే దశ ఆర్థిక పోరాటం నుంచి రాజకీయ పోరాటంగా మారడాన్ని వివరించాడు. ఆర్థికపోరాటం ప్రధానంగా పునాదిస్థాయిలో జరిగితే రాజకీయ పోరాటం ఉపరితలంలో పౌరసమాజంలో జరుగుతుందని విశ్లేషించాడు. పాలకవర్గాలు తమ వర్గపాలనను స్థిరపరచుకోవడానికి పౌర సమాజ సమ్మతిని, రాజకీయ అధికారాన్ని వినియోగించిన తీరును వెల్లడించాడు. దీనికి ప్రతిగా మౌలిక వర్గమైన కార్మికవర్గం పౌరసమాజంలో అత్యధికుల సమ్మతిని పొందడానికి అది ప్రత్యేకమైన పాత్రను పోషించాలని, రాజకీయ పోరాటం కార్మికవర్గ ఒంటరి పోరాటం కాదని అది సమాజంలోని ఉపశ్రేణుల సమ్మేళనంగా ఒక చారిత్రక సంఘటన ద్వారా జరగాలని సూత్రీకరించారు. అందుకోసం కార్మికవర్గం తన స్వప్రయోజనాలకే పరిమితం కాకుండా ఉపశ్రేణులందరి ప్రయోజనాలకు గొంతునివ్వడానికి వీలుగా తన ఏకైక ప్రయోజనాలను కొన్నింటిని వదులుకోవాలని, అది మొత్తం జాతి ప్రయోజనాలను ప్రతిబింబించే శక్తిగా రూపొందాలని ప్రకటించాడు. ఈ చారిత్రక సంఘటన రూపుదిద్దుకోవడానికి, స్థిరపడడానికి తగిన ఉమ్మడి ప్రపంచ దృక్పథాన్ని సాధించాలని, దానికి సవర్గ మేధావుల ఆవశ్యకతని, ప్రజలలో నెలకొన్న లోకుల జ్ఞానాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చే సాంస్కృతిక విప్లవం ఎంతో ప్రాధాన్యత గలదిగా ఆయన భావించారు. రాజకీయ అధికారం సాధించడానికి ముందే పౌరసమాజం మీద సమ్మతితో కూడిన ఆధిపత్యాన్ని సాధించాలని దానిని యుద్ధ సన్నాహంగా పేర్కొంటూ ఇది జరిగితే రాజ్యాధికారం సిద్ధించడం తథ్యం అని స్పష్టం చేశాడు. ఇలా కార్మికవర్గ పోరాటం రాజకీయ పోరాటంగా పరిణమించడానికి సాగించాల్సిన బహుముఖ కార్యాచరణకు గ్రాంసీ రచనలు ప్రేరణగా వుంటాయి. విప్లవాలు ఏ రూపంలో జయప్రదం కావాలన్నా పౌరసమాజంలో సమ్మతితో కూడిన ఆధిపత్యాన్ని సాధించడం అన్న కీలక అంశాన్ని మన ముందుంచారు. వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా ఉపకరించే గ్రాంసీ రచనలను అన్ని స్రవంతుల ప్రజా ఉద్యమకారులు అధ్యయనం చెయ్యాలి. జాతీయస్ఫూర్తి ప్రత్యేక సంచిక అలాంటి అధ్యయనానికి, ఆచరణకీ ప్రేరణ ఇస్తుందని భావిస్తున్నాము. ఈ సంచికలో బహు స్రవంతుల మేధావులు గ్రాంసీ భావజాలాన్ని పరిచయం చేస్తూ విలువైన వ్యాసాలు అందించారు. వారికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

# గ్రాంసీ : ప్రజా విప్లవానికి మరో దారి

**- డి.వి.వి.యస్.వర్మ**

ఆంటోనియో గ్రాంసీ ప్రముఖ ఇటాలియన్ కమ్యూనిస్టు. కాని ఆయన భావజాలం ఇటలీకి మాత్రమే పరిమితమైంది కాదు. మార్క్స్ రచనల తర్వాత ప్రపంచం అంతటా గ్రాంసీ రచనల మీదే చర్చోపచర్చలు సాగుతున్నాయి. మనదేశంలో గ్రాంసీ పేరు పెద్దగా ప్రాచుర్యంలో లేదు. ఉపశ్రేణుల రాజ్యాధికారం సమస్యల చుట్టూ సాగుతున్న చర్చలలో గ్రాంసీ ప్రస్తావన విస్తారంగా కనిపిస్తున్నది. అయితే అది మేధోపరమైన చర్చకే పరిమితం అయింది.




గ్రాంసీ రచనలు మార్క్సిజానికి కొన సాగింపు దాని భావజాల పరిధిని ఆయన విస్తరింపజేశాడు. కొత్త చిగురులు తొడిగాడు. పర్యవసానంగా ప్రజా విప్లవాలకు కొత్త కోణాలను ఆవిష్కరించాడు. మార్క్సిజానికి కొత్త పదబంధాలు జత అయ్యాయి. కొత్త భావాభివర్గాలు రూపుదిద్దుకున్నాయి. ఇది మార్క్సిజానికి ఆయన తెచ్చిన గుణాత్మకమైన పరిణామం. అవే మార్క్సిజానికి కొత్త రూపునిచ్చాయి. ఎప్పుడైనా గుణాత్మక మార్పులు ఒక పట్టాన అర్థం కావు. అంత తేలికగా వంట బట్టవు. ఎందుకంటే గుణాత్మక మార్పులు పాతను తనలో ఇముడ్చుకుని కొత్తను ఆవిష్కరిస్తుంది. మార్క్సిజాన్ని సృజనాత్మక సిద్ధాంతంగా భావిస్తే గ్రాంసీ సాధించినది మనకి అవగతమవుతుంది. మార్క్సిజాన్ని పిడివాదంగా నియతివాదంగా కుదించుకుంటే గ్రాంసీ మార్క్సిజానికి దూరమైనట్లు లేదా విరుద్ధమైనట్లు కనిపిస్తాడు.

గ్రాంధీ జైలు రచనలు రూపుదిద్దుకున్నాయి. పశ్చిమ దేశాలలో రాజ్య వ్యవస్థను "సమీకృత రాజ్య వ్యవస్థలుగా పలు సందర్భాలలో పేర్కొన్నాడు. అది రాజకీయ వ్యవస్థ, పౌర సంస్థల సమ్మేళనంగా వాటిని వేరు చేసి విశ్లేషించాడు. రాజకీయ భాగంలో సైనిక బలగాలు, పోలీసు, బ్యూరోక్రసీ, న్యాయ వ్యవస్థ, జైళ్లు వగైరా

అణచివేత సంస్థలుంటాయి. మరో పక్క పౌర సమాజంలో ట్రేడ్ యూనియన్లు, చర్చి విద్యా సంస్థలు, సాంస్కృతిక సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలుతో పాటు మహిళలు, మైనారిటీల ప్రత్యేక సంస్థలు, భాషా ప్రాంతీయ సముదాయాల అస్తిత్వ సంస్థలు వుంటాయి. వీటి ద్వారా ప్రజలు ఎంతో వైవిధ్యం గల నంబంధాలను కలిగి వుంటారు. రాజకీయ వ్యవస్థ మనుగడలో ఈ పౌర సమాజం నమ్మతి కీలకపాత్ర పోషిస్తుంది.

పాలక వర్గాల మనుగడకి ఎలాగైతే పౌర నమాజ నమ్మతి ఉపయోగపడుతుందో అదే విధంగా కార్మికవర్గం, దాని ఉపశ్రేణులు రాజ్యాధికారం కోసం సాగించే పోరాటంలోనూ పౌర నమాజం సమ్మతి అలాంటి పాత్రనే పోషిస్తుంది. పౌర సమాజ నమ్మతిని గెల్చుకోవడం అన్న ముఖ్యమైన అంశాన్ని గ్రాంసీ ముందుకు తెచ్చాడు. గ్రాంసీ తన హెజమనీ సిద్ధాంతాన్ని దీని ప్రాతిపదికపైనే రూపొందించాడు. దీంతో హెజమనీ సిద్ధాంతం గ్రాంసీ భావజాలానికి కేంద్రబిందువు అయింది. హెజమనీ అంటే పెత్తనం కాదు, పౌరసమాజం నమ్మతి ద్వారా పొందే ఆధిపత్యం. అలాంటి ఆధిపత్యాన్ని సమాజంలోని ప్రాధమిక వర్గం అంటే కార్మిక వర్గం సాధించడానికి అనుసరించాల్సిన పద్ధతుల్ని గ్రాంసీ మనకు అందించారు.

కార్మికవర్గం ఇతర జీవశ్రేణులతో కలిసి చేసే ఉమ్మడి ప్రయత్నంగానే హెజమనీని ఆయన ప్రస్తావించాడు. ఉపశ్రేణుల నమ్మతిని గెలుచుకోవడానికి కార్మిక వర్గం తన స్వీయ ప్రయోజనాలను కొన్నింటిని వదులుకోవలసి వుంటుంది. మరికొన్నింటిని సవరించుకోవలని వుంటుంది. కార్మికవర్గం ఈ ఉపశ్రేణులన్నింటి ప్రయోజనాలకు, ఆకాంక్షలకు తోడ్పాటునిచ్చేదిగానూ, మద్దతునిచ్చేదిగానూ వుంటే నరిపోదు. తానే వాటికి గొంతునిచ్చేది. అవి కూడా తన ప్రయోజనాలేనని స్పష్టపరిచేది కావాలి. ఈ కలయిక పైపై ఐక్యత కాకుండా ఒక ఉమ్మడి ప్రయత్నంగా, ఉమ్మడి ప్రపంచ దృక్పదంగా రూపుదిద్దుకోవాలి. విడివిడి కలయికగా కాకుండా ఒక ముద్దగా ఏకం కావాలి. అప్పుడే అది వ్యవస్థను మార్చే భౌతిక శక్తి అవుతుంది.


ఇందుకు అవసరమైన పార్టీని మోడరన్ప్రి న్సనూ, తత్వశాస్త్రాన్ని ప్రాక్సిస్ అఫ్ఫి లాసఫీలోనూ, ఈ వర్గాలు రూపొందించుకోవలసిన నవర్గ మేధావుల పాత్రలోనూ, నైతిక, రాజకీయ నాయకత్వ ఆవశ్యకతలోనూ గ్రాంసీ వివరిస్తాడు. భావజాలంలో లోకజ్ఞానం (కామన్ సైన్స్), విచక్షణా జ్ఞానం (గుడెసెన్స్) అనే భావన మరో ముఖ్యమైన అంశం. 'ప్రతి వ్యక్తీ తత్వవేత్త' అంటాడు గ్రాంసీ. తత్వవేత్తల పాత్ర వారు పోషించలేకపోవచ్చును గానీ ఎవరికి వారు తమదైన రీతిలో ప్రపంచాన్ని

అర్థం చేసుకుంటారు. వారు తమకున్న లోకజ్ఞానంతో ప్రపంచాన్ని చూస్తారు. ఈ లోకజ్ఞానంలో తాలూ తప్పలూ వుంటాయి. గతం నుండి నరానరి వచ్చి చేరినవి. నలుగురితో నారాయణా అంటూ ఆచరించేవి. మత వరంగా తెచ్చుకున్న నమ్మకాలు, మూఢ విశ్వాసాలు, అనుభవం నుండి నేర్చుకున్న అంశాలు వగైరాలన్నీ వుంటాయి. లోకజ్ఞానం వైరుధ్యాల పుట్టగా వుంటుంది. అయితే దీనిని తప్పుడు చైతన్యం అని తీసిపారెయ్యకూడదు. అందులో కొన్ని సత్యాలు, అవసరమైన కలగలసి వుంటాయి. అది ప్రజల ప్రపంచం. దానిలోకి చొరబడాలి తప్ప దానికి దూరంగా బైట నుండి అనిర్దిష్టమైన తాత్విక భావాలను రుద్దడం వల్ల అంతగా ప్రయోజనం వుండదు. ఈ లోకజ్ఞానం నుండి విచక్షణా జ్ఞానానికి. ప్రజల్ని నడిపించే సాంస్కృతిక ఉద్యమం తప్పనిసరి అవుతుందని అన్నాడు.

పౌర సమాజం మీద ఆధిపత్యం సాధించకుండా సాగించే తక్షణ యుద్ధం విజయాన్ని చేకూర్చదని, పౌర సమాజం మీద ఆధిపత్యం సాధించడం అంటే ప్రజల లోకజ్ఞానం విచక్షణా జ్ఞానంగా రూపాంతరం చెందినప్పుడు యుద్ధ సంసిద్ధత పరిపూర్తి అవుతుందని అంటారు. ఒకసారి పౌర సమ్మతితో కూడిన యుద్ధ సంసిద్ధత సాధిస్తే దాని విజయాన్ని ఎవరూ ఆపలేరు అంటారు గ్రాంసీ. వామపక్ష శక్తులు పౌర సమాజం మీద ఆధిపత్యాన్ని సాధించడానికి తగిన వ్యూహాలతో ముందుకు సాగాలి. దానికి తగిన రాజకీయ సాంస్కృతిక ఉద్యమాలను రూపొందించుకోవాలి. గ్రాంధీ ప్రజా విప్లవానికి మరోదారి వేశాడు. నిజానికి ప్రజా విప్లవానికి అదే రహదారి.

# గ్రాంసీ 86వ వర్ధంతికి మరో ప్రత్యేక సంచిక

ఏప్రిల్ 27 గ్రాంసీ 86వ వర్ధంతి సందర్భంగా ఈ ప్రత్యేక సంచికను అందిస్తున్నాం. ఇదే సంపాదకవర్గం సారథ్యంలో 2020 నవంబరులో గ్రాంసీ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చెయ్యాలనే తలంపుతో ఒక ప్రత్యేక సంచికను విడుదల చేసింది. ఆంటోనియో గ్రాంసీ ప్రముఖ ఇటాలియన్ కమ్యూనిస్టు. కాని ఆయన భావజాలం ఇటలీకి మాత్రమే పరిమితమైంది కాదు. ప్రస్తుతం ప్రపంచం అంతటా గ్రాంసీ రచనల మీద చర్చోపచర్చలు సాగుతున్నాయి. మన దేశంలో గ్రాంసీ పేరు పెద్దగా ప్రాచుర్యంలో లేదు. ఉపశ్రేణుల రాజ్యాధికారం సమస్యల చుట్టూ సాగుతున్న చర్చలలో గ్రాంసీ ప్రస్తావన విస్తారంగా కనిపిస్తున్నది. అయితే అది మేధోపరమైన చర్చకే పరిమితమైంది.





గ్రాంసీ రచనలు మార్క్సిజానికి కొనసాగింపు. మార్క్సిజం భావజాల పరిధిని ఆయన విస్తరింపజేశాడు. కొత్త చిగురులు తొడిగాడు. పర్యవసానంగా ప్రజా విప్లవాలకు అవసరమైన అనేక కొత్త కోణాలను ఆవిష్కరించాడు. మార్క్సిజానికి కొత్త పదబంధాలు జత చేశాడు. కొత్త భావాభివర్గాలు ఆయన రచనలలో రూపుదిద్దుకున్నాయి. ఇవన్నీ మార్క్సిజానికి ఆయన సృజనశీలనతో తెచ్చిన గుణాత్మకమైన పరిణామాలు. అవే మార్క్సిజానికి కొత్త చూపునీ, కొత్త రూపునీ ఇస్తున్నాయి. ఎప్పుడైనా గుణాత్మక మార్పులు ఒక పట్టాన అర్థం కావు. అంత తేలికగా వంట బట్టవు. ఎందుకంటే గుణాత్మక మార్పులు పాతను తనలో ఇముడ్చుకుని కొత్తను ఆవిష్కరిస్తాయి. మార్క్సిజాన్ని సృజనాత్మక సిద్ధాంతంగా భావిస్తే గ్రాంసీ సాధించినది మనకి అవగతమవుతుంది. మార్క్సిజాన్ని పిడివాదంగా నియతివాదంగా కుదించు కుంటేనే గ్రాంసీని విస్మరించగలుగుతారు. మా తొలి ప్రత్యేక సంచికకు విశేష ఆదరణ లభించింది. ఇది సృజనశీలతకు పాఠకుల సానుకూల స్పందనగా భావిస్తున్నాం.

దాని ప్రేరణతోనే ఈ రెండవ ప్రత్యేక సంచిక రూపుదిద్దుకుంది. ఈ సంచిక గ్రాంసీ భావజాలాన్ని పరిచయం చేస్తూనే మరోపక్క ఆ భావజాలం స్ఫూర్తితో దేశంలోని ఆధిపత్య రాజకీయాల విశ్లేషణ, దానిని ప్రతిఘటించే మార్గాలను ఆన్వేషించే ప్రయత్నం చేస్తున్నది. మనది చాలా ప్రత్యేకతలు కలిగిన దేశం. ఇక్కడి ఆధిపత్య రాజకీయం, ప్రతిఘటన మార్గాలు సంక్లిష్టంగా వుంటాయి. ఏమైనా వాటిని అర్థం చేసుకోడానికి, విశ్లేషించుకోడానికి గ్రాంసీ భావజాలమే దారి దీపం అవుతుంది. ఎందుకంటే పౌరసమాజంలో హెజమనీ (ఆధిపత్య) భావనకు రూపశిల్పి ఆయనే. ప్రత్యామ్నాయ రాజకీయం దిశగా ఈ సంచిక చేస్తున్న ప్రయత్నం తొలి అడుగు మాత్రమే. కొత్త తరహా విశ్లేషణలకు ప్రజా ఉద్యమాల కార్యాచరణకు ఇది ప్రేరణ కావాలి. ఇదొక అన్వేషణ. నిరంతరాయంగా కొనసాగాల్సిన మేథోమధనం. మార్క్సిస్టు భావజాలానికి చెందిన వివిధ స్రవంతుల రచయితలు ఈ ప్రయత్నంలో భాగస్వాములుగా వున్నారు. రచయితలందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు.

# తెలుగులో గ్రాంసీ భావజాలం విస్తరించిన క్రమం

1926 నవంబర్ 8వ తేదీ రోమ్‌లో ఆంటోనీయో గ్రాంసీని ఫాసిస్టు ప్రభుత్వం అరెస్టు చేసి 'ఈ మెదడును 20 సంవత్సరాలపాటు పనిచేయనియ్యరాదని' కోర్టులో వాదించింది. అనేక ప్రత్యేక చట్టాలతో న్యాయస్థానం 20 సంవత్సరాల నాలుగు నెలల ఐదు రోజులు జైలు శిక్ష విధించింది. తరువాత పదేళ్లపాటు జైలులో శారీరక, మానసిక బాధలను అనుభవిస్తూ 1937 ఏప్రిల్ 27న మెదడులో రక్తస్రావం వలన గ్రాంసీ మరణించాడు. గ్రాంసీ మేథస్సు పనిచేయనేకూడదని భావించిన పరిస్థితుల్లో కూడా క్రియాశీలంగా పనిచేస్తూనే ఉంది. జైలులో ఆంటోనీయో గ్రాంసి తన ఆలోచనలను 32 నోట్‌బుక్స్‌గా నిక్షిప్తం చేశాడు. అవే 'ప్రిజన్ నోట్స్'గా ఇప్పుడు ప్రాచుర్యంలో వున్నాయి. తొలుత ఇటలీ భాషలోనే ప్రచురితం కావడంతో గ్రాంసీకి అంతర్జాతీయంగా గుర్తింపు రాలేదు. 1970 దశకంలో గ్రాంసీ జైలు నోట్ బుక్స్ ఇంగ్లీషు అనువాదం వచ్చిన తర్వాత ఆయన రచనల మీద ప్రపంచ వ్యాపితంగా చర్చ ప్రారంభమైంది. మార్క్సిస్టు భావజాలానికి కొంత విస్తృ తిని, కొత్త కోణాలను, కొత్త చూపునీ ఇచ్చిన వానిగా గుర్తింపు పొందాడు. ఇప్పుడు ప్రపంచమంతటా గ్రాంసీపై విస్తృత చర్చలు జరుగుతున్న ప్పటికీ, భారతదేశంలో అంతంతమాత్రంగానే వుంది. అరుదుగా ఉపశ్రేణుల విశ్లేషణ లలో మాత్రమే గ్రాంసీని ఉటంకిస్తున్నారు. దేశంలో ప్రధాన స్రవంతి రాజకీయ చర్చలలో గ్రాంసీ భావజాలానికి తగిన స్థానం నేటికీ దక్కడం లేదు. తెలుగు నేలకు గ్రాంసీ రాక





మరింత ఆలస్యం అయింది. తొలుత గ్రాంసీని తెలుగు పాఠకులకు పరిచయం చెయ్యడానికి రెండు చిన్న పుస్తకాలు 20 శతాబ్ది చివరిలో వచ్చాయి. కాని, అవి గ్రాంసీని ఇక్కడ స్థిరపరచకుండానే కనుమరుగయ్యాయి. (సుశీ తారు రచించిన 'గ్రాంసి జీవితం-కృషి' హెచ్చార్కె అనువాదం-మరో పుస్తకం పొట్లూరి వెంకటేశ్వరరావు తెలుగులోకి అనువాదం చేసిన ఆంటోనియో గ్రాంసీ జైలు రాతలు-మేధావులు, విద్య). తణుకు స్టడీ సర్కిల్ చర్చలలో డీవీవీయస్ వర్మ గారు పలు సందర్భాలలో గ్రాంసీని ప్రస్తావించడంతో ఆయన భావజాలాన్ని అధ్యయనం చెయ్యడం, ప్రచారంలోకి తేవడం అవసరమని మా బృందం భావించింది. దాని పర్యవసానంగా వర్మ గారి ఆహ్వానంతో 2019 ఏప్రిల్ 28న తణుకులో గ్రాంసీ భావజాలంపై మిత్రుల సమాలోచన సమావేశం జరిగింది. (ఏప్రిల్ 27 గ్రాంసీ 82వ వర్ధంతి) ఈ సమావేశానికి గ్రాంసీని అధ్యయనం చేస్తున్నవారు, చేయాలనే ఆసక్తి గలవారు వచ్చారు. గ్రాంసీ రచనల అధ్యయనం ఆవశ్యకతను ఈ సమావేశం అందరిలోనూ కల్పించింది. ఈ సమావేశానికి వచ్చిన జేవీ సత్యనారాయణమూర్తి గారు విశాఖపట్నంలో గ్రాంసీ రచనలపై సమాలోచన సమావేశం నిర్వహించారు. గ్రాంసీ భావజాలం నేపథ్యంలో 'ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు' పేరుతో శ్రీ డీవీవీయస్ వర్మ రాసిన పుస్తకం 2020 సెప్టెంబరు 1న వెలువడింది. దానికి విశేష ఆదరణ ప్రచారం లభించింది. నెల తిరగకుండానే 2000 కాపీలతో మలి ముద్రణ వేయ్యాల్సి వచ్చింది. జేవీ సత్యనారాయణమూర్తి గారి ప్రయత్నం ఫలితంగా సుశీ తారు పుస్తకాన్ని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించి తెలుగు పాఠకులకు గ్రాంసీ జీవితమూ-కృషిని అందుబాటులోకి తెచ్చింది.



**2019 ఏప్రిల్ 28 - గ్రాంసీ సమాలోచన సమావేశం, తణుకు**


తెలుగు పాఠకులకు గ్రాంసీ భావజాలంలోని పలు భావనలను పరిచయం చేయటానికి గ్రాంసీ 130వ జయంతి సందర్భంగా మా సంపాదక బృందం సారథ్యంలో జాతీయస్ఫూర్తి పత్రిక ప్రత్యేక సంచిక నవంబరు 2020లో వెలువడింది. అన్ని వామపక్ష స్రవంతులకు చెందిన 17 మంది ప్రముఖ రచయితల వ్యాసాలతో 100 పేజీల ప్రత్యేక సంచిక రాష్ట్రంలో సంచలనం కలిగించింది.

మార్క్సిస్టు మాసపత్రికకు ప్రస్తుతం సంపాదకులుగా వున్న ఎస్.వెంకట్రావు గారి స్వతంత్ర రచన 'మార్క్సిస్టు మేధావి-ఆంటోనియో గ్రాంసీ' పుస్తకాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ చేసిన ప్రచురణతో తెలుగులో మరో పుస్తకం అందుబాటులోకి వచ్చింది. 2021 మార్చిలో మేము తణుకులో శ్రీ కలిదిండి భీమరాజు గారి జయంతి సభలో గ్రాంసీ భావజాల సమాలోచనపై జరిగిన గోష్టులకు అనూహ్య స్పందన లభించింది. వివిధ జిల్లాల నుంచి పలు రంగాల ప్రముఖులు పాల్గొని చర్చలలో భాగస్వాములయ్యారు. తిరిగి 2023 మార్చి 19న  తణుకులో జరిగిన కలిదిండి భీమరాజు జయంతి సభలో 'గ్రాంసీ భావజాలం వెలుగులో', 'భారతీయ ఫాసిజం ప్రత్యేకతలు-ప్రతిఘటన మార్గాలు' అనే అంశంపై చర్చా గోష్టులు జరిగాయి. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరుకావడమే కాదు దాదాపు 30 మంది చర్చలలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవ తెలంగాణ, ప్రజాపక్షం దినపత్రికలలో, మార్క్సిస్టు, కమ్యూనిజం, వీక్షణం మాసపత్రికలలో, కొలిమి అంతర్జాల పత్రికలలో గ్రాంసీ భావజాలంపై వ్యాసాలు వస్తున్నాయి. ఇటీవల ఆంధ్రా యూనివర్సిటీ, నన్నయ యూనివర్సిటీల పొలిటికల్ సైన్స్‌లో రాజకీయ ఆలోచనాపరుల పాఠ్యాంశంలో గ్రాంసీ చోటు దక్కించుకున్నాడు. ఇప్పుడు తెలుగు గడ్డ మీద గ్రాంసీ భావజాలాన్ని సీరియస్‌గా అధ్యయనం చేస్తున్న వారి సంఖ్య, వ్యాసాలు రాస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఇప్పుడు గ్రాంసీ 86వ వర్ధంతి సందర్భంగా దారిదీపం పత్రిక ప్రత్యేక సంచిక వెలువడుతోంది. తెలుగు నేల మీద గ్రాంసీ భావజాలం తొలి అడుగుల దశను దాటి నిస్సందేహంగా నడక ప్రారంభించింది. నిరంతర విస్తరణ క్రమంలో ముందుకు సాగుతున్నది.త్వరలోనే కొత్త తరహా ప్రజా ఉద్యమాలకు గ్రాంసీ భావజాలం దారి దీపం అవుతుందని ఆశిద్దాం.

# దీపధారి.. చక్రవర్తుల రాఘవాచారి

**చ**క్రవర్తుల రాఘవాచారి ఒక అరుదైన నిరాడంబరుడు. అరుదైన ఎందుకంటే నిత్యం మన చుట్టూ కనిపిస్తున్న నిరాడంబరత్వ నటనలో కృత్రిమత్వం అధికపాళ్లలో కనిపిస్తుంది. ఇతరుల మెప్పు కోసం వేసే సాధారణ వస్త్రధారణ, తెచ్చిపెట్టుకున్న చిరునవ్వులు, ఒలకబోసే ఆప్యాయతలు అందులో భాగంగా చేసే ఆలింగనాల రూపంలో అది దర్శనం ఇస్తుంది. రాఘవాచారికి ఇలాంటి నటన తెలియదు. కృత్రిమత్వం ఏ కోశానా కనిపించదు. ఆయన సాధారణ ధవళ వస్త్రధారి. హోదాలతో నిమిత్తం లేని స్నేహశీలి. మనసుతో పలకరిస్తాడు. మనల్ని వివశుల్ని చేస్తాడు. ఈ నిరాడంబరత ఆయన జీవన విధానం. అందుకే అది అంత సహజంగా, స్వచ్ఛంగా వుంటుంది. ప్రతి సంవత్సరం దేశంలో, ప్రపంచంలో అత్యంత ధనవంతుల జాబితాను ప్రకటించినట్లే అపార మేధో సంపద గల వారి జాబితానూ ప్రకటిస్తే తెలుగు రాష్ట్రాలలో అగ్రస్థానం రాఘవా చారికే దక్కుతుంది. మిడి మిడి జ్ఞానం గలవాళ్ల మిడిసిపాటుతనం చాలా మందిలో మనం చూస్తున్నాం. జ్ఞాన సంపద శిఖరాలను అధిరోహించిన రాఘవాచారిలో అలాంటి మిడిసిపాటు వీసమంత కూడా కనిపించదు. ఆయన నిగర్వి, స్వోత్కర్ష, ప్రగల్భాలు, వాగాడంబరం, పరుషపదజాల ప్రయోగాలు ఆయనలో కంచు కాగడా పెట్టి వెదికినా కనిపించవు. 'తరువు లతి రసఫల భార గురుత గాంచు" అన్న వాక్యం ఆయనకు అక్షరాల అతికినట్టు సరిపోతుంది. అలాంటి వినయశీలతే ఆయన నిరాడంబరత్వం. ధనార్జనకు ఆయనకు అనేక అవకాశాలున్నాయి. ఆడంబరంగా జీవించడానికి బోలెడు మార్గాలున్నాయి. ఈ 'అక్షర రుషి' చుట్టూ అనేక అవకాశాల మేనకలు నృత్య గానాలు చేసినా ఆయన పక్కచూపు చూడలేదు. ఆడంబరాలను ఆకర్షణలను దరి చేరనీయలేదు. సాదాసీదా జీవన మార్గాన్నే ఎంచుకున్నారు.



జీవితాంతం సిద్ధాంత నిబద్దత గల 'మార్క్సిస్టు మహర్షి'గానే ఉండిపోయారు.

రాఘవాచారి జీవితమే నిరాడంబరతకు నిర్వచనం. దానికి ఉన్నత ప్రమాణాలను, కొత్త కొలబద్దలను ఆవిష్కరించాడు. రాఘవాచారి ఒక అరుదైన మేధావి. బహుభాషా కోవిదుడు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం, పాండిత్యం గలవాడు. పండితుల పరిధి వేరు, మేధావులు పరిధి వేరు. మేధావులు వర్తమానాన్ని విశ్లేషించి భవిష్యత్తుకు ద్వారాలు తెరుస్తారు. గతం మీద తెలివిడిలేని వర్తమాన విశ్లేషణ అసమగ్రమే కాదు లోపభూయిష్టం అవుతుంది. అందుకే కార్ల్ మార్క్స్ తన కాలపు పెట్టుబడిదారీ వ్యవస్థను ఆకళింపు చేసుకోడానికి వివిధ దేశాలలోని వాటి పూర్వసమాజాలను లోతుగా అధ్యయనం చేశాడు. ఈ పూర్వ సమాజాల ప్రభావం ఆయా సమాజాల భవిష్యత్ పరిణామాలపై విశేష ప్రభావాన్ని చూపుతాయని భావించాడు.

రాఘవాచారి చాలా సందర్భాలలో ప్రస్తావించినట్లు మన దేశంలో సంస్కృతం తెలిసిన వారికి ఇంగ్లీషు తెలియదు, ఇంగ్లీషు తెలిసిన వారికి సంస్కృతం రాదు. కొందరికి ఈ రెండూ తెలిసినా ఆయా భావజాలాలు సమన్వయం చేయగల మార్క్సిస్టు దృక్కోణం ఉండదు. అందుచేత చాలామంది ఎవరి ప్రపంచంలో వారు తిరుగుతూ ఒక సమ్యక్ దృక్పథాన్ని ఆవిష్కరించలేకపోతున్నారు. సృజనశీల మేధావికి గతం మీద, వర్తమానం మీద, మార్క్సిస్టు దృక్కోణం మీదా గట్టి పట్టు వుండాలి. ఈ మూడు స్రవంతుల త్రివేణీ సంగమం రాఘవాచారి. ఆయన చేసిన ప్రసంగాలు ఈ స్రవంతుల మేలు కలయికకు నిదర్శనంగా నిలుస్తాయి. నిబద్ధత గల అరుదైన పాత్రికేయుడు రాఘవాచారి. ఈ నిబద్ధత ఆయన ఈ వృత్తిని ఎంచుకున్న క్రమంలోనే రూపుదిద్దుకుంది. ఎందరికో జీవిత లక్ష్యంగా ఉండే ఇంజనీరింగ్ కోర్సులో చేరి మధ్యలోనే దానిని ముగించారు. తర్వాత బి.ఎస్.సి.లో చేరి పట్టభద్రుడైనా ఆ రంగంలోనే చదువు కొనసాగించకుండా న్యాయశాస్త్ర అధ్యయనాన్ని చేపట్టారు. బి.ఎల్. తర్వాత ఎం.ఎల్. చేసినా న్యాయవాద వృత్తిలో స్థిరపడకుండా పాత్రికేయ వృత్తిని చేపట్టారు. ఆయన పదే పదే ప్రజాస్వామ్యం మీద, పత్రికా స్వేచ్ఛ మీద చేసే ఉటంకింపులు న్యాయశాస్త్ర అధ్యయనంలోనివే అయినా అవే పాత్రికేయ వృత్తికి దారి చూపించాయి. ప్రజలే సార్వభౌములు, పత్రికలు పాలితుల పక్షమే గాని పాలకుల పక్షం కాదని, ఈ నాలుగవ ఎస్టేట్ శాసన కర్తలనీ, ప్రభుత్వాలనీ, న్యాయస్థానాలనీ జవాబుదారీతనంలోకి తెచ్చే సాధనమనీ ఆయనకు నేర్పింది న్యాయశాస్త్ర అధ్యయనమే. యువ కార్ల్ మార్క్స్ తన 17వ ఏట 'వృత్తిని

ఎలా ఎంచుకోవాలి' అన్న వ్యాసాన్ని రాశారు. మానవజాతి సంక్షేమానికి, స్వయం పరిణతికీ అవకాశం ఇచ్చే వృత్తిని ఎంచుకుంటే అప్పుడు చేసే త్యాగాలు అందరి కోసం చేసే త్యాగాలు అవుతాయని, అందరి ఆనందమే తన ఆనందం అవుతుందని మార్క్స్ చెప్పిన మాటలు రాఘవాచారి వృత్తి ఎంపికలో మనకు కనిపిస్తాయి. పైగా తన నిబద్ధతకు వామపక్ష పాత్రికేయం అనువైంది. జర్నలిస్టుల శిక్షణా తరగతులలోనూ ఈ వృత్తి ధర్మాన్నే ఆయన బోధించారు. జీవితాంతం దానినే అనువదించి నిబద్ధతగల అరుదైన పాత్రికేయుడుగా శిఖరారోహణ చేశారు. రాఘవాచారి స్వయం కృషీవలుడు.

ఆయనమీద కొన్ని ప్రభావాలున్నా తనదారిని తానే వేసుకున్నవాడు. ప్రశ్నతోనే ఆయన జీవితం మలుపులు తిరిగింది. ఆయన జీవితాన్ని పరిణతికి నడిపించిన చుక్కాని ప్రశ్న. ప్రశ్నోపనిషత్తునీ, ఈశోవాస్యోపనిషత్తుని పలు సందర్భాలలో ప్రస్తావించేవారు. ప్రశ్న నుండే.. ప్రశ్నతోనే పురోగమనం ప్రారంభమైందనీ, కొనసాగిందనీ ప్రగాఢంగా విశ్వసించేవారు. మార్క్స్ చెప్పినట్లు ప్రతి దానినీ సందేహించు అన్నది ప్రశ్నించడమేనన్నది ఆయన ఉటంకింపులలో కనిపిస్తుంది. ప్రశ్నను చంపేసిన ప్రతి సందర్భంలోనూ సమాజం పురోగమనానికి తిలోదకాలు ఇచ్చి వెనక చూపు పట్టిన ఉదంతాలు ప్రస్తావించేవారు. అయితే ప్రశ్నకు ఎదురు లేదంటారు. ఎంత అణిచివేసినా మళ్లీ మళ్లీ పుట్టుకొస్తూనే ఉంటుందంటారు. అదే జరిగి ఉండకపోతే సమాజం ముందుకు సాగేది కాదంటారు. అందుకే ఆయన జీవితంలో ఏనాడూ నిర్వేదానికి తావు ఇవ్వలేదు.

గత కాలపు మూఢాచారాలు, కట్టుబాట్ల మీద తాను సంధించుకున్న ప్రశ్నల నుండి తర్కించగా వచ్చిన సమాధానాలే ఆయన జీవన పథాన్ని ప్రభావితం చేశాయి. ప్రశ్నతోనే పిలక నుంచి క్రాపింగ్‌కు మారాడు. ప్రశ్నతోనే పవిత్ర యజ్ఞోపవీతాన్నీ తీసి పక్కన పెట్టారు. ప్రశ్నతోనే కులాంతర వివాహానికి సిద్ధమయ్యారు.


చాలా కాలం కమ్యూనిస్టు పార్టీ అనుబంధ ప్రజా సంఘాలలో పని చేస్తున్నప్పటికీ, మార్క్సిస్టు భావజాలాన్ని ఆకళింపు చేసుకున్న తర్వాతే, తన ప్రశ్నల నుంచి మార్గాన్వేషణ జరిగిన తర్వాతే పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించాడు. ప్రతి అంశాన్ని ప్రశ్నలతోనే సాగు చేసి పరిణతిని పండించుకున్న స్వయం కృషీవలుడు రాఘవాచారి. ఇది అరుదైన ఒక జీవన పరిణామం.

ఇప్పుడు ప్రశ్నను నిర్బంధించే వాళ్లే పాలకులయ్యారు. ప్రశ్నను సంధించిన వాళ్లను హతమారుస్తున్నారు. సమాజాన్ని వెనకచూపు పట్టిస్తున్నారు. మెజారిటీ మతోన్మాదమే రాజకీయం కాగా మతపరమైన భావోద్రేకాలు ఓట్లు దండుకునే సాధనాలయ్యాయి.

ఇవి వర్తమాన సమస్యల్ని విస్మరించి గతం వైపు పరుగులు తీయించే వెర్రి వ్యామోహాన్ని కలిగిస్తున్నాయి. ఈ రాజకీయ మత్తు కేవలం ఆర్థిక, రాజకీయ పోరాటలతోనే వదిలిపోదు. జన సాంస్కృతిక పునరుజ్జీవనం మాత్రమే ఎదుర్కొనగలదు. ఇలాంటి తరుణంలో పాత కొత్తల మేలుకలయికగా రూపుదిద్దుకోవాల్సిన సాంస్కృతిక పునరుజ్జీవనానికి దారి చూపగల అరుదైన దీపధారి రాఘవాచారి మనమధ్య లేకపోవడం తీరని లోటు. మరెవ్వరూ తీర్చలేని లోటు. ఈ ధవళ వస్త్రధారికి అరుణవర్ణం ప్రీతికరం. అందుకే ఆయనకు అరుణాంజలి.

# బడి చదువు లేని బహుముఖ ప్రజ్ఞాశాలి రాంభట్ల

**రాం**భట్ల శత జయంతి సంచికను ఎలాగైనా తీసుకురావాలన్నది మిత్రులు ఆర్వీ రామారావు సంకల్పం. ఈ సంచిక కోసం ప్రముఖుల వ్యాసాలను సేకరించారు. 2020లో కొవిడ్ కారణంగా అచ్చు ప్రతి వెలువడలేదు. ఆ వ్యాసాలతో జాతీయ స్ఫూర్తి ప్రత్యేక సంచిక ఆన్‌లైన్ ఎడిషన్ తేగలిగాం. కాని, ఆర్వీ రామారావు పట్టు విడవని విక్రమార్కునిలాగా ముద్రణ సంచిక కోసం తపన పడుతూనే వున్నారు. అందుకు దారిదీపం సంపాదకవర్గం సహకారాన్ని కోరారు. ఈ ప్రత్యేక సంచికలో భాగస్వాములను చేసినందుకు ఆర్వీ రామారావు గారికి కృతజ్ఞతలు.




గతంలో సేకరించిన వ్యాసాలకు తోడుగా రాంభట్ల స్వీయ రచనలు, కార్టూన్లు, ఫొటోలు సేకరించి ఈ సంచికలో పొందుపర్చాం. ఆర్వీ రామారావు గారితో కలిసి మా శక్తి మేరకు రాంభట్ల బహుముఖ ప్రజ్ఞను రేఖా చిత్రంగా అందించే ప్రయత్నం చేశాం. రాంభట్ల కృష్ణమూర్తి గారు దారి దీపం సంపాదకవర్గ సభ్యులకు సుపరిచితులు. ఇందులో కొందరు ప్రత్యక్షంగా అరసం కార్యకలాపాలలో వారికి సహచరులుగా వున్నారు.


రాంభట్ల చదివింది నాలుగో తరగతి వరకే. అదీ ఉర్దూ పాఠశాలలో, అంటే ఆయన తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, భాషలతోపాటు చివరకు ఉర్దూను స్వయంగా నేర్చుకున్నారు. ఈ భాషా సాహిత్యాల మీద పట్టు సంపాదించారు. ఒక్క వాక్యంలో రాంభట్లని ఆవిష్కరించలేం. 'స్వయం నిర్మిత మేధో సౌధం' అన్నా 'నడిచే విజ్ఞాన సర్వస్వం' అన్నా 'డిగ్రీలు లేని పాండిత్యం' అన్నా ఏదో ఒక లోటు కనిపిస్తూనే ఉంటుంది. రాంభట్ల ఒక సాహిత్య కారుడు. ఒక చరిత్ర పరిశోధకుడు. ఒక తత్వ శాస్త్ర విశ్లేషకుడు. అరసం ఉద్యమ నేత. ఒక కార్టూనిస్టు. ఒక చిత్రకారుడు. కార్టూన్ గేయాలు, ప్రజా ఉద్యమపాటల కర్త. ఒక అనువాదకుడు. ఒక జర్నలిస్టు.

జర్నలిజం స్కూలుకు ప్రిన్సిపాల్. ఒక ఉపాధ్యాయుడు. ఇలా ఎన్నో అవతారాలలో ఆయన దర్శనమిస్తాడు. నిజానికి రాంభట్ల బహురూపి. ఈ ప్రయత్నాలన్నింటా మార్క్సిస్టు పరిశీలన, విశ్లేషణ ఉంటుంది. రాంభట్ల గొప్ప స్నేహశీలి. వయోభేదం లేని గురువు. అందువల్లే రాంభట్లకు ఆత్మీయుల బృందంతోపాటు ఉద్యమ సహచరులు, సాహితీ మిత్రులు, జర్నలిస్టు శిష్యగణం – అందరూ ఈ సంచికలో దర్శనమిస్తారు. రాంభట్లను శ్లాఘించే వారే కాదు విమర్శించే వారూ వున్నారు. ఎందుకంటే ఆయన పరిశీలనలో, పరిశోధనలో కొత్త చూపు వుంటుంది. కొత్త ప్రతిపాదనలు వుంటాయి. వాటి మీద భిన్నాభిప్రాయాలు వుండడం సహజం. ఆయన గతంలోకి దూరిపోతారు. మార్పుకు దోహదం చేసే కొత్త మెరుపులను పట్టుకుంటారు. జాతి చరిత్ర మూలాల కోసం దేశ సరిహద్దులు దాటి సంచరిస్తారు. మతం, తత్వం కలగలిసిన సంస్కృతిలో ఏదో ఒక కోణానికి పరిమితమై మిగిలిన దానినంతటినీ తోసి పారేసే పద్ధతి ఆయనది కాదు.

ప్రస్తుతం దేశంలో మతోన్మాద శక్తులు గతాన్ని, మతాన్ని చరిత్రనీ తమ స్వంతం చేసుకునే ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారు. ఈ వారసత్వాన్నంతటినీ మతోన్మాదుల పరం కాకుండా చేయాలి. అందుకోసం గతాన్ని లోతుగా మథించే వారు కావాలి. మన సంస్కృతిని ముందుకు నడిపించిన వాటిన ఏ ముసుగులో వున్నా గుర్తించి వెలికి తీసేవారు కావాలి. అవిచ్ఛిన్నంగా సాగిన సంస్కృతీ ప్రవాహానికి ఆధారాలు చెప్పేవారు కావాలి. గతాన్ని మతోన్మాదుల అడ్డా కాకుండా అందరూ దానిని స్వంతం చేసుకునే సమన్వయాన్ని సాధించాలి. ఇలాంటి ప్రయత్నమే రాంభట్ల చేశారు. ఇందులో కొన్ని తప్పటడుగులు వుండి వుండవచ్చును. కాని, నిస్సందేహంగా ఇలాంటి పరిశోధనకు కొత్త దారి చూపిన పథ నిర్దేశకునిగా రాంభట్ల చిరకాలం జీవించి వుంటారు. ఈ విశేష సంచిక ఆయన రచనలను, పరిశోధనలను ఆకళింపు చేసుకోవడానికి దోహదం చేస్తుందని ఆశిస్తున్నాం. ఈ సంచిక వెలుగు చూడడానికి వివిధ రూపాలలో సహకరించిన మిత్రులకు, రచయితలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

# సాహిత్య తత్వానికి దారి దీపం

ఆర్వియార్ ప్రజ్ఞ బహుముఖమైంది. వృత్తిపరంగా ఇంగ్లీషు అధ్యాపకుడు. అధ్యాపకుడే కాదు గొప్ప అధ్యయనశీలి. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు సాహిత్యాల మీద పట్టు వుంది. 'చదువులలో మర్మమెల్ల చదివితి' అన్నట్లు ఈ మూడు భాషల సాహిత్య మర్మాలు తెలిసినవాడు. దీనికితోడు యూనివర్శిటీలో విద్యార్థి ఫెడరేషన్‌లో క్రియాశీల కార్యకర్త. అక్కడ మార్క్సిజంతో పరిచయం, అధ్యయనం మొదలైంది. సాహిత్యతత్వాన్ని విశ్లేషించే సూక్ష్మ దృష్టికి మార్క్సిజం ఆలంబనం అయింది. ఆర్వియార్ 20 వరకు స్వీయ రచనలు చేశారు. అవి కేవలం సాహిత్య విమర్శకే పరిమితం అయినవి కావు. మార్క్సిజం పాఠాలు, చరిత్ర, సంస్కృతి వగైరాలతోపాటు పిల్లల కోసం ఇంగ్లీషు -తెలుగు నిఘంటువు, స్పోకెన్ ఇంగ్లీషు తదితరాలున్నాయి. ఆయన బహుముఖ ప్రజ్ఞకు ఇవన్నీ నిదర్శనాలుగా నిలుస్తాయి. తెలుగు సాహిత్యం మీద నాకు తెలిసి ఐదు పుస్తకాలున్నాయి. రాశిలో తక్కువే అయినా వాసి గల రచనలు. అందులో సాహిత్యతత్వం ఒక అపురూపమైంది. సాహిత్యతత్వాన్ని అవగాహన చేసుకోవడానికి నాటికీ, నేటికీ అదొక దారి దీపం.




కుటుంబరావు శైలి మీద, శ్రీశ్రీ ఆలంకారికత మీద రాసిన సుదీర్ఘ వ్యాసాలు ఆర్వియార్ పరిశోధనకీ, సూక్ష్మ దృష్టికీ తార్కాణాలుగా ఎప్పటికీ నిలిచి వుంటాయి. 20వ శతాబ్ది తెలుగు కవుల మీద ఆర్వియార్ చేసిన రేడియో ప్రసంగాల పుస్తకంలో వున్నవి చిన్న చిన్న వ్యాసాలే అయినా ఉద్దండులైన పలువురి కవులపై 'సాహిత్య పరంగా' ఇచ్చిన తీర్పులు ఆయన సాహిత్య దృక్పథానికి అద్దం పడతాయి. స్వాతంత్ర్య సమర చరిత్ర, మతం–మార్క్సిజం, భగవద్గీత–మార్క్సిజం, ఆంధ్ర సాహిత్య చరిత్రలాంటి స్వీయ రచనలలో మార్క్సిస్టు పరిశీలనా పద్ధతి ప్రస్ఫుటంగా

కనిపిస్తుంది. 140 పైగా పుస్తకాలను అనువాదం చేసి రాటు తేలిన అనుభవంతో రాసిన 'అనువాదాలు - ఆవిష్కరణలు - అవస్థలు' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం ఆశ్చర్యం కలిగించదు. ఆయన పుస్తకాలు, అనువాదాలు, వ్యాసాలకే పరిమితం కాలేదు. 'పనికొచ్చే ముక్క' పేరుతో విశాలాంధ్ర, ఆంధ్రభూమిలో ఆరు సంవత్సరాలపాటు ఒక శీర్షికను నిర్వహించారు. ఇతివృత్తం వర్తమాన రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలే. ఇవి వారం వారం రాసే తేలికపాటి రచనలు కావు. ప్రతి దానిలోనూ పలు భాషా సాహిత్యాల గుబాళింపు వుంటుంది. అలాంటి శీర్షిక ఆయన మాత్రమే నిర్వహించగలరు.

ఆర్వియార్ గొప్ప సంభాషణా చతురుడు. ఆయన రచనలకంటే, ప్రసంగాలకంటే ఆయనతో సంభాషణ ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది. ఆయన మేధో సంపత్తి విశ్వరూపం కనిపిస్తుంది. ఆర్వియార్ గొప్ప స్నేహశీలి, మనం ఫోన్ చేయకపోతే ఆయనే చేస్తారు. 'మనకి కించిత్తు కష్టం వస్తే ఆయన చలించిపోతారు. హుటాహుటిన పరామర్శకి వస్తారు. ఇంటికి వెళితే చాటంత ముఖం చేసుకుంటారు. ఇక ఆయన సహచరి సుందరమ్మ గారి చేతి వంట తినకుండా రావడం అసాధ్యం. ఆర్వియార్ చేసిన బహుముఖ సాహిత్య సేవ విస్మరణకు గురైందని చెప్పలేము. కాని రావలసిన గుర్తింపు మాత్రం రాలేదు. ఈ ప్రత్యేక సంచిక ఆర్వియార్ బహుముఖ సాహిత్య సేవకు ఒక రేఖామాత్ర పరిచయం మాత్రమే. ఆయన రచనలు మరోసారి చదవడానికి ప్రేరణ ఇస్తుందని ఆశిస్తున్నాం. అలాగే ఈ సంచిక తెలుగు సాహిత్య చరిత్రలో ఆర్వియార్ స్థానాన్ని పదిలపరుస్తుందని భావిస్తున్నాం. వ్యాసకర్తలకు, ప్రచురణకు సహకరించిన మిత్రులకు అందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

# ఆదర్శ కమ్యూనిస్టు - అరుదైన కార్మిక నేత

**క**పర్దీ పేరే ప్రత్యేకమైనది. అది సాధారణ వినియోగంలో వున్న పేరు కాదు. పేరుకు తగ్గట్టే ఆయన ఒక అసాధారణ వ్యక్తి. విశిష్టమైన వ్యక్తిత్వం – విలక్షణ నేతృత్వం ఆయన సొంతం. పుట్టింది సంపన్న భూస్వామ్య కుటుంబంలో. ఆ కుటుంబానికి స్వాతంత్ర్యోద్యమ నేపథ్యం వుంది. గుంటూరు ఏసీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. పైగా ఇంగ్లీషు, తెలుగులో మంచి వక్త. ఆ భాషా సాహిత్యాల మీద మక్కువే కాదు. మంచి పట్టు కూడా వుంది. సంస్కృతంలోనూ తగినంత ప్రవేశం వుంది. ఈ ప్రజ్ఞను ఆయన తన స్వంతానికి సంపాదనకు వినియోగించ లేదు. కార్మిక వర్గ కల్యాణానికి, శ్రామిక వర్గ రాజ్యాన్ని సాధించే లక్ష్యానికి వినియోగం చేశారు. 1942లో తాడేపల్లిగూడెంలో అత్యంత నికృష్ట జీవితం గడుపుతున్న పంచాయతీ పారి శుధ్య కార్మికుల సంఘాన్ని స్థాపించ డంతో కార్మికోద్యమ నిర్మాణ ప్రస్థానం ప్రారంభమైంది. 1981లో తుది శ్వాస విడిచే వరకు సమరశీల కార్మికోద్యమ కార్యకలాపాలలోనే జీవితం గడిపారు.




కపర్దీ గారిది గంపెడు సంసారం. భార్య శేషమ్మ గారు, తల్లి, అత్తగారు, ఎనిమిది మంది సంతానం. వీరికితోడు పెంచుకున్న బుజ్జమ్మ, రోజూ వచ్చిపోయే కామ్రేడ్స్. కమ్యూనిస్టు పరిభాషలో ఆ ఇల్లు ఒక కమ్యూన్. మన మాటల్లో ఒక ధర్మసత్రం. నేను కమ్యూనిస్టు పార్టీలో పనిచేయాలన్న ఉత్సాహంతో ఇల్లు వదిలి వచ్చేస్తే కపర్దీ గారు నన్ను ఆ ఇంటిలోనే కొన్ని నెలలపాటు పెట్టుకున్నారు. గూడెంలో కపర్దీ గారికి అపారమైన పలుకుబడి వుంది. హేమా హేమీలైన స్నేహితులు ఉన్నారు. ఆ పరిచయాలను స్వంతానికి వాడుకోలేదు. ఆస్తిపాస్తులు పెంచుకోవడానికి వాడుకోలేదు. ఆ తరానికి చెందిన కమ్యూనిస్టులు కొందరు వచ్చిన అవకాశాలను స్వంతానికి వాడుకున్నారు. సంపన్నులయ్యారు. కపర్దీ గారు అలాంటి దారి తొక్కలేదు. అందుకే ఆదర్శ

కమ్యూనిస్టు అయ్యారు. కుటుంబంలో పిల్లలందరూ ఒకరిద్దరు మినహాయిస్తే మిగిలిన వారంతా కులాంతర వివాహాలు చేసుకున్నారు. సాదా సీదా జీవనం గడుపుతున్నారు. ఆ కుటుంబంలో ఎవరిని కదిలించినా మా తల్లిదండ్రులు మాకు ఏమీ సంపాదించి పెట్ట లేదు అన్నమాట వినిపించదు. పైగా తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛ, పంచిన ప్రేమా నురాగాలాపన చేస్తారు. అందరూ కమ్యూనిస్టులుగా అభిమా నులుగా కొనసాగుతున్నారు. రచ్చ గెలవడమే కాదు ఇంట కూడా గెలిచిన దంపతులు వారు. కార్మికోద్యమంలో ఒక విల క్షణ నేత కపర్ధీ. గూడెంలో ఒక చిన్న సంఘాన్ని స్థాపిస్తే దానిని రాష్ట్రవ్యాపిత సంఘం చేసి అనేక రాష్ట్రస్థాయి సంఘటిత ఉద్యమాలకు ఆయన నేత అయ్యారు. సమస్యల మీద కార్మికుల్ని సమీకరిం చడం అందరూ చేసేపనే. కార్మికులను సమీకరించడం వేరు. వారి మనసులను గెలుచు కోవడం వేరు. కార్మికుల కుటుంబ సమస్యలు, పిల్లల చదువు, ఆరోగ్య సమస్యలు అన్నీ కపర్ధీ గారికి యూనియన్ సమస్యలే. వందల సంఖ్యలో కార్మికుల్ని పేరు పెట్టి పిలవగలిగేవారు. కార్మికుల జీవితాలతో పెనవేసుకుని ఉద్యమాలు నడిపిన విలక్షణ నేత కపర్ధీ.

కపర్ధీ గారు మూర్తీభవించిన ప్రజాస్వామ్యవాది. కమ్యూనిస్టు నాయకుల మీద అపప్రద వుంది. కమ్యూనిస్టు పార్టీ సాధారణ సభ్యుడు కూడా ప్రధానిని ప్రశ్నిస్తాడు, ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తాడు, భూస్వామినీ ప్రశ్నిస్తాడు. కాని ఏ స్థాయిలోనూ పార్టీ కార్యదర్శిని ప్రశ్నించడానికి ధైర్యం చేయడన్న అపవాదు వుంది. కాని, కమ్యూనిజం ప్రశ్నించడాన్ని నేర్పుతుందని అదే చర్చకు, సరైన నిర్ణయాలకు దారి తీస్తుందని మనసా, వాచా, కర్మణా నమ్మిన వారు కపర్ధీ. ఆయన పార్టీ సమావేశాల్లో ప్రశ్నను స్వీకరించడమే కాదు. దానిని చర్చించడాన్ని ఆహ్వానించేవారు. ప్రశ్నలో ఔచిత్యం వుంటే దానిని భేషరతుగా ఆమోదించేవారు. కమ్యూనిస్టు నాయకులలో పరిపూర్ణ ప్రజాస్వామ్య వాది కపర్ధీ గారు. కపర్ధీ శత జయంతి విశేష సంచికను రూపొందించి ప్రచురించే అవకాశం దారి దీపం పత్రిక సంపాదక వర్గానికి కలగడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాం. ఆదర్శ కమ్యూనిస్టు, అరుదైన కార్మిక నేతకు అరుణాంజలి ఘటిస్తున్నాం.

# సూదంటురాయి.. కపర్దీ

**- డివివియస్ వర్మ**

కపర్ది గారు మరణించి 25 సంవత్సరాలైందని కిషోర్ చెప్పే దాకా కాలం ఇంత దూరం సాగిపోయిందన్న స్ఫురణ నాకు కలగలేదు. కాలం మాత్రమే ఇంత కఠోరంగా సమయపాలన పాటిస్తుంది. కాలానికి తెలిసింది ఒకే నడక, ముందు నడక. కాలం కంటే జ్ఞాపకాలు గొప్పవి. ఎందుకంటే కాలాన్ని వెనక్కి నడిపించే శక్తి జ్ఞాపకాలకి వుంది. మన హితుల్ని, సన్నిహితుల్ని కాలం తనలో కలిపేసుకున్నా జ్ఞాపకాలు మాత్రం ఆ తీపి గుర్తుల్ని నెమరువేస్తూనే వుంటాయి. జ్ఞాపకాన్ని అనుభవించినంతగా అనువదించలేం. కపర్ది గారు ఒక్కసారి మనసులో మెదిలితే చాలు సూదంటురాయిలా ఆకర్షించే ఆయన రూపు సాక్షాత్కరిస్తుంది. ఆయన కంచుకంఠం చెవులలో గింగురుమంటుంది. మిత్రులపై ఆయన సాధికారికంగా చేసే ఆజ్ఞాపనలు, గద్దింపులు తలపుకొస్తాయి.

ఒళ్లంతా నోరు చేసుకుని కల్లా కపటం లేని నవ్వు ఆయనే నవ్వగలరు. తప్పు చేస్తే స్వపర భేదం లేకుండా ఆయనే చివాట్లు పెట్టగలరు. తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం మూడు భాషలూ తెలిసిన మనిషి. మంచి సాహిత్యాభిలాషీ. ఆయన ప్రసంగం చేస్తే ఆగి, వినాల్సిందే. విని, ఆలోచించాల్సిందే. జీవితానుభవం రంగరించి ఔపోసనపట్టిన వాడు. శ్రామికుల జీవితాలను అంత దగ్గరగా, అంత లోతుగా తెలిసిన నాయకుణ్ణి, అంతగా వారి జీవితాలతో పెనవేసుకోగల నాయకుణ్ణి నేను మరెక్కడా, మరెప్పుడూ చూడలేదు. శ్రమజీవుల జీవి తాల నుండి పుట్టుకొచ్చిన నాయకుడు. వారి మీద ఆయన పొందిన అధికారం, వారి నుండి ఆయన పొందిన విధేయత, గౌరవాలు యూనియన్ పదవుల వల్ల వచ్చినవి కావు. వారి హృదయాలను గెల్చుకున్న నాయకుడు. కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన ఒక అపురూపమైన వ్యక్తి. అనితరసాధ్యమైనది ఆ వ్యక్తిత్వం.


కపర్ది గారి కుటుంబం అంటే ఆయన భార్యాబిడ్డలు మాత్రమే కాదు. అదొక వలయాల కుటుంబం. బంధువులు, మిత్రులు, కార్యకర్తలు, పాలేర్లు, జీతగాళ్లు అంతా కలగలిసిన కుటుంబం. ఈ వలయాలకి కేంద్ర బిందువులు కపర్దిగారు, శేషమ్మగారు. ఒకరిని మించిన ప్రేమాస్పదులు మరొకరు. నేను ఇల్లు వదిలి కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలలోకి వచ్చాను. మొదట కొద్ది కాలం విమలాదేవి గారింట్లో, కొంత కాలం కపర్ది గారింట్లో, ఎక్కువ కాలం కృష్ణంరాజు గారింట్లో వున్నాను. కపర్దిగారి కుటుంబంతో అనుబంధం జీవితాంతం శాశ్వతబంధం

చేసింది. ఇక పిల్లలు చిన్నప్పటి నుండీ స్వతంత్రులే. వాళ్ల మధ్య చిన్నా, పెద్దా తేడా లేదు. అంతరం లేదు. జీవితంలోనూ అలాగే స్థిరపడ్డారు. కాని ఏకత్వాన్ని ఎప్పుడూ వదిలి పెట్టలేదు. ఈ వలయ కుటుంబతత్వాన్ని విడిచి పెట్టలేదు. అదొక సహజ కుటుంబ వారసత్వ లక్షణం అయ్యింది. కుర్రాళ్లుగా వున్నప్పుడు ఎలా మాట్లాడేవారో ఇప్పటికీ అలాగే మాట్లాడతారు. మధ్యలో వచ్చిన హోదాలు, బోల్తాల పట్టింపులు, అరమరికలు మచ్చుకైనా వుండవు. కపర్ది గారు ఉత్తమ కమ్యూనిస్టు, మంచి ప్రజాస్వామ్యవాది, అన్నిటికీమించి మానవీయమూర్తి. ఈ మూడు కలగలసి వుండడం అరుదు. అందుకే రాజకీయాలలో ఆయన అజాతశత్రువుగా వెలుగొంద గలిగారు. తాడేపల్లిగూడెం పట్టణంలో ఏ అభివృద్ధి సమస్య మీదనైనా అందరినీ కూడగట్టే సూత్రధారి పాత్ర ఆయనే పోషించారు. జిల్లా రాజకీయాలలో ఎన్ని విభేదా లున్నా అందరి మన్ననలను ఆయన పొందగలిగారు. నేను విద్యార్థి ఉద్యమంలో వుండగా ఆయన జిల్లా పార్టీ కార్యదర్శి. నేను జిల్లా కార్యవర్గంలో ఉన్నప్పుడు ఆయన రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు. రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి. ఆయనకు హోదాలు, ప్రొటోకాల్స్ వంటి కృత్రిమ సంబంధాలు అంటలేదు. ఆయనతో మాట్లాడడానికి, పోట్లాడడానికి ఎలాంటి జంకూ వుండేది కాదు. అందుకే స్థాయీ భేదం లేని స్నేహం ఆయనతో మేమంతా చేసేవాళ్ళం. నాకు రాజకీయాలలో గురువుల మీద నమ్మకం లేదు. కాని ఆయనను గురువుగా భావిం చాను. ఎందుకంటే ఆయన మాకు ప్రతిపనీ నేర్పారు. చిన్న బాధ్యత ఇచ్చి నేర్పేవారు. ఆయన పనిగట్టుకుని మా చేత తీర్మానాలు రాయించేవారు. వాటిని మా చేత ప్రవేశ పెట్టించేవారు. రిపోర్టులు, నివేదికలు రాయించేవారు. సమావేశాలలో వాటిని ప్రవేశపెట్టడం, సమాధానాలు చెప్పించడం చేయించేవారు. బహిరంగ వేదికల మీద పని గట్టుకుని మాట్లాడించే వారు. కార్మి కుల సమ్మెలలో తనతోపాటు చర్చలకు తీసుకువెళ్లేవారు. ఇలా ఆయన నేర్పనిదంటూ లేదు. తప్పులు చేస్తే మందలించేవారు. మళ్లీ ప్రేమగా దగ్గరకు చేర్చుకునేవారు.

రాజకీయాలలో గురువుల మాట నాకు నచ్చనిదైనా, ఆయన మాత్రం నాకు గురువు (నాలోని లోటుపాట్లకి గురువు కారణం కాదన్న సవరణతో). కపర్ది గారిని తల్చుకుంటే జ్ఞాపకాల పురాణాలు తెరుచుకుంటాయి. కపర్ది గారితో పరిచయమే నా జీవితానికి మెరుపు. ❑

# మోదీ జైత్రయాత్రకు అడ్డుకట్ట పడుతుందా?

**మే** 26తో మోదీ పాలనకు 8 ఏళ్లు నిండుతున్నాయి. మోదీ సాగిస్తున్న జైత్ర యాత్ర మీద, పాలన ఫలితాల మీద సమాలోచనకు ఇదొక సందర్భం. మోదీకి ఒక భక్త బృందం వుంది. వారు ఈ జైత్రయాత్రకు ఎదురులేదంటారు. 'హిందూరాష్ట్ర' కనుచూపు మేరలోకి వచ్చిందంటారు. మరోపక్క మోదీని విమర్శించే వారున్నారు. 2024లో మోదీ ఓటమి సాధ్యపడేలా లేదంటారు. మోదీకి దీటైన నాయకుడు లేడని, ప్రతిపక్షాలు ప్రశ్నించడానికే తప్ప ప్రతిఘటించే ఉమ్మడి వ్యూహం వారికి లేదంటారు. ఎన్నికల బాండ్ల రూపంలో దానికి అపరిమిత ఆర్థిక బలం వుందని, క్షేత్రస్థాయిలో పుకార్లు నడిపించే పదాతి దళాలు వున్నాయని అంటారు. ఇవన్నీ అందరూ ఏదో మేరకు అంగీకరించే విషయాలుగానే కనిపిస్తాయి. పోతే మోదీ రాజకీయాలను, పాలనా తీరును లోతుగా పరిశీలిస్తే అందులో చాలా వైరుధ్యాలు కనిపిస్తాయి. ఆయన జైత్రయాత్రను అడ్డుకునే బహుకోణాలు కనిపిస్తాయి. అవి ప్రజలు ఆదరించే ప్రత్యామ్నాయ రాజకీయానికి దారులను సూచిస్తాయి.





మొదటిది – మోదీ అనుసరిస్తున్న హిందూత్వ భావజాలం ముందుచూపు గలది కాదు. గతకాలపు వైభవాలను ఆవాహన చేస్తుంది. అనాదికాలపు రాచరికాలను ఆధునిక ప్రజాస్వామ్యంకంటే మిన్నగా భావిస్తుంది. ప్రజల సార్వభౌమాధికారానికి పట్టంకట్టే ఆధునిక రాజ్యాంగానికి భిన్నంగా నిచ్చెనమెట్ల కులాలను, వివక్షను సమర్థించే 'మనుధర్మ శాస్త్రాన్ని' ఆహ్వానిస్తుంది. మనం గతాన్ని తెలుసుకోవాలి. కాని గతంలోకి ప్రయాణించకూడదు. ఎందుకంటే వర్తమాన సమస్యలకు పరిష్కారం ఎంత వెదికినా గతంలో దొరకదు. అది భవిష్యత్తులోనే సాధ్యం అవుతోంది. ఈ గతం మత్తు దాని వైభవం ఎల్లకాలం పనిచేయదు.

జన జీవనం ఎన్ని ఆటుపోట్లు వున్నా ముందుకే సాగుతుంది. వెనక్కి నడవదు. హిందూత్వకు వున్న ఈ వెనకచూపు వదిలించుకునే దారి జనజీవనమే నేర్పుతుంది. రెండోది – భారత జాతీయవాదం స్థానంలో హిందూ జాతీయవాదాన్ని, సాంస్కృతిక జాతీయ వాదాన్ని, మెజారిటీ జాతీయ వాదాన్ని హిందూత్వ తన రాజకీయ సిద్ధాంతం చేసుకుంది. ఇన్ని భాషలు, ప్రాంతాల ప్రత్యేకతలు వాటి ప్రత్యేక సంస్కృతులు, కులాలు, మతాలు, వర్గాలు వున్న దేశంలో ఒకే జాతి, ఒకే మతం, ఒకే భాష, ఒకే ఆహారం, ఒకే ఆహార్యం అన్న నినాదాలు హిందూత్వ సాంస్కృతిక జాతీయవాదాన్ని ప్రతిఘటిస్తాయే గాని, తమ అస్తిత్వాన్ని వదులుకోవు. స్వాతంత్ర్యానంతరం రాష్ట్రాల ఏర్పాటుకు ఈ ప్రత్యేకతలే ప్రాతిపదికగా వున్నాయి. ఒకే భాష మాట్లాడే తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలు ఏర్పడడం ఈ ప్రాంతీయ ప్రత్యేకతలనే స్పష్టం చేస్తున్నది. హిందూత్వ సాంస్కృతిక బుల్డోజర్‌కు బెంగాల్, తమిళనాడు ఎన్నికలలో అడ్డుకట్టలు వేసింది ఈ ప్రత్యేకతలే. భిన్నత్వాన్ని ఆమోదిస్తేనే ఏకత్వం సాధ్యమయ్యే దేశం మనది. భిన్నత్వాన్ని చెరిపేసి ఏకత్వాన్ని సాధించాలన్న హిందూత్వకు ఈ వైవిధ్యం అడ్డుగోడగా నిలుస్తున్నది. ఇక మోదీ ఆర్థిక విధానాలు గురించి చెప్పవలసిన పనిలేదు. నిత్య జీవితంలో వాటిని ప్రజలు అనుభవిస్తున్నారు. సంపన్నులకు రాయితీలు, పేదలపై భారాలు అందరికీ కనిపిస్తున్నదే. దేశంలో విభజన రాజకీయాలపైనా, పేదలపై పడుతున్న ఆర్థిక భారాలపైనా, దళితులు, మైనారిటీల పట్ల వివక్ష పూరిత కక్ష రాజకీయాలు అందరి కళ్ళూ తెరిపిస్తున్నాయి.

వివక్షకు వ్యతిరేకంగా ఆజాదీ నినాదాలతో యూనివర్శిటీ విద్యార్థులు సాగించిన ఉద్యమాలు, మత వివక్షతో కూడిన పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా జరిగిన సామూహిక ఉద్యమాలు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికవర్గం సాగిస్తున్న బంట్లు, ఆందోళనల్లో కోట్లాది మంది పాల్గొంటున్న తీరు నిరసన గళాల నోరు నొక్కే నల్ల చట్టాలపై మేధావులు వ్యక్తం చేస్తున్న నిరసనలు, రైతు ఉద్యమం, దళితుల ప్రతిఘటనలన్నీ మోదీ ఆధిపత్య రాజకీయాన్ని నిలదీస్తున్నవే. ఈ ఉపశ్రేణుల ఉద్యమాలకు ఒక ఉమ్మడి వేదిక రాలేదు. అలాగే మోదీ ప్రభావాన్ని వ్యతిరేకించే పార్టీలు ప్రత్యామ్నాయ రాజకీయానికి ప్రయత్నాలు లేవు. మోదీ ప్రభుత్వాన్ని సవాలు చెయ్యడానికి హిందూత్వ భావనకు వ్యతిరేకంగా భారత్ భావనని, ఆర్థిక అసమానతలు అంతానికి సంపద పంపిణీ మార్గాన్ని, గతంపైనా భవిష్యత్తుపైనా ప్రజల మనోభావాలను, కొత్త ఆకాంక్షలను కలిగించే సాంస్కృతిక ఉద్యమాన్ని రూపొందించగలిగితే మోదీ జైత్రయాత్రకు అడ్డుకట్ట పడుతుంది. అలాంటి ప్రయత్నాలు జరుగుతాయని భావిద్దాం.

# మహిళల ఉద్యమాల నుండి ప్రభవించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం

19వ శతాబ్దంలోనే ప్రపంచంలో అనేక దేశాలలో మహిళలు తమ పని పరిస్థితులను మార్చుకునే పోరాటాలకు నాంది పలికారు. ఈ ఉద్యమాల నేపథ్యం నుండి 1910లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రూపుదిద్దుకుంది. ఇది మౌలికంగా శ్రామిక మహిళల పోరాట దినం. అన్ని రకాల వివక్షలకు వ్యతిరేకంగా అందరు మహిళలు సాగించే ఉద్యమ దినం. శ్రామిక మహిళలు తమ దుర్భర పరిస్థితులపై తిరుగుబాటుగా పని గంటల కుదింపు కోసం ప్రారంభమైన ఉద్యమం అటు తర్వాత విద్యాహక్కు కోసం, రాజకీయంలో పాత్ర కల్పించే ఓటు హక్కు కోసం, సమాన పనికి సమాన వేతనం కోసం, మహిళ తన అస్తిత్వాన్ని ప్రకటించుకోవడానికి, సాధికారతను సాధించడానికి, సమస్త వివక్షల బంధనాలను తెంచుకోవడానికి ఈ ఉద్యమం విస్తరించింది. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఇప్పుడు దేశ దేశాలలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు జరుగుతున్నాయి. దేశల ప్రభుత్వాలే ఈ ఉత్సవాలను నిర్వహించే సంప్రదాయం చాలా దేశాలలో ప్రారంభమైంది. ఈ విస్తృతి మనం ఆహ్వానించదగిందే అయినా దీనివల్ల మహిళలు సాగిస్తున్న ఉద్యమస్ఫూర్తి మసకబారకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళా ఉద్యమం ముందున్నది. ఈ సంవత్సరంపాటు సాగాల్సిన మహిళా కార్యక్రమాలకు ఐక్యరాజ్యసమితి రూపొందించిన నినాదం అర్థవంతంగా ఉంది. 'సవాళ్లను ఎంచు కుందాం – ఐక్యంగా ప్రతిఘటిద్దాం' అన్న నినాదం మహిళలు సాగించే ఉద్యమాల కు ప్రేరణ ఇచ్చేది అవుతుంది. ఈ నినాదాన్ని (Choose to Challenge) వివరిస్తూ చెప్పిన మాటలు మహిళల సాధికారతకు, సాగించాల్సిన




పోరాటాలకు స్ఫూర్తినిచ్చేవిగా వున్నాయి.

'ప్రశ్నిస్తేనే ప్రపంచం జాగృతం అవుతుంది. మన ఆలోచనలకూ ఆచరణకు ఎల్లప్పుడూ మనమే బాధ్యులం. అందుకే, ప్రశ్నించేందుకే మన సిద్ధమవుదాం. ఆడా మగా పక్షపాతాన్ని అసమానతనూ బోనెక్కిద్దాం. మహిళలు సాధించిన ఘనవిజయాలను చాటి చెప్తాం. ఆనందంలో సంబరాలు జరుపుకుందాం. అందరికీ సమాన అవకాశాలుండే ప్రపంచాన్ని అందరం ఒకటై నిర్మించుకుందాం. ప్రశ్నే మార్పుకు దారి తీస్తుంది. ప్రశ్నించేందుకే సంసిద్ధమవుదాం'. ఈ సందేశం మహిళా దినోత్సవ సమావేశాలలో చర్చనీయాంశం కావాలి. మహిళలు సాధించిన ఉద్యమాలను, సాధించిన విజయాలను స్మరించుకుందాం. వాటి నుండి ప్రేరణ పొందుదాం. వివక్షనీ, అసమానతనీ బోనెక్కించే ఉద్యమాలకు ఊపిరిలూదుదాం. సవాళ్లను ఎదుర్కొని సమానత్వాన్ని సాధించే పోరాటాలకు సన్నద్ధులం కావడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తిగా భావిద్దాం.

జాతీయస్ఫూర్తి ప్రత్యేక సంచిక ఈ దిశగా ప్రేరణ పొందడానికి దోహదం చేస్తుందని భావిస్తున్నాం. చిన్న పత్రిక, పేజీలు తక్కువ కావడంతో ఈ సంచికలో కొన్ని వ్యాసాలను సంక్షిప్తంగా ఇచ్చాం. అలాగే చాలా సమాచారాన్ని కుదించి ఇచ్చాం. వివిధ పత్రికల నుండి సేకరించిన సమాచారాన్ని, కొన్ని స్వీయ రచనలను ఇచ్చాం. మహిళలు సాగించిన ఉద్యమాలను, ఉద్యమ నేతలుగా స్ఫూర్తిప్రదాతలైన వారి సంగ్రహ పరిచయాలను, వర్తమానంలో సాగుతున్న ఉద్యమాలను చాలా సంక్షిప్తంగా అందిస్తున్నాం. ఇందులో విస్మరణకు గురైన అంశాలు చాలా వున్నాయి. ఇన్ని పరిమితులలో మహిళా ఉద్యమాల వైవిధ్యాన్ని రేఖామాత్రంగా అందించడానికి చేసిన ఈ ప్రయత్నాన్ని ఆహ్వానిస్తారని ఆశిస్తున్నాం.

# 2021 రిపబ్లిక్ డే ప్రత్యేకతలు

మన రిపబ్లిక్ దినోత్సవాలు వస్తున్నాయి. సంబరాలతో సాగిపోతున్నాయి. సామాన్యులకి మాత్రం అచ్చేదిన్ రావడం లేదు. ఇక ముందువచ్చే జాడ కూడా కనిపించడం లేదు. ఈ రిపబ్లిక్ కోవిడ్ నేపథ్యంలో జరుగుతున్నది. ఈ విపత్తు కూడా సామాన్యుల నెత్తినే పడింది. లక్షలాది మంది ఉపాధిని కోల్పోయారు. కోట్లాది మంది బతుకు బజారుపాలైంది. ఇంతటి కల్లోలంలోనూ కార్పొరేట్లు మాత్రం లబ్ధి పొందారు. ఆర్థిక ప్యాకేజీలో ఉద్దీపనల పేరుతో అయిన కాడికి దండుకున్నారు. అభివృద్ధి, ప్రజాస్వామ్యానికి సంబంధించిన అన్ని సూచీలలోనూ భారత్ స్థానం దిగజారింది. దీనికితోడు రిపబ్లిక్ చుట్టూ హిందూత్వ నీలినీడలు కమ్ముకొస్తున్నాయి. హిందూత్వ లక్ష్యాలను సాధించడానికి మోదీ ప్రభుత్వం వడివడిగా పావులు కదుపుతున్నది. చట్టాల మీద చట్టాలను చేస్తున్నది. ఇప్పటికీ ఒకే దేశం ఒకే పన్ను చట్టాన్ని తెచ్చింది. పన్నులు వేసే హక్కును రాష్ట్రాలకు లేకుండా చేసింది. ఒకే దేశం ఒకే భాష అన్న నినాదాన్ని అదను దొరికినప్పుడల్లా దేశం మీద రుద్దడానికి సిద్ధపడుతోంది. పౌరసత్వ చట్టాల పేరుతో ప్రజల్ని మత ప్రాతిపదికపై చీల్చడానికి పూనుకుంది. ఇప్పుడు ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో ప్రాంతీయ వైవిధ్యాలను ప్రాంతీయ పార్టీల అస్తిత్వాన్ని బలహీనపర్చి దేశాన్ని ఒకే రాజకీయ ముద్దగా చేసి మెజారిటీవాదాన్ని, హిందూత్వ మత జాతీయవాదాన్ని ఎన్నికల ఎజెండా చేయడానికి గట్టి ప్రయత్నాలు ప్రారంభించింది. కాదన్న వాళ్ళ నోరు నొక్కే చట్టాలను, ఈ మూస పద్ధతిని వ్యతిరేకించే వారిని భయభ్రాంతులను చేసే మూకదాడులను ప్రత్యేకించి కొన్ని మతపరమైన, సామాజికపరమైన వర్గాల మీద సాగుతున్నది. ప్రజల సమస్యల చుట్టూ తిరగాల్సిన రాజకీయాన్ని హిందూత్వ




చుట్టూ తిప్పడాన్ని సాగిస్తున్నది. దేశ రాజ్యాంగం మీద, రిపబ్లిక్ లక్ష్యాల మీద నిస్సిగ్గుగా దాడి చేస్తున్నది. ఇలాంటి విపత్కర పరిస్థితులలోనూ కొన్ని ఆశా కిరణాలు కనిపిస్తున్నాయి. కార్మికులు, కర్షకులు మోదీ ప్రభుత్వ విధానాలపై పోరుబాట పట్టారు. 2020 నవంబరు 26 భారత ప్రజా ఉద్యమ చరిత్రలో కొత్త అధ్యాయానికి తెర తీసింది. కార్మిక హక్కుల్ని కాలరాసే నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికులు, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కొత్త వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా కార్మికులు-కర్షకులు ఉమ్మడి కార్యాచరణకు దిగారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ జరగని రీతిలో 25 కోట్ల మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. నవంబరు 26 నుండి నేటి వరకూ రైతులు ఆందోళన కొనసాగుతూనే వున్నది. గడ్డకట్టే చలిలో ప్రాణాలను పణంగా పెట్టి రహదారుల దిగ్బంధాన్ని కొనసాగిస్తున్నారు. మోదీ ప్రభుత్వాన్ని ఒక్కొక్క మెట్టు కిందతీవికి దిగేలా ఈ ఉద్యమం సాగుతున్నది. రైతు చట్టాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ ఉద్యమం మలిదశలో కార్పొరేట్లను బోనులో నిలబెట్టింది. కార్పొరేట్ రంగం నిజ స్వరూపాన్ని మొత్తం దేశం చర్చించే స్థితిని తెచ్చింది. రైతులు, కార్మికులు సాగిస్తున్న ఈ ఉద్యమాలు ఆర్థిక సమస్యల నుండి రాజకీయ విధానాల వైపు నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతులు, కార్మికుల సమస్యలకు ప్రత్యామ్నాయ రాజకీయమే మార్గం అన్న స్పృహ ప్రారంభం అయింది.

కేరళ ప్రభుత్వం తీసుకున్న చర్యలు దేశ ప్రజలకు మరో మార్గాన్ని సూచిస్తున్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా కార్మికుల కనీస వేతనాలను కేరళ ప్రభుత్వం 1800కు పెంచింది. కేంద్రం ప్రకటించిన ధాన్యం మద్దతు ధరపై స్వామినాథన్ కమీషన్ చేసిన సిఫారసుకు అనుగుణంగా 50 శాతం మద్ధతు ధరను పెంచి కొనుగోలు చేస్తున్నది. ప్రత్యామ్నాయ రాజకీయ ఆవశ్యకతను ఇది నిరూపిస్తున్నది. దేశంలో తొలిసారి ప్రముఖంగా ముందుకొచ్చిన కార్మిక కర్షక ఐక్యతను స్థిరపరచుకోవడం, బలపర్చుకోవడం మీదే ఈ ప్రత్యామ్నాయ రాజకీయ ముందుకు సాగుతుంది. ఆర్థిక పోరాటాలకే పరిమితం కాకుండా ఈ ఉద్యమాలు ప్రత్యామ్నాయ రాజకీయానికి పోరాడే శక్తులుగా ముందుకుసాగాలి. ఈ ప్రత్యామ్నాయ రాజకీయ పోరాటాన్ని కార్మికులు, కర్షకులల ఐక్యతలో విశాల ప్రజానీకాన్ని సమీకరించే దిశగా అడుగులు వెయ్యాలి. ఈ ఉద్యమాల ఆశాజ్యోతి పురోగమిస్తే రిపబ్లికన్‌ను చుట్టు ముడుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది.

# విద్యా భారతంలో వెనకచూపు

విద్య కోసం పాఠశాలలు ఉన్నాయి. కళాశాలలు, యూనివర్శిటీలు ఉన్నాయి. విద్యను అందించడానికి అధ్యాపకులు, పాఠ్య పుస్తకాలు ఉన్నాయి. విద్యను కొలవడానికి పరీక్షలున్నాయి. ప్రశ్నపత్రాలు ఉన్నాయి. సర్టిఫికెట్లు, డిగ్రీలు, డాక్టరేట్లు ఉన్నాయి. విద్య పరీక్షల చుట్టూ, విద్యార్థుల మార్కుల చుట్టూ, ర్యాంకుల చుట్టూ తిరుగుతున్నది. చదువు దీనికి భిన్నమైంది. పరీక్షలకు, పాఠ్య పుస్తకాలకు పరిమితమైంది కాదు. అదొక నిరంతర అధ్యయన ప్రక్రియ. జ్ఞాన సముపార్జనే దాని లక్ష్యం. దీనికి కొలతలుండవు. అదొక తీరని దాహం.. విద్య పెరుగుతున్నది కాని చదువు తరుగుతున్నది. అందుకే దేశంలో విద్య కొత్త ఆవిష్కరణలకు దూరం అవుతు న్నది. విద్యలో బహు కోణాలున్నాయి. అందులో మతపరమైన విద్య ఒకటి. గొప్పగా చెప్పుకునే గురుకులాలు, మదర్సాలు, మొనాస్టీలు అంధ విశ్వాసుల్నిల తయారు చేసేవే తప్ప అధునిక జీవుల్ని రూపొందించేవి గా వుండవు. విద్య పాలక వర్గాలకు పరిచారికగా పనిచేయడం అనాదిగా వస్తున్నదే. బ్రిటీష్ పాలకులు తమ పరిపాలనా అవసరాలకు మెకాలే విద్యా పద్ధతిని తెచ్చుకున్నారు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని పెంచి పోషించడానికి అవసరమైన విద్యా విధానం కోసం ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి. ప్రభుత్వమే రంగంలోకి దిగింది. కాలేజీలు, యూనివర్శిటీలను ప్రారంభించింది. తన వ్యవస్థ అవసరాలకు తగిన శాస్త్ర, సాంకేతిక విద్యా సంస్థలను ప్రభుత్వమే ఏర్పాటు చేసింది.




ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. కార్పొరేట్ విద్య పైచేయి సాధించింది. అవి ఒక పక్క విద్యా రంగాన్ని లాభసాటి వ్యాపారం చేసుకోవడంతోపాటు, తన

కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన బిజినెస్ స్కూల్స్, మేనేజ్మెంట్ స్కూల్స్, వ్యాపార, వాణిజ్య అవసరాలు తీర్చే విద్యా సంస్థలను అవే నిర్వహిస్తున్నాయి. ఇలా విద్యా రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పిన ప్రభుత్వం తన పాత్రను పరిమితం చేసుకుంది. పర్యవసానంగా దేశంలో ఉన్న వాడికో చదువు, లేని వాడికో చదువుగా స్థిరపడింది. ఇది దేశంలో ఆర్థిక, సామాజికపరమైన అంతరాలను విపరీతంగా పెంచింది. ప్రభుత్వం సమ్మిళిత విద్య అని చెప్పేది ఒక తంతు మాత్రమే. ఇప్పుడు విద్య పాలక వర్గానికి తన భావజాల వ్యాప్తికీ, తన పాలన సుస్థిరత్వానికి వినియోగపడే సాధనం మాత్రమే భారత ప్రభుత్వం తలపెట్టిన నూతన విద్యా విధానం దీనికి అద్దం పడుతున్నది. మత జాతీయ వాదాన్ని, విద్వేషాన్ని, విభజన రాజకీయ అవసరాలకు విద్యను సాధనం చేసుకుంటున్నది. ఇది విద్యను వెనక చూపు పట్టిస్తుంది. చరిత్రను వక్రీకరిస్తుంది. అంతిమంగా దేశాన్ని వెనక్కి నడిపిస్తున్నది. ఈ అంశాలను రేఖా మాత్రంగా వివరించే ప్రయత్నమే ఈ దారి దీపం ప్రత్యేక సంచిక.


# వ్యాసాలు

## విషయ సూచిక


1. దోపిడీ వ్యవస్థను మార్చే ఉద్యమాల దారి పట్టాలి .............. 231
2. ఉపశ్రేణుల ఉద్యమాలకు ప్రేరణ కావాలి ....................... 236
3. అంతరాల సమాజానికి సంపద పంపిణీ చికిత్స ............... 239
4. మోదీని ఓడించే భావజాల పోరాటం ............................ 244
5. భారతీయ చింతన నుండి ప్రభవించిన తొలి మార్క్సిస్టు రాహుల్ 249
6. రాఘవాచారి చైతన్య పరిధిని పెంచే ఆణిముత్యాలు ............ 256
7. ఆంధ్రప్రదేశ్ : రెండు దశాబ్దాల రాజకీయ పరిణామాలు ...... 262
8. వాంఛనీయం కాని జమిలి ఎన్నికలు ............................. 270
9. జమిలి ఎన్నికల వెనక మోదీ పద్మవ్యూహం ..................... 272
10. రైతుల విజయం నేర్పుతున్న ఉద్యమపాఠాలు ................. 277
11. ప్రత్యామ్నాయ రాజకీయం : కొన్ని చర్చనీయ అంశాలు ..... 281
12. శ్రమజీవుల ప్రజా రిపబ్లిక్ ఉద్యమం ........................... 286
13. రాజ్యాంగంలో హక్కుదారులు - రాజకీయంలో లబ్ధిదారులు 290
14. పవన్ ప్రస్థానం : సినీ హీరో టు పొలిటికల్ విలన్ .......... 294
15. రాష్ట్రంలో 'రెండు పార్టీల వ్యవస్థ' బద్దలు కానుందా? ........ 297
16. విలువల పునాదిపై ప్రభవించిన విశాలాంధ్ర .................. 301

# దోపిడీ వ్యవస్థను మార్చే ఉద్యమాల దారి పట్టాలి

**2**018 మేడేకి ఒక ప్రత్యేకత వుంది. కార్ల్ మార్క్స్ ద్విశత జయంతి సంవత్స రంలో జరుగుతున్న మేడే ఇది. మార్క్స్ రచనలే కార్మికోద్యమానికి మూలాధారాలు. ఆయన శ్రమ సిద్ధాంతకర్త. శ్రమే సమస్త వస్తువులకీ విలువలను ఇస్తున్నదనీ, శ్రమ దోపిడీ నుండే అన్ని రకాల దోపిడీదారులూ లాభాలను మూటగట్టుకుంటున్నారని ఆయన సాధికారికంగా నిరూపించారు. శ్రామిక వర్గమే మొత్తం సమాజాన్ని దోపిడీ నుండి విముక్తం చేసే చోదకశక్తి అనీ, అగ్రగామిదళం పాత్ర పోషిస్తుందనీ స్పష్టం చేశారు. 1848లో మార్క్స్ - ఎంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళికను ప్రకటించారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి.. మీకు పోయేది ఏమీ లేదు సంకెళ్లు తప్ప అన్న నినాదాన్ని ఇచ్చారు. ప్రపంచవ్యాపితం అవుతున్న నాటి పెట్టుబడి దారీ వ్యవస్థపై పోరాటానికి పిలుపునిచ్చారు. మార్క్స్ కేవలం సిద్ధాంతకర్త మాత్రమే కాదు. తన




కాలంలో జరిగిన కార్మికోద్యమాలలో ఆయన ప్రత్యక్ష పాత్రధారిగా వున్నారు. 1847లో కమ్యూనిస్టు లీగ్ ఏర్పాటులో, 1864లో మొదటి ఇంటర్నేషనల్ ఏర్పాటులో ఆయనే కీలక పాత్రధారిగా వున్నారు. మొదటి ఇంటర్‌నేషనల్ 8 గంటల పని దినాన్ని డిమాండ్ చేసింది. ఆ తర్వాత 8 గంటల పనికోసం అమెరికాలో ఈ ఉద్యమం జోరందుకుంది.

1884 నుండి అమెరికాలో దేశవ్యాపితంగా మేడే ప్రదర్శనలు మొదలయ్యాయి. 1886లో చికాగో మేడే ప్రదర్శనలు జరిగాయి. మే 4న హే మార్కెట్ కూడలిలో వేలాది మంది ప్రదర్శన చేశారు. ప్రభుత్వ బలగాలు, పెట్టుబడిదారీ వర్గ తైనాతీలు ఈ ప్రదర్శన మీద విరుచుకుపడి రక్తపాతం కావించారు. ఈ ఘోరకలి ప్రపంచాన్ని కుదిపివేసింది. ఆ తర్వాత 1890లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ మే 1వ తేదీని అంతర్జాతీయ కార్మికదినంగా ప్రకటించింది. ప్రపంచ కార్మికులారా

ఏకంకండి అని మార్క్స్ ఇచ్చిన నినాదం మరో రూపంలో మేడేగా ముందడుగు వేసింది. మేడేకి ఇప్పుడు 128 సంవత్సరాలు. ఈ ఉద్యమం ప్రపంచంలోని అన్ని దేశాలకు విస్తరించింది. అన్ని దేశాలలో 8 గంటల పనిదినాన్ని చట్టబద్ధంగా సాధించింది. ప్రపంచ కార్మికుల సంఘీభావ దినంగా, హక్కుల కోసం నినదించే దినంగా అది కొనసాగుతున్నది. ఇదే కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచీకరణ రూపం ధరించింది. మధ్యలో వచ్చిన సోషలిస్టు దేశాల పతనం. తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదని, అదే శ్రేయోరాజ్యమనీ సంపద పెరిగేకొద్దీ అది అందరి జేబుల్లోకి వెదజల్లబడుతుందనీ ప్రచారం సాగించారు. ఇటీవల దాని డొల్లతనం బైటపడింది. పెట్టుబడిదారీ దేశాలు ఒక దాని వెంట మరొకటి తీవ్ర ఆర్థిక సంక్షోభాలలో కూరుకుపోయాయి. దోపిడీ వ్యవస్థను కాపాడుకోడానికి సంక్షేమానికి కోతలు పెడుతున్నారు.

కార్మికుల వేతనాలు స్తంభింపజేస్తున్నారు. సంపద వెదజల్లబడకపోగా అది వికృత స్థాయిలో కేంద్రీకృతం అయింది. 1 శాతం సంపన్నుల దగ్గర 80 శాతం సంపద పోగుపడింది. మనదేశంలో కూడా 1 శాతం కుబేరుల దగ్గర 73 శాతం సంపద మేట పడినట్లు లెక్కలు వచ్చాయి.

వ్యవస్థను మార్చే వేదిక ఇవన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన అంశాలు. మార్క్స్ చెప్పినట్లు ఈ వ్యవస్థ అంతర్గత వైరుధ్యాల పుట్ట. సంక్షోభాలకు నిలయంబీ అంతరాలకు పుట్టిల్లు. అందుచేత మేడే ప్రదర్శనలు ఈ వ్యవస్థను మార్చే లక్ష్యాలను నిర్దేశించుకోవాలి.

వివిధ దేశాలలో జరుగుతున్న "పని గంటల కుదింపు" "జీవన వేతనం" సంపద పునఃపంపిణీ ద్వారా "అందరికీ మౌలిక ఆదాయం" అన్న నినాదాలన్నీ వ్యవస్థను మార్చే లక్ష్యానికి జతపర్చుకోవాలి. అందుకోసం ఒక ఉమ్మడి వేదిక అవసరం. ప్రస్తుతం మేడే ప్రదర్శనలు ఒకే రోజున జరుగుతున్నా ఎవరి నినాదాలు వారివే అన్న రీతిలో సాగుతున్నాయి.

ఉమ్మడి నినాదాలతో దోపిడీ వ్యవస్థను మార్చే ఉమ్మడి లక్ష్యంతో అవి సాగడం లేదు. అవి ఒక ప్రపంచవ్యాపిత పోరాట రూపాన్ని ధరించడం లేదు. దోపిడీ వ్యవస్థపై పోరాటానికి ప్రపంచ కార్మికులారా ఏకం కండి అన్న నినాదానికి కార్యాచరణ రూపంగా జరగడం లేదు. మేడే ప్రదర్శనలు సాగిస్తున్న వేలాది కార్మిక సంఘాలు దేశాల స్థాయిలో, ప్రపంచస్థాయిలో సమాఖ్యలుగా సంఘటితం కావాలి. వ్యవస్థను మార్చే ఉమ్మడి లక్ష్యంతో ఈ వేదికలు రూపుదిద్దుకోవాలి.

మార్క్స్ ద్విశతజయంతి సంవత్సరంలో జరుగుతున్న ఈ మేడే అలాంటి ఉమ్మడి వేదికలకు, ఉమ్మడి పోరాటాలకు దారి చూపే విధంగా తొలి అడుగులు వెయ్యాలి. పనిగంటలు వర్గ పోరాటమే ప్రపంచం అంతటా 5 రోజుల వారం 40 గంటల పని సర్వసాధారణం అయింది.

మనదేశంలోనే కొన్ని రంగాలు మినహాయిస్తే 6 రోజుల వారం 48 గంటల పని పద్ధతే నడుస్తున్నది. అనేక దేశాలలో 30 గంటల వారం మీద ప్రయోగాలు సాగుతున్నాయి. కార్మికుల ఉత్పాదకత పెరగడంతోపాటు శాస్త్ర సాంకేతిక విజయాలు ఉత్పత్తిని ద్విగుణీకృతం చేస్తున్నాయి. వీటి ఫలితాలను పెట్టుబడిదారులే స్వంతం చేసుకుంటున్నారు. ఇది కార్మికుల జీవన నాణ్యతను పెంచడానికి బదులు శ్రమ దోపిడీని తీవ్రతరం చేస్తున్నది. పనిగంటలు తగ్గినచోట కార్మికుల ఆరోగ్యస్థితి మెరుగుదల, అకాలమరణాలు తగ్గుదల, కుటుంబ బాధ్యతలో పెరిగిన భాగస్వామ్యం.

సామాజిక కార్యకలాపాలలో భాగస్వామ్యం పెరుగుదల తమ అభిరుచులను అనుభవంలోకి తెచ్చుకునే స్థితి మెరుగుకావడం అంతకుమించి పనిగంటల కుదింపు మరింత ఉత్పాదకతను పెంచినట్లు అనేక పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. పనిగంటల కుదింపు కూడా వర్గపోరాటమేనని మార్క్స్ ప్రకటించారు. ఎందుకంటే అది పెట్టుబడిదారుని కోసం చేసే అదనపు శ్రమని తగ్గిస్తుంది. లాభాలవేటకు కార్మికులు బలి కాకుండా చేస్తుంది. అందుచేత పనిగంటల తగ్గింపు ఈ మేడేలో ఒక నినాదం కావాలి. కార్మికుల జీవన నాణ్యత కోసం దోపిడీ పై దాడి చేసే సాధనంగా ఈ నినాదం రూపుదిద్దుకోవాలి.

జీవన వేతనం మరోకొత్త నినాదం ఒక వస్తువు ఉత్పత్తి ధర ఎలా నిర్ణయం అవుతుందో అదే రీతిలో కార్మికుల కనీసవేతనాలు కూడా నిర్ణయం అవుతాయని మార్క్స్ సోదాహరణలతో వివరించారు. వేతనాల పెరుగుదల ఉద్యమాలు దోపిడీ వ్యతిరేక పోరాటంలో భాగంగా ఆయన ప్రకటించారు. కనీస వేతనాలు కార్మికుణ్ణి బతికి వుంచడానికి తన తర్వాత మరో కార్మికుణ్ణి సృష్టించడానికి, కుటుంబ పోషణకీ అవసరమైన సొమ్ముగా నిర్ణయమౌతాయి.

మేడే చరిత్ర ప్రారంభమైన తర్వాత ప్రపంచం చాలా మారింది. 'వస్తూత్పత్తి విపరీతంగా పెరిగింది. దానితోపాటే అంతరాలు పెరిగాయి. కార్మికుల వస్తుగత జీవితం కొంత మెరుగైనట్లు కనిపించినా అంతరాల వల్ల వారి సామాజిక స్థితి దిగజారింది. రకరకాల కారణాలతో నిజవేతనాలు పడిపోతున్నాయి. కుటుంబ

అవసరాలు వారిని అప్పులపాలు చేస్తున్నాయి. అందుచేత వేతనాల నిర్ధారణకు ప్రమాణాలు మారాలి. దీనికి అనుగుణంగానే కనీస వేతనాలకు బదులు జీవనవేతనం అన్న నినాదం చాలా దేశాల్లో పుట్టుకొచ్చింది. అనేక వస్తువులు కార్మికులకూ నిత్యజీవిత అవసరాల య్యాయి. నివాస యోగ్యమైన ఇల్లు, పిల్లల చదువు, వైద్య ఖర్చులు, పోషకాహారం వగైరా ప్రమాణాలతో జీవన వేతనం నిర్ణయం కావాలి. అమెరికాలో కనీసవేతనం గంట పనికి 7 డాలర్లుగా వుంటే సియాటిల్ కార్మికులు జీవన వేతనం కోసం పోరాడి గంటకు 15 డాలర్లు సాధించుకున్నారు. ఇదీ కనీస వేతనానికీ, జీవన వేతనానికీ వున్న తేడా. లాభాల వేటపై దాడి చేసి కార్మికుల జీవన స్థితిని మెరుగు పరిచే ఈ కొత్త నినాదం ప్రపంచ కార్మికుల ఉమ్మడి నినాదం కావాలి.

## అందరికీ మౌలిక ఆదాయం

ఇది ఇటీవలే కొన్ని దేశాలలో రూపుదిద్దుకుంటున్న కొత్తనినాదం. 1 శాతం మంది దగ్గర 80 శాతం సంపద పోగుపడడం అందరినీ కలవరపరుస్తున్నది. ఈ అంతరాలు తగ్గించడానికి మార్గాల వెదుకులాట నుండి అందరికీ మౌలిక ఆదాయం అన్న నినాదం పుట్టింది. దీనిపై కొన్ని దేశాలలో పరిమిత ప్రాంతంలో ప్రయోగాలు కూడా చేస్తున్నారు. అయితే అవి అసలు లక్ష్యానికి విరుద్ధమైన రీతిలో సాగుతున్నాయి. అంతరాలను తగ్గించే పేరుతో ప్రజల పన్నుల సొమ్మును "నగదు బదిలీ" రూపంలో చెల్లిస్తున్నారు. ఇది ప్రజలపై పన్నుల భారాన్ని పెంచి తిరిగి తాత్కాలిక ఉపశమనంగా ప్రజలకు పంపిణీ చేసేది అవుతుంది. దీనివల్ల పెట్టుబడిదారీ దోపిడీ మాత్రం యధావిధిగా సాగిపోతుంది. అంతరాలు గతానికి మించి పెరగడమే గాని గుండదు. అందువల్ల ఈ పద్ధతి కార్మికవర్గ నినాదం కాకూడదు. పోగుపడ్డ సంపద పునఃపంపిణీ జరగాలన్నది కార్మికవర్గ నినాదం కావాలి.

ఎందుకంటే పోగుపడ్డ సంపద అంతా పోగుపడ్డ శ్రమేనని, పెట్టుబడి అనేది ప్రజలందరి కృషి ఫలితమేనని, అందువల్ల అది వ్యక్తి శక్తి కాదని సామాజిక శక్తి అని మార్క్స్ విశ్లేషించారు. అందుచేత పోగుపడ్డ సంపద ప్రజలకు పునఃపంపిణీ జరగాలి. 1 శాతం దగ్గర మేటలుగా పోగుపడ్డ సంపదను బద్దలుకొట్టాలి. సంపద మీద పన్ను, వారసత్వం మీద ఆంక్షల ద్వారా పునఃపంపిణీ నిధులు సమకూర్చాలి. అలాగే ప్రకృతి సంపదలు ప్రజల అందరి సొత్తు. దానిని ఎట్టి పరిస్థితులలోనూ

ప్రయివేటు దోపిడీకి అనుమతించకూడదు. సముద్రతీరం, గనులు, అటవీసంపద వగైరాల మీద ఆదాయం అంతా పునఃపంపిణీ నిధిగా వుండాలి. సంపద పునః పంపిణీ ద్వారా అందరికీ మౌలిక ఆదాయ కల్పన అంతరాలను తగ్గిస్తుంది. పోగు పడ్డ సంపద మీద అందరినీ హక్కుదారులను చేస్తుంది. బతుకు భరోసా వల్ల కార్మి కులు తమకు నచ్చిన పనిని ఎంచుకునే స్వేచ్ఛ లభిస్తుంది. మార్క్స్ ద్విశత జయంతి సందర్భంగా జరిగే మేడేని అందరూ అర్ధవంతంగా నిర్వహించుకోవాలి. వ్యవస్థను మార్చే ప్రపంచవ్యాపిత ఉద్యమంగా పనిగంటల కుదింపు, జీవన వేతనాలు, పోగుపడ్డ సంపద పునఃపంపిణీ ద్వారా అందరికీ మౌలిక ఆదాయ భద్రత అన్న కొత్త నినాదాలతో మేడే దోపిడీ వ్యవస్థను మార్చే ఉద్యమాల దారిపట్టాలి.

(2018 మే 1 ఆంధ్రజ్యోతి)

# ఉపశ్రేణుల ఉద్యమాలకు ప్రేరణ కావాలి

**మే** నెలకు ఒక ప్రత్యేకత వుంది. మే 1 - అంతర్జాతీయ కార్మిక దినోత్సవం. మే 5- కార్ల్ మార్క్స్ జయంతి. మే 9 - ఫాసిజంపై విజయం సాధించిన రోజు. వర్తమాన దేశ రాజకీయాల విశ్లేషణకు కొత్త తరహా ప్రజా ఉద్యమాలకు, నినాదాలకు ఇవి ప్రేరణ ఇస్తాయి. మే డే నాడు 8 గంటల పనిదినం కోసం సాగిన చికాగో పోరాటం, కార్మికుల రక్త తర్పణ గుర్తు చేసుకుంటారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి అన్న నినాదం ఇస్తారు. వాస్తవానికి ఈ రెండు మే డే ఉద్యమంలో పుట్టిన నినాదాలు కావు. దానికి ప్రేరణ ఇచ్చిన నినాదాలు. 1866లో మార్క్స్ సారథ్యంలో ఏర్పడిన మొదటి ఇంటర్‌నేషనల్ 8 గంటల పని దినాన్ని డిమాండ్ చేసింది. 1848లో మార్క్స్ - ఎంగెల్స్‌లు రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక ముగింపు నినాదం 'ప్రపంచ కార్మికులారా! ఏకం కండి!' దానికి ముందున్న 'వారు గెలుచుకోడానికి ఓ ప్రపంచం వుంది' అన్న వాక్యం ఎంతో ప్రాముఖ్యత కలిగింది. ఇది దోపిడీ లేని ప్రపంచాన్ని సాధించే కార్యాచరణకు ఇచ్చిన పిలుపు. ఎందుకో ఇది మే డే ప్రసంగాలలో, నినాదాలలో ప్రాధాన్యత లేనిదైంది. మే డే ఉద్యమం హక్కుల ఉద్యమంగా ప్రారంభమైనా ఆ నినాదాల వెనక దోపిడీ వ్యవస్థను కూల్చే రాజకీయం వుంది. దానికి కార్మిక వర్గాన్ని సంసిద్ధుల్ని చెయ్యాలి. ప్రస్తుతం మన ముందు కొన్ని సవాళు వున్నాయి. వాటిని పరిశీలించుకుందాం.



చికాగో హేమార్కెట్‌లో
అమరవీరుల స్మారక చిహ్నం

**1. మొదటి అంశం :** మన దేశంలో శ్రామిక వర్గం ఒకే రూపంలో లేదు. పారిశ్రామిక కార్మిక వర్గం కంటే వివిధ రంగాలకు విస్తరించిన అసంఘటిత కార్మిక వర్గం అత్యధికంగా వుంది. బహు రూపాలలో విస్తరిస్తున్న సేవా రంగం పలు రకాల ఉద్యోగ బృందాలను సృష్టిస్తున్నది. మరో పక్క గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ

కూలీలు, పలు దొంతర్ల రైతులు వున్నారు. దీనికితోడు సమాజంలో వివక్ష వుంది. అణిచివేత వుంది. దళితులు, బహుజనులు, వివిధ మతాల మైనారిటీలు మహిళలు వున్నారు. వీరంతా ఒక పక్క దోపిడీకి, మరోపక్క వివక్షకీ గురవుతున్నారు. ఆంటోనియో గ్రాంసీ మాటల్లో ఇవన్నీ ఉపశ్రేణి తరగతులు. ఈ ఉపశ్రేణులను ఐక్యం చెయ్యడం ఎలా అన్నది మన మొదటి సమస్య.

**2. రెండవ అంశం :** ఈ ఉపశ్రేణులు గెలుచుకోవలసిన మరో ప్రపంచం, అంతరాలు లేని సమ సమాజం. అయితే ప్రస్తుతం దేశం నడక దీని విరుద్ధంగా వుంది. సంపద కొద్ది మంది దగ్గర మేటలు వేస్తున్నది. పేదరికం మరోచోట తిష్ట వేస్తున్నది. మోదీ 9 ఏళ్ల పాలనలో సంపద కేంద్రీకరణ శరవేగంతో సాగుతున్నది. 2013 నాటికి 60 మంది వున్న బిలియనీర్ల సంఖ్య ఇప్పుడు 119 కి పెరిగింది. 10 శాతం సంపన్నుల చేతిలో 77 శాతం దేశ సంపద పోగు పడింది. ప్రతి ఏటా పెరిగే సంపదలో 73 శాతం కేవలం 1 శాతానికి చేరిపోతున్నది. 67 కోట్ల మంది కేవలం 1 శాతం సంపదను పంచుకుంటున్నారు. దేశంలో విమానాశ్రయాలు, పోర్టులు, ఆయిల్ నిక్షేపాలు, ఖనిజ సంపదను కార్పొరేట్లు వశం చేసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలన్నీ వారి పరం అవుతున్నాయి. వివిధ పార్టీలు వీటిపై విమర్శలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నాయి. వాటిలో ప్రజలు భాగస్వాములు కావడం లేదు. ఇంతగా కార్పొరేట్లు దేశాన్ని దోచుకుంటున్నా ఈ శక్తులను సవాలుచేసే ప్రజాఉద్యమం రావడం లేదు. ఇది మరో పరిశీలనాంశం.

**3.మూడో అంశం:** మోదీ పాలన ప్రజానుకూలం కాకపోగా ప్రజావ్యతిరేకమైంది. దేశానికి అచ్చేదిన్ రాలేదు. విదేశాలలో మూలుగుతున్న నల్లధనం తేలేదు. ప్రజలకు పంచలేదు. పెద్దనోట్లు రద్దు చేసి దేశంలో నల్లధనం వెలికి తీస్తానన్నది జరగలేదు. బ్యాంకుల దగ్గర క్యూలతో సామాన్యులు బారులు తీరారు. అక్కడే 200 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. జి.యస్.టీ తో ధరలు తగ్గుతాయన్న హామీ తిరగబడింది. నిత్యవసరాల ధరలు పెరిగాయి. పెట్రోలు, గ్యాస్ ధరలు ప్రతి ఇంటా మంటపెడుతున్నాయి.నిరుద్యోగం పెరిగింది. రైతుల ఆదాయం రెట్టింపు అన్నమాట అటకెక్కింది. ఒకనాడు తాత్కాలికంగా ఉల్లిపాయల ధరలు పెరిగితే ప్రజలు ప్రభుత్వాలను మార్చేశారు. ఇప్పుడు అన్నీ పెరిగి జీవితం భారమైనా ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయడం లేదు. పైగా దేశంలో జరుగుతున్న సర్వేల ప్రకారం మోదీయే ప్రధాని కావాలనుకునే వారు ఇప్పటికీ 52 నుండి 62 శాతం వున్నారు. ఇదీ మనం పరిశీలించుకుని తీరాల్సిందే.

మోదీ బలం ఆయన ఆర్థిక విధానాలలో లేదు. పరిపాలనా దక్షతలో లేదు. మోదీ నడుపుతున్న రాజకీయంలో వుంది. తనకు తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. భారత జాతీయ వాదం దేశ పౌరులందరినీ సమానంగా చూస్తుంది. హిందూ జాతీయవాదం ఈ దేశం హిందువులది మాత్రమేనని ఇతరులంతా పరాయి వారుగా విభజిస్తుంది. విద్వేష రాజకీయాన్ని సాగిస్తుంది. ఈ భావజాలమే దేశానికి ఒక ఉక్కు మనిషిని అవసరం చేస్తుంది. ఒక హీరోని ముందుకు తెస్తుంది. భక్తులనీ, ఉన్మాదులను తయారుచేస్తుంది. ఈ అగ్గి చల్లారకుండా రోజుకొక మత వివాదాన్ని ముందుకు తెస్తారు. ఒక మందిరం తర్వాత మరొక మందిరం, ఒక కట్టడం తర్వాత మరో కట్టడం, ఒక పేరు మార్పిడి తర్వాత మరొకటి, చరిత్రను తిరగ రాయడం, పురాణాలే చరిత్రలుగా ప్రకటించడం మను వాదమే మన రాజ్యాంగం అనే వివాదాలే నిత్య ఎజెండా అవుతుంది. పార్టీల స్పందనలు దీని చుట్టూ సాగుతాయి. నిత్య చర్చల పేరుతో మీడియా ఈ విద్వేషాన్ని రోజువారీ టానిక్‌గా ప్రజలకు అందిస్తాయి. ఇలాంటి ఉన్మాదం, విద్వేషం ప్రజల తలకెక్కితే నిత్యజీవిత సమస్యలు తెరమరుగౌతాయి. ఇదే మోదీకి బలంగా మారుతున్నది. ప్రశ్నించే వాడు దేశద్రోహి అవుతాడు. కాదన్నవాడు జైలు పాలవుతాడు. అన్ని రకాల ఫాసిస్టు పద్ధతులకు ద్వారాలు తెరుచుకుంటాయి. దీనిని ఎదుర్కోనడం ఎలా అన్నది మరో కీలక అంశం. మనం మూడు అంశాలను ప్రస్తావించుకున్నాం. వాటికి ఆచరణయోగ్యమైన సమాధానాలను అందరూ ఆలోచించాలి.

**1. ఉపశ్రేణుల ఐక్యత :** ఈ ఉపశ్రేణుల ఐక్యతను సాధించకుండా రాజకీయరంగంలో ఆశించిన మార్పులు రావు. ఇవి వృత్తి పరంగా భిన్నమైనవి. పట్టణ - గ్రామీణ ప్రాంతాల నివాసపరంగా భిన్నమైనవి. వివక్షకు గురి కావడం లోనూ భిన్నమైనవి. వీటి మధ్య ఎంతో వైవిధ్యం ఎన్నో వైరుధ్యాలు కనిపిస్తాయి. పట్టణాలలో గ్రామాలలో కింది స్థాయి నుంచి ఈ శ్రేణుల మధ్య ఐక్యతకు ప్రయత్నాలు జరగాలి. ఒకరి సమస్యల పట్ల మరొకరి సహకారం ఈ ఐక్యతకు పునాది అవుతుంది. ఇది మాత్రమే సరిపోదు. ఈ ఉపశ్రేణులన్నింటి ఆకాంక్షలను వక్తీకరించేదీ, వారి జీవితాలకు కొత్తరూపును ఇచ్చే ఒక కొత్త నినాదాన్ని రూపొందిం చగలగాలి. అలాంటి ఆచరణయోగ్యమైస నినాదం మాత్రమే వారి మధ్య గల వైరుధ్యాలను వెనక్కి నెట్టి ఐక్యతకు దారితీస్తుంది. దీనిని రూపొందించగలిగితే అది వ్యవస్థ మీద పోరాడే గొప్ప ప్రజా ఉద్యమానికి ప్రేరణ అవుతుంది.

**2.పోగుపడ్డ సంపద పునఃపంపిణీ :** ఒక నినాదం ప్రజా ఉద్యమంగా విజయం సాధించాలంటే ఆ నినాదం సమంజసమైనదేనని ప్రజలు భావించాలి. దానిని అమలులోకి తెచ్చే మార్గాలు ఆచరణ సాధ్యమేనన్న నమ్మకం కలగాలి. దాని వల్ల తమ జీవితాలు ఎలా మారతాయో వారికి స్పష్టంగా కనిపించాలి. కార్పొరేట్ల సంపద అంతా దోచుకున్న శ్రమే. అదే వారి దగ్గర పోగుపడ్డ సంపద. దానిని జాతి పరం చెయ్యడం సమంజసమే. ప్రస్తుతం దానిలో కొంత భాగమైనా తక్షణం పంపిణీ జరగాలి. ఇది మనకి కొత్త కాదు. ఒక పరిశ్రమ యజమాని దగ్గర లాభంగా పోగు పడ్డ శ్రమలో ఒక భాగాన్ని బోనస్‌గా పంపిణీ చెయ్యడం లాంటిదే. ఇతర దేశాలలో లాగే మన దేశంలోను తగిన స్థాయిలో కార్పొరేట్‌ల సంపద మీద, వారసత్వ ఆస్తి బదలాయింపు మీద పన్ను పన్ను విధించాలి. తగ్గించుకుంటూ వస్తున్న కార్పొరేట్ పన్నును పెంచాలి. ఇలాంటి పన్నులు విధిస్తే ఆక్స్ ఫామ్ సంస్థ అంచనాల ప్రకారం పునః పంణీకి వచ్చే సొమ్ము లక్షల కోట్లలో వుంటుంది. దీనిని ఉపశ్రేణులకు వారి జీవితాలను మార్చే విధంగా పంపిణీ చెయ్యాలి రాజ్యాంగం ప్రకారం అందరికీ జీవించే హక్కు వుంది. ప్రతి కుటుంబానికి హక్కుగా నివాసం, హక్కుగా ఉచిత ఆరోగ్యవైద్య సదుపాయం, హక్కుగా పిల్లల చదువు, వృద్ధులకు పెన్షన్లు, గౌరవంగా జీవించడానికి ప్రతి కుటుంబానికి నగదు బదిలీని ప్రకటించాలి యువతకు ఉపాధి హక్కు లేదా నిరుద్యోగ భృతి, రైతుల పంటనంతా మద్దతు ధరకు కొనుగోలు చేసే రైతు మార్కెట్ వ్యవస్థ ఏర్పాటు వగైరాలు సాధ్యమౌతాయి. సంపద పునః పంపిణీ నినాదం ఉపశ్రేణుల ఉమ్మడి నినాదం అవుతుంది. ఐక్య ఉద్యమానికి ప్రేరణ అవుతుంది

**3.ఫాసిజంపై సాంస్కృతిక ఉద్యమం :** మోదీ అనుసరిస్తున్న విద్వేష రాజకీయం, ఉన్మాద రాజకీయం, ఫాసిస్టు భావజాలం పౌరసమాజపు లోకజ్ఞానంలో భాగం అవుతున్నది. దీనిని విచక్షణా జ్ఞానంగా మార్చడం కేవలం నినాదాలతో సాధ్యపడేది కాదు. మన పౌర సమాజంలో ఒక గొప్ప భావజాల సంఘర్షణ జరగాలి. వ్యక్తుల బుర్రల నుండి, సమూహాల చైతన్యంలో చొరబడ్డ మనువాద ఆధిపత్య భావజాలాన్ని, తొలగించడానికి తగిన సాంస్కృతిక సంఘర్షణ జరగాలి. లేకపోతే ప్రజాస్వామ్య భావజాలం మనుగడ సాగించలేదు. మే నెలలో నిర్వహించే కార్యక్రమాలు- ఉప శ్రేణుల ఐక్యతకి, సంపద పునఃపంపిణీ ఉద్యమానికి, ఫాసిస్టు విద్వేష భావజాలంపై సాగించే ప్రగతిశీల సాంస్కృతిక ఉద్యమానికి ప్రేరణ ఇచ్చేవిగా వుంటాయని ఆశిద్దాం.

# అంతరాల సమాజానికి సంపద పంపిణీ చికిత్స

**క**రోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్నది. ఈ ఏడాదిన్నర కాలంలో మన దేశంలో 3 లక్షల మందిని బలి తీసుకుంది. ఇవి ప్రభుత్వ లెక్కలు. ప్రైవేటు సంస్థల లెక్కలు అనేక రెట్లు ఎక్కువగా వున్నాయి. కొవిడ్ తొలిదశ ముగిసిందనుకున్నాం. మలి దశ మరింత ప్రళయంగా వచ్చింది. ఆసుపత్రులలో మంచాల కొరత, ఆక్సిజన్ కొరత, వెంటిలేటర్ల కొరత, స్మశానాలలో శవాల గుట్టలు, గంగా నదిలో తేలుతున్న శవాలు ఇవి కనిపించే దృశ్యాలు ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతున్నాయి. కరోనా విలయంలో ఇది ఒకవైపు చిత్రం మాత్రమే. మరో పక్క ఈ విలయం కోటాను కోట్ల ప్రజల జీవనాన్ని కకావికలం చేసింది. దాని పరిణామాల మీద తగిన చర్చ లేకుండా పోయింది. దేశంలో 50 కోట్లమంది ఉపాధిరంగంలో వుంటే అందులో 45 కోట్ల మంది (90 శాతం) అసంఘటిత రంగంలో వున్నారు. రోజువారీ కూలీలుగా వున్నారు. అజీం ప్రేమ్‌జీ యూనివర్శిటీతోసహా అనేక ప్రామాణిక సంస్థలు చేసిన సర్వేల ప్రకారం మధ్య తరగతిగా వున్న మూడు కోట్ల మంది గత ఏడాది కాలంలో పేదరికంలోకి దిగజారిన స్థితి ఆందోళన కలిగిస్తున్నది.



అసంఘటిత కార్మికుల సంపాదన తగ్గిపోవడంతో వీరిలో 40 శాతం మంది ఒకపూట భోజనంతో సరిపెట్టుకుంటున్నారు. గతంలో పొదుపు సొమ్ము చిల్లర ఆస్తులు అమ్మేసుకుంటున్నారు. స్థానిక వడ్డీ వ్యాపారుల నుండి అధిక వడ్డీలతో అప్పులు చేస్తున్నారు. ఇదే పరిస్థితి మరి కొంత కాలం కొనసాగితే ఆకలిచావుల ప్రమాదం పొంచి వుందని, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యలు పెరిగే స్థితి వుందని, పోషకాహార లోపంతో పిల్లలు, పెద్దలు అనారోగ్యంతో మరణాలు వుంటాయని ఇది కరోనా మరణాలకు మించి వుండే ప్రమాదంగా పలువురు పేర్కొంటున్నారు.

కొవిడ్ కల్లోలం ప్రకృతి ప్రసాదితం దానికి చికిత్స అవసరం. అలాగే పేదరికం, అంతరాల అగాధాలు దోపిడీ వ్యవస్థ ప్రసాదితాలు. దానికి తగ్గ శస్త్ర చికిత్స కూడా తక్షణ అవసరం అయింది. లేకపోతే మూకుమ్మడి ఆకలి చావులు, ఆత్మహత్యలు జరిగేలా ఈ పేదరికం కోటాను కోట్లమందిని నడిపిస్తుంది. పేదరికం, అంతరాల అగాధాలపై చర్చ గత దశాబ్దకాలంగా ప్రపంచవ్యాపితంగా మొదలైంది. సంక్షిప్తంగా ఆ నేపథ్యాన్ని పరిశీలించుకుందాం. 1990 దశకంలో సోషలిస్టు దేశాలు పతనం అయ్యాయి. మరోపక్క పెట్టుబడి ప్రపంచీకరణ ఊపు అందుకుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ శాశ్వతం అనీ, దానికి ప్రత్యామ్నాయం లేదనీ, అది సాధించే అభివృద్ధి ఫలితాలు తిరిగి ప్రజలపై వర్షిస్తుందనీ, అది అంతరాలను, పేదరికాన్ని తొలగిస్తుందనీ దాని సిద్ధాంతకర్తలు ఊదరగొట్టారు. మార్క్స్ భావజాలానికి కాలం చెల్లిందని ప్రగల్భాలు పలికారు. 2008లో అమెరికాతో సహా పెట్టుబడిదారీ దేశాలు ఆర్థిక మాంద్యంతో సంక్షోభంలో పడ్డాయి. వేతన స్తంభనలూ, సంక్షేమాల కోతల వంటి చిట్కాలు వారిని గట్టెక్కించలేకపోయాయి. మార్క్స్ భావాలకు కాలం చెల్లిందన్న వాళ్లే ఈ సంక్షోభాన్ని అర్థం చేసుకోడానికి 'పెట్టుబడి' గ్రంథాన్ని చదవాలని ప్రకటించారు. సంపద కొద్ది మంది చేతుల్లో పేదరికం అత్యధిక సంఖ్యాకుల దగ్గర పేరుకుపోవడాన్ని గుర్తించడం మొదలైంది.

ఈ దశలో పికెట్టీ రాసిన '21వ శతాబ్దపు పెట్టుబడి' పుస్తకం వెలువడింది. పెట్టుబడి సృష్టించిన అంతరాల అగాధాన్ని అది బట్టబయలు చేసింది. మరోపక్క ఆక్స్ ఫాం సంస్థ ప్రపంచంలో ఒక శాతం మంది దగ్గర 70 శాతం సంపద పోగుపడ్డ తీరును కోటానుకోట్ల మందిని పేదరికంతో ముంచిన స్థితిని తన నివేదికలలో వెల్లడించింది. దీంతో పలు దేశాలలో ఈ అంతరాల అగాధాన్ని, పేదరికాన్ని తొలగించే మార్గాలుగా నగదు బదిలీలు, కనీస మౌలిక ఆదాయాన్ని అందించే ప్రయోగాలు మొదలయ్యాయి. ఈ ప్రయోగాలు సంపద కేంద్రీకరణ మీద దాడి చెయ్యడానికి బదులు 'పన్నుల సొమ్ము' పంపిణీ ద్వారా సాధించాలని భావించాయి. అది శిరోభారం కావడంతో ప్రభుత్వాలు ఆ ప్రయోగాలను మధ్యలోనే వదిలిపెట్టాయి. ఈ నేపథ్యంలో భారతదేశంలో సంపద కేంద్రీకరణ పర్యవసానాలను పరిశీలించుకోవాలి. కరోనా సంక్షోభానికి ముందే సంపద కేంద్రీకరణ మీద, పేదరికం మీద చర్చ ప్రారంభం అయింది. ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం మన దేశంలో 10 శాతం దగ్గర 77 శాతం దేశ సంపద పోగై వుంది. 2017లో దేశంలో పెరిగిన సంపదలో 1 శాతం దగ్గర 73 శాతం పోగుపడింది.

అంతరాల అగాధాలు, పేరుకుపోతున్న పేదరికాన్ని తగ్గించడానికి నగదు బదిలీలు, మౌలిక ఆదాయ కల్పన వంటి అంశాలపై చర్చ మొదలైంది.

**1.పన్నుల సొమ్ము - సాధ్యం కాని పరిష్కారం :** 2017 బడ్జెట్‌కి ముందు ప్రవేశపెట్టే ఆర్థిక సర్వే నివేదికలో పేదరికంలో వున్న కుటుంబాలకు నగదు బదిలీ చేసే మౌలిక ఆదాయ కల్పన మీద ఒక అధ్యాయాన్ని కేటాయించి చర్చించారు. 'పన్నుల సొమ్ము'తో మౌలిక ఆదాయ కల్పన సాధ్యం కాదన్నది అంతిమంగా తేలిపోయింది. అందుకే బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేకుండాపోయింది. కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో కొన్ని లక్షల కోట్ల రూపాయలు పేదల మౌలిక ఆదాయకల్పనకు ఖర్చు చేసే స్థితి లేదు. ఎందుకంటే కార్పొరేట్ పన్నుకు వరుసగా రాయితీలు ఇచ్చి దాదాపు 3 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోవడం జరిగింది. తగ్గిన ఆదాయాన్ని పూడ్చుకోడానికి అప్పుల మీద, ప్రభుత్వరంగం ఆస్తుల అమ్మకం మీద కొన్ని ఎంపిక చేసిన సంక్షేమ పథకాల కుదింపు మీద ఆధారపడే స్థితి వచ్చింది. పైగా బడ్జెట్‌కు ఒక రాజకీయ లక్ష్యం కూడా వుంది. అది కొన్ని బృందాలకు నగదు బదిలీ ద్వారా 'ఓటు బ్యాంకు'లను ఏర్పరచుకోవడం, ఎన్నికల నిధులు సమకూర్చుకోడానికి కార్పొరేట్ శక్తులకు రాయితీలు ప్రకటించడం, బడ్జెట్లు వీటికే పరిమితం అవుతున్నాయి. అంతకుమించి దీర్ఘకాలికమైన మౌలిక ఆదాయ పథకాన్ని నెత్తికెత్తుకునే స్థితి దానికి ఎంతమాత్రమూ లేదు. పైగా దోపిడీదారులు సృష్టించిన అంతరాల అగాధాన్ని, పోగుపడ్డ సంపద పింపిణీతో నిమిత్తం లేని ఏ పరిష్కారమైనా అంతరాలను తొలగించకపోగా దానిని మరింత పెంచుతుంది.

**2. పారిశ్రామిక లాభాల పంపిణీ :** పారిశ్రామికరంగంలో కార్మికులకు బోనస్ అన్న సమస్య మీద దాదాపు 50 సంవత్సరాలు చర్చ జరిగింది. బోనస్ అనేది పరిశ్రమల యజమానులు ఐచ్ఛికంగా, బహుమతిగా ఇచ్చేది అన్న వాదన చివరికి వీగిపోయింది . యజమానుల లాభంలో కార్మికుల అదనపు శ్రమ ఇమిడి వున్నందున్న లాభంలో వాటాగా బోనస్ చెల్లించాలన్న వాదన ఆధారంగా 1965 బోనస్ చట్టం వచ్చింది. కార్మికుల అదనపు శ్రమే యజమాని లాభం అన్న మార్క్స్ విశ్లేషణను ఇది సమర్థించినట్లయింది. చట్టంలో నిర్దేశించిన ప్రకారం లాభంలో ఒక వాటాను వేరు చేసి విధిగా చెల్లించే పద్ధతి స్థిరపడింది. దీనికితోడు 2013లో కంపెనీల చట్టాన్ని సవరించారు. కార్పొరేట్ లాభాలలో 2 శాతాన్ని "సమాజం కోసం

ఖర్చు చెయ్యాలన్నది చట్టబద్ధం అయింది. వస్తువు తయారీలో యజమాని పొందే అదనపు శ్రమ లాభానికి మూలం అయినప్పటికీ ఆ వస్తువును సమాజం కొనుగోలు చేసినప్పుడే అది లాభంగా స్థిర రూపం పొందుతుంది అన్నది మార్క్స్ చేసిన విశ్లేషణే. లాభాలను సమాజానికి పంపిణీ చేయాలన్నదే ఈ సవరణ సారాంశం. ఇవి అనేక లోటుపాట్లు వున్న అరకొర చర్యలే. కాని లాభాలకు శ్రమదోపిడీ మూలం అనీ దానిని కార్మికులకు, సమాజానికి హక్కుగా పంపిణీ చెయ్యాలన్న సూత్రాన్ని ఆవిష్కరించాయి. భవిష్యత్తులో సంపద పంపిణీకి ఇది దారులు వేస్తుంది.

**3. సంపద పంపిణీకి ద్వారాలు తెరవాలి :** అదనపు శ్రమ లాభాలకు మూలమైనట్లే 'పోగుపడ్డ అదనపు శ్రమే' సంపద అన్నది మార్క్స్ విశ్లేషణ. లాభాలలో వాటా బోనస్‌గా కార్మికులకు, మరో వాటా సమాజం కోసం ఖర్చు చెయ్యడం చట్టబద్ధం అయినట్లే ఇప్పుడు పోగుపడ్డ సంపద పంపిణీని కూడా చట్టబద్ధం చెయ్యాలి. కరోనా కల్లోలం సృష్టించిన, నిరుద్యోగాన్ని, అర్థాకలిని, అప్పుల వలయాన్ని అధిగమించడానికి 'పన్నుల సొమ్ములు' అరకొరగా లాభాల వాటాలు' సరిపోవు. ఈ పరిస్థితిని ఎదుర్కొనడానికి దీర్ఘకాలికంగా ప్రజలకు జీవించే హక్కును కల్పించడానికి మిగిలిన ఏకైక పరిష్కారం 'పోగుపడ్డ సంపదను' పంపిణీ చెయ్యడమే. సంపద పంపిణీ జాతీయ చట్టం కోసం ప్రజాభిప్రాయాన్ని సేకరించే కార్యక్రమాలు తక్షణం ప్రారంభం కావాలి. సంపద పంపిణీ ద్వారా పేదలకు నగదు బదిలీ చేసే మౌలిక ఆదాయ కల్పనతోపాటు మొత్తం సమాజానికి బతుకు భరోసానిచ్చే మంచి ప్రమాణాల ఉచిత విద్య, ఉచిత వైద్య సేవలు, ఉపాధి నైపుణ్యాలు అందించే ఏర్పాటు జరగాలి. ఈ అంశాలు పేదరికంలో వున్న కోట్లాది ప్రజలలో, మౌలిక సదుపాయాలు అందని ప్రజలందరిలో కొత్త ఆకాంక్షను రేకెత్తిస్తుంది. 10 శాతం మంది దగ్గర పోగుపడ్డ సంపదపై 70 శాతం ప్రజలు జరిపే ఉద్యమంగా అది విస్తరిస్తుంది. ఇప్పుడు సంపద పంపిణీకి ద్వారాలు తెరిస్తే అది భవిష్యత్తులో సంపద సమాజపరం కావాలన్న సమసమాజ ఆకాంక్షకు దారి తీస్తుంది. సంపద పంపిణీ ద్వారా జీవించే హక్కు ను సాధించడం అన్నది తక్షణ ప్రజా ఉద్యమ నినాదం కావాలి.

ఆంధ్రజ్యోతి 2021 జూన్ 11,

# మోదీని ఓడించే భావజాల పోరాటం

**మో**దీ రాజకీయం మామూలు రాజకీయం కాదు. సంప్రదాయ రాజకీయానికి పూర్తిగా భిన్నమైంది. ఈ ప్రత్యేక తరహా రాజకీయాన్ని ఆవిష్కరించడానికి, విశ్లేషించడానికి సంప్రదాయ రాజకీయ కొలబద్దలు పనికిరావు. ఇటాలియన్ మార్క్సిస్టు ఆంటోనియో గ్రాంసీ రచనలలోని భావజాలం మనకు ఉపకరిస్తుంది. మోదీ రాజకీయాన్ని ప్రతిఘటించడానికి, ప్రత్యామ్నాయ రాజకీయాన్ని రూపొందించడానికి అది దారి చూపిస్తుంది. ఈ భావజాలం నేపథ్యంలో మోదీ రాజకీయాన్ని అర్థం చేసుకోవడానికి మనం కొత్త ఉపకరణాలను రూపొందించుకోవాలి. ప్రతిఘటించడానికి కొత్త మార్గాలను అన్వేషించుకోవాలి.



నిత్యజీవితంలో ప్రజలు కష్టాలను అనుభవిస్తున్నారు. అయినా మోదీని ఆమోదిస్తున్నారు. ఇది మన కళ్ల ముందు కనిపిస్తున్న రాజకీయ వైరుధ్యం. పాలకులు ప్రజల నెత్తిన భారాలు పెడితే వారు దానిని నిరసించాలి. ప్రతిఘటించాలి. పాలకులు ప్రజాదరణ కోల్పోవాలి. లేదా పరాజయం పొందాలి. కాని ప్రస్తుత పరిస్థితి దీనికి భిన్నంగా వుంది. పప్పులు, నూనెల ధరలు విపరీతంగా పెరిగాయి. పెట్రోలు, డీజిల్ ధరలు సెంచరీలు చేస్తున్నాయి. నిరుద్యోగం కొవిడ్‌కి ముందే తారస్థాయికి చేరింది. తర్వాత ఉపాధి స్థితి అధ్వాన్నం అయింది. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు మద్దతు ధర పెరగకపోగా ఉన్నదీపోతోంది. కొత్త వ్యవసాయ చట్టాలు, కొత్త కార్మిక చట్టాలు, కొత్త పౌరసత్వ చట్టాలు అన్నీ ప్రజా వ్యతిరేకమైనవే.

పౌరహక్కుల మీద, ప్రజాస్వామ్య వ్యవస్థల మీద నిత్యం దాడులు జరుగుతున్నాయి. పెద్ద నోట్ల రద్దుతో కుదేలైన ఆర్థిక వ్యవస్థ ఎన్ని ఉద్దీపనలు ఇస్తున్నా తిరోగమనంలోనే వుంది. కొవిడ్ కాలంలో ప్రజలు పడ్డ, పడుతున్న కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. నిత్యజీవితంలో ప్రజలు ఇన్ని కష్టాలను

భరిస్తున్నారు. ఒకనాడు ఉల్లిపాయల ధరలు పెరిగితే ప్రభుత్వాలు పడిపోయిన దేశంలో ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ప్రజలు కష్టాలను భరించడానికి సిద్ధం అవుతున్నారు. కాని మోదీని వదిలించుకోవాలని భావించడం లేదు. 2021 జనవరిలో ఇండియా టుడే నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో మోదీ జనాకర్షణ కించిత్తు కూడా తగ్గలేదని, ఎన్నికలు జరిగితే 302 సీట్లు గెలుస్తారని వెల్లడించింది.

ప్రజలు మోదీ పాలనలో కష్టాలను భరించడానికి ఎందుకు సిద్ధం అవుతున్నారు? మోదీ పట్ల మోజును ఎందుకు వదులుకోవడం లేదు? మోదీ రాజకీయంలోని ఈ ప్రత్యేకతను ఎలా అర్థం చేసుకోవాలి అన్న దానిని లోతుగా పరిశీలించాలి.

2014 ఎన్నికలలో మోదీ ఘన విజయం సాధించారు. ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికలలో అధికార మార్పిడి సహజం. ఈ అధికార మార్పిడి సంప్రదాయ రాజకీయ పరిణామంగానే జరిగిందా ? లేక సంక్షోభకాలపు ప్రత్యేకత వల్ల జరిగిందా ? అన్న అంశాన్ని విశ్లేషించుకోవాలి.

2014 ఎన్నికల నాటికి దేశంలో రాజకీయ సంక్షోభం లేదా నాయకత్వ సంక్షోభం చోటు చేసుకుంది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అవినీతి కుంభకోణాల పరంపరలో చిక్కుకుంది. అవినీతికి వ్యతిరేకంగా లోక్‌పాల్ చట్టం కోసం అన్నా హజారే ప్రారంభించిన ఉద్యమం ఢిల్లీని కదిలించింది, దేశవ్యాపిత ఉద్యమరూపం ధరించింది. రాజకీయాలకు దూరంగా వుండే మధ్య తరగతి వర్గాలు ఈ రాజకీయ ఉద్యమంలో పాత్రధారులయ్యారు. సోనియాగాంధీ చేతిలో కీలుబొమ్మ ప్రధానిగా మన్మోహన్‌ను నిర్ణయాలు తీసుకోలేని అసమర్థునిగా భావించారు. అలాగే ముంబై పేలుళ్లపై పాకిస్తాన్‌తో దీటుగా వ్యవహరించలేదన్న విమర్శలు చేశారు. ఎన్నికల నాటికి పాలక పార్టీ 'నాయకత్వ సంక్షోభం'లో పడింది.

ఇలాంటి రాజకీయ సంక్షోభాలపై ఆంటోనియో గ్రాంసీ తన రచనలలో చాలా లోతైన విశ్లేషణలు చేశారు. పాలక పార్టీ తన అధికారాన్ని కొనసాగించలేని స్థితి, మరోపక్క ప్రతిపక్షాలు దానిని తొలగించలేని స్థితి వున్నప్పుడు రాజకీయ సంక్షోభంలో అనిశ్చితి ఏర్పడుతుంది. అలాంటప్పుడే రాజకీయ రంగంలో సమ్మోహనా శక్తులకు ద్వారాలు తెరుచుకుంటాయి. ఈ అనిశ్చితిని తొలగించగల హీరోల కోసం, ప్రజల వెదుకులాట ప్రారంభం అవుతుంది. ఇది స్థూలంగా గ్రాంసీ విశ్లేషణ సారాంశం. 2014 నాటికి కాంగ్రెస్ పార్టీ అధికారానికి నూకలు చెల్లాయి. కాని దాని స్థానాన్ని ఏ ఒక్క పార్టీ ఆక్రమించగల స్థితిలేదు. అలాగే ప్రాంతీయ

పార్టీలు, వామపక్షాలు అధికారం చేపట్టగల స్థితి కనిపించలేదు. గ్రాంసీ పేర్కొన్నట్లు ఇలాంటి అనిశ్చితి కాలంలో ప్రజలు హీరోల కోసం వెదుకులాడడం సహజం.

అయితే దీనిని మోదీగాని బీజేపీగాని ముందుగానే పసిగట్టిన దాఖలాలు లేవు. మోదీ తన ఎన్నికల ప్రచారంలో హిందూత్వాన్నీ, రామాలయాన్ని తెర వెనుకనే వుంచారు. అందరికీ మంచిరోజులు, అందరికీ అభివృద్ధి, యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, విదేశాలలో ఉన్న అవినీతి సొత్తు తెచ్చి తలా రూ.15 లక్షల పంపిణీ వంటి సాధారణ వాగ్దానాలనే ఎన్నికల ప్రచారంలో ముందుకు తెచ్చారు. గుజరాత్‌లో సాధించిన విజయాలనే దేశమంతా విస్తరింపజేస్తాననే ప్రచారాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ నినాదాలు ఆయన విజయానికి ఎంత వరకు దోహదం చేశాయో తెలియదు. కాని ప్రజలు, ప్రత్యేకించి యువత ఆయన వాగ్దానాల కోణం నుంచి కాకుండా దేశాన్ని రక్షించే, నడిపించే హీరోగా ఓట్ల ప్రభంజనాన్ని సృష్టించారు. ఈ ఎన్నికల్లో ఆయన వాడిన నినాదాలకంటే 'నాయకత్వ సంక్షోభం' కాలపు ప్రజల మనోస్థితి ప్రధానపాత్ర వహించింది. ఇది మోదీ నినాదాలు సృష్టించిన ప్రభంజనం కాదు. సంక్షోభకాలంలో ప్రజల మనోస్థితి సృష్టించిన ప్రభంజనం. అందువల్ల మోదీ బలం ఆయన ప్రచారం చేసిన నినాదాలలో కంటే ప్రజల మనోభావాల స్థితిలో వుందన్న అంశాన్ని మనం గుర్తించాలి.

## మోదీని హీరోను చేసింది ఎవరు ?

పౌరసమాజంలో భావజాల ఆధిపత్యం లేదా ప్రాబల్యం నిర్వహించే పాత్రపై గ్రాంసీ తన హెజమనీ సిద్ధాంతంలో విపులంగా చర్చించారు. పాలకవర్గాలు తమ పాలన సాగించడానికి బలప్రయోగ పద్ధతులతోపాటు పౌరసమాజ సమ్మతిని పొందడం సాధనం చేసుకుంటారు. ఈ పౌర సమాజ సమ్మతికి ప్రభుత్వేతర పౌర సంస్థలన్నింటి ద్వారా అంటే పాఠశాలలు, మత సంస్థలు, సాంస్కృతిక సంస్థలు వగైరాలన్నింటినీ వినియోగించుకుంటారు.

ఈ భావజాల ప్రాబల్యాన్ని సాధించడంలో సవర్గ మేధావుల పాత్రను ఆయన వివరించారు. ఇది పాలక వర్గాల హెజమనీ సాధనలోనూ, దానికి ప్రత్యామ్నాయంగా రూపొందే కౌంటర్ హెజమనీ సాధనలోనూ కీలకపాత్ర పోషిస్తుంది. ఈ విశ్లేషణ నేపథ్యంలో మోదీని హీరోని చేసిన అంశాలను పరిశీలించడం అవసరం. 2017లో అమెరికాకు చెందిన అసోసియేషన్ ఫర్ పబ్లిక్ ఒపీనియన్ సంస్థ భారత ప్రజల రాజకీయ అభిప్రాయాల మీద సర్వే

నిర్వహించింది. దేశంలో ఎలాంటి మినహాయింపులు లేని ప్రజాస్వామ్య ప్రభుత్వమే వుండాలన్న స్పష్టమైన నిబద్ధతను ప్రకటించిన వారు కేవలం 8 శాతం వున్నారు. 67 శాతం మంది ప్రజాస్వామ్యంపై కొంత విశ్వాసం ప్రకటించినప్పటికీ వారు ప్రజాస్వామ్య రహిత ప్రభుత్వాలపై కూడా సానుకూలతను వ్యక్తం చేశారు. 55 శాతం మంది నిరంకుశ ప్రభుత్వాలను సమర్ధించారు. 27 శాతం మంది 'బలమైన నాయకుడు' అవసరమన్నారు. అంతేకాదు 53 శాతం మంది సైనిక పాలన అవసరంగా భావించారు. భారతదేశానికి పాకిస్థాన్ 'అత్యంత' ప్రమాదకరమైన దేశంగా భావించారు. ఈ సర్వే 2017లో నిర్వహించినా ఇలాంటి భావాలు చాలకాలంగా దేశంలో వ్యక్తం అవుతూనే వున్నాయి.

దీనికితోడు బీజేపీ మాత సంస్థ రాష్ట్రీయ స్వయక్ సేవక్ సంఘ్‌ను ఐదేళ్లుగా చరిత్రనీ, సంస్కృతిని వక్రీకరిస్తూ మతవిద్వేష భావజాలాన్ని, గత కాలపు హిందూ వైభవాలను, మత జాతీయవాదాలు వగైరాలను నూరిపోస్తూనే వుంది. పైగా మన చరిత్ర రచన నేటికీ హీరోల చుట్టూనే తిరుగుతున్నది. పురాణాలనే చరిత్రగా భావించడం, దుష్ట శిక్షణకు యుగ పురుషుల అవతారాలపై ప్రచారం నేటికీ నడుస్తూనే వుంది. రాజకీయరంగంలో 'నాయకత్వ సంక్షోభం' తలెత్తినప్పుడు, హీరోల కోసం వెదుకులాటలు ప్రారంభమైనప్పుడు పౌరసమాజంలోని ఇలాంటి భావజాలం కీలకపాత్ర పోషిస్తుంది. మన పౌర సమాజంలో నెలకొనివున్న ఈ భావజాలానికి తగిన ప్రతినిధిగా మోదీ కనిపించారు. ఆయనను ఈ భావజాలమే హీరోను చేసింది.

దేశాన్ని ఐక్యపరిచిన వ్యక్తిగా ప్రాచుర్యంలో వున్న 'సర్దార్ పటేల్'కు నివాళిగా ప్రపంచంలోనే అతి పెద్ద విగ్రహ నిర్మాణాన్ని మోదీ ప్రకటించారు. ప్రజలు మోదీలోని 'ఉక్కుమనిషి'ని అందులో చూశారు. గుజరాత్ అభివృద్ధి నమూనా ప్రచారంతో 'మోదీ వికాస్ పురుష్' అయ్యాడు. గుజరాత్ అల్లర్లలో ముస్లింలను 'ఉక్కు పాదంతో' అణిచివేసిన తీరుతో 'ప్రతీకారేచ్ఛకు' ప్రతిరూపం అయ్యాడు. భార్యను విడనాడి భరతమాత సేవకు అంకితమైన 'సర్వసంగ పరిత్యాగి' 'భారత్‌మాతాకి జై' అంటూ దేశం కోసమే జీవిస్తున్న హీరోగా కనిపించాడు.

మొత్తం మీద పౌరసమాజంలో నెలకొని వున్న ఈ భావజాలం కోరుకున్నది 'దేశరక్షకుడైన ఉక్కు మనిషిని', దేశానికి 'ప్రమాదకారి' అయిన ముస్లిం పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పగల హిందూ జాతీయవాదిని, గతకాలపు 'పురాణ' వైభవాలను పునరుద్ధరించే హీరోనే. మోదీ విజయం తర్వాత ప్రజలు ఆయన పాలనను ఈ

భావజాలపు కళ్లద్దాలతోనే చూస్తున్నారు. నిత్య జీవితానికి సంబంధించిన మోదీ వైఫల్యాలు వారికి అంతగా పట్టకపోవడానికి ఇదే కారణం.

## ప్రజా సమస్యలకు దూరం - జనాకర్షణకు మార్గం

మోదీ ఒక సాధారణ రాజకీయవాదిగా వ్యవహరించడం లేదు. ప్రభుత్వ పాలన తనకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఆయన ప్రసంగాలలో ప్రజలు నిత్య జీవితంలో పడుతున్న కష్టాలను ప్రస్తావించడం లేదు. వాటిని మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి వదిలేశారు. వాటివల్ల వచ్చే అసంతృప్తికి తాను గురికాకుండా జాగ్రత్తపడుతున్నారు. తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. తానొక సన్యాసిగా, యోగా సాధకునిగా, సంసార జంఝాటం లేనివాడిగా, భౌతిక వస్తువుల సంపదపై ఆసక్తి లేని వానిగా అందరి దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన భారతదేశాన్ని కేవలం రాజకీయవేత్తగా కాకుండా సామాజికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా నడిపించే నేతగా కనిపించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన తపస్సు గురించి, యజ్ఞం గురించి, యోగా గురించి, గతకాలపు హిందూ వైభవం గురించి అనేక ప్రస్తావనలు చేస్తున్నారు. కష్టాలు పడకుండా సుఖాలు, ముక్తి దక్కదన్న భావన కల్పిస్తున్నారు.

ఈ మార్గంలో ఆయన రాజకీయ అభిమానులని కాకుండా భక్తులను సృష్టించుకుంటున్నారు. భక్తులకు వచ్చే కష్టాలు దేవుడు పెట్టే పరీక్షలు. వారు కష్టాలను అనుభవిస్తారే తప్ప, తమ ఆరాధనను వదులుకోరు. పైగా మరింత పెంచుకుంటారు. దేశానికి మోదీ అవసరం అన్న నినాదం దీని నుండి పుట్టుకొచ్చిందే. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే నాయకుడు అన్న నినాదం అంతిమంగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతంచేస్తుంది. వైవిధ్యాన్ని తొలగిస్తుంది. నియంతృత్వానికి, ఫాసిజానికి ద్వారాలను తెరుస్తుంది.

అందువల్ల మోదీ రాజకీయాన్ని మరింత లోతుగా అధ్యయనం చెయ్యాలి. మోదీ పాలనాపరంగా బలహీనుడే. ప్రజల మీద భారాలు మోదే సాధారణ రాజకీయవేత్తే. కార్పొరేట్ దోపిడీకి ద్వారాలు తెరిచేవాడే. ఆయన ప్రజాకర్షణ ఆయన అనుసరిస్తున్న రాజకీయ విధానాలలో లేదు. పౌరసమాజంలో నెలకొన్న భావజాలంలో వుంది. దానిని తన ఆకర్షణగా మార్చుకునే పరిభాషలో వుంది. అందువల్ల మోదీ రాజకీయం మీద చేసే పోరాటం కేవలం ఆర్థిక అంశాల మీద


చేస్తే సరిపోదు. మోదీ రాజకీయం మీద పోరు పౌర సమాజంలో నెలకొన్న భావజాలం మీద జరగాలి. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటా జరగాలి. ఇందులో సాంస్కృతిక రంగంలో జరిగే పోరాటం కీలకం అవుతుంది. ప్రజల లోకజ్ఞానంలో భాగమైన ఈ భావజాలాన్ని విచక్షణా జ్ఞానంగా మార్చే కొత్త రూపంలో, సరికొత్త నినాదాలతో జరగాలి. పౌర సమాజంలో అలాంటి ప్రజా ప్రత్యామ్నాయ భావజాలం మీద సాగించే ఉద్యమాల రూప కల్పనకు గ్రాంసీ భావజాలం మనకు దారి చూపిస్తుంది.

(8 ఏప్రిల్ 2021, విశాలాంధ్ర)

# భారతీయ చింతన నుండి ప్రభవించిన తొలి మార్క్సిస్టు రాహుల్

(గౌరవ్ సంకలనం చేసిన–ఒకే వ్యక్తి అనేక జీవితాలు – రాహుల్ సాంకృత్యాయన్ పుస్తకం నుండి)

**రా**హుల్ సాంకృత్యాయన్ మీద ఇప్పటికే అనేకానేక రచనలు వచ్చాయి. ఆయన జీవితంలోని వివిధ కోణాలను విశ్లేషించిన వ్యాసాలు, అధ్యయనాలు ఉన్నాయి. అయినా ఆయన జీవన గమనాన్ని తరచి చూసే కొద్దీ మరిన్ని కొత్తకోణాలు ఆవిష్కృతం అవుతూనే వుంటాయి. ఎందుకంటే ఆయన జీవితం అంతటి విశాలమైనది. ఎంతో లోతైనది. రాహుల్ చదువు పాఠశాల మధ్యలోనే ఆగిపోయింది. కాని, పలు భాషలను స్వంతం చేసుకున్నారు. ఆయన సంస్కృతం, హిందీ, పాళీ, టిబెటన్, భోజ్‌పురి భాషల్లో అత్యధిక రచనలు చేశారు. దాదాపు 30 భాషలు ఆయనకు తెలుసు. ఆయన స్వయంకృషీవలుడు. రాహుల్‌జీ జీవితంలో చాలా భాగం దేశ దేశాల సంచారంతోనే గడిచింది. ఆయన కేవలం దేశదిమ్మరి కాదు. జ్ఞాన సముపార్జనకు నిరంతరం వెతుకులాడిన లోక సంచారి. ఆయన నిత్య సత్యాన్వేషకుడు. సత్యాన్వేషణే ఆయన జీవన గమనానికి దిక్సూచి. అదొక జ్ఞాన శిఖరారోహణ క్రమం.




వైష్ణవ సాధువుగా ప్రారంభమైన ప్రయాణం అనేక మలుపులు తిరిగింది. అనేక మజిలీలను దాటింది. స్వేచ్ఛా చింతన, హేతువాద దృష్టి, జనజీవనం పట్ల మమకారం. అంతిమంగా ఆయనను మార్క్సిజం మజిలీకి చేర్చింది. ఈ సత్యాన్వేషణ క్రమంలో ఆయన వివిధ మజిలీలను రేఖా మాత్రంగా దర్శించడమే ఈ వ్యాసం ఉద్దేశం. అదే దీనికున్న పరిమితి కూడా. రాహుల్జీకి తల్లిదండ్రులు పెట్టిన పేరు కేదార్‌నాథ్ పాండే. పాఠశాలలో చదివింది నాలుగో తరగతి వరకే.

చిన్నతనంలోనే కేదార్‌నాథ్ మీద కొన్ని ప్రభావాలు పడ్డాయి.

మొదటిది ఉర్దూ పాఠశాలలో వుండగా చదివిన కవిత.

'ఓ నరుడా! ఈ విశాల ప్రపంచాన్ని సందర్శించి రా!

లభించదు మరో జీవితం దానికోసం

కలకాలం జీవించినా తిరిగి రాదు.

నవయవ్వన మధుహాసం' ఈ కవిత ఆ బాలుని జీవిత లక్ష్యమైంది. లోక సంచారిని చేసింది.

మరొకటి అదే కాలంలో తన గ్రామంలో కలరా వచ్చింది. దుర్గామాతను ప్రసన్నం చేసుకునే క్రతువు జరిగింది. తన మేనమామ సంస్కృత పండితుడు. ఆయనతో ఆ క్రతువును నిర్వహింపజేశారు. ఇది సంస్కృతం మీద మక్కువను కలిగించింది. ఇలా అంకురించిన భాషాభిమానం అంతిమంగా బహుభాషా కోవిదుణ్ణి చేసింది. మరొకటి తన తాత గారు చెప్పే జానపద కథలూ, పౌరాణిక గాథలు మంత్ర, తంత్ర కథలు ఆకర్షించాయి. వైష్ణవ మతాచారాలతోపాటు మూఢవిశ్వాసాలు వంట బట్టాయి. ఇవి జీవితంలో ఒకసారైనా దైవ దర్శనం చేసుకోవాలన్న కోరికకు బలమైన బీజాలు వేశాయి. కేదార్నాథ్ తన 10వ ఏట ఇల్లు విడిచి లోక సంచారం మొదలుపెట్టాడు. కలకత్తాలోని సాధువుల బృందంలో చేరాడు. సంస్కృతం నేర్చుకోవడం మొదలుపెట్టారు. మరోపక్క లోక సంచారం సాగించాడు.

1910లో కాశీకి వెళ్ళాడు. సంస్కృతంతోపాటు ఆయుర్వేదం, జ్యోతిష్యం మీద పుస్తక రచన చేశాడు. దేవతల అనుగ్రహం పొందడానికి కష్టతరమైన సిద్దులను, నామజపాన్ని నేర్చుకున్నాడు. ఒకసారి దేవతా దర్శనం కోసం ఎనిమిది రోజులపాటు కఠోర తపస్సు చేశాడు.

9వ రోజు కూడా దైవదర్శనం కాలేదు. దీంతో చాలా నిరుత్సాహపడ్డాడు. ఆత్మహత్య చేసుకోవాలని ఉమ్మెత్త గింజలు తిన్నాడు. అతికష్టం మీద బతికి బైట పడ్డాడు. ఇలాంటి మూఢ నమ్మకాల మీద నమ్మకం సడలింది. సత్యాన్వేషణకు, హేతు చింతనకు అంకురార్పణ జరిగింది. ఈ కాలంలోనే పర్సా పీఠాధిపతి కాశీకి వచ్చాడు. తన పీఠానికి వారసుని కోసం ఆయన అన్వేషిస్తున్నాడు. కేదార్‌నాథ్‌ను వారసునిగా ఎంపిక చేసుకుని తనతో పీఠానికి రమ్మని ఆహ్వానించారు. అలా కేదార్నాథ్ పర్సా పీఠానికి వెళ్లాడు. అక్కడ మంత్రోపదేశం తీసుకున్నాడు. తిరునామాలు వేయించుకున్నాడు. తన పేరును రామ్ ఉదార్దాస్ మార్చుకున్నాడు.

వైష్ణవ సన్యాసిగా మారాడు. ఆ మఠంలో భోజనానికి విశ్రాంతికి లోటులేదు. ప్రాచీన సంస్కృత బ్రాహ్మణీయ సాహిత్యాన్ని అధ్యయనం చేసి వాటిపై మంచి పట్టు సంపాదించాడు.

స్వేచ్ఛా చింతన, హేతుతత్వం, సత్యాన్వేషణ గల రామ్ ఉదార్దాస్‌కు మఠాలలోని డొల్లతనం స్పష్టపడింది. ఇక్కడ బోధించే విలువలు, నైతిక సూత్రాలు తరానికి నిలబడేవి కావని అర్థమైంది. పైగా లోక సంచారికి ఈ మఠం ఒక కూపస్థ మండూకంగా కనిపించింది. తన సత్యాన్వేషణకు ఇది సరిపడదని నిర్ణయించుకుని ఆశ్రమాన్ని వదిలిపెట్టి లోకసంచారం చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. దీంతో వైష్ణవ సన్యాస మజిలీ ముగిసిపోయింది. తర్వాత అయోధ్యకు చేరిన రామ ఉదార్దాస్‌కు ఆర్య సమాజ్ ప్రచారకులతో సంపర్కం కలిగింది. వారి రచనలను చదివారు. ఆర్య సమాజానికి రెండు ముఖాలున్నాయి.

ఆర్య సమాజ్ హిందూ సనాతన ధర్మం పరమ పవిత్రమైనదని, స్వచ్ఛమైనదని పాశ్చాత్యుల మత విశ్వాసాలకు, ఇస్లాం మత విశ్వాసాలకంటే ఉన్నతమైనదని, హేతుబద్ధమైనదని భావిస్తారు. సనాతన ధర్మంలో ఇతరేతర కారణాల వల్ల దాని ఆచార వ్యవహారాలలో క్రతువులలో చోటు చేసుకున్న హేతుబద్ధం కాని విసర్జనీయ అంశాలపై అది విమర్శలు చేస్తుంది. దాన్ని సంస్కరించాలని వాదిస్తుంది. అందువల్ల దానిలో స్వేచ్ఛా చింతన హేతుతత్వం కనిపిస్తుంది. ఆర్య సమాజ్ ఒకపక్క సనాతన ధర్మాన్ని సమర్థిస్తూనే, వితంతు వివాహాలను సమర్థించింది. సంప్రదాయాల పేరుతో సాగే మూఢ విశ్వాసాలను వ్యతిరేకించింది. ఇది కేదార్‌నాథ్‌ను ఆకర్షించింది. ఆర్య సమాజ్ ప్రచారకుడయ్యాడు. ఇస్లాం, క్రైస్తవ మిషనరీలు సాగిస్తున్న మత ప్రచారాన్ని వారి గోదాలోనే తిప్పికొట్టడానికి అరబిక్, పర్షియన్ భాషలు నేర్చుకున్నాడు. సనాతన ధర్మం అనేది ప్రపంచంలోనే అత్యంత హేతుతత్వం గల శాస్త్రీయమైన మతంగా దానిని నెత్తికెత్తుకున్నాడు. అయితే తన లోక సంచారంలో మరో కోణం కనిపించింది.

1919లో ఆయన లాహోరీలో వున్నాడు. అక్కడ సాగుతున్న మిలటరీ పాలన రుచి చూశాడు. ఇది రాజకీయాలలో ఆయనకు కలిగిన ప్రత్యక్ష అనుభవం. ఈ సవాలుని ఎదుర్కొనడానికి సంస్కృతంలోని ఆధ్యాత్మిక పరిజ్ఞానం గాని, ఆర్య సమాజ్ సిద్ధాంతాలు ఎందుకూ కొరగానివిగా కనిపించాయి. జలియన్ వాలాబాగ్ ఉదంతం ఆయనను తీవ్రంగా కలచివేసింది. దీంతో ఆయన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలని భావించాడు. 1921లో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు.

1922లో అరెస్టయి ఆరు నెలలు శిక్ష అనుభవించాడు.

1924లో మరోసారి రెండేళ్లు జైలుపాలయ్యాడు. స్వరాజ్య ఉద్యమాన్ని రైతులు – కూలీల రాజ్యం కోసం సాగుతున్న ఉద్యమంగా భావించాడు. రైతు ఉద్యమంలో పాత్రధారి అయ్యాడు. ఈ ప్రయాణంలో ప్రాచీన ఆధ్యాత్మిక చింతన, ఆర్యసమాజ్ సిద్ధాంతాల పట్ల నమ్మకం పూర్తిగా సడలిపోయిది. మరోపక్క రైతుల ఉద్యమం వలన ఆయన సత్యాన్వేషణకు తాత్విక చింతనతోపాటు కార్యాచరణ అవసరమన్న మరో కొత్తకోణం వచ్చి చేరింది.

1920లో ఆయనకు బౌద్ధంతో పరిచయం కలిగింది. బౌద్ధం మీద దొరికిన ప్రతి పుస్తకాన్ని చదివాడు. బుద్ధుడు పుట్టిన లుంబినితోపాటు ఆయన సంచరించిన బుద్ధగయ, సారనాధ్, కుశలతోపాటు నలంద, రాజగిరి ప్రాంతాలను సందర్శించాడు.

1926లో జైలు నుంచి విడుదలై వచ్చిన తర్వాత 1927లో శ్రీలంకలో విద్యాలంకార పరివేణి సంస్థలో సంస్కృత అధ్యాపకునిగా చేరాడు. సాధు వేషాన్ని వదిలివేశాడు. శ్రీలంకలో ఆయన బౌద్ధ గ్రంథాల అధ్యయనం మీద సమయం కేంద్రీకరించాడు. విశ్వవ్యాపితమైన బౌద్ధం మీద పరిశోధన కోసం దుర్గమమైన దారులలో టిబెట్‌కు వెళ్లాడు. బౌద్ధగ్రంథాల అధ్యయనానికి, వాటి ప్రతుల సేకరణకు ఆయన సాగించిన కృషిని, సాహసకృత్యాలను వివరించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రాచీన బౌద్ధ గ్రంథాలు గర్భంలో కలిసిపోకుండా కాపాడింది ఆయనే.

20వ శతాబ్దంలో తిరిగి బౌద్ధాన్ని మన దేశంలో, ప్రపంచంలో ప్రచారంలోకి తెచ్చింది ఆయనే. బౌద్ధంలోని హేతుతత్వం, చలనశీలత, ఆరామాలలో దాని ఆచరణ ఆయనను అమితంగా ఆకర్షించాయి. భారతీయ తాత్విక చింతనలో బౌద్ధం ఒక అత్యున్నత దశగా ఆయన భావించాడు.

1930లో టిబెట్ నుండి తిరిగి రాగానే శ్రీలంకలో ఉపసంపద సంస్కారం చేసుకుని బౌద్ధ భిక్షువుగా కాషాయ వస్త్రాన్ని ధరించాడు. తన పేరును రాహుల్ సాంకృత్యాయన్‌గా మార్చుకున్నాడు. ఆ తర్వాత ఆయన తన పేరు మార్చుకోలేదు. బౌద్ధం పట్ల తన అనురక్తిని వదులుకోలేదు. పాట్నా మ్యూజియంకు తన కాషాయి వస్త్రాలను అప్పగించి సాధారణ దుస్తులతో రైతు ఉద్యమానికి నాయకత్వం వహించడం కొనసాగించాడు.

1917లో రష్యన్ విప్లవం తర్వాత కమ్యూనిస్టు భావజాలం ప్రపంచవ్యాపితంగా

విస్తరించింది. రష్యాలో కార్మిక, కర్షక రాజ్యం సాధిస్తున్న విజయాల వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. పత్రికలలో వస్తున్న వార్తలు, వ్యాసాలు రాహుల్‌ను ఆకర్షించాయి. తాను ఆశించిన కార్మిక కర్షక రాజ్యం అక్కడ ఏర్పడుతుందన్న భావన కలిగింది. బౌద్ధ ఆచార్యుడిగా ఆయన సోవియట్ రష్యాను రెండుసార్లు సందర్శించారు.

1932లో లండన్‌లో వున్నప్పుడు మార్క్స్ సమాధికి నివాళులు అర్పించాడు. భారతదేశంలో కమ్యూనిస్టులతో పరిచయం జరిగిన తీరును బొమ్మారెడ్డిగారు రాసిన పుస్తకంలో చాలా వివరాలు ఇచ్చారు. వృద్ధ కమ్యూనిస్టు మహాదేవసాహెరీ కలకత్తాలో రాహుల్జీని కలుసుకోవడం, కమ్యూనిస్టు సాహిత్యాన్ని, రహస్య పత్రికలను ఆయనకు అందించడం, కమ్యూనిస్టు నాయకులతో సమావేశం, అప్పుడు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం వున్నందున వారు పనిచేస్తున్న కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరవలసిందిగా రాహుల్జీని కోరడం, దానికి ఆయన అంగీకరించడం, అంతిమంగా 1939 అక్టోబరులో మాంఘీర్‌లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ బీహారు శాఖలో పార్టీ వ్యవస్థాపక సభ్యుడుగా ఎన్నిక కావడం వరకు అనేక వివరాలను బొమ్మారెడ్డి గారు తన పుస్తకంలో వివరించారు.

భారతదేశంలోని తొలితరం కమ్యూనిస్టులందరూ రష్యన్ విప్లవం ప్రచారంతోనే రూపుదిద్దుకున్నారు. వారికి అందుబాటులో వున్న రచనల ఆధారంగానే మార్క్సిస్టు భావజాలాన్ని అర్థం చేసుకున్నారు. ఆ తర్వాత గతితార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదం ఆధారంగా భారతీయ తాత్విక చింతనను అధ్యయనం చేశారు. భారతీయ తాత్విక చింతన, చరిత్రపై గొప్ప రచనలు చేశారు.

రాహుల్ ప్రయాణం దీనికి పూర్తిగా భిన్నమైంది. ఆయన మార్గం భారతీయ తాత్విక చింతన సంస్కృత గ్రంథాలతో, ప్రాచీన సాహిత్యంతో ప్రారంభమై, ఆర్య సమాజ్ సంస్కరణల వైపు సాగి తర్వాత బౌద్ధానికి చేరింది. ఈ ప్రయాణంలో ఆయనకు చారిత్రక భౌతికవాదం, గతితార్కిక వాదాల ప్రమేయం లేదు. ఆయన స్వంతంగా రూపొందించుకున్న ప్రమాణాలే ఆయనను నడిపించాయి.

'తన జీవితానుభవం, దాని నుంచి నేర్చుకున్న గుణపాఠాలు క్రమక్రమంగా తనను హేతువాదం వైపు, కారణాలు అన్వేషణ వైపు నడిపించాయ'ని చెప్పుకున్నాడు. మార్క్సిస్టు సాహిత్యంతో పరిచయం ఏర్పడిన తర్వాత బౌద్ధాన్ని దానితో తులనాత్మక పరిశీలన చేశాడు. ఈ సత్యాన్వేషణలో బౌద్ధానికి వున్న పరిమితులను, మార్క్సిజం దానిని మరింత సమగ్రం చేసిన క్రమాన్ని


ఆవిష్కరించుకున్నాడు. బౌద్ధం గతితార్కికం అన్న వ్యాసంలో దీనిని విశదీకరించాడు.

'పెక్కు రంగాలకు బౌద్ధం మౌలికమైన భావనలను సమకూర్చింది. బౌద్ధ తత్వశాస్త్రంలో పరిచయం వున్నవారికి మార్క్సిస్టు తత్వశాస్త్రం అవగాహన చేసుకోవడం తేలిక' అని అన్నాడు. 'మార్క్సిస్టు తత్వశాస్త్ర పరిణామంలో హెగెల్ తత్వశాస్త్రం ప్రముఖ పాత్ర వహించిన విషయం మనకు తెలుసు. హెగెలియన్ తత్వశాస్త్రంలోని అసందర్భాలను మార్క్సిస్టు తత్వశాస్త్రం తొలగించిన విషయమూ తెలిసిందే. బౌద్ధం, అత్యున్నత పరాకాష్ట చెందిన రూపంలో హెగెల్ భావసారాన్ని పోలి వుంటుంది' అని రాశాడు.

అంటే 20వ శతాబ్దపు హెగెల్ భావజాలం రెండు వేల సంవత్సరాల క్రితమే భారతీయ తాత్విక చింతనలో బౌద్ధం రూపంలో చోటు చేసుకుంది. నిజానికి బ్రాహ్మణీయ మతం భారతీయ తాత్విక చింతన నుంచి బౌద్ధాన్ని తరిమివేయకుండా, రూపు మాపకుండా వుండి వుంటే ఒక హెగెల్, ఒక మార్క్స భారతదేశంలోనే క్రీస్తు శకం ఆరంభంలోనే ఆవిర్భవించి వుండేవారు అనిపిస్తుంది. ఇలా బౌద్ధాన్ని మరింత సమగ్రం చేసిన మార్క్సిజానికి చేరిన రాహుల్ సాంకృత్యాయన్ భారతీయ చింతనలో ప్రభవించిన తొలి మార్క్సిస్టు, ఏకైక మార్క్సిస్టు.

# రాఘవాచారి సంపాదకీయాలు
# చైతన్య పరిధిని పెంచే ఆణిముత్యాలు

**కీ.** శే. చక్రవర్తుల రాఘవాచారి 1972 నుంచి 1998 వరకు విశాలాంధ్రలో జాతీయ అంశాలపై రాసిన 152 సంపాదకీయాలను సేకరించి ఈ సంపుటిని రూపొందించారు. ఇందులో ఏ సంపాదకీయాన్ని తీసి పక్కన పెట్టడానికి వీలుపడదు. అన్నీ మన చైతన్య పరిధిని విస్తరింపచేసే ఆణిముత్యాలే. ఇవి గతంలో జరిగిన జాతీయ సంఘటనలను నెమరువేసుకోవడానికి ఉపయోగపడేవి మాత్రమే కావు. వివిధ జాతీయ సమస్యలను విశ్లేషించి వాటి భవిష్యత్ పర్యవసానాలను వివరిస్తాయి. దినపత్రికల సంపాదకీయాలకు అనేక పరిమితులు వుంటాయి. అవి సాధారణంగా ఆ రోజు జరిగిన సంఘటనలపై స్పందనలుగా కొన్ని గంటల వ్యవధిలోనే రాయాల్సి వుంటుంది. అందుకే దినపత్రికల సంపాదకీయాలు చాలా వరకు తాత్కాలికం లేదా వార్తా వ్యాఖ్యలుగానే మిగిలిపోతాయి. దీర్ఘకాలంపాటు నిలబడే సంపాదకీయాలు రాయడానికి బహుముఖ ప్రజ్ఞ, అపారమైన జ్ఞాన



సంపద ఉండాలి. అంతకుమించి తనకంటూ  ఒక సుసంపన్నమైన భావజాలం, ఒక దృక్పథం వుండాలి. దీనిని సంపాదకీయాల్లో అంతర్లీనంగా ప్రతిఫలింపజేయగల నేర్పు వుండాలి. ఇవన్నీ రాఘవాచారిలో పుష్కలంగా వున్నాయి. అందువల్లనే ఈ సంపాదకీయాలు దీర్ఘకాలం మనగలిగే ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ  ముందుమాట కేవలం ప్రవేశిక మాత్రమే. కొన్ని జాతీయ అంశాల పరామర్శకే పరిమితం కాక తప్పదు.

### మార్క్సిజం ఆయన బాట

'మార్క్సిజం మనబాట' అన్న సంపాదకీయం వుంది. సోషలిజం ఒక నూతన

సంస్కృతిని ఆవిష్కరించిందనీ, మార్క్స్ అనుసరించిన పరిశీలన పద్ధతి, విమర్శనా పద్ధతి, సామాజిక ఆలోచనల్లో విప్లవం తెచ్చిందని రాశారు. మార్క్స్ భావజాలమే రాఘవాచారిని నడిపించిన బాట. ఆ భావజాలాన్ని తన సంపాదకీయాల్లో అంతర్లీనంగా ప్రవహింపజేశారు. అదే ఈ సంపాదకీయాలకు తాత్విక పుష్టిని ఇచ్చింది. దీనికితోడు పదునైన విమర్శ, లోతైన విశ్లేషణనీ జత చేసుకున్నాయి. ఇవే రాఘవాచారి సంపాదకీయాల ప్రత్యేకత.

## ఫాసిస్టు మత ఛాందసవాదం

దేశంలో బీజేపీ అధికారంలో వుంది. ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి మెజారిటీ మత జాతీయవాదాన్ని మోదీ నిత్య పారాయణం చేస్తున్నారు. దేశంలో ఈ విద్వేష భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి సంఘ్ పరివారం కార్యక్రమాలపై పదునైన విమర్శలతో కూడిన సంపాదకీయాలు ఈ సంపుటిలో చాలా ఉన్నాయి. 'అమృతభాండంలో విష బిందువు' సంపాదకీయంలో 'విశ్వ హిందూ పరిషత్' వారి ఏకాత్మతా యజ్ఞరథంపై ఊరేగిస్తున్నది. జాతీయ (సమైక్యతా) పతాకాన్ని చేబూనిన భారతమాత చిత్రం కాదు. ఆర్ఎస్ఎస్ కాషాయరంగు జెండా చేబూనిన సింహ వాహన రూఢయైన భారతమాత. విశ్వ హిందూ పరిషత్ వారి భారతమాత చిత్రంతోనే వారి వికృత రూపాన్ని బట్టబయలు చేసిన సంపాదకీయం ఇది.

'ఫాసిస్టు మత ఛాందసవాదం' పేరుతో బాబ్రీ మసీదు కూల్చివేతపై రాసింది భావోద్వేగభరితమైంది మాత్రమే కాదు రాముని తత్వంతో ఈ పిశాచగణాల విధ్వంసాన్ని ఎండగట్టింది. 'ఆ ఫాసిస్టు హిందూ ఛాందసవాద కాపాలికులు కూల్చి వేసింది బాబ్రీ మసీదు గోపురాలను కాదు శతాబ్దాల తరబడి బహుళమత విశ్వాసాలకు ఆవాసమైన దేశ లౌకిక, సహనశీల, సామరస్య సంప్రదాయాల పునాదుల్నే కూల్చివేశారు'.

'ఆత్మానం మానుషం మన్యే' అని ఎంతో గొప్పగా మానవతా ధర్మాన్ని రామునితో చెప్పించిన వాల్మీకిని దారుణంగా వెక్కిరిస్తూ మనుషుల రూపంలోని ఈ పిశాచాలు వ్యవహరించాయి. ఆయనను దేవుణ్ణి చేసి గుడి అని హడావుడితో ఆ మానవతా ధర్మాన్ని ఖననం చేసిన ఈ చండాలపు పాషండ ఛాందసుల అకృత్యం హిందూ తత్వంలోని ఉత్కృష్టతకే 'మాయని మచ్చ' అంటూ తూర్పారబట్టారు. బీజేపీ, సంఘ్ పరివార్‌ల విద్వేష భావజాలం పునాదుల్ని అర్థం చేసుకోవడానికి, ప్రస్తుతం దేశంలో వివిధ రకాల ఫాసిస్టు మూకల్ని సృష్టించి సాగిస్తున్న హింసాకాండ, హత్యాకాండను

అర్థం చేసుకోవడానికి, హిందూ రాష్ట్రం పేరుతో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని హరించడానికి జరుగుతున్న కుట్రలను అర్థం చేసుకోవడానికి ఈ సంపాదకీయాలు భూమికనిస్తాయి.

## దేశానికి అసలు విపత్తు సంపదకేంద్రీకరణ

దేశంలో గుత్త పెట్టుబడిదారుల మీద రాఘవాచారి 'గుత్త పెట్టుబడిదారుల జాతి విద్రోహ వైఖరి', 'ఎంత నైవేద్యం పెట్టినా చాలని గుత్త పెట్టుబడిదారులు', 'దేశానికి అసలు విపత్తు సంపద కేంద్రీకరణ' వంటి సంపాదకీయాలు రాశారు. 1947 నాటికి రూ.40, రూ.50 కోట్లు సంపద కలిగిన బిర్లా, టాటాలు 1980 నాటికి రూ.1,171, రూ.1,102 కోట్లకు ఎలా పడగలెత్తారని ప్రశ్నిస్తూ నూటికి ఐదు మంది దగ్గర సంపద కేంద్రీకరణ జరుగుతుంటే 90 మంది కష్టించినా కడుపు నిండని స్థితికి కారణమైన అంతరాల బండారాన్ని ఎండగట్టారు. ఇది పాలకులు అనుసరించిన పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా ఫలితమేనని తేల్చి చెప్పారు. దశాబ్దాల కిందట ఈ సమస్య నేడున్నంత తీవ్ర స్థితిలో లేదు. కాని, రాఘవాచారి ఈ పరిణామం పర్యవసానాలను ముందుగానే ఊహించి ఈ విపత్తు మీద హెచ్చరించారు. ఇప్పుడు దేశంలో ఒక శాతం దగ్గర 46 శాతం సంపద పది శాతం దగ్గర 77 శాతం సంపద పోగుపడ్డ తీవ్ర పరిణామాలని మనం చూస్తున్నాం. దేశ ప్రజల్ని పీల్చి పిప్పి చేసి దోచుకున్న ఈ సంపద అత్యంత ప్రమాదకరమైన విపత్తుగా మారింది. పది శాతం కుబేరుల దగ్గర పోగుపడ్డ సంపదను వివిధ రకాల పన్నుల ద్వారా దేశ ప్రజలకు పున:పంపిణీ చేయడం మినహా శ్రేయోరాజ్యానికి మరో దారిలేని స్థితి వచ్చింది. రాఘవాచారి సంపాదకీయాలు నేటి పరిస్థితికి మూలాలను ఆవిష్కరిస్తూ దారిచూపిస్తాయి.

## రాజకీయాల్లో విలువలు-ఫిరాయింపులు

గాంధీజీ ఆశయాలు ఏమయ్యాయంటూ ప్రజా జీవితంలో గాంధీజీ ఆశించిన నైతిక విలువలు, నిరాడంబరత, కార్యతత్పరత, త్యాగదీక్ష కనుమరుగై పాలక వర్గాలు అవినీతి, అక్రమార్జన బాట నడుస్తూ దేశం కుప్పకూలే విధంగా తయారైన వైనాన్ని ఎత్తి చూపించారు.

రాజకీయ పార్టీలకు కంపెనీల విరాళాలను 1970లో నిషేధించి 1976లో

కంపెనీల నికర లాభాల మీద ఐదు శాతం, లేదా 50 వేలు విరాళాలు ఇచ్చేందుకు తెచ్చిన సవరణ పర్యవసానాలను వివరిస్తూ ఈ దేశ భవిష్యత్ ఎవరి మీద ఆధారపడుతుందో ఈ సవరణ తేట తెల్లం చేస్తుందని స్పష్టం చేశారు. ఇప్పుడు నికర లాభాలతో నిమిత్తం లేకుండా డొల్ల కంపెనీలు కోట్లకు కోట్లు రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే 'ఎన్నికల బాండ్ల' తంతు మనం చూశాం. ఈ సంపాదకీయం ఊహించినట్లేనే దేశం భవిష్యత్ కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలు బొమ్మ కావడం మనం చూస్తున్నాం.

'గుత్త ధనస్వామ్యంలో ఎన్నికలు' తీరును వివరిస్తూ రాజకీయాలు గిట్టుబాటు వ్యాపారంగా దిగజారిన తర్వాత ఎన్నికలపై పెట్టిన పెట్టుబడికి ప్రజాస్వామ్య లక్షణం వుంటుందనుకోవడం ఆత్మవంచన కాక తప్పదన్న భవిష్యత్ దర్శనం చేశారు. ప్రజాస్వామ్యంలో ఫిరాయింపులపై ఫిరాయింపులంటూ ఫిరాయింపుల చట్టం డొల్లతనాన్ని ఎండగడుతూ, పార్టీ ఫిరాయిస్తే పదవి కోల్పోవాలని, పార్టీ ప్రతినిధులుగా వున్న స్పీకర్లకు ఫిరాయింపులపై నిర్ణయాధికారం వుండకూడదని చేసిన సూచన నేటికీ శిరోధార్యమే.

## పత్రికా రంగంలో గుత్తాధిపత్యం

ఒక సీనియర్, సీరియస్ జర్నలిస్టుగా తన అనుభవాల సారాన్ని రంగరించి పత్రికా రంగం మీద రాసిన సంపాదకీయాలు అపురూపమైనవి. 'సామాజిక ప్రయోజనాలకు ఉపయోగపడవలసిన ఈ ప్రధాన ప్రచార సాధనం.. స్వార్థపర వర్గాల చేతి పనిముట్టుగా మారిపోవడం వల్ల పత్రికా స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాభిప్రాయ ప్రకటన కేవలం బూటకంగా తయారయ్యాయి' అంటూ వార్తా పత్రికలను వ్యాపార సంస్థల అధీనం నుంచి తప్పించాలన్న వాదనను ముందుకు తెచ్చారు. 'పత్రికా రంగం ప్రజా సేవలో సాధనమన్న దశ నుంచి వృత్తిగా, వ్యాపారంగా, ఇప్పుడు పరిశ్రమగా పరిణామం చెందిందని' విశ్లేషించారు. పత్రికా స్వేచ్ఛ పౌరుల భావ ప్రకటనా స్వేచ్ఛలో.. అనివార్యమైన ప్రాథమిక హక్కు. ఈ హక్కు పారిశ్రామిక సంస్థల వ్యాపార స్వేచ్ఛకు లోబడి నడుచుకునే పతివ్రతగా మాత్రమే పవిత్రమని చేసే కల్లబొల్లి వాదనలను పూర్వపక్షం చేయవలసిన కర్తవ్యం ప్రగతిశీలులందరిపైనా వుందని దిశా నిర్దేశం చేశారు. 'ప్రసార సాధనాల దుర్వినియోగం' మీద ఆనాడు చేసిన హెచ్చరికలు ఈనాడు విస్తరించిన మీడియా గుత్తాధిపత్యం నిజ స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి సాధనాలౌతాయి.

## సాంఘిక పీడనే వివక్ష

దేశంలో వివిధ రకాల వివక్షలు కొనసాగుతున్నాయి. కారంచేడు ఘటనపై రాస్తూ 'బలహీనవర్గాలపై ఈనాటికి గ్రామ సీమలలో పెత్తందారీ వర్గాలు దారుణమైన సాంఘిక పీడన స్వైర విహారాలకు కారంచేడు మారణకాండ మచ్చుతునక'. భూస్వామ్య విధానాన్ని పూర్తిగా రద్దు చేసి భూమిలేని పేదలకు హరిజనులకు మిగులు భూమిని ప్రభుత్వ బంజర్లను పంచి వారికి ఆర్థికస్తోమత కలిగించిన నాడు గాని వారిపై జరుగుతున్న ఆర్థిక దోపిడీ సామాజిక పీడన శాశ్వతంగా తొలగిపోవు అని స్పష్టం చేశారు.

నేటికీ సమాజంలో స్త్రీకి పూర్తి సమానత్వం సిద్ధించలేదంటూ మహిళల పట్ల రకరకాల వివక్షలు, అన్యాయాలు కొనసాగుతూనే ఉన్నాయని 'సమాన పనికి సమాన వేతనం లేదు. కొన్ని పరిశ్రమలలో వివాహం చేసుకుంటే ఉద్యోగ అర్హత లేదు. వారసత్వ హక్కు లేదు. విద్యలో ఇంకా సమానత్వం లేదు. ఈ అన్నింటికీ మించి కుటుంబంలో వివాహ వ్యవస్థ ఉద్యోగ వ్యవస్థలో అనేక అన్యాయాలు అవమానాలు కొనసాగుతూనే ఉన్నాయి' అని స్త్రీలలో ఆత్మవిశ్వాసం కలిగించి తమ విముక్తి కోసం తామే పోరాటం సాగించాలని సూచించారు.

సామాజిక పీడన, ఆర్థిక దోపిడీల జమిలి రూపమే వివక్షగా ఈ సంపాదకీయాలు నిర్ధారిస్తాయి. సామాజిక, ఆర్థిక రాజకీయ, న్యాయం జరిగినప్పుడే వివక్ష అంతమవుతుందన్న భావనలను వివిధ సంపాదకీయాలు స్పష్టం చేస్తాయి.

## విద్య ప్రైవేటీకరణ


విద్య ప్రైవేటీకరణతో–కలిగిన కామందులకో వ్యవస్థను.. లేని దీనులకో వ్యవస్థను – రాజ్యాంగ లక్ష్యాలైన సార్వత్రిక సమాన విద్య అవకాశాలను మృగ్యం చేశారనీ, సాంకేతిక వృత్తి విద్యలు, సామాజిక శాస్త్రాల మధ్య అనుసంధానం కొరవడిందనీ, దీని ప్రభావం పెచ్చరిల్లుతున్న కుల, మత విద్వేషాల అరాచకంలో స్పష్టమవు తుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లోనూ, ఉపోద్ఘాతంలోనూ ఉల్లేఖించిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ, న్యాయ లక్ష్యాల సాధనలోనూ సెక్యులర్ ప్రజాస్వామ్య లక్ష్యాల పరిరక్షణలోనూ క్రియాశీలకమైన ఉపకరణంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాలని ప్రకటించారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన(కాషాయ) విద్యా విధానం ఈ మౌలిక రాజ్యాంగ లక్ష్యానికి ఎంతటి విఘాతం కలిగిస్తుందో తెలియజేస్తుంది.

## వామపక్షాల ఐక్యత

ఈ సంపుటిలో వివిధ జాతీయ అంశాలపై కమ్యూనిస్టు పార్టీ తీసుకున్న సూత్రబద్ధ వైఖరి మీద, వామపక్షాల ఐక్యత మీద, ఐక్యకార్యాచరణల మీద రాసిన సంపాదకీయాలు నేటికీ వర్తించేవిగా వున్నాయి. ప్రభుత్వరంగం, ప్రైవేటీకరణ మీద చేసిన విశ్లేషణలు ఈనాడు జరుగుతున్న దాని విశృంఖలత్వపు పర్యవసానాలను అర్థం చేసుకోడానికి దోహదపడతాయి. ప్రస్తావించాల్సిన మరో సంపాదకీయం 'హైదరాబాద్ విముక్తిపై చరిత్రహీనుల రాద్ధాంతాలు', హైదరాబాద్ విలీనంపై మత విద్వేషం రెచ్చగొట్టే 'రాజకీయ జ్ఞానశూన్యులైన' బీజేపీలోని కొందరు ప్రదర్శిస్తున్న వదరుబోతుతనాన్ని రాఘవాచారి శరాఘాతమైన విమర్శతో ఎదుర్కొన్నారు. తెలంగాణా సాయుధ పోరాటచరిత్రను దాని లక్ష్యాలను తనదైన అద్భుత శైలితో వివరించారు. ఈ సంపుటిలో అన్ని తరగతుల ప్రజల-కార్మికుల, వ్యవసాయ కూలీల, యువత, మహిళల, దళితుల బహుజనుల, ఆదివాసీల-జీవిత సమస్యలు, ఉద్యమాలకు రాఘవాచారి తన సంపాదకీయాలలో అక్షర రూపం ఇచ్చారు. జీవం పోసి చైతన్య పూరితం చేశారు. జాతీయ అంశాలపై ఈ సంపుటి లోతైన అవగాహన ఇస్తుంది. రాఘవాచారి విశ్లేషణలు బహుకోణాలను చూపిస్తాయి. కొత్త పుంతలు తొక్కడానికి ఆలోచనా ద్వారాలను తెరుస్తాయి. ఈ సంపుటికి ముందుమాట రాసే అరుదైన అవకాశం నాకు కల్పించిన రాఘవాచారి ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు.

# ఆంధ్రప్రదేశ్ : రెండు దశాబ్దాల రాజకీయ పరిణామాలు

**21**వ శతాబ్దానికి ఇప్పుడు ఇరవై రెండేళ్లు. అందులో 14 ఏళ్లపాటు తెలుగు ప్రజలు ఉమ్మడి రాష్ట్రంలో వున్నారు. మిగిలిన ఎనిమిదేళ్లు రెండు రాష్ట్రాలలో వున్నారు. ఈ కాలంలో శాసనసభలకు నాలుగుసార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు, పార్టీలు, వారి వారి గెలుపు ఓటముల ఫలితాలకే పరిమితం అయితే అది కేవలం ఎన్నికల విశ్లేషణే అవుతుంది. అధికార మార్పిడుల పరిశీలనే అవుతుంది. ఈ 22 ఏళ్లలో రాష్ట్ర రాజకీయ రంగంలో కొన్ని కీలక పరిణామాలు జరిగాయి. పైపై చూపులకు అవి అంతగా కనిపించవు. కాని, అవి వర్తమానం మీద భవిష్యత్ మీద విశేషమైన ప్రభావాన్ని చూపించేవిగా వున్నాయి.




## కొన్ని ముఖ్య పరిణామాలు

1. 1956లో సాధించుకున్న భాషా ప్రయుక్త రాష్ట్రం 2014లో రెండుగా చీలింది.

2. కొత్తగా మరొక ఐదు రాజకీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. అందులో 2 పార్టీలు అధికారాన్ని దక్కించుకున్నాయి.

3. కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర ప్రాంతంలో 2014లో నామమాత్రంగా మిగిలింది. అది ఒక కుటుంబ వారసుని పరం అయింది.

4. ప్రభుత్వాల నేతలు నియంతలుగా మారడానికి దారి తీసిన పరిణామాలు.

5. కుల, మత ప్రాబల్యం గల పార్టీల ఓటు బ్యాంకుల నుండి ప్రత్యక్ష లబ్ధిదారుల ఓటు బ్యాంకులుగా రూపాంతరం చెందాయి. ఇన్ని పరిణామాలను ఒక చిన్న వ్యాసంలో విపులీకరించడం సాధ్యం కాదు. అందువల్ల ఈ వ్యాసం కొన్ని పరిమితులు గల రేఖా చిత్రంగానే పరిగణించాలి.

**పూర్వరంగం :** 1982లో ఎన్.టి.రామారావు తెలుగుదేశం పార్టీ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో రాజకీయ రంగంలో అధికారం కోసం తెలుగుదేశం–కాంగ్రెస్‌ల

మధ్య ద్విముఖ పోరాటంగా మారింది. ఇలాంటి పరిస్థితి కొనసాగుతున్న కాలంలో కొత్త పార్టీల ప్రవేశానికి ఎలాంటి జాగా (స్పేస్) వుండదు. కొత్త పార్టీలు పెట్టుకునే వారు తమకు తాముగా ఒక కొత్త రాజకీయ జాగాను నిర్మించుకోవాలి. లేదా ఆ రెండు పార్టీల మధ్య నలిగిపోయి పరాజయం పాలు కావాలి.

రాజకీయ రంగంలో శూన్యత లేని కాలంలో 2001లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేశారు. పైరెండు పార్టీల మధ్య జరుగుతున్న ఎన్నికల పోరాటంలో భాగం కాకుండా 'ప్రత్యేక రాష్ట్ర సాధన' నినాదంతో తన పార్టీకి కొత్త జాగాను రూపొందించుకున్నారు. అది 2010 నాటికి ఒక ప్రజా ఉద్యమం అయింది. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. అప్పుడే జరిగిన ఎన్నికలలో తె.రా.స పార్టీ విజయాన్ని సాధించింది.

## 1. జాతి నిర్మాణానికి భాష ఒక్కటే సరిపోతుందా?

1956కి పూర్వం రెండు ప్రాంతాలలోనూ విశాలాంధ్ర ఏర్పడాలన్న ఉద్యమం జరిగింది. తొలిభాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పడింది. తర్వాత 13 సంవత్సరాలకే హైకోర్టు ముల్కీని (స్థానిక ఉపాధి హక్కు) రద్దు చేయడంతో జై తెలంగాణ ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమాలు రాష్ట్ర విభజన కోరుతూ ఉగ్రరూపంతో సాగాయి. కేంద్రం రాష్ట్ర విభజనను వ్యతిరేకించి స్థానిక ఉద్యోగ రక్షణ కల్పిస్తూ ఆరు సూత్రాల పథకాన్ని ప్రకటించి విభజనను నిరోధించింది. ఒక స్థానిక జీవనోపాధి సమస్య భాషాపరమైన సమైక్యతను సవాలు చేయగలిగింది. భాషను మించిన ప్రభావాన్ని జీవన సమస్యలు కలిగిస్తాయని ఈ ఉద్యమాలు స్పష్టం చేశాయి.

2001లో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ప్రత్యేక తెలంగాణా నినాదంతో తెలంగాణా వెనకబాటుతనాన్ని, భాషాపరమైన మాండలిక, సాంస్కృతికపరమైన అంశాలను, నీళ్లు-నిధులు-నియామకాల వంటి జీవన సమస్యలతోపాటు వారిలో కొత్త ఆకాంక్షలను పెంపొందించి విస్తరించింది. ఇది ఉమ్మడి రాష్ట్రం ఏర్పడిన 50 ఏళ్ల తర్వాత జరిగింది.

ఒక భాష మాట్లాడే జాతిని సమైక్యపరచడం అంటే జాతి నిర్మాణం. అది ప్రాంతీయపరమైన అంతరాలను, భాషా సాంస్కృతికపరమైన అంశాలను, ఆర్థికంగా ఎదగాలని భావించే ప్రాంతీయ వర్గాల ఆకాంక్షలను గుర్తించడం, గౌరవించడం. వాటికి సముచిత స్థానం కల్పించడం ద్వారానే ఒక భాష మాట్లాడే ప్రజా సమూహాలను ఒక జాతిగా కలిపి వుంచడానికి తప్పనిసరి అవసరం. భాష ఒక

ప్రాతిపదిక అయినప్పటికి అది మాత్రమే సరిపోదు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నుండి తీసుకోవలసిన గుణపాఠం ఇదే.

## ఉమ్మడి రాష్ట్రంలో కొత్త పార్టీలు

తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ 2001లో ఏర్పడింది. ప్రత్యేక తెలంగాణా నినాదంతో అది తనదైన ప్రత్యేక జాగాను(స్పేస్)ను నిర్మించుకుని విస్తరించిన క్రమాన్ని మనం చూశాం. 2006లో డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో లోక్‌సత్తా పార్టీ ఏర్పడింది. కొత్త తరానికి కొత్త రాజకీయం పేరుతో ఈ పార్టీ కూడా ప్రజలలో తనదైన ప్రత్యేక జాగా కోసం ప్రయత్నించింది. ఆ పార్టీ ప్రకటించిన ప్రజాస్వామ్య సంస్కరణలు, అవినీతి అంతం కోసం, వికేంద్రీకరణ కోసం ఇచ్చిన నినాదాలు మధ్య తరగతి ప్రజలను ఆకర్షించాయి. 2009 ఎన్నికలలో నగరాలలో 9, 10 శాతం ఓట్లు పొంది, ఒక స్థానాన్ని గెలుచుకుంది. 2014 ఎన్నికలలో పోటీ చేసినా దాని ప్రభావం విస్తరించలేదు. ఇకపై ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా వుంటుందని ప్రకటించి ఎన్నికల రంగం నుంచి స్వచ్ఛందంగా నిష్క్రమించింది.

2008లో ప్రజారాజ్యం పేరుతో చిరంజీవి తన పార్టీని ప్రకటించారు. ఆ పార్టీ తనదైన ప్రత్యేక జాగా కోసం ప్రయత్నించకుండా ప్రధాన పార్టీల మీద వున్న వ్యతిరేకత మీద, సినీ అభిమానుల మీద, కుల ప్రభావం మీద విజయం సాధించాలనుకున్నారు. తనదైన రాజకీయ జాగా లేకపోవడంతో పైపరిమిత బలంతో 16 శాతం ఓట్లు గెలుచుకున్నారు. తన పార్టీని కొనసాగించలేని స్థితిలో దానిని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసి ఆయన కేంద్ర మంత్రి అయ్యారు. తనదైన ప్రత్యేక ఎజెండాతో ప్రజల ఆకాంక్షలను పెంచి ప్రజాబలంతో అధికారంలోకి రావాలన్న ప్రయత్నం లేనప్పుడు జరిగేది ఇంతేనని ఆ పార్టీ రుజువు చేసింది.

## పార్లమెంటరీ వ్యవస్థ - అధ్యక్ష తరహాల ఎన్నికలు

ఉమ్మడి రాష్ట్రంలోనే 2011లో వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఏర్పడింది. అది ఏర్పడిన నాడే బలమైన పోటీదారు కావడానికి దారితీసిన రాజకీయ నేపథ్యాన్ని మనం పరిశీలించాలి. మన రాజ్యాంగం ప్రకారం దేశంలో ప్రధానమంత్రిని, రాష్ట్రంలో ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకునే పద్ధతి లేదు. లోక్‌సభలో, శాసన

సభలో మెజారిటీ స్థానాలు గెలిచిన పార్టీ తమ నాయకుని ఎన్నుకుంటుంది. వారు ప్రధాని, ముఖ్యమంత్రి అవుతారు. ఇది పరోక్ష పద్ధతి. అధ్యక్ష తరహా ఎన్నిక ప్రత్యక్ష పద్ధతి. 21వ శతాబ్దంలో మన రాజకీయ రంగంలో రాజ్యాంగ బద్ధమైన పరోక్ష పద్ధతి స్థానంలో క్రమేణా అధ్యక్ష తరహా ప్రత్యక్ష పద్ధతి ఆచరణలో వేళ్లూనుకుంది.

దీని పర్యవసానంగా పార్టీల మధ్య పోటీకి బదులు నాయకుల మధ్య పోటీగా మారింది. ఒక పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించడం, ఇతర పార్టీలు కూడా దానిని అనుసరించడం చాలాచోట్ల ప్రారంభం అయింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ పరిణామం చోటు చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబా లేక రాజశేఖరరెడ్డా అన్నది నినాదం అయింది. ఓటర్లు తమ ముఖ్యమంత్రి కోసం ఓటు వేసే స్థితి వచ్చింది. స్థానిక అభ్యర్థులకంటే ముఖ్యమంత్రి ఎవరన్నదే ప్రధానం అయింది. ఎన్నికల రంగంలో అధ్యక్ష తరహా ఆలోచన ప్రవేశించడంతో అది రాజకీయ రంగంలో కొన్ని కొత్త కోణాలను ముందుకు తెచ్చింది.

ఎప్పుడైతే పార్టీల స్థానంలో ముఖ్యమంత్రుల అభ్యర్థులు ప్రధానం అవుతారో, ఓటర్లు ఆ వ్యక్తుల చుట్టూ సమీకృతం అవుతారో, అలాంటి దశలో వారికి వారసులు పుట్టుకొస్తారు. ప్రజలు అలాంటి వారసుల కోసం ఎదురుచూస్తారు. వై.యస్.జగన్ అలా ఒక జాతీయ పార్టీలో పుట్టుకొచ్చిన వారసుడు.

2009 ఎన్నికలలో జగన్ పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యేవరకు ఆయన గురించి ఎవరికీ తెలియదు. కాంగ్రెస్ పార్టీలో దీర్ఘకాలంగా పనిచేసిన చరిత్ర లేదు. ప్రజా ప్రతినిధిగా ఏదో ఒక స్థాయిలో పదవులు నిర్వహించిన అనుభవం లేదు. కాని రాజశేఖరరెడ్డి మరణంతో కాంగ్రెస్ పార్టీ సహజంగానే ఆ పార్టీ సీనియర్ నేతలకు అధిష్టానం అధికార పగ్గాలు అప్పగించింది. కాని కాంగ్రెస్ శ్రేణులు, ఓటర్లు రాజశేఖరరెడ్డి వారసుని కోసం చూస్తున్నారు. అలా రాజశేఖరరెడ్డి వారసునిగా గత చరిత్రతో నిమిత్తం లేకుండా వారు జగన్‌కు బ్రహ్మరథం పట్టారు. ఇది అధ్యక్ష తరహా పోటీ పద్ధతి నుండి ఉత్పన్నమైన ఒక రాజకీయ పరిణామం.

## మారిన ఓటు బ్యాంకు రాజకీయం - డిమాండ్ లేని సప్లయ్

దీనిలో భాగంగానే ఓటు బ్యాంకు రాజకీయం మారిపోయింది. గతంలో ఓటు బ్యాంకులు కులాల ప్రాతిపదికగా మతాల ప్రాతిపదికగా, సమూహాల ప్రాతిపదికగా వారికి ప్రత్యేక కార్పొరేషన్లు, రాయితీలు ప్రాతిపదికగా రూపొందించుకున్నారు. ఇప్పుడు వాటిని నామమాత్రంగా కొనసాగిస్తూనే నేరుగా ఓటరుకు, వారి

కుటుంబాలకు ఏదో ఒక పథకం పేరుతో డబ్బును అందిస్తున్నారు. ఓటర్ల నోట నాయకుని పేరు వినిపించేలా ఈ పథకాలు అమలు చేస్తున్నారు. ఇప్పుడు ప్రధానంగా ఓటర్లుగా వున్న పేద ప్రజలు తమ కోసం ఎలాంటి డిమాండ్ చేసే అవసరం లేదు. రాజకీయ పార్టీలు డిమాండ్ లేని సప్లయిగా పథకాలను ఇస్తున్నారు. పసుపు కుంకుమ కావాలని ఎవరూ డిమాండ్ చెయ్యలేదు. ఎలాంటి ఉద్యమాలు రాలేదు. అయినా పసుపు కుంకుమ సప్లయి అయింది. అలాగే అమ్మ ఒడి, డ్వాక్రా మహిళలకు ప్రత్యేక ధన సహాయం వారు కోరింది కాదు. అయినా సప్లయి చేస్తున్నారు. ఇప్పుడు ఈ పథకాల చుట్టూ ఓటు బ్యాంకులు ఏర్పడుతున్నాయి. దీనిలో అన్ని కులాలు, మతాలు వుంటున్నాయి. ఒక్కో పథకం సూదంటు రాయిలా ఒక్కో ఓటు బ్యాంకు సమూహంగా మారుతుంది. ఓటర్లకు ఇప్పుడు వున్నది ఏ పార్టీ, ఏ నాయకుడు అధికారంలోకి వస్తే తమకు ఏమి దక్కుతుందనే లబ్ధిదారుల చైతన్యం మాత్రమే వుంది. రాష్ట్రాలలో రాజకీయం దాని చుట్టూనే, ఓటర్లు దాని చుట్టూనే తిరుగుతున్నారు.

## నియంతలుగా మారడానికి తెరుచుకున్న ద్వారాలు

మరో పరిణామం పార్టీలో నాయకుడే సర్వస్వం అయినప్పుడు ప్రజలలో నాయకుని ఆరాధన వ్యక్తి పూజ మొదలవుతుంది. ప్రభుత్వ సొమ్ము అది ప్రజల పన్నుల సొమ్ము. కాని, అది ముఖ్యమంత్రుల సొంత సొమ్ముగా ప్రచారం అవుతుంది. ప్రభుత్వాలు ఏ పథకాలు ప్రకటించినా అవి ముఖ్యమంత్రి పేరు తగిలించి వదులుతారు. జగనన్న పథకాలు, అంతకు ముందు చంద్రన్న పథకాలు అన్నీ వ్యక్తి పూజ, ఆరాధన పెంచడానికి పుట్టుకొచ్చినవే. తన వల్లే పార్టీ, తన వల్లే గెలుపు, తన చుట్టూనే ప్రజలు అన్న భావన ముఖ్యమంత్రుల తలకెక్కితే అది నియంత పోకడలకు దారి తీస్తుంది.

తన అదుపులో పార్టీయే కాదు, పోలీసు, ప్రభుత్వ యంత్రాంగం అంతా తన చెప్పు చేతలలోకి తెచ్చుకోవడం ఇతర పార్టీను అణిచిపెట్టడానికి, ప్రజా ఉద్యమాల మీద దాడులు చెయ్యడానికి, మీడియా నోరు నొక్కడానికి వెనుకాడని పరిస్థితి నెలకొంటుంది. ఏ పార్టీ అయినా ప్రత్యర్థి నాయకుల్ని బదనాం చెయ్యడం ప్రధాన వ్యాపకం అవుతుంది. వ్యక్తిగత దూషణలో, దాడులు పెచ్చరిల్లి నియంత పోకడల నుండి పుట్టుకొచ్చిన నీచ రాజకీయమే.

## రాష్ట్ర విభజన - అనంతర పరిణామాలు

ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాల కొనసాగింపు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. 2014 ఎన్నికలలో ప్రత్యేక తెలంగాణాను సాధించిన ఉద్యమ నేపథ్యంలో తె.రా.స విజయం సాధించింది. కె.చంద్రశేఖర రావు ఆ ఉద్యమానికి ఎన్నికల విజయానికి తిరుగులేని నాయకుడు కావడంతో ఆ పార్టీ ఒక కుటుంబ పార్టీగా రూపొందింది. కె.సి.ఆర్ తన కుమారున్ని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేసి తన వారసుడిని ఖరారు చేసుకున్నారు. ప్రజా ప్రతినిధులకు టిక్కెట్లు ఇచ్చేది, గెలిపించేది ఆయనే కావడంతో నియంతగా వ్యవహరించే దారి ఏర్పడింది. పరిపాలనా యంత్రాంగం తన అదుపాజ్ఞలలోకి తెచ్చుకున్నారు. ముందుగా ప్రత్యర్థిగా వున్న తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల్ని సామ దాన దండోపాయాలతో తన పార్టీలో కలిపేసుకున్నారు. అంతర్గత కుమ్ములాటలలో వున్న కాంగ్రెస్ పార్టీతో బలమైన ప్రతిపక్షం లేకుండా పోయింది.

మొదటి 5 సంవత్సరాలలో తెలంగాణ ప్రభుత్వం సాగు నీరు, తాగు నీరు అందించే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు, మైనర్ ఇరిగేషన్‌తో, గ్రామాలకు తాగు నీరందించడంలో మంచి ఫలితాలనే ఇచ్చింది. తర్వాత ఆ ప్రభుత్వం భారీ ఎత్తిపోతల పథకాలను తలకెత్తుకుంది. తన బడ్జెట్‌కు మించిన భారం కావడంతో పైగా అందులో అవినీతి పెరగడంతో తెలంగాణ అప్పుల దారి పట్టింది. దీనికి తోడు తన రాజకీయ ఆధిపత్యం కోసం ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చే అనేక పథకాలను ప్రారంభించింది. పది జిల్లాల తెలంగాణను 32 జిల్లాలుగా విభజించి రాష్ట్రానికి అదనపు భారం తెచ్చారు.

విభజన నాటికి రూ.70 వేల కోట్ల అప్పు వున్న రాష్ట్రం ఇప్పుడు అధికారికంగా రూ.3,12,191 లక్షలకు పెరిగింది. ఎత్తిపోతల పథకాలకు వివిధ ద్రవ్య సంస్థల నుంచి తెచ్చిన అప్పులు కలుపుకుంటే నాలుగ లక్షల కోట్లకు పైగా అప్పు వున్నట్లు అంచనా వేస్తున్నారు. ఇన్ని అప్పులు చేసినా ఇంకా నెరవేర్చాల్సిన వాగ్దానాలు డబుల్ బెడ్ రూం ఇల్లు, పేదలకు మూడు ఎకరాల భూమి, దళితబంధు వగైరాలు నిధులు లేక నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ తెలంగాణలో మతపరమైన విభజన రాజకీయంతో దూకుడును పెంచింది. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకతను వినియోగించుకుని ఎదిగే ప్రయత్నాలు చేస్తున్నది. తె.రా.స ప్రభుత్వం ఇప్పుడు ఒక పక్క ఆర్థిక ఇబ్బందులు, మరొక పక్క రాజకీయ సంఘర్షణను ఎదుర్కొనే సంకటస్థితిలో తన పూర్వ వైభవాన్ని కోల్పోయే స్థితిలో పడింది.

2014 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ, బి.జె.పి. కలిసి పోటీ చేశాయి. ఎన్నికలకు ముందు పవన్‌కల్యాణ్ జనసేన పార్టీని ఏర్పాటు చేశారు. అయితే ఈ ఎన్నికలలో ఆ పార్టీ పోటీ చేయకుండా తెలుగుదేశం పార్టీకి మద్దతు ప్రకటించింది. ఈ ఎన్నికలలో విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. అటు తెలంగాణలో కూడా కొన్ని స్థానాలు గెలవడంతో తెలుగుదేశం పార్టీని జాతీయ పార్టీగా ప్రకటించారు. చంద్రబాబు అధ్యక్షుడుగా, కుమారుడు లోకేష్ ప్రధాన కార్యదర్శిగా, వారసుని పేరు కూడా నిర్ధారణ చేశారు. చంద్రబాబు ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ప్రపంచంలోనే అత్యాధునిక రాజధాని నిర్మాణం అయింది. అమరావతి రాజధాని కోసం రైతుల నుండి ఉభయ తారకంగా వుండే విధంగా 33 వేల ఎకరాల భూమిని సేరించడంతో రాజధాని నిర్మాణానికి తొలి అడుగువేశారు. దేశ ప్రధానితో శంకుస్థాపన చేయించి రాజధాని నిర్మాణం పట్ల విశ్వాసం కల్పించారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం చెయ్యడానికి పూనిక వహించారు. అలాగే తక్షణ అవసరాల కోసం తాత్కాలిక రాజధాని పనులు పూర్తి చేసి అమరావతి నుండి పరిపాలన మొదలుపెట్టారు. ఈ ఐదు సంవత్సరాలలో ముఖ్యమంత్రి ఇటు అమరావతి అటు పోలవరం మీదే తన దృష్టి కేంద్రీకరించారు. మరొపక్క ప్రతిపక్ష నేతగా వున్న జగన్ పాదయాత్రలతో రాష్ట్రాన్ని చుట్టుముట్టి ప్రభుత్వ వాగ్దాన భంగాలను వినియోగించుకుని బలపడ్డారు.

2019 నాటికి రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి మారింది. బి.జె.పి.తో పొత్తును తెలుగుదేశం పార్టీ తెగతెంపులు చేసుకుంది. గత ఎన్నికలలో మద్దతు ఇచ్చిన పవన్ కల్యాణ్ ఈ ఎన్నికలలో వేరుగా పోటీ చేశారు. దీనికితోడు ఆ పార్టీ వాగ్దానం చేసిన సంక్షేమ పథకాలు పూర్తిగా అమలులోకి రాలేదు. మరో పక్క రాష్ట్రంలో అప్పులు 90 వేల కోట్ల నుంచి 2 లక్షల 42 వేల కోట్లకు పెరిగాయి. అదనంగా పెండింగ్ బిల్లులు వున్నాయి. ఈ పరిస్థితులలో ఒంటరి పోరాటంలో తెలుగుదేశం పార్టీ పరాజయం పాలైంది. 175 స్థానాలున్న రాష్ట్ర శాసనసభలో 151 స్థానాలు గెలుచుకుని వై.యస్.ఆర్. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారు. భారీ మెజారిటీ, ఏక వ్యక్తి ఆధారిత పార్టీ అధినేత కావడంతో నియంత తరహా పాలనకి దారి ఏర్పడింది.

తాను పాదయాత్రలో చేసిన వాగ్దానాలు, ప్రకటించిన నవరత్నాల పథకాలు అమలు చేయడం ద్వారా ప్రత్యక్షంగా లబ్ధి పొందే ఓటు బ్యాంకును పదిలపర్చుకోవడమే ప్రధాన లక్ష్యం అయింది. ఈ మూడేళ్లలో లక్షా 80 వేల కోట్లు

వీటిపైనే ఖర్చు పెట్టారు. ఈ ప్రభుత్వం ఈ మూడేళ్లలో అప్పుల భారాన్ని 4,73,000 కోట్లకు పెంచింది. కార్పొరేషన్ల ద్వారా ఇతరత్రా చేసిన అప్పులు మరో లక్ష కోట్లు వుంటాయన్నది ఒక అంచనా. అప్పు లేకుండా ఒక్క నెల కూడా గడిచే స్థితి లేకుండా పోయింది. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయి. మరోపక్క అనాలోచిత ప్రభుత్వ నిర్ణయాలు పరిపాలనను అస్తవ్యస్తం చేస్తున్నాయి. వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానులు ప్రకటన రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తగిన ప్రణాళికకు బదులుగా ప్రాంతీయ అంతరాలను రాజకీయ లబ్ధి కోసం వినియోగించుకునే పాచికగా మారింది. ఇది ప్రాంతీయ అసమానతల స్థాయి నుండి విద్వేషాలస్థాయికి పెరిగితే ఈ రాష్ట్ర సమగ్రతే ప్రశ్నార్థకమౌతుంది.

రెవెన్యూ జిల్లాల విభజన రెవెన్యూ మండలాల ప్రాతిపదికన కాకుండా అశాశ్విత మైన పార్లమెంటరీ నియోజకవర్గాల ఆధారంగా చేయడంతో అవి అయ్యవార్లను చెయ్యబోతే కోతి రూపం ధరించాయి. పంచాయతీలకు, మున్సిపాలిటీలకు అధికా రాలు, నిధులు బదిలీ చేయకుండా వాటి అదుపులో లేని సచివాలయాల ఏర్పాటు, రాజకీయ లబ్ధి కోసం ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థలు పరిపాలన వికేంద్రీకరణకు బదులుగా మరింత కేంద్రీకరణ చేశారు.

ప్రాథమిక విద్యలో బోధనా భాషగా ఇంగ్లీషును అశాస్త్రీయమైన పద్ధతిలో ప్రవేశపెట్టి పిల్లల విద్యా వికాసంతో చెలగాటం ఆడుతున్నారు. ఇక రాష్ట్రంలో నియంతృత్వ తరహా పాలనలు సాగిస్తున్నారు. పరిపాలన వ్యవస్థలని వినియోగించి రాజకీయ ప్రత్యర్థుల మీద కేసులు బనాయించడం, దాడులు చెయ్యడం, సర్వ సాధారణమైంది. తమ సమస్యల మీద ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేసే ఉద్యోగుల మీద, ఉపాధ్యాయుల మీద, నిరుద్యోగుల మీద వివిధ రకాల మహిళ కార్మికుల మీద బలప్రయోగం చేయడం పరిపాటి అయింది.

అందులో భాగంగానే అమరావతి రైతుల పాదయాత్ర మీద దాడులు సాగిస్తున్నారు. కోర్టు తీర్పులను పట్టించుకోకపోవడం, ప్రజాస్వామ్య హక్కుల్ని హరించడం, నిరంకుశ పాలనకు అద్దం పడుతున్నాయి. ఇవన్నీ అభద్రతా భావం నుండి ఉత్పన్నమైన రాజకీయ పోకడలు. ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న ఈ పరిస్థితిని చక్కదిద్దుకునే బాధ్యత పౌరసమాజం మీదే వుంది.

# వాంఛనీయం కాని జమిలి ఎన్నికలు

**జ**మిలి ఎన్నికలు పైకి మేడి పండులా కనిపిస్తున్నా తరిచి చూస్తే ప్రమాదకర పర్యవసానాలు తొంగి చూస్తున్నాయి. ఒకేసారి ఎన్నికలు జరపడానికి రాష్ట్రాల శాసనసభల కాలాన్ని పొడిగించడమో లేదా కుదించడమో తప్పనిసరి. రాజ్యాంగం ప్రకారం ఎమర్జెన్సీలో తప్ప పొడిగింపుకు వీలులేదు. కుదించడం కోసం శాసనసభలు బలవంతంగా కూల్చి రాష్ట్రపతి పాలన పెట్టడం కూడా బొమ్మై కేసు తీర్పు తర్వాత సాధ్యం కానిదైంది. ఒకే దేశం – ఒకే ఎన్నిక పేరుతో శాసనసభల గడువు పెంచడానికి లేదా కుదించడానికి వీలుగా రాజ్యాంగ సవరణలు చేస్తే కేంద్రం ఇష్టాయిష్టాలపై రాష్ట్ర ప్రభుత్వాలు ఆధారపడి వుండే చరిత్ర పునరావృతం అవుతుంది. దశాబ్దాలపాటు పోరాడి రాష్ట్రాలు సాధించుకున్న హక్కులు హుళక్కి అవుతాయి. దేశంలో ఫెడరల్ స్ఫూర్తి మంటగలుస్తుంది. జమిలి ఎన్నికలతో దేశం మారిపోతుందనీ, అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని చేస్తున్న ప్రచారంలో వాస్తవం తక్కువ ఉత్ప్రేక్ష ఎక్కువగానూ కనిపిస్తున్నది. ఏటా కొన్ని రాష్ట్రాలలో ఎన్నికలతో ఎన్నికల కమిషన్ విధించే కోడ్ వల్ల అభివృద్ధి ఆగిపోతుందని జమిలి ఎన్నికలతో ఈ బెడద ఒకసారితో తొలిగిపోతుందని అంటున్నారు.



వాస్తవానికి రాష్ట్రాలకు ఎప్పుడు ఎన్నికలు జరిగినా అక్కడ ఒకసారి కోడ్ తప్పదు. ఇక కేంద్రానికి ప్రతి ఏటా రాష్ట్రాల ఎన్నికలవల్ల అక్కడ కొన్ని పరిమితులున్న మాట వాస్తవం. అయితే ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టరాదన్న అభ్యంతరాలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది అప్పటికే అమలులోవున్న ఏ పథకాల అమలుపైనా ఎలాంటి ఆంక్షలను పెట్టడం లేదు. ఆ రాష్ట్రాలకు మాత్రం ప్రత్యేక రాయితీలు ఉండకూడదని మాత్రమే ఆంక్షపెట్టింది. దీనివల్లే అభివృద్ధి అంతా ఆగిపోతున్నదనేది పావు శాతం పాక్షిక సత్యం మాత్రమే. ఇక రెండోది ఇన్నిసార్లు ఎన్నికల వల్ల ప్రభుత్వ ఖర్చు పెరగడం సహజం. 17 లక్షల కోట్ల దేశ బడ్జెట్, లక్షల కోట్లలో రాష్ట్ర బడ్జెట్లు వున్న దేశంలో

5 లేక 6 వేలకోట్లు ఎన్నికల కోసం పెట్టే ఖర్చును భూతద్దంలో చూపడం సరికాదు. ఎందుకంటే అదనంగా చేసే 2, 3 వేల కోట్లతోనే దేశం మారిపోదు. అభివృద్ధి ఆగిపోదు. మంచి ఎన్నికల వ్యవస్థ కోసం అనేక దేశాలు ఎన్నికల ఖర్చుతోపాటు పార్టీలకయ్యే ఎన్నికల ఖర్చును కొంత భరిస్తున్నాయి. మనదేశంలో కూడా ఇలాంటి ప్రయోగం కోసం ఇంద్రజిత్ గుప్తా కమిటీ కొన్ని సిఫారసులు చేసింది. కేవలం ఎన్నికల ఖర్చు తగ్గించడం కోసం మాత్రమే ప్రయోగాలు సహేతుకం కావు.

జమిలి ఎన్నికలు ప్రతి ఏటా రాష్ట్రాలలో ఎన్నికల తలనొప్పిని తొలగిస్తుందే తప్ప మన ఎన్నికల వ్యవస్థను సంస్కరించడానికి అణుమాత్రం దోహదం చెయ్యదు. తక్షణం జరగాల్సిన ఎన్నికల సంస్కరణను వాయిదా వేసే ఎత్తుగడగా మాత్రమే ఉపయోగపడుతుంది. పార్టీల అభ్యర్థులు పెట్టే ఎన్నికల ఖర్చు మీద ఎలక్షన్ కమిషన్ పరిమితులు విధించినా అదనంగా ఓట్ల కొనుగోళ్లకు, ఇతర ప్రలోభాలకు కోట్లు ఖర్చు చేస్తున్నారు. తిరిగి సంపాదించడానికి అవినీతిని పెంచి పోషిస్తున్నారు. దీనిని అరికట్టే ఆలోచన మనకి కనబడడం లేదు. పార్టీల మేనిఫెస్టోలు ప్రభుత్వ ఖజానాను గుల్ల చేసే ప్రజాకర్షక వాగ్దానాలను గుప్పించేవిగా ఉంటున్నా దానిపై ఉలుకూ పలుకూ వినిపించడం లేదు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని ఉల్లంఘిస్తూ జెండాలు మార్చేస్తూ పదవులను దక్కించుకుంటున్నా దానిని చక్కదిద్దే ఊసు లేదు.

జమిలి ఎన్నికలకన్నా ముందు ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. పాలక పార్టీలన్నీ ఈ ఆటలో భాగస్వాములైనందున వీటిని పట్టించుకోవడం లేదు. కలగా పులగం తీర్పులు జమిలి ఎన్నికలలో ప్రజల తీర్పులు కలగా పులగం అవుతాయి. రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేనికదే ప్రత్యేకమైనవి. వీటి మధ్య అధికార విభజనను రాజ్యాంగమే నిర్దిష్ట పరిచింది.

ఒకరి జాబితాలో మరొకరు కల్పించుకోకుండా 7వ షెడ్యూల్‌లో కేంద్రానికి లిస్ట్ 1ని, రాష్ట్రాలకి లిస్ట్ 2ను కల్పించింది. రాజ్యాంగ పరంగా ఈ ప్రభుత్వాలు నిర్వహించాల్సిన విధులు భిన్నమైనవి. ఎన్నికలలో ప్రజలు దేని అధికారాల పరిధిలో దానికి తీర్పు చెప్పాలి. ప్రజలు దేనికి దానికి వేరువేరుగా తీర్పుచెప్పడానికి జమిలి ఎన్నికలు అనువైన పద్ధతి కాదు. మన దేశంలో జమిలి ఎన్నికలలో ఓటర్ల ప్రవర్తనపై జరిగిన అధ్యయనాల ప్రకారం జమిలి ఎన్నికలలో ఓటర్లు రాను రాను ఒకే పార్టీ వైపు మొగ్గు చూపడం పెరుగుతున్నది. ఎన్నికలప్పుడు వారిని ప్రభావితం చేసిన అంశాల ఆధారంగా రెండు ఓట్లను ఒకే పార్టీకి వేస్తున్నారు. ఇలాంటి కలగా పులగం తీర్పులవల్ల ప్రజల ఆకాంక్షలకీ, ఏర్పడే ప్రభుత్వాలకి మధ్య పొంతన లేక ప్రభుత్వాలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి.

రెండుచోట్లా ప్రజల ఆకాంక్షలకు తగ్గ ప్రభుత్వాలు రావడానికి జమిలి ఎన్నికల

పద్ధతి దోహదపడేది కాదు. ఒక వేళ రాజ్యాంగ పరమైన అవరోధాలను దాటుకొని జమిలి ఎన్నికకు దారి ఏర్పడితే అప్పుడు ఒకసారి పార్లమెంటుకూ, ఒక ఎన్నిక ప్రభావం మరోదానిపై పడకుండా కనీసం రెండున్నర సంవత్సరాల వ్యవధి తర్వాత అన్ని శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు జరపడం శ్రేయస్కరం అవుతుంది.

## జమిలి ఎన్నికల గుణపాఠం

జమిలి ఎన్నికలు మన దేశానికి కొత్త కాదు. 1952 నుండి 1967 వరకు దేశమంతటా దాదాపుగా జమిలి ఎన్నికలే జరిగాయి. ఆ పద్ధతికి తిరిగి వెళ్లడం ఘర్ వాపసీ లాంటిదిగా ప్రచారం చేస్తున్నారు. దానిని తమ వాదనకు ఒక దృష్టాంతంగా వాడుకుంటున్నారే తప్ప దాని అనుభవాలను, గుణపాఠాలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఈ జమిలి ఎన్నికలు కేంద్రంలో, రాష్ట్రాలలో ఏక పార్టీ పాలనకు దారి తీసింది.

కేరళలో 1957లో దానికి భిన్నంగా ఏర్పడిన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని మధ్యంతరంగానే కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, రాష్ట్రాలలో మరో పార్టీ అధికారంలో ఉండకుండా జాగ్రత్తపడింది. పైగా దేశంలో ఏక పార్టీ పాలన రాష్ట్రాల అభివృద్ధినీ, అధికారాలను, ప్రజల ప్రాంతీయ ఆకాంక్షలను తుంగలోకి తొక్కింది. దీని పర్యవసానంగానే దేశంలో ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. ఏక పార్టీ పాలనకు చరమగీతం పాడాయి. ఎక్కడైనా ప్రాంతీయ ఆకాంక్షలకు భంగం వాటిల్లితే అక్కడ ప్రజలకు ప్రాంతీయ పార్టీల రూపంలో ఒక ప్రత్యామ్నాయ మార్గం దొరికింది. ఆంధ్రుల ఆత్మగౌరం నినాదంతో తెలుగుదేశం పార్టీ ఎన్నికలలో గెలిచి స్థిరపడింది.

తెలంగాణలో ప్రాంతీయ ఆకాంక్షలకు ప్రతినిధిగా తె.రా.సా. ప్రాంతీయ పార్టీగా అవతరించింది. ఇవన్నీ ఒకనాటి ఏకపార్టీ పాలన పర్యవసానాల కొనసాగింపుగా జరిగిన, జరుగుతున్న పరిణామాలు. ఒకే దేశం – జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలు అసంగతం అవుతాయి లేదా జాతీయ పార్టీలకు అనుచర పార్టీలుగానూ మనుగడ సాగించాల్సిన స్థితిలో పడతాయి. అవి క్రమేణా ప్రజల ప్రాంతీయ ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించే స్థితిని కోల్పోతాయి. తర్వాత తలెత్తే ప్రాంతీయ ఆకాంక్షలకు పరిష్కార మార్గంగా దేశ విభజనోద్యమాలే మార్గంగా కనిపిస్తాయి. ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో చరిత్రను పునరావృతం చెయ్యాలని పూనుకుంటే ఈసారి జరిగే పరిణామాలు దేశానికి విషాదాంతంగా మారే ప్రమాదం కనిపిస్తున్నది.

2–5–2017 ఆంధ్రజ్యోతి

# జమిలి ఎన్నికల వెనక  మోదీ పద్మవ్యూహం

**మో**దీ చర్యలకు ఒక తాత్కాలిక లక్ష్యం వుంటుంది. ఒక పద్మవ్యూహం లాంటి దీర్ఘకాలిక లక్ష్యం వుంటుంది. జమిలి ఎన్నికల మీద మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ కమిటీ నివేదికను మోదీ మంత్రివర్గం ఆమోదించడం కేవలం లాంఛన ప్రాయమైంది కాదు. మోదీ మూడో విడత పాలన శత దినోత్సవం సందర్భంగా జమిలి ఎన్నికలను తెరమీదకు తేవడం యాదృచ్ఛికం కాదు. ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్రాల ఎన్నికల్లో ప్రతిపక్షాలపై దాడి చేసే ప్రచార అస్త్రంగా  వాడుకోవడం మోదీ తక్షణ లక్ష్యం కావచ్చును. ఈ ప్రచారానికి సరంజామా సిద్ధం అయ్యింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ జమిలి ఎన్నికలను రెండు విడతలుగా నిర్వహించవచ్చునని సూచించింది. నీతి ఆయోగ్ దానిని బలపరిచింది. లా కమిషన్ సమర్ధించింది. తాజాగా మాజీ రాష్ట్రపతి కోవింద్ కమిటీ జమిలి ఎన్నికలను సిఫార్సు చేసింది. ఇంత మంది చేసిన సిఫార్సుల ఆధారంగా  'ఎన్నికల సంస్కరణలకు' పూనుకొంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని, వారు ప్రజాస్వామ్య సంస్కరణలకు, ఒకే దేశం భావనకీ వ్యతిరేకులుగా ప్రచార దాడిని సాగించే వీలుంది. జమిలి ఎన్నికల నినాదం వెనక వున్న మోదీ దీర్ఘకాలిక వ్యూహాన్ని చర్చించే ముందు ఇప్పటికే ప్రచారంలో వుండి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న కొన్ని అంశాల లో వాస్తవాలను పరిశీలిద్దాం.




## ఎన్నికల ఖర్చు- వాస్తవాలు

ఈ ఎన్నికల వ్యయం మీద జరుగుతున్న చర్చలో రెండు భాగాలున్నాయి. ఒకటి ఎన్నికలలో పోటీ చేసే రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థులు ప్రలోభాలకి, ప్రచారానికి పెట్టే ఖర్చు  ఒకే ఎన్నికైనా, జమిలి అయినా ఈ ఖర్చు పెరుగడమే కాని తరగదు. మరొకటి ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ చేసే ఖర్చు.

1. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, వాటికి అవసరమైన సదుపాయాల కల్పన.
2. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి ప్రయాణ ఖర్చులు.

3. బాలట్ బాక్స్‌ల తరలింపు, సిబ్బంది ప్రయాణ ఖర్చులు.

4. పోలింగ్, ఓటింగ్ కేంద్రాలకు అవసరమైన తాత్కాలిక ఫోను, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్.

5. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి కొనుగోళ్లు.

6. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి చేసే ఇతర ఖర్చులు.

1952లో తొలి జమిలి ఎన్నికలకు అయిన ఖర్చు రూ.10 కోట్లు మాత్రమే. ప్రతి ఎన్నికకు పెరుగుతున్న ఓటర్లు, ధరవరలు, ఏర్పాట్లకు అనుగుణంగా ఈ ఖర్చు పెరుగుతూ 2014లో 16వ లోకసభ ఎన్నికలకు ఖర్చు రూ.3,826 కోట్లకు పెరిగింది. 2019 నాటికి ఈ ఖర్చు రూ.6,000 కోట్లకు చేరింది. ఇది ఐదేళ్లకు ఒకసారి పెట్టే ఖర్చు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ రూ.48 లక్షల కోట్లు. ఒక ఏడాదికి ఎన్నికల నిర్వహణకు పెట్టే ఖర్చు కేవలం రూ.1,200 కోట్లు మాత్రమే. ఇక రాష్ట్రాలలో వేరు వేరుగా ఎన్నికలు జరిగినా అదనంగా అయ్యేది మరో రూ.1,200 కోట్లు. అందువల్ల జమిలి ఎన్నికలతో ప్రజల డబ్బు ఆదా అవుతుందన్న వాదన వాస్తవం కాదు.

## ఎన్నికల కోడ్ - అభివృద్ధి

తరచు ఎన్నికల వల్ల ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి నిలిచిపోతుందన్నది మరో వాదన. లోకసభ ఎన్నికలప్పుడు దేశమంతటికీ ఎన్నికల కోడ్ వర్తిస్తుంది. కేంద్రంలో వుండే ఆపద్ధర్మ ప్రభుత్వం కొత్త పథకాలను తీసుకునే అవకాశం ఉండదు. వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరిగేటప్పుడు ఆ రాష్ట్రాలలో ఇదే స్థితి వుంటుంది. ఇకపోతే మధ్యలో కొన్ని రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు కేంద్ర ప్రభుత్వం స్తంభించిపోదు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఓటర్లను ప్రభావితం చేసే కొత్త పథకాలు, రాయితీలు ప్రకటించడం మీదే మాత్రమే ఆంక్షలు ఉంటాయి. రోజువారీ పరిపాలన యథాతథంగా కొనసాగుతుంది. గతంలో కొన్ని రాష్ట్రాల ఎన్నికల సమయంలో కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టడం కూడా ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోలేదు.

## కేంద్రానికి-రాష్ట్రాలకు మధ్య విభజన

దేశంలోని బహుళత్వాన్ని, వైవిధ్యాన్ని మన రాజ్యాంగ నిర్మాతలు పరిగణనలోకి తీసుకున్నారు. కేంద్ర జాబితా, రాష్ట్రాల జాబితా, ఉమ్మడి జాబితాల రూపంలో అధికారాల విభజన చేశారు. ఎన్నికలలో ప్రజలు తీర్పు చెప్పడానికి ఇవే ప్రాతిపదికలు కావాలి. జాతీయస్థాయిలో లోకసభకు జరిగే ఎన్నికలలో కేంద్ర జాబితాలోని అంశాలపై వివిధ పార్టీల విధానాలపైనా, శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర

జాబితాలోని అంశాల ఆధారంగా ప్రజలు తీర్పు చెప్పాల్సి వుంటుంది. అందువల్ల లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు వేరు వేరుగా ఎన్నికలు జరపడం వల్ల ప్రజలు దేనికి తగ్గ తీర్పు దానికి చెప్పే వీలుంటుంది. జమిలి ఎన్నికలు ఈ అధికార విభజనను కలగాపులగం చేస్తుంది. జాతీయ అంశాలు పైచేయి సాధిస్తాయి.

1952లో రాజ్యాంగం అమలులోకి రాగానే జరిగిన తొలి ఎన్నికలలో జమిలి తప్పలేదు. జాతీయోద్యమ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో రాష్ట్రాలలో రెండింటా ఆధిపత్యాన్ని పొందింది. ప్రజల ప్రాంతీయ ఆకాంక్షలు విస్మరించబడ్డాయి. దీని పర్యవసానంగా 1967లో అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. అవి నేటికీ ప్రజల ప్రాంతీయ ఆకాంక్షలకు ప్రతినిధులుగా కొనసాగుతున్నాయి. గతంలో జమిలి ఎన్నికల ప్రయోగం ఒక జాతీయ పార్టీ ఏకచ్ఛత్రాధిపత్యానికి దారి తీసింది. వివిధ రాష్ట్రాల ప్రజల, ప్రాంతాల ఆకాంక్షల వైవిధ్యాన్ని తుడిచిపెట్టింది. గతంలో జమిలి ఎన్నికలు వున్నాయి కదా అని వాదించే వారు దాని పర్యవసానాలను విస్మరిస్తున్నారు. మోదీ దీర్ఘకాలిక లక్ష్యం లేదా వ్యూహం కేవలం రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే ఉద్దేశించబడింది. ఇందులో దేశ ప్రయోజనాలకు తావు వుండదు. ఆర్థిక విధానాల ఆధారంగా ఎన్నికల్లో విజయాలను సాధించడం మోదీ లక్ష్యం కాదు. మెజారిటీ మతవాదం ఒక్కటే తనను దేశ ప్రజలకు ఏకైక నాయకుణ్ణి చేస్తుందన్న భావనే అయనను నడిపిస్తున్నది. ఇది ఆచరణలో వాస్తవం కావాలంటే దేశంలో భిన్నత్వం అన్న భావన వుండకూడదు. వైవిధ్యం అన్న భావన కనిపించ కూడదు.

ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే ఎన్నిక మాటున భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని రూపుమాపాలి. అప్పుడు మాత్రమే మోదీ మెజారిటీ వాదం తన విశ్వరూపాన్ని ప్రదర్శించగలుగుతుంది. విద్వేష రాజకీయానికి తిరుగులేని విజయాలను సాధించి పెడుతుంది. జమిలి ఎన్నికలు, డబుల్ ఇంజన్ సర్కార్ నినాదాలు ఈ లక్ష్యాన్ని చేరడానికి మోదీ ఎంచుకున్న సాధనాలు. ఈ నినాదాలు ప్రాంతీయ పార్టీలను బలహీనపరుస్తాయి. డబుల్ ఇంజన్ సర్కార్లలో అవి జూనియర్ పార్టనర్లుగా మారతాయి.కాలక్రమేణా అంతరించి పోతాయి.

## అధ్యక్ష తరహాకు రంగం

దేశంలోని వైవిధ్యాన్ని గమనంలోకి తీసుకుని మన రాజ్యాంగం లోక్‌సభకు ఎన్నికైన ప్రజాప్రతినిధులలో మెజారిటీ స్థానాలు పొందిన పార్టీపక్ష నాయకుడు ప్రధాని అయ్యే పార్లమెంటరీ పద్ధతిని స్వీకరించింది. ఈ కారణంగానే అధ్యక్ష

తరహా ఎన్నికల పద్ధతిని రాజ్యాంగం పక్కన పెట్టింది. కాని ఎలాంటి రాజ్యాంగ సవరణ లేకుండానే చాపకింద నీరులా ప్రతి ఎన్నిక లోనూ అధ్యక్ష తరహా పద్ధతివైపు అడుగులు పడుతున్నాయి. ఎన్నికలకు ముందే మీ ప్రధాని అభ్యర్థి ఎవరు? మీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు? అన్న సవాళ్ళు ప్రతి సవాళ్ళు ముందు కొస్తున్నాయి. రాజ్యాంగ విరుద్ధమైన ఈ సవాళ్ళనే నిజమైన సమస్యగా పత్రికలు, విశ్లేషకులు చర్చిస్తున్నారు. జమిలి ఎన్నికల తర్వాత మన ముందుకు వచ్చే అంశం అధ్యక్ష తరహా ఎన్నికల పద్ధతి. దీనితో ఒకే దేశం –ఒకే ఎన్నిక – ఒకే నాయకుడు అనే రాజకీయ వృత్తం పూర్తి అవుతుంది. ఇదీ జమిలి ఎన్నికల వెనుక దాగిన మోదీ రాజకీయ పద్మవ్యూహం.

ప్రస్తుతం చర్చ అంతా జమిలి ఎన్నికల పర్యవసానాల మీద కాకుండా దాని సాధ్యాసాధ్యాల మీద జరుగుతున్నది. రాజ్యాంగ సవరణలకు అవసరమైన సంఖ్యాబలం చుట్టూ తిరుగుతున్నది. మోదీ, షాలకు ఆ లెక్కలు తెలుసు. జమిలి ఎన్నికలనే 'గొప్ప సంస్కరణ' అమలును ప్రతిపక్షాలు అడ్డుకోవడం వల్లే ఆగిపోయిందని దీని అమలుకు తగిన సంఖ్యాబలాన్ని ఇవ్వాల్సిందిగా 2029 ఎన్నికలకు వారు నినాదంగా చేసుకోవచ్చును. పోతే అమిత్ షా ప్రస్తుత లోక్ సభ కాలంలోనే దీనిని అమలులోకి తెస్తామన్న మాటను తక్కువ అంచనా వెయ్యకూడదు. భయపెట్టో, బుజ్జగించో రాజ్యాంగ సవరణలకు తగిన సంఖ్యా బలాన్ని తెచ్చుకునే ఎత్తులు జిత్తులకు పూనుకోవచ్చును.

అదీ కాకపోతే 2027 లేదా 2028లో లోక్ సభను రద్దు చేసి ఆ సంత్సరం జరిగే అసెంబ్లీ ఎన్నికలతోపాటు తర్వాత సంవత్సరం జరగాల్సిన ఎన్డీఏ కూటమి రాష్ట్ర ప్రభుత్వాలను ముందస్తు ఎన్నికల కోసం రాజీనామాలు చేయించి ఒక విడత జమిలి ఎన్నికలు నిర్వహిస్తూ దీనిని రాజ్యాంగ బద్ధం చెయ్యడానికి తమకు మూడు వంతులకుపైగా మెజారిటీ ఇవ్వాలన్నది ఎన్నికల నినాదం చేసినా ఆశ్చర్యపోనక్కర లేదు. ఎందుకంటే జమిలి వారి రాజకీయ వ్యూహంలో అత్యంత కీలకమైంది. రాజ్యాంగాన్ని, దేశ రాజకీయాలను మలుపు తిప్పే జమిలి ఎన్నికల వెనక దాగిన పద్మవ్యూహాన్ని ప్రతిపక్షాలు సరైన ప్రతి వ్యూహంతో ఎదుర్కొనడానికి సిద్ధం కావాలి.

2022 నవంబరు 23

# రైతుల విజయం నేర్పుతున్న ఉద్యమపాఠాలు

**ఢి**ల్లీ చుట్టు ముట్టి రైతులు సాగించిన ఉద్యమం తొలి విజయాన్ని సాధించింది. ఇది సామాన్య విజయం కాదు. పార్లమెంటులో పాసైన చట్టాలను తిరిగి వెనక్కి తీసుకునే అసాధారణ పరిస్థితిని సాధించిన విజయం. పైగా తమకు ఎదురులేదని భావిస్తున్న మోదీ ప్రభుత్వ ఆధిపత్యపాలనను సవాలు చేసి సాధించిన విజయం. పైకి సాధారణ సత్యాగ్రహంలా కనిపించింది. శాంతియుత నిరసనగా అనిపించింది. కాని పాలకుల ఎత్తులనీ, జిత్తులనీ చిత్తు చేస్తూ విజయం సాధించింది. సంవత్సర కాలంపాటు విరామం లేకుండా సాగిన ఈ ఉద్యమం మెట్టు మెట్టుకీ అనుసరించిన పద్ధతులు ప్రజా ఉద్యమాలకు దారి దీపంగా చరిత్రలో నిలిచిపోతుంది. ఈ ఉద్యమం నేర్పుతున్న ప్రజా ఉద్యమ పాఠాలను లోతుగా పరిశీలించుకోవడం అవసరం. ఎందుకంటే ఈ ఉద్యమ విజయ రహస్యం అది పోరాడిన పద్ధతిలోనే ఇమిడి వున్నది. క్రమానుగతంగా విస్తరించి అంతిమంగా 'యుద్ధ సన్నాహ' ఘట్టాన్ని చేరిన క్రమాన్ని విశ్లేషించుకోవాలి.



విజయవాడ సభలో సంకు మనోరమ, కిసాన్ సమ్మేళన్ నాయకులు తికాయత్, వడ్డే శోభనాద్రీశ్వరరావు

మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను తెచ్చిన తీరులో అతృతే కాదు. అనైతికత వుంది. ఈ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా ఆర్డినెన్సులను జారీచేసింది. పార్లమెంటులో తగిన చర్చ జరగకుండా, అందరి అభిప్రాయాలు తెలుసుకోడానికి వీలుగా స్టాండింగ్ కమిటీని నివేదించకుండా ఏకపక్షంగా ఆమోదింపజేసుకుంది. పైగా వ్యవసాయరంగం రాష్ట్రాల జాబితాలో వుంది. కానీ మోదీ ప్రభుత్వం రాష్ట్రాల అధికార పరిధిలోవున్న వ్యవసాయ రంగంలోకి ఈ

చట్టాల ద్వారా దొడ్డిదారిన దురాక్రమణ చేసింది. ప్రజాస్వామ్య పద్ధతులకీ, ఫెడరల్ స్ఫూర్తికీ విరుద్ధంగా అనైతిక పద్ధతుల్ని అనుసరించింది. రైతుల నుండి, ప్రతిపక్ష పార్టీల నుండి కొన్ని ప్రాంతీయ పార్టీల నుండి నిరసన వ్యక్తం కావడంతో కేంద్రప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. మరోపక్క రైతులను సంఘటిత పర్చడానికి, ఉద్యమ బాట పట్టించడానికి అది నైతికంగా దోహదపడింది. సంవత్సరకాలంగా సాగిన రైతు ఉద్యమ ప్రస్థానంలో అనేక మలుపులు చోటు చేసుకున్నాయి. ప్రతి మలుపునీ తన ఉద్యమానికి అనుకూలంగా మార్చుకున్న తీరును పరిశీలించుకుందాం.

## 1. రైతుల ఐక్య ఉద్యమం

2020 సెప్టెంబరులో కేంద్ర చట్టాలు అమలులోకి వచ్చాయి. పంజాబ్, హర్యానాలో రైతులు ఎక్కడికక్కడ స్థానికంగా నిరసనలు, రోడ్‌రోకోలు నిర్వహించారు. ఈ విడివిడి పోరాటాలను ఏకం చెయ్యడానికి సంయుక్త కిసాన్ మోర్చా ఏర్పడింది. దీనిలో దేశవ్యాపితంగా 500 సంఘాలు చేరాయి. 40 సంఘాల ప్రతినిధులతో కార్యాచరణ కమిటీ ఏర్పడింది. వివిధ పార్టీలకు అనుబంధంగా వున్న రైతు సంఘాలు ఇందులో భాగంగా ఉన్నాయి. అయితే రాజకీయంగా ఈ ఉద్యమాన్ని చీల్చడానికి వీలు లేకుండా, పార్టీల జెండాలు లేకుండా పాల్గొనే వీలు కల్పించారు. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించే ఉద్యమంగా అన్ని తరగతుల రైతులను సమీకరించే విశాలమైన వేదికను రూపొందించారు.

## 2. దేశవ్యాపిత ఉద్యమంగా విస్తరణ

సంయుక్త కిసాన్ మోర్చా ఏర్పడినా అది దేశవ్యాపితమైన ఉద్యమాన్ని నిర్వహించగల స్థితిలో లేదు. ఒక పక్క నవంబరు 25న కిసాన్ మోర్చా 'ఢిల్లీ ఛలో' పిలుపునిచ్చింది. మరోపక్క కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా 11 జాతీయ స్థాయి కార్మిక సంఘాలు చేస్తున్న ఉద్యమంతో చేతులు కలిపింది. నవంబరు 26న దేశవ్యాపిత సమ్మెను సంయుక్తంగా నిర్వహించింది. రైతు ఉద్యమం ఆనాటికి రెండు రాష్ట్రాలలో కేంద్రీకృతం కాగా కార్మిక వర్గంతో కలిసి ఇచ్చిన పిలుపుతో రైతాంగ సమస్యలకు దేశ వ్యాపితమైన ప్రచారం లభించింది. ప్రతిపక్ష పార్టీలు, కొన్ని ప్రాంతీయ పార్టీలు దీనికి మద్దతు పలకడంతో అది దేశవ్యాపిత నిరసన రూపం ధరించింది. ఇలా సంయుక్త కిసాన్ మోర్చా రైతుల ఉద్యమాన్ని దేశవ్యాపిత సంఘీభావ ఉద్యమంగా మలుచుకోగలిగింది. ఆ తర్వాత డిసెంబరు

8న జరిగిన భారత్ బంద్, తదితర దేశవ్యాపిత నిరసన కార్యక్రమాలతో రైతుల ఉద్యమం అన్ని ప్రాంతాలకు విస్తరించిన సంఘీభావ ఉద్యమంగా అదనపు శక్తిని సంపాదించుకుంది.

## 3. కార్పొరేట్ విషకౌగిలి గుట్టురట్టు

రైతుల ఉద్యమాన్ని చీల్చడానికి ఈ చట్టాలు రైతుల ప్రయోజనాలను ఎలా కాపాడతాయో వివరించడానికి ప్రభుత్వం తన ప్రయత్నాలను తీవ్రతరం చేసింది. తమ వాదనకు మద్దతునిచ్చే రైతు నాయకుల అనుచర బృందాలతో సమావేశాలు నిర్వహించింది. దానికి విస్తృత ప్రచారం కల్పించింది. ఢిల్లీని చుట్టుముట్టి ఆందోళన చేస్తున్నవారు సంపన్నులు, దళారీలు అని ప్రకటించడమే కాకుండా ఖలిస్తాన్ వాదులుగా, పాకిస్థాన్, చైనాల తైనాతీలుగా ప్రకటించింది.

దీనికి ప్రతిస్పందనగా సంయుక్త కిసాన్ మోర్చా ఈ ఉద్యమాన్ని మరో మలుపు తిప్పింది. కేంద్ర ప్రభుత్వానికి, కార్పొరేట్ శక్తుల మధ్యనున్న అపవిత్ర కలయిక గుట్టును రట్టు చేసింది. ఇప్పటికీ వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం మీద పట్టు సంపాదించిన కార్పొరేట్ శక్తులు వ్యవసాయ భూముల మీద, పంటల మీద పెత్తనం చెయ్యడానికే ప్రభుత్వం తెచ్చిన చట్టాలని స్పష్టం చేసింది. అంబానీ, అదానీ కంపెనీలు వస్తు బహిష్కరణకు పిలుపు ఇచ్చింది. ప్రభుత్వ కార్పొరేట్ శక్తుల కుమ్మక్కును గ్రామీణ ప్రాంతాలకు చేరవేసిన ఘనత ఈ ఉద్యమానికే దక్కుతుంది.

మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలలో భాగంగానే ఈ చట్టాలు తెచ్చినట్టు విస్తృత ప్రచారం సాగించింది. రైతు ఉద్యమ పోరాటం చట్టాల ఉపసంహరణ డిమాండ్‌తో ప్రారంభమై ప్రభుత్వ ఆర్థిక విధానాల మీదకు, ఎక్కు పెట్టింది. ఇది మోదీ ప్రభుత్వంపై రాజకీయ పోరాటానికి తగిన భూమికతో రైతు ఉద్యమం మరో మలుపుకు సిద్ధమైంది.

## 4. చరిత్రలో నిలిచిపోయే మహోద్యమం

ప్రపంచ చరిత్రలోనే ఇది ఒక దీర్ఘకాలికమైన ప్రజాఉద్యమం.ఢిల్లీ చుట్టూ వేలాది మంది రైతులు మొహరించి సాగించిన మహోద్యమం. గడ్డ కట్టిన చలిలో, వానలో, ఎండలో నిరంతరాయంగా సాగిన ఉద్యమం. పోలీసుల లాఠీ ఛార్జీలను వాటర్ క్యాన్ నీటిధారల దాడిని, అరెస్టులను ధిక్కరించి సాగిన ఉద్యమం. ప్రభుత్వం ఎన్నిసార్లు చర్చలకు పిలిచినా, పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేసినా మూడు చట్టాల రద్దు తప్ప దేనికీ తలవొగ్గని ఉద్యమం ఇది. 600 మందికి పైగా

రైతులు ఈ ఉద్యమంలో మరణించారు. అయినా విరామం లేకుండా ఈ ఉద్యమం సాగింది. దేశప్రజల అభిమానాన్నే కాదు ప్రపంచ ప్రజల దృష్టినీ ఆకర్షించి గొప్ప సంఘీభావాన్ని పొందింది. ఒక ప్రజా ఉద్యమానికి ఇంతటి పట్టుదల, దీక్ష వుంటే అది తప్పక విజయం సాధిస్తుందని ఈ ఉద్యమం రుజువు చేసింది.

## 5. సామాజిక ఉద్యమంగా విస్తరణ

ఇది కేవలం రైతులకే పరిమితం కాలేదు. రైతు కుటుంబాలలో పిల్లలు, పెద్దలు, మహిళల ఉద్యమంగా సాగింది. ఈ ఉద్యమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఒకరు ఇంటిని, వ్యవసాయ పనులు చూసుకుంటే మిగిలిన కుటుంబం అంతా ఉద్యమంలో పాల్గొన్నారు. గ్రామాలకు గ్రామాలే ఈ కార్యక్రమాలకు తరలివచ్చాయి. మొత్తం ట్రాక్టర్లన్నీ రొడ్డెక్కాయి. ఈ కార్యక్రమానికి అవసరమైన ఆహార పదార్థాలను, కూరగాయలు, పాలు అన్నింటికీ గ్రామస్థులే సమకూర్చారు. సామాజిక ఉద్యమంగా మారడం ప్రజా ఉద్యమానికి ఉన్నతదశ దానిని ఈ ఉద్యమం సాధించింది. ఒక ప్రజా ఉద్యమం సామాజిక స్వభావాన్ని పొందితే అది విజయానికి రహదారి అవుతుంది.

## 6. రాజకీయ పోరాటంగా పరిణామం

దీర్ఘకాలికంగా ఉద్యమం సాగుతున్నా కేంద్రప్రభుత్వం చర్చలపేరుతో మభ్యపెట్టడం తప్ప ఈ చట్టాల ఉపసంహరణకు సిద్ధం కాకపోవడంతో సంయుక్త కిసాన్ మోర్చా తన ఉద్యమాన్ని బి.జె.పి. వ్యతిరేక రాజకీయ ఉద్యమంగా నడపాలని నిర్ణయించి, దేశవ్యాపితంగా రైతులను, ప్రజలను ప్రభావితుల్ని చెయ్యడానికి ప్రచార యాత్రలను, రైతుల పంచాయత్‌లను నిర్వహించడం ప్రారంభించింది. బెంగాల్ ఎన్నికలలో ఒక ప్రచార సభను నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాలలో రైతుల్ని ప్రభావితం చెయ్యడానికి పర్యటనలు చేసింది. ముజఫర్ పూర్‌లో 5 లక్షల మందితో రైతు పంచాయత్‌ని నిర్వహించి మూడు చట్టాలను ఉపసంహరించకపోతే రాబోయే ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో పోటీ చేస్తామని ప్రకటించింది.త్వరలో రానున్న ఎన్నికలలో ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లలో దీని ప్రభావం తీవ్రంగా వుంటుందనేది తెలిసిన సత్యమే.

## 7. అహింసాయుత సత్యాగ్రహం

ఢిల్లీ సరిహద్దులలో రైతులు సాగించిన నిరసన 'అహింసాయుత సత్యాగ్రహం'లా సాగింది. ప్రభుత్వం చాలా కవ్వింపు చర్యలకు పూనుకున్నా... హింసాత్మక ఘటన

లు జరిగేలా రెచ్చగొట్టినా సంయుక్త కిసాన్ మోర్చా దాని ఉచ్చులో పడలేదు. 2021 జనవరి 26న జరిగిన ట్రాక్టర్ ర్యాలీని అసరాగా చేసుకుని ఎర్రకోట మీద 'దాడి' అంటూ ప్రభుత్వం చేసిన కుయుక్తులు ఫలించలేదు. అలాగే లఖింపూర్‌లో బిజెపి మంత్రి కుమారుడు జీపును రైతుల మీద దారుణంగా నడిపించి మారణకాండకు పూనుకున్నా, రైతు ఉద్యమం తన శాంతియుత ప్రతిఘటనా మార్గాన్ని వీడలేదు. ఈ ఉద్యమం ఇంతకాలం సాగడానికి ప్రభుత్వం దమనకాండకు దిగడానికి వీలు లేకుండా చేసింది ఈ శాంతియుత సమరమే. ఈ మార్గమే వారిని విజేతలుగా నిలబెట్టింది.

మొత్తం మీద వ్యవసాయ చట్టాల మీద పోరాటం విడివిడి నిరసనలతో ప్రారంభమై, రైతుసంఘాల ఐక్య ఉద్యమంగా, కార్మికులనీ, ప్రతిపక్షాలను కలుపుకుపోయే విశాల వేదికగా మారి, కేంద్రప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానల ప్రతిఘటన రూపం పొంది, దీర్ఘకాలం శాంతియుతంగా సాగిన ఉద్యమం కొన్ని రాష్ట్రాలలో సామాజిక ఉద్యమ రూపంగానూ దేశవ్యాపితంగా సంఘీభావ ఉద్యమాల రూపంలోనూ ఎంతో ఎత్తు ఎదిగి మోదీ ప్రభుత్వాన్ని రాజకీయంగా ప్రతిఘటించే శక్తిగా అవతరించింది. ఎన్నికల్లో పరాజయాన్ని పసిగట్టిన మోదీ ప్రభుత్వం ఈ చట్టాలను ఉపసంహరించుకునేలా చెయ్యగలిగింది. ఒకప్రజా ఉద్యమాన్ని అంచెలంచెలుగా విజయాన్ని సాధించే మహోద్యమంగా, ప్రజా ఉద్యమాలు నిర్వహించే వారికి మార్గదర్శనం చేసే మహోద్యమంగా ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచివుంటుంది.

# ప్రత్యామ్నాయ రాజకీయం : కొన్ని చర్చనీయ అంశాలు

**1. దేశంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభం**

దేశంలో రాజకీయ సంక్షోభం పొంచి వుందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మోదీ ప్రభుత్వం బలహీనపడిన మాట వాస్తవం. గతంలోలాగ ఇప్పుడు మోదీ ఏక పక్షంగా వ్యవహరించడం సాధ్యం కాదు. ఇప్పుడు మోదీ తన మిత్రులతో సర్దుకు పోవాలి. లేకపోతే అధికార పీఠమే గల్లంతు అవుతుంది. అంతటి దుస్సాహసానికి మోదీ పూనుకునే అవకాశం ప్రస్తుతానికి లేదు. అలాగే మోదీ కూటమిలో వున్న రెండు ప్రధాన పక్షాలు రెండు పెద్ద రాష్ట్రాల్లో అధికారంలో వున్నాయి. అవి తమ మనుగడ కోసం మోదీ ప్రభుత్వం మీద ఆధారపడక తప్పని స్థితి వుంది. ఈ నేపథ్యంలో దేశంలో రాజకీయ సంక్షోభం కొంత కాలం వాయిదా పడే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది.



ప్రస్తుతం దేశంలో ఒక కొత్త తరహా సంక్షోభం పుట్టుకొచ్చింది. పాలక పక్షాల 'ఆర్థిక పాలనా సంక్షోభం' దేశాన్ని చుట్టుముడుతోంది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ పాలకపక్ష పాలనా రాజకీ యంలో సంక్షోభ దశ మొదలైంది. 'అప్పులతో అభివృద్ధి–బడ్జెట్ పరిధిలో సంక్షేమం' అన్న విధానాల అమలుకు కాలం పరిసమాప్తం కానుంది. ప్రజలపై మరింత భారం మోపి అదనపు నిధులు సమకూర్చుకునే దారులు మూసుకు పోతున్నాయి.

మొత్తం మీద బడ్జెట్ పరిధిలో అభివృద్ధికి అవసరమైన నిధులు లేవు. పేదలకు తాత్కాలిక ఉపశమనం కలిగించే సంక్షేమానికి నిధులు లేవు. రాష్ట్రాలకు అదనపు నిధులిచ్చే పరిస్థితి లేకపోగా పన్నుల పంపకంలోనూ రకరకాల పద్ధతుల్లో కోతలు పడుతున్నాయి. దీనితో రాష్ట్ర ప్రభుత్వాల స్థితి మరింత దారుణంగా మారింది. అవి ఇప్పటికే అప్పుల కుప్పలుగా వున్నాయి. ఎన్నికల్లో గెలుపు కోసం చేసిన వాగ్దానాలు నెరవేర్చలేని స్థితిలో సతమతమౌతున్నాయి. ప్రస్తుత ఆర్థిక వనరుల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిని ముందుకు సాగించే అవకాశాలు లేవు. వీటి బడ్జెట్ల పరిధిలో తాత్కాలిక ఉపశమన సంక్షేమ పథకాలు విస్తరించే అవకాశాలు పూర్తిగా అడుగంటాయి. ఈ తరహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ ఆర్థిక

పాలనా విధానాలు అనివార్యంగా సంక్షోభంలో పడతాయి. ఈ సంక్షోభం నుండి దేశ ప్రజలను ఒడ్డుకు చేర్చడానికి ప్రత్యామ్నాయ రాజకీయం తక్షణ అవసరం అవుతుంది.

## 2 పాలనా సంక్షోభానికి కారణాలు

గత పదేళ్ల మోదీ పాలనలో ప్రపంచంలోనే అత్యధికంగా అంతరాలు పెరిగిన దేశంగా మారింది. 2013 నాటికి 50 మంది బిలియనీర్లు అంటే 100 కోట్లకు పైబడిన డాలర్ల సంపదగల వారు లేదా రూ.8 వేల కోట్లకు పైబడిన సంపదగల వారు వుంటే 2024 నాటికి 169 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. ప్రపంచ బిలియనీర్లలో అమెరికా, చైనా తర్వాత మూడో స్థానానికి దూసుకుపోయింది. ఈ 169 మంది బిలియనీర్ల దగ్గరే 78 లక్షల కోట్ల సంపద పోగుపడింది.

ఆక్స్ ఫామ్ నివేదికల ప్రకారం దేశంలో ఒక శాతం దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడగా పది శాతంగా వున్న బిలియనీర్లు, కార్పొరేట్లు, కుబేరుల దగ్గర మొత్తం దేశ సంపదలో 77 శాతం గుట్టపడింది. ఇలా ఒక దశాబ్ద కాలంలోనే అరుదైన దేశ సంపద కేంద్రీకరణ జరిగింది.

మోదీ పాలన ప్రధానంగా కార్పొరేట్ల ప్రయోజనాల చుట్టూ తిరిగిన పాలన. దాని పర్యవసానంగానే దేశ సంపద వారి పంచకు చేరింది. ఈ పదేళ్లలో 35 శాతంగా వున్న కార్పొరేట్ పన్నును అంచెలంచెలుగా 22 శాతానికి తగ్గించారు. వారికే దాదాపు 20 లక్షల కోట్ల అప్పులను రద్దు చేశారు. గతంలో పది శాతం వున్న వారసత్వ పన్నును పూర్తిగా తొలగించారు.

మరోపక్క జీఎస్టీని నిత్యావసరాలన్నింటికీ విస్తరించి ధరల భారాన్ని ప్రజల మీద మోపారు. ప్రత్యక్ష పన్నులకంటే అధికంగా పరోక్ష పన్నులను పేదలు, సామాన్యుల నుండి దండుకుంటున్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ దెబ్బకు చిన్న చిన్న పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. దేశంలో ఏనాడూ లేనంత నిరుద్యోగం పెరిగింది. రైతుల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు లాభసాటి మద్దతు ధరను ప్రకటించకుండా రైతాంగం అప్పుల ఊబిలో పడింది. పేదలకు ఇవ్వాల్సిన ఉపశమన సంక్షేమ పథకాలు పెరగక పోగా తరిగిపోతున్నాయి. విద్య, వైద్యం కార్పొరేట్ పరం కావడంతో చాలా మంది పేదరికంలోకి దిగ జారిపోతున్నారు. ఇదీ పదేళ్ల మోదీ పాలన సంగ్రహ చిత్రం.

దేశంలో ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక పాలనా విధానాల వైరుధ్యాన్ని ఇది స్పష్టం

చేస్తున్నది. ఒక పక్క దేశ సంపదను కార్పొరేట్లు స్వంతం చేసుకుంటూ పోతున్నారు. మరో పక్క రైతులు, సామాన్యులు, పేదలు కార్పొరేట్ల అనుకూల పాలనలో నలిగి పోతున్నారు. పది శాతంగా వున్న కార్పొరేట్ల దోపిడీకి– దాని పర్యవసానంగా నలిగి పోతున్న 75 శాతం దేశ ప్రజలకీ మధ్య నెలకొన్న వైరుధ్యమే ప్రస్తుత ప్రధాన వైరుధ్యం లేదా ప్రస్తుత కీలక సమస్య అయింది. పోగుపడ్డ కార్పొరేట్ సంపదకు వ్యతిరేకంగా అత్యధిక ప్రజానీకపు జీవితాలను మార్చే సంక్షేమ సమాజాన్ని సాధించడమే ప్రత్యామ్నాయ రాజకీయానికి కీలక లక్ష్యం అవుతుంది.

### 3.ప్రత్యామ్నాయ రాజకీయం

రాజకీయ ప్రత్యామ్నాయం వేరు. ప్రత్యామ్నాయ రాజకీయం వేరు. ఈ రెండూ భిన్నమైనవి. రాజకీయ ప్రత్యామ్నాయం ఒక తాత్కాలిక రాజకీయ సంఘటన మాత్రమే. పాలకపక్షాన్ని గద్దె దించే పరిమిత లక్ష్యం కలది మాత్రమే. ప్రత్యామ్నాయ రాజకీయం పాలక పక్ష రాజకీయానికి వ్యతిరేకమైంది. పరిమితంగానైనా వ్యవస్థను మార్చడం ద్వారా శ్రమ జీవులకు అత్యధిక ప్రజానీకానికి స్వతంత్ర జనజీవనాన్ని కల్పించే దారులు వేసే లక్ష్యం కలది. పైగా అది ప్రస్తుత బడ్జెట్ల పరిధిలో అరకొర సర్దుబాట్ల చుట్టూ తిరిగే రాజకీయం కాదు. దానికి భిన్నంగా కొన్ని వ్యవస్థాగత మార్పులను సాధించడం ద్వారా ప్రజల నిత్యజీవన సమస్యలకు మరింత మెరుగైన పరిష్కారాలను సాధించే ఉద్యమం. వ్యవస్థాగత మార్పులను సాధించడం కోసం అధికార మార్పిడి లక్ష్యంగా వుంటుంది. ప్రత్యామ్నాయ రాజకీయం ఒక కొత్త రాజకీయం. ప్రస్తుత పాలకపక్ష రాజకీయం ప్రజలను 'లబ్ధిదారులను' చేసింది. ప్రత్యామ్నాయ రాజకీయం వారిని 'హక్కు దారులను' చేస్తుంది. ఇలా వారి జీవితాలను మార్చే కొత్త ఆకాంక్షలను ప్రజలకు అందిస్తుంది. ఒక ఉమ్మడి ఆకాంక్ష వైపు నడిపిస్తుంది.

### 4 ఒకే నినాదం - అనేక సమస్యలకు పరిష్కారం

ప్రత్యామ్నాయ రాజకీయం ప్రధాన వైరుధ్యాన్ని పరిష్కరించగల ఒక నినాదాన్ని రూపొందించుకోవాలి. ఒకే నినాదం చుట్టూ అనేక ప్రజా సంక్షేమ అంశాలను, పరిష్కారాలను జత చేసుకోవాలి. దానికే కార్పొరేట్లు దోపిడీ చేస్తున్న దేశ ప్రజలందరికీ చెందిన ప్రకృతి వనరుల పై ప్రభుత్వ ఆధిపత్యంతోపాటు కార్పొరేట్ల లాభాలను కట్టడి చేసే పన్నుల ద్వారా రాష్ట్రాలకు వాటాలను, స్థానిక ప్రజలకు, దేశ

ప్రజల సంక్షేమానికి తగిన మొత్తాల కేటాయింపును ముడి వెయ్యాలి. (సహజ వాయువు, ఆయిల్ నిక్షేపాలు, గనులు, ఖనిజాల దోపిడీలు)

కేవలం మోదీ హఠావో నినాదం సరిపోదు. మోదీని గద్దె దించితే తమకు జరిగే ప్రత్యక్ష ప్రయోజనాన్ని ప్రజలకు చూపించగల నినాదం కావాలి. నినాదం ఎంత మంచిదైనా అది తనంతట తాను ప్రజా ఉద్యమ రూపం తీసుకోదు. ఆ నినాదం ప్రజల ఉమ్మడి ఆకాంక్షగా మారినప్పుడే ప్రజా ఉద్యమ రూపం ధరిస్తుంది. ఉదాహరణకు 'కార్పొరేట్లను కట్టడి చేస్తాం–పోగు పడ్డ సంపద పునఃపపిణీ చేస్తాం' అన్న నినాదం తీసుకుందాం. ఈ నినాదం అత్యధిక ప్రజలకు ఆకర్షణీయంగా, ఆమోదయోగ్యంగా వున్నప్పటికీ అది ప్రజా ఉద్యమరూపం ధరించడానికి అవసరమైన ఒక అంశం మాత్రమే. సంపద పునఃపంపిణీ ఆచరణ సాధ్యమేనని ప్రజలు విశ్వసించాలి. దీనిని కల్పించడం అన్నది రెండవ అంశం. దీనికి తగిన ప్రచారం జరగాలి. కార్పొరేట్ల మీద నాలుగు పన్నులు విధించడం ద్వారా పునః పంపిణీకి అదనపు నిధులను సులభంగా ఎలా సాధించ వచ్చునో వివరించగలగాలి.

మొదటిది ప్రస్తుతం 22 శాతంగా వున్న కార్పొరేట్ పన్నును మరికొంత పెంచడం. రెండవది 10 శాతం మంది పోగుపడ్డ సంపదపై పన్నును వృద్ధి క్రమానుగతంగా విధించడం, మూడవది ప్రస్తుతం వున్న కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పన్నును వృద్ధిక్రమానుగతంగా విధించి దానిని జాతీయ సంక్షేమ నిధిగా మార్చడం. నాలుగవది తొలగించిన వారసత్వ పన్ను స్థానంలో తిరిగి ప్రపంచ దేశాల స్థాయిలో విధించడంపైన సూచించిన నాలుగు పన్నులో 1 శాతం మంది దగ్గర పోగుపడ్డ సంపద మీద కనీసం 2 శాతం సంపద పన్ను విధిస్తే 8 లక్షల కోట్లు వస్తాయని, మూడో వంతు వారసత్వ పన్ను విధిస్తే 6.67 లక్షల కోట్లు వస్తాయని ప్రముఖ ఆర్థిక తత్వవేత్త ప్రభాత్ పట్నాయక్ లెక్క తేల్చారు. పైన పేర్కొన్న నాలుగు పన్నులనూ దేశంలో 10 శాతం కుబేరుల మీద వృద్ధి క్రమానుగతంగా విధిస్తే 20 లక్షల కోట్లకు మించిన అదనపు నిధులు సమకూరతాయి. అయినా ఇలా పునఃపంపిణీకి పన్నుల ద్వారా తీసుకునే సొమ్ము కుబేరుల సంపదలో అతి చిన్న భాగంగానే వుంటుంది.

ఈ రెండు అంశాలు ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమానికి తప్పనిసరి అవసరాలు. అది ప్రజా ఉద్యమంగా విస్తరించాలంటే మూడవ అంశం చాలా ముఖ్యమైంది 'సంపద పునః పంపిణీ' నినాదం ప్రజలకి స్వతంత్ర జీవనాన్ని ఎలా కల్పిస్తుందో వారికి స్పష్టంగా తెలియజేసే ఎజెండాను ప్రకటించాలి. అందులో సంపద పునః పంపిణీ ద్వారా హక్కుగా పొందే సంక్షేమం, సాధించగల స్వతంత్ర

జీవనం వగైరా అంశాలను స్పష్టపరచాలి.

బడ్జెట్ నిధులతోపాటు సంపద పునఃపంపిణీ అదనపు నిధులతో శ్రమజీవులకు పేదల కుటుంబాలకు స్వతంత్ర జీవనాన్ని ఇచ్చే మౌలిక ఆదాయాన్ని కల్పించడం – అందరికీ ఉచితంగా మంచి ప్రమాణాల విద్య, వైద్య సేవలు, ఆహార భద్రత, నివాస వసతులను హక్కు గా కల్పించడం. కులపరమైన లింగ పరమైన మతపరమైన వివక్ష ను తొలగించడానికి ప్రత్యేక నిధుల కేటాయింపు. స్వామినాథన్ కమిషన్ సూచన మేరకు చట్టబద్ధంగా వ్యవసాయ పంటలన్నింటికీ లాభసాటి ధరలుఅందించడం. పంటల వారీగా రైతులే నిర్వహించుకునే ప్రత్యామ్నాయ మార్కెట్లకు నిధులు. ప్రకృతి విపత్తుల నుండి రక్షణ కల్పించే ప్రత్యేక నిధులు. నిరుద్యోగులకు అర్హతకు తగిన ఉపాధి కల్పనకు ప్రభుత్వ పెట్టుబడులను పెంచడం. వృద్ధులకు వేతన జీవులకు ఆదాయ పన్ను మినహాయింపు గణనీయంగా పెంచడం వగైరాలు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇతర సమాజ సంక్షేమ కార్యక్రమాలను జత చేసుకోవచ్చును.

### 5 ఫాసిజమా? లేక ప్రత్యామ్నాయ రాజకీయమా?

పాలనా సంక్షోభ కాలం సుదీర్ఘ కాలం వుండదు. ప్రధాన వైరుధ్య పరిష్కారానికి ఏదో ఒక మార్గాన్ని ఎంచుకుంటుంది. కార్పొరేట్ల పెత్తనం కొనసాగించడానికి పాలకపక్షం మెజారిటీ మతవాద నినాదాన్ని జత కలిపి దమనకాండతో సాగించే ఫాసిస్టు మూకల పాలన రూపం ధరిస్తుంది లేదా ప్రత్యామ్నాయ రాజకీయం ఒక ఉద్యమంగా విస్తరించి ప్రజా సంక్షేమ రాజ్యాన్ని సాధిస్తుంది.

# శ్రమ జీవుల ప్రజా రిపబ్లిక్ ఉద్యమం

1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చింది. దేశం రిపబ్లిక్‌గా అవతరించింది. నాటి నుండి ప్రభుత్వపరంగా రిపబ్లిక్ దినోత్సవాలు జరుగుతున్నాయి. అవి ప్రభుత్వ శాఖలు, సంస్థలకే పరిమితమై, ప్రజల భాగస్వామ్యం లేకుండా సాగిపోతున్నాయి. రాజ్యాంగం మనందరిదీ. మనకు మనమే సమర్పించుకున్న రాజ్యాంగం. ఈ రాజ్యాంగానికి మనమే యజమానులం. దేశంలో అత్యధిక సంఖ్యాకులు శ్రమజీవులు. పరిశ్రమలలో కార్మికులుగా, అసంఘటిత రంగ శ్రామికులుగా, వృత్తి సంఘాల సభ్యులుగా, వ్యవసాయ కూలీలుగా, కౌలు రైతులుగా, స్వయంగా సాగు చేస్తున్న రైతులుగా పలు రంగాల్లో వున్నారు. అలాగే వివిధ రంగాల్లో సమాజానికి సేవలు అందిస్తున్న వారు వున్నారు. దేశ సంపద ఉత్పత్తిలో ఈ శ్రమజీవులే కీలక పాత్ర పోషిస్తున్నారు. దేశంలో అన్ని రంగాలకు శిరోధార్యంగా వున్న రాజ్యాంగ కార్యకలాపాల్లో ప్రజల భాగస్వామ్యం వుండితీరాలి. అలాంటి భాగస్వామ్యాన్ని మనకు మనమే కల్పించుకోవాలి. ప్రజా రిపబ్లిక్ దినోత్సవం మన కోసం మనమే నిర్వహించుకోవాలి.

ఆర్థిక రంగంలో సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్న సకల రంగాల శ్రమ జీవులు రాజకీయ రంగంలో కేవలం ఓటర్లుగానే మిగిలిపోకూడదు. రాజ్యాంగం మీద రాజకీయంగా జరుగుతున్న దాడిని రాజకీయంగా ప్రతిఘటించడానికి సిద్ధపడాలి. కేంద్రంలో అధికారంలో వున్న మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని




**తణుకులో ప్రజా రిపబ్లిక్ సభ**

బలహీనపరిచి, దానిని మార్చడానికి అడుగులు వేస్తున్నది. మోదీ ఎలాంటి దాపరికం లేకుండా తనకు తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. మెజారిటీ జాతీయవాదానికి వీలుగా పౌరసత్వ చట్టాలను తెచ్చారు. మత విద్వేష రాజకీయాలు చేస్తున్నారు.

బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ బహిరంగంగానే రాజ్యాంగాన్ని సవాలు చేస్తున్నది. హిందూ రాష్ట్ర నినాదం త్వరలోనే సాకారం కానున్నదని ప్రకటించింది. భారత రాజ్యాంగం పట్ల ఆర్ఎస్ఎస్ వైఖరి అందరికీ తెలిసిందే. రాజ్యాంగం ఆమోదించి నప్పుడే వారు వ్యతిరేకించారు. ఇది అతుకుల బొంత రాజ్యాంగం అన్నారు. దీనిలో జాతీయత లేదన్నారు. అంతటితో సరిపెట్టుకో లేదు. ప్రపంచ ప్రశంసలు పొందిన మనుధర్మ శాస్త్రమే దేశానికి తగిన రాజ్యాంగం అని ప్రకటించారు.

ఇప్పుడు జరుగుతున్నది రాజ్యాంగానికి, ఆర్ఎస్ఎస్ హిందూ రాష్ట్ర నినాదానికి మధ్య సంఘర్షణ. రాజ్యాంగాన్ని మట్టు పెట్టాలనే ఈ సంఘర్షణలో శ్రమజీవులు పాత్రధారులు కావాలి. ఆర్ఎస్ఎస్ హిందూ రాష్ట్ర నినాదం దేశాన్ని మత రాజ్యంగా మారుస్తుంది. మత రాజ్యాలలో రాజ్యాంగాలు వుండవు. మత గ్రంథాలే రాజ్యాంగం పాత్ర నిర్వహిస్తాయి. హిందూ రాష్ట్రలో మనుధర్మ శాస్త్రం రాజ్యాంగం అవుతుంది. శ్రమజీవులు పని విభజన అర్హతను బట్టి కాకుండా కులాలనుబట్టి నిర్ణయమౌతుంది. హిందూ రాష్ట్రలో శ్రమజీవులు శాశ్వతంగా కట్టు బానిసలౌతారు. కుల విభజన శ్రమజీవుల ఐక్యతకు భంగం కలిగిస్తుంది.

మత రాజ్యాలలో ప్రజాస్వామ్యం వుండదు. పౌర హక్కులు వాటికి చట్టబద్ధత వుండదు. శిక్షలు తప్పును బట్టి కాకుండా కులాల ఆధారంగా వుంటాయి. మత రాజ్యాలలో ఓటు హక్కు, ఎన్నికలు వుండవు. నియంతలే వుంటారు. ప్రస్తుతం ఓటు హక్కు వున్నందునే వివిధ పథకాలు పేరుతో రాజకీయం శ్రమ జీవులను పట్టించుకోక తప్పడం లేదు. ప్రభుత్వాలను మార్చే శక్తి మన ఓటులో వుంది. మత రాజ్యాలలో వివక్ష వుంటుంది. మైనారిటీ మతస్థులు సమాన హక్కులు లేని రెండవ తరగతి పౌరులౌతారు. మహిళలు, దళితులు, బహుజనుల పట్ల వివక్ష కొనసాగుతుంది. అందువల్ల శ్రమజీవులు సమైక్యంగా రాజ్యాంగ రక్షణకు పూనుకోవాలి. హిందూ రాష్ట్ర నినాదాన్ని రాజకీయంగా ఎదుర్కొనాలి. ఆర్ఎస్ఎస్ హిందూ రాష్ట్ర నినాదం దాడి నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ఎంత అవసరమో రాజ్యాంగ ఫలాలను దక్కించుకోడానికి తగిన విధంగా దానిని అమలు చేయించడానికి ఉద్యమించడమూ అంతే అవసరం. ఈ ఉద్యమానికి కూడా ప్రజా రిపబ్లిక్ దినోత్సవం వేదిక కావాలి. రాజ్యాంగం పీఠిక ప్రజలందరికీ సామాజిక,

ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించాలని ప్రకటించింది. కాని సామాజిక రంగంలో కుల వివక్ష, మహిళల పట్ల వివక్ష, మైనారిటీల పట్ల వివక్ష నేటికీ కొనసాగుతున్నది. అమానుషమైన దాడులు, అత్యాచారాలు, హత్యాకాండ సాగిపోతున్నది. వివక్ష వున్నచోట సమానత్వం వుండదు. ప్రజాస్వామ్య విలువలు వుండవు. సమాన అవకాశాలు వుండవు.


శ్రమజీవులు వివక్షకు తావులేని ప్రజా రిపబ్లికన్ సాధించుకోవాలి. రాజ్యాంగం అందరికీ ఆర్థిక న్యాయం జరగాలని ప్రకటించింది. దీనికి సమాజంలో అంతరాలు తగ్గాలి. అందరికీ అవకాశాలు లభించాలి. కాని గత 10 సంవత్సరాలలో అంతరాలు విపరీతంగా పెరిగాయి. 1 శాతం మంది కార్పొరేట్లు, బిలియనీర్ల దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడింది. 10 శాతం మంది దగ్గర 78 శాతం దేశ సంపద గుట్ట పడింది. ఈ కార్పొరేట్లకే కేంద్ర ప్రభుత్వం 20 లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు, రుణమాఫీలు ఇచ్చింది. 60 శాతంగా వున్న సామాన్యులు, పేదల దగ్గర కేవలం 5 శాతం సంపద మాత్రమే వుంది. అత్యధిక ఆర్థిక అంతరాలున్న దేశాల్లో మన దేశం అగ్రస్థానంలో వుంది. దేశ ప్రజలకు ఆర్థిక న్యాయం అన్నది అర్థరహితంగా మారింది. సకల తరగతుల శ్రామికులు కేవలం నెల జీతగాళ్ళు, రోజు వారీ కూలీలు మాత్రమే కాదు. వీరే సరుకులను, సంపదను, సేవలను సృష్టిస్తున్నారు. ఈ సంపదలో తగిన వాటా వారికి దక్కడం లేదు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం దేశ సంపద, సహజ వనరులు ప్రజలందరికీ చెందాలి. దీనికి విరుద్ధంగా మోదీ ప్రభుత్వం అడవులను, గనులను, సముద్ర తీరాలను తన కార్పొరేట్ మిత్రులకు ధారాదత్తం చేసింది. వాటి నుండి కోట్లాది సంపదను ప్రైవేటు వ్యక్తులు సొంతం చేసుకుంటున్నారు.

మరో ఆదేశిక సూత్రం ప్రకారం సంపద కొద్ది మంది దగ్గర పోగుపడకూడదు. కాని పోగు పడింది. దానిని వికేంద్రీకరించాలి. ఈ సంపదలలో తగిన వాటా శ్రమ జీవులకు దక్కాలి. కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపదను పునఃపంపిణీ చెయ్యాలి. కార్పొరేట్ పన్ను పెంచడం, వారసత్వ పన్ను, సంపద పన్ను విధించడం ద్వారా దాదాపు 20 లక్షల కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరుతుందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ అదనపు నిధులతో జాతీయ సంక్షేమ నిధిని ఏర్పాటు చెయ్యాలి. ఈ సొమ్ముతో శ్రమ జీవులందరికీ హక్కుగా నివాసం, ఆహార భద్రత, విద్య-వైద్య సదుపాయాలు, కనీస మౌలిక ఆదాయం కల్పించాలి. ఈ నిధుల నుండి రైతుల పంటలకు లాభసాటి ధరలు, నిరుద్యోగానికి శాశ్వత పరిష్కారాలు సాధించాలి. ఆదేశిక సూత్రాలలో కార్మికులకు పరిశ్రమల

యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించాలని సూచిస్తే దానికి విరుద్ధంగా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను ఈ ప్రభుత్వం తెచ్చింది. కార్మికులకు హేతుబద్ధమైన పని గంటలు వుండాలని ఆదేశిక సూత్రాలు ఘోషిస్తుంటే ఈ ప్రభుత్వం 12-16 గంటల పనిదినానికి జెండా ఊపింది. ఈ తరహా రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైన ప్రతి చర్యను శ్రమజీవులు ప్రతిఘటించాలి. ప్రజా రిపబ్లిక్ అన్నది శ్రమజీవుల రాజకీయ నినాదం. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల రాజకీయాలను, భావజాలాలను ఓడించడం ఒక లక్ష్యం. కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపద పునఃపంపిణీ ద్వారా శ్రమ జీవులందరికీ గౌరవప్రదమైన స్వతంత్ర జీవనాన్ని సాధించడం మరో లక్ష్యం. దోపిడీ, వివక్షలు లేని సమాజాన్ని సాకారం చేసుకునే అంతిమ లక్ష్యానికి సాగిపోవాలి. పలు రంగాలలో చీలిపోయిన శ్రమజీవులు, వివక్ష తరగతుల సమూహాలు ఒక్కటైతే అది ప్రజా ఉద్యమం అవుతుంది, ఉప్పెనగా మారుతుంది. అసాధ్యాలను సుసాధ్యం చేస్తుంది.

# రాజ్యాంగంలో హక్కుదారులు రాజకీయంలో లబ్ధిదారులు

నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం. 1949లో రాజ్యాంగానికి తుది రూపం ఇచ్చి ఆమోదించిన రోజు. ప్రభుత్వ సంస్థలు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. అందులో ప్రజలకి ప్రత్యేకించి పేదలకి ఎలాంటి భాగస్వామ్యం ఉండదు. అవి ఒక తంతుగానే మిగిలిపోతున్నాయి. అందువల్ల రాజ్యాంగ దినోత్సవాన్ని పౌర సంఘాలు ప్రజల భాగస్వామ్యంతో ప్రజా సంఘాలు సమన్వయంతో అర్థవంతంగా నిర్వహించడం తప్పనిసరి అవసరం. రాజ్యాంగం మన దేశ ప్రజలదని రాజ్యాంగ పీఠిక స్పష్టం చేస్తున్నది. 'భారత ప్రజలమైన మేము' అన్న వ్యాక్యంతో ప్రారంభమై ఈ రాజ్యాంగాన్ని 'మనకు మనమే సమర్పించుకుంటున్నాము' అన్న వాక్యంతో ముగుస్తుంది. ఈ రాజ్యాంగానికి దేశ ప్రజలే హక్కు దారులు. దానిని అమలు జరిపించుకోవాల్సిందీ, రక్షించుకోవాల్సిందీ ప్రజలే.




రాజ్యాంగ సారాన్ని పీఠిక మనకు సంక్షిప్త రూపంలో అందించింది. అందుకే దానిని రాజ్యాంగానికి ఆత్మ అన్నారు. ఈ దేశాన్ని ఏ పునాదుల మీద నిర్మించాలన్న అంశంతో ప్రారంభం అవుతుంది. సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాతంత్ర రిపబ్లిక్‌గా నిర్మించాలని ప్రకటిస్తుంది. ఈ లక్ష్యాలకు విరుద్ధంగా దేశాన్ని నడిపించాలనే భావనలు రాజ్యాంగ విరుద్ధం. హిందూ రాష్ట్ర నినాదం అలాంటిదే. పీఠిక నుండి లౌకిక, సామ్యవాద పదాలను తొలగిస్తామనడం, రాజ్యాంగానికి సవరణలే కాకుండా రాజ్యాంగాన్ని మారుస్తాం అనడం అలాంటివే. ఇలాంటి భావజాలాన్ని ప్రజలు తిరస్కరించాలి. తిప్పికొట్టాలి.

రాజ్యాంగ పీఠిక ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం కల్పించే హామీని ఇచ్చింది. భావ ప్రకటన, మత స్వేచ్ఛ అందరికీ ఉంటుందని, అందరికీ

సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టం చేసింది. అలాగే కుల, మత, భాషా, ప్రాంతీయపరమైన భిన్నత్వం గల దేశంలో ప్రజలు విద్వేషానికి లోనుకాకుండా సోదర భావాన్ని పెంపొందించుకుని దేశ సమైక్యతను కాపాడుకోవాలని సూచించింది. ఇప్పటికీ దేశంలో సామాజిక పరంగా కులపరమైన, లింగపరమైన, వివక్షలు కొనసాగుతున్నాయి. ఆర్థిక న్యాయం జరగకపోగా అంతరాలు పెరుగుతున్నాయి. రాజకీయ రంగంలో సామాన్యులకు స్థానం లేకుండా పోయింది. అది కుబేరుల ఆటగా మారింది. ఈ అంశాలను రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలలో చర్చించాలి.

రాజ్యాంగంలో ప్రజలు పాటించాల్సిన విధులు వున్నాయి. రాజ్యాంగాన్ని, జాతీయ గీతాన్ని, జెండాను గౌరవించాలని, కుల, మత, లింగ వర్ణ భేదాలు లేకుండా అందరినీ గౌరించాలని, దేశంలోని మిశ్రమ సంస్కృతిని, వారసత్వాన్ని కాపాడుకోవాలని శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్న పలు అంశాలను ప్రజల విధులుగా పేర్కొంది. ఇవి స్వచ్ఛంద విధులు. వీటిని పాటించాలనే చైతన్యాన్ని ప్రజలకు కల్పించాలి. అలాగే ప్రభుత్వాలు అనుసరించాల్సిన కర్తవ్యాలను రాజ్యాంగం ఆదేశిక సూత్రాలుగా ప్రకటించింది. ప్రభుత్వం ప్రజలందరికీ ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం కల్పించాలని, దేశ సంపద, సహజ వనరులు ఏ ఒకరిద్దరి వద్ద కేంద్రీకృతం కాకూడదని దానిని వికేంద్రీకరించాలని, కార్మికులకు యాజమాన్యంలో భాగం కల్పించాలని, మద్య నిషేధానికి అడుగులు వెయ్యాలని, పిల్లలకు నిర్బంధ ప్రాథమిక విద్య అందించాలని మార్గదర్శనం చేసింది. ఇవి ప్రభుత్వాలు చేపట్టాల్సిన విధులు.

వీటిని ప్రభుత్వాలు పాటించకపోగా ఆదేశిక సూత్రాలకు విరుద్ధంగా ప్రజలందరికీ చెందాల్సిన సహజ సంపదలు ప్రకృతి వనరులు ప్రైవేటు వ్యక్తుల పరం చేస్తున్నారు. పోగుపడ్డ సంపదను వికేంద్రీకరించాలన్న ఆదేశిక సూత్రాల ప్రకటనకు విరుద్ధంగా దేశంలో ఇప్పుడు ఒక శాతం మంది దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడింది. దానిని ప్రజలకు చెందేలా వికేంద్రీకరించాలి. అప్పుడే దేశ ప్రజలకు ఆర్థిక న్యాయం అందుతుంది. మద్య నిషేధం వైపు అడుగులు వేయాలని సూచిస్తే దేశంలో మద్యం పెద్ద వ్యాపారంగా మారింది. ప్రభుత్వాలు ఈ మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చేసుకున్నాయి.

రాజ్యాంగమే దేశ పౌరులకు ఓటు హక్కునిచ్చింది. ప్రతి ఐదేళ్లకు పాలకుల్ని ఎన్నుకునే ప్రజాస్వామ్యాన్ని ఇచ్చింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానుల

య్యారు. వారి ఓటుతోనే ప్రభుత్వాలు ఏర్పడతాయి. ప్రజల పన్నులతోనే ప్రభుత్వాలు, పాలనా యంత్రాంగం నడుస్తుంది. ఆ సొమ్ముతోనే సంక్షేమం, అభివృద్ధి కార్యకలాపాలు సాగుతాయి. సంక్షేమం, అభివృద్ధి ప్రజల హక్కు. పాలకుల దయాదాక్షిణ్యాల మీద సంక్రమించేవి కావు.

రాజ్యాంగం ప్రజలందరికీ అత్యంత కీలకమైన ప్రాథమిక హక్కులను కల్పించింది. ప్రజలందరికీ భావ ప్రకటనా స్వేచ్ఛనీ, ఆరాధనా స్వేచ్ఛనీ, సమానత్వం, సమాన అవకాశాలు పొందే హక్కును ప్రసాదించింది. భావ ప్రకటనా స్వేచ్ఛలో పత్రికా స్వేచ్ఛ అంతర్భాగంగా వుంది. అలాగే జీవించే హక్కు కేవలం ప్రాణ రక్షణ హక్కు మాత్రమే కాదు. అందులో గౌరవప్రదమైన స్వతంత్ర జీవనం గడిపే హక్కు ఇమిడి వుంది. గౌరవప్రదంగా జీవించడం అంటే నివాస వసతి, కనీస ఆదాయం, విద్య వైద్య సేవలను పొందడం వంటివి అని సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టం చేస్తున్నాయి. ఇవి ప్రజలు హక్కుగా పొందాల్సిన అంశాలు.

మొత్తం మీద ఈ రాజ్యాంగంలో ప్రజలే హక్కుదారులు పాలకులు కాదు. దేశ సహజ వనరుల మీద, పోగుపడ్డ సంపద మీద ప్రజలు హక్కుదారులు, గౌరవ ప్రదమైన స్వతంత్ర జీవనాన్ని పొందే హక్కుదారులు. అందువల్ల ఈ రాజ్యాంగ దినోత్సవాన్ని హక్కుదారుల ఉత్సవంగా నిర్వహించుకోవాలి.

మన రాజకీయం రాజ్యాంగ ఆదేశాలకు విరుద్ధంగా నడుస్తున్నది. వక్ర మార్గాలను అనుసరిస్తున్నది. ప్రజలు యజమానులన్న భావన దానికి లేదు. ప్రజా ప్రతినిధులు ప్రజా సేవలకులు అన్న ధ్యాస కనపడదు. పాలకులదే అధికారం అన్నట్లు పెత్తనం చేస్తున్నారు .ప్రజల సొమ్ముతో ప్రజలు ఇచ్చిన అధికారాన్ని తిరిగి ప్రజలకు స్వతంత్ర జీవనానికి, సంక్షేమానికి, అభివృద్ధికి వినియోగించే పవిత్ర కర్తవ్యంగా రాజకీయం లేదు. ప్రస్తుత రాజకీయానికి అధికారమే ఏకైక లక్ష్యం. దానికి ప్రజల ఓట్లు అవసరం. ప్రజలను ప్రలోభపెట్టి ఓట్లు దండుకునే పద్ధతిని పాటిస్తున్నారు. ప్రజలను లోబర్చుకోవడానికి డబ్బు సంచులను వినియోగిస్తున్నారు. 'ప్రజల సొమ్ముతో' వివిధ పథకాలను ప్రకటిస్తూ ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు. ఓట్లు కోసం కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడానికి వారు వెనకాడడం లేదు.

పాలకపక్ష నేతలకు రాజకీయం ఒక వ్యాపారం. గెలుపు కోసం కోట్లు గుమ్మరిస్తున్నారు. అధికారం చేపట్టాక అంతకు పది రెట్లు కూడబెట్టుకుంటున్నారు. ఈ రాజకీయ వ్యాపారంలో ప్రజలు కేవలం ఓటర్లు మాత్రమే. వారికి సంక్షేమం

పేరుతో తమ 'స్వంత డబ్బు' ఖర్చు పెడుతున్నట్లు రకరకాల పథకాలను ఉచితాలను ప్రకటిస్తూ హక్కుదారులైన ఓటర్లను లబ్ధిదారులుగా ఈ రాజకీయం దిగజార్చింది. అర చేతిలో స్వర్గాన్ని చూపించే ఈ పథకాలు ప్రజలను ఎదుగు బొదుగు లేని త్రిశంకు స్వర్గంలో వుంచుతున్నాయి. పేదరికం తొలగిపోవడం లేదు. రైతులు అప్పుల భారం తరగడం లేదు. యువతకు ఉద్యోగాల ప్రాప్తి కలగడం లేదు. ప్రజలు కేవలం ఓటర్లుగా, లబ్ధిదారులుగా మిగిలిపోతున్నారు.

ఇల్లు, ఉపాధి, విద్య, వైద్య సౌకర్యాలు కనీస ఆదాయం, రైతులకు లాభసాటి ధరలు ప్రజలకు హక్కుగా దక్కాలి. సంక్షేమం, ప్రజలకు స్వతంత్ర జీవనం ఇచ్చేదిగా విస్తరించాలి. అందుకు ప్రభుత్వాలు ఆదేశిక సూత్రాలను అనుసరించి పాలన సాగించాలి. ప్రకృతి వనరులు, సహజ సంపదలను ప్రజల పరం చేయాలి. పోగుపడ్డ సంపదను వివిధ పన్నుల ద్వారా ప్రజలకు పున: పంపిణీ చేయాలి. ఇది జరగాలంటే ప్రస్తుత రాజకీయం మారాలి. హక్కుదారులం అన్న చైతన్యం ప్రజలకు కలిగితే రాజకీయం మారుతుంది. లబ్ధిదారులుగా మార్చబడ్డ వారంతా తిరిగి హక్కుదారులవుతారు. ప్రజలు హక్కుదారులు అన్న చైతన్యాన్ని నింపే కార్యకలాపాలతో రాజ్యాంగ దినోత్సవాన్ని పౌరసంస్థలు అర్థవంతంగా నిర్వహించాలి.

# పవన్ ప్రస్థానం : సినీ హీరో టు పొలిటికల్ విలన్

పవన్‌కల్యాణ్ సినిమాలలో అనేక హీరో పాత్రలు పోషించారు. రాజకీయాలలోనూ ఆయన బహుపాత్రధారి కావడం ఆశ్చర్యాన్ని కలిగించదు. రాజకీయ ఆరంగేట్రం చేసినప్పుడు 'చే గువేరా' బొమ్మతో అలరించారు. తర్వాత భగత్‌సింగ్ తన ఆదర్శంగా ప్రకటించారు. ఇప్పుడు తాజాగా 'సనాతన ధర్మం హీరో' పాత్రధారణ చేస్తున్నారు. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యితో అపవిత్రమైన ప్రసాదం అంశంపై పవన్ పాపపరిహార దీక్షతో ఇది ప్రారంభమౌతుంది. పూజలు, ప్రాయశ్చిత్తాలు, దుర్గ గుడి మెట్ల కడుగుడు ఘట్టాలు పూర్తయ్యాయి. నడక మార్గంలో తిరుమల మెట్ల అధిరోహణం చేసి దైవ దర్శనం అనంతరం తిరుపతి వారాహి సభలో సనాతన ధర్మంపై తన ట్రయిలర్‌ను రిలీజ్ చేశారు. ఇక ఇంటర్‌వెల్ తర్వాత



కథ ఎన్ని మలు పులు తిరిగి క్లైమాక్స్‌కు చేరుకుంటుందో మనం ఊహించుకోవాల్సిందే. పవన్‌కు ఇదొక్కటే పనికాదు. యథావిధిగా ఆయన చేయాల్సిన ఇతర సినిమాల షూటింగులు వున్నాయి. ఉప ముఖ్య మంత్రిగానే కాకుండా నిర్వహిచాల్సిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి వంటి కీలక శాఖలను నిర్వహించే బాధ్యతలు వున్నాయి.

వారాహి సభ ప్రసంగాన్ని చూస్తే ఈ బాధ్యతలకు ఇచ్చే కాల్‌షీట్స్ కంటే సనాతన ధర్మానికి ఎక్కువ ఇచ్చేలా కనిపిస్తుంది. సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదని ఈ సభలో ప్రకటిస్తూ అలాంటి వారికి సహాయ నిరాకరణ చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో సనాతన పరిరక్షణకు చట్టం తేవాలని సనాతన ధర్మాన్ని కించపరిచే వారిపై చర్యలు తీసుకునే విధంగా దానిని రూపొందించాలని వారాహి డిక్లరేషన్ లో కోరారు. తన సనాతన ధర్మం అన్ని మతాలను గౌరవిస్తుందనే పైపై డైలాగులు తప్పిస్తే నిర్దిష్టంగా సనాతన ధర్మం ఏమిటన్న స్పష్టత ఇవ్వలేదు.

ఆయన సనాతన ధర్మాన్ని వేద ప్రమాణంగా భావించి వుంటే రుగ్వేదంలోని పురుష సూక్తం వుంది. మనుషుల పుట్టుకలోనే వున్న వివక్షను అది నొక్కి చెప్పింది.

‘ఆ పురుషుని నోటి నుండి బ్రాహ్మణులు, చేతుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు జన్మించార’ని పేర్కొంది. పవన్ సనాతన ధర్మం వేద ప్రమాణమే అయితే పుట్టుకతో వివక్షను సమర్థించడమే అవుతుంది.

సనాతన ధర్మానికి ప్రాణప్రదమైన ‘మనుస్మృతి’ కుల వ్యవస్థను, కులాల చట్రంలో వృత్తులను నిర్దేశించింది. స్త్రీలకు స్వాతంత్ర్యాన్ని నిరాకరించింది. శూద్రులందరికీ చదువును నిరాకరించింది. ఇలాంటి సనాతన ధర్మాన్నే పవన్ కోరుకుంటున్నారా ? అలాగే భగవద్గీత మరో సనాతన ధర్మాన్ని ప్రబోధించే గ్రంథమే. అందులో నాలుగు వర్ణాలను నేనే సృష్టించానని శ్రీ కృష్ణ పరమాత్మ ప్రకటించడాన్ని సనాతన ధర్మంగానే పవన్ భావిస్తున్నారా ? వీటిని నిరాకరిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటిస్తే అది ‘సనాతన ధర్మం’ కాకుండాపోతుంది. సనాతన ధర్మాన్ని 21 సంవత్సరాల వయస్సు నుండి పాటిస్తున్నానని పవన్ చేసిన ప్రకటన సినిమాలో హీరోలు చేసే నకిలీ స్టంటు గానే మిగిలిపోతుంది.

పవన్ కల్యాణ్ తన దీక్ష సందర్భంగా కాషాయవస్త్రం ధరించారు. ఇది సనాతన ధర్మమానికి చెందిన రంగు కాదు. బౌద్ధుల నుంచి హిందూ మతాచార్యులు కాషాయాన్ని తస్కరించారు. వాస్తవానికి బౌద్ధం సనాతన ధర్మం మీద తిరుగుబాటు చేసింది. తిరుగుబాటుదారుల కాషాయ రంగును కప్పుకుని సనాతనధర్మ పునరుద్ధరణకు పూనుకోవడం విడ్డూరం కాక మరేమిటి ? వివాహ బంధంలో విడాకులు అన్నది ఆధునిక కాలానికి చెందిన భావన. కాని, సనాతన ధర్మంలో విడాకులు అన్న పదమే లేదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచించారు. సంస్కృతంలో విడాకులు అన్న పదమే లేదని పండితులు చెబుతున్నారు. కులాంతర, మతాంతర, దేశాంతర వివాహాలను సనాతన ధర్మం నిషేధించింది. సనాతన ధర్మం పేరుతో పవన్ వీటిని సమర్థిస్తారా ?

మన భారతీయ సమాజం అనేక దశలను దాటి ప్రజాస్వామ్యానికి చేరుకున్నది. తనదైన రాజ్యాంగాన్ని ఆమోదించుకుని రిపబ్లిక్‌గా అవతరించింది. ఇప్పుడు కుల వివక్షకీ, లింగ వివక్షకీ తావులేదు. చదువుకునే హక్కు అందరికీ వచ్చింది. కుల చట్రంలో వృత్తుల బిగింపు సడలిపోయింది. సనాతన ధర్మం ఆధారంగా జైళ్ళలో ఖైదీలకు కులాల ప్రాతిపదికగా పనులు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని ఇటీవలే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇవన్నీ సనాతన ధర్మాన్ని సంస్కరించడం ద్వారా సాధ్యమయ్యాయి. దీని కోసం సనాతన ధర్మంలోని అధర్మం మీద వివక్ష మీద ఉద్యమాలు, సంస్కరణలు విమర్శలు జరిగిన చరిత్ర మనకు వుంది.

తిరుపతి వారాహి సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే వారితో గొడవ పెట్టుకోవడానికే ఇక్కడకు వచ్చానని ప్రకటించారు. ఆయన ఎలాంటి వారితో గొడవ పెట్టుకోవాలనుకుంటే అలాంటి వారితో గొడవ పెట్టుకోవచ్చును. అది ఆయన ఇష్టం. అంటే మను ధర్మశాస్త్రాన్ని బహిరంగంగా తగులపెట్టిన అంబేడ్కర్‌తో పవన్ గొడవ పెట్టుకోవాలి. అన్నీ వేదాల్లోనే ఉన్నాయష అని సనాతన ధర్మాన్ని ఎద్దేవా చేసిన గురజాడతో, సనాతనంపై తిరుగుబాటు చేసిన వీరేశలింగంతో, త్రిపురనేని రామస్వామి వగైరాలతో ఆయన గొడవకు దిగాలి. పవన్ ఇలాంటి వారి మీద యుద్ధం మొదలు పెడితే 'సనాతన ధర్మం హీరో' బిరుదు వస్తే రావచ్చు.  రాష్ట్రంలో రాజకీయంగా ఎదగడానికి చిరకాల వాంఛగా ముఖ్యమంత్రి పదవిని అధిరోహించడానికి మంచిమార్గాలు వున్నాయి. తనకు దక్కిన అవకాశం పరిధిలో పరిపాలనా దక్షతను ప్రదర్శించడం ద్వారా లేదా ప్రజలకు స్వతంత్ర జీవితాన్ని అందించే ప్రత్యామ్నాయ విధానాలకు పోరాడే పార్టీగా ప్రజల విశ్వాసాన్ని పొందే మార్గాలను అనుసరించవచ్చు. కాని పవన్ కల్యాణ్ ఒక వక్ర మార్గాన్ని ఎంచుకున్నారు.

రాష్ట్రంలో రాజకీయ 'హీరోగా' ఎదగడానికి సనాతనం ముసుగులో విద్వేష రాజకీయ విలన్ 'పాత్ర పోషించే అడ్డదారిని ఎంచుకున్నారు. ఒక పక్క ఢిల్లీ పెద్దలతో మమేకం కావడం, మరోపక్క రాష్ట్రంలో పెద్దన్న పాత్రను పోషిస్తున్న తెలుగుదేశం పార్టీని వెనక్కి నెట్టడానికి, ఒక్క దెబ్బతో రెండు పిట్టలను వశపరుచుకునే దుస్సాహసానికి పూనుకున్నారు. దీనికోసం పవన్ తనకు సాధనంగా దొరికిన సనాతన ధర్మాన్ని వెతుకుతూ ఎంత వెనుకకు పోవాలనుకుంటే అంత వెనుకకుపోవచ్చు. ఆయనతోపాటే ప్రజలు వెనకకి నడుస్తారని, వారు తన 'సనాతన ధర్మ చిత్రం' బాక్సాఫీసులు బద్దలు కొడతారని అనుకోవడం మాత్రం కేవలం భ్రమే అవుతుంది. ఎందుకంటే 'ఆదిత్య 360 సినిమా'లో లాగ సమాజం మాత్రం వెనక్కు నడవదు. దాని పరమ లక్ష్యం మరింత స్వేచ్ఛ కోసం, మరింత ప్రజాస్వామ్యం కోసం, వివక్ష లేని సమాజం కోసం ముందుకు సాగడమే. సమాజాన్ని వెనకకు నడిపించాలని తలపెట్టే వారిని నిర్దాక్షిణ్యంగా పక్కకు నెట్టేసి మరీ ముందుకు సాగుతుంది.

# రాష్ట్రంలో 'రెండు పార్టీల వ్యవస్థ' బద్దలు కానుందా ?

**ఒ**క పార్టీ తర్వాత మరొక పార్టీ అధికారాన్ని మార్చుకునే రెండు పార్టీల వ్యవస్థ ప్రజాస్వామ్యంలో గొప్ప ముందడుగుగా భావించే వారున్నారు. రాజకీయ సుస్థిరతకు ఇది తప్పనిసరి అవసరంగా వాదించే వారున్నారు. తామరతంపరగా పార్టీలు పుట్టుకు రావడాన్ని ఇది నిరోధిస్తుందని తలపోసే వారున్నారు. వాస్తవానికి రెండు పార్టీల వ్యవస్థ ఒక గానుగ ఎద్దు ప్రజాస్వామ్యం. ఒకపార్టీ తర్వాత మరో పార్టీ తిరగడం తప్ప ముందుకు సాగే



రాజకీయం కాదు. పైగా ఈ పద్ధతి ప్రత్యామ్నాయ రాజకీయాన్ని కోరే పార్టీలకు పుట్టగతులు లేకుండా చేస్తుంది. రెండు పార్టీల వ్యవస్థ మరో కొత్త రాజకీయ శక్తికి చోటు ఇవ్వదు. చిన్న పార్టీలు లేదా ప్రత్యామ్నాయ రాజకీయాన్ని కోరే పార్టీలు రెండు పాలకపక్షాలతో ఏదో ఒక దానితో ఉనికి కోసం జతకట్టాలి. లేకపోతే ఆ రెండు పార్టీల మధ్య జరిగే పోటీలో నలిగిపోయి పరాజయం పొందుతాయి. రెండు పార్టీల వ్యవస్థ ప్రత్యామ్నాయ రాజకీయానికి గొడ్డలి పెట్టు మాత్రమే కాదు నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రెండు పార్టీల వ్యవస్థ ప్రారంభమైంది. 2009 వరకు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలే ఒకరి తర్వాత ఒకరు పాలకులవుతూ వచ్చారు. 2014 నాటికి రాజశేఖరరెడ్డికి వారసునిగా జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని కబ్జా చేసి వైయస్ఆర్ పార్టీ రూపంలో ముందుకు వచ్చారు. అప్పటి నుండి రాష్ట్రంలో రెండు పార్టీల వ్యవస్థ తెలుగుదేశం–వైసీపీ పార్టీల రూపం తీసుకుంది. పైగా రెండు ప్రాంతీయ పార్టీల మధ్య ఘర్షణగా రూపాంతరం చెందింది. రాష్ట్రంలో తిరిగి కొత్త రూపంలో ఒకరి తర్వాత మరొకరు పాలకులయ్యే రెండు పార్టీల వ్యవస్థే వచ్చింది. ఈ మొత్తం కాలంలో వామపక్షాలు ఏదో ఒక పాలక పక్షంతో ఎన్నికల సర్దుబాటు చేసుకున్నప్పుడు కొన్ని శాసనసభ, పార్లమెంటు స్థానాల్లో విజయాలు పొందాయి. అలా కాకుండా ప్రత్యామ్నాయం కోసం విడిగా పోటీ చేసినప్పుడు అవి ఈ 'రెండు పార్టీల వ్యవస్థ' పోటీలో నలిగిపోయి ఫలితాలు

సాధించలేకపోయాయి. 2009లో సినీనటుడు చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని పెట్టి రెండు పార్టీల వ్యవస్థలో మరో కొత్త రాజకీయ శక్తిగా ఎన్నికల్లో పోటీకి దిగారు. 18 శాసనసభా స్థానాలు గెల్చుకుని 16 శాతం ఓట్లు సాధించి కొంత ప్రభావాన్ని చూపించారు. అయితే 'రెండు పార్టీల వ్యవస్థ' సంఘర్షణ మధ్య చిరంజీవి తన పార్టీని నిలబెట్టుకోలేక ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్ విలీనం చేసి మూడో రాజకీయశక్తి స్థానం నుండి తప్పుకున్నారు. ప్రస్తుత నడుస్తున్న రెండు పార్టీల వ్యవస్థ భవిష్యత్తును పరిశీలించడానికి గత రెండు ఎన్నికల ఫలితాలను విశ్లేషించుకోవాలి.

2014 ఎన్నికల్లో 102 శాసనసభ స్థానాలను గెల్చుకున్న తెలుగుదేశం పార్టీ 2019లో కేవలం 23 స్థానాలకు పడిపోయింది. అప్పుడు 70 స్థానాలు పొందిన వైసిపి 2019 ఎన్నికల్లో 151 స్థానాలు గెల్చుకుంది. 2024 ఎన్నికల్లో వైసీపీ బలం 11కి పడిపోయింది. ఈ రెండు ఎన్నికల్లో ప్రజల తీర్పు ఏకపక్షంగా వచ్చింది. ఓడించదలచిన పార్టీలకు ఘోర పరాజయాన్ని చవి చూపించారు. ప్రస్తుత ఎన్నికలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కూటమిగా పోటీ చేసినా అందులో తెలుగుదేశం పార్టీయే ప్రధాన పార్టీ. తెలుగుదేశం పార్టీకి 40 ఏళ్ల పైబడ్డ చరిత్ర వుంది. ఓటమి తర్వాత ఓటమిని చవిచూసినా నిలదొక్కుకుని తిరిగి అధికారాన్ని దక్కించుకోగల పార్టీ యంత్రాంగం, వివిధ స్థాయిల నాయకత్వం ఆ పార్టీకి వుంది.

వైసీపీకి వివిధ స్థాయిల్లో వున్న పార్టీ యంత్రాంగం, నాయకత్వం అలాంటిది కాదు. ఈ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత ఆ పార్టీలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితి దానికి అద్దం పడుతున్నది. అవకాశం దొరికిన కొందరు నాయకులు , కింది స్థాయి కార్యకర్తలు పార్టీని వీడి పోతున్నారు. అధికారంలో వున్నప్పుడు అతిగా వీరంగం వేసిన కొందరు అజ్ఞాతవాసం చేస్తున్నారు. మరి కొందరు రాజకీయ సన్యాసం ప్రకటించి తమ తమ వ్యాపారాలకు పరిమితం అవుతున్నారు. ఆ పార్టీ అధ్యక్షునికి దన్నుగా తెరముందుకు వస్తున్న వారి సంఖ్య ఇప్పుడు వేళ్ల మీద లెక్కించే స్థాయికి పడిపోయింది. మరో పక్క వైసీపీ అధ్యక్షునిపై తలమీద కత్తిలా కేసుల విచారణ వుండనే వుంది. మొత్తం మీద ఆ పార్టీ 'నాయకత్వ సంక్షోభంలో' కూరుకు పోతున్న పరిస్థితి కనిపిస్తున్నది. వైసీపీ తిరిగి పుంజుకునే అవకాశాలు సందేహాస్పదంగా వున్నాయి. ఈ ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లే వచ్చినా ఆ పార్టీ 40 శాతం ఓట్లను తెచ్చుకుంది. ఇది విస్మరించడానికి వీలుకాని గణనీయమైన సంఖ్య. ఈ ఓటర్లను వైసీపీ నిలబెట్టుకోగలుగుతుందా అన్నదే అసలు సమస్య. అన్ని

స్థాయిల్లో నాయకత్వ సంక్షోభం, కింది స్థాయి నేతల్లో స్తబ్ధత వున్నప్పుడు ఆ పార్టీ తన ఓటర్లను నిలుపుకోవడం తేలిక మాత్రం కాదు. వైసీపీ ఓటర్లలో అత్యధికులు దళితులు, ఆదివాసీలు, బహుజనులు, మైనారిటీ తరగతులకు చెందినవారు. అలాగే ఈ ఓటర్లు తెలుగుదేశం దాని కూటమి పార్టీలకు సంప్రదాయకంగా వ్యతిరేకులు. స్థానికంగా వారికి దన్నుగా వుండే నాయకత్వం లేనప్పుడు వారు నిర్లిప్తతకు లోనవుతారు లేదా మరో దారి కోసం ఎదురుచూస్తారు.

ఈ ప్రజా సమూహాలు ఒకనాడు వామపక్షాలకు తర్వాత కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారులుగా వున్నవారు. వైసీపీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యం లో వామపక్షాల కూటమి లేదా 'ఇండియా' కూటమి ఈ ప్రజా సమూహాలను సమీకరించడం వారికి అవసరమైన నాయకత్వాన్ని అందించగలిగితే మరో రాజకీయ శక్తి రాష్ట్ర రాజకీయాల్లో ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోపక్క తెలుగుదేశం కూటమి తిరుగులేని మెజారిటీ సాధించినా అది ప్రకటించిన 'సూపర్ సిక్స్' వాగ్దానాలను తు.చ తప్పకుండా నిలబెట్టుకోవడం ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్ పరిధిలో అంత తేలిక కాదు.

ఇప్పటికే అప్పుల కుప్పగా వున్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లో తేదేపా కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిన 'అభివృద్ధి-సంక్షేమం' ఆచరణలో ఆశించిన ఫలితాలు ప్రజలకు కనిపించకపోతే పాలనపై అసంతృప్తి కలగడం సహజం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని విశ్లేషిస్తే రాష్ట్రంలో రెండు పార్టీల వ్యవస్థలో మరో రాజకీయ శక్తి రంగ ప్రవేశానికి అవకాశాలు కనిపిస్తున్నాయి. కేవలం అవకాశాలను చూసి సంతృప్తిపడితే సరిపోదు. అవకాశాలను ఫలితంగా మార్చగల ఆచరణ లేకపోతే ఫలితాలు రావు. ముందుగా నాయకత్వ సంక్షోభంలో చిక్కుకున్న వైసీపీ వెనక వున్న పేదలను సమీకరించడం మీద 'ఇండియా' కూటమి పార్టీలు కేంద్రీకరించాలి. ఒకటి రెండు సంవత్సరాలు దీని మీదే పనిచెయ్యాలి. కొత్త ప్రత్యామ్నాయానికి కొత్త బలాన్ని సంపాదించుకోవాలి. ఆ మేరకు రాష్ట్ర రాజకీయంలో వైసీపీ పాత్ర బలహీన పడుతుంది. ఒకటి, రెండు సంవత్సరాలు గడిచే సరికి తేదేపా కూటమి పాలన బాగోగులు కూడా స్పష్టపడతాయి. కొత్త రాజకీయ శక్తి మరింత బలపడే కొత్త అవకాశాలు ముందుకు వస్తాయి. రాబోయే ఐదేళ్ళలో ప్రస్తుత 'రెండు పార్టీల వ్యవస్థ' ను బద్దలు కొట్టగల కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం పుట్టుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆచరణలో దీనిని సాకారం చేసుకోవడమే అందరి తక్షణ కర్తవ్యం కావాలి.

# విలువల పునాదిపై ప్రభవించిన విశాలాంధ్ర

1952లో కమ్యూనిస్టు పార్టీ దిన పత్రికగా విశాలాంధ్ర ప్రస్థానం మొదలైంది. తెలుగు దినపత్రికలలో నిరంతరాయంగా 72 సంవత్సరాలు పూర్తి చేసుకుని కొనసాగుతూ వయస్సు పరంగా పెద్దరికపు చరిత్రను తన సొంతం చేసుకుంది. అంతకుమించి ప్రత్యామ్నాయ జర్నలిజానికి అంకురార్పణ చేసిన ఘనత విశాలాంధ్రకే దక్కింది. కమ్యూనిస్టు పార్టీ నిత్య కార్యకలాపాల ప్రచారానికే పరిమితం కాకుండా తెలుగు ప్రజలకు ఒక అంతర్జాతీయ దృక్పథాన్ని సామ్రాజ్య వాద వ్యతిరేక స్ఫూర్తిని అందించింది. దేశ స్వావలంబన సాధనకూ, సకల శ్రామిక ప్రజల పోరాటాలకూ వెన్ను దన్నుగా నిలిచిన చరిత్రా విశాలాంధ్ర దక్కించుకుంది. తెలుగు ప్రజల సాంఘిక, సాంస్కృతిక జీవనంలో శాస్త్రీయ దృష్టినీ, అభ్యుదయ సాహిత్యాభిరుచులు పంచిందీ విశాలాంధ్రే. దీనికి దోహదం చేసిన విశిష్ట పునాదులను నెమరు వేసుకుని ముందుకు సాగడానికి ఈ వార్షికోత్సవాలు ప్రేరణగా నిలవాలి.



స్వాతంత్ర్యోద్యమ కాలంలో తెలుగు పత్రికలు విస్తరించాయి. ఒక ఆదర్శం కోసం, ఒక సంస్కరణ కోసం వచ్చిన ఈ పత్రికలు అన్నీ దాదాపుగా సంపాదకుల పత్రికలే. వీటికి లాభాపేక్ష లేదు. సమాజానికి మంచి జరగాలన్న తాపత్రయం ప్రధానం. స్వాతంత్ర్యానంతరం పత్రికా రంగంలో కొత్త శక్తులు ప్రవేశించాయి. పత్రికా రంగంలోకి పెట్టుబడి దిగింది. లాభాపేక్ష గల వ్యాపార రంగంగా క్రమేణా రూపాంతరం చెందింది. ఇక్కడ పత్రికాధిపతులు వేరు, సంపాదకులు వేరు అన్న విభజన ప్రారంభమైంది. యజమానికి లాభాల వేట ప్రధానం. అధికార పార్టీల ప్రాపకం అవసరం. అడ్వర్‌టైజ్‌మెంట్లు ఆదాయం ప్రధానం. దానికి అనుగుణంగానే వార్తల సేకరణ, ప్రచురణ సాగుతున్నది. చివరికి 'నగదుకు వార్త' వరకు విస్తరించింది.

చాలా పత్రికలకు యజమానులే ఎడిటర్‌లు అయ్యారు. ఎక్కడైనా ఎడిటర్లు వున్నా మార్కెటింగ్ మేనేజర్లే వార్తల ప్రాధాన్యత నిర్ణయించే వారయ్యారు. ఇక్కడ పత్రికా రంగం విలువలన్నీ వ్యాపార విలువలుగా మారాయి. 'పెట్టుబడికి, కట్టుకథకు పుట్టిన విషపుత్రిక'లంటూ శ్రీశ్రీ వీటికి నామకరణం చేశాడు. ఈ పత్రికలు లాభాల వేటలో చిన్న పత్రికలను స్వాతాపి జీర్ణం చేసుకున్నాయి. ఇంతటి లాభాల పోటీలో, విలువల పతనంలో ఇంతటి దుర్నీతి జర్నలిజం జడలు విప్పిన కాలంలో వీటికి ఎదురొడ్డి నిలబడిన పత్రికగా విశాలాంధ్ర.

మరికొన్ని వామపక్ష పత్రికలు మనకు కనిపిస్తాయి. విశ్వమానవ విలువలను పునాది చేసుకుని నిలబడగలిగాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే కమ్యూనిస్టు పార్టీ పత్రికలు పుట్టుకొచ్చాయి. 1937లో నవశక్తి, ఆ తర్వాత స్వతంత్ర భారత్, 1942 తర్వాత ప్రజాశక్తి పత్రికలు నడిచాయి. నిర్బంధాలతో ప్రజాశక్తిని మూసివేయాల్సి వచ్చింది. తిరిగి స్వాతంత్ర్యానంతరం 1952లో కమ్యూనిస్టు పార్టీ దినపత్రికగా విశాలాంధ్ర ప్రారంభమైంది. అసలు విషయం ఏమిటంటే పైన పేర్కొన్న కమ్యూనిస్టు పత్రికలన్నింటికి మద్దుకూరి చంద్రశేఖరరావు గారే సంపాదకులు. చంద్రం గారు స్వాతంత్ర్య సమరయోధులు. ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలలో సారథులలో ప్రముఖులు. అంతకుమించి తెలుగు సాహిత్యం మీద, సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాల మీద అవగాహన, ముందుచూపు గల అపురూపమైన నాయకుడు. చంద్రం గారి సారథ్యంలో కమ్యూనిస్టు పత్రికలు కేవలం పార్టీ కార్యకలాపాల ప్రచార సాధనాలు మాత్రమే కాకుండా విశ్వ జననీ విలువల పునాదుల మీద వాటిని నడిపించారు.

సామ్రాజ్యవాద కుట్రలను ప్రతిఘటించడం, ప్రపంచశాంతికి వర్ధమాన దేశాల స్వావలంబన పోరాటాలకు వేదికను చేసి ఒక అంతర్జాతీయ విలువను సంతరింపజేశారు. కార్మికవర్గ పక్షపాతిగా శ్రమజీవుల సమస్యలకు గొంతుకగా, వారు సాగించే ఉద్యమాలకు ఊపిరిగా ప్రజల పక్షాన నిలబడే పత్రికగా నిబద్ధతను మరొక విలువగా పాటించారు. జన జీవనాన్ని సంస్కారవంతం సారవంతం చేసే సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాలను సంఘ సంస్కరణ ఉద్యమాలను పత్రికా రచనలో అంతర్భాగం చేసే మరో విలువను జత చేశారు. ప్రత్యామ్నాయ ప్రజా జర్నలిజానికి విశాలాంధ్రను ప్రతీకగా రూపొందించారు. విశాలాంధ్ర కమ్యూనిస్టు పార్టీ పత్రికే అయినా రాష్ట్రంలో రచయితలను, మేధావులను, మధ్య తరగతి వర్గాలను విశేషంగా ఆకర్షించేలా చేశారు.

విశాలాంధ్ర ఆదివారం సాహిత్య పేజీలో రాష్ట్రంలో లబ్ధ ప్రతిష్టులైన రచయితలు, కవుల వ్యాసాలు, సాహిత్య విమర్శలో ప్రత్యేక కాలమ్‌లు రాశారు. విశాలాంధ్ర ఆదివారం సంచిక ఎంతటి ప్రాచుర్యం పొందిందంటే ఒక్క ఆదివారం సంచిక కోసం ప్రత్యేక చందాతో పత్రికను అందించే పద్ధతి ప్రవేశ పెట్టవలసి వచ్చింది. స్థానిక ప్రజా సమస్యలకు, గ్రామీణ వార్తలకు దినపత్రికలో విశేషస్థానం కల్పించిన తొలి పత్రిక విశాలాంధ్రే. ఇతర పత్రికలకు గ్రామీణ విలేకరులు లేరు. ఆ పత్రికలకు పంపిణీ ఏజంట్లు మాత్రమే వుండేవారు. వారు తమ పత్రికలో ప్రకటనలకు అవసరమైన ఒకటి, రెండు వార్తలు నెలలో పంపే పద్ధతి వుండేది. కాని విశాలాంధ్రకు రాష్ట్రం అంతటా విస్తరించిన కమ్యూనిస్టు పార్టీ స్థానిక నాయకులందరూ వార్తలు సేకరించి పంపే విలేకరులు కావడంతో గ్రామీణ వార్తల ప్రచురణకు శ్రీకారం చుట్టిన ఘనత విశాలాంధ్రకే దక్కుతుంది.

కార్మిక సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు సాగించే కార్యకలాపాలకు ఉద్యమాలకు విశాలాంధ్రలో ఎంతో ప్రాధాన్యతతో చోటు దక్కేది. విశాలాంధ్ర మహిళా రంగం, రైతు రంగం, యువజన రంగం వగైరాలకు ప్రత్యేక కాలమ్స్ నిర్వహించి ఆయా రంగాల సమస్యల మీద అవగాహన కల్పించడమే కాకుండా సామాన్యుల రచనలకు, అభిప్రాయాలకు అవకాశాలు కల్పించారు. నేను నా మొదటి చిరు వ్యాసం విద్యార్థిగా వుండగా 'తరుణ జగతి' పేజీకి రాశాను. ఆ తర్వాత కొన్ని కాలమ్స్ వ్యాసాలు రాసే వరకు ప్రోత్సహించింది విశాలాంధ్రే. చంద్రం గారి తర్వాత రాజకీయ, సాహితీ రంగాలలో నిష్ణాతులైన వారు సంపాదకులుగా వచ్చారు.

దీర్ఘకాలంపాటు బహుముఖ ప్రజ్ఞాశాలి చక్రవర్తుల రాఘవాచారి సంపాదకులుగా 'విశాలాంధ్ర రాఘవాచారి'గా పేరు పొందారు. విశాలాంధ్ర ఇతర వామపక్ష పత్రికలు లేకపోతే సామ్రాజ్యవాదాన్ని ప్రపంచీకరణనీ ప్రశ్నించే, నిలదీసే శక్తి ఉండేది కాదు. శ్రమ జీవుల సమస్యలను, వారి పోరాటాలను ప్రచారం చేసే సాధనం వుండేది కాదు. మూఢ నమ్మకాలను సాంఘిక దురాచారాలను, మహిళా వేధింపులకు వార్తలలో ప్రాధాన్యత ఉండేది కాదు. సాహిత్య సాంస్కృతి రంగాల వికాసానికి తగిన ప్రాధాన్యత లభించేది కాదు.

మరోపక్క విశాలాంధ్ర పత్రికతోపాటు 1953లో విశాలాంధ్ర ప్రచురణాలయం కూడా ఏర్పడింది. సాహిత్య సాంస్కృతిక రంగాలలో దానికి అదే సాటి అన్న రీతిలో పుస్తకాలను ప్రచురించింది. విశాలాంధ్ర ప్రచురణాలయం ద్వారానే కందుకూరి,

గురజాడ, గిడుగు రచనలు పూర్తిగా వెలుగు చూశాయి. శ్రీశ్రీ, కుటుంబరావు, తిలక్ రచనలతోపాటు రాహుల్ సాంకృత్యాన్ సాహిత్యాన్ని బొల్లిముంత, రాంభట్ల, ఆర్వీయార్ వంటి ఉద్దండుల రచనలను అందుబాటులోకి తెచ్చింది.

మార్క్స్ కాపిటల్ మూడు భాగాలను, ఆంధ్రప్రదేశ్ దర్శిని పేరుతో రాష్ట్ర ఆర్థిక రాజకీయ సామాజిక అంశాలపై ప్రామాణికమైన వ్యాసాలతో తెచ్చిన సంకలనాలు విశాలాంధ్రకు పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి. విశాలాంధ్ర వార్షికోత్సవం సందర్భంగా ఇవి కొన్ని జ్ఞాపకాలు మాత్రమే. చిన్న వ్యాసంలో రాసిన దానికంటే విస్మరించినవే ఎక్కువగా వుండడం సహజం. విశాలాంధ్ర కేవలం ఒక దినపత్రిక, ఒక ప్రచురణ సంస్థ మాత్రమే కాదు. తెలుగు ప్రజలను విశేషంగా ప్రభావితం చేసిన ఒక కాంతి పుంజం.



# డి.వి.వి.యస్.వర్మ

# కొత్తచూపు

## ఈ పుస్తకం గురించి ....

వర్మగారు మార్క్సిస్ట్ దృక్పథంతో చేసిన కొన్ని సూత్రీకరణలు ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర అధ్యయనానికి మార్గదర్శకాలుగా పనిచేస్తాయనడంలో సందేహం లేదు. స్వాతంత్ర్యానంతర ఆంధ్రదేశ రాజకీయ అధ్యయనానికి వర్మగారి ఈ పరిశీలన ఒక కరదీపిక.

గ్రాంసీని అధ్యయనం చెయ్యడానికి లోతైన అవగాహనా శక్తి కావాలి. వర్మగారు గ్రాంసీని వ్యక్తీకరించిన తీరులోని స్పష్టత నన్ను విస్మయపరచింది. Historic bloc, హెజమొని, కౌంటర్ హెజమొని, బాస్టర్డ్ హెజమొని, సవర్ణ మేధావులు, లోకజ్ఞానం విచక్షణా జ్ఞానంగా మారే తీరు వంటి జటిలమైన సైద్ధాంతికాంశాల్ని తెలుగులో మంచినీళ్ల ప్రాయం చేశారు.

వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలకు కొత్త దారి చూపిస్తున్నారు వర్మగారు. ఒక సిద్ధాంతంగానీ భావజాలంగానీ ప్రజల మనసుల్ని ఆకర్షించగలిగినపుడు అది భౌతికశక్తిగా మారుతుందన్న మార్క్స్ భావనని శాస్త్రీయంగా వివరించారు.

మనకు తెలియని మార్క్స్ రాత ప్రతులను పరిచయం చేసిన రెండవ సంచిక మార్క్సిస్ట్ మేధావులకు సైతం తెలియని కోణాల్ని బయటపెట్టింది.

మోదీ ఎనిమిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా వేసిన సంచికలో 'మనం గతాన్ని తెలుసుకోవాలి. కాని గతంలోకి ప్రయాణించకూడదు' అన్నప్పుడు వర్మగారి ఆలోచనల్లో గాఢత, వ్యక్తీకరణలో సరళత తెలుస్తుంది....

- ప్రొ. వకుళాభరణం రామకృష్ణ